నాల్గవ కూర్పు
౨౦౦౦ ప్రతులు.

౧౯౪౮

ANDHRA GRANTHAMALA,
No. 7, Thambu Chetty Street, G. T., Madras.

Printed at the Andhra Patrika Press,
G. T., Madras.

సూచన

గాంధిమహాత్ముని ఆత్మకథను ప్రపంచము సుస్వాగతంబు నొసంగినది. భిన్నార్థప్రతిపాదకము లైన స్వకీయచరిత్రము, సత్యాన్వేషణము, ఆత్మకథ, మానవజీవయాత్రయందు సమానార్థమును ప్రతిపాదించుచున్న విధమును గాంధిమహాత్ముని ఆత్మకథ విశదము చేయుచున్నది. మొదటిభాగమునందు జననము, విద్యాభ్యాసము, వివాహము, న్యాయవాదిజీవనము, దక్షిణాఫ్రికాప్రవాసము మొదలగు విషయములకు సంబంధించిన విశేషాంశములు గలవు.

రెండవ భాగము దక్షిణాఫ్రికాసత్యాగ్రహప్రస్థానముతో నారంభమై రౌలటుశాసనసత్యాగ్రహప్రస్థానముతో నంతము నొందుచున్నది. రౌలటుసత్యాగ్రహము నిరంకుశాధికారులకు విస్మయమును, భారతీయుల కాత్మవిశ్వాసమును గలుగజేసినది. ప్రపంచకల్యాణమునకు నవధర్మము సాధనముగా గల విధమును భారతీయేతిహాసములు విశదము చేసినవి.

భిన్నభిన్నధర్మప్రతిపాదకము లైన దేహయాత్ర, సత్యాన్వేషణము, ఆత్మయాత్ర సమానధర్మప్రతిపాదకము లైనవి. సత్యారాధనము మతవిషయములందువలెనే రాజకీయసాంఘికార్థికవిషయములందును పరమధర్మమని ఆత్మకథ ప్రత్యక్షము చేసినది. ఈ పరమార్థమునే ఆత్మకథారూపమునను లోకమున కనుగ్రహించిన గాంధిమహాత్ముడు ధన్యుడు, పూజ్యుడు, కృతకృత్యుడు, లోకారాధ్యుడు. సత్యాగ్రహ ప్రభావమును భారతీయులు బాగుగ గ్రహించిన విధమును గతించిన పదేండ్లచరిత్రము విశదము చేయుచున్నది. స్వరాజ్యసంపాదనమునకు

భారతీయు లవలంబించిన సత్యాగ్రహ ప్రస్థానము ప్రపంచేతిహాసములం దపూర్వమై ధర్మజ్ఞుల ప్రశంసలకు పాత్ర మైనది. భారతీయు లవలంబించిన మార్గము నే ఇతరజాతులును నవలంబించి కామితార్థములను బడయుటకు చేయుచున్న ప్రయత్నములు సత్యాగ్రహ ప్రభావమునకు నిదర్శనములు. ధర్మవిజయమునకు సత్యవ్రతము మూలాధార మని ఆత్మకథ అన్ని సందర్భములందును ప్రత్యక్షము చేయుచున్నది.

ఈ ఉత్తమగ్రంథముయొక్క రెండవ భాగము గుజరాతీ హిందీ ఆంగ్లాదిభాషలయందు చిరకాలముక్రితమే ప్రచురింపబడినది. ఆంధ్రభాషయందును ప్రచురించుటకు పలయు ప్రయత్నములు చేయబడినను దేశావృతమైన అశాంతియును, నా నిర్బంధమును ప్రతిబంధకము లైనవి. నిరంతరము శ్రమచేసి, అచిరకాలములోనే ఆంధ్రానువాదముచేసి ఆంధ్రముద్రణము సాధ్యముచేసిన శ్రీ వేలూరి శివరామ శాస్త్రిగా రాంధ్రుల కృతజ్ఞతకు పాత్రులు. ఆంధ్రలోక మీ యమూల్యమైన ఆత్మకథ నాదరించి పారాయణముచేసి ఆత్మోద్ధరణమును బడయునుగాత!

ప్రమోదూత పుష్య శు ౧ శుక్రవారము.	కా. నాగేశ్వరరావు.

విషయసూచి

నాలవ భాగము

	విషయము		పుట
౧	ప్రేమచేఁ జేసిన శ్రమ వృథయాయెనా	...	౩–౬
౨	ఆసియానుండి నిరంకుశాధికారము	...	౭–౯
౩	అవమానసహనము	...	౧౦–౧౩
౪	త్యాగవృద్ధి	...	౧౪–౧౬
౫	ఆత్మపరిశోధనపరిణామము	...	౧౭–౨౧
౬	శాకాహారమునకు బలి	...	౨౨–౨౪
౭	మట్టి, నీరు: వీనితో పరీక్ష	...	౨౫–౨౮
౮	ఒక హెచ్చరిక	...	౨౯–౩౨
౯	బలముతో లడాయి	...	౩౩–౩౬
౧౦	పుణ్యస్మరణము, ప్రాయశ్చిత్తము	...	౩౭–౪౦
౧౧	ఆంగ్లేయులతో గాఢపరిచితి	...	౪౧–౪౪
౧౨	ఆంగ్లేయులతో పరిచితి	...	౪౫–౪౯
౧౩	'ఇండియన్ ఒపీనియన్'	...	౫౦–౫౩
౧౪	కూలీలొకేషనా, లేక మాలగూడెమా?	...	౫౪–౫౭
౧౫	మహామారి (౧)	...	౫౮–౬౧
౧౬	మహామారి (౨)	...	౬౨–౬౬
౧౭	లొకేషను తగులఁబెట్టుట	...	౬౭–౬౯
౧౮	ఒక – గ్రంథప్రభావము	...	౭౦–౭౩
౧౯	ఫినిక్సు – స్థాపన	...	౭౪–౭౬
౨౦	తొలిరేయి	...	౭౭–౮౦
౨౧	పోలాకుగూడ దిగెను	...	౮౧–౮౪

విషయము :		పుట
౨౨ రాముఁడే రక్షకుఁడు	...	౮౫-౮౯
౨౩ ఇంటిదెస	...	౯౦-౯౩
౨౪ జులూతిరుగుబాటు	...	౯౪-౯౭
౨౫ హృదయమథనము	...	౯౮-౧౦౦
౨౬ సత్యాగ్రహోత్పత్తి	...	౧౦౧-౧౦౩
౨౭ ఆహారపరిశోధనములు	...	౧౦౪-౧౦౬
౨౮ కస్తురబాయిధైర్యము	...	౧౦౭-౧౧౧
౨౯ ఇంటిలో సత్యాగ్రహము	...	౧౧౨-౧౧౫
౩౦ సంయమము	...	౧౧౬-౧౧౮
౩౧ ఉపవాసము	...	౧౧౯-౧౨౩
౩౨ పంతులుగారు	...	౧౨౪-౧౨౭
౩౩ అక్షరజ్ఞానము	...	౧౨౮-౧౩౧
౩౪ ఆత్మశిక్ష	...	౧౩౨-౧౩౫
౩౫ బియ్యములో వడ్లు	...	౧౩౬-౧౩౭
౩౬ ప్రాయశ్చిత్తరూపమగు ఉపవాసము	...	౧౩౮-౧౪౦
౩౭ గోఖలేగారిని కలియఁబోవుట	...	౧౪౧-౧౪౩
౩౮ యుద్ధములో నా పాలు	...	౧౪౪-౧౪౭
౩౯ ధర్మసందేహము	...	౧౪౮-౧౫౧
౪౦ సత్యాగ్రహపు పిసరు	...	౧౫౨-౧౫౭
౪౧ గోఖలేగారి ఔదార్యము	...	౧౫౮-౧౬౦
౪౨ వాఁపులకు వైద్యము	...	౧౬౧-౧౬౩
౪౩ దేశమునకు ప్రయాణము	...	౧౬౪-౧౬౬
౪౪ ప్లీడరీలో కొన్ని గుర్తులు	...	౧౬౭-౧౭౦
౪౫ చాతుర్యమా?	...	౧౭౧-౧౭౩
౪౬ క్లయంట్లు సహచరు లగుట	...	౧౭౪-౧౭౫
౪౭ క్లయంటుకు చెఱ తప్పుట	...	౧౭౬-౧౮౦

అయిదవ భాగము

విషయము		పుట
౧ మొదటి అనుభవము	...	౧౮౧-౧౮౩
౨ పూనాలో గోఖలేగారితో	...	౧౮౪-౧౮౬
౩ బెదరింపా?	...	౧౮౭-౧౯౧
౪ శాంతినికేతనము	...	౧౯౨-౧౯౫
౫ మూడవతరగతిబాటసారుల కడగండ్లు	...	౧౯౬-౧౯౮
౬ నా ప్రయత్నములు	...	౧౯౯-౨౦౦
౭ కుంభోత్సవము	...	౨౦౧-౨౦౬
౮ లక్ష్మణ-ఝూలా (వంతెన)	...	౨౦౭-౨౧౧
౯ ఆశ్రమస్థాపనము	...	౨౧౨-౨౧౪
౧౦ పరీక్ష!	...	౨౧౫-౨౧౮
౧౧ గిరిమిటుపద్ధతి నెత్తివేయుట	...	౨౧౯-౨౨౪
౧౨ నీలిమందుడాగు	...	౨౨౫-౨౨౮
౧౩ బిహారువారి మంచితనము	...	౨౨౯-౨౩౩
౧౪ అహింసాదేవిసాక్షాత్కారము	...	౨౩౪-౨౩౮
౧౫ కేసు తీసివేసికొనుట	...	౨౩౯-౨౪౨
౧౬ కార్యపద్ధతి	...	౨౪౩-౨౪౬
౧౭ సహచరులు	...	౨౪౭-౨౫౦
౧౮ గ్రామప్రవేశము	...	౨౫౧-౨౫౩
౧౯ మంచి అధికారివలని ప్రయోజనము	...	౨౫౪-౨౫౬
౨౦ కూలివారితో	...	౨౫౭-౨౬౦
౨౧ ఆశ్రమము నొకతూరి తొంగిచూచుట	...	౨౬౧-౨౬౩
౨౨ ఉపవాసము	...	౨౬౪-౨౬౮
౨౩ ఖేడాసత్యాగ్రహము	...	౨౬౯-౨౭౧
౨౪ ఉల్లిదొంగ	...	౨౭౨-౨౭౫

	విషయము		పుట
౨౫	ఖేడాసత్యాగ్రహ సమాప్తి	...	౨౭౫–౨౭౬
౨౬	ఐక్యమునకు ప్రయత్నము	...	౨౭౭–౨౮౧
౨౭	యుద్ధమునకు జనమును పోగుచేయుట	...	౨౮౨–౨౮౯
౨౮	మృత్యుపథము	...	౨౯౦–౨౯౫
౨౯	రౌలతుచట్టము – నా ధర్మసందేహము	...	౨౯౬–౩౦౦
౩౦	అద్భుతమగు హరతాళము	...	౩౦౧–౩౦౪
౩౧	ఆరోజులు (౧)	...	౩౦౫–౩౧౧
౩౨	ఆరోజులు (౨)	...	౩౧౨–౩౧౫
౩౩	కొండంత తప్పు	...	౩౧౬–౩౧౮
౩౪	నవజీవన్ యంగిండియాలు	...	౩౧౯–౩౨౨
౩౫	పంజాబులో	...	౩౧౩–౩౨౬
౩౬	బదులుకు బదులా?	...	౩౨౭–౩౩౨
౩౭	అమృతసరపు కాంగ్రెసు	...	౩౩౩–౩౩౬
౩౮	కాంగ్రెసుతో సాక్షాత్సంబంధము	...	౩౩౭–౩౩౯
౩౯	ఖాదీపుట్టుక	...	౩౪౦–౩౪౨
౪౦	దొరకెను	...	౩౪౩–౩౪౬
౪౧	ఒక సంవాదము	...	౩౪౭–౩౫౦
౪౨	అసహాకారము	...	౩౫౧–౩౫౫
౪౩	నాగపురమున	...	౩౫౬–౩౫౮
	పూర్ణాహుతి	...	౩౫౯–౩౬౧



శ్రీ మోహన్‌దాస్ కరంచంద్ గాంధి.

ఆత్మకథ

నాల్గవభాగము

౧

ప్రేమచేఁ జేసిన శ్రమ వితయామెరా ?

మి. చేంబర్లేను దక్షిణ-ఆఫ్రికా దేశములో మూఁడు కోట్ల యేఁబది లక్షుల పౌనులు కానుకగొని తెల్లవారలకును, వీలగు చేని బోయరులకును శిల్లముల పల్లవింపఁజేయుటకు వచ్చియుండెను. ఇటులగుటఁజేసి యితఁడు ఇండియా ప్రతినిధులకు శాంతివచనములను ఈ రీతిగాఁ జెప్పెను:—

'తమ్ముఁ దాము పరిపాలించుకొను వలసరాజ్యములపై సామ్రాజ్యప్రభుత్వమున కుండు నధికారము నామమాత్రమని మీ రెఱిఁగినదే కదా! మీరు చెప్పుకొను కష్టములు సత్యమేయగును. వానిని తొలఁగించుటకు నా శక్తికొలఁదిని పాటుపడుదును. కాని తెల్లవారిలో నివసింపనెంచురేని మీ శక్తికొలఁది. వారితో సంధికుదుర్చుకొనవలసి యుందురని మీరును మఱువరాదు.'

ఈజవాబుతో ప్రతినిధులమొుదలు చల్లఁబడెను: నాకును ఆశ లుడిగెను. ఈజవాబు మమ్ము జాగరూకుల నొనరించెను. మరల ఓనమాలకడనుండి ప్రారంభింపవలయునని మాకు తెలిసివచ్చెను. నాతో పని చేయువారలకు ఈసంగతి యంతయు లెస్సగా తెలిపితిని.

కాని మి. చేంబర్లేనుమాట జాటా యగునా! మాయమాటలుగాక యతఁడు నిక్కమాడెను. 'ఎడితె యెవనిదో బఱ్ఱె-వారిది'* అను నీ సామెతను ఇతఁడు మెత్తగా చెప్పెను:

---

* 'నోయిగలవానిదే రాజ్యము' అని తెలుఁగువారి సామెత. 'మారే తేవీ త వాక' అని గుజరాతువారి సామెత. 'ఉస్‌కీ లాఠీ ఉస్‌కీ భైంస్' అని హిందీ సామెత. అను.

కాని మనకడ బడితె యేదీ? బడితెమాట యటుండె; బడితె దెబ్బలు తినుటకుఁ దగినంత శరీరముగూడ మనకు లేదు.

మి. చేంబర్లేను అచట కొలఁదికాలమే ఉండెను. దక్షిణ-ఆఫ్రికాదేశ మొక లోకిలేఁదు కాదు; ఇంచుమించుగా అదియు నొక భూఖండము. ఆఫ్రికాలో కొన్ని ఉపఖండములు ఉన్నవి. కన్యాకుమారినుండి శ్రీనగరమునకు ౧౯౦౦ మైళ్లు ఉండుచో డరబనునుండి కేప్‌టవునుకు ౧౧౦౦ మైళ్లకు తక్కువలేదు. ఇంత గొప్ప భూఖండమున నితఁడు వాయువేగమునఁ బోఁగెడెను.

అతఁడు సెటాలునుండి ట్రాన్స్వాలునకు వెళ్లెను. విషయముల సన్నిఁటిని సేకరించుకొని భారతీయుల కష్టనిష్ఠురములను నేను వారి యెదుటఁ బెట్టవలసియుంటిని. 'ఇంగులకు ప్రిటోరియా చేరు టెబులు' అను సమస్య అడ్డువచ్చెను. తటిలో నే నటకుఁ జేరుటకు అనుజ్ఞాపత్రికను సంపాదింపఁగల వీలు ప్రిటోరియాలో నున్న మనవారికి లేకపోయెను.

బోయరుయుద్ధము జరిగిన తరువాత ట్రాన్స్వాలు బాధపడుచుండెను. అచట తినుటకు గింజలేదు; కట్ట గుడ్డలేదు; వీధులు శూన్యములు; అంగళ్లు మూయఁబడి యుండెను. వస్తువులు రావలయు; దుకాణములు తెఱవఁబడవలయు. అదియు వెంటనే జరుగునది కాదు. ఇది జరుగనిదే వెడలిపోయినవారు మరల చేర్చుకొనఁబడరు. కావున ట్రాన్స్వాలులోని ప్రతివాఁడును ఒక అనుజ్ఞాపత్రిక తెచ్చికొనవలసియుండెను. తెల్లవారి కిది హస్తామలకము; మఱి నల్లవారికో ఆకాశకుసుమము.

యుద్ధదినములలో దక్షిణ-ఆఫ్రికాకు హిందూదేశమునుండియు, లంకనుండియు పలువురు ఉద్యోగులును సిపాయిలును వచ్చియుండిరి.

౧ ప్రేమచేఁ జేసిన శ్రమ వితథమాయెనా?

వీరిలో నెవరేని అచట కాపుర ముండఁ దలఁచుకొందురేని వారికి భూసహాయము చేయుట విధి యని బ్రిటిష్ అధికారులకు తోఁచెను. వీరేపట్టిననేని క్రొత్త ఉద్యోగములను బనాయింపఁగలరు. దీనికి తగినటులు అనుభవము కలవారు కావలసినంతమంది తయారుగా నుండిరి. ఈ యుద్యోగుల తీవ్రబుద్ధి ఒక క్రొత్త డిపార్టుమెంటును సృష్టించెను. ఇట్టి పనులలో వారు చాల సమర్థులు. నీగ్రోలకు వేరే ఒక డిపార్టుమెంటు కలదు. ఇఁక ఆసియావారికి ఒకటి యేల యుండరాదు? ఈ వాదము న్యాయ్యముగనే కానిపించెడిని. నేను ట్రాన్సువాలు చేరు వఱకే ఈ క్రొత్త డిపార్టుమెంటు ప్రారంభమై మెల్లగా నెల్లెడలను తనవలను పరఁగించుచుండెను.

అనుజ్ఞాపత్రికల నిచ్చు నధికారులు తిరిగివచ్చినవారి కందఱికిని అనుజ్ఞాపత్రికలను ఈయవచ్చును; కాని ఆసియావారి విషయమున నిది చెల్లునా? ఈ క్రొత్త డిపార్టుమెంటువారి యనుమతితో అనుజ్ఞాపత్రికల నిచ్చుచో ఈ యధికారుల పూచీయును, బరువును తగ్గిపోవును. కావున ఈ క్రొత్త డిపార్టుమెంటు ఆవశ్యకమని వారి వాదము. అసలుమాట యేమనఁగా ఈ క్రొత్త డిపార్టుమెంటువారికి ఏదో కొంతపని యుండవలయును; వారికి ధనము కావలయును. పని యేమియు లేనిచో వ్యర్థముగద! పని లేనిచో ఈ డిపార్టుమెంటు ఎత్తివేయఁబడును. కావున ఈపనిని తమకుఁ దామ సృష్టించుకొనిరి.

హిందువులీ డిపార్టుమెంటు వారికి అర్జీ పెట్టుకొనవలయును. కొన్నాళ్లకు జవాబు వచ్చును. ట్రాన్సువాలుకు తిరిగివచ్చువారు పలువురు కాఁగా దళారులను మందలు మందలుగా పోగైరి. వీరును, ఆఫీసరులును గలిసి నిరుపేదలగు హిందువులకడనుండి వేలకొలఁది రూపాయలను గుంజుకొనిరి. పలుకుబడి లేనిచో చీటి పుట్టదనియు విశే

క్షించి కొందఱివిషయమున నూఱుపాళులేని న్యాయముచేయనిచో దొరకదనియు నాకు తెలియవచ్చెను. ఇట్టిస్థితిలో నటుకుపోవుటకు నాకేటి వీలు ?

నా ప్రాంత చెలికాఁడు డరబను పోలీసు సూపరింటెండెంటు కడకు వెళ్లి—చీటుల నిచ్చు ఆఫీసరుకు నన్నెఱిఁగించి నాకొక చీటి పుట్టునటులు చూడవలసినదనియు, నేను ట్రాన్సువాలువాసి నని మీ రెఱుఁగుదురుగదా యని అంటిని. అతఁడు వెంటనే తలకు టోపీ తగిలించుకొని నాతోవచ్చి చీటి యిప్పించెను. రైలుకు గంటకన్న అవకాశములేదు. సామాను సర్దుకొంటిని. ఆలెగ్జాండరుగారికి తలఁచి కొనుచు ప్రిటోరియాకు బయలుదేరితిని.

ముసళ్లపండుగ ముందున్నదని నేనెఱుఁగుదును, ప్రిటోరియా చేరి దరఖాస్తును తయారుచేసితిని. దర్బనులో ముందుగా ప్రతినిధుల పేరు లడిగినటులు నాకు గుఱుతులేదు. కాని యిప్పుడిచట క్రొత్త డిపార్టుమెంటు పనిచేయుచుండుటచే ముందు ప్రతినిధుల పేరులు చెప్పుడని యడిగిరి. ఆఫీసరులు ప్రతినిధులపట్టికనుండి నా పేరును తొలగింప దలఁచిరని ప్రిటోరియాలో హిందువు లిదివఱకే యెఱిఁగియుండిరి.

దుఃఖజనకమయ్యును మనోరంజకమగు నీ విషయము ముందు ప్రకరణమున.

౨

ఆసియానుండి నిరంకుశాధికారము

నేను ట్రాన్సువాలులో నెటులు కాలిడఁగలిగితినో అది ఈ క్రొత్త డిపార్టుమెంటువారికి తెలియరాలేదు. వారు తమకడకు వచ్చుచుఁ బోవుచుండు హిందూదేశీయులవారిని కనుఁగొనిరి గాని వీరికి మాత్ర మేమి తెలియును? నేను నా పురాతన పరిచయబలమున చీటి లేకుండఁగనే ప్రవేశించియుందునని వా రనుమానించిరి; అటులగుచో నన్ను జైలఁబెట్టవచ్చును.

పెద్దయుద్ధ మొకటి ముగిసిన పిదప కొంతకాలమువఱకు ప్రభుత్వమువారు ఒక విశేషాధికారము వహించుట అలవాటు. నాఁటి దక్షిణ-ఆఫ్రికాస్థితి సరిగా అట్టిదే. శాంతిని నెలకొలుపుటకు వారొక శాసనమును నిర్మించిరి. సెలవుచీటి లేక ట్రాన్సువాలు ప్రవేశించువారు చెఱసాలలో నుంపఁబడుదురని ఆ శాసనము. దీనిని బట్టి నన్ను చెఱఁబెట్ట నూహించిరి కాని 'సెలవుచీటి యేది?' అని నన్నడుగుటకు వీరికి సాహసము చాలకపోయెను.

ఆఫీసరులు డర్బనుకు తంతి యంపిరి. చీటితోనే నేను వచ్చినటులు తెలిసికొని, పాపము వారు నిరాశు లయిరి. కాని వా రంతటితో ఆస లుడుగువారు కారు. నేను ట్రాన్సువాలులోఁ జొచ్చితిఁ గాని వారు నన్ను మి. చేంబర్లేనును జూడకుండఁ జేయఁగలరు.

ఇందులకు ముందుగా వారు ప్రతినిధుల పేరు లడిగిరి. దక్షిణ-ఆఫ్రికాలో నెల్లెడలను రంగుతెగులు కానుపించుచునే యుండును; కాని, ఇండియాలో ఎట్టి మకిలి, ఎట్టి కుట్రలు కలవో అట్టిది అచట లేదు. దక్షిణ-ఆఫ్రికాలో ప్రజలకొఱకు ఉన్న డిపార్టుమెంటులు ప్రజా

క్షేమమునకే పాటుపడుచుండును. అవి ప్రజాభిప్రాయమును అనువర్తించుచుండును. కావున ఈ యుద్యోగులలో సరళతయు నమ్రతయు చూపట్టుచుండును. కావున నీని యుపయోగము అలంతియో కలంతియో మిగిలిన జాతులకు గూడ జూపట్టును. ఈ క్రొత్త ఆఫీసరులకు ఆసియానుండి వచ్చుటతో పాటు అచటి నిరంకుశాధికారమును వచ్చెను. దక్షిణ-ఆఫ్రికాయందు ఒకవిధమగు ప్రజాప్రభుత్వము కలదు. కాని ఇపుడు ఆసియానుండి వచ్చిన ఈ క్రొత్తసరుకు పదునారణాలును నిరంకుశాధికారపరిపూర్ణమే; ఏలయన: ఆసియాలో ప్రజాప్రభుత్వము లేదు; ఉన్నది పరప్రభుత్వము. దక్షిణ-ఆఫ్రికాలో తెల్లవారు ఇండ్లుకట్టుకొని అట ఉండిపోయిరి. ఇటులు వారు దక్షిణ-ఆఫ్రికావాసు లయిరి కావున డిపార్టుమెంటులోని ఆఫీసరులపయి వారికి అంకుశము కలదు. ఇపుడు ఆసియానుండి వచ్చిన నిరంకుశాధికారులు రంగస్థలమునం బ్రవేశించిరి. దీనితో హిందువులపని అడకత్తులోని పోకవలె నాయెను.

నేనును దీనిచవిని ప్రత్యక్షముగా ననుభవించితిని. ముమ్మొదట ఆడిపార్టుమెంటు పెద్ద ఉద్యోగిచే 'రమ్మని' నేను ఆజ్ఞాపింపఁబడితిని. అతఁడు లంకనుండి వచ్చినవాఁడు. 'ఆజ్ఞాపింపఁబడితిని' అను ఈ మాటలో కొంచెమేని అత్యుక్తి లేదనుటకు నాయాశయమును విప్పి చెప్పెదను. నాకు వారు చీటి వ్రాసి పంపలేదు. అచట భారతీయ ప్రముఖులు నిరంతర మా యుద్యోగులకడకు పోవలసియుండెదరు. స్వర్గీయులగు సేఠ్ తైయబ్ హాజీ ఖాన్ మొహమ్మద్ గారును అట్టివారిలో నొకరు. వారిని ఆ యాఫీసరు ఇటు లడిగెను—'గాంధీ ఎవరు? అతఁ డిచటి కేల వచ్చెను?'

తైయబ్ సేఠు ఇటులు జవాబిచ్చెను—'వారు మాకు సలహాదారు; మేము కోరఁగా వచ్చినవారు.'

౨. ఆసియానుండి నిరంకుశాధికారము

'ఎటు లగుచో మేము అందఱము నిచట నెందుకు? మీ సంరక్షణము నకుఁగాదా మే ముండుట? ఇచటి స్థితిగతులు గాంధీ కేమి తెలియును?'

తైయబ్‌షేకు సరిగనే సమాధానము నిట్లు చెప్పెను— 'నిక్కము. మీరు కలరు. కాని గాంధీ మా వాఁడు కాఁడా? అతనికి మా భాష తెలియును; మా భావము తెలియును. మీ రట్టివా రయినను తుదకు ఆఫీసరులు!'

'గాంధీని నా కడకుఁగొనిర'మ్మని ఆ యాఫీసరు హుకు మిచ్చెను

నేను తైయబ్‌షేక్ వగైరాలతో ఆఫీసరుగారికడ కరిగితిని. అచట మాకు కుర్చీ లెట్లుండును? మే మందఱమును నిటారుగా నిలువఁబడి చెప్పవలయును.

నాకేసి కన్నెత్తి ఆయాఫీసరు 'నీ వేల యిచ్చటికి వచ్చితివి?' అని యడిగెను.

'నావారందఱు నన్నుఁగోరఁగా సలహా యిచ్చుటకు వచ్చితి' నని నేనంటి.

'ఇచ్చటికి వచ్చుటకు నీకు హక్కు లేదని తెలియదా? పొరపాటున నీకు చీటి పట్టినది. నీవు ఈ దేశవాసివిగా పరిగణింపఁబడవు. నీవు మరలిపోవలసి యుందువు. నీకు చేంబర్లేనుగారి దర్శనము దొరకదు. భారతీయుల రక్షణముకొఱకే ప్రత్యేకముగా ఏషియాటిక్ డిపార్టుమెంటు నెలకొల్పఁబడినది. మంచిది. నీవిఁక వెళ్లవచ్చును.'

ఇంత వక్కాణించి, ఆఫీసరుగారు నాకు సెలవొసఁగిరి. జవాబిచ్చుటకు నా కవకాశ మీయలేదు.

పిదప నాతోడివారిని ఆఁపి— 'గాంధీని ట్రాన్సువాలునుండి పంపివేయుఁ' డని మెల్ల మెల్లగా చివాట్లు పెట్టెను.

వారు నూతి మునకటించుకొని వెనుదిరిగిరి. మా యెదుట ఈ క్రొత్తసమస్య! అదియు ఆకస్మికము.

3

అవమానసహనము

ఈ యవమానము నామనస్సునకు బాధ కలిగించెను. అయి-నను తొల్లి నే నిట్టివి పెక్కు సహించియుంటిని గాన అవి నాకు అలవాటయిపోయెను. కావున నే నీ క్రొత్త యవమానమును సహించి తటస్థుఁడనై కర్తవ్యమును నిర్వర్తింప నిశ్చయించితిని.

ఇటుపిమ్మట ఆ యాఫీసరుకడనుండి ఒకచీటి వచ్చెను. అందిటుల కలదు: 'గాంధి డరబనులో మి. చేంబర్లేనను చూచియుండెనుగాన ఇప్పుడు ప్రతినిధుల పట్టికనుండి ఇతనిపేరు తొలఁగించుట ఆవశ్యకమాయెను.'

ఈ యుత్తరము నాతోడివారలకు సహ్యము కాలేదు. ఇపుడు ప్రతినిధుల నసలే పంపవలదనుకొనిరి. అపుడు నే నచటి విషమస్థితిని సరిగా నిటులు తెలిపితిని. 'మీ రందఱును మి. చేంబర్లేనును కలిసికొని చూడనిచో మీ కేమియు కష్టనిష్ఠురములు లేవని నే నర్థమగును. అది యటుండె. మనము వ్రాసికనా మనకష్టములఁ దెలుపుకొనవలెను. అర్జీని మనము వ్రాయనే వ్రాసికొంటిమి. దానిని నేఁ జదివిననేమి ఇంకొకరు చదివిన నేమి? మి. చేంబర్లేను ఈ విషయమును గుఱించి మనతో వాదింపఁబోవఁడుకదా! మనకుఁ గలిగిన ఈ యవమానము సహింపనొప్పును.'

నేనిటులు ముగింపకమునుపే త్రైయబ్ సేతు—'మీ కవమానము కలిగినచో అందఱకును కలిగినటులు కాదా! మీరు మా ప్రతినిధులను మాట మే మెటులు మఱువఁగలము?' అని బిట్టనెను.

3 అవమాన సహనము

'నిక్కమే, కాని మనసంఘమంతయు నిట్టి యవమానముల దిగ్రమింగవలయును. దానికంటె వేఱే గతి యున్నదా?' అని నే నంటిని.

'ఏ మయినను సరే, మనము మఱియొక క్రొత్తయవమానము నేల నెత్తిపై తెచ్చి పెట్టుకొనవలయు? ఇంక దీని కన్న నెక్కుడు దుస్థితి రాదు. మనకున్న అధికారము లేవి పోయినవి?' అని తైయబ్ సేటు ప్రత్యుత్తరించెను.

తైయబ్ సేటుగారి యీ వీరత్వము నాకు ఆనందము కలిగించెను; కాని యీ పరాక్రమముచే ప్రయోజనములేదని నే నెఱుఁగుదును. వీరి లోటుపాటు లన్నియు నే నెఱుఁగుదును. కావున వీరి నందఱను శాంతింపఁజేసితిని. 'నాకు బదులుగా ఇండియన్ బారిష్టరయిన జార్జి గాడ్ఫ్రేగారిని (ఇపుడు స్వర్గీయులు) నియమించుకొనుఁ' డని వీరికి సలహా ఇచ్చితిని.

ఈరీతిగా శ్రీ గాడ్ఫ్రేగారి అధ్యక్షతతో వీరు మి. చేంబర్లేనుగారిని జూడఁబోయిరి. నన్ను తొలగించిన విషయమునఁగూడ మి. చేంబర్లేను కొంచెము మాటలాడెను. 'ఇనుమాఱులు ఒక ప్రతినిధితోడనే మాటలాడుటకన్న మఱొక క్రొత్తప్రతినిధితో మాటలాడుట మేలుతరము కాదా?' అని చెప్పి అయినగాయముమీఁద పట్టీ వేయఁజూచెను.

దీనితో నాయొక్కయు, సంఘముయొక్కయు పని ముగియుటకు బదులు హెచ్చెను. మేము మరల ఓనమాలకడకుఁ బోయితిమి. 'మీ మూలమునఁ గదా మనవారు యుద్ధములోనికి దిగిరి! దానికి ఫలమిది' అని కొంద ఱాడిపోసిరి. కాని దీనికి నేఁ జలింప లేదు. నే నిటు లంటి—'నాచేఁతకు నాకు పశ్చాత్తాపము లేదు. అటులు

చేయుట మంచి దనియే నేఁటికిని నేఁ దలఁతును. అటులు చేయుట కర్తవ్యమును పరిపాలించుట. ఫలము వెంటనే కనఁబడకుండుఁగాక; సత్కార్యము సత్ఫలమునే యిచ్చునని నాకు గట్టి నమ్మకము. ఇఁక మనము గతించిన దానిని వర్జించి కర్తవ్యమును గురించి విచారించుట లాభకరము.'

ఇతర మిత్రులును నా యీ మాటలను సమర్థించిరి.

మరల నే నిటులంటి—'నిక్క మాడవలయుచో నన్ను పిలిచిన పని ముగిసె ననఁదగును. మీ కెల్లరకును 'ఇంటికిఁ బొమ్మని' నాకు సెల వొసఁగినను 'ట్రాన్స్వాలునుండి కాలు కదపవలదు' అని నా యంత రాత్మ నాకు తెలుపుచున్నది. నేటాలునకు పోక ఇచటనే యుండి పనిచేయఁదలఁచితిని. నే నింకొక యేఁడాదిదాఁక భారతదేశమునకు పోవు తలఁపును విసర్జించుకొంటిని. ఇచట వకాలతు చేయఁదలఁచితిని. ఈ క్రొత్త డిపార్టుమెంటువారితో మంచిమాట చేసికొనఁగలనని నాకు ధైర్యము కలదు. మన మీ వ్యవహారమును పరిష్కరించుకొననిచో మనవా రందఱు కొల్లగొట్టఁబడుదురు; ఈదేశమునుండి వెళ్ళఁగొట్టఁబడుదురు; క్రొత్తయవమానములు తలఁదాల్పఁ జేయఁబడుదురు. నా కీ విషయమున ఇసుమంతయు సందియము లేదు. మి. చేంబర్లేను నన్ను జూడకుండుటయు, ఆ యాఫీసరు నన్ను తిరస్కరించి నాకు మన్నా చెప్పుటయు ఇవి ఈ ప్రతినిధుల యవమానమునందు భారతీయ సమాజము నవమానమునందు ఇసుమంతయుఁ గావు. మనము కుక్కల వలె కాలముగడపుట తగునా?

నే నీరీతిగా నా యభిప్రాయమును వారి కెఱుకసేసితిని. ప్రిటోరియా జొహాన్సుబర్గులలో నున్న భారతీయమిత్రులతో నాలోచించి జొహాన్సుబర్గులో ఆఫీసు నడుప నిశ్చయించితిని.

3 అవమాన సహనము

ట్రాన్సువాలులో నాకు వకాలతు-సనదు ఫట్టునా ఫట్టదా! అని సందియమే. కాని లా సొసైటీవారు నా దరఖాస్తునకు అడ్డము రాలేదు. కోర్టువారు మంజూరు చేసిరి.

అచట ఆఫీసు పెట్టికొనుటకు భారతీయునకు మంచితావు దొరకదు. లోగడ నాకు రిచ్ గారితో మంచి పరిచయము కలదు. అపుడు అతడు బేహారము చేయుచుండెను. అతడెరిగిన ఇండ్ల ఏజెంటు ఒకడు కలడు. క్లీడగులు ఉండుచోటున అతడు మంచి గదులు కుదిర్చిపెట్టెను. నేను వకాలతు చేయ మొదలిడితిని.

త్యాగవృద్ధి

ట్రాన్సువాలులోని భారతీయుల హక్కులు కాపాడుటకు చేసిన ప్రయత్నమును గూర్చియు, ఏషియాటిక్ డిపార్టుమెంటువారితో జరిపిన వ్యవహారములఁ గూర్చియు ఎక్కువగా వర్ణింపకముందు అప్పటి నా స్థితిగతులను గూర్చి కొంత ముచ్చటింతును.

ఇంతవఱకును కొలఁదిగనో గొప్పగనో డబ్బు కూడఁబెట్టవలయునను నాశ నామనసులో ఉండియేయున్నది. పరమార్థముతో పాటు, ఈ స్వార్థమును కలిసియే యున్నది.

బొంబాయిలో నేను వకాలతు చేయుచుండినపుడు అమెరికా బీమా ఏజెంటొకఁడు నాకడకు వచ్చెను. అతని రూపము రమణీయము, పలుకు మధురము. చిరకాలమిత్రుని వలె అతఁడు నాకు భవిష్యత్కాలమున మేలు కలుగ నిట్లు ప్రసంగించెను. 'అమెరికాలో మీవంటి స్థితిగతులు కలవారందఱును తమతమ జీవితములను బీమా చేయించుకొందురు. మీరుకూడ వారివలె భవిష్యద్విషయమున చీకుచింతలులేకుండ ఉండఁగోరుచున్నాను. జీవితము శాశ్వతమా? మా అమెరికావారు బీమా చేయించుకొనుట ధర్మముగా పరిగణింతురు. తామొక చిన్న పాలిసీని తీసికొండని నేను బులిపింతును.'

ఇంతవఱకు ఇండియాలోను, దక్షిణ-ఆఫ్రికాలోను ఎందఱో ఏజెంట్లు నాకెదురైరి కాని నేనెవరికిని మాట యీలేదు. ఏలన? బీమా చేయించుకొనుట అనఁగా భయము చెందుట, ఈశ్వరునియెడ విశ్వాసము గొనకపోవుట యని నేనెఱుఁగుదును. ఇటులయినను నే నీతని

బులిపింపఁబడితిని. అతఁడు తన వాదమును చెప్పుకొనుచుఁ బోవుచుండఁగా నా యెదుట నా యాలుబిడ్డల ప్రతిమలు గోచరించెను. 'ఓయీ! నీవు నీయాలినగలు ఇంచుమించుగ నన్నియు అమ్మనే యమ్మితివి నీ శరీరమునకు ఏదేని సంభవించుచో నీయాలుబిడ్డల బరువు? తండ్రి తరువాత తండ్రియై పోషించుచున్న నీయన్నగారిపైఁ బడును. అతఁడేమో ధనికుఁడా? దరిద్రుఁడు. ఇటు లొనరించుట నీకేటిపాడి?' ఇటులు నా మనసులో నిర్ధారించుకొని పదివేలరూకలకు బీమా చేయించుకొంటిని.

దక్షిణ-ఆఫ్రికాలో నా జీవితపు చూపు మాఱుటచే నా భావములును మాఱెను దక్షిణ-ఆఫ్రికాలో వచ్చిన ఈ నూతనాపత్సమయమున నే నేది చేసినను ఈశ్వరుని సాక్షిగా నిడికొని చేసితిని. నేను దక్షిణ-ఆఫ్రికాలో ఇంకను ఎంతకాలము ఉండవలయుదునో అది తెలలేదు. ఇండియాకుఁ దిరిగిపోఁజాలనని యనిపించెను. కావున నా యాలుబిడ్డల రావించుకొనవలె ననుకొంటిని. వీరిని ఇంకను దవ్వుల నుంచుట పాడిగాదు. వీరి భరణపోషణము లన్నియు దక్షిణ-ఆఫ్రికాలోనే జరుగవలె ననుకొంటిని. ఇట్టి చర్చలతో బీమా ఏలచేసితినా యనుకొంటిని. వృథాగా ఆ యేజెంటువలలో నేలపడితినా యని విచారించితిని. 'మా యన్నగారు నా పితృస్థానమునందే యుండినచో విధవయగుచో తనతమ్ముని యిల్లాలిని పోషింపఁడా?' అని అనుకొంటిని. కాని 'ముందు నీవే మరణింతువని అనుకొనుటెట్లు? తుదకు అందఱను పరిపాలించువాఁ డొక ఈశ్వరుఁడే; నీవునుగాదు నీ యన్నయుఁగాదు. బీమాచేసితివిపో నీ యాలుబిడ్డల పరాధీనులఁ జేసితివి. వారేల స్వతంత్రముగా జీవింపఁజాలరు? లోకమున అసంఖ్యాకు లగు నిఱుపేదలగతి యేమి? నీవు వారిలో నొకఁడవు గావా?

ఈ రీతిగా నామనస్సులో విచారధార ప్రవహించెను. కాని వాని ననుసరించి వెంటనే యేమియుం జేయలేదు. దక్షిణ-ఆఫ్రికాలో గూడ కంపెనీకి ఒక కిస్తీ చెల్లించినటులు స్మృతి.

మఱియు బాహ్యవిషయములుగూడఁ గొన్ని నా యీ విచారధారకు తోడయినవి. దక్షిణ-ఆఫ్రికాకు నేను తొలిసారి వెళ్ళినప్పుడు ఏసుమతమువారితో కూడిమాడి యుంటిని. దానికి ఫలముగా నాకు ధర్మమునెడ జాగరూకత అంటి పెట్టుకొని యుండెను. ఈ తూరి థియాసఫీ పరివేషమునఁ బడితిని. మి. రీచ్ దివ్యజ్ఞానసామాజికుఁడు. ఇతఁడు నాకు జోహాన్సుబర్గులోని సమాజముతో నెయ్యమలవడఁ జేసెను. దివ్యజ్ఞానసమాజమువారి యభిప్రాయములతో నాకు ఐక్యము లేదు. కావున నే నందుచేరలేదు. అయినను ఆ సమాజమునవారలతో ప్రత్యేకముగా నాకు గాఢపరిచయము కలదు. దైనందినమును వీరితో ధర్మమునుగూర్చి చర్చించుచుంటిని. అందు పుస్తకపఠనము జరుగుచుండెడిది. అప్పుడప్పుడు నేనును ఉపన్యసించుచుండువాఁడను. భ్రాతృత్వమును కలిగించుకొనుటయు పెంపొందించుకొనుటయు, దివ్యజ్ఞానసమాజమున ముఖ్యవిషయములు. మా కిదియె చాల చర్చ జరుగుచుండెడిది. ఈ యాదర్శముతో అందలి సభ్యులకు భేద మేర్పడినప్పుడు నేను పట్టి చూపుచుండువాఁడను. ఈ విమర్శప్రభావము నాకు సత్ఫల మొసఁగకపోలేదు. అది నాయాత్మపరిశోధనకు కారణమాయెను.

౫

ఆత్మపరిశోధనపరిణామము

నాకు ౧౮౮౯ సంవత్సరమున క్రైస్తవ-మిత్రులతో పరిచయము కలిగెను. నాకపుడు విద్యార్థిదశ. వారు బైబిలుసందేశమును నా మదికెక్కించి నాచేత దానిని స్వీకరింపఁజేయఁ జూచిరి. నేను నమ్రతతో తటస్థుఁడ నయి వారిపలుకులను వినుచును, తెలిసికొనుచును ఉంటిని. ఇంతియ కాక హిందూధర్మమును నా శక్తి కొలఁది పఠించితిని. మఱియు నితరమతములనుగూడ తెలిసికొన యత్నించితిని. పిదప ౧౮౯౩ సంవత్సరమున నా స్థితి మారెను. దివ్యజ్ఞానసమాజపు మిత్రులు నన్ను వారి సంస్థలోనికి లాగికొన నెంచిరి. దానికి హేతు వేమి? నేను హిందువుఁడను నా కడనుండి ఏదియో కొంత పుచ్చుకొనవచ్చును. దివ్యజ్ఞానసమాజపుస్తకములలో హిందూధర్మముయొక్క ఛాయయు, దాని ప్రభావమును కొంత కొంత కలదు. కావున నేను వారికి కొంచెము సాయము చేయఁగల నని వారియూహ. 'నాకు సంస్కృతము రాదు నేను ప్రాచీన సంస్కృతగ్రంథములలో హిందూధర్మమును జదువలేదు. అనువాదములలోఁ జదివికొనినదియు కడుఁ గొలఁది' అని వారికిఁ దెలిపితిని. వారు సంస్కారములను, పునర్జన్మములను విశ్వసించువారు గాన నావలన నేదియో కొంచె ముపకార ముండునని వారు నమ్మిరి. చెట్లు లేనిచోట్లున ఆముదపుఁజెట్టె మహావృక్షముకదా! కొందఱితో వివేకానందుని 'రాజయోగము'ను, మఱికొందఱితో మణిలాల్ నభుభాయి ద్వివేది 'రాజయోగము'ను జదివితిని. ఒక మిత్రునితో పాతంజలయోగదర్శనము పఠించితిని. పలువురతోఁ గలిసి గీతలఁ జదువ నారంభించితిని. మేమచట నొక చిన్న జిజ్ఞాసుసభను స్థాపించితిమి.

అందు నియమపూర్వకముగా అధ్యయనమును ఆరంభమాయెను. మొదటినుండియు గీత లనిన నాకు భక్తిశ్రద్ధలు కలవు. ఇపుడు దాని రహస్య మెఱుఁగవలె ననిపించెను. నాకడ ఒండు రెండు అనువాదములు కలవు. వానిసాయమున మూలమును దెలిసికొన ప్రయతించితిని. మఱియు ప్రతిదినమును ఒకటి రెండు శ్లోకములు కంఠస్థములు చేయ నిశ్చయించితిని.

ప్రాతఃకాలమున దంతధావనము చేయునపుడును, స్నానము చేయునపుడును గీత వల్లించుచుంటిని. దంతధావనమునకు ౧౫ నిమిషములును, స్నానమునకు ౨౦ నిమిషములును పట్టెడివి. నేను తెల్లవారి వలె నిలువఁబడి పలుదోమెడివాఁడను. గీతాశ్లోకములను చిన్న కాకితముపై వ్రాసి ఎదుటిగోడ కంటించి చూచుచు వల్లించుచుంటిని. ఈరీతిగా స్నానము చేయుసరికి శ్లోకములు వచ్చెడివి. దినపాఠము వల్లింపను,వెనుకటి వానిని గుర్తు చేసికొనను ఈ కాలము సరిపోయెడిది. ఇటులు పదుమూఁడధ్యాయములవఱకును వల్లించినటులు గుర్తు. పిదప జంజాటము బలిసెను. సత్యాగ్రహము జనించెను. ఈ పసికాయను పెంచవలసినభార మొకటి మీఁదఁ బడెను. దాని లాలనపాలనములతో నాసమయ మత్యన్న మయ్యెడిది. నేఁటికిని అది యాచందముననే యున్న దననగును.

గీతాపఠనమువలన ఎట్టి ఉపలబ్ధి కలిగెనో దానిని పఠించిన నాసహాధ్యాయులే చెప్పఁ దగుదురు; కాని నామాట—నా కది శీలమును దిద్దికొన మార్గదర్శక మాయెను. నా కయ్యది ధర్మనిఘంటువు. తెలియని ఇంగ్లీషుమాటలకు డిక్షనరీని ఎటులు త్తెఱతునో అటులే ప్రవర్తనకుసంబంధించిన చిక్కులలో గీత తెఱతును. ఇందలి అపరిగ్రహము, సమభావము మొదలగు పదములు నన్ను గిఱివైచెను. 'సమభావము నెటులు సాధింతును? ఎటులు పాలింతును?' అని

మల్లాడితిని. అధికారి యొకఁడు మనల నవమానించును; ఒకఁడు లంచగొండి; దారిని బోవుచుండఁగా నొకఁడు కయ్యమునకు కాలు సాఁపును. ఇట్టివారును గలరు. మనకు చాల నుపకారము చేసిన వారును గలరు. వారికిని వీరికిని భేదము లేదా? ఇట్టియెడ సమత్వ మెటులు? మఱియు అపరిగ్రహము ఆచరణమునఁ బెట్టుకొనుట యెటులు? మనదేహముమాత్రము మనకు పరిగ్రహము కాదా? స్త్రీ పుత్రాదులు పరిగ్రహము కాక మఱేమి? గ్రంథపూర్ణమైన ఈయల మారలలో నిప్పు పెట్టనా? నాయింటిని జలాకరమగు క్షేత్రముగాఁ జేసినైవనా? లోపలనుండి వెంటనే ఇటులు జబాబు వచ్చెను—ఇల్లు ముల్లెలు వీడనిచో పరమేశ్వరుని పడయఁ జాలవు. నాచదివిన ఇంగ్లీషు-లా నాకు తోడయినది. స్నెల్ రచించిన లాలోని సిద్ధాంతముల చర్చ గుర్తు దవిలెను. గీతాధ్యయనాదృష్టమున ట్రస్టీ అను పదమున కర్థము లెస్సగా తెలిసెను. లామీఁద ఆదరము హెచ్చెను. నాకు లాలోఁగూడ ధర్మతత్త్వము కానిపించెను. ట్రస్టీలు లక్షలాది ధనమును నిలువయుందురు. కాని అందొక చిల్లిగవ్వపయి నేని వారి కధికారము లేదు. ముముక్షువు కూడ ఈరీతిగనే ప్రవర్తింప వలయును—ఈపాఠము నేను గీతలనుండి నేర్చికొంటిని. అపరిగ్రహమునకు, సమత్వమునకు హృదయపరివర్తనము కావలయు నను విషయము నాకు దివ్వెవలె కానిపింపఁదొడఁగెను. 'భీమాపట్టాను రద్దుచేయింపు' డనియు, 'తిరిగి యిచ్చినంత పుచ్చుకొందును; లేనిచో లే' దనియు రేవాశంకరుగారికి వెంటనే వ్రాసితిని. భగవానుఁడు నన్ను సృజించినటులే నా యాలుబిడ్డలను సృజించెను. నన్ను రక్షించినటులే వారినిని రక్షించును. నాకు పోసినవాఁడె నీరు పోయును గదా యని నే నెఱిఁగికొంటిని. నాఁటి నా యాశయము ఒకయుత్తరమునఁ గలదు. తండ్రితో సమానుఁడగు మాయన్నగారికి

అందిటులు వ్రాసితిని.—'నేఁటివఱకు నేను సంపాదించుచువచ్చినది నీకు అర్పించుచు వచ్చితిని. ఇఁక నాయాశను విడనాడఁగోరు చున్నాను. ఇఁకమీఁద నా సంపాదింపఁబోవునది ఏ కొంచెమేని సార్వజనికములగు కార్యములకు వినియోగపడఁగలదు.'

దీని యాచితి మాయన్నగారికి వడిగా విశదము కాలేదు. ఆయన పెద్దపెద్ద మాటలతో నావిధినిగూర్చి నాకు వ్రాసిరి—'నీవు నాయనగారికన్న నధికుఁడవు కాఁదలఁపఁ బనిలేదు. నాయనగారు కుటుంబపాలనపోషణముల మానుకొనిరా? నీవును వారివలె ఇల్లువాకిలి జాగ్రత్త పెట్టుకొనవలయును....' నేను దీనికి వినయపూర్వకముగా నిటులు జబా బిచ్చితిని—'నాయనగారు ప్రవర్తించిన చందముగనే నేనును ప్రవర్తించుచున్నాను. కుటుంబ మను పదమునకు కొంచెము విశాలముగా వ్యాఖ్యానము చేయుచో నాచేసిన పనియొక్క బాగోగులు తమకు విశద మగును.'

మాయన్నగారు నాపై ఆస లుడిగిరి. నాకు ఉత్తరము వ్రాయుట మానుకొనిరి. దీన నాకు దుఃఖ మొదవెను. కాని దేనిని నేను విధి యని తలఁచితినో దానిని విడనాడుకొంటినేని ఇంతకంటె నెక్కుడు దుఃఖపడియుందును. కావుననే నే నీకొలఁది దుఃఖమును సైరించితిని. ఇటులయినను నాకు మాయన్నగారియెడల భక్తి తొంటివలెనే నిర్మలముగను, అధికముగను ఉండెను. మాయన్నకు నాపైఁ గల అధిక వాత్సల్యమే దుఃఖమునకు కారణమని నాకుఁ దెలియును. వీరికి నా రూపాయలమీఁద కంటె నా సౌజన్యముమీఁదనే ఎక్కుడ పేక్ష.

తుదకు చరమదివసములలో ఆయనకు నాపని నచ్చెను. మృత్యుశయ్యపై నున్నపుడు నాపని ఉచితమనియు, ధర్మ్యమనియు అతఁడు సూచించెను. ఆయన అపుడు వ్రాసిన కమ్మ కరుణాజనకము. తండ్రి

కొడుకును క్షమింపుమని కోరినటులు ఆయన నన్ను క్షమింపుమని కోరెను. నాపిల్లలను నీయిచ్చవచ్చిన లాలనపోషణశిక్షణములఁ జేయుమని వ్రాసెను. ఆయన నన్నుఁ జూడ కన్నులు వాచుకొనెను. దక్షిణ-ఆఫ్రికాకు వచ్చెదనని నాకు తంతి యిచ్చెను. తొందరగా రమ్మని నేనును తంతి నిచ్చితిని. కాని మాకలయికకు ఈశ్వరుఁడంగీకరింపలేదు.

తనపుత్రులవిషయమున అతఁ డెట్టి యిచ్ఛఁజూపెనో అదియు నెఱవేర్పఁబడలేదు. మాయన్న దేశమునందే మేను దొరఁగెను. ఆయన కుమారులు ప్రాచీనసంస్కారమునే పడసిరి. అందు పరివర్తనము పడయఁగలుగలేదు. నేను వారిని ఆకర్షించుకొనలేక పోయితిని. దీన వారి దోసఁ మేదియు లేదు. స్వభావము నెవరు మార్పుచేసికొనఁగలరు? బలవత్తరములగు సంస్కారముల నెవఁ డాపఁగలఁడు? మన భావములలో నెట్టిపరివర్తనము కలుగుచున్నదో, మఱియు మన కెట్టులు వికాసము కలుగుచున్నదో అటులే మనల నాశ్రయించుకొని యున్నవారికిని, మన తోడివారలకును కలుగవలయునని మన మనుకొందుము; కాని అది మిథ్య.

తలిదండ్రులగువారి పూఁట* ఎంత భయంకరమో ఈవిషయమువలన కొంచెము తెలియఁగలదు.

---

* పూఁట = పూచీ, లేక బాధ్యత, responsibility.

౬

శాకాహారమునకు బలి

జీవనమునందు త్యాగము, నిరాడంబరతయు, ధర్మజాగృతియు వృద్ధి పొందిన కొలఁదిని నాకు నిరామిషాహారమునందును తత్ప్రచారమునందును ఆసక్తి హెచ్చెను. ప్రచారము చేయుటలో నాకుఁ దెలిసిన దొకటే పద్ధతి: ఆచరించుట, ఎఱుఁగఁగోరువారితో ఆలపించుట.

జోహాన్సుబర్గునందు నిరామిషాహార-గృహము (**Vegetarian restaurant**) కలదు. దాని నడుపువాఁ డొక జర్మను దేశమువాఁడు. అతనికి కూనీ జలచికిత్సయందు నమ్మిక. నే నటకు పోఁదొడఁగితిని; మఱియు ఎంతమంది ఇంగ్లీషుమిత్రులను తీసికొనిపోవఁగలనో అంత మందిని తీసికొనిపోవుచుంటిని. కాని ఆ నిరామిషాహారగృహ మెంతో కాలము మనదని తెలిసెను; ఏలన, ధనలోపము. తగునంత దానికి నే సాయపడితినిగాని తుదకు దానిని మూయక తప్ప లేదు. దివ్యజ్ఞాన సమాజమువారిలో పలువురు మాంసము తినరు. కొంద అసలే తినరు, కొందఱు కొంచెము కొంచెము. ఆ సమాజమునం దొక సాహసవతి కలదు. ఆమె చాల పెద్దయెత్తున మాంసము లేని భోజనాలయ మొకటి పెట్టెను. ఆమె చాల కలారసిక. ధనవ్యయమునకు వెను దీయదు. జమాఖర్చులు చూచికొనదు. ఆమెకు మిత్రులును పలువురని చెప్పవచ్చును. మొదట నీమె కొద్ది యెత్తుమీఁదనే నడపెను. కాని పిదప పెద్దయెత్తున నడపఁదలఁచెను. దీనికి నా సాయము కోరెను. అపుడు ఆమెకడ నెంత యున్నదో నే నెఱుఁగనుగాని తగినంత ధన ముండకపోదని తలఁచితిని. నాకడ డబ్బునకు వీలు కలదు. పలువురు క్లయంట్లు నాకడ ధనము నిలువయుంతురు. వీరిలో ఒకసజ్జనుని సమ్మతి

గాని ఇంచుమించు వేయిపౌను లీమెకు బదు లిచ్చితిని. ఆ క్లయంటు ఉదారుఁడును, విశ్వాసియు. అతఁడు మొట్టమొదటి గిరిమిటియా. అతఁడు 'భాయీ! మీ యిష్టప్రకారము డబ్బు ఇచ్చివేయుఁడు. నే నేమియు నెఱుఁగను. నేను మిమ్ములనే యెఱుఁగుదును' అని యనెను. అతని పేరు బదరీ. ఇతఁడు సత్యాగ్రహమున చాల పని చేసెను. చెఱకుఁగూడఁ బోయెను. ఇతని యీమాత్రము సమ్మతి చాలు ననుకొని యితని పైకమును ఆమె కొసఁగితిని. రెండు మూఁడు నెలలు గడచెను. కాని పైకము తిరిగి వచ్చునటులు కానిపింపలేదు. అంత నష్టమును భరింపఁదగినశక్తి నాకు లేదు. ఆ పైకము నాకడనే యుండుచో వేఱ యుపయోగించెడిది. తుదకు అప్పు మునిఁగి పోయెను. అటులని నన్ను నమ్మిన బదరీని నష్టపఱుప నగునా? అతఁడు నన్నుమాత్ర మెఱుఁగును. ఆదండుగను నేనే పెట్టుకొంటిని.

ఈ సంగతిని నేనొక క్లయంటుతో ప్రస్తావించితిని. అతఁడు నన్నిటులు తియ్యగ ముదలకించి నాకు మేలఁకువ కలిగించెను;

'భాయీ! [దక్షిణ-ఆఫ్రికాలో నేను మహాత్ముఁడను కాలేదు; బాపును (తండ్రి) కాలేదు. మిత్రులగు నాక్లయంట్లు నన్ను భాయి యని సంబోధించెడివారు] ఈపని మీది కాదు. మేము పలుపనులలో మిమ్ము నమ్మి చనుచుందుము. మీ కీ డబ్బు తిరిగిరాదు. కాని మీరే సొమ్ము ఇచ్చికొందురు. బదరీని నష్టపఱుపరు. అది యటుండె. మీ రీ రీతిగా మీ క్లయంట్లధనమును సంస్కరణముకొఱకు సాయము చేయుచో వారు పాడగుదురు. కొలఁదిరోజులలో మీకును నిష్పచ్చరము. ఇటులగుచో మీ సార్వజనిక కార్యము లన్నియు మునిఁగియును.'

సౌభాగ్యమున నాయీ మిత్రుఁ డింకను నున్నాఁడు. దక్షిణ ఆఫ్రికాలోఁగాని, మఱియొకతావునఁగాని ఇతనికన్న మంచి మనసు

గలవాఁడు మఱియొకఁడు నాకుఁ గానరాలేదు. ఇతఁ డెవరినేని సందేహించెనేని పిదప నది కట్టిదని తెలిసికొనెనేని, వెంటనే అతనికడకరిగి క్షమింపుమని వేఁడికొని మనస్సును శుద్ధము చేసికొనెడివాఁడు. నన్నితఁడు ముదలకించుట చాల మేలయిన దని అనుభవమాయెను. బదరీ రూకలు బదరీకి ఇచ్చివయిచితిని. కాని మరల నిట్టి దెబ్బ తగులుచో గానికి తాళగలశక్తి నాకు లేదే! అందులకు అప్పు చేయవలయును. ఇట్టిది నే పుట్టినతరువాత చేయలేదు. అప్పనిన నాకు రోఁత. సంస్కరణాభిలాష యెంత యున్నను తన శక్తికి మించిపోఁగూడదని దీనివలన నేర్చికొంటిని. నే నీపనిలో గీతలలో ముఖ్యమగు నిష్కామకర్మమును అనాదరించితిననియు తెలిసికొంటిని. ఈ తప్పు నాకు ముందరికి దీపస్తంభమాయెను.

నిరామిషాహార ప్రచారమునకుఁగాను వేదిలో నింత బలిదానము వేయవలసియుండునని నే నెంచలేదు. ఇది నేఁ గోరక చేసికొనిన పుణ్యము.

౭

మట్టి, నీరు : వీనితో పరీక్ష

నా జీవనము నిరాడంబరమయిన కొలఁదిని వ్యాధులకు మందు పుచ్చుకొనుటలో మొదటినుండియు నాకుఁగల అరుచి ఇపుడు మఱికొంచెము పెరుఁగఁదొడఁగెను. నేను డరబనులో వకాలతు చేయుచుండఁగా డాక్టరు ప్రాణజీవన మెహతాగారు అచటికి ననుఁ జూడవచ్చిరి. అపుడు నాకు దుర్బలత్వమును (debility), కీళ్ళవాఁపును (rheumatic inflammation) కలుగుచుండెడివి. డాక్టరుగారు మందీయఁగా నిమ్మళించెను. పిదప ఇండియాకు మఱలు వఱకు చెప్పఁదగినంత వ్యాధి యేదియు వచ్చిన గుర్తు నాకు లేదు.

జోహాన్సుబర్గులో నున్నపుడు మలబద్ధకము, తలనొప్పియు వచ్చుచుండెడివి. భేదులను పుచ్చుకొనియు, పథ్యము చేసియు సరి పుచ్చుకొనుచుంటినిగాని దాన రోగముక్తుఁడను గాలేదు. 'ఈ మందుల జంజాటమునుండి బయటఁ బడితివా బ్రతికిపోదు' వని నా మనస్సు చెప్పుచుండెను.

ఆరోజులలోనే కావచ్చును, మాంచెస్టరులో 'నో బ్రేక్ ఫాస్టు ఎసోసియేషన్*' అనునది స్థాపింపఁబడెనని నే వింటిని. దాని యుద్దేశ మేమనఁగా, ఇంగ్లీషువారు పలుమాఱులు భుజింతురు. పలురకముల వంటకములు కుడుతురు. రేయి పండ్రెండుగంట లగువఱకును తినుచునే యుందురు. దాన డాక్టరుల యిండ్లకు పరుగెత్తుచుందురు. ఈ యాపద తప్పించుకొనవలయుచో ప్రాతర్భోజనము మానవలయును. ఈ యంశములన్నియు నాయెడఁ బట్టకున్నను కొన్ని కొన్ని తప్పక

* ప్రాతరాహారము మానవలెనని పెట్టుకొనిన సమాజము.

పట్టును. నేను మూర్ఖులు కడుపారఁ గుడుతును. రెండు జాములవేళ తేనీరు త్రావుదును. నే నెన్నఁడును కొంఁచెగా తిని యెఱుఁగను. నిరామిషాహారి నయ్యు, పొగపులు, మసాలాలు వదలినవాఁడ నయ్యు, వీలున్నంతవఱకు నాతినుదానిలో నే రుచులు చూచుట మానలేదు. ఆరేఁడుగంటలు కొట్టకముందెన్నఁడును లేచి యెఱుఁగను. అపుడు ప్రొద్దుటితిండిమానినచో తలనొప్పిపోవచ్చు ననుకొంటిని. ప్రయత్నము చేసితిని. కొన్నాళ్లు కొంచెము కష్టమనిపించెను. కాని తలనొప్పి పాఱి పోయెను. కావలసినదానికంటె నెక్కువ తినుచుంటినని దానితో తేలిపోయెను.

ఈ పరివర్తనమువలన మలబద్ధకము మాత్రము పోలేదు. కూనీ చెప్పిన కటిస్నానము చేసి చూచితిని. అది కొంచెము పనిచేసెను గాని అనుకొన్నంతగా చేయలేదు. ఈనడుమ నిరామిషాహారగృహము పెట్టిన జర్మనుమిత్రుఁడో, మఱి యింకొకమిత్రుఁడో కాని, జుస్టు వ్రాసిన 'రిటర్‌ టు నేచర్' అను గ్రంథమును నాచేత నిడియెను. ఈ గ్రంథమున మట్టి చేయు నుపయోగములు చదివితిని. ఇంతియ కాక సద్యఃఫలములును, పప్పుగల కాయలును మనుజుల స్వభావము నకు తగిన ఆహారమని ఆ గ్రంథకర్త సమర్థించెను. నే నప్పటికి కేవలము పండ్లను తిని చూచి యుండలేదు; కాని మట్టివైద్యము చేయ మొదలిడి చూచితిని. అది చక్కగా పనిచేసెను. మట్టివైద్యము నిట వివరింతును. ఎఱ్ఱనిదిగాని, నల్లనిదిగాని, శుభ్రమయిన మట్టిని తగి నంత దెచ్చి చలినీళ్ళతో తడుపవలయును. పిండివలె నున్న ఆ మట్టి ముద్దను పరిశుభ్రమగు వస్త్రముపై పూయవలయును. దానిని పొట్టకుఁ గట్టుకొనవలయును. ఈరీతిగా దీనిని పొట్టకుఁగట్టుకొని పడుకొంటిని. మెలఁకువ వచ్చినపుడుగాని, ప్రొద్దునఁగాని తీసివేయుచుంటిని. దాన మలబద్ధకము నిర్మూల మాయెను. నాఁటనుండియు నేను ఈ

వైద్యమును చేసికొనుటయగాక నా మిత్రులచేతను జేయించితిని. దీని వలన లాభము కలుగలేదని చెప్పినవారున్నటులు నాకు సుర్తు చాలదు.

నే నీదేశమునకు వచ్చినపిదప ఈ యుపచారములమీఁద ఆత్మ విశ్వాసమును కోలుపోయితిని. ప్రయోగ మొనరించి చూచుటకు నా కవకాశము లేకపోయెను. ఏల యన, ఎచటను నేను అంటిపట్టుకొనియుండ వీ లయినదికాదు. అయినను ఈ మట్టివైద్యమునందును, జలచికిత్సయందును మొదట నా కెంత విశ్వాసము కలదో నేఁటికిని అంత విశ్వాసము కలదు. నేఁటికిని నేను కొంత మట్టివైద్యము చేసికొనుచునే యున్నాను. అక్కఱ కలుగుచో నా మిత్రులకుఁగూడ చేయుఁడని సలహా యిచ్చుచున్నాను. నాకు రెండు మాఱులు మహావ్యాధులు వచ్చెను; కాని మందులతో మనుజులకు అంతగా పనిలేదని నాకు నమ్మిక. పథ్యము, నీరు, మట్టి ఈ మొదలగు గృహవైద్యములతో వేయింటికి తొమ్మిదివందల తొంబదితొమ్మిది కుదుర్పవచ్చును.

చీటికి మాటికి వైద్యులకడకుఁ బరుగిడి రసవిషగంధకములచే శరీరము నింపుకొని మానవుఁడాయువును తగ్గించుకొనుచున్నాఁడు. తనను తన యధీనమున నుంచుకొనఁ జాలఁడు. తాను తన శరీరమునకు ఏలిక యగుటకు బదులు బంటై తుదకు మానవత్వమునుగూడఁ గోలుపోవుచున్నాఁడు.

నే నీ యధ్యాయమును రోగశయ్యపైఁ బరుండి వ్రాయుచున్నాను; కావున నాయీయుద్దేశముల నెవ్వరును గేలిచేయకుందురుగాక! నా తెగుళ్ళకు కారణము నే నెఱుఁగుదు; నేనే వానికి కారణమనియు నెఱుఁగుదు; కావుననే నాకు ఓర్పు పోలేదు. ఈ రోగములను ఈశ్వరానుగ్రహముగా నమ్మి పలురకము లగు మందుల బారినుండి తప్పుకొనఁ గలిగితిని. ఈ మొండివానివలన డాక్టరు మిత్రులకు కష్టము కలుగుచున్నదని నే నెఱుఁగుదును కాని వారు ఉదారతతో నా మొండిపట్టును సైరించి నన్ను విడువకున్నారు.

ఆత్మకథ

ఇచట నా ప్రస్తుతస్థితిని అడ్డముగాను, నిలువుగాను చెప్పకొనవలయు నావశ్యకత లేదు. కావున నేను మరల ౧౯౦౮-౨౧ సంవత్సరములకు వత్తును.

ఈ విషయము ముందునకు సాగక ముందు పాఠకుల కొక హెచ్చరిక చేయవలసియున్నది. ఇది పఠించువారు జుస్టువ్రాసిన ప్రతిమాటయు వేదవాక్యమని నమ్మరాదు. వ్రాయసకాండ్ర దృష్టి ప్రాయికముగా ఏకాంశమునందే లగ్నమయి యుండును. ప్రతివస్తువును తక్కువలోఁదక్కువగా పదిమూలలనుండి చూడవలయునని నా కోరిక. మఱియు ఆ వస్తు వేమూలనుండి చూచినను సత్యముగా నుండవలయును. కాని ఆ వస్తువు ఏకకాలమున అన్నిస్థితులయందును సత్యముగా నుండఁజాలదనియు మఱవఁదగదు. మఱియు చాల పుస్తకములు ధనమునకును, పేరునకును వ్రాయఁబడుచుండును. కావున ఇట్టి పుస్తకములు చదువఁగోరు సజ్జనులు వివేకముతోఁ జదువుదురుగాక! అందలి విషయములను పరీక్షింపఁ గోరువారు అనుభవము గల వారి సలహాను పుచ్చికొందురుగాక! ఓర్పు గొని చదివి తెలిసికొనిన పిదప పరీక్షచేయ నారంభింతురుగాక!

౮

ఒక హెచ్చరిక

ప్రవాహపతితమగు కథను జెప్పవలసి మూలకథను మఱొక యధ్యాయముదాఁక ఆఁపవలసి వచ్చినది.

వెనుకటి అధ్యాయమున మట్టినిగుఱించి కొంచెము వ్రాసితిని; ఆ చందముగనే తినుబండములందుఁగూడ పరీక్ష యొనరించి చూచితిని. కావున వీనిని గుఱించియు కొంచెము వ్రాయుట యుచితము. ఈ విషయమును ప్రసక్తానుప్రసక్తముగా ముందును వ్రాయఁగలను.

తినుబండములలో నాచేసిన పరీక్షల గుఱించియు, విచారణ గుఱించియు సవిస్తరముగా వ్రాయఁ బనిలేదు. ఏలన, ఈ విషయములను నేను ఆరోగ్యదిగ్దర్శనము అను గ్రంథమున విస్తరించితిని. ఇండియన్ ఒపీనియన్ అను పత్రికకుఁగాను నేనీగ్రంథమును రచించితిని. నా చిన్న చిన్న గ్రంథములలో నెల్ల ఈ గ్రంథమే ఎక్కువగా పాశ్చాత్యులచేతను, ప్రాచ్యులచేతను పఠింపఁబడినది. దీనికి కారణ మేమో తెలియరాదు. ఈ పుస్తకము ఇండియన్ ఒపీనియన్ చదువుకొనువారలకు వ్రాయఁబడెను. కాని దీనిని జదివి పలువురు స్త్రీపురుషులు తమ జీవితములను మార్చుకొనిరి. మఱియు నాకు ఉత్తరములను వ్రాసిరి, వ్రాయుచును ఉండిరి; కావున దీని గుఱించి కొంచెము వ్రాయక తప్పదు.

దీనికి కారణ మిది: అందు వ్రాసిన విషయములను మార్చవలసిన పని పట్టలేదు. అయినను నాయాచారములను కొంచెము మార్చికొంటిని. ఆ గ్రంథము చదివినవారికి ఈమార్పులు తెలియవు. కావున వీనిని వడిగా తెలిసికొందురని వ్రాయక తప్ప దంటిని.

ఇతరగ్రంథములవలెనే నేనీగ్రంథమును ధర్మబుద్ధిచే ప్రేరితుఁడనై వ్రాసితిని. ఈ ధర్మభావమే నాప్రతిపనియందును నేఁటికిని గలదు. నే నాగ్రంథములో నిర్ణయించిన కొన్ని విషయములను అలవాటులో పెట్టుకొనఁజాలక పోవుటచే దుఃఖమును, సిగ్గును కలుగుచున్నవి.

మనుజునకు శైశవమున తల్లిపాలు కావలయును. పిదప మఱియేపాలును అక్కఱలేదని నాకు చాల నమ్మకము. వనమున పండిన పండ్లును, కాయలును దక్క వేఱు మనుజున కక్కఱలేదు. బాదముపప్పు మొదలగు బీజములందును, ద్రాక్ష మొదలగు ఫలములందును శరీరమును, బుద్ధిని పెంపొందించు ద్రవ్యములు కలవు. ఇట్టి యాహారము దినువానికి బ్రహ్మచర్యము, సంయమము చులుకన. 'తిండి యెట్టిదో త్రేఁ పట్టిది,* భోజన మెట్టిదో జీవన మట్టిది' అను నీ మాటలు చాల తథ్యము. ఇది నాకును, నామిత్రులకును మంచి యనుభవము. నా పుస్తకమునం దీవిషయములను విపులముగా చర్చించితిని.

కాని నాదురదృష్టమున ఇండియాలో నాప్రయోగములను సంపూర్ణముగా ననుష్ఠింపఁజాలకపోయితిని. ఖేడాజిల్లాలో యుద్ధమునకు కూటువమూఁకను పోగుచేయుచున్నతఱి ఒక పొరపాటుచే మృత్యుశయ్య నెక్కితిని. పాలను విడనాడి ప్రాణధారణ మొనరించుటకు నే నింతవట్టు నిష్ఫలప్రయత్నము లనేకము లొనరించితిని. పాలు లేకుండ ప్రాణధారణ మొనరించుటకుఁగాను నాయెఱిఁగిన పలువురు డాక్టరులను, రసాయనశాస్త్రజ్ఞులను అడిగి చూచితిని. కొందఱు పాలకు బదులు మినపకడుగును, కొందఱు మహువా నూనెను, కొందఱు బాదముపప్పు పాలను సూచించిరి. శరీరము కృశించువఱకు

* ఆహార్ తేవో ఓడకార్, మాణస జేవుం ఖాయ్ తేవో థాయ్.

పీని నన్నిటిని వాడి చూచితిని గాని రోగశయ్యను మాత్రము విడువ లేదు.

రోగనివారణమునకు ఖాద్యాఖాద్యవిచారణము చేయరాదని వైద్యులు చరకము మొదలగు గ్రంథములు ప్రమాణముగాఁ జూపిరి. మఱియు పని పట్టుచో మాంసాదులనుగూడ తినవచ్చు ననిరి. ఇట్టి వారు పాలను ఎటులు విడనాడు మనఁగలరు? బీఫ్ టీని, బ్రాందిని పుచ్చుకొనుమనువారు పాలను విడువు మనఁగలరా? నే నొట్టు పెట్టు కొంటిఁ గాన ఆవుపాలను, గేదెపాలను త్రావను. క్షీరమాత్రమును త్యజించుటయే నాఒట్టునం దుద్దేశము. కాని నే నా శపథము చేసి కొనినపుడు నామనస్సులో ఆవులు, గేదెలు మాత్రమే కలవు. కావునను, జీవితాశచేతను ఎటులో ఒకటులు మనస్సును సరిపెట్టు కొంటిని. ఈరీతిగా శపథముయొక్క ఉద్దేశమును పాలించి మేఁక పాలఁ ద్రావ నిశ్చయించితిని. ఈ మేఁకపాలు త్రావునపుడు అది శపథము యొక్క ఆత్మను చంపుటయే యని నామనస్సు చెప్పుచునేయుండెను.

శౌలతుచట్టమును ఎదురుకొనవలయు నను మోహము నన్ను విడనాడలేదు. దీనిచే బ్రతుకునందును ఇచ్ఛ పుట్టెను. దానఁజేసి జీవితమునందలి నా యీ మహాపరిశోధన ఆఁగిపోయెను.

కూటితోడను, నీళ్లతోడను ఆత్మ కించుకేనియు సంబంధము లేదు. ఆత్మ తినదు, మఱి త్రావదు. 'పొట్టలోనికి పోవు వస్తువుచే లాభహాని లేదు గాని లోపలి నుండి వచ్చు మాటచే లాభహాని కలదు' అను నీ వచనముల నే నెఱుఁగుదును. ఇవి నిక్కములే. కాని యీ వచనములతో జగడము పెట్టుకొనుటకన్న నా నిశ్చయమును వ్రాయఁ దలఁతును—ఎవఁడు భగవంతునియెడల భయభక్తులతో సంచరింపఁ గోరునో, ఎవఁడు ఈశ్వరుని ప్రత్యక్షముగాఁ జూడఁ గోరునో, ఆ

సాధకుఁడు మాటయందువలె తిండియందును త్యాగమునకుఁ గాని, గ్రహణమునకుఁ గాని ఆవశ్యకత సమానమని తెలియవలయు.

పిదప నేను పొరపడిన విషయములలో నాకు మాపిన దెసనే పొందుమని యితరులకు సలహా నీయుదును. ఇంతియ కాక మీరీ దారిని పోవలదనియు నిరోధింతును. కావున నా ఆరోగ్యదిగ్దర్శనమును జూచి దాని ప్రకారము ప్రయోగము లొనరించి చూచు స్త్రీపురుషులకు ఈ విషయము చెప్పఁగోరుచున్నాను. ఎటుఁ జూచినను పాలను విడనాడుట మేలని తోఁచినచో, లేక అనుభవము కల వైద్యుఁడు పాలను త్రావవలదని చెప్పినచో, అపుడుపాలను విడనాడవలయుఁగాని నాపుస్తకమునుబట్టి యేసజ్జనుఁడేని పాలను విడనాడరాదు. ఎవని జఠరాగ్ని మందగించెనో, ఎవఁడు దీర్ఘవ్యాధిచే మంచ మెక్కెనో, అట్టివానికి పాలకంటె తేలికగా జీర్ణమగునదియు, పాలకంటె పుష్టి చేయునదియు నగు నింకొక పదార్థము లేదని హిందూదేశములో నా కనుభవము.

ఈపుస్తకమునందు పాలను గుఱించి వ్రాసిన విషయము ఆరూఢము కాదని పాఠకులకడ నావినతి.

ఈప్రకరణము చదువు వైద్యులు గాని, డాక్టరులు గాని, హకీములు గాని, మఱియు అనుభవముగల యేసజ్జనులేని పాలవంటి పోషకమును, పాచకమును అగు వనస్పతిని—అధ్యయనబలమునఁగాక అనుభవబలమున—ఎఱిఁగియున్నచో తెలిపి నా కుపకారము చేయఁగోరుచున్నాను.

౮

బలముతో లడాయి

ఇఁక ఆసియా అఫీసరులయొక్క దృష్టిఁ బఱపుదము. వీరి పెద్ద తాణా జోహాన్సుబర్గులో. ఈ తాణాలో హిందూస్థాను వారికిఁ గాని, చీనా వారికిఁ గాని, మఱి యితరులకుఁ గాని రక్షణము లేదు సరికదా, భక్షణమే. 'వచ్చుట కధికారము గలవారిని రా నిచ్చుట లేదు, మఱి అధికారము లేనివారికడ నూఱు పౌనులుఁ పుచ్చు కొని రానిచ్చుచున్నారు; దీనికి ప్రతికారము మీరు చేయనిచో మఱి యెవరు చేయుదురు?' అని నాకడ ప్రతిదినమును ఫిర్యాదు. నా మనస్సుకూడ లోపల నటులే చెప్పుచున్నది. ఈకష్టము తొలఁగింప నిచో నేను ట్రాన్సువాలునం దున్న ఫల మేమి?

దీనికి సాక్ష్యము సమకూర్పఁ దలపెట్టితిని. తగినంత సాక్ష్యము సమకూర్చినపిదప పోలీసు కమీషనరు కడ కరిగితిని. అతనియందు దయయు, న్యాయమును గలవని నాకుఁ దోఁచెను. నామాట లొక్క పెట్టున ఉఫ్ఫని ఎగరఁగొట్టుటకు బదు లతఁడు మనస్సునకు పట్టించు కొని వినెను. మఱియు సాక్ష్యము నంతయుఁ దనకుఁ జూపు మనెను. సాక్షులను స్వయము పరీక్షించెను. నామాటపయి నమ్మకము కలిగెను. 'దక్షిణ-ఆఫ్రికాలో తెల్లజూరరులు తెల్ల అపరాధులను దండించుట దుష్కర'మని నే ననుకొనినటులే అతఁడును అనుకొనెను. పిదప నతఁ డిటు లనెను——'అయినను మనము ప్రయత్నము చేసి చూతము. జూరరు లపరాధులను విడిచిపెట్టింతురేమో యనుభయమున మన పనిని మనము మానరాదు. వీరిని తప్పక అరెస్టు చేయింతును. నేను నా శక్తికొలఁది పనిచేయుదు నని నమ్ముఁడు.'

నేను నమ్మనే నమ్మితిని. పలువురు ఆఫీసరులపై నా కనుమానము కలదు; కాని వారి అందఱియెడల నాకడ ప్రబలమగు ప్రమాణము లేదు. ఇరువురియెడల మాత్రము నా కావంతయు సందియము లేదు. కావున వా రిరువురికిని వారంటులు జారీ ఆయెను.

నా చేఁతలకు రహస్య మనునది లేదు. నేను ప్రతిదినమును పోలీసుకమిషనరుకడ కరుగుచుంటినని పలువు రెఱుఁగుదురు. ఈ యాఫీసరులకడ పలుఱకాల వేగులవా రున్నారు. వారు నా ఆఫీసుకడకు రాకపోకలు చేయుచు నా అనుపానులను వారి కెఱిఁగించుచుండిరి. ఆ యాఫీసరులగుఱించి యొకటి చెప్పవలయును. భయముచేత తగినంతమంది వేగులు వారికి దొరకలేదు. భారతీయులును, చీనా వారును నాకు సాయపడనిచో ఆ యాఫీసరులను పట్టించుట దుస్తర మయ్యెడిది.

వీరిలో నొకఁడు పాఱిపోయెను. పోలీసుకమిషనరు వారంటు పంపి, పట్టించి తెప్పించెను. విచారణ జరిగెను. సాక్షులు సంపూర్ణముగా విచారింపఁబడిరి. వీరిలో నొకరి సంగతి జ్యూరీకి ఎఱుకయగుటకుఁగూడ ప్రమాణ ముండెను. అయినను వీ రిరువురును విడుదల చేయఁబడిరి.

నేను మిగుల నిరాశుఁడ నయితిని. కమిషనరుగూడ మిగుల వెత చెందెను. వకీలుపనిపై నాకు రోఁత పుట్టెను. నేరములు కప్పిపెట్టుటలో బుద్ధి ఉపయోగపడె నని బుద్ధిపైఁగూడ రోఁత వొడమెను.

వీ రిటులు విడుదల పొందినను సర్కారువారు వీరిని ఉద్యోగమునుండి తొలఁగించి తమస్థానమున ఉండనీయకపోవుటచే వీరి యపరాధము తేటతెల్లమే ఆయెను. వీ రిరువురును తమపదవిని బాపుకొనినపిదప ఈ ఠాణాలో కళంకము కొంచెము తగ్గెను. భారతీయులకు కొంచెము ధైర్యము కలిగెను.

దీన నా ప్రతిష్ఠ. హెచ్చెను. నా వకాలతుగూడ హెచ్చెను. లోకులు వెచ్చించు ధనము అంతయుఁ గాకపోయినను, కొంతవట్టు తగ్గెను. లంచగొండు లింకను చేతులు కొట్టుచునే యుండిరి గాని ఆ పనితో యోగ్యులకు తమ యోగ్యతను కాపాడుకొన కా లానిన దని చెప్పనగును.

ఈ యాఫీసరు లఘములు; అయినను వారియెడల నా కిసుమంతయు దుర్భావము లేదు. ఇదియు వా రెఱుఁగుదురు. వారు చిక్కులో నుండఁగా సాయము చేయవలసిన అక్కఱ కలిగెను; చేసితిని. నే నెదిరింపనిచో జొహాన్సుబర్గు మునిసిపాలిటీలో వీరికి ఉద్యోగము దొరకదు. వారి మిత్రుఁ డీ విషయమును నాతోఁ జెప్పెను. నేను వారికి ఉద్యోగ మిప్పింప పాటుపడితిని. వారి కది దొరకెను.

దీనివలన నన్నెఱిఁగిన తెల్లవారు నాయెడల నిశ్శంకముగా ప్రవర్తింపఁగలిగిరి. మఱియు ఈ డిపార్టుమెంటువారితో నేను పలుమాఱులు తలపట్టుకొన్నను, ఎంత గట్టిగా మాటాడినను, వారు నాకు నెయ్యమును, తియ్యమును చూపుచునే యుండిరి. ఇట్టి ప్రవర్తనము నా స్వభావములోఁ గలదని నాఁటికి నే నెఱుఁగను. ఇట్టి ప్రవర్తనము సత్యాగ్రహమునకు కూఁకటివే రనియు, అహింసలో నొక అంగమనియు పిదప తెలిసికొంటిని.

మనుజుఁడు వేఱు, వాని పని వేఱు. మంచిపనియెడ ఆదరము, చెడుపనియెడ తిరస్కారమును కలిగి తీరును. మంచి పని చేసినను, చెడు పని చేసినను, మనుజునియెడల ఆదరము గాని, దయ గాని చూపవలయును. ఈమాట తెలిసికొనుట సులువు. కాని ఆచరించుట మాత్రము బలువు. ఈ జగత్తునం దింత ద్వేషము ప్రబలుట కిదియ కారణము.

సత్యమును శోధింప అహింసయే మూలము. అహింస యెంతవట్టు హస్తగతము కాదో సత్యముకూడ నంతవట్టు హస్తగతము కాదని ప్రతిక్షణమును నా కనుభవ మగుచున్నది. ఒకపనిని, ఒక ప్రణాళికను విరోధింపఁదగును కాని ఆ పనిని, ఆ ప్రణాళికను నడుపువానితో విరోధము పెట్టుకొనుట యనఁగా తనతో తాను విరోధము పెట్టుకొనుటయే. ఏలయనఁగా—మన మందఱమును ఒక కుంచెచేతనే చేయఁబడితిమి. మన మందఱమును ఒక బ్రహ్మపుత్రులమే. మనుజునిలో అనంతములగు శక్తులున్నవి; కావున మనము మనుజు ననాదరించుచోఁ గాని, తిరస్కరించుచోఁ గాని వాని శక్తులను, గుణములను తిరస్కరించినటు లగును. మఱియు ఇటు లొనరించుట మనుజునకును, ప్రకారాంతరముగా సమస్తజగత్తునకును హాని కలిగించిన దగును.

౧౦

పుణ్యస్మరణము, ప్రాయశ్చిత్తము

నా జీవితమున పలుమతములవారితో, పలుజాతులవారితో పరిచయ మొదవఁజేయుఁగల సంఘటనము లనేకములు జరుగుచు వచ్చెను. ఇట్టి యనుభవము లన్నింటిచే నాకు ఇంటికిని బయటికిని, దేశమునకును పరదేశమునకును, హిందువునకును ముసలమానునకును, కిరస్తానికిని పారసీకునకును యూదునకును భేదబుద్ధి యెన్నఁడును కలుగలేదు. నాహృదయ మిట్టి భేదము నెఱుఁగఁజాలదనియే చెప్పఁగలను. ఇయ్యది నా కొక గుణ మని యనుకొనను. ఏలన, అహింస, బ్రహ్మచర్యము, అపరిగ్రహము లోనగు యమములను, నియమములను అలవాటులోఁ బెట్టుకొంటిని. నేఁటికిని వానియెడ నాప్రయత్నము కలదు. కాని ఆరీతిగా అభేదబుద్ధిని పెంపొందించుకొనుటకు నేను ప్రయత్నముచేసిన గుఱుతు లేదు.

డరబనులో నేను వకాలతు చేయుచుండఁగా నా గుమాస్తాలును నాయింటనే నివసించెడివారు. వారిలో హిందువులును, కిరస్తానులును గలరు. దేశమునుబట్టి చెప్పవలసివచ్చుచో గుజ్జరులును* చెన్నపురివారును అని చెప్పవలసివచ్చును. నే నెన్నఁడును వీరిని వేఱుగాఁ జూచిన యెఱుక లేదు. నాయాదరమునకు నాభార్య యెన్నఁడేని అడ్డువచ్చుచో నే నామెను ముదలకించుచుండెడు వాఁడను. నాగుమాస్తాలలో నొకఁడు క్రైస్తవుఁడు. ఇతని తలిదండ్రులు పంచములు. మా యిల్లు తెల్లవారి యిళ్లపద్ధతిని కట్టఁబడినది. ఈ కారణమున గదులలో తూములు లేవు——ఉండవలయుననియు

---

* గుజరాతువారు. ఇది ఘూర్జరశబ్దభవము. అను.

ననియు నాయుద్దేశము కాదు—ఇది నా మతము. దీనివలన గదులలో తూము లుండవలయు తావుల మూత్రమునకు వేఱుగా కుండలు ఉండెడివి. వీనిని బాగుచేయు పని మా ఆలుమగల యిరువురిదే కాని నౌకరు లది కాదు. ఇంటివారితో పాటయిపోయిన సమాస్తాలు మాత్రము తమంతట దామే శుద్ధిచేసికొనుచుండిరి. కాని యీ క్రైస్తవుఁడు సరి క్రొత్త. ఇతని కుండను మేమే ఎత్తి బాగుపఱపవలయును. కస్తూరి బాయి కుండలనెత్తి బాగుచేసెడిదే కాని ఈ సోదరుని భాండ మెత్తుట ఆమె కసహ్యమనిపించెను. దానితో మాయిరువురకును చెడెను. నేను ఎత్తివేయుటయు ఆమెకు మంచి దనిపింపలేదు. మఱియు తా నెత్తుట కును కష్ట మనిపించెను. అయినను, కన్నులనుండి ముత్తెముల బిందువులురాల ఒకచేత కుండనెత్తికొని కెంపుచూపుతో ముదలకించుచు మెట్లుదిగు కస్తూరిబాయి నేఁటికిని నాకనుల గ్రేలును.

నే నెంత ప్రేముడి గలవాఁడనో అంత ఘాతకుఁడ నగు పతిని. నే నామెకు శిక్షకుఁడ నని నాయూహ. కావున గ్రుడ్డి ప్రేమకు వశుఁడనై ఆమె నిటులు రాచి అంపమునఁ బెట్టుచుంటిని.

ఈ కారణమున ఆమెయే ఆకుండను దీసికొని వెళ్ళినను నాకు తుష్టి కలుగలేదు. నగుమోముతో దానిని దీసికొని పోవలయు నని నా కోరిక. దీనిగుఱించి నే నామెపైకి ఉఱుకులు పరుగులెత్తితిని. తుదకు త్తేజితుఁడనై 'ఇదిగో, ఈ యల్లరి నాయింట సాగదు' అని అంటిని.

ఈ మాట బాణమువలె నాటెను.

'మీయిల్లు మీరే యుంచుకొనుఁడు; ఇదె నే నేఁగితిని' అని యామె గట్టిగా వచెను.

౧౦ పుణ్యస్మరణము, ప్రాయశ్చిత్తము

నే నపు డీశ్వరుని మఱచితిని. నాయెదలో దయ యనునది ఎండిపోయెను. నే నామెచేయి పట్టుకొంటిని. మెట్ల కెదురుగనే ద్వారము కలదు. దీనయు, నబలయు నగు నామె చేయి పట్టుకొని ద్వారమువఱకు ఈడ్చుకొని పోయితిని. తలుపు సగము తెఱచితిని.

కన్నులనుండి గంగాయమునలను ప్రవహింపఁ జేయుచు కస్తూరిబాయి యిటు లనెను:

'మీకు సిగ్గు లేకపోవుఁగాక! నాకుఁ గలదు. కొంచెము సిగ్గు తెచ్చికొనుఁడు! నన్ను బయటికిఁ ద్రోయుచో నే నెక్కడికిఁ బోవుదును! పుట్టింటికిఁ బోద మన్న నా తలిదండ్రు లిచట లేరుగదా! మాది ఓర్పు గల స్త్రీజాతి. కావున మా రభస సైరింపనే వలయు. ఇఁక నైనను కొంచెము సిగ్గుగొని తలుపు మూయుఁడు! ఎవరేని మనల నిరువురిని జూచినచో నవ్వుకొని పోదురు!'

నేను మొగ మింత చేసికొంటిని గాని లోలోన సిగ్గిలితిని. తలుపు మూసివేసితిని. నన్ను నా భార్య విడువఁజాలనిచో నేను మాత్ర మామెను విడువఁగలనా? ఈరీతిగా మాలో మా కెన్నియో కయ్యములు వచ్చెను; కాని అన్నియు తుదకు మంగళముగనే పరిణమించెను. పత్నియే అద్భుతమగు తన యోర్పు బలమున ఎల్లప్పుడును విజయ మందెను.

నే నిపుడు తటస్థుఁడనై ఆ విషయములఁ జెప్పగలను; ఏలన ఆఘటన లన్నియు నా పూర్వయుగమునకు సంబంధించినవి. నేఁడు నే నామోహాంధుఁడ నగు భర్తను గాను; ఆమెకు శిక్షకుఁడను గాను; ఇచ్చ వచ్చుచో కస్తూరిబాయి న న్నిపుడు దండింపవచ్చును. మేము ఒండొండ భుక్తభోగులమగు మిత్రులము. మే మొండొండ నిర్లేపముగానుండి జీవితము గడపుచున్నాము. కస్తూరిబాయి నా జబ్బులలో ప్రతిఫల మపేక్షింపక సేవ చేయున దాయెను.

౧౮౯౮లో ఇది జరిగెను. అప్పుడు బ్రహ్మచర్యపాలన మననించుకయు తెలియదు. పత్ని కేవలము సహధర్మిణి యనియు, సుఖదుఃఖసఖి యనియు నాటికి నే నెఱుఁగను. పత్ని యన భోగభాజన మనియు, మగని యాజ్ఞలను తలఁ దాల్చుటకే పుట్టిన దనియు నాటి నా తలఁపు.

కాని ౧౯౦౦ నాటికి నా తలఁపులలో గంభీరమగు పరివర్తనము కలిగెను. ౧౯౦౬ నాటికి వాని పరిణామము పూర్ణమాయెను. కాని వానిమాటయుందు నేను నిర్వికారుఁడ నయిన కొలఁదియు నా సంసారము శాంతమును, నిర్మలమును, సుఖయుతమును అగుచు వచ్చెను. నేటికిని అగుచుండె నని చెప్పనొప్పను.

ఈ పుణ్యస్మరణమువలన మేము ఆదర్శదంపతుల మనిగాని, లేక నా ధర్మపత్నియందు ఎట్టి దోసఁగును లేదని గాని, లేక మా యాదర్శము ఒకటియే యని గాని ఎవరును అనుకొనకుఁడు! కస్తూరిబాయికి వేఱుగా ఆదర్శము కలదా యనఁచో, లేదు; పాప మా యిల్లా లేమియు నెఱుఁగదు. నా యాచరణములలో చాలవట్టు ఆమెకు ఇంపుగావు. మే మెన్నఁడు నొండొండ వానిని గుఱించి చర్చింపము. చర్చించినను సారము కానిపింపదు. తటిలో తల్లిదండ్రులుగాని, నేనుగాని ఆమెను చదివింపలేదు. కాని హిందూస్త్రీలందఱిలో కొలఁదిగనో గొప్పగనో యుండు నొక మహాగుణ మీయామె యందు అతిమాత్రముగా నున్నది. తలఁచియో తలఁపకయో, ఎఱిఁగియో యెఱుఁగకయో నాపాదముల ననుసరించుటలో తన జీవితము సార్థకమని యామె నమ్మిక. మరియు జీవితమును నిర్మలముగాఁ జేసికొనఁబూను నా పూనికల కామె యెన్నఁడును అడ్డు రాలేదు. మా యిరువురి బుద్ధిశక్తులలో భేద మున్నను పయి కారణము వలన మాజీవనము సంతుష్టమనియు, సుఖవంత మయిన దనియు, ఊర్ధ్వగామి యనియు నా యుద్దేశము.

౧౧

ఆంగ్లేయులతో గాఢపరిచితి

సత్యశోధనమును సూచించిన యీ కథ యేరీతిని వ్రాయఁబడు చున్నదో పాఠకులకు ఈ ప్రకరణముకడఁ జెప్పఁదగియున్నది. దీని నారంభించినపుడు 'ఈపద్ధతిని వ్రాయుదును' అని యొక పద్ధతిని నిరూపించుకొనలేదు. పుస్తకములుగాని, డయరీలుగాని, వేఱు కాగితములుగాని ఉంచుకొని వానినిజూచి వీనిని వ్రాయుటలేదు. వ్రాయఁ గూర్చున్ననాఁడు నాయంతరాత్మ నన్నెట్లు ప్రేరేపించినరీతి వ్రాయుచు వచ్చుచుంటిని. నాలోపల జరుగుచున్న క్రియాకలాపమంతయు నా యంతరాత్మచే ప్రేరితమని నిశ్చయముగా నొక్కువఁ జాలను. కొలఁదివనిగాని, గొప్పవనిగాని చెప్పఁదగినవియు, ఏఁటేఁట నా చేయునవియు నగు కార్యములను పరిశీలించినచో నవి నాయంతరాత్మను ప్రేరించుటచే జరిగినవే యని చెప్పినచో అనుచితమనుకొనను.

నే నంతరాత్మ నెఱుఁగను లేదు, చూడను లేదు. భగవానునిపై ప్రపంచకమునకు అంతకునుగల నమ్మకము నాయది యని యను కొందును. ఆ నమ్మిక ఏరీతి నయినను ఆఁపరానిది. కావున దానిని నేను వట్టి నమ్మిక యనుకొనను; మఱి అనుభవ మనుకొందును. దీనిని అనుభవమని రూపించుట ఒకరీతిగా సత్యమును దండించుటయే. కాక దీని శుద్ధస్వరూపమును దెలుపఁగల శబ్దము నాకడ లేదన్నచో ఇంచుమించు ఉచితతర మని అనుకొందును. అదృష్టమగు నీ యంతరాత్మకు వశవర్తినై ఈ కథను వ్రాయుచున్నానని నా నమ్మకము.

వెనుకటి ప్రకరణము వ్రాయ మొదలిడి ‘ఆంగ్లేయులతో పరిచితి’ అని శీర్షిక మొదలు వేసితిని. ఇటులు వ్రాయుచుండఁగా ఆ విషయమును వ్రాయుముందు ‘పుణ్యస్మరణము’ను గుఱించి వ్రాయుట ఆవశ్యకమని గ్రహించితిని. అపుడు ‘పుణ్యస్మరణము’ అను ప్రకరణమును వ్రాసితిని. పిదప ముందటి శీర్షికను దీనికి మార్చితిని.

ఈ ప్రకరణము మొదలిడఁగానే మరల నొక ధర్మసంకట మెదురాయె. ఆంగ్లేయుల పరిచితిని వ్రాయునపుడు వేనిని వేనిని వ్రాయను? వేనిని వేనిని వదలను? అనునది దొడ్డ సందియము. వ్రాయవలసినదానిని విడుచుచో సత్యమును కప్పిపుత్తునేమో యని యనుమానము. ఇంతియ కాక ఈ కథ వ్రాయుటయు ఆవశ్యకము కాదనియు అనవచ్చును. ఇట్టి దశలో ఆవశ్యకము లేవో అనావశ్యకము లేవో యేఱిచూచుట కడుఁ గఠినము.

ఆత్మకథలు సంపూర్ణముగా ఇతిహాసములు కావనియు, మరియు వీనిని వ్రాయునపుడు చాలఁ జిక్కులు కలుగుననియు ఎపుడో చదివియుంటినిగాని దాని యర్థ మిపుడు చక్కగా బోధపడెను. సత్యశోధనములకు సంబంధించిన నా యీ యాత్మకథయందు నాకు గుఱుతున్న దంతయు ఎక్కించుట లేదని నాకుఁ దెలియును. సత్యమును తెలుపవలయునెడ ఎన్నిమాటలు వ్రాయవలయునో, మఱి యే మాటలు వ్రాయఁదగదో యెవరు చెప్పఁగలరు? నా ఒకతరపున మాత్రమే గల సాక్ష్యమునకు న్యాయమందిరమున ఎంతకిమ్మతు ఉండఁగలదు? తీరికగలవాఁ డెవఁడేని వెనుక వ్రాసిన ప్రకరణములలో క్రాసు పరీక్ష చేయఁదొడఁగినచో వీని కింకను మెఱుఁగు రావచ్చును. లేక మఱొక వ్యాఖ్యాత ఖండనదృష్టితో దీనినంతయు ఛిన్నభిన్న మొనరించి పొరపాటులను చూపి ఉప్పొంగవచ్చును.

౧౧ ఆంగ్లేయులతో గాఢపరిచితి

ఇవన్నియు నాలోచించి చూడఁగా ఈ గ్రంథము నిఁక కట్టి పెట్టినచో బాగుండదా? యని అనిపించుచున్నది. కాని 'పూనిన పనిని తప్పని తోఁచినదాఁక విడనాడరాదు' అను న్యాయము నాధారముగాఁ జేసికొని నాఅంతరాత్మ 'వలదు' అని చెప్పువఱకు వ్రాసి కొనుచుఁబోవ నిశ్చయించితిని.

వ్యాఖ్యాతల మెప్పునకు నేను దీని వ్రాయుటలేదు. సత్యశోధనలలో వ్రాయుటయు నొకశోధన యని వ్రాయుచున్నాను. ఇంతియ కాక నాతోడివారలకు దీనివలన కొంత యూఱట కలుగఁగల దనియు నొక యుద్దేశము. దీని యారంభము వారి సంతోషము కొఱకే. ఆనందస్వామియు, జయరామదాసును నన్ను వెంటాడనిచో నిది యారంభింపఁబడునది కాదేమో! ఈ కారణమున దీనిని వ్రాయుటలో నేదేని దోసఁ గున్నచో వారును ఈ దోసఁగులో భాగస్వాములు.

ఇఁక ప్రకృత మనుసరింతము. హిందూస్తానీ గుమాస్తాలును, తదితరులును మాయింటిలో ఇంటివారితోపాటయిపోయి యున్నటులే ఇంగ్లీషువారును ఉండిపోఁ దొడఁగిరి. నాకడ నున్నవారిలో కొందఱ కిది యిష్టము కాదు. అయినను నేను వారిని పట్టుపట్టి ఉంచుకొంటిని. అందఱ యెడలను ఇట్టి పట్టు పట్టుట తెలివిగల పని యని తలఁపను. ఈ బాంధవ్యముచే కొందఱవలన చిక్కులు కలిగెను. ఈ యెడ నాకు పశ్చాత్తాపము లేదు. చిక్కులు కలుగుచున్నను, చిక్కులు కలుగుచున్నటులు తెలియుచున్నను, ఇతరమిత్రులకు అసౌకర్యము సంభవించుచున్నను, ఈ కష్టములు సైరింపఁబడుచునే యుండెను. నా మతమును నేను మార్చుకొనలేదు, మరియు నా మిత్రులు ఉదారతతో సైరించిరి. ఈ నా క్రొత్తచుట్టఱికములు నా మిత్రులకు కష్ట మనిపించినపుడు నేను వారిని మందలింప మానలేదు

ఏలయన, ఆస్తికులు తమలో నున్న ఈశ్వరుని అంశములో పలను జూడఁ గోరుదురు. అట్లు లయటఁజేసి అందఱియెడలను లోపము లేకుండ సంచరింపఁగల శక్తిని సంపాదించుకొనవలయును. అట్టిశక్తి సంపాదింప నుపాయ మే మన్నచో అప్రయత్నముగా అట్టి యవకాశము లొదవినపుడు వానిని దూరగింపక క్రొత్తక్రొత్త చుట్టరికములలో పడి రాగద్వేషములు లేకుండఁ జూచుకొనుటయే.

ఈ కారణమున బోయరుయుద్ధము ఆరంభమయిన తఱి నా యిల్లంతయు కిటకిట లాడుచున్నను ఇరువు రాంగ్లేయులకు తా వొసఁగితిని. వారిరువురును దివ్యజ్ఞానసమాజమువారు. వారిలో నొక్కరైన కిచనుగారినిగూర్చి ముం దెఱుఁగఁ గలరు. ఈమిత్రుల సహవాసమున నాభార్యను ఏడిపింపవలసివచ్చెను. నావలన ఆమె పలుమాఱులు దుఃఖింపవలసివచ్చెను. అడ్డమూఁకలు లేక తెరచాటు లేక తెల్లవారు మాలో కూడిమాడి యుండుట కిదియే తొలిసారి. నే నింగ్లాండునందు తెల్లవారియిండ్ల నివసించితిని. నేను వారి యాచార ప్రచారములు నేర్చితిని. అయినను పూఁటకూళ్లయింట నున్నట్టులే అచట నుంటిని. కాని యిపుడు మా యి ల్లట్టిది కాదు. నామిత్రులు నాకుటుంబములో నొకరు. వారును భారతీయాచారములు తెలిసికొనిరి. పోలికకు మాయిల్లు తెల్లవారి యిల్లేకాని లోపల ఆచార వ్యవహారము లన్నియు భారతీయులకు సంబంధించినవియే. వారి నుంచుకొనుటవలన మేము చాల ఇబ్బందుల కిగ పైతిమని నుడుపుతు. కాని ఆ సజ్జను లిరువురును తమ యింట నున్నట్టులే యుండి రని చెప్పనగును. ఈ మాపరిచయములు డరబనులో కన్న జోహాన్సుబర్గులో ఎక్కువాయెను.

౧౨

ఆంగ్లేయులతో పరిచితి

జోహాన్సుబర్గులో ఒకతూరి నాకడ నలుగురు హిందూస్తానీ గుమాస్తాలు ఉండిరి. వీరు నాకు గుమాస్తాలో, కుమారులో చెప్పుట కష్టము. ఈ నలువురితో నాపని తెమలదు. టైపింగు లేక పనికాదు. మాలో నాకే టైపింగు కొలఁదిగా తెలియును. నేను వారిలో నిరువురికి టైపింగు నేర్పితిని; కాని వారి కింగ్లీషులో శక్తి కొలఁదియగుటచే వారి టైపింగు ఎన్నఁటికిని శుద్ధము కాలేదు. కావున వీరిలో నొకనిని లెక్కలపనిలో పెట్టఁదలఁచితిని. నాకిష్టుఁడైనవాని నొకని నేటాలునుండి పిలిపించుకొన వీలు లేదు; ఏలన సెలవు చీటి లేక భారతీయుఁ డెవఁడును అటనుండి రా వీలులేదు. మరియు నేను నాపనికిగాను ఆఫీసరులను కృపాభిక్ష అడుగుటకు సంసిద్ధుఁడనయి యుండలేదు.

ఈ స్థితిలో నా కేమియు పాలుపోలేదు. ఎంత పని చేయుచున్నను ఇటు వకాలతు, అటు సార్వజనికకార్యములు; ఈ రెంటి బరువు తఱుగునటులు తోఁపలేదు.

ఆఁడుది యగుఁగాక, మగవాఁ డగుఁగాక తెల్లగుమాస్తా కుదురుచో నాపని జరుగును. కాని నల్లవానికడ తెల్లవాఁడు నౌకరి చేయునా అని భయము కలిగెను. అయినను ప్రయత్నము చేయఁదలఁచితిని. టైప్‌రైటింగు ఏజెంటుతో నాకు పరిచయము కలదు. నే నతనిని కలిసికొని 'టైపు చేయఁగల తెల్లవాఁడుగాని, తెల్లదిగాని నల్లవానికడ పనిచేయుటకు ఆతంకము లేనిచో అట్టివానినిఁగాని, అట్టి యామెనుగాని కుదిర్చిపెట్టు'మని అడిగితిని. దక్షిణ-ఆఫ్రికాలో

షార్టు-హాండుకాని, టైపుకాని చేయఁగలవారిలో. పలువురు ఆఁడువారిలోనే దొరకుదురు. 'అట్టి యామెను మీకు కుదిర్చి పెట్టుదు'నని ఆ యేజెంటనెను. మిస్ డిక్ అను కన్య యొకతె అతని చేఁజిక్కెను. ఆమెది స్కాట్లాండు. తెల్లవాఁడయిన సరియు, నల్లవాఁడయిన సరియ, ప్రామాణికుఁ డగుచో నతనికడఁ బనిచేయుట కామె కేయాపత్తియు లేదు. పనిలోఁ బ్రవేశించుట కామెకు తొందరగాఁగూడ నుండెను. ఆ యేజెంటామెను నాకడ కనిచెను. ఆమెను చూడఁగనే నాకు తృప్తి ఆయెను.

'మీకు నల్లవానికడ పనిచేయుట కాపత్తి యేమియు లేదా?' అని నే నడిగితిని.

'ఇనుమంతయు లేదు' అని యామె దృఢముగా ననెను.

'జీత మెంత కావలెను?'

'పదియేడునర పౌనులు కావలె ననినచో అది మీ కెక్కువ అని అనిపింపదు కదా?'

'నా కోరిన పనిని నెఱవేర్చుచో ఈ జీత మించుకేని ఎక్కు డనిపింపదు. సరియ, పనిలో నెపుడు చేరుదురు?'

'వలయుచో నిపుడే చేరుదును.'

నే నీమెను బడసి చాలఁ బ్రసన్నుఁడ నయితిని. మరియు అపుడే ఎదురుగా కూరుచుండఁబెట్టుకొని ఉత్తరములు వ్రాయింపఁ దొడఁగితిని.

ఈమె కేవలము నాగుమాస్తా కాదు. నాకూఁతురో, సోదరియో అనిపించుకొనెను. ఈమెపనిలో నెచటను వేలుపెట్టి చూపరాదు. ఒకతూరి యీామె చేతిమీఁదుగా వేలకొలఁది పౌనులు ఇచ్చుటయు,

పుచ్చుకొనుటయు జరిగెను. దాని లెక్కడొక్కలామెయే చూచుచుండెను. ఆమె నా సంపూర్ణవిశ్వాసమును సంపాదించుకొనెను. అది యటులుండె. ఆమెకు నేనుగూడ తన పరమరహస్యములను ఎఱిఁగింపఁగలిగినంత విశ్వాసపాత్రుఁడ నయితి ననునది నాకొక గొప్పమాట. ఆమె తన జీవనసఖుని వరించుటలో నా సాయము కోరెను. కన్యాదానము చేయు సౌభాగ్యముగూడ నాకుఁ దక్కెను. మిస్ డిక్ మిసెస్ మేక్‌డోనల్డు అయినపిదప నన్నొడఁబాయవలసి వచ్చెను. అయినను వివాహానంతరమునఁగూడ అక్కఱ కలిగినపుడు నాకు సాయపడుచుండెడిది.

పిదప ఆఫీసులో ఎల్లప్పుడు పనిచేయుటకు ఒక షార్టుహాండ్ రైటరు కావలసివచ్చెను. అందులకును ఒకతె కుదిరెను. ఆమె పేరు మిస్ శ్లెశిణ్. మి. కేలన్ బెక్ ఈమెను నాకడ కనిపెట్టెను. మి. కేలన్ బెక్ సంగతి ముందు రాఁగలదు. ఆమె అపుడు ట్రాన్సువాలులోని ఒక హైస్కూలులో ఆచార్యగా నుండెను. నాకడకు వచ్చినపు డామెకు సుమారు పదియే డేం డ్లుండును. ఆమె కడ కొన్ని విచిత్రచర్య లుండెడివి. మొదట మొదట నేనును, మి. కేలన్‌బెకును వానిని సైరింప లేకుంటిమి. ఆమె ఉద్యోగము చేయ రాలేదు. అనుభవము సంపాదింపవచ్చెను. ఆమె రంగు తెగు లను మాటయే యెఱుఁగదు. ఆమె కే విషయమున నయినను శ్రద్ధ లేదు. ఆమె యెవరినేని అవమానించుటలోఁగూడ వెనుదీయదు. తన మనసులో అనుకొనినంతయు పైకి చెప్పుటలో ఆమె కించుకయు సందియము లేదు. ఆమె ఇట్టి స్వభావము కలదగుటచే నాకు తఱుచు చిక్కులు కలుగుచువచ్చెను. కాని ఈమెహృదయము శుద్ధము. కావున ఈ చిక్కులును విడిపోవుచుండెడివి. నాకంటె ఆమెకు

ఆంగ్లభాషాజ్ఞానము హెచ్చు; మరియు నామెయెడ నాకు నమ్మకము హెచ్చె. ఈ కారణములచే ఆమె టైపు చేసిన పత్రము లన్నింటి పయిని చూడకయే చేవ్రాలు చేయుచుండువాఁడను.

ఆమెత్యాగమునకు పారము లేదు. చాలఁ గాల మామె నా కడ నెల కాఱు పౌనులే పుచ్చుకొనెను. తుదకు పది పౌనులు. ఎక్కువ తీసికొను మని నే ననఁగా 'నేను మీకడ జీతము తీసికొనుటకు రాలేదు. నాకు మీకడ పనిచేయుట మంచి దని వచ్చితిని. నాకు మీ యాదర్శములు ప్రియమయినవి. దీనఁజేసి నేను మీకడ నుంటిని' అని యామె ముదలకించెను.

ఒకసారి అక్కఱ కలిగి ఆమె నాకడ నలుబది పౌనులు పుచ్చుకొనెను; అదియు అప్పుగా. నిరుడు ఋణవిముక్తి చేసికొనెను.

ఆమెకు త్యాగ మెంతయో ధైర్యమంత. సౌభాగ్యవశమున నాకు పరిచయముగల స్త్రీలలో స్ఫటికమువలె పవిత్రయు, ధైర్యమున క్షత్రియునిగూడ సిగ్గిలఁజేయఁగలదియు నగు నీ బాలికవంటి యామెను మఱొకతెను జూడను. ఇపు డామె ప్రౌఢకుమారి. ఇప్పటి యామె మనస్స్థితిని నే నెఱుఁగఁ గాని యెపుడేని ఈ బాలిక గుఱుతు వచ్చుచో నది యొక పుణ్యస్మృతి యని అనుకొందు నను. నీ విషయము చెప్పనిచో సత్యద్రోహి నగుదును.

ఆమెకు పనుల పట్టున రేయింబవళ్లు లేవు. నడిరేయి నేపని మీఁదనేని ఒంటరిగాఁ బోవుతఱి వెంట తోడుగొని పొమ్మంటి నేని ఆమె కను లెఱ్ఱజేసెడిది. గడ్డములు మీసములు వచ్చిన పలువురు హిందూస్తానీయు లామె నాదరదృష్టితోఁ జూచుచుండిరి. మరియు ఆమెమాట మన్నించుచుండిరి. మేము మందఱమును చెఱసాలలో నున్న పుడు ధైర్యముగలవా రెవరును బయట లేనపుడు ఆమె యొక్కతెయే

పోరాటము నంతయు సంబాళించుకొనెను. లక్షలకొలఁదిగా డబ్బు లెక్క యంతయును, ఉత్తరప్రత్యుత్తరవ్యవహారమంతయును, ఇండియన్ ఒపీనియన్ పత్రికావ్యవహారమంతయును ఈమె ఒక్క చేతిమీఁదుగా నడవవలసిన స్థితి వచ్చెను. అయినను ఆమెకు అలపు సొలపు అనుమాట లేదు.

మిస్ శ్లేశినను గురించి వ్రాయుటలో నాకు అలఁగు టనుమాట లేదు. ఇఁక గోకలేగారి ప్రమాణపత్రమును జూపి యీ ప్రకరణమును ముగింతును. నాతో పని చేసినవారి నందఱను గోకలేగా రెఱుఁగుదురు. వారిలో పలువురు ఆయనకు సంతోషపాత్రములు. అప్పుడప్పుడు గోకలేగారు నాకడ పనిచేయువారిని గురించి అభిప్రాయప్రదానము చేయుచుండెడివారు. నాకడ నున్న భారతీయులలోను, ఆంగ్లేయుల లోను మిస్ శ్లేశినకు మొదటి చో టొసఁగిరి. 'ఇంత త్యాగముఁ ఇంత పవిత్రత, ఇంత నిర్భయత, ఇంత కుశలత కడుఁ గొలఁదిమందిలో, గాంచితిని. నాయుద్దేశమున మీసహకారు లందఱిలో మిస్ శ్లేశిన్ చోటు మొట్టమొదట' అని గోకలేగా రనిరి.

౧౩

‘ఇండియన్ ఒపీనియన్’

ఇంకను తెల్లవారిలో మఱికొందఱితోఁ నయిన గాఢపరిచయమును గూర్చి చెప్పవలసియున్నది. కాని రెండు మూఁడు ముఖ్య విషయములను ముందు తెలుపుట ఆవశ్యకము.

ఒక పరిచితి నిచటఁ దెలుపుచున్నాను. ఒక డిక్కుతో నా పని దక్కలేదు. మి. రిచ్చిని గూర్చి వెనుకఁ దెలిపియుంటిని. వారితో నాకు సాక్షాత్తు పరిచయము కలదు. అతఁ డొక వాణిజ్యాలయమునకు సంచాలకుఁడు. ఆ పనిని వదలి నాతోఁ బనిచేయు నాతని రమ్మంటిని. అతఁ డియ్యకొని నా ఆఫీసున పని చేయఁ దొడఁగెను. దీన నాబలువు తగ్గెను.

ఆ రోజులలో శ్రీ మదనజిత్తుగారు ‘ఇండియన్ ఒపీనియన్’ అను పత్రికను ప్రకటింపఁ దలఁచిరి. వారు నా సలహాను, సాయమును వేఁడిరి. ఇంతకు మున్నే వీరు ముద్రాయంత్రమును నడపుచుండిరి. కాన నేనును సమ్మతించితిని. ౧౯౦౪ సంవత్సరమున ‘ఇండియన్ ఒపీనియన్’ జన్మగ్రహణ మొనరించెను. మనసుఖలాలనాజరుగారు ప్రథమమున సంపాదకుఁడు. సత్యమునకు—మూలభారము నాపైఁ బడెను. నాయదృష్టమున, చాలవఱకు నాకు దవ్వుననే యుండి పత్రసంచాలనము నడుచుచుండెను.

మనసుఖలాలనాజరుగారు సంపాదనకార్యము నిర్వహింపఁ జాలినవారు కారు. వారు దేశమున చాల పత్రికలలో వ్రాయుచుండిరి. కాని దక్షిణ-ఆఫ్రికాలోని కఠినవిషయములను నా కప్పగించెడువారు. స్వతంత్రించి వ్రాయు ధైర్యము వారికి చాలదు. నా

వివేచకత్వమునందు వారికి చాల నమ్మకము. కావున ఆవశ్యకములగు విషయములను వ్రాయు బరువును నాపయి నిడుచుండెడివారు.

ఇండియన్ ఒపీనియన్ వారపత్రిక. నేటికిని. తొలుదొలుత గుజరాతీ, హిందీ, అఱవము, ఇంగ్లీషు భాషలలో బయలువెడలుచుండెడిది. అఱవము, హిందీ ఈ రెండును నామమాత్రమున కని నాకుదోచెను. వీనివలన భారతీయులకు ఉపకారము కలుగ దనియు నేనెఱిఁగికొంటిని. ఈ నాలుగు విభాగములను ఉంచుట జూటాగా కానిపించెను. కావున ఆ రెంటిని ముగించి శాంతి నందితిని.

ఈ పత్రిక కొఱకు నేను ధనము గూడ వెచ్చింప వలసి వచ్చునని అనుకొనలేదు. నేను దీనికి ధనము వెచ్చింపనిచో నిఁక నది నడవదని కొలఁదిరోజులలోనే తెలిసిపోయెను. నేను దీనికి సంపాదకుఁడను గాకున్నను దీని వ్రాఁతలకు పూఁటకాపు నేనేయని నల్లవారికిని, తెల్లవారికిని తెలిసిపోయెను. మొదట పత్రికను ప్రచురింపకుండ నుండుటయే లెస్సపని; ప్రచురింప మొదలిడిన తరువాత కొన్నాళ్ళకు మానివేయుచో భారతీయసమాజమునకు సిగ్గుచేటు. మరియు దీన హానియు కలుగఁగల దని చాల భయ మాయెను.

కావున దీనికి వెచ్చింప మొదలిడితిని. తుదకు నాకడ నున్న డబ్బయు వెచ్చింపఁబడెను. నెలనెలకు డెబ్బది యయిదు పౌనులు దీనికిఁగాను వెచ్చించిన సమయమును కలదని గుఱుతు.

కాని ఇంతకాలము దాటినతరువాత ఇపుడు 'ఈపత్రిక భారతీయసమాజమునకు గొప్ప సేవచేసె'నని తలఁచుచున్నాను. దీనివలన సేకరింత మను నూహా కించిత్తును లేదు.

ఇది నాచేతిలో నున్నంతవఱకు దీనిలో ఏ కొంచెము మార్పు కలిగినను అది నా జీవితములోని మార్పునకు సూచకము. నేఁడు

యంగుఇండియా, నవజీవన పత్రికలు నాజీవితాంశములలోని కొన్నింటి కెటులు సారములో అటులే ఇండియన్ ఒపినియన్ కూడ సారమయి యుండెను. నేను ప్రతివారము నాయాత్మను ధారపోసి సత్యాగ్రహమును గుఱించి తెలుపఁ బ్రయత్నము చేసితిని. చెఱలో నున్న రోజులు కాక పదియేండ్లవఱకు, అనఁగా ౧౯౧౪ వఱకు నా వ్రాఁతలేని ఇండియన్ ఒపినియన్ పత్రిక ఒకటియేని లేదు. ఆ పత్రికయందు ఆలోచింపక వ్రాసిన మాట గాని, తూఁకము లేని మాట గాని, వట్టి మెఱమెచ్చుమాటగాని, అత్యుక్తిగాని ఉన్నదని గుఱుతు చాలదు. ఆ పత్రిక నాసంయమమునకు తాలింఖానా. నా యుద్దేశము లెఱుఁగఁగోరు మిత్రులకు సాధనము. విమర్శకుల కిందు హావిన్ను తక్కువగా దొరకఁగలదు. ఇందలి వ్రాఁతలవలన విమర్శకులకు తమతమ కలములమీఁద అంకుశ ముంచుకొనవలసివచ్చెడి దని నే నెఱుఁగుదును. ఆ పత్రిక లేనిచో సత్యాగ్రహసమరము సాగెడిది కాదు. సత్యాగ్రహసంగ్రామముయొక్కయు, దక్షిణ-ఆఫ్రికాలోని భారతీయులయొక్కయు సత్యచరిత్రము నెఱుఁగుటకు పాఠకు లీ పత్రికకొఱకు కనిపట్టుకొని యుండెడివారు.

ఈపత్రికవలన నలుపు తెలుపు మొదలగు రంగులుకల మనుజుల స్వభావము నెఱుఁగఁ జాల వీలయినది. దీనివలన సంపాదకునకును, పాఠకులకును నడుమ స్వచ్ఛమగు సంబంధమును కలుపఁగోరితిని గాన లేకరులు తమతమ లోలోపలి విషయములను నాకడ వెల్లడించుచుండెడివారు. ఈ లేఖలలో వాఁడియయినవియు, కటువులయినవియు, మధురములయినవియు నుండెడివి. వీనిని చదివి, విచారించి, సారము పిండి ప్రత్యుత్తరించుట నా కొక పాఠ మాయెను. దీనివలన వారివారి ప్రసంగములను, ఆలోచనలను చెవులతో వినుచున్నటులు

౧౩ 'ఇండియన్ ఒపీనియన్'

నా కనుభూత మయ్యెడిది. దీనివలన నాకు సంపాదకుని పూచీ తెలిసినది. మఱియు దీనిమూలమున భారతీయులలో నాకు మంచి పలుకుబడి కలుగ మొదలిడెను. దాన జరుగఁబోవు సంగ్రామము సుళకమును, సుశోభితమును, ప్రబలమును ఆయెను.

ఈపత్రికను ప్రారంభించిన మొదటి నెలలోనే సమాచార పత్రికవలన ప్రజాసేవయే కర్తవ్యమని కనుఁగొంటిని. సమాచార పత్రిక ఒక మహాశక్తి. కాని అడ్డులేని జలప్రవాహము గ్రామములను ముంచివయిచి పైరులను పాడుచేసినటులు అడ్డు లేని కలము గూడ సత్యనాశనము చేసివయిచును. కాన కలమునకు అంకుశము కావలయును. ఆ యంకుశముకూడ బాహిర మగుచో నిరంకుశతకన్న పాడు. కావున లాభము కోరుచో నా యంకుశ మాంతరము కావలయును.

ఈ విచారసరణిలో దోసమేమియు లేనిచో ప్రపంచమునం దెన్ని పత్రికలు చిరకాలము నిలువఁగలవు? మఱియు అక్కఱ మాలిన పత్రికలను ఎవరు ప్రకటింప మానఁగలరు? మఱియు ఎవరు ఇవి అక్కఱ మాలిన వని చెప్పఁగలరు? మంచి చెడుగులు రెండును ఈ ప్రపంచమున ఒండొండ కలిసియే నడుచుచుండుట సత్యము. ఈ రెంటిలో మంచిని ఏఱికొనుటయే మనుజుని పని.

౧౪

కూలీ లోకేషనా, లేక మాలగూడెమా ?

హిందూ దేశములో నందఱికంటె నెక్కువ సంఘసేవ చేయు మాలలు మొదలగువారిని అంటరానివారినిగా పరిగణించి వారిని ఊరివెలుపల నుంచుచున్నాము. వారుండు చోటును మాలగూడె మందుము. ఆపే రుచ్చరించుటకు ఈసుగొందుము. ఈరీతిగనే ఏసుమతమువారి యూరోపునందును ఒక కాలమున యూదు లనఁబడువారు అంటరానివారుగా పరిగణింపఁబడిరి. వారి నివాసములు ప్రత్యేకింపఁబడెను. వానికి ఘెట్టో లని పేరు. ఈ తెఱఁగుననే దక్షిణ-ఆఫ్రికాలో మన హిందువులు అంటరానివారుగా నెంచఁబడిరి. ఆండ్రూజుగారి త్యాగమును, శాస్త్రిగారి సమ్మోహనాస్త్రమును చేసిన పని మనల నంటరానివారినిగాఁ జేయింపక సభ్యులనుగాఁ జేయింపదా ? చూడవలయును.

యూదులు తామే ఈశ్వరులకు ఇష్టుల మనుకొని మిగిలినవారిని సృష్టిలో హేయులనుగా నెంచిరి. వారి యీ యపరాధమునకు దండన విచిత్రముగను, అనుచితముగను జరిగెను. ఇంచుమించు ఈ రీతిగనే హిందువులును 'మేము సంస్కృతులము, లేక ఆర్యులము' అని అనుకొనిరి. తమలోనే కొందఱను 'మీరు ప్రాకృతులు, అనార్యులు, అస్పృశ్యులు-పొం'డనిరి. ఈ పాపఫలము దక్షిణ-ఆఫ్రికా మొదలగు తావులందు విచిత్రముగాను, అనుచితముగాను పొడతెంచి, వీరినే గాక వీరిచుట్టుపక్కములైన ముసలమానులను, పారసీకులను, వేయేల—వీరిరంగువారిని, వీరిదేశమువారిని వీరితోపాటు దుఃఖ మనుభవింపఁ జేయుచున్న దనుకొందును.

౧౮ కూలీ లొకేషనా, లేక మాలగూడెమా?

జోహాన్సు బర్గులోని కూలీలొకేషనును గుఱించి ఈ ప్రకరణ మేల వ్రాయవలసియుండెనో పాఠకు లిపు డెఱుఁగ నోపుదురు. దక్షిణ-ఆఫ్రికాలో మన హిందూస్థానీయులకు 'కూలీలు' అని ప్రసిద్ధి. భారత దేశమున కూలివాఁ డనఁగా వెలగొని పనిచేయువాఁడు. కాని దక్షిణ-ఆఫ్రికాలో 'కూలీ' అను పదము మాలఁడు, మాదిగవాఁడు మొదలగు పదములవంటిదయి, ఆ పదము లిచ్చు అర్థమునే బోధచేయున దయినది. దక్షిణ-ఆఫ్రికాలో కూలీలను విడిగానుంచు గూడెముపేరు కూలీలొకేషన్. ఇట్టి లొకేష నొకటి జోహాన్సుబర్గులో కలదు. పెఱతావులందును ఇట్టి లొకేషనులు కలవు. అచట నుండువారికి ఆ లొకేషనులయెడ అధికారముగాని, స్వామ్యము గాని లేదు. ఇఁక జోహాన్సుబర్గులో లొకేషనులు హిందూస్థానీయులు ౯౯ ఏండ్లకు కౌలుతీసికొనిరి. ఇచట హిందూస్థానీయులకు కడు నిఱుకు. జనాభా పెరుఁగుచున్నది కాని లొకేషనుమాత్రము గొప్పదోఁక. మునిసిపాలిటీవారు మఱుఁగు దొడ్లను అఱగొఱగా బాగుచేయించుట దక్క వేఱుపను లేవియు చేయింపలేదు. వీనిపనియే ఇటులుండఁగా నిఁక బాటలమాట, దీపముల మాట చెప్పవలయునా! మఱియు మఱుఁగు దొడ్లనే శుచిగా నుంచనపుడు మిగిలిన విషయముల శుచినిగుఱించి అడుగ నక్కఱలేదు. మఱియు నచట నున్న హిందూస్థానీయులకు నగరసంస్కారము గాని, ఆరోగ్యనియమము గాని తెలియదు. ఇట్టివారిని తిన్నఁగాఁ జూచు జరూరు ఆ మునిసిపాలిటీకి లేదు. అచట నివసించుచున్న హిందూస్థానీయులు అడవిలో మేడ మొలిపింపఁగలరేని, ధూళినుండి ధాన్యమును పిండఁగలరేని వారి యితిహాసము వేఱుగా నుండెడిది. ఇంత జనము తమదేశమును విడనాడి పరదేశమునందు తిరుగాడుచుండుట ప్రపంచమునం దెచటను కన్నది కాదు; విన్నది కాదు. సామాన్యముగా జనము ధనమునకుఁగాని, వర్తకము

నకుఁ గాని పరదేశముల కేఁగుదురు. ఇండియానుండి దక్షిణ-ఆఫ్రికాకు వెళ్ళినవారిలో ఎక్కువమంది చదువు రానివారు, నిరుపేదలు, దీనులు నగు కూలివారు. వీరికి సక్రమమగు రక్షణ మావశ్యకముకదా! వీరికి పిదప వాణిజ్యము చేయువారును, స్వతంత్రముగా జీవనము చేయఁగలవారును కూడ వెళ్ళిరి. కాని వీరు వానికంటె కడుఁ గొలఁది మంది.

మునిసిపాలిటీవారి క్షమింపరాని ఉపేక్షవలనను, భారతీయుల అజ్ఞానమువలనను ఈ లొకేషను అనారోగ్యనిలయ మాయెను. మునిసిపాలిటీవారు సంస్కరణప్రయత్నములు సలుపక, పైఁగా తమ లోపమును లొకేషనువారి నెత్తిపైఁ బెట్టి లొకేషనును ఎత్తివేయఁదలపెట్టిరి. అందులకు శాసనసభవారి సమ్మతిని సంపాదించిరి. నేను జోహాన్సుబర్గులో నెలకొనిన నాఁటి కున్న స్థితిగతు లివి.

అక్కడివారికి తమతమ నివేశనములపై హక్కు కలదు గాన వారి కేకొంచెమో ప్రతిఫలము ముట్టఁజేయవలసియుండును. ప్రతిఫలము లొసఁగుట కొక పంచాయతీని పెట్టిరి. మునిసిపాలిటీ యిచ్చు ప్రతిఫలము చాల దని నివేశనస్థలములు కలవారు అర్జీ పెట్టుకొనుచో దానిని ఈ పంచాయతీవారు విచారించి తీర్పు చెప్పుదురు. దానికి అందఱును సమ్మతింపవలసియుందురు. పంచాయతీవారు అర్జీలు పెట్టుకొనినవారికి ఎక్కువ డబ్బీయవలయునని తీర్మానము చేయుదు రేని ప్లీడరు ఫీజు మునిసిపాలిటీ భరింపవలసియుండును.

చాల దావాలలో కౌలుదారులు నన్ను వకీలుగా పెట్టుకొనిరి. వీనివలన నేను డబ్బు కూడఁబెట్టఁ దలఁప లేదు. 'మీరు గెలుచుచో మునిసిపాలిటీవా రిచ్చు ఫీజుతో తృప్తిపడుదును. మీరుమాత్రము పట్టాకు పది పౌను లిచ్చుచో చాలు'నని కౌలుదారులకు మొదటనే చెప్పితిని. ఈ వచ్చిన డబ్బులో ఇంచుమించుగా సగము బీదల ఆసుపత్రికిఁ గాని, లేక అందఱి కుపయోగించు మఱియొక పనికిఁ

గాని వినియోగింతునని చెప్పితిని. దీని వారందఱును సహజముగానే సంతుష్టులయిరి.

సుమారు ౭౦ దావాలలో ఒకటి పోయెను. నాకు ఫీజు చాల ముట్టెను. ఆ సమయమున ఇండియన్ ఒపీనియన్ 'ఇమ్మ ఇమ్మ'ని నా నెత్తిపైఁ గూరుచుండెను. దీనికిఁగాను ఇంచుమించు ౧౬౦౦ పౌనులు ఈయవలసివచ్చె నని గుఱుతు.

ఈ దావాలలో ఇచ్చగించియే చాల శ్రమపడి పనిచేసితిని. క్లయంట్లు ఎప్పుడును మూఁగుచుండెడువారు. వీరిలో చాలమంది ఔత్తరాహులగు బీహారు మొదలగు దేశములవారును, దాక్షిణాత్యులగు అఱవవారును, తెలుఁగువారును. వారు మొదట గిరిమిటియాలుగా వచ్చిరి. ఇపుడు ముక్తిఁబడసి స్వతంత్రముగా నున్నారు.

వీరు తమ కష్టములను బాపుకొనుకొఱకు భారతీయవణిక్సంఘమునకు వేఱుగా తమ కొక సంఘమును నెలకొలుపుకొనిరి. వీరిలో చాలమంది సత్యసంధులు, ఉదారమతులు, సచ్చరిత్రులు నగు భారతీయులు. దీనికి అధ్యక్షులు జేరామసింహులుగారు. అధ్యక్షులు గాకపోయినను అధ్యక్షుల తరువాత అధ్యక్షులంతవారు బదరీగారు. ఇపుడు వీ రిరువురును స్వర్గము చూఱఁగొనిరి. వీ రిరువురును నాకుఁ గడు సాయపడిరి. బదరీగారి పరిచితి నా కెక్కుడు. వీరు సత్యాగ్రహమునఁ జాలఁ బనిచేసిరి. నేను వీరి మూలమునను, ఇటువంటివారి మూలమునను ఔత్తరేయులను, దాక్షిణాత్యులు నగు పలువురు భారతీయుల నెయ్యముఁ బడసితిని. నేను వీరికి కేవలము వకీలును గాను, మఱి సోదరునివంటివాఁడ నయియుంటిని; వీరి దుఃఖములలో పాలుగొంటిని. సేఠ్ అబ్దుల్లాగారు నన్ను గాంధీ యని పిలువ నిరాకరించివయిచిరి. మఱియు 'సాహెబు' అని నన్ని మన్నన గొన్నవాఁ డెవఁడు? కావున ఆయన మంచి పేరు వెదకి వెదకి 'భాయీ' అని సంబోధింపఁ దొడఁగెను. తుదవఱకు దక్షిణ-ఆఫ్రికాలో నా కీ పేరు పోలేదు. మఱియు గిరిమిటు-ముక్తులగు భారతీయులు నన్ను భాయీ యని పిలిచినపుడు వీనులవిందుగా నుండెడిది.

౧౫

మహామారి—౧

ఈ లొకేషనును మునిసిపాలిటీవారు స్వాధీనపఱచికొనిరిగాని వెంటనే భారతీయుల నటనుండి వెడలఁగొట్టలేదు. ముందుగా వారి కనుకూలమగు వేఱొక తావు చూపుట ఆవశ్యకమాయెను. మునిసిపాలిటీ ఇంకను స్థలనిరూపణ మొనరింపలేదు. కావున భారతీయులు 'ముఱికికొట్టు'లోనే ఉండవలసివచ్చెను. వెనుకటికంటె నిపుడొక భేదము వచ్చెను. భారతీయులు వెనుక హక్కుదారులు; ఇపుడు కౌలుదారులు. వెనుక లొకేషనులో కంపు కొంచెము తక్కువ; ఇపుడు మిగుల నెక్కువ. ఇంతకుముందు భారతీయులు హక్కుదారు లనుకొనుచుండిరి. కావున ఇచ్ఛాపూర్వకముగాఁ గాకున్నను భయముచే నయినను కొంచెము గాకపోయినఁ గొంచెముగా నయినను మునిసిపాలిటీవారు శుచిగా నుంచుచుండిరి. కాని యిపుడీఁక మునిసిపాలిటీకి భయ మేడది? కౌలుదారుల సంఖ్య పెరిఁగెను. దానితోపాటు అశౌచము, అవ్యవస్థయు పెచ్చు పెరిఁగెను.

ఈస్థితులలో భారతీయులు సంకటపడుచుండఁగా నల్లమారి రోగము డబ్బాటు వచ్చిపడెను. అది వచ్చినచో చావు తప్పదు. అది ఊఁపిరితిత్తులను పట్టుకొనును. బొబ్బరోగముకంటె నది భయంకరము.

అదృష్టవశమున ఈ మారి లొకేషనులో పుట్టలేదు. ఒక బంగారుగనిలో పుట్టెను. జోహాన్సుబర్గు పరిసరములలో బంగారుగను లనేకములు కలవు. వానిలో పనిచేయువారిలో పలువురు నీగ్రోలు. వారి పరిశుభ్రతకు కేవలము వారి యజమానులగు తెల్లవారే పూఁటకాఁపులు. ఈ గనులందు పలువురు హిందూస్తానీయులును పనిచేయుచుండిరి

వీరిలో ౨౩ రు ఈమారికి ఒబ్బాటు గురియయిరి. వారీ భయంకరావస్థను వెంటఁ బెట్టుకొని లోకేషనులోని తమతమ యిండ్లలోనికి వచ్చి పడిరి.

ఆనాఁడు ఇండియన్ ఒపినియన్ పత్రికకు చందాదారులఁ జేర్చను, చందాలు వసూలుచేయను మదనజిత్తుగారు అచట తిరుగుచుండుట తటస్థించెను. ఆయన చాల ధీరుఁడు. ఈరోగులఁ జూడఁగనే అతని చిత్తము ద్రవించెను. పెన్సిలుతో నాకొక చీటి వ్రాసెను. దానిభావ మిది: 'ఇచట నల్లమారి హఠాత్తుగా వచ్చిపడెను. మీరు వడిగా వచ్చి కొంచెము సాయపడవలయును. రానిచో చాల ఆపద కలుగును. వెంటనే రావలయును.'

మదనజిత్తుగారు భయపడక ఎవరును లేని ఒకయింటి తాళము పగులఁగొట్టి అందు రోగులను ప్రవేశపెట్టిరి. నేనును సైకి లెక్కి లోకేషను చొచ్చితిని. ప్రకృత స్థితిగతులు తెలుపుచు ఈ యింటి తాళము తీయవలసివచ్చిన దని టౌనుక్లర్కుకు వార్త నంపితిని.

డాక్టరు విలియమ్ గాడ్ ఫ్రేగారు జోహాన్సుబర్గులో వైద్యముచేయుచుండిరి. ఆయనకు కబురు వెళ్లఁగనే పరుగెత్తుకొని వచ్చిరి. డాక్ట రొకఁడును, పరిచారకు లిద్దఱును కుదిరిరి. రోగు లిరువదిముగ్గురు. కాని మేమో? ముగ్గురమే. వీరితో పని నెగ్గుట దుర్లభము.

మది మంచిదగుచో సంకటసమయమున సేవకులును, సాధనములును తమంత వచ్చిపడు నని నా కనుభవపూర్వమైన విశ్వాసము కలదు. నా ఆఫీసులో కల్యాణదాసుగారు, మాణికలాలుగారును, మఱి యిద్దఱు హిందూస్థానీయులును గలరు. ఈ యిరువురి పేరులయెడ నా

కిపుడు గుఱుతు * తక్కువ. కల్యాణదాసుగారిని వారి తండ్రియే తీసి కొని వచ్చి నా కప్పగించెను. వీరివంటి పరోపకారులను, వీరివలె చెప్పిన పనిని చెప్పినటులు చేయు సేవకులను అచట కడుం గొలంది మందిని జూచితిని. కల్యాణదాసుగా రపుడు బ్రహ్మచారు లయి యుండుట సౌభాగ్యము. కావున వీరి నేపనికైనను బంపుటకు జంకు వాఁడనుగాను. రెండవవారగు మాణిక్‌లాల్‌గారు నాకు జోహాన్సు బర్గులో దొరకిరి. అతఁడును బ్రహ్మచారి యనియే గుఱుతు. వీరు నలువురును నాకు గుమాస్తా లనుఁడు, సహచారు లనుఁడు, కుమారు లనుఁడు. వీరి నలుగురిని ఇందు హోమము చేయ నిశ్చయించుకొంటిని. కల్యాణదాసు నడుగఁ బనియే లేదు. ఇఁక మిగిలిన మూవురి నడుగు టయే తడవు, తయారయి యుండిరి. 'మేమును మీతోడివారమే యని క్లుప్తముగను, మధురముగను వా రిచ్చిన జవాబు.

రిచ్‌గారి సంసారము దొడ్డ. అతఁడును మాతోపా టుండుటకు తయారే కాని నే వల దంటి. అతని నీ యాపదలో పెట్టుటకు నేను తయారు కాలేదు. ధైర్యమును చాలలేదు. కావున నతఁడు పై పనులు సంబాళించుకొనుచుండెను.

మేము సేవచేయు ఆరాత్రి చాల భయంకరము. నే నింతకు ముందు పలురోగుల కుపచారము చేసితిని గాని ఎన్నఁడును నల్లమారి రోగులకు ఉపచారము చేయుట పడలేదు. డాక్తరుగారి ధైర్యము మా భయమును బాపెను. ఉపచారము కడుఁ దక్కువ. మం దిచ్చుట, ఓదార్చుట, మంచినీ ళ్లిచ్చుట, మకిల తుడుచుట—ఇంతకు వినా ఎక్కుడు పని లేదు.

---

* ఈ యిరువురిలో నొకరు గుణవంతరాయి దేశాయిగారు. చూ. ఇంగ్లీషు-ఆత్మకథ. ౨-వ సం. ౮౫-వ పుట. —అనువాదకుఁడు.

ఈ నలుగురును ప్రాణము లొడ్డి సేవ చేసిరి. ఇట్టి వీరి సాహసమును, నిర్భయతను జూడఁగా నా యానందమునకు మేర లేకుండెను.

డాక్టరు గాడ్ ఫ్రేగారి ధైర్యమును, మదనజిత్తుగారి ధైర్యమును దొడ్డవే కాని ఆ నలువురు కుఱ్ఱలయు ధైర్యము చూచినచో ఆశ్చర్య మగును. ఆ రాత్రి యోటులో కడచెను. ఆ రేయి ఒక రోగి నేని మేము పోఁగొట్టుకొనిన గుఱుతు లేదు.

ఈ యుదంత మంతయు ఎంత కరుణాజనకమో అంత మనోరంజకము; విశేషించి నా దృష్టిలో ధార్మికము. కావున ఇంకను ఈ విషయమును గుఱించి విడిగా రెండు ప్రకరణములు వ్రాయవలసి వచ్చును.

౧౬

మహామారి—౨

ఇట్లు లింటితాళము పగులఁగొట్టి రోగుల నందు ప్రవేశపెట్టి వారి కుపచారము చేయుచున్నందులకు టౌన్ క్లర్కు మాకు కృతజ్ఞత తెలుపుచు, 'ఇప్పటిలో వెంటనే సాయము చేయఁగల సాధనములు మాకడ లే'వని దాఁచక ఒప్పుకొనుచు, 'మీకు వలయు సాయమును తప్పక తెలుపుఁడు; టవున్-కౌన్సిలు తనశక్తికొలఁది సాయపడును' అని చీటి వ్రాసెను. మునిసిపాలిటీవారు మేలుకొనిరి. పిదప తగిన ఉపాయములను జేయుటకు విలంబ మొనరింపలేదు.

ఆమఱునాఁడు ఖాళీగిడ్డంగులను మాకు స్వాధీనపఱిచి అందు రోగుల నందఱను ఉంచవచ్చునని తెలిపిరి. వారు దానిని బాగు చేయించు పూఁచీని తమ నెత్తిపయి నిడుకొనలేదు. ప్రదేశ మంతయు చెత్తచెదారములతో నిండియుండెను. మేమే బాగుచేసికొంటిమి. ఉదారులగు భారతీయులు మంచములు మొదలగువాని నిచ్చిరి. అది యంతయు నొక ఆసుపత్రి యయిపోయెను. మునిసిపాలిటీవా రొక నర్సును, అనఁగా పరిచారికను పంపిరి. ఆమె బ్రాందిసీసాలను, మఱి కొన్ని వస్తువులను దీసికొని వచ్చెను. డాక్తరు గాడ్ఫ్రే గారు తొంటి వలెనే పనిచేయుచుండిరి.

మేము నర్సును రోగులను ముట్టుకొన నిచ్చుట లేదు. ఆమె వారిని తాఁకుటకు వెనుదీయునది కాదు. ఆమె దొడ్డయిల్లాలు. ఆమెకుఁగూడ నీ వ్యాధి యెక్కడ అంటుకొనిపోవునో అని మేమే నివారించితిమి.

రోగులకు మాటిమాటికి బ్రాంది నిమ్మని మా కాదేశము. 'మీరు గూడ బ్రాందిని కొంచెముకొంచెము పుచ్చుకొనుచుండినచో వ్యాధి అంటు' దని చెప్పుచు నర్సు తాను త్రాగుచుండెడిది. కాని మేము దానిని తాఁక కుంటిమి. రోగుల కయినను బ్రాంది ఉపయోగించునని నాకు నమ్మక లేదు. బ్రాంది పుచ్చుకొనక యుండుటకు మూవ్వు రంగీకరించిరి. డా. గాడ్ఫ్రేగారి అనుమతితో ఈ మూవురిపై నేను మట్టిని ప్రయోగించితిని. తలమీఁదను, బొమ్ముమీఁదను, నొప్పిగల చోటులను మట్టిపట్టీలు వేసితిని. వీరిలో నిరువురు బ్రతికిరి, మిగిలిన వారందఱును మేనులు విడిచిరి. ఇరువదిమంది ఆ గిడ్డంగులలోనే మృతిజెందిరి.

మునిసిపాలిటీవా రితరోపాయములుచేయఁదొడఁగిరి. జోహాన్సుబర్గుకు ఏడుమైళ్ళదూరమున ఒక లేజ్ రేటో, అనఁగా అంటురోగుల కాసుపత్రి కలదు. అచట డేరాలు వేసిరి. పోఁగా మిగిలిన మూవురిని అచటకుఁ గొంపోయిరి. క్రొత్తరోగులను అచటికే కొనిపోవ నిశ్చయించిరి. మే మా పనినుండి విముక్తుల మయితిమి. పిదప ఆ మేలి యుపచారికకుఁగూడ నల్లమారి తగిలె ననియు, దేహము చాలించె ననియు కొలఁది దినములకే వింటిమి. ఆ రోగు లెట్టు బ్రతికిరో, మా కా మారి యేల తగులలేదో యెవరు చెప్పఁగలరు? దీని వలన మృచ్చికిత్స యెడల నాకు నమ్మక ప్రబలెను. మరియు బ్రాంది మందునకుఁగూడ గొఱగాదు అని బ్రాందిపై అశ్రద్ధ ప్రబలెను. కాని నా యీ శ్రద్ధాశ్రద్ధలు నిరాధారము లనవచ్చు నని నాకుఁ దెలియును. కాని ఆరోజులలో ఈ రెండు విషయములును నామానసమున హత్తుకొనిపోయి నేఁటివఱకు ఆ రీతిగనే నిలిచియుండెను గాన నిది యుదాహర్తవ్యమాయెను.

ఈ మహామారి బయలువెడలఁగనే మునిసిపాలిటీవారు లొకేషనును స్వాధీనము చేసికొనినపిదప దానియెడ ఔదాసీన్యము వహించుటను కూర్చియు, వచ్చిన మహామారికి మునిసిపాలిటీవారే పూఁటకాఁపు లనియు పత్రికలో కటువుగా వ్రాసితిని. ఈ వ్రాఁతవలన మి. హెన్రీ పోలకు గారును, నేఁడు స్వర్గీయులగు మి. జోసెఫ్ డోక్ గారును * మిత్రు లయిపోయిరి.

నే నొక నిరామిష భోజనాలయమున భుజించుటకు వెళ్లుచుంటి నని వెనుకటి ప్రకరణమున చెప్పితిని. అచట నాకు మి. ఆల్బర్టు వెస్టుగారితో కలయిక కలిగెను. మే మిరువురమును గలిసి భోజనాలయమున కరుగుచుంటిమి. భుజించిన పిదప నిరువురమును కలిసియే షికారు వెళ్లుచుంటిమి. మి. వెస్టు ఒక చిన్న అచ్చుకూటమున భాగస్వామి. మారినిగురించి నా వ్రాసిన లేఖ నతఁడు చదివెను. నే నిపుడు భోజనాలయమున కానిపింపమిచే ఆదుర్దాపడెను.

నేనును, నా సహచరులును ప్లేగురోజులలో ఆహారమును తగ్గించితిమి. మరియు నీ యంటు తెగులు ప్రకోపించియున్నంతవఱకు పొట్టను ఎంత తేలికగా నుంచుకొనిన అంతే మే లని చాలకాలము వఱకు ఆ నియమము ననుసరించితిమి. దీనివలన నేను రాత్రి తినుట మానితిని. మరియు నితరులకు నావలన భయము కలుగకుండుటకు ఎవ్వరును రాకముందే నా మధ్యాహ్న భోజనమును ముగించుకొనిపోవుచుంటిని. ఆ భోజనాలయపు యజమానితో నాకు చాల పరిచయము. 'నే నీ ప్లేగురోజులలో రోగులకు పరిచర్య చేయుచుంటిని గాన ఇతరులకు నా స్పర్శ తగులకుండ చూచుకొందు'నని చెప్పియుంచితిని.

---

* వీరి విషయమున Partly Responsible అని ఆంగ్లప్రతి—అను.

భోజనాలయమున నన్నుఁ గానక మి. వెస్టు రెండవనాఁటి ప్రొద్దుననో, మూఁడవనాఁటిప్రొద్దుననో నాతలుపు తట్టెను. నేనును బయటికి వచ్చుటకు సంసిద్ధుఁడ నయియుంటిని. ఇంతలో నితఁడు వచ్చి నాగదితలుపు కటకట లాడించెను. తలుపు తీయఁగనే 'మీరు నాకు భోజనాలయమున కానిపింపమిచే మీకును ప్లేగు సోఁకెనేమో యని బేజారయితిని. ఈ సమయమున వచ్చుచో తప్పక మీరు దొరుకుదు రని ఇపుడు వచ్చితిని. నావలన నేమియేని పని కావలయుచో తప్పక చెప్పుఁడు. నేను రోగులకు పరిచర్య చేయుటకుఁగూడ సంసిద్ధుఁడను. నాపొట్ట నే నిండించుకొనుటదక్క ఇతరుల పొట్టలను నిండింపవలసిన పని నాకు లే దని మీ రెఱుఁగనే యెఱుఁగుదు' రని అతఁ డనెను.

మి. వెస్టు ఇందులకు నాకు మాన్యుఁడు. ఒక నిముసమేని ఆలోచించినటులు గుఱుతు చాలదు. ఇటు లంటిని:

'మిమ్ములను నేను నర్సుగా తీసికొనను. ఇఁక క్రొత్తలు లేనిచో మాపని ఒకటి రెండు రోజులలో తీరిపోవును. కాని మీ వలన ఒకపని కావలసియున్నది.'

'అది యేమి ?'

'తాము డరబను దయచేసి ఇండియన్ ఒపినియనును చేతఁ దీసికొనవలయును. మదనజిత్తుగారి కింకను ఇచట పనిగలదు. మీరచటికి వెళ్ళినచో అచటి పనులయెడల నా చింత తీరిపోవును.

'నా యధీనమున నొక ముద్రాలయము కలదని మీ రెఱుఁగుదురు. పలువిధముల నే నచటికి వెళ్లఁగలనుగాని ఏసంగతియు ఆలోచించి మాపటివేళ చెప్పుదు నన్నచో నీలోపుగా చిక్కేమియు

లేదుకద? మాపటి షికారువేళ దీనిగురించి మాటలాడుకొందము' అని మి. వెస్టు జవాబిచ్చెను.

నేనును వల్లె యంటిని. నాఁటి మాపటింతల మాటయు, మంతియు నాయెను. నెలకు పదిపౌనుల జీతమును, లాభమున కొంత పాలును ఇచ్చునటులు మాటలాడితిని. జీతము కొఱకు వెస్టుగారచటికి పోవఁ గూర్చుండలేదు. జీతముగొను నుద్దేశమే వారికి లేదు. వారికి రావలసిన బాకీలు సాకీలు నా కప్పగించి ఆ మఱునాఁటి రాత్రి మెయిలులో వెస్టుగారు డరబనుకు రవాణా అయిరి. నాఁటి మొదలు నేను దక్షిణ-ఆఫ్రికాను విడనాడువఱకు అతఁడు నా సుఖదుఃఖములకు తోడాయెను. సీమలో లౌత్ అను నొక గ్రామమున మి. వెస్టు జన్మించెను. అతఁ డొక రైతు బిడ్డ. పాఠశాలలో సామాన్యవిద్యను నేర్చెను. తన సొంత పూనికచే అనుభవపాఠశాలలో చదివి విజ్ఞుఁడును, శుద్ధుఁడును, సంయమియు, ఈశ్వరభీరువును, ధీరుఁడును పరోపకారియు ఆయెను. ముందరి ప్రకరణములలో నితనిని, ఇతని కుటుంబమును గుఱించియు వ్రాయుటకు బాకీ యున్నది.

లోకేషనుకు నలుదెసలను పహారా పెట్టిరి. అజ్ఞ లేకుండ లోపలికి పోవుటకుఁ గాని, బయటికి వచ్చుటకుఁ గాని వీలులేదు. నాకును, నా సహచరులకును మాత్రము సెలవుచీటి కలదు. జోహాన్సు బర్గుకు పదమూడుమైళ్ళదూరమున నున్న మైదానమున వేసిన డేరాలలో ఈ లోకేషనులోనివారి నందఱను ఉంచి ఆ లోకేషనును తగులఁబెట్టవలయు నని మునిసిపాలిటీవారు తలఁచిరి. డేరాలతో నొక క్రొత్తగ్రామము నిర్మించుటకును, అచట తినుబండము లన్నియుం సమకూర్చుటకును కొంతకాలము పట్టుట స్వాభావికము. అంతవట్టును ఇచట పారా పెట్టిరి.

వీరు చాల గాబరాపడిరి. నేను వారిపట్టున నుండుటచే ఊఱటగొనిరి. వారిలో పలువురు నిఱుపేదలు తాము కూడఁబెట్టుకొనిన ధనమును ఇండ్లలో పాఁతిపెట్టుకొనిరి. దానిని పెల్లగించి ఒక్క చోటున దాఁచికొనవలయును. వారికి బాంకు లేదు. వారు బాంకు అను మాటయు నెఱుఁగరు. నేనే వారికి బాంకు. నాయిల్లు రూకలతో నిండిపోయెను. అట్టితఱి నేను నా చేసిన దొడ్డపనికి వీరికడ ఏమయిన ను తీసికొనవచ్చునా? ఎటులో ఆ యాపద గడఁపితిని. బాంకు మానేజరుకును నాకును గాఢపరిచయము కలదు. ఈ డబ్బంతయు బాంకులో జమ కట్టింపఁ గోరితిని. రాగి నాణెములను వెండి నాణెములను పుచ్చుకొనుటకు బాంకువా రిష్టపడరు. మరియు మారి మసఁగిన చోటులనుండి వచ్చిన నాణెములను గుమాస్తాలు ముట్టుకొనవొల్లక పోవచ్చును. కాని బాంకుమేనేజరు సమస్తసదుపాయములను జేసెను. పురుగుల జంపు ద్రావకములో ఈ నాణెములను కడిగించి పట్టుకొనిరండు అని చెప్పెను. ఈ రీతిగా ౬౦,౦౦౦ పౌనులు బాంకులో కట్టినటుల గుఱుతు. ఎక్కువ డబ్బు కలవారికి ఫిక్సెడ్ డిపాజిట్లు చేయుఁ డని సలహా ఇచ్చితిని. ఈ రీతిగను పెక్కుడిపా

పెట్లు కట్టుకొనఁబడెను. దీనికి ఫలముగా చాలమందికి పొంకులలో ధనము దాఁచికొన నభ్యాసము కలిగెను. ఈ లోకేషనులోనివారి నందఱను జోహాన్నెసుబర్గుకు సమీపమున నున్న క్లిప్‌స్ప్రిట్ ఫారమునకు స్పెషల్ రయిలుమీఁద తీసికొనిపోయిరి. అచట మునిసిపాలిటీ వారు తమ సొంతఖర్చుతో వారికి కావలసిన సదుపాయముల నన్నిఁటిని సమకూర్చిరి. ఈ డేరాల బారు సేనాశిబిరమువలె నుండెను. వీరికి ఆకాశముక్రింద ఆ డేరాలలో నుండు నలవాటు లేమి కొంచెము చిక్కుగనే యుండెను; కొంచెము క్రొత్త చేసెను; కాని వారి కచట నెట్టి యిబ్బందియు కలుగలేదు. నేను నిత్యమును సైకిలుమీఁద వెళ్లి వచ్చుచుంటిని. ముయ్యేడునాళ్ళవఱకు ఈరీతిగా మంచిగాలిలో నుండుటవలన వారి యారోగ్యము చక్కఁబడెను. మొదటి ఇరువది నాలుగుగంటలు గడచుసరికి క్రొత్తయు గిత్తయు ఎగిరిపోయెను. మరల నానందమున నోలలాడఁగడఁగిరి. నేనచటికి వెళ్లినపుడెల్ల వారి భజనకీర్తనలను ఆటపాటలను, జూచుచునే యుంటిని.

లోకేషను ఖాళీ చేయించిననాఁడో, ఆ మఱునాఁడో దానికి నిప్పంటించిరి. మునిసిపాలిటీవారం దొక వస్తువునేని తీసికొన లోభ పడలేదు. ఈ దినములలోనే, ఈ కారణముచేతనే మునిసిపాలిటీ వారు మార్కెటులో నున్న కలప నంతయుఁ దగులఁబెట్టించి పదివేల పౌనుల నష్టమును భరించిరి. మార్కెటులో చచ్చిన యెలుకలు కానిపించుటచే మునిసిపాలిటీవారీ సాహసమునకు దిగిరి. మిక్కిలి వ్యయమాయెను గాని దీనికి ఫలముగా మారి వ్యాపింపలేదు. నగరము నిర్భయ మాయెను.

౧౮

ఒక గ్రంథప్రభావము

ఈ మహామారిమూలమున దిక్కులేని భారతీయులయందు నా పలుకుబడియు, నా వకాలతును, నా పూచీయును చాల హెచ్చెను. మరియు తెల్లవారలతో నాకుఁగల పరిచయ మినుమడించెను. దానఁ జేసియు నా నైతిక మయిన జవాబుదారి హెచ్చఁదొడఁగెను.

భోజనాలయమున వెస్టుగారు పరిచితు లయినటులే పోలకు గారును నాకు పరిచితు లయిరి. ఒకనాఁడు నా భుజించు మేజా బల్లకు దూరముగా నున్న మఱియొక మేజాబల్లకడ నొక క్రొత్త పిన్న వాఁడు భుజించుచుండెను. అతఁడు నాతో మాటలాడఁగోరి తన పేరు వ్రాసి నా కొక చీటి నంపెను. నేను నా బల్లకడకు రమ్మంటిని; అతఁడు వచ్చెను.

'నేను క్రిటిక్ పత్రికకు ఉపసంపాదకుఁడను. మీరు ప్లేగును గూర్చి వ్రాసిన వ్యాసము చూచితిని. మి మ్మెప్పుడు చూతునా అని అనుకొనుచుంటిని. ఇపుడు చూడఁగలిగితిని' అని అతఁ డనెను.

పోలకుగారి నిష్కాపట్యము న న్నాకర్షించెను. ఆరాత్రియే మా యిరువురికిని పరిచయము కలిగెను. జీవితమునకు సంబంధించిన మా పరస్పర భావములకును పోలిక యున్నటులు కానిపించెను. నిరాడంబరజీవితము అతని కిష్టము. ఏ మాటయేని తనమనికి లెస్సయని తోఁచుచో దానిని వెంటనే అనుష్ఠానమునఁ బెట్టుకొను నతనిశక్తి చాల ఆశ్చర్యకరము. అతఁడు తన జీవితమునందు పెక్కులు మార్పు లొక చిటికలోఁ జేసికొనెను.

౧౮ ఒక గ్రంథప్రభావము

ఇండియన్ ఒపినియన్ పత్రికకు వ్యయము చాలఁ బెరుఁగుచుండెను. వెస్టుగారంపిన మొదటి రిపోర్టు చూడఁగా భయమాయెను. 'ఈ పనిలో మీరు చెప్పినంత లాభము కానిపించదు. పైఁగా నష్టము వచ్చు ననిపించుచున్నది. లెక్కలుం డొక్కలు సరిగా లేవు. బాకీలు బోలెఁడు; వానికిని తలయుఁ దోఁకయు లేవు. కడు సవరింపవలసి యున్నది. కాని ఈ రిపోర్టువలన మీరు గాబరా పడకుఁడు. నా శక్తికొలఁది సర్దుబాటు చేసెదను. లాభము రాదని ఈ పనిని విడనాడను' అని వెస్టుగారు వ్రాసిరి.

లాభము రాదని తెలియఁగనే వెస్టుగారా పనిని మానుకొనవచ్చును. దాననే నాతనిపై నిసుమంతయు నేరమును మోపలేకపోవుదును. పైఁగా నాతఁడే నాపై నేరము మోపవలసి యుండును. ఏలన, తిన్నగా విచారింపక లాభము రాఁగలదని చెప్పి నేనే దోషభాగి నయితిని. ఇటులయినను ఇతఁడెన్నఁడును పెదవి నెత్తలేదు. ఎవరే మాట చెప్పినను ఆమాటను నమ్ము వెఱ్ఱివానిగా నన్ను వెస్టుగారు పరిగణింతు రనుకొంటిని. మదనజిత్తుగారి అంచనాను నమ్మి లాభము రాఁగల దని వెస్టుగారికి మాట యిచ్చితిని. ప్రజాసేవకుఁ డెవఁడేని స్వయముగా చూచుకొనక ఇతరుల మాట నమ్మరాదు. సత్యారాధకునకు చాల మెలకువ ఉండవలయును. తాను తిన్నగా తెలిసికొనక మఱియొకని నమ్మించుట సత్యమునకు డాగు. ఇది యంతయు తెలిసియు వెంటనే నమ్మి పనిచేయు నా ప్రకృతిని తిన్నగా మార్చుకొనజాలక పోవుచున్నా నని చెప్పుచు వగచుచున్నాను. శక్తికి మించిన పనిని నెత్తిని బెట్టుకొను లోభము దీనికి కారణము. ఈ లోభము వలన నేనును, నాకంటె నాతోడివారలును ఎక్కువ వగచిరి.

వెస్టుగారి ఉత్తరము రాఁగనే నేటాలుకు బయలుదేఱితిని. పోలకుగారి కీ సంగతి యంతయుఁ దెలిపితిని. అతఁడు నన్ను వీడ్కొ—

ల్పుటకు స్టేషనుకడకు వచ్చి రస్కిన్ రచిత మగు 'అన్ టు ది లాస్ట్' అను గ్రంథమును నాచేతఁ బెట్టి 'ఈ గ్రంథము ప్రయాణ ములో చదువుటకు బాగుండును, మీకుఁ జాల రుచించును' అని చెప్పెను.

పుస్తకము విప్పితిని, మాయఁజాలకపోతిని. అది నా మనస్సును ఆకర్షించెను. జోహాన్సుబర్గునుండి నేటాలుకు ౨౪ గంటల ప్రయాణము. రైలు రాత్రికి డరబను చేరెను. ఆరాత్రి నాకు నిదురపట్టలేదు. ఆ గ్రంథములోని పద్ధతుల ప్రకారము నా జీవితమును ద్రిప్పికొను ఏర్పాటు చేసికొంటిని.

ఇంతకుముందు నేను రస్కిను వ్రాసిన పుస్తక మొక్కఁడేని చదువలేదు. విద్యార్థిదశలో బడిపుస్తకములు తక్క వేఱు పుస్తకముల నే నెఱుఁగను. కర్మభూమిలో కాలుపెట్టిన పిదప నాకు తీరికయే లేదు. కావున నేఁటివఱకు నాకుఁగల పుస్తకజ్ఞాన మత్యల్పము. అనా యాసముగాఁ గాని, బలపూర్వకముగాఁ గాని జరిగిన యీ సంయ మమువలన నా కెట్టి లోటును కలిగిన దనుకొనను. నా చదివిన కొలఁది పుస్తకములను నేను చక్కగా జీర్ణము చేసికొంటి ననఁగలను. నా చదివిన కొలఁది గ్రంథములలో నా జీవితమును క్రియాపూర్వక ముగా మార్పు చేయించిన దీ గ్రంథమే. పిదప దీనిని నేను గుజరాతీ లోనికి అనువదించి 'సర్వోదయ' మను పేరున ప్రకటించితిని.

నా లోపల నే వస్తువు లుండెనో వాని ప్రతిబింబములు ఈ రస్కిను గ్రంథరత్నములోఁ గానఁబడుటచే నది నన్ను వశపఱచికొని దానిప్రకారము నన్ను నడిపించె నని నా నమ్మకము. మనలోపల నున్న భావనలను మేల్కొలుపఁ గల శక్తి కలవాఁడే కవి. కవు లందఱు

ప్రభావము అందఱిపైనిని ఒకరీతిగా నుండదు. ఏలయనఁగా అందఱి భావనలును ఒకరీతిగా నుండవు.

సర్వోదయసిద్ధాంతములు నాకు ఇటు లర్థమాయెను:

౧. అందఱి మేలులో తన మేలు.

౨. వకీలుపనికిని, మంగలవానిపనికిని వెల సమానమే. ఏలనఁగా బ్రతుకు తెఱఁగు రెరువురకు నొకటియే.

3. కూలివాని జీవనమును, కర్షకుని జీవనమును సత్య జీవనములు.

మొదటి సిద్ధాంతము నే నెఱుఁగుదును. రెండవదానిని కొంచె ముగా నెఱుఁగుదును. మూడవది ఇంతవట్టు నా కచుంబితము. రెండు మూడవ సిద్ధాంతములలోని విషయములు మొదటి సిద్ధాంతములో అంతర్గతము లని సర్వోదయమువలననే తేటపడును. తెల్లవారుట తోడనే వీని ననుసరించి నా జీవితమును మలచుకొనఁ బ్రయత్నము చేసితిని.

౧౮

ఫినిక్సు-స్థాపన

తెల్లవాఱుటతోడనే మున్ముందట వెస్టుగారికీ సంగతి చెప్పితిని. సర్వోదయప్రభావము నన్నెట్టులు మార్చినదియు తెలిపితిని. ఇండియన్ ఒపినియన్ పత్రిక నొక పొలమునకు మార్చి అచట మన సహచరుల మందఱమును నివసించి జీవికకు మాత్రము ధనము గొని సేద్యము చేసికొనుచు తీరికలో ఇండియన్ ఒపినియన్ పని చేయుద మని నా యభిప్రాయ మెఱింగించితిని. వెస్టుగారి కిది బాగుండెను. ప్రతిమనుష్యునకును భోజనవ్యయమునకుఁగాను తక్కువలో తక్కువగా మూడుపౌను లని నిర్ణయించితిమి. ఇందు నలుపు తెలుపు భేదము లేదు.

కాని అచ్చుపనివారు పది పదియేవురు కలరు. కాని అడవిలో నుండుట వీ రందఱకును సమ్మత మగునా యని ఒక సంశయము. భోజనవ్యయముమాత్రమే పుచ్చుకొని నివసింతురా యని మఱియొక సంశయము. కాని, ఎవ రిట్లుండఁజాలరో వారు మామూలు జీతములనే గొనుచు నివసింపవచ్చు ననియు, వీరును పిదప పిదప నీ యాదర్శమునకు వచ్చి ఆశ్రమమునందు ఉండిపోవలయు ననియు మే మిరువురమును ఆలోచించి తేల్చితిమి.

పనివాండ్రందఱతో ఈ సంగతి ముచ్చటించితిని. మదనజిత్తుగారిష్టపడరైరి. 'ఇది వట్టి తెలివిమాలిన పని. సర్వస్వమును ధారపోసిన యీ కార్యము మట్టిలో కలిసిపోవును. మరియు ఇండియన్ ఒపినియన్ పడిపోవును. ప్రెస్సుకూడ మూలఁబడును. పనివారందఱు పాఱిపోదురు' అని వారికి భయమెత్తెను.

౧౯. ఫీనిక్సు స్థాపన

మా యన్నకుమారుఁడు ఛగన్‌లాల్ గాంధి ఈ ప్రెస్సులో పని చేయుచుండెను. వెస్టుగారికిఁ జెప్పునపు డితనికిని జెప్పితిని. ఇతనికి సంసారభారము కలదు. చిన్ననాఁటనుండియు నితనికి నాకడఁ బనిచేయుచుండుటయే ఇష్టము. నాపై నతనికి దొడ్డ విశ్వాసము. కావున నితఁడు మాఱుమాట లేక వల్లె యని నాఁట నుండియు నాతోడనే యుండిపోయెను.

మూఁడవవాఁడు గోవిందస్వామి. ఇతఁడు ముద్రాయంత్రమును నడుపువాఁడు. ఇతఁడును ఇయ్యకొనెను. తక్కినవా రొప్పుకొన లేదు గాని ముద్రాయంత్రముతోపాటు వత్తు మనిరి.

ఇటులు పనివారలతో మాటలాడుటకు రెణ్ణాళ్లకంటె నెక్కుడు పట్టినటులు లేదు. 'డర్బను సమీపమున స్టేషనుకు దగ్గఱగా నొక స్థలము కావలసియున్నది' అను నొక ప్రకటనను వెంటనే పత్రికలో ప్రకటించితిని. ఫీనిక్సులో స్థలము కలదని తెలియవచ్చెను. వెస్టు గారును, నేనును చూడఁబోయి యేడురోజులలో ఇరువది యెకరములు కొంటిమి. అం దొక చిన్న నీటిబుగ్గ కలదు. కొన్ని మావులును నారింజలును గలవు. దానికి అంటుకొని మఱియొక అరువది ఎకరముల భూఖండ మున్నది. అందు ఫలవృక్షము లెక్కుడు. ఒక ప్రాఁత యిల్లుకూడ నం దున్నది. కొంతకాల మయిన పిదప దానినిఁగూడఁ గొంటిమి. ఈ రెండు తునకలును గలిసి వేయి పౌనులు.

ఇట్టి సాహసకార్యములలో సేఠ్ పారసీ రుస్తుంజీగారు నాకు తోడు. నా యీ పని యతనికి నచ్చెను. ఇతఁడు తన గిడ్డంగులమీఁది టిన్ రేకులు మొదలగువానిని ఇచ్చెను. బోయరుయుద్ధమున నాతోఁ బనిచేసినకొందఱు వడ్రంగులును, తాపీపనివారును నాకు సహాయులై కారఖానా పెట్టిరి. ఒక్క నెలలో ముద్రాలయము తయారాయెను. దానిపొడవు ౭౫ అడుగులు; వెడలుపు ౫౦ అడుగులు. వెస్టు మొదలగు వారు తాము కష్టించి వడ్రంగులతోపాటు ఉండిరి.

ఫినిక్సులో గడ్డి ఎక్కువ. ఆబాధు తిన్నగా లేదు. ఇందు పాములు మొదలగువాని ఉపద్రవము కలదు; భయమును కలదు. మొదట మేము డేరాలు వేసికొని ఉండఁదొడఁగితిమి.

ముఖ్యకార్యాలయము పూర్తి కాఁగనే ఒక యేడురోజులలో సామానులను గాడీలమీఁద వేసి ఫినిక్సుకు పోయితిమి. అది డరబనుకు ౧౪ మైళ్లు; స్టేషనుకు ౨½ మైళ్లు. ఇటులు స్థలమును మార్చుట వలన ఇండియన్ ఒపీనియన్ పత్రిక ఒకతూరి మెర్క్యూరీ ప్రెస్సులో ముద్రణ చేయింపవలసివచ్చెను.

ధనార్జనమునకు నాతోఁగూడ ఇండియానుండి వచ్చి యాయా వ్యాపారములోనున్న నా బంధుమిత్రులను ఫినిక్సులో చొప్పించుటకు ప్రయత్నింప దొరకొంటిని. వా రందఱును ధనము నార్జింపఁ గోరి దక్షిణ–ఆఫ్రికాకు వచ్చిరి. వీరికి నచ్చఁ జెప్పి తీసికొనివచ్చుట కడుఁ గష్టపుఁ బని; కాని కొందఱకు నామాట ఇష్టమాయెను. ఇట్టి వారిలో మగనలాల గాంధీ పేరు ఏఱి తీసికొందును. ఏలన: మిగిలిన వారు కొలఁదిమాత్రమే ఫినిక్సునందుండి మరల ద్రవ్యసంచయమునకు లేచిపోయిరి. మగనలాలగాంధీమాత్రము తన పనులు విడిచి నాకడకు వచ్చెను. నేఁటివఱకు నాకడనే యుండెను. మరియు తనబుద్ధిబలమున, త్యాగశక్తివలన, అనన్యభక్తివలన నా ఆంతరికపరీక్షలలో నాకు సహచరుఁడై యుండెను. నామూలసహచరులలో అందఱికన్న నితని స్థానము మొదటి. స్వయంశిక్షితులగు శిల్పులలోఁగూడ నా యుద్దేశమున నితఁ డద్వితీయుఁడు.

ఈరీతిగా ౧౯౦౪ సంవత్సరమున ఫినిక్సు నెలకొల్పఁబడెను. మరియు విఘ్నములు కష్టములు వచ్చుచున్నను ఫినిక్సు-సంస్థయు, ఇండియన్ ఒపీనియన్ పత్రికయు నేఁటికిని నడుచుచున్నవి. కాని ఈసంస్థ నారంభించిననాఁటి కష్టములు, అప్పటి ఆశలు, ఆశాభంగములును వినఁదగినవి. వేఱు ప్రకరణమున ఆ విషయమునుగూర్చి ముచ్చటింతును.

౨౦

తొలిరేయి

ఫీనిక్సునందు ఇండియన్ ఒపినియన్ యొక్క మొదటి అంకమును ముద్రించి పంపుట సులభము కాలేదు. రెండు విషయములలో నేను జాగ్రత్త వహింపనిచో ప్రథమసంచిక ఒకవారము ఆపవలసివచ్చెడిదో, లేక కొంచెము ఆలస్యమయ్యెడిదో. ఈ సంస్థయందు ఎంజినుతో నడుపఁబడు యంత్రములు మొదలగువాని నుంచుట నాకు అంతగా ఇష్టముకాదు. మనము కర్షకులమై చేతిపనినే కోరుకొనినపుడు చేతితో నడపఁబడిన పనిముట్టులనే పెట్టుకొనవలయు నని నాయూహ. కాని అప్పుడది సాగునటుల తోఁపలేదు. కాఁగా ఆయిల్ ఎంజినును పెట్టితిమి. కాని ఎపుడేని ఈ నూనెమర ఆడకుండినచో అపుడు పని జరుగుట కొరకు చేతిమరనుగూడ పెట్టుట మేలని వెస్టుగారికి చెప్పితిని. వెస్టుగారు నామాట విని చేతితో త్రిప్పఁదగు చక్రము నొకటిగూడ నేర్పాటు చేసిరి. ఇండియన్ ఒపినియన్ పత్రిక యొక్క ఆకారము దైనికపత్రికవలె పొడవును వెడల్పును. పెద్దమర ఆఁగిపోవుచో ఇంత పెద్ద ఆకారముగల పత్రికను వెంటనే అచ్చొత్తింప వీలుండదు. కావున పత్రిక అపుడపుడు ఆఁగిపోవచ్చును. ఈ చిక్కును తొలఁగించుటకు, చిన్నపన్నాతో చిన్నమరమీఁద నడపుటకు వీలుగా పత్రిక ఆకారమును తగ్గించితిమి.

ఆరంభకాలమునందు ఇండియన్ ఒపినియను పత్రికను ప్రకటించునాఁటి ముందురాత్రి మాకందఱకును జాగరణము చేయవలసివచ్చెడిది. పత్రికలు మడఁచుటకు చిన్నలనక, పెద్దలనక అందఱమును పదిగంటలనక, పండ్రెండుగంటలనక పనియగువఱకు కూర్చుండు

వారము; కాని తొలిరేయి మఱపురాదు. చట్రము మరపై బిగింపఁబడెను; కాని ఎంజిను బిగిసెను. నడవనని మొరాయించెను. ఎంజినును సరిచేసి సాగించుటకు ఎంజనీయరును పిలిపించితిమి. అతఁడును. వెస్టుగారును పనిచేసిరిగాని వృథా. అందఱును చింతాయుక్తులై కూరుచుండిరి. తుదకు వెస్టుగారు ఆసలుడిగి నాకడకు వచ్చి కనులు తుడుచుకొనుచు 'నేఁడిఁక ఎంజిను నడచు నాస లేదు. ఈ వారమునాఁటి పత్రికను సకాలమునకుఁ బంపఁజాలము' అని పలికెను.

'సరియె. అందులకు మనము కనులు తడుప నక్కఱలేదు. ఇంకేమేని యుపాయ మున్నచోఁ జేసి చూతము. ఆఁ; ఆ చేతిచక్రమే మయినది?' అనుచు నే నతని నూఱడించితిని.

'ఆ చక్రము ద్రిప్పుటకు మనకడ మనుష్యు లేరీ? మన మందఱ మేకమయినను దానిని తిప్పలేము. దానిఁ ద్రిప్పుటకు తడవకు నలుగురితోఁ జరుగును. పోనీ మన వాండ్రో అనినచో వా రందఱు నలసి యున్నారు.' అని వెస్టుగా రనిరి.

ఇఁకను వడ్రంగ మంతయు కాలేదు. కాన వడ్రంగు లందఱు ముద్రాలయముననే నిద్రించు చుండిరి. నేను వారిదెసఁ జూపి—'వీరుగో వడ్రంగులు! మనము వీరి సాయము గొనరాదా? మన మీ రాత్రి యంతయు మేలుకని ముద్రణోపాయము చూతము. ఈ కర్తవ్య మింకను బాకీయున్న దనిపించుచున్నది'.

'వడ్రంగులను లేపి వీరి సాయము వేఁడుటకు నాకు ధైర్యము చాలదు. మఱియు మనవారుకూడ నలసి యున్నారు, వారినిమాత్ర మెటులు లేపను?' అని వెస్టుగా రనిరి. 'అది నా పని' యని నే నంటి. 'అటులగుచో మనము ఒడ్డెక్క వచ్చును.' అని వెస్టుగా రనిరి.

నేను వడ్రంగులను లేపితిని. వారి సాయము వేఁడితిని. వారిని బతిమాలవలసిన పని లేకపోయెను. వా రిటు లనిరి: 'మే మిట్టి చిక్కని నక్కలకు రానిచో మనుష్యులమా! మీరు పడుకొనుఁడు. మేము గుఱ్ఱములవలె పనిచేసెదము. మా కది యొక లెక్క కాదు.'

మరియు అచటి యచ్చుపనివాండ్రు గూడ సిద్ధులయియే యుండిరి.

అపుడు వెస్టుగారికి సంతోష మాఁగలేదు. అతఁడు పని చేయుచుఁ జేయుచు భజనకీర్తన లారంభించెను. నేనును వడ్రంగులలో కలిసితిని. మిగిలినవారును ఒకొక్క వరుసగా తిప్పఁ దొడఁగిరి. ప్రొద్దున ఏడు కొట్టిరి. ఇంకను చాల పని మిగిలి యుండెను. 'ఇపు డింజనీయరును లేపుచో!, ఈ పగటివెలుఁగున చూచిన బాగుండను. మీఁదట ఎంజిను నడచుచో మన పని సమయమునకు నెఱవేఱఁగలదు' అని నేను వెస్టుగారితో నంటిని.

వెస్టుగారు ఎంజినీయరును లేపిరి. అతఁడు లేచి నిలువఁబడి ఎంజినుగదిలోని కేఁగెను. కదపఁగనే ఎంజిను నడవఁదొడఁగెను. ప్రెస్సు హర్షనాదముతో మాఱుమ్రోఁగెను. 'ఈ తెలివి రాత్రి ఎక్కడికి పోయెను! రాత్రి ఎంతమంది కొట్టుకొన్నను మొద్దువలె కదలలేదు. ఇపుడు చేయి వేయఁగనే ఏమియు ఎఱుఁగనటులుం పరుగెత్తఁదొడఁగెను' అని అంద అనఁ దొడఁగిరి.

అపుడు వెస్టుగారో, ఎంజినీయరో ఇటులు జవాబు చెప్పిరి: 'దీనికి ఉత్తరము చెప్పుట కఠినము. యంత్రములుఁగూడ మనవలె విశ్రాంతి గోరును. అపుడపుడు వీని స్థితి యిటులు కనుపట్టును.'

ఎంజిను నడవకపోవుట మాయందఱకును పరీక్షయనియు, మఱి సమయమున నది నడచుట పరిశుద్ధమగు మాపనికి శుభఫలమనియు నాకుఁ దోఁచెను.

పత్రిక నియతవేళకు స్టేషనుకు వెళ్లెను; మే మందఱము నిశ్చింతుల మయితిమి.

మా పట్టుదలకు ఫలముగా పత్రికకు నియమ మేర్పడెను. ఫీనిక్సునందు స్వయంసహాయతావాతావరణ మారంభమాయెను. తరువాత బుద్ధిపూర్వకముగా ఎంజినును విడనాడి దృఢతాపూర్వకముగా చేతిచక్రముతో పని నడపిన యుగ మొకటి ఈ సంస్థాజీవనములో ప్రవేశించెను. అది ఫీనిక్సుజీవనమునందు కడు దొడ్డయగు నైతికకాల మని నా యుద్దేశము.

౨౧

పోలాకుగూడ దిగెను

ఫినిక్సులో ఆ సంస్థను స్థాపించిన పిదప కొలఁది కాలమే నేనం దుండఁగలుగుట యొక విచారకారణము. దాని స్థాపించు సమయమున అచట నుండవలయు ననియు, అచటనే నా పొట్ట గడపుకొనవలయు ననియు, వకాలతు విడనాడవలయు ననియు, అచటనే యుండి నాచేతనయిన సేవ చేయవలయు ననియు, నాసేవయంతయు ఫినిక్సు-సాఫల్యమునందే పర్యవసింపవలయు ననియు నాకోరిక. కాని, ఈ కోరికలు గొంతెమ్మకోరిక లాయెను. నే ననుకొనున దొకటి, జరుగున దొకటి. ఇది మొదటినుండియు నా కనుభవము. తా నొకటి తలంచిన దైవ మొకటి తలంచుఁగాక! సత్యసాధనముగాని, సత్యోపాసనముగాని ఉద్దిష్టమగునెడల మనుజుని ప్రయత్నములు భగ్నములయినను అవి అకుశలములుగా పరిణమింపవు. మరియు కొన్ని వేళల మనము తలపోయునంతకన్న నెక్కువ మేలొనఁగూర్పుటయు నా కనుభవము. ఫినిక్సునందు తలఁపని తలంపుగా కలిగిన పరిణామములును, తలఁపని తలంపుగా ఫినిక్సునకుఁ గలిగిన స్వరూపమును నే మనుకొనినంత మేలుతరములు కావు కాని అకుశలములుఁ మాత్రము కావని నిక్కముగాఁ జెప్పఁగలను.

ఎవరికి వారు పనిపాట లొనరించి పొట్ట జరుపుకొనవలయు నని నాయుద్దేశము కావున అచ్చుకూటమునకు దాపుగా నున్న పొల మొకొక్కనికి మూఁడేసి యెకరములవంతున పంచిపెట్టఁబడెను. అం దొక చీలిక నావంతునకు వచ్చెను. ఇష్టము లేకున్నను టిన్‌రేకుల యిండ్లను వేసికొంటిమి. రైతులవలె పూరియిండ్లలోఁగాని, ఇటుక

యిండ్లలోఁగాని యుండుటయే మాకిష్టముగాని అది నెఱవేఱలేదు. దానికి దీనికన్న వ్యయము హెచ్చు; కట్టుటకు కాలమును హెచ్చు. 'ఎపు డిండ్లు తయారగునా? ఎపుడు పనిపాటలు చేసికొందమా?' అని అందఱును తొందరపడిరి.

మనసుఖలాల్ నాజరుగారే నాఁటికిని ఇండియన్ ఒపినియన్ పత్రికకు సంపాదకులుగా నున్నను వారు మాలో కలియలేదు. వీరికి డరబనులో నిల్లు కలదు. డరబనులో ఇండియన్ ఒపినియన్ పత్రిక కొక చిన్న శాఖ కలదు.

అచ్చుకూటమునందు జీతము గొని పనిచేయు కంపోజిటరులుం ఉన్నను ఈ సంస్థలో నున్నవా రందఱును అక్షరములు కూర్చుట మొదలగున వన్నియు నేర్చుకొనవలసియుండు రని సంకల్పింపఁబడెను. ఏలనఁగా ఈ పని చాల తేలికయేగాని ఇది కాలమును చాల గ్రహించును. కావున తొఁగడ నీ పని నెఱుఁగనివా రందఱు నిపుడు నేర్చిరి. నేనీ పనిలో నందఱికన్న కనిష్ఠుఁడనేగాని మగనలాల్ గాంధీ మాత్ర మందఱికన్న జ్యేష్ఠుఁడు. తన శక్తి తనకుఁ దెలియ దని మగనలాల్ గాంధీ విషయమున నాయుద్దేశము. ఇతఁ డిదివఱ కెన్నఁడును అచ్చుపని యిసుమంతయు నెఱుఁగకున్నను చిటికలో నొక గొప్ప కంపోజిట రయిపోయెను; వడిలోఁగూడ దాఁటిపోయెను. ఇతఁ డింత కొలఁదికాలములో అచ్చుపను లన్నిటిలో ప్రావీణ్యము సంపాదించి నన్ను ఆశ్చర్యచకితుని జేసెను.

మే మింకను కాలు నిలఁద్రొక్కుకొనలేదు. గృహనిర్మాణ మింకను పూర్తికాలేదు. ఇట్టి స్థితిలో నాకీ నూతన కుటుంబమును విడిచి జోహాన్సుబర్గు వెళ్లవలసివచ్చెను. అక్కడి పను లన్నియు పలుకాలము పాడువెట్టి యుంచుటకు నా కవకాశము లేకపోయెను.

౨౧ పోలాకుగూడ దిగెను

జోహాన్సుబర్గుకు వచ్చి పోలాకుగారితో ఈ గొప్ప మార్పు నంతయుఁ జెప్పితిని. తా నొసఁగిన పుస్తకమువలనఁ గలిగిన యీ పరిణామము వినఁగా నతని యానందమున కొక యెల్ల లేకపోయెను. 'అందు ప్రవేశించుటకు నాకును వీ లుండునా?' అని అతఁ డాసక్తితో నడిగెను.

'లేకేమి? తప్పక వీలుండును' అని నే నంటిని.

'మీరు ఊఁ యనుచో నే నిపుడే తయారు' అని పోలాకుగా రనిరి.

ఇతని దార్ఢ్యము నన్ను ముగ్ధుని గావించెను. తనను తనపనిలో నుండి ఒక నెలలో విడుదల చేయుఁడని క్రిటిక్ పత్రికాసంపాదకునకు నోటీ సిచ్చి నెల వయినపిమ్మట నతఁడు ఫినిక్సు చేరెను. తన కలుపుగోలుతనముచే నందఱకును మంచివాఁడై యతఁడు మాకుటుంబములో నొకఁ డయిపోయెను. నిరాడంబర జీవనము చాలఁ బ్రియముగుటచే ఫినిక్సులో నుండుట ఇతనికి ఇనుమంతయుఁ గష్ట మనిపింపక స్వాభావికమును, ఇష్టతరమును ఆయెను.

కాని నే నతని నెంతో కాల మచట నుండనీయ లేదు. రిచ్ గారు సీమకు వెళ్ళి లాను ముగించుకొని రాఁదలఁచెను. ఆఫీసుపని యంతయు నాయొక్కనివలన తేలదు. కావున ఆఫీసులో నుండుమనియు, వకీలుగా తయారగు మనియు పోలాకుతోఁ జెప్పితిని. అతఁడు వకీలుగా తయారయిన పిదప తుదకు మే మిరువురమును ఫినిక్సులో నుండిపోవచ్చు నని నాయభిప్రాయము.

నాయభిప్రాయము లన్నియు తుదకు తలక్రిందు లయిపోవుట నిక్కము. తన నమ్మినవారితో నిసుమంతయు వాదింపక వారితో

ననుకూలముగఁ బోవు మంచితనము పోలాకుగారిలోఁ గలదు. 'మీకే జీవనము మేలి దని తోఁచునో నాకును దానినే సుఖము. నే నీ యాశ్రమమును వికసింపఁ జేయఁగల ననుకొందును. అయినను నే నచటికి వచ్చుచో మన యాదర్శములు త్వరగా ఫలించు నని మీ యభిప్రాయ మగునెడల నే నిదె వచ్చితిని' అని నాకు పోలాకుగారు వ్రాసిరి. నే నీయుత్తరమునకు సంతసించితిని. పోలాకుగారు ఫీనిక్సును వీడి నాయాఫీసులో పని చూడఁ దొడఁగెను.

ఆసమయముననే స్కాచ్ థియాసఫీ స్టాకఁడు నాకడ లాపరీక్షకు తయారగుచుండెను. అతనినిగూడ పోలాకుగారి ననుకరింపు మంటిని. అతనిపేరు మేకిన్ టాయర్.

నే నిటులు ఫీనిక్సుయొక్క ఆదర్శములను వడిగా సిద్ధింపఁ జేయు శుభచింతలో నుంటిని. కాని దీనికి భిన్నమగు జీవనమునందు తగులుకొని ఒకనాఁటికంటె మఱియొకనాఁడు లోఁతు లోఁతులకుఁ బోవుచుంటిని. దైవసంకల్ప మింకొకవిధముగా నుండనిచో నిరాడంబరజీవన మను నీ మోహజాలములోనే చిక్కుపడియుందును.

నేనును, నా యాదర్శములును కల్పన కందని రీతిగా నెటులు సంరక్షింపఁబడెనో తెలుపుటకు కొన్ని ప్రకరణములు పట్టును.

౨౨

రాముఁడే రక్షకుఁడు

దేశమునకు వడిగా వెళ్లఁగల నని కాని, వెళ్లి దేశమున స్థిరపడఁగల నని కాని ఆశ పెట్టుకొనలేదు. ఒకయేఁడాదిలో తిరిగి వత్తునని నాభార్యకు బాస యిచ్చితిని; ఏఁడాది గడచెను గాని మరలుమాట కానరాలేదు. పిదప ఆలుబిడ్డలను రావించుకొన నిశ్చయించితిని.

బిడ్డలు వచ్చిరి. వారిలో రామదాసును ఉన్నాఁడు. ఓడలో నితనికి కెప్టెనుతో మిగుల చనవాయెను. ఇతఁడు కెప్టెనుతో నాడుకొనుచు చేయి విఱుగఁగొట్టుకొనెను. కెప్టెను కడు జాగ్రత్తతో ఓడ వైద్యునిచే కట్లుగిట్లు కట్టించెను. జోహాన్సుబర్గునకు వచ్చువఱకు నితనిచేయి బద్దలతో కట్టఁబడి రుమాలులో పొట్లముగా వ్రేలాడుచుండెను. స్టీమరులోని డాక్టరు చాల మంచివాఁడు. ఇంటికి వెళ్లఁగనే మంచివైద్యునిచే కట్టు కట్టింపుమని అతఁడు చెప్పియుండెను.

అపుడు నాకు మృచ్చికిత్సపై చాల మురిపు. నా అనార్య వైద్యమునందు నమ్మకము గలవారిచే నేను మృజ్జలవైద్యమును చేయించుచునే యుంటిని. ఇఁక రామదాసునకు వేఱువైద్య మెటులు? అతనికి ఇంచుమించు ఎనిమిదేండ్లు. 'నేను నీగాయమునకు కట్టు కట్టెదను; నీకు భయములేదు కదా' అని నే నతని నడిగితిని. అతఁడు నగుచు కట్టు మని నా కనుజ్ఞ యిడెను. అతనికి మంచిచెడుగు లేర్పఱించుకొను శక్తిలేదు కాని కూరగాయల వైద్య మేదో, మంచివైద్య మేదో తెలియును. ఇంతియకాక అతనికి మాయింటి వైద్యము తెలి

యెను. నాయెడల నతనికి నమ్మకము కావున దీనివలన నితనికి కొంచె మేనియు బెదురు పుట్టలేదు.

నేను కట్టు విప్పితిని. అపుడు నాచేయి వడఁకుచుండెను. గుండెలు కొట్టుకొనుచుండెను. గాయము కడిగి మట్టి పట్టీ వయిచి వెనుకటివలె కట్టు కట్టితిని. ఈరీతిగా నెల గడచువఱకు గాయము మానిపోయెను. డాక్టరు కట్టుకట్టినను నెలకుఁగాని మానుపట్టదని స్టీమరు- వైద్యుఁడు చెప్పెను.

దీనిచే గృహవైద్యమునెడల నా నమ్మకమును, దానిని చేసి చూడవలయుననెడు సాహసమును వృద్ధిపొందెను. ఈపిదప నావైద్యశోధనకు విషయము లెక్కుడాయెను. గాయములు, జ్వరములు, అజీర్ణము, కామిల యీ మొదలగు రోగములు కలస్త్రీపురుషులచే చేయించితిని. చాలవట్టు మేలు కలిగెను. కాని నాకు నేఁ డానాఁటి నమ్మకము లేదు. ఇంతియు కాక ఈప్రయోగములలో ఆపద గలదని అనుభవమయినది.

ఈప్రయోగముల నిచటఁ దెలుపుట అవి తప్పక పనిచేయు ననుటకుఁ గాదు. ఇట్టి దేదియు తప్పక పనిచేయు నని నామతము కాదు. డాక్టరులును తమప్రయోగములగుఱించి అటులు తెలుపఁజాలరు. కావున వీనిని గూర్చి చెప్పు నాయుద్దేశ మిది: ఎవరీక్రొత్త ప్రయోగములను చేయఁగోరుదురో వానిని తమమీఁదనే ప్రయోగించుకొని చూడవలయును. ఇటు లొనరించినయెడలనే సత్యము వడిగా ప్రకాశమొందును. మరియు ఇట్టి ప్రయోగములను చేయువారికి ఈశ్వరుఁడే వైద్యుఁడై కాపాడును.

మృచ్చికిత్సలో నెట్టి చిక్కులు కలవో తెల్లవారి సాంగత్యములోను అట్టి చిక్కులు కలవు. ఈ రెంటను ఒకటియే భేదము. ఈ తుదిచిక్కులను నేను లెక్కగొనలేదు.

పోలాకుగారిని నాకడకు రమ్మంటిని. అతఁడు వచ్చి నాయనుఁగుఁదమ్మునివలె నుండఁజొచ్చెను. పోలాకుగారికి చాల దినములక్రిందనే ప్రధానము జరిగెను గాని వివాహ మింకను గాలేదు. ఉచితసమయమున వివాహము చేసికొందమని వారిరువు రనుకొనిరి. కాని డబ్బు కూడఁబెట్టుకొనినపిదప పోలాకుగారు పెండ్లి చేసికొన నెంచిరని నే ననుకొంటిని. నాకంటె వీరికి రస్కిను గ్రంథపఠనమనన మెక్కువ. కాని పాశ్చాత్యవాతావరణమునందు రస్కిను చెప్పిన చొప్పున జీవనమును సరిగా మార్చుకొనుట మిగుల కష్టపడినఁగాని సమకూరదు. ఒకనాఁడు పోలాకుగారితో నే నిటు లంటిని: 'హృదయమున ప్రేమ నాటుకొనిన పిదప కేవలము ద్రవ్యాభావముచే వియోగమును సహించుటుచితము కాదు. ఇటులనుచో నిరుపేద లెవ్వరికిని పెండ్లాడఁ జాలరు. మరియు ఇపుడు మీరు నాకడనే యుంటిరికదా! కావున ఇంటిరొక్కమునకు వెతుకుకొన నక్కఱలేదు. మీ కుచితమని తోఁచుచో పెండ్లాడుఁడు.'

పోలాకుగారి కెన్నఁడును ఒకమాటను రెండుమాఱులు చెప్పఁబని కలుగలేదు. వడిగా నామాట వీరికెక్కెను. పోలాకుగారికి కాఁబోవు నిల్లాలు సీమలో నుండెను. ఆమెకు ఉత్తరము పోయెను. ఆమె యియ్యకొనెను. ఒకనెలలోఁగా పెండ్లిఁజేసికొన జోహాన్సుబర్గు వచ్చెను.

పెండ్లికిఁ గొంచెమైనను ఖర్చు లేదు. మామూలు వస్త్రములే గాన వస్త్రములకును వ్యయము లేదు. మంత్రతంత్రములకును అవశ్యకత లేదు. పోలాకుగారి యిల్లాలు క్రైస్తవి. పోలాకుగారు యూదులు. వారిరువురికిని సామాన్యమయినది నీతిధర్మము.

ఈ వివాహసమయమున మనోరంజకమగు నొక ప్రసంగము జరిగెను. ట్రాన్సువాలులోని పెండ్లిండ్ల రిజిస్ట్రారు నల్లవారల పెండ్లిండ్లను రిజిస్టరు చేయఁడు. నేను పెండ్లిపెద్దను. మేము కోరుచో పెండ్లిపెత్తనమున కొక తెల్లవాఁడు దొరకకపోఁడు గాని పోలాకు గారి కిష్టము లేదు. కావున మేము మూవురమే రిజిస్ట్రారుకడకు వెళ్లితిమి. ఈ పెండ్లికి మధ్యస్థుఁ డొక నల్లవాఁడఁట! పెండ్లి చేసికొను వారు తెల్లవారఁట! వారు తెల్లవారే యని రిజిస్ట్రారు ఎటులు నమ్మను? కావున 'నేను విచారించిన పిదపఁగాని రిజస్టరుచేయ'నని అతఁడనెను. మఱునాఁడాదివారము నాఁడు కిసిమిసి పండుగ. పెండ్లి పనులన్నియు ఆయెను. పెండ్లి రిజస్టరు చేయుటకీ రీతిగా వాయిదా పడుట సహింప నశక్య మాయెను. నేను పెద్ద మేజస్ట్రీటు నెఱుఁగు దును. అతఁడీరిజిస్ట్రేషనుడిపార్టుమెంటున కధికారి. నే నీ దంపతులను వెంట నిడికొని అతనిముందర హాజరయితిని. అతఁడు నవ్వి చీటి వ్రాసి యిచ్చెను. పెండ్లి రిజస్టరులో పడెను.

నేఁటివఱకు మాయింట నున్నవారెల్లరును తెల్ల మగవారే. ఇపు డొక యపరిచితయగు నొక తెల్లయామె మాయింట విడిసెను. నాకును వీరికిని విఱుపులు కలిగిన గుఱుతులేదు. పలుజాతులవారును, పలుప్రకృతులు గలవారును వచ్చిపోవుచుండునట్టిది మాయిల్లు. నా భార్య కిఁకను ఇట్టియెడ ననుభవము తక్కువ. అట్టియెడ వీరి కించుక కలియకపోవుచో నది యంత ఆశ్చర్యము కాదు. సజాతీయులచేతను, విజాతీయులచేతను కలగూరగంప యగు మాయింట నేదేని మాట పుట్టుచో నది సజాతీయకుటుంబములో పుట్టుదానికన్న నెక్కుడయినది కాదని చెప్పవచ్చును. అదియు అతి సాధారణము. ఈ సజాతీయ విజాతీయ భేదము మన మనోభ్రాంతి. వాస్తవమునకు మే మందఱము ఏకకుటుంబములోని వారము.

౨౨ రాముఁడే రక్షకుఁడు

ఇఁక వెస్టుగారి వివాహమున్మాత్ర మిచట నేల చెప్పరాదు? ఈసమయమున బ్రహ్మచర్యమును గుఱించి నా మనస్సు పరిపక్వము కాలేదు. కావున బ్రహ్మచారులగు మిత్రుల కందఱకును పెండ్లిండ్లు చేయించుట నాపని. వెస్టుగారు తలిదండ్రులఁ జూడఁబోవ సమకట్టిరి. 'పెండ్లి చేసికొని మఱి రం' అని వీరికి నే సలహా ఇచ్చితిని. ఏలనఁగా, ఫీనిక్సున మే మందఱ మిండ్లు కట్టుకొంటిమి. మరియు మే మందఱ మును కర్షకుల మయితిమి. కావున పెండ్లి యనినఁ గాని, వంశవృద్ధి యనినఁ గాని మాకు భయంకరము కాదు.

వెస్టుగారు లెస్టరులో నొక సుందరిని పెండ్లాడి వెంటఁదీసికొని వచ్చెను. ఈమె తలిదండ్రులు మొదలగువారు లెస్టరులో చెప్పులు కుట్టు నొక పెద్ద ఫాక్టరీలో పనివారు. ఆమెకును అందు కొంత అనుభవము కలదు. ఈమెను నేను సుందరి యంటిని. ఏలయన నేను గుణారాధకుఁడను. మనుజులకు సత్యమయిన సౌందర్య మేది? గుణము. వెస్టుగారు తన యత్తగారిని గూడఁ దీసికొనివచ్చిరి. ఈవృద్ధు నేఁటికిని జీవించియున్నది. ఈమె తన పూనికచేతను, ఎప్పుడును నవ్వుచుండు స్వభావముచేతను మాకు సిగ్గు కలిగించెడిది.

ఇటు తెల్ల మిత్రుల పెండ్లిండ్లు చేయించుచు, అటు నల్ల మిత్రులను మీమీ నాలుబిడ్డలను దీసికొని రండని ప్రోత్సహించుచుంటిని. అచట నయిదారు హిందూస్థాని కుటుంబములు కాఁపుర ముండి పెంపొందఁదొడఁగెను.

౨౩

ఇంటి దెస

డర్బనులో నున్న యింటిలో కొంత మార్పు చేయవలసి యున్నది. కాని అచట ఖర్చు ఎక్కువ. ఇపుడిపుడే మితవ్యయము మొదలాయెను. ఇంక జోహాన్సుబర్గులో సర్వోదయగ్రంథము ననుసరించి పరివర్తనము చేయవలసినది బోలెఁడు.

ఒక బారిష్టరు ఇంటిలో ఎంత ఖర్చు తగ్గింపవచ్చునో అంత ఖర్చును తగ్గించితిని. అయినను కుర్చీలు, బెంచీలు మొదలగు కొంత సామగ్రి లేనిచో పనులు సాగవు. సత్య మగు నిరాడంబరజీవనము మనసునందు పెరిఁగెను. కొన్ని పనులు స్వయముగా చేసికొన పట్టుదలకలిగెను. పిల్లలనుగూడ ఆరీతిగనే తయారుచేయ దొరకొంటిని.

బజారు రొట్టెను కొనుట మానితిని. కూనీ చెప్పిన రీతిగా పులియఁబెట్టని గోదుమ పిండితో చేతి రొట్టెలు చేసికొనఁ దొడఁగితిమి. ఈరొట్టెలకు మిల్లులలో పిండి పనికి రాదు. చేతితో విసరిన పిండి ఆరోగ్యకరము. వెలయు తక్కువ. కావున ఏడు పౌను లిచ్చి ఒక చేతిమరను కొంటిని. దీనిచక్రము కడు బలువు. త్రిప్పుట కొకనికి బలువు; ఇరువురికి సులువు. నేనును, పోలాకుగారును, బాలురును ముఖ్యముగా ఈ చక్రమును త్రిప్పుచుందుము. అపుడపుడు కస్తూరబాయియు, తరుచుగా ఆమెకు ఈసమయము వంటవేళ. మిసెస్ పోలాకుగారు ఇపుడు చక్రము త్రిప్పుటకు వచ్చుచుండిరి. ఈ కసరతు పిల్లలకుఁ జాల మేలు. ఈపనినిగాని,మఱియొక పనినిగాని నేనెపుడును పిల్లల నెత్తిపైఁ బెట్టను. కాని వా రది యొక ఆటగా చక్రమును త్రిప్ప వచ్చుచుండిరి. అలసట కలుగఁగనే వారికి సెలవు. పిల్లలును,

ముందు చెప్పఁబోవు నింకకొందఱును నాతోపాటు పని చేయకుండ లేదు. నాకడ పెద్దబ్బాయిలు లేకపోలేదుగాని, వారిలో పలువురు కడు నుల్లాసముతో పనిచేసిరి. 'అబ్బో, అలసట అయినది' అని చెప్పువారు కొలఁదిమంది అని గుర్తు.

ఇంటి బాగుచేత కొక నౌకరు కలఁడు. అతఁడును మాకుటుంబములో నొకఁడుగా నుండెను. పిల్ల లెల్లరు నతనికి సాయము చేయుచుందురు. పాకీవాఁడు వచ్చి మలమును ఎత్తుకొనిపోవుచుండును. మఱుఁగు దొడ్డి కడుగుట, ముంగిలి మొదలగువానిని కడుగుట ఈపనులను నౌకరునెత్తిపై నిడక, అతఁడు చేయునని ఆశపెట్టుకొనక మేమే చేయుదుము. ఇట్టిపనులు మేమే చేసికొనుటవలన పిల్లలకు అలవాటును, పరిశ్రమయు కలిగెను. దీనికి ఫలముగా నాపిల్లలకు మలము నెత్తుటలో రోఁత పోయెను. మరియు ఆరోగ్యమును గుఱించిన సామాన్య నియమములను సులభముగ గ్రహింపఁగలిగిరి. జొహాన్సుబర్గులో సామాన్యముగా జబ్బనుమాటలేదు. ఎపుడేని వచ్చుచో పిల్లలు సేవచేయుచుండువారు. వారి కీపని యన్న నుత్సాహముగూడ మెండు.

వీరికి నే నక్షరజ్ఞానము కలిగింపఁ బ్రయత్నము చేయలేదనఁ జాలను గాని దానిని త్యాగము చేయించుటలో సంకోచింప లేదు. కావున నా కొమరులు నాపై నేరము మోపిరి; కొన్నిమాఱులు తమ అసంతుష్టినిగూడ కనఁబఱచిరి. ఈయెడ కొలఁదిగా నా దోషమొప్పుకొందును. వీరి కక్షరజ్ఞానము కలిగింపవలయు నని నాకు చాల కోరికయుండెను. ప్రయత్నముగూడఁ జేసితిని. కాని యిందులకెప్పుడు నేదో యొక విఘ్నము తగులుచునే వచ్చెను. ఇంతియకాక, యింటికడ వీరి కెవరిచేతనేని చదువు చెప్పించు ప్రయత్నము జరుగలేదు. వీరిని నాతో నడిపించి ఆఫీసుకు తీసికొని పోవుచుంటిని. ఆఫీసు ౪½ మైళ్లదూరము. ఇది వారికిని నాకును ఖురళీకేళి* యయ్యెడిది. నడచుచు నడచుచు వీరికి చెప్పుచుంటిని. అదియును నాతోఁ

---

* కసరత్తు.

గూడ మఱియొక మిత్రుఁడు నడచి రాకున్నపుడే. వారు ఆఫీసులో క్లయంట్లతోడను, గుమాస్తాలతోడను చనవుగా నుండెడివారు. నేను ఏదేని చెప్పుచో చదువుకొనెడివారు, ఇటు అటు తిరుగాడువారు. బజారునుండి యేదేని కావలయుచోఁ దెచ్చిపెట్టుచుండెడు వారు. సర్వజ్యేష్ఠుఁడగు హరిలాలుగాక మిగిలినవారెల్లరును ఈరీతిగనే పెంచఁబడిరి. హరిలాలు దేశమునందే యుండెను. నేను ప్రతిదినమును నియమముగా నొక గంటచొప్పున వీరికిఁ జదువు చెప్పుచు వచ్చినచో రావలసినవిద్య వీరికి వచ్చెడిది. నేనిటులు చేయఁజాలక పోయినందులకు నాకును, నాకుమారులకుఁగూడ నీవిషయమయిన చింత ఉండనే యుండెను. హరిలాలు తన యసంతుష్టిని పలుమాఱులు నాకడనే చెప్పెను. పలువుర యెదుటఁగూడఁ బ్రకటించెను. మిగిలినవారు ఉదారతతోఁజేకొని ఈ దోష మనివార్య మని తలపోసి దీనిని సైరించిరి. దీనికిఁగాను నాహృదయమున పశ్చాత్తాపము లేదు; కాని యేమేని యున్నచో నది నే నాదర్శమగు తండ్రిని కాననియే. కాని లోకసేవ కొఱకు వీరియక్షరజ్ఞానము నాహుతి చేసితి నని నాయభిప్రాయము. దీనికి మూలము అజ్ఞానమైన నగుఁగాక అది సద్భావపూర్ణమయిన దని నే ననఁగలను. నేను వారిచరిత్రమును తిన్నగాఁ జూచుటలో సోమరిని కాలేదు. ఇది తలిదండ్రులకు అవశ్యకర్తవ్యమని నాతలఁపు. నే నింత ప్రయత్న మొనరించియున్నను నాకుమారుల జీవనమునం దేదేని దోసఁగు కలదేని అది నాప్రయత్నలోపమువలన జరిగినది కాక మాదంపతుల దోషములకు ప్రతిబింబ మని నాయుద్దేశము.

బాలకులు తలిదండ్రుల రూపములకు మాత్రము కాక వారి గుణదోషములకుఁగూడ వారసు లగుదురు. చుట్టుప్రక్కల వాతావరణమువలన ననేకప్రకారములగు మంచిగుణములుగాని, చెడుగుణములుగాని వారి కలవడుట నిక్కమే కాని ప్రధానగుణముమాత్రము తండ్రితాతలనుండి సంక్రమించును. ఇట్టి సంక్రామకదోషమునుండి తప్పిం కొనఁగలిగిన బాలకుల నే నెఱుఁగుదును. ఇది ఆత్మయొక్క మూలస్వభావము. అది యీ దోషముల బలిగొనును.

౨౩ ఇంటిదేస

నాకుమారుల కింగ్లీషు చెప్పించు విషయమున నాకును, పోలాకు గారికిని పలుమారులు తీవ్రముగా సంవాదము జరుగుచు వచ్చెను. భారతీయులగు తలిదండ్రులు తమబాలురకు బాల్యమునుండియు ఇంగ్లీషు చెప్పించి ఇంగ్లీషు మాటలాడుట యలవఱతురేని వారు దేశమునకును, తమబిడ్డలకును ద్రోహము చేయువా రని మొదటినుండియు నాయభిప్రాయము. ఇట్టి బాలురు తమ జాతియొక్క ఆధ్యాత్మిక సాంఘిక జ్ఞానమునకు వారసులు కాలేకపోవుటయేకాక తమ దేశమునకును, జగత్తునకుఁగూడ సేవ చేయుటకు సరియగు నర్హతను కోలుపోవుచున్నారనియు నా యభిప్రాయము. కావున ఎఱిఁగియెఱిఁగియే నేను నా కుమారులతో మాగుజరాతియే మాటలాడుచుంటిని. పోలాకుగారి కిది యిష్టము కాదు. 'మీరు వారి భవిష్యమును పాడుచేయుచున్నారు. బాలురను పిన్ననాఁటనుండియు ఇంగ్లీషువంటి వ్యాప్తి చెందినభాషలో తరిఫీదు చేసినచో ఇప్పటి జీవనసంఘర్షమునందు మిగిలినవారికంటె నగ్రేసరులు కాఁగలరు' అని పట్టుదలతోను, ప్రేమతోను పోలాకుగారు వాదించిరి. నా కీ వాదము గొంతుక దిగలేదు. తుదకు, నావాదమే వారికి నచ్చెనో, లేక నాబండపట్టును జూచి వారే వాదింప మానిరో నా కిపుడు గుర్తుచాలదు. ఇది ౨౦ ఏండ్ల క్రింది ముచ్చట. అప్పటి నా యుద్దేశము లనుభవముతోపాటు వృద్ధి జెందెను. నాబాలుర కక్షరజ్ఞానము సంపూర్ణముగా లేకున్నను మాతృభాషలో సామాన్యజ్ఞానము సహజముగానే సంప్రాప్తమాయెను. దీనివలన వీరికిని లాభము కలిగెను, దేశమునకును గలిగెను. వా రిపుడు పరదేశులవలె నుండరు. వారికి సహజముగా రెండు భాషలు వచ్చెను. ఎక్కువమంది ఇంగ్లీషు మిత్రులతో సహవాసము ఉండుట చేతను, ఇంగ్లీషు ప్రధానభాషగా నున్న దేశమున నుండుట చేతను వారు సులభముగా ఇంగ్లీషు చదువను వ్రాయను నేర్చికొనిరి.

౨౪

జులూ 'తిరుగుబాటు'

ఇల్లు కట్టుకొనిన పిదపఁగూడ స్థిరముగా నొకచోటున నుండఁగలుగుట నాయదృష్టములో వ్రాయఁబడియుండలేదు. జోహాన్సుబర్గులో మే మందఱము ప్రోఁగయి నివసింప మొదలిడితిమి. ఇంతలో తలవని తలంపుగా నొక ఘటన జరిగెను. నేటాలులో జులూలు తిరుగుబాటు చేసి రని సమాచారము వచ్చెను. జులూలయెడల నాకు ద్వేషము లేదు. వా రేభారతీయునకేని అపకారము చేసియుండలేదు. తిరుగుబాటునెడఁగూడ నాకు సందియమే. కాని ఆసమయమున ఇంగ్లీషుపరిపాలనము లోకకల్యాణమున కని నేను భావించుచుంటిని. నాకు దానియెడ దొడ్డభక్తి. దాని క్షయము నా కిష్టము కాదు. కావున బలమును ఉపయోగించుటలో నీతి యనియు, అనీతి యనియు విచారించుటలు నన్నడ్డగింపలేదు. నేటాలుకు ఏదేని ఆపద వచ్చినచో తన్ను రక్షించుకొనుటకు స్వయంసేవకసేన కలదు. ఆపత్సమయములయందు ఇందు భారతీయులనుగూడఁ జేర్చికొందురు.

నాకు నేటాలుతో చాల సంబంధ ముండుటచే నేనును నొక నేటాలువాసి నని యనుకొనుచుంటిని. కావున 'అక్కఱ పట్టుచో గాయపడినవారికి పరిచర్య చేయుట కొక హిందూస్తానీ సేవకసేనను తీసికొనివచ్చుటకు తయారుగా నున్నా' నని గవర్నరుకు ఉత్తరము వ్రాసితిని. గవర్నరు వెంటనే యంగీకరించెను. ఇంత యనుకూలముగా, మరియు నింతవడిగా నుత్తరము వచ్చునని నే ననుకొనలేదు. నే నతనికి ఉత్తరము వ్రాయకముందే నా పనిని నేను చేసికొనియే యుంటిని. గవర్నరు నాప్రస్తావమును అంగీకరించినచో జోహాన్సుబర్గులోని సంసార మెత్తివేయఁ దలఁచితిని. పోలాకుగారు వేఱొక చిన్న యింటిని మాటాడుకొని యుండుదురు. కస్తురబాయి

ఫినిక్సులో నుండును. కస్తూరిబాయియు నిందులకు సంపూర్ణముగా నంగీకరించెను. ఇట్టి పనులలో నా మాట కెన్నఁడు నెదురాడి యున్న గుర్తు లేదు. గవర్నరుకడనుండి జాబు రాఁగనే ఇంటివాని కొకనెల నోటీ సిచ్చితిని. కొంతసామాను ఫినిక్సు వెళ్లెను; కొంత పోలాకుగారికడ నుండెను.

డర్బను వెళ్ళి నేను మనుష్యులను పోగుచేయ మొదలిడితిని. అందులకు పలువురతో పని లేదు. మే మిరువది నలుగురము తయారయితిమి. అందు నేను గాక నలుగురు ఘూర్జరులు. మిగిలినవారు గిరిమిట్-ముక్తులగు దాక్షిణాత్యులు. ఒకడు పఠాను.

ఛీఫ్ మెడికల్ ఆఫీసరు నన్ను టెంపొరరీ సార్జంటు మేజరును జేసెను. నాయిచ్ఛగించిన మఱి ముగ్గురను సార్జంటులఁ జేసెను. మఱియొకనిని కార్పొరల్ చేసెను. సరకారువారే మాకు దుస్తు లిచ్చిరి. పనిచేయువారి గౌరవము రక్షింపఁబడు టొకటి, పనులు తేలికగా జరుగుట రెండు, ఇట్టి పదవు లొసంగుట రివాజగుట మూడు, దీనికి ప్రయోజనములు.

ఈ దళము ఆఱువారముల దాఁక సంతతము పనిచేసెను. 'తిరుగుబాటు' చేసిన తావునకే నరిగి చూచితిని. అచట తిరుగుబాటను మాటయే కానరాదు. ఎదురుగా వచ్చువాఁడే లేఁడు. దీనిని తిరుగుబా టనుటకుఁ గల కారణ మిది: క్రొత్తగా తమపై విధింపఁబడిన పన్ను ఈయవల దని ఒక జులూసరదారు జులూలకుఁ జెప్పెను. ఆ పన్ను వసూలుచేయుట కొక సార్జం టచటికి వెళ్లెను. వానిని పట్టుకొని కొట్టిరి. ఇది జులూ తిరుగుబాటు. అయిన దాయెను; నా హృదయము జులూల దెస నుండెను. మేము ప్రధానకార్యాలయము కడ కరిగితిమి. జులూవారిని సేవింప మమ్ము నియమించిరి. దీన నాకు మఱికొంచె మానందము కలిగెను. 'గాయపడిన ఈ జులూలకు తెల్లవారు సేవచేయుట కిష్టపడుటలేదు. నే నేకాకి నేమి చేయఁగలను? వీరి గాయములు క్రుళ్ళినవి. మీరు వచ్చితిరి, మేలాయె. నిరపరాధు

లకు వీరి యెడల నీశ్వరునకుఁ గృప గలిగెఁ గావలయునని వైద్యాధికారి మాకు స్వాగత మొసఁగెను. ఇటుపై నతఁడు మాకు పట్టీలును, పురుగులను జంపు నీరును ఇచ్చి గాయపడినవారికడకు మమ్ముఁ గొంపోయెను. మమ్ముఁ జూడఁగనే వారికి ప్రాణములు లేచివచ్చెను. తెల్ల సోల్జరులు వారికిని మాకును నడుమ నున్న కటకటాలనుండి తొంగి చూచుచు, కట్టు కట్టవలదని మమ్ము నిషేధించుచు జులూలను బూతులు తిట్టెడివారు. ఆ తిట్లకు మేము చెవులలో వేళ్లు దోపుకొనెడివారము.

క్రమక్రమముగా నాకీ తెల్లసిపాయిలతో పరిచయమాయెను. పిదప వారు మమ్ము నివారింప మానుకొనిరి. ఆ సేవలో ౧౯౦౬ సంవత్సరమున నాతో ఘోరముగా విరోధించిన కర్నల్ స్పార్క్స్ అను వారును, కర్నల్ వాయులీగారును గలరు. నే నీ పనిలో నుండుటఁ జూచి వారు చకితు లయిరి. వారు నన్ను ప్రత్యేకముగా పిలిచి ధన్య వాదములు సలిపి జనరల్ మెకెంజీగారికడకుఁ గొంపోయి వారితో నాకుఁ బరిచయము కలిగించిరి.

వీ రందఱును అసలు సైనికు లని పాఠకులు తలఁపకుందురుగాక! కర్నల్ వాయలీగారు ప్లీడరు. కర్నల్ స్పార్క్స్‌గారు ఒక కసాయిదుకాణమున కధిపతి. జనరల్ మెకెంజీ గారు నేటాలునం దొక ప్రసిద్ధభూస్వామి, కర్షకుఁడును. వీ రెల్లరును స్వయంసేవకులే. స్వయంసేవకు లగుటకుఁ గాను సైనికశిక్షను, అనుభవమును వీరు సంపాదించిరి.

నే ముపచరించు రోగులు యుద్ధమున గాయపడినవారు కారు. అనుమానముచే వీరిలో నొక జట్టు చెఱసాలలోఁ బెట్టఁబడెను. జనరలుగారి యాజ్ఞవలన వీరు కొరడాలచేఁ గొట్టఁబడిరి. ఆ దెబ్బలవలన వీరికి గాయములాయెను. చూచువారు లేకపోవుటచే నవి కుళ్ళి నీరు గాఱఁదొడఁగెను. ఇఁక రెండవ జట్టు. వీరు జులూ లయినను తెల్లవారికి మిత్రులు. మిత్రులని తెలియుటకు వీరికి చిహ్నము లున్నవి. ఉన్నను పొరపాటుచే తెల్ల సిపాయిలు వీరిని కాల్చిరి.

౨౮ జులూ 'తిరుగుబాటు'

ఇంతియ కాక తెల్లసిపాయీలకు మందు తెచ్చుటయు, ఇచ్చుటయు నాపని. డాక్టర్ బూత్ గారి చిన్న ఆసుపత్రిలో నొక సంవత్సరము నేను పని చేసియుండుట పాఠకులకు గుర్తుండియుండును కావున నా కీ పని తేలిక యయ్యెను. దీన నాకు పలువురు తెల్లవారితో పరిచయ మాయెను.

కాని యుద్ధస్థలమున కరిగిన సేన యొకచో నిలువదు. అక్కఱఁగల చోటుల కెల్ల నది పరుగిడుచుండును. వీరిలో పలువురు ఆశ్వికులు.

మా పౌజుగూడ వారి వెనుక డోలీలతో బయలుదేరెను. ఒకనాఁడు రెండు మూఁడు మాఱులు నలుబది మైళ్ళవఱకు పోవలసి వచ్చెను. మే మెచటి కేఁగినను భగవత్కార్యము. జులూమిత్రులు పొరపాటునఁ గాల్వఁబడిరి. వారిని డోలీలలో నెక్కించుకొని మోసికొని పోయి ఉపచారము చేయవలసియుండెను.

౨౫.

హృదయమథనము

జులూ తిరుగుబాటువలన నాకుఁ జాల ననుభవములు కలిగెను. ఆలోచించుటకును జాల సామగ్రి దొరకెను. బోయరు యుద్ధమును జూచినపుడును నా కింత చేటు భయ మనిపింపలేదు. ఇది యుద్ధము కాదు. మనుష్యుల వేఁట. ఇది కేవలము నాయూహయే కాదు. పలువురు తెల్లవారల యూహయు నిదియే. ప్రొద్దుటినుండియుఁ గుండ్లప్రోఁత టపాకాయల ప్రోఁతవలె వినఁదెంచును. సైనికులు ఊళ్ళమీఁదికిఁ బోయి గుండ్లు విడుతురు. ఈ శబ్దములు వినుచు నచట నుండుట నాకుఁ జాలఁ గష్ట మనిపించెను. ఈశ్వరకృపచే మా కీ పని దొరకెను. విశేషించి జులూల పరిచర్య. కావున మే మీ విషము నెటులో మ్రింగితిమి. మే మీ పనికిఁ బూనుకొననిచో మఱియెవ్వరును నీ పని చేయ రని నాకు నమ్మకమే. కావున నాయంతరాత్మను శాంతపఱచికొంటిని.

ఆ దేశమున ఆబాదు కడుఁ దక్కువ. కొండలందును, లోయలందును అచటనచట మంచివారును, అమాయకులును అగు అనార్యులని చెప్పఁబడు నీ జులూల గుడిసెలు తక్క నచట మఱి యేమియును లేవు. అది యంతయుఁ జూడ నింపయిన ప్రదేశము. ఇట్టి శూన్య ప్రదేశమున గాయపడినవారి నెక్కించుకొనిన డోలీతోఁ గాని, వట్టి డోలీతోఁ గాని పలుమైళ్ళు పయనించునపుడు నామనస్సు అనేకవిషములగు దీర్ఘాలోచనలలో మునిఁగిపోవుచుండెడిది.

అచట బ్రహ్మచర్యమును గుఱించిన నా యాలోచన పరిపక్వ మాయెను. నాసహచరులతో దీనిగుఱించి చర్చించితిని. కాని యీశ్వర దర్శనమునకు బ్రహ్మచర్య మనివార్య మని నా కప్పటికి తోఁచినటులు

స్పష్టముగా గుఱుతు లేదు. లోకసేవ కిది యనివార్యమే యని యెఱింగికొనినటులు నాకు విస్పష్టముగా గుర్తే ఇట్టి సేవ దినదినమును ఇతోధికముగాఁ జేయవలసివచ్చువనియు, నేను భోగవిలాసములందు, బిడ్డల గనుటయందు, కన్నవారిని పెంచుటయందు తగులకొనియుందు నేని సంపూర్ణముగా సేవ చేయఁజాల ననియు నాకుఁ దెలియును. నేను రెండు గుఱ్ఱములమీఁద దౌడు తీయలేను. ఈసమయమున నాభార్య చూలాలయి యున్నయెడల నేను ఇంత నిశ్చింతమగు మనస్సుతో నీ సేవాకార్యములోని కుఱికియుండను. బ్రహ్మచర్యము లేక కుటుంబవృద్ధి కోరుచు సమాజసేవ చేయు టనునది పొసఁగని మాట; పెండ్లిచేసికొనియు బ్రహ్మచర్య మవలంబించినచో కుటుంబసేవకును, సమాజసేవకును విరోధము కాఁజాలదు. నే నీ విచారమున మునిఁగి తేలి తుదకు బ్రహ్మచర్యవ్రతముఁ బూనుటకు తొందరపడితిని. ఈ యాలోచనలచే నా కొకయానందము కలిగెను. ఉత్సాహమును అమితమాయెను. ఈసమయమునందు భావన సేవాక్షేత్రమును చాల విశాల మొనరించెను.

ఈ యాలోచన యింకను నామనస్సునందు వృద్ధి చెందుచుండెను. శరీరమునకు పనియు నుండెను. ఇంతలో 'తిరుగుబాటు అడఁగిపోయెను' అని వార్త వచ్చెను. ఇఁక మాకు సెలవు. ఆ మఱునాఁడే 'మీ రిండ్లకు పోవచ్చు' నని హుకుము వచ్చెను. కొలఁది రోజులలోనే మే మందఱమును మామా యిండ్లకు అరిగితిమి. తరువాతఁ గొలఁది నాళ్ళలోనే మాసేవకు ధన్యవాదము లర్పించుచు గవర్నరుగా రొక యుత్తర మంపిరి.

ఫినిక్సు వచ్చిన తరువాత బ్రహ్మచర్యమునుగూర్చిన నా యాలోచనమును చగనలాలు, మగనలాలు, వెస్టు మొదలగువారికిఁ జాల నుత్సాహముతోఁ జెప్పితిని. అది యందఱకును నచ్చెను. అందఱకును

బ్రహ్మచర్యముయొక్క ఆవశ్యకత తెలిసెను. కాని దీని ననుష్ఠించుట అందఱకును కష్టమని తోఁచెను. కొందఱు ప్రయత్నము చేయ సాహసించిరి. ఇందు కొందఱు సఫలతఁ జెందిరనికూడ నే నెఱుఁగుదును

ఆ సమయమున జీవనపర్యంతము బ్రహ్మచర్యమును పరిపాలింతు నని నేనును శపథము చేసితిని. ఈ వ్రతమహాత్త్వమును, దీని కాఠిన్యమును ఆనాఁడు నాకు చక్కగా గోచరింపలేదు. దాని కాఠిన్యమును నేను నేఁటికిని అనుభవించుచునేయుంటిని. దానితోపాటు దానిమహత్త్వమును ప్రతిదినమును ఒకనాఁటికంటె నొకనాఁ డెక్కువగా గోచరించుచునే యుండెను. బ్రహ్మచర్యము లేని జీవనము శుష్కము, మఱి పశుజీవనము. పశువు సహజముగా నిరంకుశము. తన యిచ్ఛచే తనమీఁద నంకుశ ముంచుకొనుటయందే మనుష్యుని మనుష్యత్వ మున్నది. ధర్మగ్రంథములలో బ్రహ్మచర్యస్తుతిని జూచి నే నత్యుక్తి యనుకొంటిని. కాని అది యుచిత మనియు, ననుభవసిద్ధ మనియు నేఁడు ప్రతిదినమును స్పష్టముగా తెలియవచ్చుచున్నది.

ఇంత మహాఫలము గల బ్రహ్మచర్యము సులభసాధ్యము గాదు; కేవలము శారీరకమును గాదు. శారీరకనిగ్రహముతోడనే బ్రహ్మచర్య మారంభ మగుచున్నది. శుద్ధబ్రహ్మచర్యమునందు తలఁపుగూడ తప్పు. పూర్ణబ్రహ్మచారి కలలో నైన తలఁపఁడు. ఎంతవఱకు కలలు వచ్చుచుండునో, కలలయందును వికారము ప్రబలుచుండునో అంతవఱకును బ్రహ్మచర్యము కొఱఁతయే యని తెలియవలయును.

బాహ్యేంద్రియ నిగ్రహముగూడ చాలఁ గష్టమే యని నా యభిప్రాయము. బ్రహ్మచర్యవిషయమున నిర్భయుఁడ నని నేఁడు నేను చెప్పుకొనవచ్చును. కాని తలఁపునెడ నింకను చాల జయము కలుగవలసి యున్నది. నా ప్రయత్నములలో లోపము లేదు. కాని

యెచటినుండి యరుగుచుండునో నాయెఱుక లేకయే ఆ తలఁపులు నా మీఁద సవారు చేయుచుండెను. తలఁపులనుగూడ వశపఱచు తాళపుఁ జెవి మనుజునికడ నున్నదని నే నెఱుఁగుదును. కాని ఆ తాళపుఁ జెవిని ఎవరికి వారే వెదుకుకొనవలయును, తమ యనుభవములను తమ వెనుకవారి కిచ్చిపోయిన మహాపురుషులు మనకు మార్గదర్శకులు. వారు పరిపూర్ణులు కారు. పరిపూర్ణత పరమేశ్వరునిది. కావున భక్తులు తమ తపశ్చర్యచే పవిత్ర మొనరించి రామనామాది మంత్రములను మన కిచ్చిపోయిరి. మనము మనలను సంపూర్ణముగా ఈశ్వరున కర్పించుకొననిచో ఎన్నఁటికిని తలఁపుల దాఁటఁ జాలమని నాకు నమ్మకము సమస్త ధర్మగ్రంథములందును నే నిట్టి వచనములను చదివి యుంటిని. బ్రహ్మచర్యమును మిగుల జాగ్రత్తతో కాపాడుకొను సందర్భములందు దీని సత్యమును చవి చూచితిని.

రాఁబోవు ప్రకరణములలో బ్రహ్మచర్యమునకు నా పడ్డ పాట్లు కొన్ని తెలిపెదను. కావున ఈ ప్రకరణాంతమున 'ఆ మొదటి బులుపాటములో ఈ వ్రతపాలనము సులభముగాఁ గానిపించె' నని యింతమాత్రమే తెలుపుదును. వ్రతము తీసికొనఁగనే భార్యతో ఏకశయ్యయును, ఏకాంతసేవయు వదలిపెట్టితిని. ఇదియే నాచేసిన మార్పు. ఈవిధముగా ౧౯౦౦ సంవత్సరమునుండియు ఇచ్ఛతోడను, అనిచ్ఛతోడను నడచుచుండిన ఈ బ్రహ్మచర్యము ౧౯౦౬ సంవత్సరము మధ్యమున వ్రత మాయెను.

౨౬

సత్యాగ్రహోత్పత్తి

ఈ నా యాత్మశుద్ధి సత్యాగ్రహమునకు నిమిత్త మగునటుల కొన్ని కొన్ని విషయములు జోహాన్నెస్బర్గునందు సంభవించుచుండెను. నేను బ్రహ్మచర్యవ్రతమును గైకొనువఱకు నాజీవితము నందలి ముఖ్యఘటనలన్నియు మెల్ల మెల్లగా సత్యాగ్రహమునే సృజించినటులు నే నిపుడు గ్రహింపఁ గలుగుచున్నాను. సత్యాగ్రహ మను శబ్దము పుట్టుటకు ముందు సత్యాగ్రహ మను పదమున కర్థమగు వస్తువు పుట్టియుండెను. అది పుట్టినపుడు 'ఈ వస్తు విట్టిది' అని నేను నెఱుఁగను. దీనిని జెప్పవలసినపుడు గుజరాతీలో 'పేసివ్ రిజిస్టెన్స్' అను ఇంగ్లీషుపదమునే వాడుచుంటిమి. ఒక తెల్లవారి సభలో ఈ 'పేసివ్ రిజిస్టెన్స్' అనునది సంకుచితార్థబోధకముగా వాడఁబడుచున్నదనియు, ఈ వస్తువు బలము లేనివారి కేదుగడయనియు, ఇందు ద్వేషమునకుఁ గూడ తా వున్నటులు కానిపించు ననియు, తుదకిది హింసలో పరిణమించు ననియు తెలిసికొని ఈ శబ్దము భారతీయుల సంగ్రామముయొక్క సత్యరూపమును గోచరింపఁ జేయ లేదని చెప్పవలసివచ్చెను. కావున నొక క్రొత్తశబ్దమును గూర్ప వలసివచ్చెను.

నా కొక స్వతంత్రశబ్దము తట్టలేదు. ఈ యర్థమును దెల్పు శబ్దమును వ్రాయఁగలవారికి బహుమతి యీయఁబడు నని ఇండియన్ ఒపీనియనులో ప్రకటించితిని. మగన్‌లాల్ గాంధీ* 'సత్ + ఆగ్రహ' అను నీ రెండు పదములను మేళవించి 'సదాగ్రహము' అను నీ సమస్త

---

* సత్ = సత్యమునందు, ఆగ్రహము = పట్టుదల.

పదమును బనాయించి బహుమతి పొందెను. తరువాత ఈ సదాగ్రహ శబ్దమును మిగుల స్పష్టము చేయనెంచి 'య' అను నక్షరమును జోడించి నేను దీనిని 'సత్యాగ్రహము' అని మార్చితిని. నాఁటి నుండియు గుజరాతుభాషలో నీపదము నేఁటిపోరాటమందు రూఢ మాయెను.

ఈ పోరాటముయొక్క ఇతిహాసమే దక్షిణ-ఆఫ్రికాలోని నా జీవితముయొక్కయు, విశేషించి సత్యశోధనము యొక్కయు ఇతిహాసము. ఈ యితిహాసములో చాలభాగము యేరవడ చెఱయందు వ్రాసితిని. మిగిలినది విముక్తుఁడ నయినపిదప వ్రాసితిని. అదియంతయు నవజీవన పత్రికయందు క్రమక్రమముగా ప్రకటింపఁబడి తుదకు దక్షిణ-ఆఫ్రికా సత్యాగ్రహేతిహాస మను పేరున పుస్తకముగా ప్రకటింపఁబడెను. దీనిని కరంట్ థాట్ పత్రికకు శ్రీ వాలజీ గోవిందజీ దేసాఈగారు ఇంగ్లీషులో తర్జుమా చేయుచున్నారు. ఇదిగూడఁ గొన్నాళ్లలో పుస్తకముగా ప్రకటింప నేర్పాటు జరిగెడిని. * దానిఁ జదివినచో దక్షిణ-ఆఫ్రికాలోని నా సత్యశోధనలు తెలియును. అచటి నా సత్యాగ్రహ మెఱుఁగని ఘూర్జరులా గ్రంథమును తిలకింతురు గాక! దాన వ్రాయఁబడిన యంశములను వదలి దానఁజేరని కొన్ని క్రొత్త సంగతులను ముందరి ప్రకరణములలో పూర్తిచేసి పిదప భారత దేశమునందలి నాశోధనలను పాఠకులకు పరిచయము గావింప నిచ్ఛగించుచున్నాను.

ఈ పరిశోధనల వరుస తెగకుండఁ జదువఁ దలఁచుకొనువారు దక్షిణ-ఆఫ్రికా-ఇతిహాసమునుగూడ తమ ముందు ఉంచుకొందురు గాక!

---

* దీని ఆంగ్లానువాదము యస్. గణేశన్ కంపెనీవారిచే (ట్రిప్లికేన్, మదరాసు) పుస్తకముగా ప్రకటింపఁబడెను.

౨౮

ఆహార పద్ధతి శోధనములు

మనోవాక్కాయములచే బ్రహ్మచర్యపాలనమును గురించిన యాలోచనయు, ఆత్మశుద్ధిచే సత్యాగ్రహ సమరమునకు ఎక్కువ శక్తులను వినియోగించుటను గురించిన యాలోచనయు, ఈ రెండే సాధనములు. ఈ రెండాలోచనలును నా భోజనమున మిగుల సంయమమును, మిగుల మార్పును ప్రేరేపించెను. వెనుకటి మార్పు ఆరోగ్యమునకు, ఇప్పటి మార్పు ధర్మమునకు.

ఇందు ఉపవాసమును, అల్పాహారమును ఎక్కువ తావు నాక్రమించెను. లోపల విషయవాసన యున్నవారికి జిహ్వాచాపల్య మెక్కుడు. నాకును జిహ్వాచాపల్యము కలదు. జననేంద్రియమును, స్వాదేంద్రియమును నిగ్రహించుటకుఁ జాలఁ బ్రయాసపడితిని గాని వానిని పరిపూర్ణముగా నిగ్రహింపఁగలిగితి నని నేఁటికిని చెప్పుకొనఁ జాలను. నేను తిండిపోత ననియే తలఁతును. నామిత్రులు నాతిండిని జూచి సంయత మనుకొనెడివారు గాని అది యటులు కాదు. నేను చేయఁగలిగినంత నిగ్రహమును చేయకున్నచో నేను పశువుకన్న పాడై యీపాటికే నాశము నొందియుందును. నాలోపములు నాకుఁ జక్కగాఁ దెలియును. వానిని పోఁగొట్టుకొనుటకు మిగులఁ బ్రయత్నించితి ననియుఁ జెప్పఁగలను. ఈ కారణముననే నేను నేఁటిదాఁక ఈ శరీరము నీడ్చుకొనివచ్చుచు నా చేతనయిన పనిని చేయఁగలుగుచున్నాను.

నాలోపములు నాకుఁ దెలియుటవలనను, అనాయాసముగా అనుకూలమగు సాంగత్యము దొరకుటవలనను ఏకాదశిని ఉపవాసము

గాని, ఫలాహారమును గాని చేయ మొదలిడితిని. జన్మాష్టమి మొదలగు నితరతిథులందును వీనిని జేయఁబూనితిని. సంయమదృష్టితో ఫలాహారమునకును, అన్నాహారమునకును ఎట్టి భేదము లేదు. ధాన్యములను పేరఁ బరఁగు ద్రవ్యము లన్నిటియందే రుచి కలదో ఫలాహారమునందును ఆరుచి కలదు. అలవాటు పడినతరువాత ధాన్యముల రుచికన్న పండ్ల రుచియే యెక్కుడని పించును. కావున పర్వములందు ఉపవాసముగాని, ఏకభోజనము గాని మంచి దనుకొంటిని. మరియు ప్రాయశ్చిత్తాదుల కేదేని నిమిత్తములు సంఘటించుచో ఆనాఁ డేకభోజనము పెట్టుకొంటిని. దీన శరీరము స్వచ్ఛమగుటచే రసజ్ఞానమును అధికమాయెను. ఆఁకలియుఁ బెరిఁగెను. ఇది నా కనుభూత మాయెను. ఇటు లుపవాసాదు లొకవంక సంయమమునకును, ఇంకొకవంక భోగమునకును సాధనము లని కనుఁగొంటిని. ఇటీవలి నా యనుభవములు కొన్నియు, ఇతరుల యనుభవములు కొన్నియు పైవిషయమును సమర్థించెను. నా శరీరము పెరిఁగి బలిష్ఠముగా నుండవలయు నని నాకు కోరిక గలదు కాని నా ముఖ్యోద్దేశము సంయమము—నాలుకను కట్టివేయుట. కావున భోజ్యవస్తువుల మార్పఁగడఁగితిని. ముద్ద తగ్గింపఁ దొడఁగితిని. కాని రుచి—చాపల్యము—నాతోఁక పట్టుకొనియే వచ్చుచుండెను. ఒకవస్తువును విడిచి మఱియొక వస్తువును తినుచుంటిని. ఆక్రొత్తవస్తువుగూడ ప్రాఁతవస్తువుకంటె రుచిగా నున్నట్లు కనఁబడఁ దొడఁగెను.

ఈ పరిశోధనలలో నాకుఁ గొందఱు జొసట గలరు. వీరిలో హారమాన్ కేలన్ బెక్ గారు ముఖ్యులు. వీరినిగూర్చి దక్షిణా-ఆఫ్రికా-సత్యాగ్రహ చరిత్రమున సంపూర్ణముగా వ్రాసియుంటిని గాన మరల నిచట వ్రాయ దొరఁకొనను. ఉపవాసములందును, ఏకాహారములందును పెరమాఱుపులందును వీరు నాకు సబ్రహ్మచారులు.

సత్యాగ్రహసమరము ముక్కుపట్టులో నున్నపుడు నేను వీరియింట నుంటిని. మే మిరువురమును మార్పులను చర్చించుచు క్రొత్త మార్పులలో నెక్కువ చవి ననుభవించుచుంటిమి. నాఁడు వానిని గూర్చిన మామాటలుఁగూడ చవిగా నుండెడివి. వానిలో ఏమాటయుఁ జేఁదని పించెడిది కాదు. కాని రుచులలోఁబడి యిటులుమునిఁగిపోవుట తగని పనియని యిటీవల ననుభవమునకు వచ్చెను. ఏలన మనుజుఁడు తినుట రుచికొఱకుఁ గాదు, శరీరమును నిలుపుకొనుటకొఱకు. అన్ని యింద్రియములును శరీరమును, శరీరద్వారమున ఆత్మను సేవింపఁ దలఁచి పనిపాటలు చేయుచో అపుడు వానివానిపయి చవులు చప్పఁబడును. అప్పటినుండియు అవి తమ స్వాభావికమగు రూపమును బొంది తమ తమ పనులను నిర్వహించు నని వాక్రువ్వ నగును.

ఇట్టి స్వాభావికతను మేళవించుట కెన్ని లక్షల పరిశోధనలను చేసినను ఎక్కువ అనిపించుకొనవు. మరియు నిందులకు పెక్కు శరీరము లాహుతి యొనర్పవలసియున్నను అందులకు లెక్క చేయరాదు. కాని దీనికి ప్రవాహ మెదురునడచుచున్నది. నశ్వరమగు నీ శరీరమును సుశోభిత మొనరింపను, ఆయువును వృద్ధిఁబొందింపను మన మనేకప్రాణులను బలిగోరుచున్నాము. కాని మన మిటు లొనరించి శరీరాత్మలను రెంటిని చంపుకొనుచున్నాము. మన మొక రోగము నిర్మూలింపఁజేసికొనఁబోవుచు క్రొత్తక్రొత్త రోగములఁ దెచ్చుకొనుచున్నాము. ఇంద్రియభోగముల భుజించుట కుద్యమించుచు భుజించు శక్తినే కోలుపోవుచున్నాము. ఇది యంతయు మన కనులయెదుటనే జరుగుచున్నను మనము దానిని చూచుట లేదు. దీనికన్న నాశ్చర్య మేమున్నది!

ఈ భోజనపరిశోధనలను గుఱించి యింకను వ్రాయఁ దలఁతును. కావున వాని యుద్దేశమును, వాని గుఱించి నా విచారసరణిని పాఠకుల యెదుటికిఁ దెచ్చుట యావశ్యకమాయెను.

౨౮

కస్తురబాయిధైర్యము

కస్తురబాయికి ముమ్మాఱులు ప్రాణముమీఁదికి వచ్చెను. ముమ్మాఱులును గృహవైద్యముచేతనే బ్రతికి బయటఁబడెను. మొదటిమాఱు ప్రాణముమీఁదికి వచ్చినపుడు సత్యాగ్రహము జరుగుచుండెను. ఆమెకు మాటిమాటికి రక్తస్రావము కలుగుచుండెను. డాక్టరు మిత్రుఁడొకఁ డాపరేషను చేయింపుమని సలహా యిచ్చెను. కొంత గ్రంథము జరిగిన పిదప ఆమె ఆపరేషనుకు సమ్మతించెను. ఆమెశరీరము మిగుల క్షీణించి యుండెను. కావున డాక్టరు మత్తుమందీయక యాపరేషను గావించెను. దాన నామె కపుడు కడుబాధ కలిగెను గాని యామె పలుధైర్యముతో నోర్చుకొనెను. ఆ యోరిమి చూడఁగా నాకాశ్చర్యము కలిగెను. ఆపరేషను నిర్విఘ్నముగా నెఱవేఱెను. డాక్టరును, వారి ధర్మపత్నియు కస్తురబాయికి మిగుల నుపచారము చేసిరి.

ఇది డర్బనులో. రెండు మూఁడు దినములు గడచిన పిదప డాక్టరు 'ఇఁక భయము లేదు, మీరు జొహాన్సుబర్గు వెళ్లవచ్చును' అని మాకు సెలవొసఁగెను. నేము వెళ్లితిమి. కాని కొలఁదినాళ్లకే 'కస్తురబాయి యారోగ్యము సరిగా లేదు, మంచముమీఁదనుండి లేవ లేదు, ఒకతూరి స్పృహగూడ లేదు' అని వార్త వచ్చెను. నా యనుజ్ఞ లేక ఆమెకు సారా గాని, మాంసము గాని మందులోఁ గాని, ఆహారములోఁ గాని కలిపి యీయఁగూడ దని డాక్టరెఱుఁగు. అతఁడు నాకిటులు టెలిఫో నిచ్చెను—'తమ భార్యకు మాంసరసముగాని, మద్యముగాని యిచ్చితీరవలయును. నా కనుజ్ఞ యీవలయును.' నే నిటులు సమాధాన మిచ్చితిని—'నే ననుజ్ఞ యీఁజాలను. కస్తురబాయి

స్వతంత్ర. ఆమె యిపు డడుగఁదగిన స్థితిలో నున్నచో నడిగి ఆమె తీసికొనఁగోరుచో ఇమ్మనది.'

'రోగుల నే నిట్టిమాట లడుగను. మీరు స్వయముగా రండు! నా చెప్పిన వస్తువుల నామె కిచ్చుటకు మీ రంగీకరింపనియెడల మీ భార్యప్రాణములకు నేను పూచీపడను' అని మరల డాక్టరు తెలిపెను.

ఇది విని నేను వెంటనే డర్బను చేరితిని. డాక్టరును కలిసికొనఁగా నతఁ డిట్లనెను—'నేను మాంసరస మిచ్చియే మీకు టెలిఫోను చేసితిని.'

'అయ్యా! మీరు దగాకోరులు!' అని నే నంటిని.

'వైద్యునందు దగాలు గిగాలు లేవు. ఇట్టి సమయములలో రోగులను, వారి బంధువులనుగూడ దగాచేయుట పుణ్యమని మే మనుకొందుము. ఎట్లయినను రోగుల బ్రతికించుటయే మా ధర్మము.' అని డాక్టరు దిట్టముగా బదులాడెను.

దీనఁ గడు వగచితిని. కాని శాంతుఁడ నయియే యుంటిని. డాక్టరు నాకు నెచ్చెలి, సజ్జనుఁడు. ఇతఁడును, ఇతని భార్యయు మాకుఁ గడు నుపకరించిరి. ఇతని వర్తన సైరింప నెంచనయితిని.

'అయ్యా! ఇఁక దాఁచవలదు. ఇపు డేమి చేయవలయును? ఆమెయిచ్ఛ లేక ఆమెకు మాంస మీయ నొల్లను. మాంసము గొనకున్నఁ జచ్చిపోయినను మా కిష్టమే.'

'మీ వేదాంతము మాయింట సాగదు. మీభార్య మాయింట నున్నంతవట్టు మాంసముగాని, మఱి యేదిగాని యీవలసియున్నయెడల తప్పక యిత్తును. ఇట్లు మీ కిష్టము గానిచో మీభార్యను

మీరు తీసికొని పోవచ్చును. నాయింట నామె యీరీతిగా చచ్చు చుండఁగా నేఁ జూడఁజాలను.'

'నాభార్య నిపుడు తీసికొనిపోవలయు నని యామీ యాజ్ఞ ?'

'తీసికొని లేచిపొం డని నే నెన్నఁటికి ననఁజాలను. నాకు షరతొకటి అడ్డము పెట్టకుఁడు ! మా దంపతుల మిరువురము మా శక్తి కొలఁది పరిచర్య చేయుదుము. మీరు వెనుక చింత యేమియు లేక వెళ్లవచ్చును. ఈ చిన్న విషయమే మీ మతి కెక్కనిచో మీరు మీభార్యను మాయింటినుండి తీసికొని వెళ్లుఁడని చెప్పక తప్పని సరి యగుచున్నది.'

అప్పుడు నాకుమారుఁడుగూడ నున్నాఁ డనుకొందును. ఆతఁడును ఇందులకు సమ్మతింపలేదు.

పిదప నేను కస్తూరబాయికడ కరిగితిని. ఆమె కప్పు డించుకయు శక్తి లేదు. అప్పు డామె నేవిషయమునకుఁ గాని కదలించుటయు దుఃఖదాయకమే. అయినను ఆ విషయము చెప్పుట ధర్మమని తలఁచి చెప్పితిని. ఆమె దిట్టతనముతో నిటు లనెను—'నేను మాంసరసము పుచ్చుకొనను. మానవజన్మము దుర్లభము. మీ చేతులలో ప్రాణములు విడుతునేని పరవా లేదు; కాని ఈ శరీరమును అపవిత్రము చేసికొనను.'

నేను బోధింపవలసిన దంతయు బోధించితిని. మరియు, 'నీవు నా మతము ననుసరించి యుండవలసిన అక్కఱ లేదు. మన మెఱిఁగి యున్న పలువురు హిందువులు మద్యమాంసములు మందుగాఁ గైకొందురు.' అని చెప్పితిని. కాని ఆమె నామాటలకు లొంగక— 'నన్నచటికిఁ గొనిపొండు' అని పలికెను.

నేను వల్లె యంటిని. తీసికొని వెళ్లుట యనఁగనే మనస్సు కలుక్కు మనెను. అయినను పోవుటకే నిశ్చయించుకొంటిని. డాక్టరు గారికిని, వారి భార్యకును తీసికొని వెళ్లుదు నని చెప్పివయిచితిని.

డాక్టరు అగ్గిరాముఁడై ఇటు లనెను :

'ఎంత ఘాతకుఁడవయ్యా! ఇట్టి దుస్థితిలో ఏమియు నెఱుఁగని యామెతో ఇట్టి మాటలు చెప్పుటకు నీకు సిగ్గు వేయలేదటయ్యా? నీ భార్య యిపుడు తీసికొనిపోవఁ దగిన స్థితిలో లేదు. ఆమెశరీర మేమాత్ర మొత్తిడిని సైరింపలేదు. రస్తాలో ఆమెప్రాణములు పోయినను పోవచ్చును; అదియు వింత కాదు. మొండిపట్టు వలన నామాట విననిచో మీకే తెలిసివచ్చును. మఱి మీరు నొల్లనిచో ఒక రాత్రి యేని మాయింట నుంచుటకు నాకు ధైర్యము చాలదు.'

చిటపట చిటపట వాన పడుచుండెను. స్టేషను దవ్వు. దరబనునుండి ఫినిక్సువఱకు రైలురస్తా. పిమ్మట ౨౹౹ మైళ్లు కాలి నడక. వెళ్ళఁగల మని ధైర్యము కావలసినంత యుండెను. ఈశ్వరుఁ డన్నివిధముల కాపాడు నని నేను తలఁచితిని. ముం దొకనిని ఫినిక్సు పంపితిని. ఫినిక్సులో నా కొక హేమక్ కలదు. హేమక్ అనఁగా గట్టిదారములతోఁ జేసిన డోలీ. దీనిని వెదురువాసములకుఁ గట్టి రోగుల నందు కూరుచుండఁబెట్టి సుఖముగా మోసికొని పోవచ్చును. ఇట్టి హేమక్ ఒకటి, వేఁడిపాలసీసా ఒకటి, వేఁడినీళ్ల సీసా యొకటి, మనుష్యు లాఱుగురు,—వీనిని దీసికొని ఫినిక్సుస్టేషనుకు రమ్మని వెస్టుగారికి కబు రంపితిని.

రైలు వేళ యాయెను. రిక్షాను మాటాడితిని. అట్టి భయంకర స్థితిలో నం దామె నెక్కించి బయలుదేఱఁదీసితిని.

నా కామెకు ధైర్యము కలిగింపఁ బని లేకపోఁగా ఆమెయే నాకు ధైర్యము కలిగించి, 'నా కేమియు భయము లేదు. మీ రూరక తొందరపడకుఁ' డనెను.

ఎముకలు, చర్మము తక్క మఱియేమియు లేదు. ఒక మెతుకేని లోపలికి పోదు. స్టేషను-ప్లాటుఫారము కడు పొడవు. బండి

యొక్కటకు కడు దవ్వుగ నుండెను. రిక్షా అంతవఱకు పోవదు. నేను బండిదనుక చేతులపై మోసికొనిపోతిని. ఫీనిక్సుస్టేషనునకు ఆడోలీ వచ్చెను. దానిలో ఆమెను సుఖముగా ఇంటివఱకు గొంపోయితిమి. అచట కేవలము జలచికిత్సచే నీమెకు మెల్లమెల్లగా జీవకలుగ నారంభించెను.

ఫీనిక్సు వెళ్ళిన రెండుమూఁడు దినముల తరువాత ఒక స్వాములవారు విజయంచేసిరి. నాబందపట్టు విని నాపయి దయ పుట్టి మాకుఁ గొంచెము బోధచేయవచ్చిరి. అపుడు మణిలాలును, రామదాసును ఉన్నయటులు గుఱుతు. స్వాములవారు మాంసాహారము నిర్దోషమని బోధింపఁగడఁగిరి. మనుస్మృతిలోని శ్లోకములఁ జదివిరి. నాభార్య యెదుట ఈసంవాదము నడచుట నా కిష్టము లేదు. కాని వినయ బలమునఁ జెప్పనిచ్చితిని. మాంసాహారము చేయవచ్చునని చెప్పుటకు నాకు మనుస్మృతితో ఆవశ్యకత లేదు. నాకును ఆ శ్లోకములు తెలియును. అవి ప్రక్షిప్తము లనెడు పక్షముగూడ కలదని నే నెఱుఁగుదును. అవి ప్రక్షిప్తములు కాకున్నను ఆహారమునకు సంబంధించిన నామతము స్వతంత్రము. కస్తురబాయి విశ్వాసము చలము. ఆయమాయికరా శీ శాస్త్రప్రమాణము లేమెఱుఁగును! ఆమెకు తండ్రితాతలకడ నుండి వచ్చు నాచారమే ధర్మము. ఇఁక కుఱ్ఱలకు తమతండ్రి విశ్వాసమే ధర్మము. కావున వా రా స్వాములవారితో వినోదించుచుఁ గూరుచుండిరి. తుదకు కస్తురబాయి యీ మాటలు పలికి యీ సంవాదమును ముగింపఁజేసెను:

'స్వామీ! మీరు వేయి చెప్పుఁడు, నేను మద్యమాంసములతో ఆరోగ్యవతిని కానొల్లను. ఇఁక నాకు తలనొప్పి వచ్చునటు లొనరింపకుఁడు. ఇంకేమేని కొఱఁత యున్నచో తమరీ బిడ్డలను, తండ్రిని వెంట వేసికొని వెళ్ళి వాదింపుఁడు! నేను నా నిశ్చయమును మీ కెఱిఁగించియే యుంటినిగదా!'

౨౯

ఇంటిలో సత్యాగ్రహము

మొదటి జైలు-అనుభవము నాకు ౧౯౦౮ లో. అచట ఖైదీలు పాటింపవలసిన నియమములు చూచితిని. అవి సంయమముకలవాఁడు, లేక బ్రహ్మచారి స్వేచ్ఛాపూర్వకముగా పాలింపవలసిన నియమములవంటి వని తెలిసికొంటిని. సూర్యుఁ డస్తమింపక ముందు అయిదుగంటలు కొట్టునప్పటికి ఖైదీలు భుజింపవలయును. ఖైదీలలో—భారతీయులకుఁ గాని, నీగ్రోలకుఁ గాని—కాఫీ తేనీరు లొసఁగఁబడవు. కూరలు మొదలగువానిలో ఉప్పు కలిపి వండరు. వలయుచో విడిగా నిత్తురు. రుచి గల వస్తువు నీయరు. 'ఖైదీలకు కూరలలో వేసికొను సంబారు కారమిప్పింపుఁ' డనియు, 'వండుచుండఁగనే ఉప్పు వేయింపుఁ' డనియు నేను జైలువైద్యుని వేఁడుకొనఁగా నతఁడు 'ఇష్టము వచ్చిన పదార్థముల నారగించుటకు మీ రిచటికి దయచేయలేదు. కూరలో సంబారు కారము లేనిచో ఆరోగ్యము చెడదు. మరియు ఉప్పు వంటక మగుచుండఁగా వేసినను, వంటక మయినపిదప కలుపుకొనినను, ఆరోగ్యమున తేడా లేదు' అని సమాధానము చెప్పెను.

తుదకెంతో కొట్టుకొనిన పిదప భోజనమున కొంత మార్పు చేయించుకొనఁ గలిగితిమి. కేవలము సంయమదృష్టితోఁ జూచుచో ఈ రెండు నిషేధములు రెండును మంచివి. ఒకరియాజ్ఞచే నియమమును పాలింపవలసి వచ్చునేని దాన ఫలము కలుగదు. కాని స్వేచ్ఛచే నియమమును పాలించుచో దానఁ జాల మేలు కలుగును. కావుననే నేను జైలునుండి రాఁగానే ఈ రెండు నియమములను పెట్టుకొంటిని. చాల

వట్టు తేనీరు త్రావ మానితిని. ప్రొద్దు గ్రుంకకముందే భుజింప మొద లిడితిని. ఈరెండును నేఁడు స్వాభావికము లయిపోయెను.

ఉప్పునుగూడ పరిత్యజింపవలసిన ప్రసక్తి యొకటి సంభవించెను. ఈ నియమ మించుమించు పదియేండ్లపాలుండెను. 'మనుజునకు లవణ మావశ్యకము కాదు. మరియు ఆరోగ్యమును గుఱించియు ఉప్పు తిన కుండుట మేలు' అని నేను కొన్ని ఆహారగ్రంథములలోఁ జదివి యుంటిని. దీనివలన బ్రహ్మచారికిఁ గూడ మేలు కలుగు నని నా కల్పన పరుగులెత్తెను. బలము లేనివాఁడు పప్పు తినరా దని చదివితిని. అను భవమువలనఁ దెలిసికొంటిని. కాని అప్పుడు ఈ రెంటిని విడువలేక పోయితిని. ఏల యందురా, ఆ రెండును నా కిష్టదేవతలు.

ఆపరేషను జరిగిన పిదప కస్తూరబాయికి రక్తస్రావము కొంచె మాఁగినను, కొన్నాళ్లకు మరల కాఁదొడఁగెను. ఏమి చేసినను ఆఁగ లేదు. జలచికిత్స వ్యర్థ మాయెను. నా యీ వైద్యమునం దామెకు నమ్మిక లేదు గాని దానితోపాటు తిరస్కారము మాత్రము లేదు. కాని, ఇంకొక మందు పుచ్చుకొమ్మందునా, మందు పుచ్చుకొన వలయు నను పట్టుదల లేదు. నా చేయఁగల వైద్యములవలన ప్రయోజనము కలుగని పిదప ఉప్పుఁబప్పుల మానివేయు మని చెప్పితిని. నే నెంత చెప్పినను, ఎన్ని ప్రమాణములు చూపినను ఆమె యియ్యకొనలేదు. తుద కొకనాఁడు 'ఉప్పుఁ బప్పుల మాను మని మీ కెవరేని చెప్పుచో మీరును మానలేరు' అని యామె నాతో పంతమాడెను. ఈ పలుకువలన కష్టము కలిగెను గాని వెంటనే హర్షమును గలిగెను. హర్ష మేల యందురా? నా ప్రేమ నామెకుఁ జూపించుట కది పట్టు. ఈ హర్షముతో నే నామె కిటు లంటి— 'నీ వోడెదవు! నాకు జబ్బు వచ్చి, వైద్యుఁడు ఉప్పుఁబప్పుల మాను

మని చెప్పనేని వెంటనే మానఁగలను. కాని వైద్యుఁడు చెప్పనేల? నీ మాట చొప్పున ఉప్పుఁబప్పుల నేఁటినుండి ఒకయేఁడాది దనుక విడిచి వయిచితిని. నీవు విడువుము! లేక విడువకుము! నే నిదే విడిచి వయిచితిని.'

ఆమెకు పశ్చాత్తాపము కలిగెను. ఆమె యిటులు గోల పెట్టెను—'నన్ను క్షమింపుఁడు! మీస్వభావము నెఱిఁగియుండియు మాట జాఱితిని. నే నిఁక నుప్పుఁబప్పుల మానెదను. మీరొట్టు తీసి వైచికొనుఁడు! నాపై నింత కచ్చి వలదు.'

నే నిటు లంటి—'నీ వీ యుప్పుఁబప్పుల మానితివేని చాల మేలు కలుగుటకు సందియము లేదు. నే నొకతూరి ఒట్టు పెట్టుకొంటినా మఱి మానుట లేదుకదా! నాకును దీన మే లొదవఁగలదు. మనుజుఁ డేకారణముననేని సంయమ మొనరించినచో దాన మేలే కలుగును. కావున నామాట కిఁక పట్టు పట్టకుము. ఏలన నాకిది పరీక్షగ నుండును. నీనిశ్చయమునకును తోడుగ నుండును.' నే నింత చెప్పిన యంత నన్నిఁక మాటాడించు నంత పని లేకపోయెను. 'మీరు పెంకెలలో పెంకెలు. ఒకరి మాట వినుట మీచదువులో లేదు' అని అంగలార్చి యూరకుండెను.

ఈ విషయమును నేను సత్యాగ్రహమున నొక యంశముగా పరిగణింతును. మరియు నాజీవితమున జరిగిన చక్కని ఘటనలలో నిదియు నొకటిగా దీనిని గుఱుతుదెచ్చికొందును.

పిదప కస్తురబాయికి ఆరోగ్యము కలుగఁ దొడఁగెను. ఉప్పుఁబప్పుల మానుటవలననో, దీన భోజనములోఁ గలిగిన కొలఁది గొప్ప మార్పులవలననో, ఇతరనియమములఁ బరిపాలింపఁజేయుటకు నా తీసి

కొనిన జాగ్రత్తవలననో, ఈ శపథముచేఁ గలిగిన మానసోల్లాసము వలననో ఆరోగ్యము కలిగెను,—గాని వీనిలో నేది కారణమో, ఎంతవఱకు కారణమో నేఁ జెప్పఁజాలను. మెల్ల మెల్లగా కస్తురిబాయి పనులుచేయఁదొడఁగెను. రక్తస్రావ మాఁగిపోయెను. నాకు 'వైద్యరాజ' అను బిరుదు వచ్చెను.

ఈ రెంటిని నిగ్రహించుటవలన నాకుఁగూడ మేలు కలిగెను. విడిచినపిదప నుప్పుఁబప్పుల కోరికయు నాకెపుడు రాలేదు. ఒక సంవత్సరము పరుగెత్తుకొనిపోయెను. దీన నింద్రియముల కెక్కుడు శాంతి కలిగినటులు గోచరించెను. మరియు సంయమముచెస మనసు మొగ్గుకొనెను. ఏఁడాది దాఁటు పిదప దేశమునకు తిరిగివచ్చిన్న చాల నాళ్ళవఱకును ఈ నియమ మాచందముననే యుండెను. ౧౯౧౪ సంవత్సరము నేను సీమలో నొకతూరియే ఉప్పుఁ బప్పులఁ దింటిని. పిదపని, పిమ్మట దేశమునకు వచ్చినపిదప నీ రెండు ద్రవ్యములను తినుట మొదలిడుటకును గల కారణములను ముందు తెలిపెదను.

నేను దక్షిణ-ఆఫ్రికాలో నామిత్రులు కొందఱిచే నీ యుప్పుఁ బప్పులఁ దినుట మానిపించి చూచితిని. దానఁ జాల మేలు చేకూరెను. ఈ ద్రవ్యములయెడ వైద్యమున రెండు మతములు కలవు. కాని సంయమమునకు ఈ రెంటిని విడనాడినచో చాల మేలు కలుగునని చెప్పుటలో సందియ మేమియు లేదు. భోగికిని, సంయమికిని తినుబండము వేఱు, వారి త్రోవలు వేఱు. బ్రహ్మచర్యమును పరిపాలింపఁ దలఁచుకొను వారు భోగుల జీవనము నలవాటు చేసికొనినచో కడుఁజిక్కులపా లగుదురు. ఇంతియ కాక బ్రహ్మచర్య మశక్య మనియు ననిపించును,

30

సంయమము

భోజనమునందలి కొన్ని మార్పులకు కస్తురబాయి జబ్బు కారణ మని క్రిందటి ప్రకరణమునఁ జెప్పఁబడెను. కాని యిపుడు ప్రతిదినమును మార్పులకుఁ గారణము బ్రహ్మచర్యము.

మొదటి మార్పు పాలను మానివైచుట. పాలు ఇంద్రియ వికారముల నెక్కువచేయునని తొలుదొలుత నేను రాయచందుభాయి గారివలన వింటిని. ఆహారమునకు సంబంధించిన కొన్ని ఇంగ్లీషు గ్రంథములు చదువుటవలన నీయభిప్రాయము రూఢమాయెను. కాని బ్రహ్మచర్యవ్రత మవలంబింపనంతవఱకు పాలను పరిత్యజించు నిశ్చయమునకు రాఁజాల నయితిని. శరీరరక్షణకు పాలుండి తీర నక్కఱలేదని నేను లోఁగడనే యెఱిఁగికొనియుంటినిగాని పాలు వడిగా విడనాడ వీలయిన వస్తువా? ఇంద్రియదమనమునకు పాలు విడనాడుటయే అను సంగతి ఒక నాఁటికంటె మఱియొకనాఁడు నాకు తెలిసి వచ్చుచుండఁగా, ఆవులు కలవారును, గేదెలు కలవారును ఆవులకును, గేదెలకును జేయు హింసను దెలుపు కొన్ని గ్రంథములు కలకత్తానుండి దిగెను. ఆ గ్రంథములు చేసిన పని కడుఁజమత్కారము. నే నా విషయమును కేలెన్‌బేక్ గారితోఁ జర్చించితిని.

సత్యాగ్రహేతిహాసమున కేలెన్‌బెకుగారిని గూర్చి వ్రాసియుంటిని. వెనుక నొకప్రకరణమున వీరిని దడవియు నుంటిని. అయినను వీరినిగుఱించి మఱి రెండు మాటలు చెప్పవలయును. నాకు వీరిచెలిమి అనాయాసముగ లభించెను. వీరు ఖానుగారికి మిత్రులు. వీరి లోలోపల వైరాగ్యము కలదని ఖానుగారు పసిపట్టిరి. కావుననే

వీరికిని, నాకును ఖానుగారు పరిచయము కలుగఁజేసియుందురు. నాకు వీరితో పరిచితి యొదవిన రోజులలో వీరిచేయు రాజవ్యయమును జూచి నేను కను లెగురవేయుచుండు వాఁడను. అయినను మా మొదటి సమావేశమున వీరు నన్ను ధర్మమును (తత్త్వమును) గురించి ప్రశ్నించిరి. ఆ సంభాషణలో బుద్ధభగవానుని త్యాగమునుగూర్చి రాఁబగిన ప్రశ్న వచ్చెను. నాఁటినుండి మా చెలిమి చిలవలు పలవలు పెట్టెను. మదిలో నిక్కము చేసికొని నే నేపని చేయఁ దొడఁగుదునో ఆపనిని తానుగూడ జేయునంతవఱకు అతఁడు నాలో నేకీభవించెను. అతఁ డప్పు డేకాకి. ఇంటియద్దె యటుంచి నెలకు ౧,౨౦౦ రూపా యలు అతనికి ఖర్చగుచుండెను. తుదకు తుదకు ౧౨౦ రూకలతో సరి పెట్టుకొని పొదుపు నేర్చుకొనెను. సంసారమును ఎత్తివైచి జైలులోఁ బడి నేను తిరిగివచ్చిన తరువాత మే మిరువురమును కలిసి ఒకయింట నుంటిమి. మే మప్పుడు కావలసినదానికంటె కడు తక్కువ ఖర్చుతో జీవనము వెళ్ళఁదీసితిమి.

ఆరోజులలోనే పాలనుగూర్చి మాకు చర్చ జరిగెను. మి. కేలన్‌బేక్: 'మనము పాలు ఇంత పాడైన వనుకొనుచు ఏల వదలి వేయరాదు? పాలు లేకున్న ఏమి మునిఁగిపోవును?' అని యనెను. వీరి యభిప్రాయమునకు నాకానందాశ్చర్యములు కలిగెను. నే నీమాటకు స్వాగత మొసఁగితిని. మే మిరువురమును టాల్‌స్టాయ్-ఫారమునం దా క్షణముననే క్షీరత్యాగము కావించితిమి. ఇది ౧౯౧౨వ సాలున.

కాని నే నీ త్యాగముతో శాంతింప నయితిని. పాలు వదలిన కొన్నాళ్ళకే కేవలము పండ్లు దిని యుండ నిశ్చయించుకొంటిని. అవియు చవుకపాటివి. నిఱుపేదలలో నిఱుపేదలమై వారితోపాటు జీవనము చేయుట మాకోరిక.

ఫలాహారము చాల సులువని తెలిసెను. పొయి వేయఁ బని లేదు. పచ్చి వేరుసెనగలు, అరఁటులు, ఖర్జూరము, ఆలివునూనె— ఇవి మాకు మామూలు ఆహారద్రవ్యములు.

బ్రహ్మచర్యమును పరిపాలింపఁ దలఁచుకొనువారి కొకటి చెప్ప వలయును. ఆహారోపవాసములతో బ్రహ్మచర్యమునకు దగ్గఱ చుట్టఱిక మున్న దని చెప్పవచ్చుచున్నాను. అయినను దీనికి ముఖ్యాధారము మనస్సు అని యరయునది. మలినమగు మనస్సు ఉపవాసముచే శుద్ధి నొందఁజాలదు. దీని శుద్ధికి ఆహారమును ఉపకరింపదు. మనోమాలిన్యము విచారముచేత, ఈశ్వరధ్యానముచేత, తుద కీశ్వరానుగ్రహముచేతనే క్షాళిత మగును. మనస్సునకును, శరీరమునకును కడుఁ జుట్టఱికము కలదు. మకిల యగు మనస్సు మకిలతిండ్లకే మరులుకొనును. మకిలమనస్సు పలుతెగల చవులకును, భోగములకును మారాముచేయును. తిరిగి యీ తినుబండములయు, భోగములయు గుణము మనసుపయిం బని చేయును. కావున ఆహార నియమమునకును, ఉపవాసమునకును ఆవశ్యకత కానిపించుచున్నది. వికారయుక్తమగు మనస్సు శరీరమును, ఇంద్రియములను తన వశమునముంచుకొనుటకు బదులు శరీరేంద్రియములకు వశమై నడచుచుండును. ఈ కారణముచేఁ గూడ శరీరమున కొక యాహారమర్యాద యుండవలయును. ఆ యాహారము శుద్ధముగ నుండవలయును. ఇంచుకయు వికారము * కలిగించునదిగా నుండరాదు. మరియు పైఁ జెప్పిన యుపవాసము గూడ నావశ్యకము. సంయమికి ఆహారనియమములతోఁగాని ఉపవాసములతోఁగాని ఇసుమంతయు ప్రయోజనము లే దనువారు, ఆహారనియమములతోడనే, ఉపవాసములతోడనే ప్రయోజనము కల దని వాదించువారితోపాటు తప్పుత్రోవ నడచువారే యగుచున్నారు. సంయమికి ఈరెండును చాల సాయము చేయఁగలవని నా కనుభవము. వీని సాయము లేక మనసులోని వికారము అడఁగుట అసంభవము.

---

* వికారము కలిగింపనిది=రజస్సును, తమస్సును ప్రకోపింపఁజేయనిది : Non-Stimulating—అను.

౩౧

ఉపవాసము

పాలు, ధాన్యములు విడనాడి ఫలాహారము చేసి చూచు రోజులలో, సంయమముకొఱకు ఉపవాసమునుగూడ నారంభించితిని. దీని కేలెన్‌బెకుగారు నాకుఁ దోడు. తొలుత నా యుపవాసము ఆరోగ్యముకొఱకు. దేహదమనమున కుపవాస మావశ్యక మనునది యొక మిత్రునివలనఁ దెలిసికొంటిని. వైష్ణవ కుటుంబమున జన్మమెత్తినందువలనను, మాయమ్మ కఠినవ్రతముల నొనరించున దగుటవలనను ఏకాదశీవ్రతము మొదలగువానిని నేను ఇండియాలో ననుష్ఠించియుంటిని గాని యవి మాయమ్మను జూచి నేర్చికొనినవో, లేక మా తలిదండ్రుల సంతుష్టికొఱకు అనుష్ఠింపఁబడినవో. ఇట్టి వ్రతానుష్ఠానముల వలన లాభ ముండు నని నేననుకొనను లేదు, విశ్వసింపను లేదు. కాని నే నామిత్రుని జూచి బ్రహ్మచర్యవ్రతమున కుపయోగముగా నతని ననుకరింపఁ దొడఁగి ఏకాదశుల నుపవసింప నిశ్చయించుకొంటిని. ఏకాదశినాఁడు పాలు పండ్లు తిని వ్రతము పాలించితి మనుకొనుట సామాన్యరీతి. నే నిట్టివ్రతమును ప్రతిదినమును పరిపాలించుచునే యుంటిని. కావున నీరు త్రావు హక్కు మిగిల్చికొని పూర్ణోపవాస మొనరింప నారంభించితిని.

ఆ యారంభమునందే శ్రావణమాస మారంభించెను. ఆ సంవత్సరమున రంజాను పండువును, శ్రావణమాసమును కలిసెను. గాంధీకుటుంబమిటు వైష్ణవవ్రతములను, అటు శైవవ్రతములను గూడఁ జేయుచుండును. ఇటు విష్ణ్వాలయములకు వెళ్లుచుండును, అటు శివాలయములకును వెళ్లుచుండును. శ్రావణమాసమున కుటుంబములో నెవరో

యొకరు ప్రదోష మొందుచునే* యుందురు. అటులే నేనును ఈ శ్రావణమున ప్రదోషవ్రతము చేయ నిశ్చయించితిని.

ఈ గొప్ప ప్రయోగముల యారంభము టాల్‌స్టాయి-ఆశ్రమములో. సత్యాగ్రహపుఁ గయ్యము పొడిచి చెఱసాలలోఁ బడినవారి కుటుంబములతో నేనును, కేలన్‌బెకుగారును అచట నుంటిమి. అచట బాలకులును, నవయువకులును గలరు. వారలకుఁ గాను బడి యొకటి పెట్టితిమి. ఈ నవయువకులలో నలుగు రైదుగురు ముసలమానులు గలరు. ఇస్లాము ధర్మపరిపాలనమున తోడుపడుచు నేను వీరి కుత్తేజనము కలిగించుచుంటిని. నమాజువగైరాలు సరిగా చేయించుచుంటిని. ఆశ్రమమున పారసీకులును, క్రైస్తవులుఁ గూడఁ గలరు. 'ఎవరి ధర్మమును వా రనుష్ఠింపవలెను. ఇతరు లది జరుగునటులు చూడవలెను' అని యందఱకును నియమ ముండెను. కావున రోజా జరుపుఁ డని ముసలమానులకు ఉత్తేజనము కలిగించితిని. నేను ప్రదోష ముందుచునేయుంటిని. మరియు ముసలమానులకు సాయము చేయవలసినదని హిందువులకును, పారసీకులకును, క్రైస్తవులకును సలహా యిచ్చితిని. సంయమపాలనమునం దందఱకును సాయము చేయుట మంచి పని యని తెలిపితిని. ఆశ్రమవాసులలో పలువురు నామాట నియ్యకొనిరి. హిందువులును, పారసీకులును ముసలమానులను సంపూర్ణముగా ననుకరింపలేదు. అట్టి యావశ్యకతయు లేదు. ముసలమానులు సూర్యాస్తమయముదాఁక దిండికి కనిపట్టుకొని యుండవలసి వచ్చెడిది. మధ్యాహ్నముననే భోజనమును ముగించుకొనినవారు ముసలమానులకు వంటక మొనరించి యీయఁగలిగిరి. ఇంతియ కాక ముసలమానులు సరగహీ చేయుదురు. అనఁగా ప్రతిదినములలో

* వక్తములని యిచటి వాడుక.—అను.

సూర్యుఁ డుదయింపక ముందు చీకటితో భుజింతురు. ఇతరు లీ విషయమున వీరికి తోడుపడరు. మరియు మూసలమానులు పగటఁగూడ నీరు గ్రోలరు. దప్పి యగుచో నితరులు గ్రోలుదురు.

ఈ యనుష్ఠానమువలన ఉపవాసమహత్త్వమును, ఏకభోజన మహత్త్వమును అందఱకును దెలియనాయెను. ఒకరిపై నొకరికి సౌహార్ద్యమును, ప్రేమయు వర్ధిల్లెను. ఆశ్రమమునం దాహారనియమము కలదు. కావున నాయాజ్ఞను శిరసావహించి నా మిత్రు లందఱును మాంసము వర్జించినందులకు నేను కృతజ్ఞుఁడను. రోజాదినములందు మూసలమానులకు మాంసత్యాగము కష్టమయినను దానిని లెక్కగొనక కష్ట మను మాటగూడ నా చెవిఁ బడకుండఁ జేసిరి. ఆశ్రమజీవనమునకు ప్రాతికూల్యము లేకుండ హిందూబాలకులు వీరికి రకరకముల వంటకములు చేసి పెట్టిరి.

నాయుపవాసమును గూర్చి వ్రాయుచు ఇచ్ఛాపూర్వకముగా విషయాంతరములోనికి దిగితిని. ఏలన ఈ చక్కని ప్రసంగమును మఱియొకచోట నుదాహరింపఁజాలను. మరియు ఈవిషయాంతర ద్వారమున నాస్వభావ మొకటిగూడఁ జూపించితిని. మంచివని తోఁచు ప్రతి పనులయందును నాకుఁ గొందఱు సహచరుల నుంచుకొనుచుందును. ఈ యేకభోజనము, ఈ యుపవాసమును వారికిఁ గ్రొత్త. కావున ప్రదోష మనియు, రంజాన్ అనియు వారిని లాఁగుకొని వచ్చితిని.

ఈరీతిగా సంయమవాతావరణ మనాయాసముగా నాశ్రమము నందు నెలకొనెను. మాతోపాటు ఆశ్రమవాసులును ఉపవాసములు, ఏకభోజనములును చేయఁజొచ్చిరి. దాన మేలు కలుగు ననియే నామతము. ఈ సంయమము వారి హృదయముల నెంత పని చేసెనో, ఉపవాసా

కాలం విషయముల నవరోధించుట కెంత పని చేసెనో నేను నిశ్చయముగాఁ జెప్పఁజాలను. నాకుమాత్రము వానివలన ఆరోగ్యమును, ఇంద్రియదమనమును కలిగెను. 'ఉపవాసాదులవలన నందఱకును ప్రయోజనము కలిగితీరును' అని నా యుద్దేశము కాదు. ఇంద్రియదమనము నుద్దేశించి యుపవసించుచో విషయములు వినివర్తించును. మఱియు, ఉపవాసాంతమునందు విషయేచ్ఛయు, స్వాదేచ్ఛయు తీవ్రమయినటులు నా మిత్రుల పలువుర యనుభవము. అనఁగా దీని కర్థమిది: ఉపవాసదినములలో విషయములను అరికట్టుటకును, స్వాదమును జయించుటకును సంతతోద్దేశము లేకున్నచో శుభఫల మొందఁగూడదు. ఇట్టియుద్దేశము లేక, మనస్సును లగింపక, వట్టి శారీరకోపవాసమువలన విషయవేగ మాఁగు ననుకొనుట కల్ల. గీతలలోని రెండవ యధ్యాయమునందలి యీ శ్లోక మిప్పట్టున విబుధుల విచారణాయోగ్యము.

విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః*,
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే.

---

* 'యద్యపి విషయా విషయోపలక్షితాని విషయశబ్దవాచ్యాని ఇంద్రియాణి [అథవా విషయా ఏవ-పాఠా.] నిరాహారస్య అనాహ్రియమాణవిషయస్య, కాష్ఠతపసి స్థితస్య [కష్టే తపసి స్థితస్య-పాఠా.] మూర్ఖస్యాపి వినివర్తన్తే దేహినో దేహవతః.—భాష్య.

'విషయవిగ్రహములేక [తాఁబేటివలె అవయవములను ముడుచుకొని] తపస్సులో కట్టెవలె నుండు మూర్ఖునకు ఇంద్రియములు [లేక విషయములు] ఉడుగును' అని శంకరులవారి యభిప్రాయము.

నిరాహారస్య అనఁగా అన్నము తినుట మానుకొనినవానికి అని వారి అభిప్రాయము కాదు. ఉపవసించినను కన్ను, మేను మొదలగు నింద్రియములకుచూపు, సోఁకు మొదలగువిషయముల తాఁకు సంభవింపవచ్చును గాన

అనఁగా ఉపవసించువానికి విషయములు (ఉపవాసమునడుమ) శమించును; కాని రసము పోదు. రసము ఈశ్వరదర్శనమున— ఈశ్వరప్రసాదమున—శమించును.

సంయమికి ఉపవాసాదులు మార్గమువందు సాధనరూపముగా నావశ్యకములు. ఇంతియకాదు. ఈ శారీరకోపవాసమునకు మానసికోపవాసముగూడఁ దోడుపడనిచో నది దంభముగా పరిణమించి హాని చేయు నని చెప్పవలసివచ్చును.

‘నిరాహారస్య’ అనఁగా లంఘనములు చేయువాని కని అర్థము చెప్పరాదు అని వెల్లంకొండ రామరాయలు—‘న చాత్ర నిరాహారస్య త్యక్తభోజనస్య కృతలఙ్ఘనస్యేతి యావ దిత్యర్థ ఇతి శక్యమ్. ఆహారాభావేఽపి చక్షుస్త్వగాదిభీ రూపస్పర్శాదివిషయగ్రహణసంభవా న్న సర్వేన్ద్రియప్రతినివృత్తిః’ భాష్యార్కప్రకాశః.

వెనుక పుటలోని ‘విషయా వినివర్తంతే’ అను శ్లోకమునకు పైనున్న పంక్తులకును ఈ శాంకరాభిప్రాయమునకును చెలిమి యున్నది. అయినను నిరాహారపదమునకు అర్థవిశేష ముండుటచేతనే యీ భాష్యాదు లుదాహరింపఁబడినవి. —అనువాదకుఁడు.

౩౨

పంతులుగారు

సత్యాగ్రహేతిహాసమునందు వ్రాయ వీలుపడనివియు, కొలందిగనే వ్రాయంబడినవియు నగు విషయముల నీ ప్రకరణములలో వ్రాయుచున్నాను. పాఠకుల కీ మాట గుఱుతున్నచో పూర్వాపరసంబంధము బోధపడంగలదు.

టాల్‌స్టాయి-ఆశ్రమమునందు బాలురకును, బాలికలకును విద్యావిషయమైన యేర్పాటు చేయవలసి వచ్చెను. అందు హిందూ ముసలమాన క్రైస్తవ పారసీక బాలకులును, కొలందిమంది హిందూ బాలికలును ఉండిరి. వీరికి ప్రత్యేకించి ఒక పంతులుగారిని పెట్టుట అసంభవము. నా కది యనావశ్యక మనియు తోంచెను. అసంభవ మేలనిన, తగిన హిందూస్తానీ-పంతులుగా రచట దొరకరు. ఒకవేళ దొరకినను ఈ కొలంది జీతమునకు డర్బనునుండి ౨౧ మైళ్లదూర మెవండు రాంగలండు? మఱి మేము ధనములో మునింగి తేలుచుండుట లేదు. మరియు బయటనుండి ఆశ్రమములోనికి పంతులుగారిని రప్పించుట యనావశ్యక మనిపించెను. ఏలన నేంటి చదువులరీతి [విద్యాప్రణాళి] నాకు బాగుండలేదు. కాని వాస్తవమగు రీతి నాకనుభవమున లేదు. తల్లిదండ్రులు లర్హులగుదురేని వారి యదుపాజ్ఞలవలననే సరియగు చదువు వచ్చును. ఇది యాదర్శము. ఇట్టి యాదర్శస్థితిలో వెలుపటిసాయము తక్కువలోం దక్కువగా నుండందగును. టాల్‌స్టాయి-ఆశ్రమ మొక కుటుంబము. అందు నాది జనకస్థానము. కావున ఇందఱి బాలకులకు మంచి జీవనమును నిర్మింపవలసిన భారమును. యథాశక్తి శిరసావహింపవలయు ననుకొంటిని.

ఈ నా భావనలో చాల దోషములు కలవు. ఈబాలు రందఱును పుట్టినప్పటినుండి నాకడ లేరు. అందఱును వేఱువేఱు వాతావరణమునఁ బెరిఁగినవారు. పైఁగా వారివారి మతము లొక్కటి కావు. ఈబాలురయు, బాలికలయు స్థితిగతు లిట్టివి. నే నీ వీరికి పితృస్థానమున నుండి యెటులు న్యాయ మొనరింపఁగలను?

చదువులో మనశ్శిక్షకు, అనఁగా చరిత్రవికాసమునకు నే నగ్రస్థాన మిత్తును. అట్టిచదువు ఎట్టి ప్రాయమువారికిఁగాని, యెట్టి వాతావరణమునఁ బెరిఁగినవారికిఁగాని చెప్పవచ్చును. కావున రేయుం బవల్లు నే నీ బాలురలో బాలికలలో తండ్రివలె మెలఁగఁ జొచ్చితిని. అట్టి చదువునకు సచ్చరిత్రము పునాది. పునాది గట్టిదగుచో మిగులు విషయములు యథాసమయమునఁ దమంత తమకే తెలియును. లేదా, పరులసాయమునఁ దెలియఁగలవు.

మరియు భాషాజ్ఞానముగూడ కొలఁదియో గొప్పయో ఆవశ్యకమగుటచే కేలన్‌బేక్, ప్రాగజీ దేశాయీగారల సాయమున వీరిని చదువ వేసితిని.

నాకు శరీరశిక్ష ఆవశ్యకమని తెలియును గాని, అది వీరి కనాయాసముగనే లభించుచుండెను.

ఆశ్రమమున నౌకరులు లేరు. పాకీపని మొదలుకొని వంటవఱకును గల పనులన్నియు ఆశ్రమవాసులే చేసికొనుచుండిరి. ఆశ్రమమున ఫలవృక్షము లెక్కుడు. త్రవ్వటము పెట్టవలసియుండెను. ఆశ్రమమున కేలన్‌బేకుగారికి త్రవ్వట మనిన కులాసా. వారు స్వయముగా సర్కారువారి ఆదర్శక్షేత్రములలో కొంతకాల ముండి క్షేత్రపాలనమంతయు నేర్చికొనియుండిరి. వంటపని లేనివా రెల్లరును పిన్నలనక

పెద్దలనే తోఁటపని చూచి తీసవలెను. వీరిలో పిల్లలపా లెక్కువ. గోతులు త్రవ్వుట, చెట్లునఱకుట, నఱికిన చెట్ల నీడ్చుట యీమొదలగు పనులచే వీరి శరీరము గట్టిపడి బిగియుచు వచ్చెను. వీరికీ పని యున్న నమితానందము. వీరికీ పనివలన వేఱుగా కసరతుతోఁగాని, ఆటలతోఁగాని అవశ్యకత లేకపోయెడిది. వీరిలో కొందఱు విద్యార్థులు, ఒక్కొక్కప్పుడు అందఱునుగూడ, నీ పనికి రాక తప్పించుకొనిపోవుచుండెడివారు. ఒక్కొక్కప్పుడు అలస్యముగా వచ్చుచుండెడివారు. నేను వీరి కొంటెతనములను పలుమాఱులు ఉపేక్షించితిని. పలుమాఱులు నేను వీరి మెడలమీఁద కూర్చుండియే పని చేయించితిని. నా యీ కాఠిన్యమునకు వీ రియ్యకొని చనుకొననుగాని వీరు నా కెన్నఁడు నెదురాడి యున్నటులు గుర్తులేదు. పని యుండఁగా ఆటపాటలకు తిరుగాడుట మేలు కాదని నే నపుడు వారికి తెలియఁ జెప్పుచుంటిని. అప్పుడది వారి మది కెక్కెడిదిగాని మఱుక్షణము ననే మఱపు తగిలెడిది. ఈరీతిగా పనిమాత్రము జరిగిపోవుచుండెడిది. దాన వారి శరీరమును బాగుపడెను.

ఆశ్రమమున జబ్బనుమాట లేదు. దీనికి అచటి మంచిగాలియు, మంచినీరును, ఆహారనియతియుఁగూడ కారణము లనవగును.

వీరికి ఈపాటుతోపాటు చేతిపనుల పాటుఁగూడ కలుప నెంచితిని. వీ రందఱకును ఏదో యొక చేతిపని వచ్చియుండవలయు నని నాయభిప్రాయము. దీనికి కేలన్‌బేకుగారు ట్రేపిస్టు మొనాస్టరీకిఁ బోయి చెప్పులు కుట్టుపని నేర్చి వచ్చిరి. వారికడ నేను నేర్చితిని. నేర్చుకొనఁ గోరిన బాలకులకు నేను నేర్పితిని. కేలన్‌బేకుగారికి వడ్రము కొంచెము తెలియును. ఆశ్రమమున వడ్రంగ మెఱిఁగిన సహచరుఁ డొకఁడు గలఁడు. దాన వడ్రము నేర్పుటయు జరిగెను. మఱియు నించుమించుగా బాలకు లందఱును వంటచేయ నేర్చుకొనిరి.

ఈ పను లన్నియు నీ బాలకులకు సరిక్రొత్తలు. ఇవి నేర్చుకొన వలసిన పని వీరు కలలోనయిన ననుకొనలేదు. దక్షిణ-ఆఫ్రికాలో హిందూస్థానీ బాలకులకు కేవలము అక్షరములు దిద్దుట దక్క వేఱు చదువు దొరకదు. ఉపాధ్యాయులు చేయక యే పనినేని బాలురచేఁ జేయింపరా దనియు, బాలురతోఁ బాటు ఉపాధ్యాయుఁడుగూడఁ బని చేయుచుండవలయు ననియు టాల్‌స్టాయి-ఆశ్రమమున నొక నియమము కలదు. దీన బాలురు సంతోషముతో నేర్చుకొనుట సాఁగెను.

చరిత్రమును, భాషాజ్ఞానమును గుఱించి ముందు ప్రకరణమున.

33

అక్షరజ్ఞానము

గత ప్రకరణమున టాల్‌స్టాయి-ఆశ్రమమునందు శారీరకశిక్షయు, దాని కంగములుగా కొన్ని చేతిపనులను నేర్ప మొదలిడుటయు చూచియున్నాము. దీన నాకు సంపూర్ణముగా సంతుష్టి కలుగకున్నను కొంచెమో గొప్పయో సాఫల్యము కలిగె ననదగును. భాషాజ్ఞానము కలిగించుట కష్టమనిపించెను. దానికిఁ దగు సామగ్రి నాకడ లేదు. కోరిక యెంతకలదో తీరిక యంత లేదు. అంతటి భాషాజ్ఞానమును నాకు లేదు. దిన మంతయు పని చేసిచేసి యలయుచుంటిని. కొంచెము దగ దీర్చుకొందు ననుకొను వేళ నీ చదువు వచ్చి పడుచుండెడిది. బోధించుటకు నేను కలకలలాడుచు నుండుటకు బదులు బలాత్కారముగా నిదుర నాఁపుకొనవలసి వచ్చెడిది. తోఁటపనుల తోడను, గృహకృత్యములతోడను ప్రాతఃకాలము తీరిపోవఁగా పండ్రెండు గంటల భోజన మయిన తరువాత పాఠశాలారంభము. దీని కంటె ననుకూలమగు వేళ లేదు. సాహిత్యపాఠములకు మూఁడు గంట లుపయోగించుచో నక్కడి కెక్కువలో నెక్కువ. హిందీ, అఱవము, గుజరాతీ, ఉర్దూ: ఈ భాషలలో పాఠములు. బాలకులకు మాతృభాషలోనే పాఠములు చెప్పవలయు నని నియమము పెట్టుకొంటిమి. అందఱకును ఇంగ్లీషు సామాన్యభాషగా నియమ మొనరించితిమి. గుజరాతీవారికిని, హిందీవారికిని సంస్కృతము వచ్చు. అందఱకును హిందీ ఆవశ్యకము. వీనిలో ఇతిహాసము, భూగోళము, గణితము అందఱకును నేర్పఁబడుచుండెను. అఱవము, ఉర్దూలు నేర్పుట నావంతు.

33 అక్షరజ్ఞానము

నాకు వచ్చిన అఱవము ఓడలోను, జైళ్లలోను. 'పోప్' వ్రాసిన తమిళ-వాచకమును మించి నా కెక్కుడు జ్ఞానము లేదు. నా ఉర్దూలిపిజ్ఞానము ఓడలో నేర్చికొనినది. మరియు నాకుఁ గల అరబ్బీ ఫారసీ పదజ్ఞానము ముసలమానుమిత్రుల పరిచితివలన సంపలబ్ధ మయినది. నాకుఁగల సంస్కృతజ్ఞానము, గుజరాతీజ్ఞానమును హైస్కూలులో కలిగిన వే.

నేను నిర్వహింపవలసిన పనికి నా శక్తిసామర్థ్యము లిట్టివి. ఇఁక నాతోడివారుగూడ నాకు తమ్ములే. దేశభాషలయెడల నాకుఁ గల ప్రేమ, నాశిష్యశక్తియెడ నాకుఁ గల విశ్వాసము, విద్యార్థుల తెలివితక్కువతనము, దీనికన్న నెక్కుడయిన వీరి యౌదార్యము ఇవన్నియుఁ గలిసి నాపనికి సాయము చేసెను.

ఈ యఱవ విద్యార్థులు దక్షిణ-ఆఫ్రికాయందే జన్మించిన వారు. వారికి వచ్చిన అఱవము కడుఁ గొలఁది. లిపి యసలే రాదు. వారికి అక్షరములు దిద్దఁబెట్టుటయు, వ్యాకరణమున సామాన్యజ్ఞానము కలిగించుటయుఁ జేయవలసి యుండెను. ఇది కడుఁ దేలిక. అఱవము మాటలాడుటలో వారు నన్ను నాయాసముగా జయింపఁగలరు. అది వారికిఁ దెలియును. ఇంగ్లీషు రాని అఱవవారెవరేని నాతో మాటలాడ వచ్చినపుడు నాయీ శిష్యులు మాకు దుబాసులగుచుండిరి. నే నిటులు సంతోషముగా నిర్వహింపఁ గలుగుచుంటిని; ఏలనఁగా, నేను విద్యార్థులముందు నా యజ్ఞానము నెన్నఁడును దాఁచుటకుఁ ప్రయతింపలేదు. నా కెంత తెలియునో నే నంతలోనే యుంటిని. కావున నాకు ఓ యనిన ఢం రాకున్నను వారి ప్రేమకును, ఆదరమునకును పాత్రము గాకుండలేదు.

ఇఁక మూసలమానులకు ఉర్దూ చెప్పుట ఇంతకన్న తేలిక యాయెను; ఏలయనఁగా వారికి లిపి తెలియును. కావున వారికి చదువునం దాదరము కలిగించుటయు, వస్తాది చక్కఁజేయుటయు నీ రెండే నా పనులు.

వీరందఱును లోఁగడ నిరక్షరులు. ఏ బడియందును జదివి మిడికినవారు గారు. వీరికిఁ జెప్పవలసినది కడుఁ దక్కువ యని కొలఁది కాలములోనే నేఁ గనుఁగొంటిని. సోమరితనమును పోఁగొట్టుటయు, తమంతఁ దాము చదివికొనునటులు చూచుటయు, అభ్యాసమును పైనుండి కనిపట్టుచుండుటయు నను నీ పనులు పెద్దవి. ఇటులు నే నింతటితో సంతృప్తిఁ జెందుటచే వేఱు వేఱు ఈడు గల యీ బాలురలో, వేఱు వేఱు పాఠములు చదువు నీ బాలురలో నొక గదిలోఁ గూరుచుండి చదివించుకొనుచు వచ్చితిని.

పాఠ్యగ్రంథములనుగుఱించిన హడావుడి నలుదెసలను వినఁబడుచుండును. నాకు వాని గరజు కనిపింపలేదు. అప్పటి కున్న పుస్తకములతో నేని మా కంతగా పని పట్టినట్లులేదు. బాలురమీఁద పెక్కు పుస్తకములు కుక్కుట యావశ్యకముగాదు. విద్యార్థులకు పాఠ్యగ్రంథమేదని నన్నడిగినచో నుపాధ్యాయుఁడే యని యందును. నాగురువులు పుస్తకములలో నాచేతఁ జదివించిన విషయములు కడుఁగొలఁదియే నాకు గుఱుతున్నవి కాని వారు పుస్తకములలోఁగాక విడిగాఁ జెప్పిన చదువున్నదే అది నేఁటికిని గుఱుతున్నది. బాలురు కనులతో కన్న చెవులతో నెక్కువ గ్రహింతురు; అదియు అనాయాసముగా నేను నాశిష్యులచే నేపుస్తకమేని తుట్టతుదిదాఁకఁ జదివించిన చందము లేదు. పలుతెలుఁగుల గ్రంథములఁ గొలదిగాఁ జదివి నేను జీర్ణము చేసికొనిన విషయములను నాభాషలో వారికిఁ జెప్పుచు వచ్చితిని.

అది నేఁటికిని వారి మెదడులకు పట్టియున్నది. పుస్తకములలోఁ జదివినది గుఱుతుంచుకొనుట వారికిఁ గష్టమాయెడిది. మరియు నేను ప్రత్యేకముగా వినిపించినది గుర్తుంచుకొని, విన్నది విన్నచందమున మరల నాకు వినిపించెడివారు. పుస్తకమునందు వీరి మనస్సు లగ్నమయ్యెడిది కాదు. అలయికచేఁ గాని, కొండొక కారణమునఁ గాని నేను కనులు మలుముకొనకుండ నుంటినేని, నా చెప్పునది నీరసముగా నుండకుండునేని, నా చెప్పిన, లేక వినిపించిన మాటలు వారు చెవులు దోరపెట్టుకొని వినెడివారు. మరియు రసమును గ్రహించెడివారు. అపుడు వారు చేయు శంకలవలన వారి గ్రహణశక్తి యించుమించుగా నాకుఁ దెలియవచ్చెడిది.

ఆత్మశిక్ష

విద్యార్థుల శరీరమునకును, మనస్సునకును సాము నేర్పుటకంటె ఆత్మకు సంస్కారము కలిగించుటలో నేను మిగుల శ్రమ పడ వలసివచ్చెను. నే నిందుల కెక్కువ తత్త్వగ్రంథముల సాయము తీసి కొనలేదు. విద్యార్థులకు తమతమ మతముల మూలతత్త్వములను, తమ తమ మతముల సాధారణజ్ఞానమును ఉండితీరవలయునని నాయుద్దేశము గాన ఇట్టి జ్ఞానము కలుగఁజేయుటకు నాశక్తికొలఁది పాటుపడితిని. కాని యిదియును మనశ్శిక్షకు నొక యంగ మని నాతలఁపు. ఇఁక ఆత్మశిక్షణ మొక ప్రత్యేకవిషయము. టాల్‌స్టాయి-ఆశ్రమమున బాలురకుఁ జదువు చెప్పమొదలిడక పూర్వమే నే నీ సంగతిని గ్రహించితిని. ఆత్మకు వికాసము కలిగించుట యనఁగా చరిత్రనిర్మాణము కలిగించుట, ఈశ్వరజ్ఞానము కలిగించుట, ఆత్మజ్ఞాన మొదవఁ గలిగించుట. ఈ జ్ఞానము కలిగించుటకు బాలురకు కడు సాయము చేయ వలసియుండును. ఇట్టి జ్ఞానము గాక మిగిలిన జ్ఞానము లన్నియు వ్యర్థములు; ఇంతియ కాక హానికరములు—అని నామతము.

మనుష్యున కాత్మజ్ఞానము నాలవ యాశ్రమముననే కలుగు నని వాడుక. ఎవరీ నాలవ యాశ్రమము వఱకును ఈ యమూల్యవస్తువును కడఁబెట్టుదురో వారీయాత్మజ్ఞానమును పొందకపోఁగా, ముదిమిని, మరియు దీనికంటెను దయనీయమగు రెండవ బాల్యమును బొంది భూమికి భారమై పోవుచున్నారు. ఇది యెల్లెడల ననుభూతచరము. ౧౯౧౧-౧౨ సంవత్సరములలో ఈ నా యుద్దేశములను ఈ భాషలోఁ దెలుపఁ బొసఁగలేదు కాని నాఁటి కీయుద్దేశములు కలవని చాల గుఱుతు.

3వ ఆత్మశిక్ష.

ఆత్మకు సాము గఱపు టెటులు? బాలురచే భజన చేయించితిని. వీరికి నీతిపుస్తకములను వినిపించితిని కాని దీన సంతుష్టి కలుగలేదు. బాలురతో నాకు సంబంధ మెక్కువయినకొలఁదిని పుస్తకములవలన వీరికి ఈ జ్ఞానము కలిగింప వీలు లేదని తెలిసికొంటిని. సాము చేసి చూపియే సాము నేర్ప వీలగును. తనమనస్సును సాము చేయించియే ఇతరుల మనస్సుచే సాము చేయింప వీలగును. ఆ రీతిగనే తన యాత్మను సాము చేయించియే ఇతరుల ఆత్మచే సాము చేయింప వీలగును. గురువు ప్రవర్తనవలననే బాలకు లాత్మశిక్షణము నేర్చికొందురు. కావుననే యుపాధ్యాయుఁ డెల్లప్పుడును—విద్యార్థులు తన కడ నుందురుగాక, లేకుందురుగాక—తాను జాగరూకుఁడయి యుండవలయును. ఉపాధ్యాయుఁడు లంకలో నుండుఁ గాక, తన ప్రవర్తనమువలన తన శిష్యుల యాత్మలను మేలుకొలుపఁ గలఁడు. నేను కల్లరినై నా శిష్యులను సత్యసంధులఁ జేయఁగలుగుట వట్టి బూటకము. పిఱికిపంద యగు గురువు తన శిష్యులకు పరాక్రమము నేర్పఁ జాలఁడు. తెప్పి చరించు గురువు శిష్యులకు సంయమ మెటులు నేర్పఁగలఁడు? కావున నాకడ నుండు యువకులయు, యువతులయు ముందు నేనే యొక పదార్థపాఠ మయిపోవలయు నని తెలిసికొంటిని. దీన నా శిష్యులే నాకు గురువు లయిరి. నేను నాకొఱకుఁ గాకున్నను నాకడ నుండు వీరికొఱకయినను మంచివాఁడనయి మంచితనమును కాపాడుకొనుచు నుండవలయు నని తెలిసికొంటిని. టాల్‌స్టాయి-ఆశ్రమమునందలి పలువిధములగు నా సంయమములు ఈ యువకులకును, ఈ యువతులకును కృతజ్ఞములు.

ఆశ్రమమునం దొక కుఱ్ఱఁడు కలఁడు. అతఁడు కడు నల్లరి వాఁడు. కల్లలమారి. ఎవరిని లెక్కగొనఁడు. మిగిలిన కుఱ్ఱలతో

కయ్యములకుఁ గాలుఁ జాఁచును. ఒకనాఁ డతఁడు పట్టరాని యాగడము చేసెను. నా కేమియుఁ దోఁచలేదు. ఏలయనిన నేను విద్యార్థులను దండించి యెఱుఁగను. కాని యపుడు నా కోపము మించిపోయెను. నే నతనికడ కరిగితిని. చెప్పితిని. అతఁడు వినలేదు. మరియు నన్నే తన వలలో వైచికొనఁ జూచెను. నాముందు రూలుకర్ర యొకటి పడియుండెను. దాని నెత్తి యతని చేతిపైఁ గొట్టితిని. కొట్టుచుండఁగనే నాకు కంపమెత్తుకొనుచువచ్చెను. అతఁడును నాకంపమును దప్పక చూచియుండును. విద్యార్థుల కందఱకును ఇది యంతయు నిదివఱ కెన్నఁడు నెఱుఁగని క్రొత్తవింత. ఆ విద్యార్థి యేడ్చెను. క్షమింపు మని వేఁడుకొనెను. అతఁడు తనకు దెబ్బలు తగిలినందుల కేడ్వలేదు; —ఇతఁ డించుమించు పదునేడేండ్ల ప్రాయము వాఁడు, చియ్యా పట్టిన మేనివాఁడు; తలఁచుకొనినచో నతఁడు బదులు తీర్చికొనఁ గలఁడు—కాని కొట్టుచుండఁగా నాకుఁ గలిగిన దుఃఖము నతఁడు తెలిసికొనెను. ఇటుపిమ్మట నతఁ డెన్నఁడును నా కవిధేయుఁడు కాలేదు. కాని నే నటులు రూలుకర్రతోఁ గొట్టినందులకు నేఁటి వఱకు నేను పశ్చాత్తప్తుఁడ నగుచున్నాను. అతనిని కొట్టి నేను నా యాత్మను ప్రకటింపలేదు. మఱి? పశుత్వమును.

బాలకులను పట్టుకొని కొట్టి చదువు చెప్పుట యనిన నాకుఁ గిట్టదు. నాజీవిత మంతటిలో ఒకతూరిమాత్రమే నా కుమారు నొకని కొట్టినటులు గుర్తు. నేను రూళ్లకర్రతోఁ గొట్టుట యోగ్యమయిన దని యింతవఱకును నిశ్చయించుకొనఁ గలిగియుండలేదు. ఇది యుచిత మని చెప్పుటకు నా కింతవట్టును సందియమే. ఏలనఁగా దీనికి మూలము క్రోధము. మరియు దండనమే ఉద్దేశము. ఇందు తెలుప వలసినది కేవలము నాసంతాపము. ఆ సంతాపమునే నేను వెలిఁ బుచ్చి

యుంటినేని ఈ దండ ముచిత మనుకొందును. కాని ఇందు రెండును గలిసియున్నవి. ఈ పని జరిగిన తరువాత విద్యార్థులకు మంచి సంస్కారము కలుగఁజేయుటకు నా కొక యుపాయము దొరకెను. ఆ యుపాయము నపుడుపయోగించినచో నెట్టి ఫల మొందఁగూడెడిదో యిపుడు చెప్పఁజాలను. ఆ కుఱ్ఱఁ డపుడే యా విషయమును మఱచి పోయెను. అతఁ డంతగా బాగుపడినటులును నేఁ జెప్పఁజాలను. కాని యీ ప్రసంగమువలన విద్యార్థులయెడ నుపాధ్యాయుని ధర్మమును గుఱించి విచారింపఁ జాల సామగ్రి దొరకెను. ఇది జరిగిన పిదపఁ గూడ బాలురలో నిట్టి దోషములు కానిపించెను గాని నే నెపుడును దండనీతిని ప్రయోగించి చూడలేదు. నే నిటు లాత్మజ్ఞానము కలుగఁ జేయఁ బ్రయత్నము చేయుచు నేనే యాత్మగుణముల నధికముగాఁ దెలిసికొనఁ గలిగితిని.

౩౮

ధాన్యములో వడ్లు

నా కెన్నఁడును తట్టని విషయ మొకటి కేలన్‌బేకు గారు టాల్‌స్టాయి-ఆశ్రమమున నామనోవీథి కెక్కించిరి. ఆశ్రమము నందలి బాలురలోఁ గొందఱు ఆకతాయిలు, దుండగీండ్రును, తిరుగుఁబోతులును గలరు. నా మూవురు కుమారులును వీరితో కూడిమాడి యుందురు. మరియు నాకుర్రలతో పాటు మఱికొందఱు కుర్రలును వారితోఁ గలిసి తిరుగుచుండిరి. ఇటులు తిరుగుఁబోతులగు ఆ కుర్రలతో నా కుర్రలు కలిసి మెలసి యుండుట కేలన్‌బేకు గారికి కష్ట మనిపించి యొక నాఁడు 'మీకుర్రలను వారితోఁ గలియనిచ్చుట అంత మంచిదని నాకు తోఁచదు. ఆ కుర్రలతో మీకుర్రలను గలిపినందుల నేమి ఫలము? ఆతిరుగుఁబోతుల సావాసమువలన వీరికిమాత్రము దుశ్చారిత్రము కాక వేఱేమి?' అనిరి.

ఈ విషయము విని నేను తిరుగుడు పడితినో లేదో గుర్తుచాలదు కాని అపుడు నా చెప్పిన ఉత్తరము గుర్తున్నది. నాప్రత్యుత్తర మిది: 'నాకుమారులకును ఆ తిరుగుఁబోతులకును నాకు భేద మెటులు చేయఁ జెల్లును? వారికిని వీరికిని నేనే పూఁటకాఁపను. నేను రమ్మంటిని. ఆ కుర్రలు వచ్చియుండిరి. నేను కొన్ని రూక లిచ్చుచో వా రిపుడే జొహాన్సుబర్గుకు పోయి వెనుకటివలెనే సంచరించు చుందురు. ఈ బాలు రిచటికి వచ్చి యుండుట నాకు మెహరబానీ యని వారి తలిదండ్రు లెంచినచో నే నాశ్చర్యము పొందను. వా రిచటికి వచ్చి కష్టములు పడుచున్నారు. ఈ విషయమును మన మిరువురమును ఎఱుఁగుదుము. ఈయెడ నాచేయవలసిన పని నాకు

చక్కగాఁ గానవచ్చుచున్నది. వీరి నిచటనే యుంపవలయును. వాకుర్రలును వీరితో కలిసియే యుండవలయును. మఱియు "మీ రా కుఱ్ఱలకంటె గొప్పవారురా!" యని యిప్పటినుండియే నా కుమారులకు భేదబుద్ధి సహజముగాని మీ రందురా? ఇది వారి బుఱ్ఱ కెక్కుచో తప్పవారిని బాగుపరచగలరు. ఈ స్థితిలో నున్నచో వారికి మంచి శిక్షయు, మంచిచెడుగుల తెలివియు అనాయాసముగాఁ గలుగును. మఱియు "వీరిలో నిజముగా నేదేని గుణ మున్నచో దాని ప్రభావము వారిపై ప్రసరింపఁగల"దని మన మేల యనుకొనరాదు? ఇంక నేమయిన నగుఁగాక! వారి నిటనుండి పంపివైవఁజాలను. నాక కేదేని చెఱుపు గలుగుచో ననుభవింప సంసిద్ధుఁడను.'

కేలన్ బేకుగారు తల యూఁచిరి.

ఈ ప్రయోగమువలన చెడ్డ ఫలము కలిగె నని చెప్పలేను. దీన నా కుఱ్ఱల కెట్టి లోటును కలిగె నని నే ననుకొనను. మఱియు మేలే పొందిరని నే నెఱిఁగితిని. 'మేము గొప్పవారము' అని యేమేని గర్వ మున్నచో నది వీరిని వదలిపెట్టెను. వీ రందఱితో నను గలసియుండుట నేర్చిరి. వీ రిందు పరీక్ష నిచ్చిరి.

తలిదండ్రులు పైనుండి కడు మెలకువతో కనిపట్టి సాఁకుచుందురేని మంచి పిల్లలును, చెడ్డ పిల్లలును ఒకచోటనే యుండుటవలనను, చదువుకొనుటవలనను మంచి పిల్లల కేమియు హాని కలుగదని దీనివలనను, ఇటువంటి మఱికొన్ని యనుభవములవలనను తెలిసికొంటిని. మనము పిల్లలను పెట్టెలోఁ బెట్టి తాళము వేసినచో మంచివారగుదు రనియు, బయటికిఁ దీసినంతనే పాడయిపోవుదు రనియు నిట్టి నియమము మెచటను లేదు. పలు తెఱఁగుల బాలికలను, బాలురను ఒకచో నుంచి చదివించుట తలిదండ్రులయు, ఉపాధ్యాయులయు జాగ్రత్తకు నికషోపలము. వారు కంట వత్తి నిడికొని యుండవలయును.

౩౬

ప్రాయశ్చిత్తరూపమగు ఉపవాసము

బాలురను, బాలికలను మంచి త్రోవలో నుంచి వారికి విద్య గఱపుట యెంత కష్టమయిన విషయమో దీని యనుభవము దినదినము వృద్ధి పొందెను. నేను వారి కుపాధ్యాయుఁడను, పాలకుఁడను అగుదునేని వారి మనస్సులోఁ బ్రవేశింపవలయును. వారి సుఖదుఃఖములలో పాలుగొనవలయును. వారి జీవనరహస్యములను విడఁబఱచి చెప్పవలయును. ఉఱుకుచున్న వారి జీవనతరంగములను సరిగా పాలింపవలెను.

జైలుసాలనుండి కొందఱు సత్యాగ్రహులు విముక్తఁబడినతరువాత టాల్‌స్టాయి-ఆశ్రమమున కొలఁది జనులే యుండిరి. వారును ముఖ్యముగా ఫీనిక్సువారే కావున నేను వారి నచటికిఁ బనిచితిని. నా కచట అగ్నిపరీక్ష జరిగెను. టాల్‌స్టాయి-ఆశ్రమమునుండి వారిని ఫీనిక్సులో దిగఁబెట్టి నేను మరల జోహాన్సుబర్గునకు వెళ్లితిని. జోహాన్సుబర్గునందు కొలఁది రోజు లుంటిని. అపుడు ఆశ్రమమునం దిరువురికి భయంకరమగు పతనము కలిగె నని వింటిని. సత్యాగ్రహము వంటి మహాసంగ్రామ మెటనేని సఫలము కాలే దని విన్నచో నా కంత యాఘాతము కలిగెడిది కాదుగాని యీ వార్త నాకు వజ్రప్రహార మాయెను. నాగుండెయ లదిరెను. నాఁడే ఫీనిక్సు రైలెక్కితిని. నేనును వత్తునని కేలన్‌బేకుగారు పట్టుపట్టిరి. దయనీయమగు నా స్థితి యతనికి గోచరించెను. నే నొంటిగా వెళ్లుట కతఁ డించుకయు నొప్పుకొనలేదు. ఈ పతనవార్త యతఁడు తెచ్చినదే.

దారిలో నాధర్మమును నే నెఱిఁగికొంటిని. పోనిండు, ఎఱిఁగికొంటినని యనుకొంటి ననుకొండు! తన రక్షణమున నున్న

౩౩ ప్రాయశ్చిత్తరూపమగు ఉపవాసము

వారి పతనమునఁ గొలఁదిరో గొప్పరో యంశమునకు రక్షకుఁడు గాని, శిక్షకుఁడు గాని పూఁటకాఁపు లని నేననుకొంటిని. ఈ ఘటనలో వాజవాబుదారి స్పష్టముగా అర్థమాయెను. నా భార్యయు హెచ్చరనే నను మందలించెను. కాని విశ్వసించుట నా స్వభావము. కావున నే నీ మందలింపు నంతగా పాటింపలేదు. నే నా పతనమునకు సంపూర్ణమగు ప్రాయశ్చిత్తము చేయుదునేని ఆ పతితులు నా వ్యథను గ్రహింపఁ గలుగుదు రనియు, తమ దోషమును తా మెఱుఁగఁగలుగుదు రనియు, దీని లోఁతు కొంచెము తెలియఁగల దనియు నాకు తోఁచెను. కావున ఏడునాళ్లు ఉపవాసమును, నాలుగునెలల పదిరోజులనాళ్లు పాటు ఏకభోజనమును చేయుదు నని వ్రతము గొంటిని. కేలన్‌బేకు గారు నన్ను వారింపఁ బూనిరి గాని యది నిష్ఫలమాయెను. తుదకతఁ డీ ప్రాయశ్చిత్తము తగినదే యని యొప్పుకొని తానుగూడ నుపవసింతు నని పట్టుపట్టెను. అతని నిర్మలమగు ప్రేమను నేను నిరసింపఁ జాలకపోయితిని. ఇటులు నిశ్చయించినతరువాత నా గుండెల బరువు తగ్గెను. శాంతి కలిగెను. దోషులపైఁ గ్రోధము పోయి దయ నిలిచెను.

ఇటులు రైలులో బరువు తగ్గించుకొని ఫినిక్సు చేరితిని. శోధన చేసి తెలిసికొనవలసిన సంగతులను దెలిసికొంటిని. నా యుపవాసమువలన నందఱకును కష్టము కలిగెను గాని దాన వాతావరణము శుద్ధమాయెను. పాపము చేయు టెంత భయంకరమో అది యెల్లరకును దెలిసెను. విద్యార్థులయు, విద్యార్థినులయుఁ దోడ నాకుఁ గల సెయ్యము మఱింత దృఢమును, సరళమును ఆయెను.

ఈఘటన జరిగిన కొలఁది కాలమునకు దీనికి సంబంధించియే మరలఁ బదునాలుగునాళ్లుపవసింపవలసిన ప్రసంగము తటస్థించెను. దాని పరిణామము నే ననుకొన్నదానికన్న మిన్నగా జరిగెను.

శిష్యుల దోషము లన్నింటికిని గురువుగా రెల్లపుడును ఉపవాసాదులు చేయుచుఁ గూరుచుండవలసినదని నా యభిప్రాయము గాదు. కాని యిటువంటి కొన్ని విషయములలో ప్రాయశ్చిత్తరూపమయిన ఉపవాసములకు తప్పక స్థానము కలదని నా నమ్మిక. దీని

సరియయిన వివేకమును, అధికారమును వలయును. గురుశిష్యులకు శుద్ధమగు ప్రేమబంధనము లేనిచో, శిష్యునిదోషము గురువునకు సరియగు సాక్షాత్కారము కలిగింపనిచో, గురువుపై శిష్యున కాదరము లేనిచో, నట్టియెడఁ జేయు నుపవాసము నిరర్థకము. మరియు నొకానొకపుడు హానికిఁగూడఁ బట్టు. ఈ యుపవాసములయెడలను, ఏకభోజనములయెడలను శంక లుండుఁగాక! శిష్యుని దోషములలో కొంత యంశమునకు గురువు జవాబుదారీ కల సమాటలో లేశమును శంక లేదు.

ఈ యేణ్ణాళ్ల ఉపవాసమును, ఈయేకభోజనమును నాకుఁ గష్టమనిపింపలేదు. నే నాదినములలో నే పనిని మానలేదు. మందముగాను జేయలేదు. నే నీకాలమున కేవలము ఫలాహారము గొనియుంటిని. పదునాలుగునాళ్ల యుపవాసమున తుది భాగములో కఠిన మనిపించెను. ఆనాళ్లలో రామనామమునకుఁ గల చమత్కారము నే నెఱుఁగను. కష్టము సహించు సామర్థ్యమును నాకుఁ దక్కువ. ఉపవసించు దినములలో నే చంపమున నేని నీరు కడుపారఁ గ్రోలవలయును. ఈ బాహ్యకళ నే నెఱుఁగను. ఈకారణమువలనను ఉపవాసము నాకుఁ గష్టమాయెను. మరియు మొదటి యుపవాసమును సుఖముగా, శాంతముగాఁ జేసితిని గాన నీ పదునాలుగునాళ్ల యుపవాసమున మైమఱచియుంటిని. మొదటి యుపవాసమున నెల్లపుడును కూనీగారి కటిస్నానము లొనరించితిని. పద్నాల్గు నాళ్ల యుపవాసమున మూఁడు నాలుగు నాళ్లు మాత్రము చేసి మానివయిచితిని. నీటిరుచి అసహ్యమాయెను. నీరు త్రావఁగనే ఓకర కలుగునట్టు లుండెను. దాన నీరు కడుఁ గొలఁదిగా త్రావితిని. దీన గొంతెండెను. శరీరము క్షీణించెను. చివర చివరకు మెల్లమెల్లగనే మాటలాడఁ గలిగితిని. ఇటులయ్యు వ్రాఁతకు అక్కఱ కలిగినపుడు తుదినాఁటివఱకును వ్రాయింపఁ గలుగుచునే యుంటిని. రామాయణాదులను తుది వఱకును వినుచునే యుంటిని. కొన్ని ప్రశ్నలకు సమాధానము చెప్పుటకును, ఆవశ్యకములగు కొన్ని పనులు చేయుటకును సమర్థుఁడ నయియే యుంటిని.

౩౮

గోఖలేగారిని కలియఁబోవుట

దక్షిణ-ఆఫ్రికాకు సంబంధించిన చాల విషయముల నిచట దిగఁబెట్టవలసి వచ్చుచున్నది. ౧౯౧౪ సాలున సత్యాగ్రహసంగ్రామము ఆఁగిపోయెను. అపుడు గోఖలేగారు లండనుమీఁదుగా ఇండియాకు రమ్మని వార్తనంపిరి. జూలై నెలలో కస్తురబాయియు, కేలన్‌బేకుగారును, నేనును సీమకు పయన మయితిమి. సత్యాగ్రహసంగ్రామ దినములలో నేను మూఁడవతరగతి బండ్లలోనే కూర్చుండి పయనము చేయ నాకాంక్షించితిని. కావున ఓడలో మూఁడవతరగతి టిక్కెట్టే కొంటిని. అచటి మూఁడవతరగతికిని, మన మూఁడవతరగతికిని చాల భేదము కలదు. మన మూఁడవతరగతి పెట్టెలలో కూర్చుండుటకును, పరుండుటకును తగిన సౌకర్య ముండ దనిన నిఁక పరిశుభ్రత మాట వేఱ చెప్పవలయునా? కాని మాయోడలో దీనికి విపరీతము. వలసినంత చోటు, వలసినంత స్వచ్ఛత. ఓడవారు మాకుఁ జాల సౌకర్యములు కలుగఁజేసిరి. ఇతరుల సంపర్కము లేకుండ మా కొక మఱుఁగుదొడ్డిని ప్రత్యేకించి తాళము వేసి తాళపుఁజెవులు మా కిచ్చిరి. మేము ఫలాహారుల మగుటచే మాకువలసిన పండ్లు నిమ్మని ఖజాంజీకి ఉత్తరు విచ్చిరి. మూఁడవతరగతి బాటసారులకు పండ్లు తక్కువగా నిత్తురు. ఆఱుఁ బండ్లు* అసలే యీయరు. ఇది మామూలు. దీనికి విపరీతముగా మంచి సౌకర్యములతో సముద్రముపై మిగుల శాంతముగా ౧౮ దినములు గడిపితిమి.

ఈ యాత్రలోని కొన్ని విషయము లుదాహార్యములు. కేలన్‌బేకుగారికి దుర్భిణులమీఁద చాల షోకు. వారు వెలగల జోడొకటి

* ముగ్గి ఆఱినపండ్లు : అంగూరము మొ: Nuts-అను.

తమకడ నుంచుకొనిరి. దాని విషయమున మా యిరువురికిని కయ్యాటము జరుగుచుండెను. 'మన ఆదర్శము ప్రమితజీవితము; మన వస్తువులా మిగుల వెల గలవి: ఈ రెంటికి పొందిక యేమది?' అని నే ననుచుంటిని. క్రమక్రమముగా నొకనాఁ డిది రగడలోనికి దిగెను. మే మిరువురమును కేబిను కిటికీకడ నిలుచుంటిమి.

'ఈ జగడగొండిదానిని సముద్రములో పాఱవయిచిన నేమి?' అని నే నంటి.

'తప్పక ఈ జగడాలమారిని పాఱవేయుఁడు!' అని వెంటనే కేలన్ బేకుగా రనిరి.

'చూడుఁ డిదిగోఁ బాఱవైచితిని' అని నే నంటిని.

'హాఁ! నాకును సమ్మతమే' అని వడివడిగా కేలన్ బేకుగా రనిరి.

సరి, నేను దుర్బిణులను విసరి వయిచితిని. దాని వెల ఏడు పౌనులో. కేలన్ బేకుగారికి దానఁగల మోహముకంటె దాని విలువ లెచ్చు. దీనికి కేలన్ బేకుగా రెన్నఁడును విచారింపలేదు. కేలన్ బేకుగారికిని, నాకును నడుమ పెక్కు అనుభవములు కలవు. వానిలో నమూనా కిది యొకటి.

మా కొండొంటఁ గల సంబంధములవలన ప్రతినాఁడును క్రొత్త విషయములు నేర్చికొనుచుంటిమి. ఏలన, మే మిరువురమును సత్యము ననుసరించి సంచరింపఁ బ్రయత్నము లొనరించుచు వచ్చుచుంటిమి. సత్యము ననుసరించుటవలనఁ గ్రోధము, స్వార్థము, ద్వేషము మొదలగు నవి సహజముగ తొలఁగి చనును; తొలఁగి పోవనిచో సత్యప్రాప్తి కలుగదు. రాగద్వేషాదులచే నిండిన మానవుఁడు సరళుఁడు కావచ్చును. వాక్సత్యమును పరిపాలింపవచ్చును. కాని వానికి శుద్ధసత్యప్రాప్తి

కలుగదు. శుద్ధసత్యమును శోధింప దొరఁకొనువాఁడు రాగము, ద్వేషము మొదలగు ద్వంద్వములనుండి ముక్తిఁ బడయవలయును.

ఉపవాస మయిన కొలఁదిదినములకే ఈ పయనము చేసితిని. నాకు మరల వెనుకటి బలము రాలేదు. డెక్కుమీఁద అటు ఇటు నడచి తిన్నదాని నరిగించుకొనఁ గడఁగుచుంటిని. నడచినకొలఁదిని పిక్కలలో నొప్పు లెక్కుడాయెను. సీమఁ జేరువఱకు నొప్పి తగ్గక పోఁగా మఱి కొంచె మెక్కుడాయెను. అచట డాక్టరు జీవరాజ మెహతాగారికడ కరిగితిని. ఉపవాసములను, ఈ నొప్పులను విని 'కొన్నాళ్లు విశ్రాంతి లేనిచో మీ కాళ్లు పడు నను భయము కలదు' అనియతఁడనెను. దీర్ఘోపవాసములు చేసినవారు వడిగా బలము పొందఁగలుగుటకు ఎక్కువగా తినెడి లోభమును మానుకొనవలయు నని యెఱిఁగితిని. ఉపవాసము లొనరించునాఁటికంటె మానుకొను నాఁడు ఎక్కువ మెలఁకువ గొనవలయును. మరియు నొకానొకప్పు డెక్కువ నిగ్రహమును వలయును.

మదీరాకు వచ్చుసరికి 'మహాయుద్ధము నేఁడో రేపో మొగియు' నని తెలియవచ్చెను. ఇంగ్లీషుచానలులో ప్రవేశించుచుఁ బ్రవేశించుచు నుండఁగా యుద్ధము మొగియనే మొగిసె నని వింటిమి. మా కచట నాఁగిపోవలసివచ్చెను. నీటిలో ప్రతిచోటను రహస్యమార్గము లేర్పాటుచేయఁబడెను. దాన మేము సౌతాంప్టన్ చేరుసరికి ఒకటి రెణ్ణాళ్లాలస్యమాయెను. ౪వ ఆగస్టున యుద్ధారంభము. ౬వ ఆగస్టున మేము సీమలో దిగితిమి.

౩౮

యుద్ధములో నా పాలు

సీమకు పోవఁగనే గోఖలేగారు పారిసులో చిక్కుబడిపోయి రనియు, పారిసునకు రాకపోకలు నిలుపుచేయఁబడినవనియు, వారెప్పుడు వచ్చునదియుఁ జెప్ప వీలు లేదనియు తెలిసెను. గోఖలే గారు ఆరోగ్యముకొఱకు ఫ్రాన్సు వెళ్లియుండిరి. పోరు మొదలయఁ గనే వారి రాక కష్టము కలిగెను. వా రెప్పుడు రాఁగలరో యదియు నేరికిని చెప్పఁ దరము కాదు.

ఈలోపుగా నా చేయవలసిన పని యేమి? ఈ యుద్ధమునెడ నా ధర్మ మేమి? జెయిలులో నాకు సహచరుఁడును, సత్యాగ్రహియు నగు సోరాబ్జీ అడాజానియాగారు సీమలో బారిష్టరీ చదువుచుండిరి. సత్యాగ్రహులలో నతఁ డెంచఁదగిన చేయి. కావున దక్షిణ-ఆఫ్రికాలో నా స్థాన మాక్రమించుటకుఁగాను ముందు ఇంగ్లండులో బారిష్టరు పరీక్ష యిచ్చుటకితఁడు పంపఁబడెను. డాక్టరు ప్రాణజీవన మెహతాగా రితనిని భరించుచుండిరి. నేను వీరితోడను, వీరినిబట్టి డాక్టరు ప్రాణజీవన మెహతాగారితోడను, మరియు నచటఁ జదువుచున్న వారితోడను ఆలోచించితిని. అపుడు సీమలో నున్న భారతీయుల నందఱను సమావేశపఱచి నాయుద్దేశములను వారికిఁ దెలిపితిని. సీమలో నున్న భారతీయు లీ సంగ్రామమున తమచేత నయిన సాయము తాము చేయవలయు నని నా యభిప్రాయము. ఆంగ్లేయవిద్యార్థులు తాము యుద్ధములోఁ బని చేయుదు మని ప్రకటించిరి. భారతీయులును వీరికిఁ దీసిపోఁగూడదని నాకోరిక. నా యీ యభిప్రాయములకు విరుద్ధముగా పలువురీ సభలో వాదించిరి. 'ఆంగ్లేయులకును, మనకును ఏనుఁగునకును గుఱ్ఱమునకును గలంత యంతరము. ఒకఁడు దొర, ఒకఁడు

బంటు. అట్టిచో దొరకు నాపద వచ్చినప్పుడు బంటు స్వేచ్ఛాపూర్వకముగా దొర కెట్టులు సాయము చేయ వలనుపడును! మరియు ఆ బంటు తన బంటుతనమునుండి తప్పించుకొనఁ దలఁచునేని తన దొర యాపదను తన మేలుగాఁ జేకొని తప్పించుకొనిపోవుటకు ప్రయత్నించుట పాడి గాదా? అప్పుడీ వాదము నాకు గుటకపడునా? తెల్లవారికిని నల్లవారికిని పెల్లంతరము కలదని నాకుఁ దెలియును గాని మన గతి యింత యధోగతిగా నున్నదని నమ్మిక లేదు. అపుడు నానమ్మిక యేమనియా,—తెల్లవారి యేలుబడి కొంతవరకు మంచిదే కాని కొంద అధికారుల దోషమిం దెప్పుడెనియు, ఈ దోషములనుగూడఁ బ్రేమచే మనము పోకార్పఁగల మనియును. మరియు తెల్లవారి సాయమున మనము మన స్థితిని బాగుపఱచుకొనఁ గోరుదుమేని వారి యాపద గడవఁబెట్టి మన స్థితిని చక్కఁబెట్టుకొనునది యని నామతము. రాజ్యపద్ధతి దోషభూయిష్ఠ మని అపుడు నే ననుకొనినను ఇపు డనుకొనునంత గాదు. నేఁడు నాకు రాజ్యపద్ధతిపై నమ్మిక యెగిరిపోయెను. తెల్ల దొరతనమునకు నేను సాయము చేయఁజాలను. ఈరీతిగా వారికి రాజ్యపద్ధతిపై నమ్మిక మా వాఁటికే పోయెను. ఇంతియ కాక తెల్ల యధికారులయెడలను నమ్మకము పోయెను. ఇట్టి స్థితియందు వారెట్టులు సాయము చేయఁగలను?

ప్రజల హక్కులను నిశ్చయముగాఁ బ్రకటించి పరిపాలనమునందు సంస్కరణములను బడయుటకు అదియే అదను అని వారి యభిప్రాయము. ఇంగ్లీషువారికి వచ్చిన యీకష్టకాలమునందు మనహక్కులను బ్రకటించుట ఉచితమని నాకు తోఁచలేదు. మరియు యుద్ధము జరుగుచున్నంతవరకు మన హక్కులను బ్రకటించుట నాఁపియుంచుకొను సంయమమునందే మన సభ్యతయు, దీర్ఘదృష్టియుఁ గలదని నేను నమ్మితిని. కావున నేను నామాటమీఁదనే నిలువఁబడి స్వయంసేవ

కులంగా చేసిన వ్రాసి యున్నాను వ్రాసి యుంచిని అకలితిని. చాల చేయబడి వచ్చెను. పిమ్మట వాలంటీర్లు అన్ని ప్రాంతములయందు, మతములవారు నాకు చేయూత నిచ్చిరి.

ఈ సన్నాహము నంతయు లార్డ్ క్రూకునకు తెలిపితిని — 'భారతీ యులము యుద్ధమున గాయములు తిను సిపాయిలకు సేవ చేయుటకు చేయదలచినాము. శిక్షణ పొందవలెనన్నచో దానికి సంసిద్ధుల మయి యుంటిమి.' కొంత కాలోచించిన పిదప లార్డ్ క్రూ మా విన్నప మంగీకరించి సామ్రాజ్యమునకు కష్టకాల మగు నీ సమయమున తోడ్పడ వచ్చినందులకు మమ్మభినందించి మాసేవ నంగీకరించెను.

ప్రసిద్ధ వైద్యులగు కేంటలీగారికడ చేర్పించిన వారందఱును ప్రథమాభ్యాస మారంభించిరి. నేర్పిన దారు వారములు. అయినను ప్రథమచికిత్స యంతయు ముగిసెను. ఇందు మే మందఱమును ఎనుబది మందిమి. ఆఱువారముల పిదప జరిగిన పరీక్షలో ఒకరు తక్క మే మందఱమును ప్యాసయితిమి. ప్యాసయినవా రందఱకును సరకారు వారు కవాతు నేర్పించిరి. దీనిని నేర్పు భారము కర్నల్ బేకరుగారిది. వారే యీ సేనకు సరదా రయిరి.

ఆరోజులలో సీమను చూచి తీరవలయును. యుద్ధమునిన నెవరికిని భయము లేదు. ఇంతియ కాక అందఱును యథాశక్తి సాయము చేయుటకు మూఁగుచుండిరి. శక్తిగలవారు యుద్ధపుసాము నేర్చుకొనఁ దొడఁగిరి. మఱి అశక్తులగు వృద్ధులు, స్త్రీలు చేయుచో వీరికిని కలసినంత పని కలదు. గాయములు తగిలినవారికి గుడ్డలు కుట్టుట, కత్తిరించుట మొదలగు పనులకు వారు దొరఁకొనిరి.

అచట ఆఁడువారికి లా ఇసియమ్ అను క్లబ్బు కలదు. ఆందలి వా రందఱును సైనికులకుఁ గావలసిన వస్తులను తమశక్తికొలఁది

తయారుచేయుట భారమును బూనితి. శ్రీమతి సరోజినీదేవియు ౧౦ రొక సభ్యురాలు. ఆం వా మెది నింపుపాలు. అదియే మాకు ప్రథమ పరిచయము. కత్తిరించిన బట్టలు మో పొత్తికి నాయుడు పడవైచి 'కుట్టి పంగిలన్ని కుట్టించి నా కప్పగింపు' మని యామె యనెను. నే నామెకోరికకు స్వాగత మొసరించి మేము నాడు నేర్చుకొను దినములలో నా చేత నయినన్ని వస్త్రములు తయారుచేసి యామె కిచ్చితిమి.

౩౯

ధర్మసంకటము

యుద్ధములో పని చేయుటకు మే మొక సభ చేసికొని మా పేరులు సర్కారువారికి పంపినట్లు దక్షిణ-ఆఫ్రికాకుఁ దెలియఁగనే నాకు రెండు టెలిగ్రాములు వచ్చెను. అం దొకటి పోలాకుగారి కడనుండి— 'మీ పని అహింసాసిద్ధాంతమునకు విరుద్ధము కాదా?'

నే నిటు లాశంకించుచునే యుంటిని. ఏలన 'హింద్ స్వరాజ్' లో నే నీ విషయమును జర్చించియుంటిని. మరియు దక్షిణ-ఆఫ్రికాలో నా మిత్రులతోడ నిరంతరమును దీనిని గూర్చి చర్చించుచునే యుంటిని. 'యుద్ధము చేయుట నీతి కాదు' అని మేమందఱ మంగీకరించి యుంటిమి. 'నాపైఁ బడి కొట్టినవానిపై అమలు జరుపఁగూడ' దనుకొను నేను రెండు రాజ్యములవారు కయ్యమునకు దిగఁగా అందు సత్పక్ష మెవరిదో, అసత్పక్ష మెవరిదో నాకుఁ దెలియనపుడు, సాయము చేయవచ్చునా?' అని ప్రశ్న. బోయరుయుద్ధమున నేను పాలుగొంటి నని నా మిత్రు లెఱుఁగుదురు. పిదప నా యుద్దేశములు మాఱియుండు నని వారి తలఁపు.

నే నే వాదసరణికి వశుఁడనై బోయరుయుద్ధమునఁ బడితినో ఆ వాదసరణియే న న్నిందుఁ బ్రేరేపించెను. 'పోరాటమున పాలుగొనుట అహింసాసిద్ధాంతమున కనుకూలము కాదని నాకు లెస్సగాఁ దెలియును. కాని మానవున కెల్లపుడును తనకర్తవ్యము దివ్వెవలె భాసము కాదు. సత్యారాధకుఁడు పలుమాఱులు ఈ రీతిగా గోతఁ గూలవలసి వచ్చుచుండును.

3. ధర్మసందేహము

అహింస యొక్క వ్యాపకమగు వస్తువు. మనము హింసాదావానలమునఁ జిక్కుపడిన ప్రాణులము. జీవుఁడు జీవుని దిని బ్రతుకు నను మాట * కల్లగాదు. బాహ్యహింస చేయక జీవుఁ డొక క్షణమైన బ్రతుకఁజాలఁడు. తినుట, త్రాగుట, కూర్చుండుట, లేచుట మొదలగు సకలక్రియలయందును ఇచ్ఛచేఁగాని, అనిచ్ఛచేఁగాని మనుజుఁ డే కొంచెము హింసనో చేయుచునే యున్నాఁడు. ఎవఁ డీ హింస చేయకుండుటకు చాలఁ బ్రయాసపడునో, ఎవఁ డిట్టి యహింసాచే జాలిగొనునో, ఎవఁడు చీమకేని కీడు వలఁపఁడో. మరియు దానిని బ్రతికించుటకు శక్తికొలఁది పాటుపడునో వాఁ డహింసారాధకుఁడు. అట్టివాని ప్రవృత్తిలో నిరంతరము నిగ్రహము పెంపొందుచుండును. ఇతనిలో నిరంతరమును కరుణ వృద్ధిఁ బొందుచువచ్చును. కాని దేహధారి యెవఁడును బాహ్యహింసనుండి తప్పుకొనఁ జాలఁడు.

మరియు అహింసలో అద్వైతభావన గర్భితమయి యున్నది. ప్రాణులన్నియు నొకటియే యగుచో నొకదాని పాపప్రభావము మిగిలినవానిపైని బ్రసరించును గావునను మానవునకు హింసాస్పర్శ తప్పదు. సంఘమునందుండు మానవుఁడు తన కిచ్ఛ లేకున్నను సంఘపు హింసలో భాగస్వామి యగుచున్నాఁడు. ఇట్టియెడ రెండురాష్ట్రములు యుద్ధమునకు దిగినపుడు అహింసావలంబి యగు వాని ధర్మమేమి? యుద్ధమును నాఁపుటయే ధర్మము. ఎవఁ డీ ధర్మమును పరిపాలింపఁ జాలఁడో, ఎవఁడు నిరోధింపఁజాలఁడో, ఎవఁడు నిరోధింపఁ గల అధికారముఁ బడయనేరఁడో అట్టివాఁడు ఏమి చేయవలయును? యుద్ధమునకే దిగఁజెల్లును. దిగి తనను, తన దేశమును, ప్రపంచమును ఉద్ధరించుటకు సంపూర్ణమగు ప్రయత్నమును చేయఁజెల్లును.

---

* జీవో జీవస్య జీవనమ్.

వెల్లవారి తోడుపడుటవలన నా స్థితిని, అనఁగా నా ప్రజాస్థితిని, చక్కఁబఱుప వలయునని నాకోరిక. నే నిపు డింగ్లండులో నుంటిని. మఱియు ఇంగ్లండు నౌకాబలమున కాపాడఁబడు చుంటిని. ఈరీతిగా నీ బలము నుపయోగించుకొనుచు దీని హింసలో నేనును భాగస్వామి నయితిని. కావున నే నీరాజ్యముతోడ గట్టి సంబంధమునే పెట్టుకొనవలయుచో, ఈ రాజ్యపు బావుటా క్రింద నిలువఁబడ వలయుచో 'యుద్ధము కూడదు' అని వాదించి చెప్పి ఈ రాజ్యపు యుద్ధనీతి మాఱునంతవఱకును సత్యాగ్రహశాస్త్రము ననుసరించి బహిష్కరింప వలయును; లేక భంగింపఁదగిన శాసనములను భంగించి చెఱసాల లెక్కడ నున్నా యని వెదకుకొనుచుఁ బోవలయును; లేక యుద్ధములో పాలుగొని దాని నడఁపఁగల సామర్థ్యమును సంపాదింపవలయును. 'నిరోధించుశక్తి మనకు లేదు, మన కొకటే దారి, అది యుద్ధములో పాలుగొనుట' యని నేను నిశ్చయించుకొంటిని.

తుపాకి పేల్చువానియెడలను, వానికి సాయము చేయువాని యెడలను అహింసకు వ్యత్యాసము లేదు. బందిపోటుగాండ్రలో నుండి వారి మూటలు మోసి, వారికి పైకాఁపుండి, వారికి గాయములు తగిలినపుడు కట్టు కట్టి సేవించువాండ్రును బందిపోటు వాండ్రవంటివాండ్రే. ఈ రీతిగానే యుద్ధమున గాయములు తినిన వారికి సేవచేయువారుగూడ యుద్ధదోషమునుండి తప్పుకొనఁజాలరు.

పోలాకుగారికడనుండి తంతి రాకమునుపే నే నిటులు విచారించుకొనుచుంటిని. వీరి తంతి వచ్చిన పిదప వెంటనే మరల కొందఱు మిత్రులతో చర్చించితిని. యుద్ధమున పాలుగొనుట నా ధర్మమని అనుకొంటిని. నేఁటికిఁగూడ నీ విచారసరణి దోషగ్రస్తము కాదని నా నమ్మకము. ఆ సమయమున బ్రిటిషుసామ్రాజ్యసంబంధమునఁ గల

నా యుద్దేశముల ననుసరించియే నేను యుద్ధమున పాల్గొంటిని గావున దానిగూర్చి నా కించుకయును పశ్చాత్తాపము లేదు.

నా మాట బాగుగా నున్నదని ఆనాఁడును మిత్రు లందఱు చేతను ఒప్పింపఁజేయుట శక్యము కాదు అని నాకుఁ దెలియును. ఇది కడు సూక్ష్మ మగు విషయము. ఇందు మతభేదముల కవకాశము కలదు. కావున అహింసాధర్మమును విశ్వసించి దానిని జాగరూకతతో పరిపాలించువారికడ తేటతెల్లముగా నా యభిప్రాయమును విన్నవించుకొంటిని. సత్యాగ్రహ మొనరించువాఁడు రూఢిబలమున, అనఁగా పరంపరాగతమగు ఆచారబలమున, నే పనియుఁ జేయ నక్కఱలేదు. అతఁడు తన యభిప్రాయములందే ఆరూఢుఁడయి యుండవలయును. దాన దోష ముండునేమో యని కను గలిగి యుండవలయును. తప్పు కలదని తెలిసినపిమ్మట దాని నెత్తిని చాల్చి ప్రాయశ్చిత్తమునుగూడఁ జేసికొనవలసి యుండును.

౪౦

సత్యాగ్రహ [illegible]

నేనిటులు నా కర్తవ్య మెంచి యుద్ధమునందు ప్రవేశించినను సాక్షాత్ ప్రవేశించు నాయదృష్టమున వ్రాసిపెట్టఁబడియుండక పోవుటయేగాక అట్టి యాపత్సమయమునందుగూడ నేను సత్యాగ్రహము నడిపింపవలసిన స్థితి నాకుఁ గలిగెను.

మా పేరులు మంజూరు చేయఁబడి నమోదు చేసికొనఁబడిన వెంటనే మాకు కవాతు నేర్పుట కొక యధికారి నియమింపఁబడెనని వ్రాసియుంటిని. ఈ యధికారి యుద్ధపు కవాతు నేర్పుటలో మాత్రము నాయకుఁడనియు, మిగిలిన అన్ని విషయములందును మా టుకిడీకి నేను నాయకుఁడ ననియు మాయందఱి యభిప్రాయము. నా సహచరుల జవాబుదారీ నాది, అతనికి నేను జవాబుదారీ; అనఁగా ఈ యధికారి అన్ని పనులను నాద్వారమున నడుపవలయును అని మాయందఱి యుద్దేశము. కాని ఆ యధికారి కన్నులు వేఱు రీతిగా ఉన్నవని మాకు మొదటినాఁడే తెలిసెను. సోరాబజీ కడు జాగరూకుఁడు. అతఁడు నన్నిటులు హెచ్చరించెను: 'ఏమండోయ్! ఈయన తాను చక్రవర్తి అనుకొని తన అధికారమునంతయు మనమీఁద చెలాయించునటు లున్నాఁడు. మనకు ఈయన హుకుముతో జరూరు లేదు. ఇతఁడు మన కొక పంతులు. ఈయన పంపిన ఆ క్రొత్త కుఱ్ఱలుగూడ మన మీఁద హుకుములు నడుపఁదలఁచుచున్నారు.' ఈ క్రొత్త కుఱ్ఱవాండ్రు ఆక్స్‌ఫర్డులోని విద్యార్థులు. వీరు మాకు నేర్పవచ్చిరి. పెద్ద ఆఫీసరు గారు వీరిని మాలో కొన్ని భాగములకు నాయకులనుగా నియమించిరి. సోరాబజీ గారు చెప్పిన విషయము నేను సోరాబజీకి చల్లమాటలు చెప్పి

‘ఈ విషయమున అంతగా వగచవలదంటిని. కాని సొరాబ్జీ వెంటనే ‘సరే’ అనునట్టివాఁడు కాఁడు.

‘మీరు కట్టి జోళ్లవారు. మీరు తియ్యతియ్య మాటలు చెప్పి మాకు సౌఖ్యము చూపింతురు. మీరు కనులు తెఱచికొని పాఱఁ జూచి అప్పుడు ‘ఇంక డీక సత్యాగ్రహము చేయుఁడు’ అని అందురు. అప్పైని మీకును మాకును దుఃఖింపకతప్పదు’ అని సొరాబ్జీ నవ్వుచు పలికెను.

‘నా సావాసమువలన దుఃఖము గాక మఱి యేమి మీకుఁ జేకూరు ననుకొందురు? సత్యాగ్రహి మోసగింపఁబడుటకే జన్మమెత్తెను. కావున నతఁడు నన్ను మోసగింపనీ! మోసగించువాఁడే తుదకు మోసగింపఁబడు నని వేయిమారులయినను మీకుఁ జెప్పియుందునే’ అని నే నంటిని.

సొరాబ్జీ పకపక నవ్వి ‘మంచిది, ఇఁక మోసములోఁ జొరుఁడు! మీ రెపుడో యొకనాఁడు సత్యాగ్రహములోఁ జత్తురు; మమ్ములఁగూడ మీవెనుకఁ దీసికొని పోయి చంపుదురు’.

ఈ మాటలను వ్రాయుచుండఁగా మిస్ హాబ్‌హౌస్‌గారి మాటలు గుర్తు వచ్చుచున్నవి. నాన్‌కో ఆపరేషన్ రోజులలో ఈమె నా కిటులు వ్రాసెను—‘సత్యమునకుఁగాను ఎపుడో ఒకపుడు మీకు ఉరిశిక్ష పడుటొక వింత కాదు ఈశ్వరుఁడు మీకు సత్పథమును జూపుఁగాక! ఈశ్వరుఁడు మిమ్ము రక్షించుఁగాక!’

ఆ యధికారి యధికార మారంభించిన మొదటిదినములందే సొరాబ్జీకిని నాకును పయి సంభాషణ జరిగెను. కాని ఆ ఆరంభమునకును అంతమునకును నడుమ నెన్నో దినములు పట్టలేదు. ఇంతలో నా యూఁపిరితిత్తులలో వాఁపు ఎక్కువాయెను. పదునాల్గునాళ్ల

ఉపవాసము వలన [illegible] నాకిదివరకు బాగుపడలేదు, [illegible] కవాతు [illegible]. కవాతు మైదానము నాకు రెండు మైళ్ళదూరము. అక్కడికి తరుచు నడచియే పోవుచుంటిని. అందువలన గాను [illegible] ఎక్కువైపోయెను.

నాకు ఆట్టి స్థితిలో కాంపునకు పోవలసి వచ్చెను. అందఱును కాంపులోనే యుండుచుండిరి. నేనుమాత్రము రాత్రికి ఇంటికి వచ్చుచుంటిని. అప్పుడు సత్యాగ్రహమున కవకాశము కలిగెను.

ఆ యాఫీసరు ఇష్టము వచ్చినట్లు హుకుములు జారీచేయఁ దొడఁగెను. అన్ని విషయములయందును 'నేనే మీకు అధికారి' నని అతఁడు తేలతెల్లము గా చెప్పెను. చెప్పుటయే కాక దాని రుచిగూడఁ గొంచెము చూపెను. సోరాబ్జీ నాకడకు పరుగెత్తుకొని వచ్చెను. అతఁడా యధికారమును సహింపఁజాలకుండెను. అతఁడిట్లనెను: 'ఏ హుకుము వచ్చినను అది మీ ద్వారమున రావలయును. నేఁటికిని మనము కవాతు నేర్చుకొను కాంపులలోనే యున్నాము; అప్పుడే మనపై పాడు హుకుములు! ఆ క్రొత్తయుద్యోగి వారలకును మాకును చాల తేడా చూపఁబడుచున్నది. అది దుస్సహము. అది వెంటనే తొలఁగ వలయును. కానిచో మన పని యంతయు భగ్నమగును. మన విద్యార్థులలోఁ గాని, మనతోపాటు దీనిలోనికి దిగిన మనవారలలోఁ గాని యెవఁడును పాడు హుకుమును సహింపరాదు. ఆత్మగౌరవమునకుఁ గాను ఇందుచేరి దీనిలో అవమానమును వహించుట కాని పని'.

నేనా యాఫీసరు కడకు వెళ్ళి నాకడకు వచ్చిన ఫిర్యాదుల నన్నిటిని వినిపించితిని. అతఁడిట్లు నాకు వ్రాసెను—'మీ ఫిర్యాదు లన్నియు వ్రాసి నాకుఁ బంపుడు.' దీనితోఁ దన యధికారమునుగూడ జతపఱచి— 'ఫిర్యాదులు మీ ద్వారమున రాఁగూ

సెను. ఆ యా భాగములకు నాయకు లయినవారి ద్వారముననే రావల యును.' దీనికి నే నిట్టులు ప్రత్యుత్తరించితిని—'నా కధికారముతోఁ బని లేదు, యుద్ధన్యాయమును బట్టి చూచినచో నే నొక మామూలు సిపాయిని. నేను మా తుకిడీకి ముఖ్యుఁడను. నన్ను ఈ తుకిడీకి ప్రతినిధిగా మంజూరు చేయుఁడు.' అని మరియు నాకడ నున్న ప్రియాదుల నిట్టులు తెలిపితిని: 'మాతో సంప్రతింపకుండ కుర్ర ఆఫీసరులను మా మీఁదఁ బెట్టినందువలన మాకుఁ జాల నసంతుష్టి కలిగినది, కావున వీరిని దీసివేయునది. ఆట్టి నాయకుల నేర్పాటు చేసికొను వీలు తుకిడీకే కలిగింపవలసినది.'

ఈమాట లాయనకు గుటక పడలేదు. 'తుకిడీవారే ఆఫీసరుల నెన్నుకొనుట యుద్ధన్యాయమునకు విరుద్ధము. ఇఁక ఆఫీసరులను తీసివేయుచో తుకిడీకి ఆదుపాజ్ఞలు అక్కఱ లేదన్న మాట' అని ఆయన నాతో ననెను.

పిదప మే మొక సభ చేసికొంటిమి. సత్యాగ్రహమువలనఁ గలుగు గంభీరమగు పరిణామమును వారి కెఱుకపఱచితిని. ఇంచుమించుగా అందఱును సత్యాగ్రహ శపథముఁ బూనిరి. లోఁగడ నియమించిన క్రొత్తకుర్ర ఆఫీసరులను తామే యెన్నుకొను నధికారము తుకిడీ కీయనిచో తుకిడీలోనివా రందఱును ఇఁకమీఁద కవాతుకుఁ గాని, క్యాంపుకుఁ గాని వెళ్లఁగూడదు అను తీర్మానము పలువురచే నంగీకరింపఁబడెను.

పిదప నే నా యాఫీసరు కొక యుత్తరము వ్రాసితిని. అందు మా అసంతుష్టిని ప్రకటించితిని. నా కధికారకాంక్ష లే దనియు, మా పని సేవామాత్రమే యనియు, సాంగోపాంగముగా మే మా పనిని చేయఁగోరుచున్నా మనియును వ్రాసితిని. మరియు బోయరు యుద్ధ

మునఁ గూడనే నే యాఫ్రికాదేశమును బడయలేదనియు కర్నల్ గోల్ వేకను మాకను అప్పు డెట్టి నివారణమును తలఁ స్థింపలేదనియు. అందుచే సా ధ్యారమున మా సంకిద్ధియొక్క ఉద్దేశములను గమఁగొని అన్యాయములను జేసెడివాఁ డనియు వ్రాసితిని. ఈ యుత్తరముతో మా తీర్మానపు నక లొకటి పంపితిని.

ఈ యుత్తరము వానిపై ఇసుమంతయును కదిలింపఁ జాలక పోయెను. నేను మిత్రులు సభ చేసి యీ తీర్మానము గావించుటయుఁ గూడ యుద్ధనియమోల్లంఘన మని యతఁడు తలఁచెను.

ఇటు పిమ్మట ఈ విషయము లన్నియుఁ వ్రచ్చి హోస్త్రము భారతమంత్రి కొక యుత్తరము వ్రాసితిని. దానితో మా తీర్మానమును గూడఁ బంపితిని.

భారతమంత్రి యిట్లు ప్రత్యుత్తర మొసఁగెను: 'దక్షిణ- ఆఫ్రికాలో స్థితి వేఱు; ఇక్కడి స్థితి వేఱు. ఇచట పెద్ద ఆఫీసరుకు చిన్న ఆఫీసరులను నియమించు హోదా కలదు. అయినను ఇఁకముందు ఆ యాఫీసరు మీమాటల నాలకింపఁగలఁడు.'

పిమ్మట మా యిరువురిమధ్యను ఉత్తర ప్రత్యుత్తరములు చాల జరిగెను. కాని ఆ గోడు నంతయు నిచటఁ జెప్పుకొని యీ ప్రకరణమును బెంచఁగోరను.

కాని ఆ గో డెట్టి దనఁగా, మనము ప్రతిదినమును హిందూదేశ ములో ననుభవించు గోడువంటిదే యను మాటమాత్రము చెప్పక తప్పదు. ఆ యాఫీసరు నవమాన, భయపెట్టన మాలోఁ గొందఱను చీలఁ దీసెను. శపథము తీసికొనినను మాలోఁ గొందఱు ఛలమునకును, బలము నకును బలియైరి. ఇంతలో గాయములు తినిన సోల్జరులు అనుకొన

నంతమంది నెటలీ ఆసుపత్రిలో వచ్చిపడిరి. వీరికి శుశ్రూష చేయుటకు మా తుకిడీ తుకిడీతో అక్కఱ యొదవెను. ఎవరిని ఈ యాఫీసరు తనవైపునకుఁ ద్రిప్పుకొనెనో వారు నెటలీకి వెళ్ళియుండిరి కాని యితరులు పోలేదు. ఇది ఇండియాఆఫీసుకు బాగుండలేదు. నేను మంచము పట్టితిని గాని మా తుకిడీవారితో సంబంధ ముంచుకొనియే యుంటిని. మి. రాబర్ట్సుతో నాకు గాఢపరిచయము కలిగెను. అతఁడు నన్నుఁ గలిసికొని మిగిలినవారి నందఱనుగూడఁ బంపుమని వేధించెను. ‘ఈ మిగిలినవా రందఱును వేఱే ఒక తుకిడీగా నేర్పాటయి నెటలీ ఆసుపత్రికి వెళ్ళవలసిన దనియు, వారి కచటి పెద్ద ఆఫీసరుతోనే గాని చిన్న ఆఫీసరులతో సంబంధ ముండదనియు, దాన ఆత్మగౌరవమునకు హాని కలుగదనియు, ఇటులు చేయుచో సరకారువారు సంతసింతురనియు, ఇపుడు గాయపడినవారు పలువురు వచ్చిపడిరి గాన వారికి ఉపచార మొదవఁగల దనియు అతఁడు చెప్పెను. ఈ మాట మాయందఱకును నచ్చెను. ఉండిపోయిన విద్యార్థులందఱును నెటలీకి వెళ్ళిరి. నే నొక్కఁడనే పండ్లు కొఱుకుకొనుచు మంచమునఁ బడి మూలుఁగుచుంటిని.

గోఖలేగారి ఔదార్యము

సీమలో నాకు కలిగిన ఊపిరితిత్తుల వాపునుగూర్చి వ్రాసి యుంటిని. నేనటులు జబ్బుపడి యుండగనే గోఖలేగారు సీమకు వచ్చిరి. నేనును, కేలన్‌బేకుగారును ప్రతిదినము వారికడ కరుగుచుంటిమి. మా ప్రసంగములో నెక్కువపాలు యుద్ధమును గురించి. కేలన్‌బేకుగారికి జర్మనీ భూగోళమెల్లను సమగ్రమున తాంతరించుచుండును. మరియు కేలన్‌బేకుగారు యూరోపుఖండము యాత్ర లొనరించి వచ్చిరి. కావున వారు యుద్ధమునకు సంబంధించిన ప్రదేశముల నన్నిటిని గోఖలేగారికిఁ జూపుచుండిరి.

మా ప్రసంగములలో నాజబ్బుగూడ నొకటి. నాఁటికిని నేను తినుబండములను పరీక్షించుచునే యుంటిని. వేరుసెనగలు, పచ్చి యరఁటులు, పండిన యరఁటులు, నిమ్మలు, ఆలివునూనె, కర్పూర వంగలు, ద్రాక్షలు మొదలగునవి నా తినుబండము. పాలు పప్పులు ధాన్యములను ముట్టుటలేదు. జీవరాజ మెహతాగారు నన్ను జూచి పోవుచుండిరి. పాలు ధాన్యములు తీసికొను మని వీరు నాకు నొక్కి చెప్పిరి. ఈమాట గోఖలేగారి చెవులకుఁగూడఁ బ్రాఁకెను. ఫలాహార మునకు సంబంధించిన నా యభిప్రాయములు వారికి చాలవట్టు రుచింపవు. ఆరోగ్యరక్షణమునకు డాక్టరుగారి మాటలు వినవలయునని వారి యుద్దేశము.

గోఖలేగారి మాట వినకుండుట నాకు చేతఁగాని పని. వారు పట్టు పట్టిరి. ఆలోచించుకొనుటకు ఇరువదినాలుఁగుగంటలు నాకవకాశ మొసఁగుఁడని వారినిఁ గోరితిని. కేలన్‌బేకుగారును, నేనును ఇంటికి వచ్చితిమి. 'ఇప్పుడు నా చేయవలసిన దేమి?' అని నేను కేలన్

వేరుగారితో నాలోచించితిని. ఈ ప్రయోగమున నీవు నాకు సహాయులు. ఈ ప్రయోగము నాకెక్కుడు ముఖ్యముగా నుండెను. కాని ఆరోగ్యమును రక్షించి యీ ప్రయోగము విడనాడుటయే వారి కిష్టము. ఇంక మిగిలినది నే నొక్కఁడనే. నేను నా యంతరాత్మను నాలకింపవలయును.

రాత్రియంతయు నాలోచనలో మునిఁగితిని. నే నిప్పు డీ ప్రయోగములను విడనాడుదు నేని నా యుద్దేశము లన్నియు మట్టిఁ గలియును. పోనీ, నా యాలోచనలలో పొరపాటు కలదని యందుమా, అదియుఁ గానిపింపదు. కావున నిప్పుడు చేయవలసిన దేమి? గోఖలేగారి ప్రేమను ఎంతవట్టు పాటించుట ధర్మము? ఆ శరీరరక్షణమునకుఁగాను ఈ ప్రయోగము నెంతవట్టు తగ్గించుట యుక్తము? అని యాలోచించి, ఈ ప్రయోగమున 'ధర్మమునకుఁ జేటు రాకుండునంతవట్టు కాపాడుకొనవలయునని నా యధీనమున నుంచుకొనవలయు ననియు, మిగిలిన విషయము లన్నియు డాక్టరుకు వశపఱుపవలయు ననియు నిశ్చయించితిని. నా క్షీరత్యాగమునకు బీజము ధర్మము. పాలొక చుక్కయేని లేకుండ పిండుటకుఁగాను కలకత్తాలో ఆవులకును గేదెలకును కలిగించు హింసలు నా కనులకుఁ గట్టినటు లుండెను. మరియు మాంసమువలెనే పాలును మనుష్యునకాహారము కాదను విషయము గూడ నా బుర్రలో నుండెను. కావున క్షీరత్యాగము నిశ్చయించుకొని, తలబరువు తగ్గించుకొని చీఁకటితో లేచితిని. కాని గోఖలేగారి భయము పోలేదు. కాని నా నిశ్చయమును అనుమతింతురని నమ్మకమును లేకపోలేదు.

సాయంకాలమున మే మిరువురమును గోఖలేగారి దర్శనమునకు నేషనల్ లిబరల్ క్లబ్బులోనికిఁ బోయితిమి. వారు మమ్ముఁ జూచుచునే—'డాక్టరుగారి మాట విన నిశ్చయించితిరా?' అని యడిగిరి.

నేను చల్లగా నిట్లంటిని — 'మీ రెన్నిమాటలు చెప్పినను గాని మీ రొకదానికొఱకు మాత్రము పట్టు పట్టకుఁడు! పాలు, పాలతోఁ జేసిన వస్తువులు, మాంసము తినిని నేఁ గొనను. వీనిని గొనకున్నచో మృత్యువు వచ్చునన్నచో, రానిండు! దానిని కౌఁగిలించుకొనుటయే ధర్మ మనుకొందును.'

'ఇది మీ చివరమాటయా?' అని గోఖలేగా రడిగిరి.

'చివరమాట మఱి యొకటి యుండదు అని అనుకొనెదను. దీన మీకు కష్టము కలుగు ననుకొందును గాని నన్ను క్షమింపుఁడు.' అని నే నంటిని.

గోఖలేగారు కష్టపడినను మిగుల ప్రేమతో నిట్లనిరి: 'మీ మాట నాకు రుచింపలేదు. ఇందు ధర్మ మను మాటయే నాకుఁ గాన రాదు. కాని ఇఁక మిమ్మొప్పింపఁ బ్రయత్నింపను.' అని యిట్లు పలుకుచు జీవరాజ మెహతాగారివైపు తిరిగి, 'ఇఁక గాంధీని కొట్టి పెట్టవద్దు. అతఁడు పెట్టుకొనిన హద్దులో పుచ్చుకొనఁదగిన వస్తువులనే పుచ్చుకొనుమనుఁడు' అనిరి.

డాక్టరుగారి కనిష్టముగనే యుండెనుగాని, పాపము, వా రేమి చేయఁగలరు? 'ఇంగువ పోగిచిన మినప కట్టు పుచ్చుకొ'మ్మనిరి. 'చిత్త' మంటిని. రెండు మూఁడునాళ్లు త్రాగియుఁ జూచితిని. అది ఉపయోగింపక పోఁగా వాఁపెక్కుడాయెను. అది నాకు పడలేదు. మరల పండ్లలో పడితిని. డాక్టరుగారు పై యుపచారములు చేయుచునే యుండిరి. దానఁ గొంచెము శాంతి చిక్కెను. కాని నా నియమములు వారికి మహాప్రాణములు. ఈనడుమ గోఖలేగారు అక్టోబరు నవంబరు నెలలలో లండనులో పట్టు పొగమంచులకు ఆఁగలేక దేశమునకు పయనించిరి.

౪౨

వాఁపులకు వైద్యము

ప్లూరెసి పిరితిత్తులవాఁపు నిమ్మళింపలేను. దానఁ గొంచెము భయపడితిని. మందు దీనికిఁ గొఱగాదనియు, ఆహారపరివర్తనము చేతను, బాహ్యోపచారములచేతను జబ్బు తప్పక పోఁడా యుననియు నాకుఁ దెలియును.

ఆన ౧౯౧౪ సంవత్సరమున నేను డాక్టరు ఏలిన్‌సన్ గారి నెఱుఁగుదును. ఆయన తినుబండములు మార్చి వ్యాధులు కుదుర్చును. నేను వారి నాహ్వానించితిని. నా శరీరము చూపించితిని. నాకును, పాలకును విరోధమని వారికిఁ జెప్పితిని. వెంటనే యతఁడు హెచ్చరికతో—'పాలతో ఎంతమాత్రమును పని లేదు. ఇపుడు కొన్నాళ్ళు మీకు క్రొవ్వుకలిగించు పదార్థములు లేకుండఁ జూతును' అని రొట్టె,* పచ్చికూరలు, పండ్లు మాత్రమే తినుమని చెప్పెను. పచ్చికూరలలో ముల్లంగి, ఉల్లి వంటివి. పండ్లలో ముఖ్యముగా నారింజలు. పచ్చికూరలను కసకస నమలి తినవలయును. ఇటులు రెండు మూఁడు నాళ్లు తిని చూచితిని. పచ్చికూర లఱుగలేదు. అపుడా ప్రయోగమును విధిప్రకారము చేసి చూడఁగల శక్తి నాకు లేదు. మరియు నమ్మకమును లేదు. డాక్టరుగారు కిటికీతలుపు లిరువదినాలుగు గంటలును తెఱచియుంచవలసిన దనియు, నులివెచ్చ నీరు పోసికొమ్మనియు, వాఁపు మీఁద నూనె రాయుమనియు, పావుగంటయో అరగంటయో గాలిలో నడువు మనియుఁ జెప్పిరి. నాకీ యుపచారములు బాగుండెను. అక్కడివి ఫ్రెంచి కిటికీలు. వీని నిండారఁ దెఱచి యుంచినచో వర్షోదకము లోనికి వచ్చును. పైనున్న వెలుఁగుకంతలు తెఱవఁ దగినవి

* Brown bread

కావు. కావున అద్దపు బుడ్లు గొట్టి ఇటునిటు నాలుగు గంటలును గాలి వచ్చుటకు వాకిళ్ళు వేయించితిని. వాన రానిచో పరదాను కిటికీలను తెఱచి యుంచుమని చెప్పితిని.

ఇంత చేసిన తరువాత కొంత శాంతి కలిగెను గాని సంపూర్ణారోగ్యము కలుగలేదు. సిసిలియా రాబర్ట్సు దొరసాని వచ్చిన న్నెప్పుడు నాకు తోడ్పడుచుండెను. మాకు మైత్రి కలిగెను. నాచేత పాలు త్రాగింపవలయు నని గంపెండాశ. కాని నేను త్రాగను. కాబట్టి పాలవలె పనిచేయు పదార్థములను ఆమె యాలోచింప సాగెను. ఎవరో మిత్రుఁడొకఁడామెకు మాల్టెడ్ మిల్క్‌ను సూచించెను. అతఁడం దొక పాలచుక్కయైని లేదని చెప్పెను. పాప, యతఁ డెఱుఁగఁడు. మరియు పాలలోఁ గల గుణము లన్నియును అందుఁ గలవనియు, అది రసాయనశాస్త్ర ప్రకారము చేయఁబడిన ఒక ద్రవ్యమనియు నతఁ డామెకుఁ జెప్పెను. సిసిలియా రాబర్ట్సు దొరసానికి నా ధర్మదృష్టియెడఁ గడు నాదరము కలదని నే నెఱుఁగుదును. కావున నే నామాల్టెడ్‌మిల్క్‌ను కొంత తీసి నీళ్లలోఁ గలిపి పుచ్చుకొంటిని. సరిగా పాల రుచి. నీరు త్రాగి 'ఇ ల్లెవరిది?' అని అడిగినటుల త్రాగినపిదప సీసామీఁది చీటి చూచితిని. అది పాలతోఁ జేయఁబడిన ద్రవ్యమని తెలిసెను. అంతటితో దానిఁ బాఱవయిచితిని. ఈసంగతిని దెలుపుచు 'ఇందులకు మీ రిసుమంతయు విచారింపవల'దని సిసిలియా రాబర్ట్సు దొరసానికి వ్రాసితిని. చూచుచునే ఆమె మా యింటికి ఒక్కపరుగున వచ్చి తన పొరపాటునకు కడు వగచెను. ఈమెమిత్రుఁడు పాప మా చీటి చూడలేదు. నే నామె నూఱడించితిని. 'మీ రింతగా కష్టపడి నాకు సమకూర్చిన యీ ద్రవ్యములు పుచ్చుకొనఁ జాలనందులకు నన్ను క్షమింపుఁ' డని కోరితిని. తెలియక పుచ్చుకొన్నందులకు పశ్చాత్తాపముతోఁగాని, ప్రాయశ్చిత్తముతోఁగాని యిసుమంతయుఁ బని లే దంటిని.

కతి వాఁపులకు వైద్యము

ఈ వ్యాధిని గుఱించి చాల విషయములు నాకు గుఱుతున్నవి గాని వానిని వర్ణింతును. పలు విపత్తులలో, పలు విరోధములలో ఆశ్రయ మొసఁగిన మిత్రులు నాకు పలువురు గలరని గుర్తు తెచ్చికొందును. ఈశ్వరుఁడు దుఃఖములు అను చేఁదు మందులతో పాటు మైత్రి యను తియ్యని అనుపానమునుగూడఁ బెట్టు నని శ్రద్ధాళువగువాఁడా గుర్తులలోఁ గాంచఁగలఁడు.

డాక్టరు ఏలిక్సనుగారు రెండవతూరి చూడవచ్చి మఱి కొన్ని వస్తువులకు సెలవొసఁగిరి. శరీరమున క్రొవ్వు పట్టుటకు వేఱు సెనగ, వెన్న లేక ఆలివ్ నూనె పుచ్చుకొను మనిరి. పచ్చికూరలు పడనిచో వండి అన్నములోఁ దినుమనెను. ఈ పదార్థములు నా కనుకూలములు.

కాని రోగము నిర్మూలము కాలేదు. చాల జాగ్రత్తగా ఉండవలసియే యున్నది. నే నింకను మంచమునుండి లేచుట లేదు. డాక్టరు మెహతాగారు నడుమనడుమ వచ్చి చూచి పోవుచుండిరి. 'నామాట ప్రకారము నడచుకొనినచో మీకు నిర్మూలింపఁజేయుదు' నని వచ్చినపుడెల్ల అని పోవుచుండిరి.

సంగతు లీరీతిగా జరిగిపోవుచుండఁగా నొకనాఁడు రాబర్ట్సను గారు మాయింటికి ననుఁ జూడవచ్చి, 'మీ రిఁక దేశమునకు వెళ్లిపొండు! మీ రీ స్థితిలో సెటలీకి పోఁజాలరు. ముందున్నది ముసళ్ల పండుగ! మంచు! మీకు దేశముననే గాని యిచట నిర్మూలింపదు. కావున మీరు తప్పక దేశమునకు వెళ్లుఁడు! అంతవఱకును యుద్ధము జరుగుచునే యుండునేని మీకు ఆరోగ్యము కలుగుచో అచటనే యుండి సాయము చేయుటకు వలసినంత యవకాశము కలదు. ఇప్పటికే మీరు చేసిన సాయమేమాత్రమును తక్కువైనది కాదు' అని పలికిరి.

మీ రిచ్చిన సలహా బాగున్న దనిపించెను. నేను దేశమున కేఁగుటకుఁ బ్రయత్నము చేయఁదొడఁగితిని.

ఆత్మకథ

ఈ గాలి సోఁకకుండ దేశమునఁ బడుటకు తొందర యొత్తెను. ఏడెనుకు చేరుటకు ఇల్లు చేరినటులే యుండెను. దక్షిణ–ఆఫ్రికాలో నాకు ఏడెన్‌వారితో పరిచితి గలదు. భాయి కేకోబాద్ కావసజీ దిన్షాగారు పరనను వచ్చియుండిరి. నాకు వారితోను, వారి భార్యతోను ఎక్కువ స్నేహము కలిసెను. కొలఁది నాళ్లలో బొంబాయి చేరుకొంటిమి. దేశమునకు ౧౯౦౫ సంవత్సరములో రాఁగలనని యాశ యుండెడిది. కాని పదియేండ్లు దాఁటిన తరువాత వచ్చుటచే చాల నానందమాయెను. గోఖలేగారు బొంబాయిలో నాకు స్వాగత మొసఁగుటకు సకలసన్నాహములను జేసిరి. వారి కారోగ్యము లేదు. లేకున్నను బొంబాయి వచ్చిరి. వారి దర్శనము చేసికొని వారిలోఁ గలిసిపోయి తలబరువు తగ్గించుకొనవలయు ననునాశతో బొంబాయి వచ్చితిని. కాని బ్రహ్మగారు దానికి మాఱు వ్రాఁత వ్రాసి యుంచుకొనిరి.

ప్లీడరీలో కొన్ని గుర్తులు

ఇండియాకు వచ్చినపిదప నా జీవన మెట్లు నడచెనో వానిని గూర్చి చెప్పకముందు, ఇచ్ఛాపూర్వకముగా విడనాడిన కొన్ని విషయముల నుల్లేఖించుట తప్పనిసరి యని తోఁచుచున్నది. వకాలతు విషయములు కొన్ని వ్రాయుమని నామిత్రులు కోరుచున్నారు. వాని నన్నిటిని వ్రాయుచో నది యొక గ్రంథ మగును. మరియు నవి యన్నియు నీగ్రంథపుటెల్లి కావలివి. కొన్ని సత్యమునకు సంబంధించినవి కలవు. వాని నుదాహరించుట యనుచిత మనిపించుకొనఁబడదు.

నాకు గుర్తు గలంతవఱకు నా వృత్తిలో నే నెన్నఁడును అసత్యమునకుఁ బూనుకొని యుండలేదని లోఁగడనే చెప్పియుంటిని. మరియు నావృత్తిని కేవలము లోకసేవ కర్పణ మొనర్చితిని. కడుపు కూటికే ఫీజు గొంటిని. ఒక్కొక్కప్పు డదియు లేదు. ఈ మాటలతో నావకాలతు పనిని గుఱించి యంతయుఁ జెప్పినట్లే. కాని నా మిత్రులింకను జెప్పుమనుచున్నారు. నే నీ విషయమును కొఁదిగనో, గొప్పగనో వ్రాయఁజొచ్చినచో, దాన సత్యమును నే నెటుల పాలింపఁగలిగితినో తెలియనగు ననియు, దాన వకీళ్లు తెలిసికొనఁ గల విశేషము లుండఁగల వనియు వారి యభిప్రాయము.

'ప్లీడరులకు కల్లలాడక తెల్లవాఱదని నా విద్యార్థిదశనుండియు నేను వినుచునే యుంటిని. నాకు పేరక్కఱలేదు. ముల్లె యక్కఱలేదు; ఇఁక కల్లతో నేమిపని?

దక్షిణ-ఆఫ్రికాలో ఈ నా నియమమునకు పలుమాఱు లొఱపిడి కలుగుచు వచ్చెను. మా ప్రతివాదులు తమ సాక్షులకు బడి పెట్టి,

వ్రాయించి, చదివించి, అక్షేత్తకని విధము కావున నేనును నా క్లై
యంటును గాని, సాక్షులును గాని కల్లలాడుటకు 'కిసూక్ష్మ-గోల్మాలు'చే మా
కేసు గెలుచునని నాకుఁ దెలియును. కాని నే నెప్పుడును అట్టి ప్రలో
భనమునకు లొంగలేదు. ఒకకేసు గెలిచిన తరువాత నా క్లయంటు నన్ను
మోసగించునటులు కనఁబడిన విషయ మొకటి మాత్రము గుర్తుకలదు.
'నా క్లయంటు చెప్పునది సత్యమైనయెడల నే గెలుచుఁగాక! అసత్య
మైనచో ఓడిపోవుఁగాక!' అను నుద్దేశ మొకటియే నాహృదయమున
నెల్లపుడు నుండెడిది. ఓటమిని బట్టి, గెలుపును బట్టి ఫీజు నిర్ణయించు
కొనిన గుఱుతు నా కెన్నఁడును లేదు. కేసు గెలుచుఁ గాక, ఓడుఁ
గాక! నాపనికి ఫీజెంతయో అంతయే. గెలిచెనని యెక్కువ లేదు;
ఓడె నని తక్కువ లేదు. 'మీ కేసు కల్లయైనచో నాకడకు రావలదు.
సాక్ష్యము బనాయింపఁ దలఁచికొనుచో నాయాశ పెట్టుకొనవల'
దని మొదటనే నేను క్లయంట్లకు చెప్పుచుంటిని. దీనితో జూటా కే
సొకటియు నాకడకు వచ్చెడిది కాదు. కల్లయు, కపటమును లేని
కేసులనే నాకిచ్చి కల్ల యొక పిస రున్నను అట్టి కేసులను మఱొక
వకీలుకడకుఁ దీసికొని పోవు క్లయంట్లను నే నెఱుఁగుదును.

నన్ను కఠినముగా పరీక్షింపవచ్చిన కే సొకటి కలదు. అది నా
క్లయంట్లందఱిలో పెద్ద క్లయంటుది. అది యంతయు జమా ఖర్చు
లెక్కల చిక్కుముడి. అది యెన్నాళ్లనుండియో విచారింపఁబడుచు
వచ్చుచున్నది. అం దనేకభాగము లనేకన్యాయస్థానములలో కొంత
కొంత విచారింపఁబడెను. అందలి లెక్కలచిక్కు లెక్కలు బాగుగా
వచ్చిన పంచాయతీకి అప్పగింపఁబడెను. పంచాయతీతీర్పు పరిపూర్ణ
ముగా మా కనుకూలము. కాని వీరి లెక్కలలో ఒక చిన్న తప్పుండెను.
అగుట కది చిన్నదే కాని పాడుచేయుటకు పెద్దది. పంచాయతీవారి
పొరపాటుచే ఖర్చులో పడవలసిన పద్దు జమలో పడ్డది. ప్రతివాదు లీ

పంచాయతీవారి తీర్మానమును రద్దుపఱుపవలసిన దని దరఖాస్తు* పెట్టిరి. నేను మాక్లయంటుకు చిన్నవకీలును. పెద్దవకీలుగారికి పొరపాటు తెలియునుగాని పంచాయతీవారు చేసినపొరపాటును క్లయంటు ఒప్పుకొనవలసిన పని లే దని వారి యభిప్రాయము. వాదికి నష్టము కలిగించు ప్రతివాదిమాట యే వకీలును ఒప్పుకొనఁగూడదని స్పష్టముగా ఆయన చెప్పివైచెను. కాని నే నిటు లంటిని: 'ఈ కేసులో నున్న పొరపాటును మన మంగీకరింపవలయును.'

పెద్ద వకీలు గా రిటు లనిరి: 'మన మంగీకరించుచో కోర్టువారికి తీర్పు నంతయును రద్దుపఱుతు రని భయపడుచున్నాను. తెలివిగల వకీ లెవఁడును తన క్లయంటు నిట్టి యాపదకు పాలుచేయఁడు. ఈ యాపదను నెత్తిని బెట్టుకొను సాహస మిసుమంతయు నాకు లేదు. ఈ కేసు పునర్విచారణకు వచ్చుచో మన క్లయం టెంత వ్యయము భరింపవలసి యుండునో, తుద కీ కేసు ఎటులు పరిణమించునో యెవరు చెప్పఁగలరు?'

మా కీ సంవాదము జరుగునపుడు క్లయంటుగూడ నచట నుండెను.

'మన క్లయంటును, మనముఁగూడ నీ సాహసమునకు దిగవలయును. మన మొప్పుకొనకపోయినప్పటికిని కోర్టువా రా తప్పు తీర్పు నంగీకరింతు రని నమ్మక మేమిటి? ఈ తప్పును దిద్దుకొనక యూరకుండుట వలన క్లయంటు కేమైన నష్టము అనుభవింపవలసివచ్చుచో అర్థమేమి!'

'మన మస లొప్పుకొనక పోయిన నేమి!' అని పెద్దవకీలుగారనిరి.

---

* "ప్రతిపక్షి తీర్పును వేఱుకారణములచే నెదిరించిరి" అని ఆంగ్లానువాదము—అను.

'మనము జయముఁ బెట్టినచో కోర్టువారికిఁ గాని, ప్రతివాదులకుఁగాని ఇది పట్టుపడ దని నిశ్చయ మెక్కడ?' అని నే నంటిని.

'అటు లయినచో ఈ కేసులో మీ రికఁ వాదించెదరా? తప్పు నొప్పుకొను షరతు పెట్టుకొని నే నీ కేసులో వాదింపఁజాలను' అని పెద్దవకీలుగారు దృఢముగాఁ బల్కిరి.

నేను వినయముతో నిటు లంటిని: 'మీరు రానిచో క్లయంటంగీకరించునేని నేను వాదించుటకు సంసిద్ధుఁడను. తప్పు నొప్పుకొనక నే నీ కేసులో పనిచేయుట అసంభవము.'

నే నిటు లని క్లయంటుమోము చూచితిని. అతఁడు కొంచెము వికలుఁ డాయెను. నే నీకేసులో మొదటినుండియు పని చేయుచుంటిని. నాపై నతనికిఁ జాల నమ్మకము. నా స్వభావముకూడ సంపూర్ణముగా నతనికి వాకఫే. కావున నతఁ డిటు లనెను: 'మంచి మాట, తమరే వాదింపుఁడు, తప్పొప్పుకొనుఁడు. ఓటమి వ్రాసియున్నచో ఓడుదుముగాక! సత్యమును కాపాడు నీశ్వరుఁడు లేఁడా?'

నే నానందించితిని. అతఁడు వేఱుగా పలుకు నని నే ననుకొనలేదు. పెద్దవకీలు నన్ను ముదలకించెను. నా సాహసమునకు జాలిపడెను. దానితోపాటు నాకు ధన్యవాదములను సమర్పించెను.

కోర్టులోముచ్చట ముందు.

చాతుర్యమా?

నేనొసంగిన సలహా మంచి దనుటలో శంకయే లేదు. కాని ఈ కేసునకు పరిపూర్ణమైన న్యాయము కలిగింపఁగలనా, లేనా యని నాయెడల నాకే కావలసినంత శంక. ఇంత ఒడుదొడుకుగా నున్న యీ కేసులో, అందును సుప్రీముకోర్టులో వాదింపఁబోవుట చెడ్డ సాహస మనిపించెను. గుండెదడతో నేను జడ్జీలయెడల నిలువఁబడితిని. నే నీ పొరపాటును బయటఁబెట్టఁగనే జడ్జి యిటు లనెను: 'ఇది చాతుర్య మనిపించికొనదా?' నా మొగము జేగురుగడ్డ యాయెను. ఇందు మోస మేమాత్రము లేకపోవుటవలన ఆ యారోపణము నాకు దుస్సహ మాయెను. 'జడ్జీగారు మొదటనే అసూయాగ్రస్తుఁడాయెను. కఠినమగు నీ కేసెటులు గెలుచునా?' యని నేను గుంజాటన పడితిని.

నా రోషము నాఁపుకొంటిని. శాంతుఁడ నయితిని. ఇటు లంటిని: 'అయ్యా, మీ రిటు లనుట నా కాశ్చర్యముగా నున్నది. నామాటలు తుదకంట వినకుండ మొదటనే 'చాతుర్య' మని నింద నారోపింపఁ దొడఁగితిరి.'

'నేను నింద నారోపింపలేదు, కేవలము నా శంకను ప్రకటించితిని' అని జడ్జిగా రనిరి.

'తమ శంకయే నిందయంతగా నున్నది. నావాదము నంతయు నాలకించి శంకకు తా వున్నచో తమరు తప్పక శంకింపవచ్చును' అని నే నంటిని.

'మీకు నే నడ్డు దగిలినందులకు వగచుచున్నాను. మఱి మీరు చెప్పవలసిన దంతయుఁ జెప్పుఁడు.' అని జడ్జిగారు శాంతులయి పలికిరి.

నా విషయమును నేను స్పష్టముగాఁ దెలుపుటకు నాకు కావలసినంత తావు వున్నది. జడ్జిపున్యాయమా యని మొదటనే శంక నెత్తి వంతములఁజేసి నా వాదము జడ్జిగారి మనస్సునకు చక్కగా పట్టునటుల చేయఁగలిగితిని. దీనితో నాకు ధైర్యము కలిగెను. నా చెప్పవలయు మాటల నన్నిటిని వివరించితిని. కోర్టువారు నా మాటల శాంతముగా నాలకించి ఆ పొరపాటు కేవలము కన్ను చెదరుటవలనఁ గలిగె నని తెలిసికొనిరి. మరియు చాల పరిశ్రమించి తయారుచేసిన లెక్కను రద్దుపఱచుట వారికి రుచింపలేదు.

మేము తప్పు నొప్పుకొనుటవలన తమ కింక నంతగా వాదింపవలసిన పని పట్టదని ఎదిరి వకీలుగా రనుకొనిరి. కాని ఈ తప్పెట్టిదో తెలిసిపోవుటవలనను, దిద్దుబాటు చేయుటకు వీలయిన దగుటవలనను పంచాయతీవారు చేసిన తీర్పును రద్దుపఱచుట కోర్టువారికిష్టము లేకపోయెను. ఎదిరి వకీలు తల బాదుకొనెనుగాని మొదట నాపై నను మానము చెందిన జడ్జీ ఇపుడు సంపూర్ణముగా నావైపునకు మ్రొగ్గెను.

'గాంధీగా రా తప్పు నొప్పుకొననిచో మీ రేమి చేయుదురు?' అని జడ్జి ప్రశ్నించెను.

'మేము తీసికొని వచ్చిన లెక్కగాఁడు చిత్రగుప్తునంతటివాఁడు. అతనికన్న తెలివిగలవాఁడును, ప్రామాణికుఁడును మఱియొకఁడు దొరకఁగలఁడా?'

'మీ కేసు మీకు బాగుగా తెలియు నని కోర్టువారి యుద్దేశము. ఇటువంటి తప్పు ఎంతటి చిత్రగుప్తునకైనను వచ్చును. ఈ తప్పును తేలికగా దిద్దవచ్చును. ఈ తప్పుకంటె క్రొత్త దేమియు మీరు చెప్పుకొనఁగలది లేకపోయినయెడల నిఁక పునర్విచారణ మెందులకు?

ఇందుల కుభయపక్షములవారికిని ఖర్చు లెందులకు ? ఇట్టి పని కోర్టు తలపెట్టదు.' అని జడ్జి యనెను. దీనిచేతను, మఱికొన్ని ఇట్టి వాదముల చేతను వకీలును శాంతపఱచి కోర్టువారే ఆ తప్పును దిద్దిరో, లేక దిద్దుబాటును పంచాయతీకి వదలిరోగాని, దిద్దిన తీర్పును ఖాయపఱచిరి.

ఇఁక నా సంతోషమునకు మితి లేదు. నా క్లయంటును, పెద్ద వకీలును సంతసించిరి. ప్లీడరీలోఁగూడ సత్యమును దప్పకుండ నుండ వగు నను నా యుద్దేశము మఱికొంచెము బలపడెను.

దుకాణముగా పెట్టుకొనిన వకీలువృత్తియొక్క పునాదిలో దోసము కలదు. దానిని దీనిచేత మాయఁజేయుట కష్టమని గుఱుతుంచుకొనవలయును.

౪౬

క్లయింట్లు సహచరులగుట

నేటాలు ట్రాన్సువాలులలో వకాలతునుగురించి భేదము గలదు. నేటాలులో ఆడ్వొకేటనియు, ఎటర్నీయనియు రెండు భేదములు కలవు. ఆడ్వొకేటుగాఁ జేర్చుకొనఁబడిన బారిస్టరు ఎటర్నీగాఁగూడ అన్ని కోర్టులలోను పని చేయవచ్చును. ట్రాన్సువాలులో బొంబాయిలో వలె భేదము కలదు. అడ్వొకేటు తన క్లయింట్ల పనుల నన్నిఁటిని ఎటర్నీలచేత చేయించుకొనవలయును. బారిస్టరయినవానికి అడ్వొకేటు ఎటర్నీలలో ఏదో ఒక పని చేయుటకు మాత్రమే సన దుండును. నేను నేటాలులో అడ్వొకేటుసనదును, ట్రాన్సువాలులో ఎటర్నీ సనదును పుచ్చుకొంటిని. అచట అడ్వొకేటు సనదును పుచ్చుకొంటినేని నాకు భారతీయులతోడ సాక్షాత్సంబంధము కలుగదు. మరియు తెల్ల ఎటర్నీలు నాకు కేసుల నిప్పింపఁగల మంచితనముకూడ దక్షిణ-ఆఫ్రికాలో లేదు.

ట్రాన్సువాలు మేజిస్ట్రీటు కోర్టులో నాకుఁ జాల పని యుండెడిది. నే నొక కేసులో వాదించుచుండఁగా నాక్లయింటు నన్ను మోసగించె నని తెలిసికొంటిని. అతని దావా వట్టి కల్ల. బోనులో నిలువఁబడియుండినవాఁడు నిలువున కూలిపోవుట లాయెను. మా క్లయింటుకు వ్యతిరేకముగ తీర్పు జెప్పుఁ డని నేను కూర్చుంటిని. నా యెదుటి వకీ లాశ్చర్యపడెను. మేజిస్ట్రీటు సంతసించెను. నేను నా క్లయింటును చీకొట్టితిని. నేను దొంగకేసు పట్ట నని నాక్లయింటెఱుఁగు. నేను తప్పొప్పుకొనినందులకును, వ్యతిరేకముగా తీర్పు జెప్పుఁ డనినందులకును అతనికి కోపము కలుగలే దనుకొందును. అయిన దాయెఁ గాని నా యీ ప్రవర్తనవలన నా కించుకయు చెడు పేరు రాలేదు. ఇంతియకాక కోర్టులలో నా పని సరళ మాయెను. మరియు

౪. క్లయంట్లు సహచరులగుట

సత్యప్రాజవలన వకీలుమిత్రులలో నా ప్రతిష్ఠ వర్ధిల్లెను. నేను వల్లవాఁడెయినను కొన్ని కేసులలో తెల్లవారి ప్రేమను చూరఁగొనగలవాఁడ నయితిని.

నాకు తెలియని సంగతిని నా క్లయంట్లకడఁగాని, ఎదుటి వకీళ్ల కడఁగాని దాఁచుట యనునది నా స్వభావము కాదు. నాకు తెలియని విషయములలో నా క్లయంట్లను మఱియొక వకీలుకడకుఁ బొమ్మనువాఁడను. నన్నే పట్టుకొని ప్రాఁకులాడినచో అనుభవము కల వకీలు సలహాను తీసికొని పని చేయించుకొను మనువాఁడను. ఈ నిష్కాపట్యము నా క్లయంట్ల నుండి అగాధప్రేమవిశ్వాసములను నాకు సంపాదించి పెట్టెను. నా క్లయంట్లు పెద్దవకీలు-ఫీజుగూడ సంతోషముతో నిచ్చుకొనుచుండిరి.

ఈ ప్రేమవిశ్వాసములు నా ధర్మకార్యములకు సంపూర్ణముగా నుపయోగించెను.

దక్షిణ-ఆఫ్రికాలో నేను వకాలతు చేయుటకుఁ గల కారణము కేవలము లోకసేవ కని పూర్వప్రకరణమునఁ జెప్పియుంటిని. ఆధర్మకార్యములకొఱకేని ప్రజల ప్రేమవిశ్వాసములు నాకు సంపాదింపవలసి యుండెను. అచట ఉదారహృదయులగు భారతీయులు ధనము పుచ్చుకొని నా చేసిన పనిని ప్రజాసేవ యని గౌరవించిరి. తమ హక్కులకుఁగాను చెఱసాలలకుఁ బోయి కష్టపడవలసిన దని నేను సలహా యిచ్చినపు డెల్ల చెరసాలలకు వెళ్లిరి. అందఱి యోగ్యతను తెలిసికొని చెఱసాలకు వెళ్లిరా, లేక నాయందలి ప్రేమవిశ్వాసములచే వెళ్లిరా యనినచో నాయందలి ప్రేమవిశ్వాసములచేతనే వెళ్లి రన వలయును.

ఇది నేను వ్రాయుచుండఁగా వకాలతునాఁటి చాల సంగతులతో నా కల మంతయు నిండిపోవుచున్నది. వందలకొలఁది క్లయంట్లు ప్రాణమిత్రులై, ధర్మకార్యములందు సహచరులై కఠినమగు నా జీవనమును రసమయముగఁ జేసివైచిరి.

క్లయంటుకు భుజ తప్పట

పారసీ రుస్తుంజీగారి పేరు పాఠకులకు నెరిగినదే. అతఁడు నాకడకు వచ్చుచునే క్లయంటును, సహచరుఁడు నాయెను. ముందర సహచరుఁడై పిదప క్లయంటాయె ననుటయే యుక్తమని తోఁచుచున్నది. నాయెడల నాతనికి దొడ్డ నమ్మకము. అతఁడు గృహకృత్యములలోఁగూడ నా సలహాను పుచ్చుకొని దానిప్రకార మాచరించెడివాఁడు. మాకు మతభేద మించుక యున్నను అతనికి జబ్బు చేసినచో నా కూరఁగాయవైద్యముతోడనే పని పట్టెడిది.

ఈ నా సహచరున కొకతూరి గొప్ప ఆపద తటస్థించెను. ఇతఁడు తన వ్యాపారమునకు సంబంధించిన మాటలన్నియు నాకుఁ జెప్పెనుగాని ఒక మాటమాత్రము దాఁచెను. పారసీ రుస్తుంజీ దొంగ సరకులు తెప్పించుచుండెను. అతఁడు బొంబాయి కలకత్తాలనుండి సరకు దిగుమతి చేయించుకొనుచుండెడివాఁడు. దానిచాటున దొంగ సరకుగూడ వచ్చెడిది. ఆఫీసరులకును, రుస్తుంజీకిని మంచి దోస్తీ కలదు. కావున నతనియెడ నెవరికిని నిసుమంతయు శంక లేదు. వా రతనియెడఁ గల నమ్మకముచే పట్టీప్రకారము సుంకము వసూలుచేసికొని పోవుచుండెడివారు. తమకు తెలిసినను కనులు మూసికొని పోవువారును కొంద ఱుండవచ్చును.

కాని ఆఖోకవి పలుకెన్నఁడేని అసత్యమగునా?—

క. అద్దమువలె మతి యన్నపు
మద్దవలెం బాదరసపు ముద్దవలెన్ మేల్

సుద్దవతె దొంగసా త్తది
కద్దన్నను వచ్చి కొనఁబడుచునె యుండుగా.*

పారసీ రుస్తుంజీగారి దొంగతన మొకతూరి పట్టుబడెను. ఆయన నాకడకు పరుగెత్తుకొనుచు వచ్చెను. ఆయన కనులవెంట నీరు ధారాప్రవాహముగాఁ బ్రవహించుచుండెను. అతఁ డిటు లనెను : 'భాయీ! నేను నిన్ను మోసమున ముంచితిని. నా పాపము నేఁడు పండి బ్రద్దలయినది. నేను దొంగసరకులను తెప్పించితిని. నా నెత్తిమీఁద జైలుకు పోవలయు నని వ్రాసిపెట్టియున్నది. నే నిఁక చచ్చినట్లే. ఈ యాపదలో నీ వొక్కఁడవే నన్ను బ్రతికింపఁగలవు. నేను నీ కేమియు దాఁచలేదు. కాని యిది వర్తకపుజిత్తు. దీనిని నీ కెటులు చెప్పఁగలను? కాన దాఁచితిని. ఇందులకు పశ్చాత్తాపపడుచున్నాను.'

నే నతని నోదార్చి యిటు లంటిని: 'నారీతి నీకుఁ దెలియును. రక్షించుటయు, రక్షింపకుండుటయు పరమేశ్వరాధీనము. కాని మీ పాపమును మీ రొప్పుకొందురేని నే నీ యాపదనుండి తప్పింపఁగలను.'

ఆ పారసీకుని తల పడిపోయినటు లాయెను.

'నేను మీముందు ఒప్పుకొంటిని. ఇది చాలదా?' అని రుస్తుంజీసేఠనెను.

'సర్కారుకు తప్పుచేయుటా? నాకడ తప్పొప్పుకొనుటా?' అని మెల్లమెల్లగా జవాబు చెప్పితిని.

'సరియె, మీరు చెప్పినటులే చేయుదునుగాని నా ప్రాఁతవకీలుతో సలహాచేయరాదా? అతఁడు నాకు వకీలేగాక మిత్రుఁడు' అని పారసీ రుస్తుంజీ యనెను.

---

* కాచో పారో ఘావో అన్న
తేవుం ఛే చోరీ నుం ధన. (అఖో)

సోదాచేయఁగా ఈ దొంగవర్తకము చాలకాలమునుండి జరుగుచు వచ్చుచున్నట్లు తెలిసెను. ఇప్పుడు పట్టుబడిన దొంగతనము కనుఁగొనఁబడెను. మేము ప్రాంతవకీలుకును చేరితిమి. ఒకరోజు కేసంతయూ ఆలోచించెను. 'ఈకేసు జూరీకి పంపెదను. జూరీవారు భారతీయులను విడిచిపెట్టుదురా? అయినను నా ప్రయత్నము చేయుదును' అని పలికెను.

నా కక్షికునితో మాటాడవలసినది లేదు. పార్సీ రుస్తుంజీసేఠ్ యిట్లు జవాబు చెప్పెను:

'తమ కిందులకు కృతజ్ఞుఁడను. కాని నేను నా కేసులో గాంధీగారు చెప్పినట్లుగానే నడుచుకొందును. వారికి నా సంగతి బాగా తెలియును. వలయుచో మీరు వారితో సలహా నీయఁ గోరెదను.'

ఇంత లచట వెంటనే ముగించుకొని రుస్తుంజీగారి దుకాణమున కరిగితిమి.

నే నిట్లు అంటిని: 'బహుశా ఈ కేసు కోర్టునకు పోదు. కేసు పెట్టుటయూ మానుటయూ సుంకముల యధికారి* చేతిలో నున్నది. సరకారువారికి సలహా యిచ్చు పెద్దవకీలు ఏటర్నీ జనరలు చెప్పిన ప్రకారముననే ఈ సుంకముల యధికారి నడుచుకొనవలసి యుండును. నేను వారిరువురిని తప్పక కలిసికొందును. కాని వారికి సంగతి యంతయు తెలియనియెడల నిపుడు చెప్పవలసివచ్చును. వారు వేసిన జరిమానాను చెల్లింపవలయును. తొంబదితొమ్మిదిపాళ్లు వా రంగీకరింతురు. నా కొకవేళ అంగీకరింపరేని మీరు జైలు కెక్కవలయును. జైలుకు పోవుటలో లజ్జ లేదు; కాని దొంగతనముచేయుట సిగ్గుచేటని నా యభి

* సుంకములు వసూలుచేయువానికి సుంకరి, సుంకీఁడు, సుంకరీఁడు ఈ మొదలగునవి తెలుఁగుపేరులు. ఇంగ్లీషుపేరు Customs Officer—అను

ప్రాయము. అది జరుగనే జరిగెను. జైలులో పడవలసినచో దానిని ప్రాయశ్చిత్తముగా తలపోయుండు. 'ఇక ముందెన్నడును ఇట్టి దొంగ పని చేయను' అని శపథము చేయుటయే నిక్కమయిన ప్రాయశ్చిత్తము'.

పారసీ రుస్తుంజీగారు నా మాటలను సరిగా గ్రహించిరో లేదో నేను చెప్పజాలను. అతడు కడు ధీరుడు; కాని యీ సమయమున ధైర్యమును కోలుపోయెను. అతని ప్రతిష్ఠ పోవు సమయము తటస్థించెను. ఇంత కష్టపడి కట్టుకొనిన యీ కోటను కూలద్రోయుట కష్టము కాదా?

అతడిట్లనెను: 'నా ప్రాణములు మీచేతిలో నున్నవి. మీ సెలవు ప్రకారము చేసెదను.'

ఈ కేసులో నా వినయశక్తి నంతయు ధారపోసితిని. నేను సుంకరిని గలిసికొంటిని; దొంగతనము నంతయు నిర్భయముగా జెప్పివేసితిని. వలసినచో తమకు లెక్కల నన్నిటిని జూపుదు నంటిని. మరియు పారసీ రుస్తుంజీగారికి ఇందులకు మిగుల పశ్చాత్తాపము కలిగెనని చెప్పితిని.

ఆ సుంకరి ఇట్లనెను: 'పాప మా పారసీవృద్ధుడు మంచివాడు. చాల మూర్ఖత చేసినాడు. కాని నా విధి మీ రెఱుగుదురు. పెద్ద వకీలుగారి యిష్టప్రకారము నేను నడచుకొనవలసి యుండును. మీరు వారితో మాటలాడినచో ప్రయోజన ముండును.'

'మీరు పారసీ రుస్తుంజీని కోర్టుకీడ్వకుండినచో చాలు. నాకు సంతోషము.' అని యంటిని.

ఈ సుంకరివలన నభయదానము బొంది సర్కారువకీలు గారితో ఉత్తరప్రత్యుత్తరములు నెఱపితిని. వారిని దర్శించితిని.

నా సత్యప్రియత్వ మాయనకుఁ దెలిసెను. నే నేమియుఁ దాఁచలేదని యాయన కవగతమాయెను.

ఈ కేసులోనో, మరియొక కేసులోనో గాని నాకు నా కక్షిదారులు ప్రమాణపత్రిక నిచ్చిరి: 'మీ కిఁక నాకేసునుండి 'ఫీజు' అని జవాబు రాదు.'

రుస్తుంజీగారిపయిని కేసు పెట్టలేదు. కాని సొమ్మునకు రెట్టింప వెల పుచ్చుకొని వదలివేయవలసినదిగా హుకుము మాయెను.

రుస్తుంజీగారు తన దొంగతనపు కథనంతయు వ్రాయించి దాని నద్దపుఁ జట్టములో బిగించి తన వారసులకును, తోడివర్తకులకును 'ఖబర్దార్' అని చెప్పినటులు తమ ఆఫీసులోఁ గట్టించిరి.

రుస్తుంజీగారికి మిత్రులయిన వర్తకులు 'ఇది సత్యవైరాగ్యము కాదు శ్మశానవైరాగ్యము' అని నాకుఁ దెలిపిరి.

కాని యీ మాట యెంతవఱకు నిక్కమో నేను చెప్పఁజాలను.

నే నీ మాటను రుస్తుంజీగారి చెవిని బడవయిచితిని. అతఁడు విని 'మిమ్ము మోసగించి నే నెక్కడికి వెళ్లఁగలను?' అని యనెను.

నాలుగవ భాగము-సమాప్తము

ఆత్మకథ

అయిదవ భాగము

౧

మొదటి అనుభవము

ఫినిక్సునుండి బయలుదేరినవారు నేను రాకముందే దేశమునకు వచ్చియుండిరి. నేను ముందు వెళ్ళియుండవలయు నని మేము మొదట తలచుకొంటిమి. యుద్ధమువలన నేను లండనులోఁ జిక్కుపడితిని. వారిని హిందూదేశములో నెక్కడ నుంచవలెనా యని యాలోచించితిని. అందఱును ఒక తావుననే యుండి ఫీనిక్సునందువలెనే జీవితము నేర్పాటుచేసికొనవలయు నని నా యభిప్రాయము. దేశమున ఏ యాశ్రమమును నడపువారి పరిచితియు నాకు లేదు. కావున 'ఆండ్రూసుగారి దర్శనము చేసికొని వారి సలహాను పాలింపుఁ' డని వ్రాసితిని.

వారు మొదట కాంగడీ గురుకులమున కరిగిరి. అచట స్వామి శ్రద్ధానందులు వారిని తమ పుత్రులవలె నాదరించిరి. తరువాత వారు శాంతినికేతనమునకుఁ జనిరి. అచట మహాకవియు, వారి యనుయాయులును వీరిమీఁద ప్రేమవృష్టి కురిపించిరి. ఈ రెండు తావులందును వారికిఁ గలిగిన యనుభవములు వారికిని, నాకును చాల నుపయోగించెను.

రవీంద్రులు, శ్రద్ధానందులు, సుశీల రుద్రులు—ఈ మువ్వురును ఆండ్రూసుగారి ముమ్మూర్తులు. దక్షిణ-ఆఫ్రికాలో వీరినిగూర్చి ఆండ్రూసుగారు వినుటకు విరామము లేకుండ జెప్పుచుండెడువారు. దక్షిణ-ఆఫ్రికాయందు మా మిత్రగోష్ఠిలో ఆండ్రూసుగారి హృదయము మీఁదను, నాలుకమీఁదను ఈ మువ్వుర పేరులు నిరంతరము తాండవించుచుండెడివి. కావున ఆండ్రూసుగారు మావారిని సుశీల రుద్రగారికడకుఁ గొంపోయిరి. రుద్రుల కాశ్రమము లేదు గాని

ఉన్నది యున్లే. అయింటిని కిటికి విడిచిచేసిరి. నాకి పాలయిను, కిరస ఒక నాఁటిలోఁ గలిసి పోయిరి. కీసు ఫిరికన్న మాజలిపోయెను.

బొంబాయిరేవులో దిగిన తరువాత వీరంబరము గాంధీగారిల్లు మున నున్నటులు నాకుఁ దెలియవచ్చెను. కాని గోఖలేగారిని జూచినవెంటనే వారిని గలిసికొనుటకు తొందరపడితిని.

బొంబాయిలో నాకు స్వాగతసత్కారము లొసంగుచోట చిన్న సత్యాగ్రహ మొకటి చేయవలసివచ్చెను.

పిటిటిగారి భవనమున స్వాగతసభ జరిగెను. నాకి స్వాగతసభ నకు గుజరాతిభాషలో ప్రత్యుత్తర మొసఁగుటకు నాకు ధైర్యము చాల లేదు. కనులకు మిఱుమిట్లు గొలుపు నాఢంబరపు మిసమిసలలో గిరిమిటి కూలివారికి సహచరుఁడనగు నేను గజిబిజి పడసాగితిని. నేఁటి నా వేసముకన్న నాఁటివేషమునే నాగరక మనవచ్చును. నిజమే, నాఁడు అంగరకా, పాగ మొదలగునవి యుండెడివి. కాని అలంకృతమగు ఆసమాజములో నేను వేలు పెట్టి చూపించుకొనఁబడినవాఁడనుగనే యుంటిని. కాని ఫిరోజిషా గారి చాటున నెటులో యొకటుల నాపని నెఱవేర్చుకొంటిని.

పిదప గుజరాతువారి మోలాగము. స్వ. ఉత్తమలాల్ త్రివేదులు దాని సమకూర్చిరి. దీని పుచ్చుట ముందే కొంత నాకుఁ దెలిసెను. జిన్నాగారును గుజరాతువారగుటచే సభకు వచ్చిరి. వారు సభాపతులో, లేక ప్రధానవక్తలో యిపుడు గుర్తులేదు. వీరు క్లుప్తముగ, మధురముగ నాంగ్లమున నుపన్యసించిరి. మిగిలిన ఉపన్యాసములుగూడ నాంగ్లముననే జరిగినటులు కొంచెగుర్తు. పిదప నావంతు వచ్చెను. నేను గుజరాతీలోనే మాటలాడితిని. గుజరాతీ హిందూస్తానీ భాషలయెడ నాకుఁగల పక్షపాతమును కొలఁది మాటలలోఁ జెప్పితిని.

గుజరాతువారిసభలో తల్లిభాష నుపయోగించుట కూడ వలెనను పట్టుదలగ నా యసమ్మతిని ప్రకటించితిని. నే నటుల చెప్ప నప్రసంగ లోపిచేసితినే యనుకొంటిని. నేను చాలకాలము దేశములో లేక పోయితిని. ఇప్పుడు స్వదేశమునకు క్రొత్తవాడను. అనుభవము లేని వాడను. ఇప్పుడేటి కెదురించుచున్నాను. 'ఇది యవివేకము కాదు గదా?' అని అనుకొంటిని. కాని గుజరాతీలో మాటలాడు నా సాహసమును కొందరును అపార్థము చెప్పలేదు. నా యసమ్మతితో సంఘమును సహకరించిరి. నా కానందము కలిగెను. మరియు నా క్రొత్త యుద్దేశములు ప్రజలలో ప్రచారము చేయుటయు అంత కష్టము కాదని తెలిసి కొంటిని.

నే నీ రీతిగా బొంబాయిలో రెండుమాసములుండి దేశమును క్రొత్తగా అనుభవములోనికి దెచ్చుకొనుచు గోఖలేగారి యాజ్ఞ చొప్పున పూనా చేరితిని.

౨

పూనాలో గోఖలేగారితో

గవర్నరుగారు మిమ్ముఁ జూడఁగోరుచున్నారు, గాన మీరు పూనా పోకముందు వారిని గలిసికొనుట మంచి పని' నేను బొంబాయి చేరీ చేరఁగనే గోఖలేగారు నాకు కబురుపెట్టిరి. నేను గవర్నరుగారి దర్శనమున కేగితిని. మామూలు మాట లయినపిదప గవర్నరుగారు ఇటు లనిరి:

'మీరు నా కొక మాట ఇవ్వవలయును. సర్కారుకు సంబంధించి మీ రేమయినను ఆందోళనము చేయఁదలఁచితిరేని ముందు నాతో మాటలాడి మఱీ చేయుఁడు.'

నే నిటులు జవా బిచ్చితిని:

'నే నీ మాట కడుసులభముగా నీయఁగలను. ఏ లందురా? నేను సత్యాగ్రహిని. కావున నే నెవరితో సంబంధము పెట్టుకొందునో వారి యుద్దేశ మెంతయో ముందుగా గనుఁగొందును. పిదప వీలయినంత వఱకు వారి కనుకూలముగ నుండుటకు ప్రయత్నింతును. నేను దక్షిణ-ఆఫ్రికాలో ఎప్పుడును ఈ నియమమునే పాలించియుంటిని. ఇచటఁ గూడ నటులే చేయఁగలను.'

పిదప లార్డ్ విలింగ్డను నాకు ధన్యవాదములు చెప్పి మరియు నిటు లనిరి:

'ఆక్కఱ కలిగినప్పు డెల్ల మీరు నన్ను గలిసికొనవచ్చును. సరకారువారు ఇచ్ఛాపూర్వకముగా ఏ పొరపాటును చేయరని మీకు తెలిసివచ్చును.'

నే నిటు లంటిని:

'నే నట్టి విశ్వాసముతోనే యున్నాను.'

పిమ్మట నేను పూనా కరిగితిని. అచటి విషయము లన్నియు వ్రాయుటకు నే నసమర్థుఁడను. గోఖలేగారును, వారి సొసయిటీ

సభ్యులును నాయెడ ప్రేమ కురిపించిరి. గోఖలేగారు సొసయిటీ సభ్యుల నందఱను పిలిపించినట్లు గుర్తు. మేమందఱమును హృదయములు విప్పి మాటలాడుకొంటిమి. నన్ను గూడ వారి సొసయిటీలో నొక సభ్యునిగాఁ జేయవలయు నని గోఖలేగారి తలఁపు. నాకును అట్టి తలఁపే కలదు. కాని సొసయిటీలోని మిగిలిన సభ్యుల తలఁపు వేఱు. సొసయిటీ ఆదర్శములు, దాని కార్యప్రణాళియు వేఱు; నా ఆదర్శములు, నా కార్యప్రణాళియు వేఱు. కావున నా సభ్యత సాగునది కాదు. నాకు నా యాదర్శములను గాపాడుకొనుటలో నెంత పూనిక గలదో యితరుల యాదర్శములను గాపాడుటకుఁగూడ నంత పూనిక కల దని గోఖలేగారికి తెలియును. గోఖలేగా రిటు లనిరి: మీ రాజీ–స్వభావము మావారి కింకను తెలియలేదు. వారికి వారి యాదర్శములయెడఁ గడు పట్టుదల. మరియు వారు కడు స్వతంత్రులు. వారు మిమ్ము సభ్యులనుగాఁ జేర్చికొందురుగాక యని యాసించుచున్నాను. ఒకవేళ వారు చేర్చికొనరేని వారికిఁ దమయెడల ప్రేమగాని, యాదరముగాని యిసుమంతయు తక్కువ కాదని నే ననఁగలను. మీయందలి ప్రేమ యఖండితముగ నుండఁగలందులకే వా రిట్టి సాహసమునకు వెనుకాడుచున్నారు. మీ రిందు సాక్షాత్తు సభ్యులయినను, గాకున్నను నేను సభ్యులని పరిగణించుకొందును.

నేను నా సంకల్పముల నన్నిటిని గోఖలేగారికిఁ దెలియఁ జెప్పితిని. 'సొసయిటీలో నేను సభ్యుఁడనయినను గాకున్నను ఆశ్రమము నొకటి యేర్పఱచి ఫినిక్సు–సహచరుల నం దుంపఁగోరుచున్నాను. నేను గుజరాతువాఁడ నగుటవలన గుజరాతునం దుండియే దేశసేవ చేయుట మిగుల నుచితము. కావున గుజరాతునం దునికి యేర్పఱచుకొనుటకే నిశ్చయించితిని.'

గోఖలేగారికి నా యీ యుద్దేశము రుచించెను. వా రిటు లనిరి:

‘తాము తప్పక కటాలు చేయుండు. సత్యాగ్రహులతో సహానైన మీ సంభాషణాఫలము మెప్పులయినవి మీ గృహాశ్రమమునకు సమయము నాకేం గొనండు. దాన నా యాశ్రమము నే యనుకొందును.’

నా హృదయము ఉప్పొంగెను. చందాలు పోగు చేయవలసిన జంజాటము తప్పిపోయెగదా యని కడు సంతోసించితిని. మరియు భారము నా యొక్కని మీదనుండియు తప్పుచున్నది. ‘కష్టకాలము నందు నా కొక మార్గదర్శకుండు దొరకె’ నను విశ్వాసముచే నాశిరో భారము దిగిపోయినటు లాయెను.

గోఖలేగారు స్వ. డాక్టరు దేవుగారిని పిలిచి ‘సొసయిటీ ఖాతాలో గాంధీగారి పే రొకటి పెట్టుండు. వారి యాశ్రమమునకుం గాని, వారి ప్రజాసేవకుంగాని కావలసిన సొమ్ము ఎన్నియైన నొసంగుండు.’ అని యాజ్ఞాపించిరి.

పిదప నేను పూనానుండి శాంతినికేతనమున కేంగ నిశ్చయించితిని. నేను వెళ్లుటకు ముందు గోఖలేగారు నాకు రుచికరమగు విందొకటి యేర్పాటు గావించిరి. అందు నేను తిను పచ్చిపండ్లు, ఆకీన పండ్లు మొదలగువానిని దెచ్చిరి. విందుచోటు గోఖలేగారున్న గదికి కొంత దవ్వు. వారి ఆరోగ్యము సరిలేదు. అంతమాత్రము దూరము గూడ వారు నడచుస్థితిలో లేరు. కాని వాత్సల్యము వారి నూరకుండనా! నేనును వచ్చితీరవలెనని రి. పడియుండుగులు కైచెరి, పడిపోయిరి; వారిని వెనుకకుం దీసికొని పోవలసివచ్చెను. గోఖలేగారి కిట్టి మూర్ఛలు తఱుచు వచ్చుచుండెనని యెవరును గమనింపలేదు. పిదప మేము ఆశ్రమములోని అతిథిశాలముందటి మైదానమున పఱచిన తివాచీలమీదం గూర్చుండి వేఁచుసెనగలు, కజ్జము మొదలగువానిని దినుచు ప్రేమాలాపములు చేసికొనుచు నొకళ్ల హృదయ మింకొకళ్లు మెఱుఁగవగాఁ దెలిసికొంటిమి.

నా జీవితములో వారి మూర్ఛహాత్ర మొక సామాన్యవిషయము కాదు.

3

బెదరింపా?

మా యన్నగారు గతించిరి. మా వదినగారిని, తక్కుంగల బంధువులను జూడవలసియున్నది. కావున బొంబాయినుండి నేను రాజకోటకును, పోరుబందరుకును ప్రయాణమయితిని. దక్షిణ-ఆఫ్రికాలో సత్యాగ్రహసంగరమున కొక యంగముగా నా వేషమును మార్చుకొంటిని. అది గిర్మిటియాల వేషము. సీమలో నింటియం దా దుస్తులనే తాల్చుచుంటిని. దేశములోనికి దిగినతరువాత కాఠియావాడు దుస్తులం దాల్పఁగోరితిని. వానిని దక్షిణ-ఆఫ్రికాలో నాకడ నుంచుకొంటిని. బొంబాయిలో వానిని పైకిఁదీసితిని-అంగరకా, ధోతి, తెల్లని తలపాగ ఇవి యన్నియు ఇండియామిల్లులందు తయారయినవే. బొంబాయినుండి కాఠియావాడునకు మూఁడవతరగతి బండిలో వెళ్ల నిశ్చయించితిని. పాగయు, అంగరకాయు అక్కఱమాలిన బరువని పించెను. కావున విడిచితిని, ధోతీ, ఎనిమిదిపదణాలు చేయు కాశ్మీరపు టోపీ-వీనినిమాత్ర ముంచుకొంటిని. ఇట్టి వస్త్రములు తాల్చినవాఁడు పేదలలో జమ కట్టఁబడును. ఆనాళ్లలో ప్లేగు ఉండుటవలన వీరమగాములోనో, వఢవాణులోనో మూఁడవతరగతి బాటసారులను దింపి పరీక్షించుచుండిరి. నాకు కొంచెము జ్వరము తగిలెను. ఇన్‌స్పెక్టరు నా చే యంటుకొనెను. వెచ్చగా తగిలెను. 'రాజకోటలో డాక్టరును కనఁ బడుము' అని హుకు మిచ్చెను. నా పేరు వ్రాసికొనెను.

వఢవాణులో దర్జీ మోతీలా లనువాఁడు ప్రసిద్ధుఁడగు ప్రజాసేవకుఁడు. బొంబాయినుండి అతనికి వార్త వెళ్లెనుగాఁబోలు! వఢవాణుస్టేషనులో నన్నుఁ గలిసికొనెను. అతఁడు వీరమగామునందలి శాయరీని గుఱించియు, దాన బాటసారులకుఁ గల బాధలగుఱించియుఁ

జెప్పెను. నాకు కొంత తగిలియుండుటచే అట్టి నూతనుడు కిష్టము గాలేదు. టూకీగా తేల్చి వెంచి యిట్లు అంటిని:

'మీరు జైలునకుం బోవ తయారుగా నున్నారా?'

ముందువెనుక లాలోచింపకుండ మాట అనివేయు మనుజుల వారిలో నితఁడును నొకఁడై యుండును అని నేననుకొంటిని. కాని మోతీలాలు దిట్టముగా——

'మేము జైలునకు తప్పక వెళ్లెదము. కాని మీరు మమ్ము నడిపింపవలయును. కాఠియావాడువార మగుటచే మామెడల మాకు ముందుగా స్వాతంత్ర్యమున్నది. ఇప్పుడు మీ సత్యాగ్రహము. కాని తిరిగి వచ్చునపుడు మీ రిచట దిగవలయును. ఇచట పిన్నలు చేయు పనిని, వారి యుత్సాహమును జూచి తాము సంతసింపఁగలరు. తా మెప్పుడు రమ్మని పిలిచిన నేనపుడు నాసేనతో వచ్చెదను' అనెను.

మోతీలాలు నన్నాకర్షించెను. అతనితో నున్న సహచరు లతని నిట్టుల నుతించిరి:

'అనుటకు మావాఁడు దర్జీవాఁడే కాని తనపనిలో నేర్పరి. రోజు కొక గంట పనిచేసి ౧౫ రూకలు సంపాదించును. వానితో పొట్ట గడచును. మిగిలిన సమయ మంతయు ప్రజాసేవకు వినియోగించును. అతనిముందు మా చదు వంతయు సిగ్గుచేటు!'

పిదప నాకు మోతీలాలుసంగతి తెన్నగా తెలిసెను. ఈ పై స్తుతి అతనియెడ నతిశయోక్తి కాదు. సత్యాగ్రహాశ్రమమును స్థాపించిన పిదప నతఁడు నెలలో కొన్నిదినము లచట నుండెడివాఁడు. పిల్లలకు కుట్టుపని నేర్పెడివాఁడు. ఆశ్రమములో కుట్టుపనినిగూడఁ జేసెడివాఁడు. వీరమగాము ముచ్చటలు ప్రతిదినమును చెప్పుచుండెడివాఁడు. అచట బాటసారులకుఁ గలుగుచుండు కష్టము లతనికి దుస్సహ

ములుగా నుండెను. నిండు ప్రాయమున నితని రోగ మెత్తుకొని పోయెను. అతఁడు చనిపోవుటచే వఢవాణు అరణ్యమాయెను.

నేను రాజకోటకుఁ జేరిన మరుసటినాఁటి ప్రొద్దుట హెచ్చరిక ప్రకారము ఆసుపత్రికి వెళ్లితిని. నన్నచట నెఱుఁగినవారు లేరు. డాక్టరు నన్నుఁ గని సిగ్గిలెను. ఆఫీసరుపైఁ గినిసెను. ఇందువలన కోపకారణము లేదు. ఆఫీసరు తన ధర్మమును తాను చేసికొనెను. అతఁడు నన్నెఱుఁగఁడనుకొందును. ఎఱిఁగినను తన ధర్మమును తాను చేసికొనక తప్పదు. డాక్టరు నన్ను మరలఁ బరీక్షింపక నాకొఱకు ఇన్స్పెక్టరును బంపఁబోవఁడాయెను.

అట్టి సమయములందు మూఁడవతరగతి ప్రయాణికులను బరీక్షించు టావశ్యకము. గొప్పవార మనుకొనువారు మూఁడవతరగతి బండ్లలో ప్రయాణము చేయఁదలఁచుకొనినచో పేదలు పాటింపవలసిన నియమములకు వశవర్తులు కావలయును. అధికారులను పక్షపాతము చూపఁగూడదు. అధికారులు మూఁడవతరగతిప్రయాణికులను జంతువులవలెఁ జూచుట నేఁ జూచితిని. 'నీవు నీ'వనుట తక్క మఱుమాట లేదు. మూఁడవతరగతివానికి ప్రత్యుత్తరము దొరకదు. విన్నపము వినువాఁడు లేఁడు. అధికారులు వీరిని తమ నవుకరు లనుకొందురు. రైలునవుకరులు వీరిని తన్ని దెబ్బ కొఁడయుదురు; రైలు తప్పింతురు; టికెట్లీయఁగ బెట్టుదురు. ఇది యంతయు నేననుభవించితిని. ఉన్న దున్నట్టులు చెప్పితిని. దీనినంతయు మార్పింపవలయును. ధనవంతులగువారు బీదల యుపకారముకొఱకు కష్టముల నెత్తిని వైచుకొని మూఁడవ తరగతిలో ప్రయాణము చేయవలయును. వారికి లేని సౌకర్యములను తమకును వల దని చెప్పవలెను. వారి అసౌకర్యము, అవివేకము, అన్యాయము, బీభత్స వీనిని పోఁగొట్టవలయును.

కాఠియావాడులో నాతిరిగిన యాత్రలలో వీరమగాము సాయరును గూర్చియు, దానికై గాను బాటసారుల నాపివేయుటను గూర్చియు ఫిర్యాదులను వినుచునే యుంటిని.

లార్డు విలింగ్డనుగారు నాకొసంగిన వాగ్దానమును వెంటనే ఉపయోగింపఁ దలఁచితిని. సాయరుకు సంబంధించిన కాకితముల నన్నిఁటిని జదివితిని. ఫిర్యాదు లన్నియు తథ్యము లని గ్రహించితిని. బొంబాయి సర్కారువారితో పత్రికావ్యవహారము సాగించితిని. సెక్రటరిని గలసితిని. లార్డు విలింగ్డనుగారినిగూడఁ గలిసికొంటిని. వారు సౌహార్దము కనఁబఱచిరి కాని తప్పును ఢిల్లీమీఁద త్రోసిరి.

'ఇది నా చేతులలో నున్నచో ఈ సాయరిదివఱకే యాఁగిపోయెడిది. మీరు ఇండియా సర్కారుకు విన్నవించుకొనుఁడు.' అని సెక్రటరీగా రనిరి.

నేను ఇండియా సర్కారుతో నుత్తర ప్రత్యుత్తరములు నడిపితిని. రసీదు తక్క ప్రత్యుత్తర మేమియు రాలేదు. తరువాత ఇంచుమించు రెండేండ్లు పత్రవ్యవహారము జరిగిన పిదప ౧౯౧౭ సంవత్సరమున నేను చెమ్సుఫర్డుగారిని కలిసికొనినప్పుడీ ముచ్చట తేఁగా వా రాశ్చర్యపడిరి. వారికి వీరమగాము విషయ మేమియు తెలియనే తెలియదు. నా మాటలను చక్కఁగా వినిరి. అప్పుడే వీరమగాము తాలూకు కాకితములను పంపుఁడని టెలిఫో నిచ్చిరి. అధికారు లీ విషయమున చెప్పఁదగిన దేదియు లేనిచో సాయరు రద్దుపఱతు ననుమాటను గొంటిని. కొలఁది నాళ్లకే వీరమగాము సాయరు తీసివేయఁబడినదని పత్రికలలోఁ జూచితిని.

నే నీ విజయమును సత్యాగ్రహమునకు పునాదిగా నెన్నుదును. ఏలన, వీరమగామును గుఱించి బొంబాయి సర్కారుతో నేను మాటలాడునప్పుడు సెక్రటరీగారు—'బగస్రాలో మీ రొసఁగిన యుప

న్యాయసభ్యు నకలు వ్రాకపె నన్నది. మీరు దీనిని సత్యాగ్రహ మంటిరి. అది సరి కాదు.' అనిరి. మరియు—

'ఇది బెదరించుట కాదా? ఇంత శక్తి గల ప్రభుత్వము బెదరింపులకు లొంగునా?' అనిరి.

నే నిట్లు లంటిని:

'ఇది బెదరింపు కాదు. ఇది ప్రజకు ప్రబోధము కలిగించు నుపాయము. లోకుల దుఃఖములను దూరము చేయుటకు తగిన యుపాయముల నన్నిఁటిని జెప్పుట నాధర్మము. స్వాతంత్ర్యము గోరువారు తమతమ యుపాయముల నన్నిఁటిని ఎఱిఁగియుండవలెను. సామాన్యముగా నుపాయము లన్నియు హింసాత్మకములు. సత్యాగ్రహమే అహింసాత్మకమగు శస్త్రము. దాని యుపయోగము, దాని మేరలను జెప్పుట, అనఁగా దాని ప్రయోగోపసంహారములు చెప్పుట నాధర్మము. ఇంగ్లీషు సర్కారువారు మహాశక్తిగలవా రనుటలో సందియ మేమియు లేదు. కాని సత్యాగ్రహముకూడ అస్త్రము లన్నిఁటిలో దొడ్డదగు బ్రహ్మాస్త్ర మనుటలో సందియమేమియు లేదు.'

తెలివిగల ఆ సెక్రటరీ తల నూఁపుచు నిట్లనెను:

'చూతముగాక!'

శాంతినికేతనము

రాజకోటనుండి నేను శాంతినికేతనము పోయితిని. అచట నధ్యాపకులును, విద్యార్థులును నాపై ప్రేమ కురిపించిరి. నిరాడంబరతను, శిల్పమును, ప్రేమను మేళవించి నాకు స్వాగత మొసగిరి. కాకాసాహెబ్ కాలేల్కరుగారితో నాకచట ప్రథమపరిచయము.

కాలేల్కరుగారికి కాకాసాహెబను పేరేల వచ్చెనో నా కప్పుడు తెలియదు. తరువాత దానిసంగతి తెలిసెను. కేశవరావు దేశ పాండేగారు సీమలో నాకు సమకాలికులు. నాకును, వారికిని గాఢ మైత్రి యేర్పడెను. వారు బరోడా రాజ్యమున గంగానాథవిద్యాలయ మును నడపిరి. విద్యాలయమునందు కుటుంబభావన కలిగింపవలె నని వారి తలంపు. కావున నుపాధ్యాయులకు వావివరుస లేర్పాటు చేయబడెను. కాలేల్కరుగారికి కాకా (కక్క) యను పేరొసంగ బడెను. ఫడకేగారు మామ అయిరి. హరిహర శర్మగారు అన్నగా రయిరి. ఇతరులును తగిన పేరుల బడసిరి. కొంతకాలము జరిగినతరువాత కక్కకు మిత్రుండైన నర్థము గల స్వామియను పేర ఆనందానంద లును, మామకు మిత్రుండైన నర్థముగల అప్ప యను పేర పట్వర్ధను లును ఈ కుటుంబమునందు చేరిరి. ఈ కుటుంబమునందలి యీ యైదుగురును ఒకరితరువాత నొకరుగా నాకు మిత్రు లయిరి. దేశ పాండేగారికి సాహెబ్ అను పేరు విఖ్యాతము. విద్యాలయము మూసి వేయబడినపిదప నీ కుటుంబము చిట్లిపోయెను. కాని యీ కుటుంబము తన యాధ్యాత్మికసంబంధమును విడనాడలేదు. కాకా సాహెబు భిన్నభిన్నస్థలములలో భిన్నభిన్నానుభవములు సంపాదింపఁ బోయెను. నేను శాంతినికేతనమున కరిగినతఱి వా రచట నుండిరి.

ఈ కుటుంబములో నివారే యను చింతామణిశాస్త్రిగారును అప్పు డచట నుండిరి. ఈ యిరువురు నచట సంస్కృతము చెప్పుచుండిరి.

ఫీనిక్సు-కుటుంబమునకు శాంతినికేతనమున విడిగా బస యేర్పాటు చేయఁబడెను. మగనలాలగాంధీ కుటుంబ-పెద్ద. ఆశ్రమ నియమము లన్నియు సరిగా జరుగునట్లు అతఁడు చూచుచుండెను. అతఁడు తన శ్రమచే, జ్ఞానముచే, పూనికచే శాంతినికేతనమునం దెల్లెడల తన తావిని విరఁజిమ్మెను. అప్పు డచట ఆండ్రూసు పియర్సను గారు లుండిరి. జగదానందబాబు, నేపాలబాబు, సంతోషబాబు, క్షితిమోహనబాబు, నగేంద్రబాబు, శరదబాబు, కాళీబాబు మొదలగువారితో నాకు గొప్ప పరిచయ మాయెను.

నేను నా స్వభావము చొప్పున విద్యార్థులలోను, ఉపాధ్యాయులలోను కలిసిపోయితిని. వారితో శరీరపరిశ్రమమును గురించియు, తన పనిని తానే చేసికొనుట గురించియు చర్చింపఁ దొడఁగితిని. జీతము తీసికొని వంటవారి నేర్పఱచుటకంటె నుపాధ్యాయులును, విద్యార్థులును తమ పాకము తాము చేసికొనుట మంచి పనియు, ఉపాధ్యాయులు వంటయింటిని పరిశీలించుచుందురేని విద్యార్థుల యారోగ్యము, నీతియు చక్కగా నుండుననియు, విద్యార్థులు తమ వంట తాము చేసికొనుచో [illegible] [illegible] నొక పదార్థపాకము నేర్చికొనినట్లు అగు నవియు సూచించితిని. ఒకరిద్దరు ఉపాధ్యాయులు పెదవులు విఱిచిరి కాని పలువురు కలియఁబడిరి. బాలకులకు—వారి స్వభావము నూతనప్రియము కావున-ఇది రుచించెను. ఇఁక నడ్డేమి? క్రొత్తపని ప్రారంభ మాయెను. నేనీ మాట మహాకవికి విన్నవించితిని. 'ఉపాధ్యాయుల కిది యనుకూలమగుచో నాకును అనుకూలమే' యని వా రనిరి. ఇఁక విద్యార్థుల విషయమున నిది స్వరాజ్యమునకు తాళపుఁజెవి యని వా రభిప్రాయపడిరి.

ఈ క్రొత్తపని నెలకొల్పుటకు పియర్సనుగారు చాలా ప్రీతిగ. ఇది వారికిఁ గడు నింపుగా నుండెను. ఒకవైపుఁ గొందఱు కూరలు తఱుగుచుండఁ గూర్చుండిరి. మఱియొకవైపు బియ్యము బాగుచేయుటకుఁ గొందఱు కూర్చుండిరి. వంటయింటిని చక్కగా శుద్ధిచేయుటకు నగిన బాటు కష్టాలు ప్రారంభించిరి. ఇట్లు వారందఱు పనిముట్లుగొని పనిచేయుట చూచెదగా నాకు కనులపండువాయెను.

కాని మా టపాతికముంది విద్యార్థులకును, వారి గురువులకును ఒక్కతూరైన ఇది సహింపఁదగినదిగా లేదు. కావున ప్రతిదినము చర్చ జరుగుచుండెడిది. ఇందు కొందఱలసిపోవుచుండిరి. కాని పియర్సనుగా రలసియున్నారా? వారు చిఱునగవుతో నేదో యొక పని చూచుచుండువారు. పెద్ద పెద్దగుండిగలు మొదలగుపాత్రలు తోముట వీరి వంతు. శ్రమ మఱపించుటకుఁగాను పాత్రలు తోముచువారిముందు కూర్చుండి కొందఱు సితారు వాయించుచుండిరి. మఱి కొందఱు విద్యార్థులు మఱికొన్ని పనులత్యుత్సాహముతోఁ జేయఁదొడఁగిరి. ఈ రీతిగా శాంతినికేతనమంతయు తేనెపెరవలె ఝుమ్మనుచుండెను.

ఒకతూరి మొదలుపెట్టఁబడిన క్రొత్తపద్ధతు లిఁక సాఁగవు. ఫీనిక్సు వంటయిల్లు స్వాశ్రయమే కాక యందలి పాకముగూడ కడు ఋజువు. దాన పోపు లేదు. బియ్యము, పప్పు, కూరలు, గోదుమ పిండి ఇవి యన్నియు నొకతూరియే మరపాయిలో తయారయ్యెడివి. దీనిని జూచి బంగాళీవారి పాకశాలగూడ మార్పుచెందెను. ఒక రిరువు రుపాధ్యాయులు, కొందఱు విద్యార్థులును దీనిని నిర్వహించిరి. దీనికి ఫలితముగా భోజనశాల యంతయు స్వాశ్రయముగా నుండ వీలాయెను.

కాని యేవో కొన్ని కారణములచే నీ పద్ధతి యాఁగిపోయెను. జగద్విఖ్యాత మగు నీసంస్థ కొలఁదికాల మయినను ఈ ప్రయోగము నడపినందువలన దీనికి లోటేమియు రాలేదనియు, దీనివలనఁ జేకూరిన

కొలఁది యనుభవములవలన వీనికి మేలే కలిగెననియును నా యభిప్రాయము.

కొంతకాలము నేను శాంతినికేతనమున నుండ దలఁచితిని గాని విధి నన్ను బలాత్కారముగా నీడ్చివైచెను. నేనచట నొక్కవారము నుండితినో లేదో గోఖలేగారు దేహము చాలించిరని తంతివచ్చెను. శాంతినికేతనమంతయు శోకమున మునిఁగిపోయెను. అందఱును నన్నూఱడింపవచ్చిరి. అచటి దేవాలయమున సభ గూడెను. అది గంభీరమగు దృశ్యము. నే నానాఁడే నాభార్యతోడను, మగన్‌లాలుతోడను పూనాకు బయలుదేరితిని. మిగిలినవా రెల్లరును శాంతినికేతనమందే యుండిరి.

ఆండ్రూసుగారు బర్ద్వానువఱకు నాతో వచ్చిరి. 'ఇండియాలో సత్యాగ్రహము సాగింప నెప్పుడేని సమయము వచ్చునా? అనుచో నెప్పుడు? దీనిగుఱించి మీ రాలోచించితిరా?' అని వారడిగిరి.

నే నిటులు సమాధానము చెప్పితిని: 'దీనికి జవాబు చెప్పుట దుష్కరము. ఒకసంవత్సరమువఱకు నే నేమియు చేయనెంచను. 'నీ వొక సంవత్సరము దేశమంతయు తిరుగుము, గడువు దాఁటునంతవఱకు దేశమునకు సంబంధించిన ఏ ప్రశ్నకును నీ యభిప్రాయమును తెలుపకుము' అని గోఖలేగారు నాకు ఆదేశించిరి. నే నటులు వారికి మాట యిచ్చితిని. నే నిందు ప్రతి-అక్షరమును పరిపాలింపవలయును. గడువుదాఁటిన పిదపఁగూడ నావశ్యకత లేనిచో నే నే ప్రశ్నకును సమాధానము చెప్పఁదలఁపను. కావున మఱియయిదేండ్లదాఁక సత్యాగ్రహముతో పని పట్టుననితోఁపదు.'

ఇక్కడ ఈమాట చెప్పుట మంచిది. హింద్ స్వరాజ్ లోని నా యుద్దేశములను జూచి, 'ఒక సంవత్సరము నీవు హిందూదేశములో నుండుము, నీ యుద్దేశము లన్నియు తమకుఁ దామే సరిపుచ్చుకొనును' అని గోఖలేగారు నవ్వుచుండెడివారు.

౫

మూఁడవతరగతి బాటసారుల కడగండ్లు

బర్ద్వానులో మూఁడవతరగతి టిక్కెట్టు తీసికొనుటకు మాకుఁ జాలఁ గష్టమయిపోయెను. మూఁడవతరగతి బాటసారులకు ముందుగా టిక్కెట్లు ఈయరని తెలిసెను. నే నపుడు స్టేషను-మాస్టరు కడకు వెళ్లితిని. ఆయనకడకు వెళ్లఁగలుగుట మాత్రము సామాన్యమా? స్టేషను-మాస్టరుగారు శాలానాచోట నున్నారని యెవరో నామీఁద దయఁదలఁచి చెప్పిరి. తుదకు వారికడకు వెళ్లఁగా వారును మూఁడవ తరగతివారికి ముందుగా టిక్కెట్లీయఁబడవని చెప్పిరి. కిటికీతలుపు తీయఁగనే టిక్కెట్లు కొనుటకు వెళ్లితిని. కాని టిక్కెట్లు సులువుగా దొరకు వీలు కానిపింపలేదు. బలముకలవా రొకరివెనుక నొకరు త్రోసికొనుచు చనుచుండిరి. నే నా త్రోపులలో నలిగిపోతిని. తుద కెట్టులో టిక్కెట్టు దొరకెను.

రైలు వచ్చెను. ఇచటఁగూడ బలము గలవారే త్రోసికొని పోయిరి. ఎక్కినవారును, ఎక్కఁబోవువారును పరస్పరము దూషించుకొనుచుండిరి. వారి తలలును వీరి తలలును డీకొక్కులు కొట్టుకొనుచుండెను. దీనిలో నేను పాలుగొనలేకపోతిని. కావున మే మిచటనుండి అచటికిని, అచటినుండి యిచటికిని పరుగెత్తితిమి. ఎచటికి వెళ్లినను ఒకటేమాట—'ఇచట చోటు లేదు. ఇచట చోటు లేదు.' నేను గార్డువద్దకు వెళ్లితిని. 'చోటున్నచో కూర్చుండుము! లేనిచో మఱియొక రైలులో వెళ్లుము!' అని యతఁడనెను.

'నాకు చాల తొందరపని యున్నది' అని నేను వినయముతో పలికితిని. ఈమాట వినుటకు గార్డు కవకాశము లేదు. ఇంతటితో నా పని అయినది. 'ఎచటనో యొకచోట ఇఱుకుకొ'మని మగవాండ్లకుఁ

చెప్పితిని. నేను నా భార్యతో ఇంటర్ క్లాసుబండి యెక్కితిని. ఆ బండిలో నెక్కుచుండఁగా నన్ను గార్డు చూచెను.

ఆసనసోల్ స్టేషనులో ఇంటర్ క్లాసు చార్జి వసూలుచేయుటకు గార్డు నాకడకు వచ్చెను. నే నిట్లు అంటిని: 'మాకు చోటు చూపవలసిన బాధ్యత మీది. చోటు లేకపోవుటచే నే నిచటఁ గూరుచుంటిని. మూడవతరగతిబండిలో చోటు చూపుదురేని నే నచటికి వచ్చుటకు సంసిద్ధుఁడను.'

గార్డుగా రిట్లనిరి: 'నాతో వాదము చేయకుఁడు. చోటు లేదు. బండిబాడుగ యియ్యనిచో దిగిపోవలసియుండును.'

నాకు ప్రయాణాలో తొందరపని. గార్డుతో దెబ్బలాడుటకు నాకు ఉత్సాహము లేదు. గార్డు పూనావఱకును కట్టి నాకడ సొమ్ము వసూలుచేసెను. నా కిది అన్యాయ్యమనిపించెను.

ప్రొద్దుటికి మొగల్ సరాయి చేరితిమి. మొగలసరాయినకు మూడవ తరగతి బండిలో చోటు చిక్కెను. మొగల్ సరాయిలో నేనును అచటికి మారితిని. నేను టికెట్ కలెక్టరుకు జరిగిన సంగతి యంతయుఁ దెలిపితిని. మొగల్ సరాయిలో నేను మూడవతరగతి బండిలోనికి మారినట్టులు సాక్ష్యముగా నొక చీటి వ్రాసి యిమ్మంటిని. అతఁ డీయ ననెను. పిదప నేను 'వసూలుచేసిన సొమ్మును మరలా యిమ్మని' రైల్వే అధికారికి వ్రాసితిని.

'సాక్ష్యపుఁ జీటి లేక డబ్బు వాపసుచేయుట మాకు రివాజు కాదు గాని మీవిషయముమాత్రము వేఱుగా భావించి వాపసు చేయుచున్నాము. మఱియు బర్ద్వానునుండి మొగల్ సరాయివఱకు వాపసుచేయఁబడదు' అని జవాబు వచ్చెను.

నాఁటినుండియు మూడవతరగతిలో నే ననుభవించుచు వచ్చుచున్న యిక్కట్టు లన్నియు వ్రాసినచో నొక మహాగ్రంథ మగును.

ఆత్మకథ

కాని ప్రసక్తి కలిగినప్పుడు ముందటి ప్రకరణములలో నచటనచట కొంచెము కొంచెము తెలుపుదును. శరీరము తాళఁజాలకుండుటవలన మూఁడవతరగతి బండ్లలో ప్రయాణమును నే మానివేయవలసి వచ్చెను. ఇందులకు నేను కడు వగచితిని, వగచెదను. మూఁడవతరగతి బాటసారుల కష్టములకు రైల్వే అధికారుల పెద్దరికపు పరిపాలనము. మరియు ఆ బాటసారుల మొరటుదనము, మలినతనము, స్వార్థపరత్వము, అజ్ఞానము—ఇవియు వారి కష్టములకు కారణములు కాఁగలవు. ఇంతియకాక ఈ బాటసారులు తమ యసభ్యత్వమును తా మెఱుఁగ కుండుట, తమ మలినతనమును తా మెఱుఁగకుండుట. తమ స్వార్థ పరత్వము తా మెఱుఁగకుండుట—ఇదియంతయుఁ జాల విచార కరము. వారు చేయునదంతయు వారికి స్వాభావికముగా నుండును. వారు తమ లోపములను దిద్దుకొనఁ దలపెట్టరు.

వచ్చి చెడి కల్యాణ-జంక్షనుకు చేరితిమి. మగనలాలును, నేనును స్టేషనులోని పంపుకడ నీరుగొని స్నానముచేసితిమి. నాభార్య స్నానముచేయుటకు నేను ప్రయత్నము చేయుచుండఁగా సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసయిటీకి సంబంధించిన 'కౌలు' గారు మమ్ముగుర్తించి మాకడకు వచ్చిరి. వారును పూనాకు వెళ్లుచుండిరి. స్నానము చేయుటకు నాభార్యను రెండవక్లాసు స్నానశాలలోనికి తీసికొని వెళ్లుదు నని వా రనిరి. వారి సౌజన్యము నుపయోగించుకొనుటకు మనసులో సంకోచించితిని. రెండవక్లాసు అవుతుఖానాను ఉపయోగించుకొను నధికార మామెకు లేదని నే నెఱుఁగుదును. కాని అప్పు డట్టి అయోగ్యతను పాటింపనైతిని. సత్యపాలకున కిది తగదు. మరియు రెండవ క్లాసు అవుతుఖానాలో నే స్నానముచేయవలయు నను పట్టుదల నా భార్యకు లేదు. కాని భర్తృమోహము సత్యమును మూసెను—'హిరణ్మయస్య పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్.'

ప్రార్థన చేసితిని. ఆ ప్రకారము జరిగెను. పిదప సొసయిటీ చేయవలసిన పనులను సూచించినను, నే నందు సభ్యత్వమును వహించుట సూచించియు మే మండలమును విచారించితిమి. ఇది నాకు చాల బరువాయెను. గోఖలేగా రుండగా సొసయిటీలో చేరవలసిన యక్కఱ నాకు లేదు. గోఖలేగారి యాజ్ఞను వినుటయే, వారి యిచ్ఛ ననువర్తించుటయే నా పని. ఆ స్థితియే నా కోరదగినది. హిందూ దేశము తుపానులో నున్నప్పు డొక కర్ణధారుఁడు కావలయును. అట్టి కర్ణధారుఁడు గోఖలే. 'ఆయన కాపాడుచుండఁగా నాకేమి భయము?' అని నే ననుకొంటిని.

ఆ ప్రకారము వారు గ్రహించిరి. కాని సభ్యత్వమునకు నేను తప్పక ప్రయత్నము చేయవలయును. మరియు గోఖలేగారి యాత్మకును ఇది యిష్టము అని తలంచి యించుకంతయు సందియము లేకుండ పట్టుదలతో ప్రయత్నము చేయఁబోయెఁగితిని. అప్పుడచట చాలమంది సభ్యు లుండిరి. నాయెడల వారికిఁ జాల భయ ముండెను. దాని బాఱఁద్రోలఁగడఁ బ్రయత్నించితిని. దీనఁజేసి వారిలో మతభేదము కలిగెను. కొందఱకు నన్నుఁ జేర్చుకొనుట యిష్టము; మఱి కొందఱకుఁ జాల నయిష్టము. ఇరువాగులవారికిని నే నవిన ప్రేమయే కాని నామీఁది ప్రేమకంటె వారికి సొసయిటీజవాబుదారీ యెక్కువ కాదా? ఒక వేళ ఎక్కువ కాకున్నను నామీఁది ప్రేమకన్న తక్కువమాత్రము కాదు.

కావున మా వాదములు కటువులు గాక మధురములుగా నుండెను. మరియు సిద్ధాంతములనే అనుసరించి యుండెను. తమ యభిప్రాయములకును, నా యభిప్రాయములకును ఉత్తరమునకును, దక్షిణమునకును ఉన్నంత తేడా యున్నదనియును, ఏ ముఖ్యవిషయముల మీఁద ఈ సొసయిటీని గోఖలేగారు నిలువఁబెట్టిరో వానికే కొలఁది కాలములో హాని కలుగఁగలదనియు ప్రతిపక్షుల వాదము. ఇది సహజమే.

చాల చర్చించి చర్చించి ఇండ్లకు మరలితిమి. నిర్ధారణ మొనరించుటకు వాయిదా వేయఁబడెను.

నాకు సుడిగుండమునఁ బడి కొట్టుకొనినటు లుండెను. అధికులగు మిత్రుల బలముచే సొసయిటీలో దూరు టుచితమా? నాపని గోఖలే గారి జవాబుదారీని వహించునా? నే నుండుట పలువుర కనిష్టమగుచో సొసయిటీ విషమస్థితికి నేను కారణము కానా? నన్నుఁ జేర్చుకొనుటలో సభ్యులకు మతభేద ముండునంతవరకు నే నందు ఇముడ సంకోచించుట పాడి గాదనియు, విరోధికోటిలోనివారి నిట్టి సంకటమునుండి తప్పించుట మేలనియు నాకుఁ దోఁచెను. ఇటులు చేసినయెడలనే సొసయిటీకిని, గోఖలేగారికిని నా జవాబుదారి యుండునని గ్రహించితిని. నా యంతరాత్మలో ఇట్టి నిర్ణయము కలిగినంతనే—'నన్ను సభ్యునిగాఁ జేర్చుకొనుటకు సభ్యులను కూడఁబెట్టి సభ జరుపవలదు' అని శ్రీ శ్రీనివాసశాస్త్రిగారికి ఉత్తరము వ్రాసితిని. నా విరోధికోటిలోనివారికి నా నిర్ణయము బాగుగా నచ్చెను. వారికి ధర్మసందేహము తొలఁగెను. పైఁగా మాకు చెలిమి బలిసెను. సొసయిటీనుండి నా దరఖాస్తు వాపసు కాఁగనే నే నందు నిక్కముగ సభ్యుఁడ నయిపోతిని.

నే నందు సభ్యుఁడనుగాఁ జేరకుండుట మంచి దాయెననియు, నన్నుఁ జేర్చుకొనుట కిష్టపడనివారి వాదము సరి యయిన దనియు నా కిపు డనుభూత మాయెను. వారి సిద్ధాంతములును, నా సిద్ధాంతములును చాల భిన్నము లనియు నా కిపు డనుభవ మాయెను. మాకు మతభేద మున్నటులు తెలిసినపిదపఁగూడ మా యాత్మలలో భేదము లేదు. మా మనస్సులలో భేదము లేదు. మాకు మతభేదమున్నను మేము బంధుగులమే, మిత్రులమే. పూనాలోని సొసయిటీస్థలము నా కొక క్షేత్రము. లౌకికదృష్టిలో నేను సభ్యుఁడను గాకున్నను ఆధ్యాత్మిక దృష్టిలో సభ్యుఁడనే. లౌకిక సంబంధముకంటె నాధ్యాత్మిక సంబంధ మనర్ఘము. ఆధ్యాత్మిక సంబంధము లేని లౌకికసంబంధము ప్రాణము లేని దేహముతో సమానము కదా!

౮

కుంభోత్సవము

డాక్టరు ప్రాణజీవనదాస్ మెహతాగారితో మాటలాడుటకు రంగూను పోఁదలంచితిని. దారిలో కలకత్తా కలదు. అచట భూపేంద్రనాథవసుగారు నన్ను రమ్మని కోరిరి. వంగీయు లతిథుల నెంత పూజింతురో అంత పూజయు సమగ్రముగా నచటఁ గానవచ్చెను. నే నా దినములలో పండులనే భుజించుచుంటిని. నా కుమారుఁడు రామదాసు అపుడు నా వెంట నుండెను. కలకత్తాలోఁ గల పండ్లన్నియు నాకొఱకు తీసికొనిరాఁబడెను. స్త్రీలు రాత్రియంతయు మేలుకని బాదము, పిస్తా మొదలగు పండ్ల బెరడు లొలుచుచుఁ గూర్చుండిరి. రకరకముల పండ్లు చక్కఁగను, నేర్పుగను సిద్ధము చేయఁబడెను. నాతో వచ్చినవారికి రకరకముల పక్వాన్నము లొనర్పఁబడెను. దీనఁగల ప్రేమమును, వివేకమును నే నెఱుఁగుదునుగాని యొక యిరువు రతిథులకు ఇంటిల్లిపాది రేయెల్లయు మేలుకని యుపచరించుట దుస్సహము. కాని యీగండము దాఁటుటకు నా కుపాయ మేమియు లేకపోయెను.

రంగూను పోవు స్టీమరులో నేను డెక్కుమీఁద కూర్చుండఁ దలంచితిని. వసుగారి యింట నెంత సత్కార మందితిమో స్టీమరులో నంత యసత్కార మందితిమి. డెక్కుమీఁద ప్రయాణించువారి కష్టము లన్నియు ననుభవించితిమి. స్నాన మొనరించు చోట నిలువలేనంత కంపు! మఱుఁగు దొడ్డి నరకము! మలమూత్రములు తొక్కుకొనుచు దానికి పోవలయును. నా కిది దుర్భరమాయెను. నే నిది యంతయు కెప్టెనుకు విన్నవించితిని. కాని వినువా రెవరు? బాటసారులు తమ మురికిచే డెక్కంతయు ఖరాబుచేసివైచిరి. కూరుచుండుచోటనే

ఉమియుచుంటిని. నాకు కావలసిన తమస్త్రీసము [illegible]. తినఁగా మిగిలిన రెండు కుసుల వనటతో నిద్రపోవుచుంటిని, నా [illegible] లాడునవి మాటలు కొన్ని: [illegible]. ప్రతిదానికిని కాలయినంత చోటు నాక్రమించుకొనఁ బ్రయత్నించెను. ఆ నాక్రమించు కొనిన చోటుకంటె తన సామానును కావలసిన చోటెక్కువ. ఆ రెండు రోజులను మిక్కిలి కష్టముతో గడిపి వెళ్లఁబెట్టితిని.

రంగూనులో దిగఁగనే ఏజెంటు కేప్టెన్ బేంతపేయు వ్రాసి తిని. నేను మరల డెక్కుమీఁదనే తిరిగి వచ్చితిని. నా వ్రాసిన చీటి వలనను, డాక్టరు మెహతాగారి ప్రయత్నముననైనను అట్టి యంత కష్ట మనుభవింప లేదు.

రంగూనునందును నాకక్కఱ కలవాని కన్న నెక్కువ పండ్లనే సమకూర్చిరి. డాక్టరు మెహతాగారి యిల్లు నాకు స్వగృహమే. కావున నేనచట తినుపండ్ల సంఖ్య తగ్గించితినిగాని తినెడి పరిమాణమును తగ్గింపనయితిని. కావున పలురకముల పండ్లు తీసికొనివచ్చెడివారు. నేనును వానిని నిషేధింపనయితిని. ఆకాలములో క్రొత్తక్రొత్తవస్తువులు నాకనుల నాకర్షించెడివి. వానిఁ జూచెఁగా నాలుక యూరెడిది. మరియు తినుట కొక వేళ పాట లేదు. నాకు గూఁటదీపము, నోట మెతుకైనను వేయు భోజించి లేచువఱకు ఎనిమిది, తొమ్మిది గంట లయ్యెడిది.

౧౯౧౫ సాలున హరద్వారమున కుంభోత్సవము. నే నచటికి వెళ్లక తప్ప దనుకొంటిని. మరియు మహాత్ములగు మున్షీరామగారి దర్శనము చేసికొనవలయు ననుకొంటిని. గోఖలేగారి సానయిటీవారు కుంభోత్సవమునకు స్వయంసేవకులను పంపిరి. వారికి హృదయనాథ కుంజ్రూగారు అధిపతులు. స్వర్గీయులగు డాక్టరు దేవుగారును ఆ

స్వయంసేవకసేనలో సేవకులుగా నుంచిరి. మా జట్టుతో రమ్మని నాకు వ్రాసినారు. మగనలాల్ గాంధీ శాంతినికేతనమునం దున్న మా తుకిడీని తీసికొని నాకన్న ముందే హరద్వారమున కరిగెను. నేనును రంగూనునుండి వచ్చి వీరిని కలిసికొంటిని.

కలకత్తానుండి హరద్వారమునకు రైలులో పోవుచు మా పడ్డ పాట్లు భగవంతున కెఱుక. రైలుబండ్లలో కొన్ని వేళల దీపము లయినను నుండెడివి కావు. సహారాన్ పురమునుండి మేము సామానులవలె, జంతువులవలె క్రిక్కిరిసిపోయితిమి. పైకప్పు లేని రైలుపెట్టెలు, పైని మధ్యాహ్నసూర్యుడు, క్రింద కాలుచున్న యినుపరేకులు: ఇక మా పని యెటు లుండెనో చెప్పవలయునా? దప్పిచే నాలుక యెండిపోయినను ఆ యెండలో ఛాందసులగు హిందువులు చత్తురు కాని, తురకలు నీరు తెచ్చుచో ముట్టరు. 'హిందూనీళ్లు' వచ్చిననే త్రావుదురు. ఈ హిందువులే వ్యాధిగ్రస్తులగుచో నపుడు తమకు డాక్తరులు బ్రాంది నిచ్చినను, తురకకాంపౌండరులు, కిరస్తానీ కాంపౌండరులు నీ రిచ్చినను, మాంసరస మిచ్చినను త్రాగుటకు సంకోచింపరు.

హిందూదేశమునందు మనకు పాకీపని చేయుటయే విశేష మయిన పని యని శాంతినికేతనమున నేను గ్రహించితిని. ఒక సత్రమునం దీ స్వయంసేవకులకు డేరాలు వేయబడెను. డాక్తరు దేవుగారు మఱుగుదొడ్లుగా నుపయోగించుటకు కొన్ని గోతులు త్రవ్విరి. వీనిని బాగుచేయుటకు డబ్బిచ్చి పాకీవాండ్ర నేర్పాటు చేయ జూచుచుండిరి. ఈ దశలో 'ఈ పని యంతయు మా ఫినిక్సువారిది' అని నే నంటిని. డాక్తరు దేవుగా రంగీకరించిరి. ఇక మాలో మాట యిచ్చువాడను నేను; పని చేయువాడు మగనలాల్ గాంధీ.

డేరాలో కూర్చుండి యాత్రికులకు దర్శన మిచ్చుట, ధర్మ ప్రసంగము చేయుట, తదితర ప్రసంగము చేయుటయు నా పని. ఈ దర్శనము లిచ్చుటతో నాపని చెల్లు. ఒక్క నిముషమేని తీరుబడి లేదు. స్నానమునకు వెళ్లినప్పుడును నన్ను విడిచిపెట్టెడివారు కారు. ఇంక నన్ను ఫలాహారము మాత్రము చేయనిత్తురా? దక్షిణ-ఆఫ్రికాలో నా చేసిన యల్పసేవ హిందూదేశమునం దంతటను తెలియఁబడినదో యని హరిద్వారమున కనుగొంటిని.

నేను తిరుగలిలో నలిగిపోతిని. మూఁడవతరగతిలో పయనించు నపుడు నే నందఱితోపాటు కష్టము లనుభవించితిని. అప్పుడు నన్నెఱిఁగినవారు లేరు. దిగినంతటనే దర్శనము గోరు జనులచే పరివేష్టింపఁబడిపోతిని. ఈ రెండు స్థితులలో నేది దయాజనకమో నిర్ణయించుకొనుటకుఁ జాలఁ గష్టపడితిని. దర్శనమునకు వచ్చు మూఁకను జూచి కోపము వచ్చుచుండెడిది. తఱుచు సంతాపముకూడ కలుగుచుండెడిది. మూఁడవతరగతి పయనములవలన కష్టము మాత్రమే కలిగెడిది; కోపము కలిగెడిది కాదు. కలిగిన కష్టముకూడ మేలునకే యుపయోగించెడిది.

నా కానాళ్లలో ఇష్టము వచ్చినటులు తిరుగుటకు శక్తి యుండెడిది. ఆ కాలములో నాకు రస్తాలో వెళ్లుటకుఁ గూడ వీలు లేనంత ప్రసిద్ధి లేదు. అచటఁ గూడిన జనులకు ధర్మచింత తక్కువ. అజాగరూకత, చంచలత, పాషండత యెక్కువ. సాధువులు నేల యవిసినటులు పుట్టుకొని వచ్చిరి. పాలు, పంచదార తినుటకు వారు పుట్టినటు లుండిరి. ఇచట నే నయిదు కాళ్లు గల యావును జూచితిని. నా కాశ్చర్యము కలిగెను గాని యెఱిఁగినవారు నా యజ్ఞానమును పాఱఁద్రోలిరి. ఈ యావు దుష్టుల లోభమునకు బలి యాయెను. లేగ

కాళ్లు తెగఁగొట్టి ఆవుమూఁపురపు తోలుకుట్టి అచట నీ కాళ్లు కట్టి యయిదుకాళ్ల యావును జేసిరి. ఈ రెండు పాతకములకును ఫల మేమనఁగా నమాయికుల కడనుండి ధనము దోచుకొనుటయే. అసలు ఈ యయిదుకాళ్ల యావును జూచిన హిందు వెవఁడును లేఁడు. దానిని చూచినందులకుఁగాను తక్కువ దక్షిణ యిచ్చిన హిందు వెవఁడును లేఁడు.

కుంభోత్సవదినము వచ్చెను. నా కది దినము పర్వదినము. తీర్థయాత్ర యనుకొని నేను హరిద్వార మేఁగలేదు. తీర్థక్షేత్రములవలన పవిత్రతాదుల సంపాదింపవలయు ననుమోహము నా కెన్నఁడును లేదు. అపు డచటికి పదియేడు లక్షల జనులు వచ్చి యుండిరి. ఆ వచ్చిన పదియేడు లక్షల జనులును పాషండులా? వీరిలో పలువురు పుణ్యము కొఱకును, ఆత్మశుద్ధికొఱకును వచ్చియుందు రని చెప్పుటలో నాకిసుమంతయు సందియము లేదు. ఇట్టి విశ్వాస మాత్మోన్నత్యము కలిగించుట అసంభవము కాదుగాని కొంచెము కష్టమని మాత్రము చెప్పవలయును.

ప్రక్కపయిఁ బరుండి నేను విచారసాగరమున మునిఁగి పోయితిని. ఈ పాషండులనడుమ పవిత్రులును గలరు. వా రీశ్వరునిముందు నిర్దోషులని చెప్పవచ్చును. ఇట్టి సమయమున హరిద్వారమునకే వచ్చుట తప్పగునేని నే నా విషయమును వెల్లడించి కుంభోత్సవము నాఁడు హరిద్వారమును విడనాడియుందును. హరిద్వారమునకు వచ్చుటయు, కుంభోత్సవమునాఁ డచట నుండిపోవుటయు పాపము కానిచో నే నేదో యొక కఠినవ్రతమును బూని యచట జరుగుచున్న పాపమునకుఁ బ్రాయశ్చిత్తమును, ఆత్మశుద్ధిని చేసికొనవలయునని తలఁచితిని. నేను వ్రతము లాచరించుటకే పుట్టితిని గావున నేదో యొక

కఠినవ్రతి మాచరింపఁదలపెట్టితిని. కలకత్తాయందును, రంగూనునందును నాకొఱకు నా మిత్రులనావశ్యకముగ శ్రమను బొందుటయు ఆ సమయమున నాకు నచ్చచెప్పెను. ఈ కారణమున తినెడు వస్తువుల కొక హద్దేర్పఱచుకొని, సూర్యాస్తమయమునకు ముందే భుజింపను నిశ్చయించికొంటిని. నేను భోజనమున కొక హద్దు నేర్పఱచికొననిచో నా కాతిథ్యమిచ్చువారలకు కష్టము కలిగింతు ననియు, నేనే యొకరికి సేవ చేయవలసియుండఁగా నొరులచే నేనే సేవింపఁబడుచుందు ననియు గ్రహించితిని. కావున ఇరువదినాలుగు గంటల పరిమితి గల కాలములో నయిదు వస్తువులకన్న నెక్కువ ముట్ట ననియు, చీకటిపడినతరువాత భుజింప ననియు వ్రతము గొంటిని. ఈ రెంటి కష్టములను లెస్సగా విచారించితిని. ఈ రెంటిని ఇంచుకేనియు జవదాటకుండుటకు నిశ్చయించితిని. రోగము వచ్చినపుడు ఔషధరూపముగా నెక్కువ వస్తువులను తినుటయా, తినకుండుటయా? మందుగూడ నీ యయిదు వస్తువులలో చేరునా, చేరదా? అను నీ విషయము లన్నింటిని చర్చించి 'తినఁదగిన వయినచో సరి; అయిదింటికంటె నెక్కువ వస్తువులను దినను' అని నిశ్చయించితిని. నేనీవ్రతములు పూని పదమూఁడేండ్లాయెను. ఇవి నన్ను లెస్సగా పట్టి చూచెను. ఇవి నన్నిటులు పట్టి చూచుటయే నాపాల రామకవచమాయెను. ఈ వ్రతముల వలన నా యాయువు పెరిఁగెననియు, వీనివలన పలుమాఱులు రోగముక్తుఁడనయితి ననియు నా యభిప్రాయము.

౮

లక్ష్మణ-ఝూలా (వంతెన)

కాంపడితవారు మున్షీరాము మహాత్ములు. వారిని, వారి గురుకులమును దర్శించిన తరువాత నాకు చాల శాంతి కలిగెను. హర్ద్వారు కోలాహలమునకును, గురుకులశాంతికిని గల భేదము నాకు వెంటనే స్పష్టముగా కానిపించెను. మహాత్ములు తమ ప్రేమతో నన్నోలలాడించిరి. బ్రహ్మచారు లందఱు నన్ను భక్తిశ్రద్ధలతో గౌరవించిరి. రామదేవుగారిని నేను మొదట నిచటనే చూచితిని. వారి కార్యశక్తిని వెంటనే నేను కనుఁగొనఁ గలిగితిని. మాకు కొన్ని విషయములలో మతభేదము లున్నను కొలఁదిరోజులలోనే మా పరిచయము స్నేహముగా పరిణమించెను. నేనచట రామదేవాచార్యులతోను, తదితరాచార్యులతోను పనిపాటలు నేర్పుటను* గూర్చి చాల సంభాషించితిని. వెంటనే గురుకులమునుండి సెలవు తీసికొనవలసి వచ్చుట నాకు సంతాపకర మాయెను.

'లక్ష్మణఝూలా' తప్పక చూడఁదగినదని యెక్కువగా వింటిని. ఇంతదూరము వచ్చి హృషీకేశము చూడకపోవుట మంచిది కాదని పలువురు మిత్రులు నొక్కి చెప్పిరి. లక్ష్మణ-ఝూలా హృషీకేశమునకు దగ్గఱ. నేను నడచి పోనెంచితిని. హృషీకేశ మొక మజిలీ; రెండవ మజిలీ లక్ష్మణ-ఝూలా.

హృషీకేశమున పలువురు సన్న్యాసులు నన్నుఁ జూడ వచ్చిరి. వారిలో నొకరికి నాజీవన వృత్తాంతము రమణీయముగా కానిపించెను. ఫినిక్సు-జట్టంతయు నావెంట నుండెను. ఆయన మమ్ముల నందఱను జూచి చాల ప్రశ్న లడిగెను. మాతో ధర్మమును గుఱించియు ప్రసం

* Industrial Training

గించెను. నాలో ధర్మమునెడల తీవ్రాభిలాషము కలదని యతఁడు గ్రహించెను. నేను గంగలో స్నానముచేసి వచ్చుచుంటిని. నా శరీరముమీఁద చొక్కాలుఁ, గిక్కాలు లేవు. నాకు శిఖాయజ్ఞోపవీతములు లేవు. ఇట్టి నన్నుఁ జూచి దుఃఖితుఁడై యా సన్యాసి 'నీవా స్తికుఁడవు. నీకు శిఖాయజ్ఞోపవీతములు లేకుండుట నాకు విచారముగా నున్నది. ఈ రెండును హిందూధర్మమునకు బాహ్యచిహ్నములు. హిందువయినవాఁ డీ రెంటిని తప్పక తాల్పవలయు' నని పలికెను.

పోరుబందరులో బ్రాహ్మణబాలకులు జందెములకు తాళపుచెవులు కట్టుకొనుచుండుట చూచితిని. ఆ తాళపుచెవుల ఝుంకారము నేను వినుచుంటిని. నా కపుడు పదియేండ్లు. వారివలెనే జందెము వేసికొని దానికి తాళపుచెవులు కట్టుకొని గిఱ్ఱున త్రిప్పుచు వాని ఝుంకార మాలకించుచుండవలెనని నాకును అభిలాష కలిగెను. ఆ కాలమున కాఠియావాడు కోమటులకు జందెము వయిచుకొను నాచారము లేదు. కాని ద్విజమాత్రులు జందెము తాల్పితీరవలయు నను నొకః ప్రచారము అపుడే యారంభ మాయెను. గాంధీకుటుంబమువారందఱు జందెములఁ దాల్పఁగడఁగిరి. మావారి కిరువురకును, నాకును అపు డొక బ్రాహ్మణుఁడు రామరక్ష చెప్పుచుండెను. ఆయన మాకు జందెములు వయిచెను. అపుడు నాకు తాళపు చెవులతో పని లేకున్నను రెండుమూఁడు దానికి తగిలించి త్రిప్పఁదొడఁగితిని. పిదప జందెమెపుడో తెగెను గాని మరల జందెము వేసికొనవలయు నను వ్యామోహము నాకు కలిగినటులు గుఱుతు చాలదు. పిదప నేను క్రొత్త జన్నిదమును తగిలించుకొనలేదు.

పెద్దవాఁడ నయిన పిదప నాచేత జందెము తాల్పఁజేయుటకు పలువురు ప్రయత్నించిరి. కాని వారి ప్రయత్నము నామీఁద ప్రస

రింపలేదు. శూద్రులకు జందెములు తాల్చు నధికారము లేకున్నచో తదితరుల కేల యుండవలయును! ఈ బాహ్యచిహ్నమును ధరించు నలవాటు మాకుటుంబములో లేదు. మరియు దీనిని ధరించితీరవలయు ననుటకు ప్రబలమగు కారణము నాకుఁ గానరాలేదు. 'నాకు జందెము మీఁద గోఁత లేదుకాని దానిని దాల్చుటకుఁ దగినంత హేతువు కానరాలేదు. నేను వైష్ణవుఁడను గాన తావళము దాల్చితిని. పెద్దలు మాయన్నదమ్ములకు పిలక నుంచుటలో జాగ్రత్తగనే యుండిరి. కాని నాకు సీమలో పిలక తీసివేయవలసివచ్చెను. తెల్లవారు చూచి నవ్వుదురనియు, నన్నునాగరకుఁ డని యందురనియు సిగ్గుపడి నేనచట పిలకను తీసివేసితిని. మాయన్నగారి కుమారుఁడు ఛగన్‌లాల్ గాంధీ దక్షిణ-ఆఫ్రికాలో నాకడ నుండెడివాఁడు. అతఁడు పట్టుదలతో శిఖ నుంచుకొనెను. ప్రజాకార్యముల కతని శిఖ యడ్డు వచ్చునని యతని మనస్సునకు బాధ కలిగినను గూడ లెక్కగొనక నేనతని పిలక తీసివేయించితిని. ఈరీతిగా పిలకనుగురించి నాకింత సిగ్గుండెడిది.

నే నా స్వాములవారి కీకథనంతయు వినిపించి పిదప నిట్టులంటిని :

'జందెము నేను వేసికొనను; ఏలయనిన చాలమంది హిందువులకు జందెము లేదు. అయినను వారు హిందువులే. మరియు దాని యక్కఱ నాకుఁ గానిపించుటలేదు. మరియు యజ్ఞోపవీతధారణ మనఁగా జన్మాంతరధారణము. జన్మాంతర మనఁగా శుద్ధజీవనము, ఉన్నతజీవనము. ఈకాలమున హిందూసమాజమును, హిందూస్థానమును ఈరెండుగూడ వెనుకఁబడి యున్నవి. ఇట్టి స్థితిలో మనకు జందెము దాల్చు నధికార మేడ! హిందూసమాజ మస్పృశ్యతను విసర్జించిన నాఁడు, ఉచ్చనీచభేదములను మఱచిననాఁడు, ఇతరదోష

ములనీసడించిననాఁడు, నాలుగుదిక్కులను పిక్కటిల్లిన మాహాత్మ్యమును, పాపంపెతను పాటఁద్రోలిననాఁడు మనకు యజ్ఞోపవీతమును ధరించు నధికారము రాఁగలదు. కావున యజ్ఞోపవీతమును గుఱించి మీరు చెప్పిన మాట నాకు గిట్టును. ఇఁక పిలకనుగుఱించి కొంచెము విచారింపవలసి యున్నది. నా కివఱకు పిలక యుండెడిది. కాని సిగ్గుచేతను, భయము చేతను దానిని దీసివయిచితిని. ఇప్పుడు దానిని మరలఁ బెంచఁ దలఁచు చున్నాను. నా సహచరులతోఁ గూడ నీ విషయమును విచారించెదను."

జందెమునుగుఱించి నాచెప్పిన మాటలు స్వామివారికి నచ్చ లేదు. జందెము తాల్పకుండుటకు నేనే కారణములను జెప్పితినో వారా కారణములనే జందెము తాల్పుటకు ప్రమాణముగాఁ జెప్పిరి. అది యటుండె. జందెమునుగుఱించి యాయభిప్రాయములు నేఁటికిని మాఱ లేదు. పలు మతము లున్నంతవఱకును ఒకొక్కమతమున కేదో యొక బాహ్యసంకేత ముండుచునేయుండును గాని, యా బాహ్యసంకేతము డంబమున కగునేని, ఇతరమతములకన్న తనగొప్పను ప్రకటించుకొను నేని యది త్యాజ్యమగును. ఈకాలమున జందెము హిందూమతమున కభివర్ధకమగు సాధనముగా నాకుఁ గానిపింపదు. కావున నేనీ విషయమున తటస్థుఁడనయి యుంటిని

పిలకను సిగ్గుచేతను, భయముచేతను దీసివేసితినిగాన నా సహచరులతో సంప్రతించి మరల పిలకను బెంచఁ దలఁచితిని. ఇఁక నీ విషయ మటు లుంచి లక్ష్మణ-ఝూలా దెస కేఁగుదము.

హృషీకేశము, లక్ష్మణ-ఝూలా యీ రెండును జూచి తీరవలసినవి. మన ప్రాచీనుల ప్రకృతిసౌందర్యజ్ఞానమునకును, శిల్పమునకు ధర్మస్వరూపమొసఁగువారి దూరదర్శిత్వమునకును నా కత్యాదరము జనించెను.

కాని పట్టిచోటుల మనుష్యు లొనరించు పనులు చూడఁగా నాకు శాంతి నిలువలేదు. హరద్వారమునందువలెనే హృషీకేశము నందును బాటల ప్రక్కల సుందరమగు గంగాతీరములయందు మనుష్యులు రోఁతచేసివయితురు. అది పావనమగు గంగాజల మని యయినను వారికి తోఁచదు. కొంచెము దవ్వేఁగినయెడలఁ గావలసినంత చోటు దొరకుచుండఁగా బాటలను, నదులయొడ్డులను పాడుచేయుట చూచి కడు సంతసించితిని.

లక్ష్మణ-ఝూలా యనునది ప్రేలాడుచుండు నొక యినుప వంతెన. లోఁగడ నచట త్రాటితోఁ జేయఁబడిన యొక చక్కని వంతెన యుండెడిదఁట. ఉదారహృదయుఁ డగు నొక మారువాడీ సజ్జనుఁడు దానిని దీయించి చాల రొక్కము వెచ్చించి యీ యినుప వంతెన వేయించి దాని తాళపుచెవులు గవర్నమెంటువారికి వశపఱిచె నఁట! నేను చూచియుండ లేదు గాన లోఁగడనున్న త్రాటివంతెనను గుఱించి యేమియుఁ జెప్పఁజాలను గాని, యీ యినుపవంతెన యచటి ప్రకృతిసౌందర్యమునకు కళంక మనియు, నస్థానపతిత మనియుఁ జెప్పఁ గలను. నిక్కమున కిది యాత్రికుల వంతెన. దాని తాళముచెవులు సర్కారువారి కీఁబడియెను. రాజభక్తి గల నా కొనాఁటికే యీ విషయము కటువుగా నుండెను.

దీనికంటె దుఃఖజనకమగు దృశ్యము స్వర్గాశ్రమము. టిన్ రేకుల పాకలకు స్వర్గాశ్రమ మని పేరిడిరి కాని వేఱేమియు లేదు. ఈ పాకలు సాధకులకుఁగాను వేయఁబడియె నని వింటిని. కాని యచట నపుడు సాధకుఁ డెవఁడును ఉన్నటులు లేదు. అచటి ముఖ్యస్థలమునం దున్నవారిని చూచితిని గాని వారు గొప్పవారని నాకుఁదోఁపలేదు.

హరద్వారమునందు నాకుఁ గలిగిన యనుభవము లమూల్యము లనుటలో సంశయ మిసుమంతయు లేదు. అవి నా యునికిని గుఱించియు, నా పనిని గుఱించియు నిశ్చయించుటకు చాల సాయ మొనరించెను.

౮

ఆశ్రమస్థాపనము

నేనీ కుంభయాత్ర చేయుటకు ముందొకతూరి హరిద్వార మరిగి యుంటిని. ౨౫-౫-౧౯౧౫లో సత్యాగ్రహాశ్రమము స్థాపింపఁబడెను. శ్రద్ధానందులవారు నన్ను హరిద్వారమునం దుండఁగోరిరి. కలకత్తా మిత్రులు కొందఱు వైద్యనాథమునం దుండుమనిరి. రాజకోటలో నుండుమని మఱికొందఱు మిత్రులు పట్టుపట్టిరి.

నే నమదాబాదుమీఁదుగా వెళ్లుచుండునపుడు పలువురు మిత్రులు నన్నమదాబాదునం దుండుమనిరి. ఆశ్రమమున కగు వ్యయమును తామె భరింతుమనిరి. మాకు నివసించుటకు నిండ్లిత్తుమనిరి. ఈ కారణములచే నా కమదాబాదుమీఁదనే చూపువడెను. నేను గుజరాతువాఁడ నగుటచే గుజరాతుభాషవలన దేశమునకు నా చేయఁగలిగినంత సేవయును చేయఁగలుగుదు నని తలఁచితిని. మఱియు అమదాబాదు చాలఁగాలమునుండియు చేతిమగ్గములకు కూడలి. కావున నిచట రాటముల పని బాగుగా సాగఁగలదనియు, నిది గుజరాతుదేశమునకు ప్రధాననగర మగుటఁజేసి యచటఁ గల ధనవంతులు ధన మొసఁగి చాల సాయము చేయఁగల రనియు తలఁచితిని.

అమదాబాదు మిత్రులతో ఆశ్రమమును గుఱించి మాటలాడు సందర్భమున అస్పృశ్యులను గుఱించియు లెస్సగా చర్చించితిని. యోగ్యుఁడగు నంత్యజసోదరుఁ డెవఁడేని యాశ్రమమునఁ బ్రవేశింపఁ గోరినచో నేను తప్పక చేర్చికొందునని వారికి స్పష్టముగాఁ జెప్పివయిచితిని.

'మీ నియమములను పరిపాలింపఁగల యంత్యజుఁ డెవఁడేని దొరకినపుడు చూతము లెం' డని యొక వైష్ణవమిత్రుఁడు తన మన

స్సంతోషమును వెల్లడించెను. తుదకు నే నమదాబాదునం దాశ్రమము స్థాపింప నిశ్చయించితిని.

శ్రీ జీవనలాల్ దేశాయి బారిస్టరుగారు నన్నమదాబాదులో నుండఁగోరినవారిలో ప్రధానులు. మేము వారి కోచరబ్-బంగాళా అద్దెకుఁగొని యం దుంటిమి.

పిదప ఆశ్రమమునకు ఏమి పేరు పెట్టవలయు నని చర్చకు వచ్చెను. నేను మిత్రులతో నాలోచించితిని. సేవాశ్రమ మనియు, తపోవనమనియు నెవరికిఁ దోఁచిన పేరులు వారు చెప్పిరి. సేవాశ్రమ మను పేరు బాగుగనే యుండెనుగాని దాన సేవారీతి తెల్లగా తోఁపదు. ఇఁక తపోవన మనుపే రెటులు పెట్టుకొనఁజెల్లును? మాకు తపస్సనినఁ బ్రియమే కాని యీ పేరు మా తల దాఁటినది. మా యుద్దేశము సత్యమును పూజించుట, సత్యమును శోధించుట, సత్యము నెడలఁ బట్టుదల వహించుట, మరియు దక్షిణ-ఆఫ్రికాలో మేము చేసిన పద్ధతిని హిందూదేశమువారిచే చేయించుట, మరియు దాని శక్తి హిందూదేశమున నెంత పని చేయునో చూచుట నా యుద్దేశము. కావున నా సహచరులును, నేనును సత్యాగ్రహాశ్రమ మను పేరును నిర్ణయించితిమి. ఈ పేరువలన సేవయు, సేవాపద్ధతియు సహజముగా గోచరించును.

ఆశ్రమమునకు నియమావళి యుండవలయును. చిత్తు తయారు చేసి యందఱి యభిప్రాయములను కోరితిని. అందఱి యభిప్రాయములలోను గురుదాస బెనర్జీగారి యభిప్రాయము నేఁటికిని నాకు గుర్తున్నది. వ్రతములలో నమ్రతనుగూడ నొక వ్రతముగా చేయవలయునని వారి యూహ. నేఁటి పిన్నవారలలో నమ్రత కొఱవడియున్నదని దీని యాశయము. నాకును ఈ సంగతి తెలియును గాని నమ్రతను

గూడ వ్రతములలోఁ జేర్చినచో నమ్రత నమ్రతగా నుండదు. నమ్రతను సంపూర్ణముగా నర్థము చెప్పవలసివచ్చుచో శూన్యత యని చెప్పవలసివచ్చును. శూన్యతాప్రాప్తికి వేరే వ్రతము వలయును. శూన్యత యనిన మోక్షస్థితి. ముముక్షువునకుఁగాని, సేవకునకుఁగాని ప్రతివిషయమునందును శూన్యత-అభిమానము లేకుండుట-కావలయును. లేకున్నచో నతఁడు ముముక్షువు కాఁడు, సేవకుఁడును గాఁడు. అట్టివాఁడు స్వార్థపరుఁడు, అహంకారి.

అపు డాశ్రమమున నించుమించు పదమూవురు ద్రవిడులు కలరు. దక్షిణ-ఆఫ్రికానుండి నాతో నయిదుగురు ద్రవిడబాలకులు వచ్చిరి. వీరితోఁగలిసి మే మందఱమును ౨౫ మందిమి. మా కందఱకును పాకశాల యొకటియే. మే మందఱమును ఏకకుటుంబమువారివలెనే నివసింపఁ బ్రయత్నించితిమి.

౧౦

పరీక్ష!

ఆశ్రమము స్థాపింపఁబడిన కొలఁదికాలములోనే నే ననుకొనని విషయ మొకటి తటస్థించెను. భాయి అమృతలాలు ఠక్కరు గారికడ నుండి నా కొక యుత్తరము వచ్చెను: 'మిగుల దరిద్రుఁడును, యోగ్యుఁడును అగు నంత్యజుఁ డొకఁడు తనకుటుంబముతో మీ యాశ్రమమున నుండఁగోరుచున్నాఁడు. తా మతనిని స్వీకరింతురా?'

నే నుద్విగ్నుఁడ నయితిని. ఠక్కర్ బాబువంటి గొప్పవారి యనుమతి గొని యింత శీఘ్రకాలములో నొక యంత్యజకుటుంబ మాశ్రమమునకు వచ్చు నని నే ననుకొనియుండలేదు. నా సహచరుల కా చీటిని చూపితిని. వారు సంతోషించిరి. 'ఆ కుటుంబములోని వా రెల్లరును ఆశ్రమనియమములను పరిపాలింతురేని తప్పక మేము స్వీకరింతు' మని అమృతలాల్ ఠక్కరుగారికి తెలిపితిని.

దూదాభాయియు, అతని భార్య దానీ బహెన్, వారికూఁతురు లక్ష్మియు వచ్చిరి. లక్ష్మి యపుడు పాలు గుడుచు శిశువు. దూదాభాయి బొంబాయిలో పంతులు. వారు ఆశ్రమమునందలి నియమములను పరిపాలింప నంగీకరించిరి. ఆశ్రమమునఁ జేర్చుకొనఁబడిరి.

వీరిని జేర్చికొనుటవలన నాశ్రమమునకు సాయ మొనరించు మిత్రమండలిలో నలజడి పుట్టెను. ఇంటివారికి నూతిలో పాలు గలదు. ఆ నూతినుండి నీరు తెచ్చికొనుటకు మాకు కష్టము కలిగెను. అచట ఇంటివారికి నీరు తోడి యిచ్చువాఁడు మ మ్మాతంకపఱచెను. మా నీటిబొట్లు అతనికి తగులరాదు. అతఁడు మమ్ము తిట్టఁదొడఁగెను.

దూదాభాయిని తొలఁగింపుమ్మని నిందింపఁగడఁగెను. 'నిందించినచో సైరింపుఁ' డనియు, 'నేమయినను సరియె నీరు తెం' డనియు నే నంత వఱకును జెప్పితిని. మేము మాఱు తిట్టకుండుటవలన నతఁడు సిగ్గిలి మరల మమ్ముఁదిట్టుట మానుకొనెను. కాని దీనివలన ధనసాహాయ్య మంతరించెను. మొట్టమొదట నంత్యజప్రవేశమునుగుఱించి శంకించిన మిత్రుఁడు నియమపరిపాలకుఁడును నంత్యజుఁ డెచట దొరకు నని యనుకొనెను.

ధనసాహాయ్య మాఁగినపిదప సంఘబహిష్కారము వచ్చు నను వార్త నా చెవిని బడెను. బహిష్కారము వచ్చినను, సాయ మాఁగిపోయినను అమదాబాదు విడువఁగూడ దని నా సహచరులతో నాలోచించితిని. మాలగూడెమునకుఁ బోయి యచటనే నివసించి కూలి నాలి చేసికొని వచ్చినదానితో జీవింత మని యనుకొంటిమి.

ఇటు లుండఁగా నొకనాఁడు—'రా బోవు నెలకు డబ్బు లేదు' అని మగన్‌లాల్ గాంధీ నాకు నోటీ సిచ్చెను. 'అటు లగుచో మనము మాలకూడెమునకు తరలుద' మని చల్లగా నేను ప్రత్యుత్తరించితిని.

నా కిట్టి సంకటములు కలుగుట కిది మొదటితూరి కాదు. కాని పలుమాఱులు చిట్టచివరనిముసమున నాకు సాయము దొరకెను.

మగన్‌లాలు నాకు నోటీ సిచ్చిన కొలఁదినాళ్లలో నొకనాఁటి ప్రొద్దున వడిగా పరువెత్తికొనివచ్చి యొక కుఱ్ఱఁడు—'వెలుపట నొక మోటారు నిలువఁబడి యున్నది. ఒక సేఠు మిమ్ము పిలువ మన్నాఁడు' అనెను. నేను మోటారుకడకు వెళ్లితిని. 'ఆశ్రమమునకు కొంచెము సాయము చేయఁదలఁచితిని. తాము స్వీకరింతురా?' అని యా సేఠు నన్నడిగెను. 'తప్పక స్వీకరింతును, ఇపు డట్టిది చాల నావశ్యకము' అని నే నంటిని.

'నేను రేపు ప్రొద్దున ఈవేళకే ఇచటికి రాఁగలను. మీరు ఆశ్రమముననే యుందురా?' అని సేఠ డడిగెను. 'ఉందు'నని నే నంటిని.

నేను వెళ్లెను. మఱునాఁడు సరిగా ఆసమయమునకే మోటరు 'బంయి' మనెను. బాలకులు నాకీ వార్త తెచ్చిరి. నేను లోపలికి రాలేదు. నేనే వెలుపలికి వెళ్లితిని. అతఁడు ౧౩౦౦౦ రూపాయల నోట్లు నాచేతి కిచ్చి మాటాడకుండ వెళ్లిపోయెను. నేనీ సాయమును కలలో నేని తలపోయ లేదు. అతఁడు ధర్మము చేసిన పద్ధతియు ఆశ్చర్యకరముగా నుండెను. ఆయన యెప్పుడును ఆశ్రమమునకుఁ గూడ రాలేదు. నేను వారి నొకతూరియే చూచియున్నటులు గుఱుతు. ఆశ్రమములోనికి వచ్చుటా లేదు, అడుగుటా, నడుగుటా లేదు. సా యిమ్మిచ్చి బయటి వాఁడు బయటినుండియే నిష్క్రమించెను. ఇట్టి సంఘటన చూచుట నాకిదే మొదలు. ఈ సాయమువలన మాలగూడెమునకు పోవు నాలోచన మాఁగిపోయెను. ఈ సాయముతో నొక యేఁడాదివఱకును పరవా లే దనుకొంటిమి.

వెలుపలవలెనే యాశ్రమములోపలఁ గూడ నలజడి యారంభ మాయెను. దక్షిణ–ఆఫ్రికాలో అస్పృశ్యులు మాయింటికి వచ్చుటయు, ఉండుటయు, భుజించుటయు వాడుకయేగాని యిప్పు డాశ్రమమునందు వారిని సాక్షాత్తు ప్రవేశపెట్టుకొనుట నాభార్య మొదలగు స్త్రీల కింపితము కాలేదు. దానీ బహేను నెడల మావారికి తిరస్కారము లేకున్నను ఔదాసీన్యము కల దని తీక్ష్ణ మయిన నా నయన శ్రవణములకు గోచరమాయెను. ఆర్థిక సాహాయ్య మడుగంటిన నాకంత చింతయు, భీతియు లేకుండెను గాని యీ గృహకల్లోలము దుస్సహ మాయెను. దానీ బహేను అందఱాఁడువారివంటిదే. దూదాభాయి చదువులో సామాన్యుఁడే కాని మంచి వివేకము కలవాఁడు. అతని యోర్పునకు నే సంతసింతును. అతని కప్పుడప్పుడు క్రోధము కలుగుచుండెడిది కాని యతని సైరణ న న్నాకర్షించుచుండును. చిన్న చిన్న యవమానములను సైరింపుమని నేను దూదాభాయికి చెప్పఁగా నతఁ డంగీకరించుటయే గాక దానీ బహేనునుగూడ సైరింపు మని ప్రేరించుచుండువాఁడు.

ఆత్మకథ

ఈ కుటుంబము చేరుటవలన నాశ్రమము చాల పాఠముల నేర్చుకొనెను. మొట్టమొదటనే మేమాశ్రమమునం దస్పృశ్యత లేదని చాటితిమి కావున మాపని సరళ మాయెను. మే మిటులు చాటి చెప్పినను, ఆశ్రమవృత్తియ మధిక మగుచున్నను దీనిని పోషించువారు ప్రధానముగా సనాతనమతావలంబకులగు హిందువులే కావున నస్పృశ్యత పునాదులు జవజవ లాడిపోయె నని స్పష్టమాయెను. ఇందుల కింకను చాల ప్రమాణము లున్నవి. కాని మేము అస్పృశ్యులతో నన్నపానము లాచరించుచుంటి మని తెలిసియు హిందువులు మాకు సాయము చేయుచున్నారు. వారు తమను సనాతన మతావలంబులనుగాఁ బలుకుచున్నారు. ఇది యేమంత తక్కువ ప్రమాణమా?

ఈ యస్పృశ్యతను గురించియు, దీనికి సంబంధించి కలిగిన సాహసకృత్యములను చిక్కులను గురించియు, తలవని తలంపుగా వచ్చి పడిన కష్టముల నతిక్రమించుటను గురించియు, సత్యశోధనమునకు సంబంధించిన వివిధవిషయములను గురించియు తెలుపవలసియున్నను ప్రకృతము తెలుపకుండఁ బోవుటయు, ముందు ప్రకరణములలోఁ గూడ నీ దోష మెంతేని కొంత యుండుటయు తటస్థించుచున్నది. దీనికి నేను వగచుచున్నాను గాని యిది తప్పదు. కొన్ని ముఖ్యవిషముల నే నిందు విడనాడవలయును. ఏలన: ఈ నాటకమునందలి చాల పాత్రములు జీవించియున్నవి. వీరి సమ్మతిని గైకొనక వీరికి సంబంధించిన విషయములను వ్రాయుట యనుచితమైన పని కాదుగదా! 'పోనీ, వారిసమ్మతి గొనరాదా?' యని యనవచ్చునుగాని ఆయా యీ ప్రకరణములు వ్రాయునపుడే వానివానికి సంబంధించిన సంగతులు వానివానికిఁ బంపి సంస్కరణము చేయించి, చీటికి మాటికి వారి సమ్మతులు గైకొనుట యసంభవము మాత్రమే కాక యీ యాత్మకథ హద్దుగూడ నతిక్రమించిన పని యగును. కావున నవశిష్టభాగము సత్యశోధకున కెఱుఁగఁజేయవలసియున్నను సంపూర్ణముగా నెఱుఁగజేయఁజాల నని వెతనొందుచున్నాను. ఇటులయ్యు యీశ్వరేచ్ఛ యున్నచో నీ కథను నా నాల్గో ఆపరేషన్ రోజులవఱకు లాఁగుకొని రావలయు నని నే నాసించుచున్నాను.

౧౧

గిరిమిటుపద్ధతి నెత్తివేయుట

ఇట్టి కలహములలోను మిడుతపోటున్న పండయుగా తొలఁగిపోయినతనే యాంతర బాహిరసంచలనామారుతములలోఁ జిక్కికొని బయటఁ బడిన మా యాశ్రమపు ముచ్చట ముగించి గిరిమిటియాల సంగతి కొంచెము విచారింపవలసిన సమయము సమాసన్నమయినది. అయిదేండ్లు గాని, అంతకు లోపుగాఁగాని పనిచేయుటకు కరారు నామా వ్రాసి యిచ్చి హిందూదేశము విడనాడి పోయినవారు గిరిమిటియాలు. నేటాలులో గిరిమిటియాలమీఁద వేయఁబడిన మూఁడుపౌనుల పన్ను ౧౯౧౪ సంవత్సరమున తీసివేయఁబడెను. కాని యీ పద్ధతి యింకను ఆఁపివేయఁబడలేదు. ౧౯౧౬ సంవత్సరమున పండిత మదనమోహన మాలవ్యాలు ఇంపీరియల్ లెజిస్లెటివ్ కౌన్సిలులో ఈవిషయమును గురించి ప్రసంగించిరి. లార్డు హార్డింగుగారు ఈ ప్రస్తావము నంగీకరించిరి. 'సార్వభౌములు సమయము వచ్చినపుడు ఈపద్ధతి నెత్తివేయుమని నాకు సెలవిచ్చిరిగాన తటి వచ్చినపుడెత్తివేయుదు' నని లార్డు హార్డింగుగా రుద్ఘోషించిరి. అస్పష్టమగు నీ వాగ్దానమున కిండియా తృప్తిపడఁజాలదుగాన దీనిని వెంటనే యెత్తివేయింపవలయు నని నేఁ దలఁచితిని. హిందూదేశ మిన్నాళ్లనుండియు నీపద్ధతిని 'బహుపరాకుగా' సైరించుచు వచ్చుచుండెను. ఇపుడు హిందూదేశము కొంచెము కన్ను తెఱచె నని నే ననుకొంటిని. కొందఱు మిత్రులతో సంప్రతించితిని; పత్రికలలో వ్రాసితిని. వెంటనే తీసివేయుటకే యందఱకును అభిమత మని గ్రహించితిని. దీనియొక్క సత్యాగ్రహమున కేమేని ప్రసక్తి కలదా? ప్రసక్తి కలదనుటలో నా కేమియు సందియము లేదు కాని దీని నెటు లుపయోగింపవలయునో అది తెలియలేదు.

ఈలోపుగా వైసరాయిగారు 'సమయము వచ్చినపుడు' అను మాటల కర్థమును విప్పిచెప్పిరి. 'ఈ పద్ధతికి బదులు మఱియొక పద్ధతిని ప్రవేశ పెట్టుటకు సరియగు సమయము చిక్కఁగనే ఈ పద్ధతి తీసివేయఁబడు'నని వైసరాయిగారు ప్రకటించిరి. పిదప ౧౯౧౭ సాలున ఫిబ్రవరిలో వెంటనే యీ పద్ధతిని తొలఁగించుటకు బిల్లును మంజూరు చేయుఁడని ఇంపీరియల్ లెజిస్లెటివ్ కౌన్సిలులో పండిత మదన మోహన మాలవ్యాలు వైసరాయిగారి నడిగిరి గాని వారు నామంజూరు చేసిరి. నే నీ విషయమును హిందూదేశమునం దంతటను ప్రచారము చేయ నారంభించితిని.

హిందూదేశ మంతయు తిరుగుటకుముందు వైసరాయిగారిని చూచుట మే లని తలఁచితిని. నేను వారిదర్శనమునకు దరఖాస్తు పెట్టుకొంటిని. వెంటనే అది అంగీకరింపఁబడెను. వైసరాయిగారి కిపుడు మి. మేఫీ మంత్రి. అతఁడిపుడు సర్ జాన్ మేఫీ యాయెను. నాకు మి. మేఫీతో గాఢపరిచయ మొదవెను. లార్డ్ ఛెమ్స్‌ఫర్డు గారును, నేనును ఇష్టపూర్తిగా మాటలాడితిమి గాని వారు నిక్కచ్చిగా నే మాటయుఁ జెప్పరయిరి. కాని వారు తప్పక సాయము చేయుదు రని నే నాశ పెట్టుకొంటిని.

నా త్రిప్పుటకు బొంబాయి మొదలు. జహాంగీరు పిటిట్ గారు సభను జరపించు భారము వహించిరి. ఇంపీరియల్ సిటిజన్‌షిప్ అసోసియేషనువారి తరఫున సభ యాయెను. కార్యనిర్వాహకవర్గము వారు తీరుమానముల ముసాయిదా వ్రాయుటకు గుమిగూడిరి. డాక్టరు రీడ్, సర్ లల్లూభాయి శామలదాస్, మి. నటరాజన్ వగైరాలును, పిటిట్ గారును అపుడు ఉండిరి. 'ఎపుడీ పద్ధతి నెత్తివేయుదు రని సరకారువారి నడుగవలయును?' అను చర్చ వచ్చెను. 'ఏ లయినంత

త్వరలో' నని యొకరును, '౩౧ వ జూలైనాఁడెత్తివేయవలయు' నని మఱియొకరును, 'వెంటనే యెత్తివేయవలయు' నని మఱియొకరును గవర్నమెంటువారి నడుగుద మని వారు వారు సూచించిరి. '౩౧ వ జూలైనాఁడు' అను మాట నాది. ఏదో యొక తేదీని నిష్కర్ష చేయుచో ఆనాఁటికి గవర్నమెంటువా రేమియుఁ జేయకున్నయెడల పై పనిని మనము విచారించుకొనుటకు వీలు కలుగు నని నా యభిప్రాయము. 'వెంటనే' అను మాట లల్లుభాయిగారిది. '౩౧వ జూలైకంటె వడిగా కావలయు నని నాయుద్దేశము' అని లల్లుభాయిగా రనిరి. 'వెంటనే' అను మాట లోకులకు సరిగా అర్థము కాదని నేను తెలిపితిని. 'లోకులచే నేదేని పని చేయింపవలసివచ్చుచో నిశ్చయార్థబోధకమగు పదమునే వాడవలయును. 'వెంటనే' యనుదాని కెవనికి తోఁచినటులు వాఁ డర్థము చెప్పికొనుచుఁబోవును. గవర్నమెంటువా రొక యర్థము చెప్పుదురు; లోకు లింకొక యర్థము చెప్పుదురు. ౩౧ వ జూలై యనునెడల నిఁక నర్థభేదము పొసఁగదు. ఆ తేదీకి గవర్నమెంటువా రేమియు పరిష్కరింపనిచో మనపనిని మనము చేసికొనుటకు వీలు కలుగును' అని నే నంటిని. డాక్టరు రీడుగారు దీని శక్తిని వెంటనే గ్రహించిరి. లల్లుభాయిగారికిఁ గూడ తుద కిది రుచించెను. కడపట ౩౧ వ జూలై నిర్ధారింపఁబడెను. హిందూదేశమంతటను ఈ రీతిగనే సభలు జరిగెను.

బొంబాయినుండి శ్రీమతి జాయజీ పిటిట్‌గారి ప్రోద్బలమున స్త్రీల డెప్యుటేష నొకటి వైసరాయిగారికడకు వెళ్లెను. బొంబాయినుండి వెళ్లినవారిలో లేడీ తాతా, స్వర్గీయ దిల్‌శాద్ బేగమ్ మొదలగువారు కలరు. అందఱి పేరులును నా కిపుడు గుర్తు లేవు. ఈ డెప్యుటేషనువలన చాల పని యాయెను. వైసరాయిగారు ఆశావర్ధకముగు ప్రత్యుత్తర మొసఁగిరి.

నేను కరాచీ, కలకత్తా మొదలగు చోటులకు వెళ్లితిని. ప్రతి చోటను పెద్ద పెద్ద సభ లాయెను. ప్రతియోలగమునను ఉత్సాహము పిక్కటిల్లెను. మొదట నే నిది తలపెట్టినపు డింతింత సభలు జరుగు ననియు, నింతఱు గుమిగూడుదు రనియుం దెలియలేను.

ఆదినములలో నే నొంటరిగనే ప్రయాణము లొనరించు చుంటిని. దాన నలౌకికములగు ననుభవములు చేకూరెను.

సి. ఐ. డి. వారు నన్నంటి యుండెడివారు కాని వీరితో జగడము పెట్టుకొనుటకు నాకు జరూరు లేదు. నాకే రహస్యమేమియు లేదు గాన నన్ను కష్టపెట్టవలసిన పని వారికి లేదు. వారిని కష్టపెట్టవలసిన పని నాకును లేదు. సౌభాగ్యవశమున నా కపుడు మహాత్మ్యము ప్రి లేదు. కాని నన్నెఱిఁగినచోట మహాత్మ్యమునకు గొఱవ లేకపోలేదు. ఒకతూరి నేను రైలులో పోవుచుండఁగా చాల స్టేషనులలో 'సి. ఐ. డీ.' లు నాటిక్కెట్టు చూడవచ్చి నెంబరు వేసికొని కొంచెము గోలచేసిరి. వా రడిగిన ప్రశ్నలన్నిటికిని నేను వడిగనే సమాధాన మిచ్చుచువచ్చితిని. నా తోడి బాటసారు లందఱును నన్నొక సాధువుగనో, ఫకీరుగనో పరిగణించిరి. ప్రతి స్టేషనునందును నన్నిటులు కలవరపఱచుటచే బాటసారులు సి. ఐ. డి. వారిని తిట్టుచు 'పాప మీ సాధువును వృథాగా నేల కష్టపెట్టుచున్నా'రని తిరుగఁబడి నాదెసఁ జూచి 'ఈ బద్మాషులకు టికెట్టు చూపవల' దని నాకుఁ జెప్పిరి.

'టికెట్టు చూపుట నా కేమియు కష్టము కాదు. వారు వారి విధిని చేసికొనుచున్నారు.' అని నే నా బాటసారులకుఁ జెప్పితిని. బాటసారుల కీ నా మాట తృప్తిగా లేదు. వారికి నాపై చాల దయ గలిగెను. నిరపరాధుల నెందుల కిటులు హైరాణ పెట్టవలయు నని వారు ప్రతిఘటించిరి.

౧౧ గిరిమిటుపద్ధతి నెత్తివేయుట

సి. ఐ. డి. వారి బాధకంటె జనసమూహపు బాధయే నాకెక్కుడనిపించెను. లాహోరునుండి ఢిల్లీకి పోవుచు గుంపుల యొత్తిడిచే పడరాని పాట్లు పడితిని. నేను కరాచినుండి కలకత్తాకుఁ బోవుచుంటిని. నడుమ లాహోరులో రైలు మార్చుకొనవలయును. నాకు రైలులో చోటెచటను దొరకలేదు. బలము గలవారికే చోటు. తలుపులు బిగించుచో జనులు కిటికీలనుండి లోపలికి దూఱుచుండిరి. నేననుకొన్న నాఁటికి కలకత్తా చేరితీఱవలయును. ఈ రైలు దాఁటిపోవుచో నేననుకొన్న నాఁడు దాఁటిపోవును. నాకిఁక చోటు దొరకునను నాశ యుడిగెను. ఎవరును నన్ను లోనికి రానీయలేదు. నేను వెతుకుకొనుచుండఁగా నొక పోర్టరు 'పండ్రెండణా లిచ్చుచో మీకు చోటు చూపింతు' ననెను. 'చోటు చూపించుచో తప్పక పండ్రెండణా లిత్తు'నంటిని. అతఁడు కనఁబడినవారి చేతులు కాళ్లు పట్టుకొని నాకు చోటుచేయుటకు బతిమాలాడెను. కాని యెవరు నంగీకరింపరయిరి. రైలు బయలుదేఱు వేళ యాసన్నమాయెను. ఇంతలో నొక బాటసారి—'ఇచట చోటులేదు గాని అతనిని లోనికిఁ ద్రోయుము. అతఁడిచట నిలుచుండవలయును.' అని యనెను. 'మీకు సమ్మతమేనా?' యని పోర్టరు నన్నడిగెను. 'ఆ, సమ్మతమే, లోనికిఁ ద్రోయుము'మని నే నంటిని. అతఁడు నన్నెత్తి కిటికీనుండి లోనికిఁ ద్రోసెను. ఈరీతిగా నేను లోపలఁ బడితిని. పోర్టరు పండ్రెండణాలు సంపాదించుకొనెను.

నా కది కాళరాత్రి. బాటసారు లందఱును ఎట్టెటులో కూరుచుండిరి. పై బల్లకు గల గొలుసును పట్టుకొని రెండు గంటలు నిలువఁబడితిని. 'ఇంతవఱకును కూర్చుండవే' మని నడుమనడుమ బాటసారులు నన్ను దబాయించుచుండిరి. 'కూర్చుండుటకు చోటు

లే దని వారిని సమాధానపఱచుచుంటిని గాని, నే నిటులు నిలువఁ బడుట వారికి సమ్మతముగా లేదు. వారు కాళ్లు నిగుడఁదన్నుకొనియే పరుండిరి. వారు నన్ను కూర్చుండుమని దబాయించినకొలఁదియు నేను మిగుల శాంతముతో సమాధానము చెప్పుచుంటిని. దీనితో వారు కొంచెము శాంతించిరి. వారిలో నొకరు నా యూరుపేరు లడిగిరి. నా పేరు వినఁగనే వారు నొచ్చుకొని క్షమాపణ చెప్పి చోటు చేసిరి. శాంతికి ఫలము నాకపుడు కానవచ్చెను. నా తల గిర్రున తిరుగుచుండెను. కూర్చుండవలసిన సమయమున కీశ్వరుఁడు సరిగా చోటు చూపెను.

ఈ ప్రయాసతో అనుకొన్న నాఁటికి కలకత్తా చేరితిని. కాసింబజారు మహారాజుగారు నా కాతిథ్య మిచ్చిరి. వారే కలకత్తాసభ కధ్యక్షులు. కరాచీలోవలెనే కలకత్తాలోఁగూడ నుత్సాహమునకు మేర లేకపోయెను. అచటికి కొంద ఱాంగ్లేయులుగూడ వచ్చిరి.

3౧ వ జులై రాకమునుపు కూలిపద్ధతి తీసివేయఁబడియె నని సరకారువారు చాటిరి. ౧౮౯౪ వ సాలున దీనిని తీసి వేయుఁ డని మొదట నేను దరఖాస్తు చేసితిని. సర్ డబ్ల్యు. డబ్ల్యు. హంటరుగారు 'సెమి-స్లేవరీ' యని పేరుకొన్న యీ కూలిపద్ధతి యెపుడో కూలిపోవు నని నే నాశించితిని. ౧౮౯౪ వ సాలున ప్రారంభమయిన యీ పనికి పలువురు సాయము చేసిరి గాని యీతూరి ఇది సఫలమగుటకు పలువుర సాయముతోపాటు సత్యాగ్రహముగూడ సమ్మిళితమయి యున్న దని చెప్పక తప్పదు.

ఆనాఁటి ప్రచారమును, దాన పాలుగొనినవారి పనులను తెలిసికొనఁ గోరువారు దక్షిణ-ఆఫ్రికా-సత్యాగ్రహేతిహాస మారయుదురుగాక!

౧౨

నీలిమందు డాగు

చంపారణ్యము జనకుని రాజ్యములోనిది. చంపారనులో మామిడితోఁటలవలెనే ౧౯౧౭ సాలువఱకు నీలిమందుతోఁటలుండెడివి. అచటి రైతు లిరువదిపాళ్లలో మూఁడుపాళ్ల నేలయందు కౌమందుకు నీలిమందు వేసితీరవలయు నని లా కలదు. దీని కచట 'తీన్ కఠియా' అని పేరు. ఇరువది కఠాలగుచో నొక ఎకరము. ఇందు మూఁడు కఠాలలో నీలిమందు వేసి తీరవలయును. ఈరీతిగా నిది 'తీన్ కఠియా' అని ప్రసిద్ధ మాయెను.

చంపారను వెళ్లకమునుపు నాకు దాని పేరే తెలియదు. నీలిమందచట పండింపఁబడునని అసలే తెలియదు. నేను నీలిమందు పొట్లములను జూచియుంటిని గాని నీలిమందు చంపారనులో తయారగు ననియు, నచట వేలకొలఁది రైతు లిడుములఁ గుడుచుచున్నా రనియు ఎఱుఁగను.

రాజకుమారశుక్ల యనునతఁడు చంపారనులో నొక రైతు. అతనికి చాలఁ గష్టములు సంభవించెను. తనవలెనే కష్టము లనుభవించుచున్న రైతు లందఱి కష్టములను పోఁగొట్టుట కతఁడు ప్రయత్నము చేసెను. కాన నీ నీలిమందువలన నంటిన డాగు కడిగివేయ నుత్సాహ మినుమడించెను.

నేను కాంగ్రెసుకు లక్నో వెళ్లినపు డితఁడు నన్ను పట్టుకొనెను. మా కడగండ్లన్నియు వకీలుబాబు మీకుఁ జెప్పఁగలఁడని యతఁడు నన్ను చంపారణ్యమున కాహ్వానించెను.

ఈ వకీలుబా బెవరో కారు; చంపారనులో నాకు ప్రియసహాచరుఁడును, బిహారునందు సేవాజీవనమున కాయువుపట్టును అగు

బ్రజకిశోరబాబు. రాజకుమార శుక్ల యితనిని నా గుడారములోనికిఁ దీసికొని వచ్చెను. ఇతఁడు నల్లని ఆల్పాకా చొక్కా లాగులు తొడుగుకొని యుండెను. ఇతఁడు నాదృష్టి నాకర్షింపలేదు. వీరు నిరుపేదలగు రైతుల డబ్బు కొల్లగొట్టు నొక వకీలుదొరగా రయి యుందు రని తలఁచితిని.

ఇతఁడు చంపారనునుగురించి కొలఁది మాటలు చెప్పఁగా విని, 'కనులారఁ జూడక నేను నా యభిప్రాయ మేమియును జెప్పఁజాలను; మీరు కాంగ్రెసునం దీ విషయమును ముచ్చటింపుఁడు; నేఁటికి నన్ను విడిచిపెట్టుఁ' డని నేను నా రివాజుచొప్పున బదులు చెప్పితిని. రాజకుమారశుక్ల కాంగ్రెసుసాహాయ్య మర్థించెను. బ్రజకిశోరబాబు చంపారనునుగురించి కాంగ్రెసులో మాట్లాడెను. వారి ప్రస్తావము సర్వజనాంగీకారమును బడసెను.

రాజకుమారశుక్లకు సంతోషము కలిగెనుగాని యింతటితోనే యంతయు సిద్ధించె నని యతఁడు తలపోయలేదు. 'స్వయముగా మీరు చంపారను వచ్చి యచటి రైతుల కడగండ్లు చూడవలయు' నని యతఁడు నన్నుఁ గోరెను. 'నేను నా సంచారములో నచటికి రాఁగలను, ఒకటి రెండు నాళ్లుండఁగల' నని నే నంటిని. 'మీ రొక్క నాఁ డుండినఁజాలును, కష్టము లన్నియు మీకుఁ దెలిసిపోవు' నని రాజకుమార శుక్ల యనెను.

లక్నోనుండి కాన్పూరు వెళ్లితిని. రాజకుమార శుక్ల అచట ప్రత్యక్షము. 'చంపారణ్య మిచటికి దాపు, ఒకదినము మాకు సెల వొసఁగుఁ' డని యతఁ డనియెను. 'ఈతూరి రాఁజాలనందులకు నన్ను క్షమింపుఁడు, ఇంకొకతూరి నేను తప్పక రాఁగల నని బాస యిచ్చుచున్నా' నని నన్ను నే బంధించుకొంటిని.

నే నాశ్రమమునకు మరలితిని. రాజకుమార శుక్ల నా వెనుక వెనుకనే హాజర్. 'ఏదో యొక తిథి నిర్ణయించి తెలుపుఁ' డని యతఁడు కోరెను. 'ఫలానా తేదీకి నేను కలకత్తా వెళ్లుదును, న న్నచటఁ గలిసికొని తీసికొనిపొం' డని నే నంటిని. ఎచటికి వెళ్లవలయునో, యేమి చేయవలయునో, యేమి చూడవలయునో నా కేమియుఁ దెలియదు. నేను కలకత్తాలో భూపేన్ వసుగారి యింటిలో కాలు పెట్టకముందే సర్వవ్యాపకుఁ డగు రాజకుమార శుక్ల యచట నా కొఱకు కనిపెట్టుకొనియుండెను. అనక్షరాస్యుఁడును, అకలుషితుఁడును, పట్టుదలగల యీ రయితు నన్నీరీతిగా లోఁగొనెను.

౧౯౧౭ వ సాలు మొదట కలకత్తానుండి మే మిరువురమును బయలుదేఱితిమి. మే మిరువురమును కూడుజోడుగను, రయితులముగను చూపట్టుచుంటిమి. నా కే రైలెక్కవలయునో తెలియదు. అతఁడు నన్ను బండికడకుఁ గొంపోయెను. మే మిరువురము నొక బండిలో నే కూరుచుంటిమి. ప్రొద్దున పాట్నాలో దిగితిమి.

పాట్నా నాకుఁ గ్రొత్త. బసచేయుటకు నా యెఱిఁగిన వారెవరును అచట లేరు. కల్ల కపట మెఱుఁగని రయితు గావున రాజకుమారశుక్లకు పాట్నాలో నే కొంచెమో పలుకుబడియుండకపో దని నేఁదలఁచితిని. రైలులో నితనిని గుఱించి కొంచెము నాకుఁ దెలియవాయెను. పాట్నా దిగిన తరువాత యితని సంగతి యంతయు తెలిసిపోయెను. అతఁడు శుద్ధ-అమాయికుఁడు. తనకు మిత్రులనుకొనిన వకీల్లి తనికి మిత్రులు కారు. పైఁగా రాజకుమారశుక్ల వారి కాశ్రితునివలెఁ దోఁచెను. ఇట్టి రయితు-క్లయంట్లకును, వకీళ్లకును వర్షర్తువునందలి గంగయంత యంతరము.

రాజకుమారశుక్ల నన్ను రాజేంద్రబాబుగారి యింటికిఁ గొంపోయెను. అతఁడు పూరికో, యింకొక యూరికో వెళ్ళెను. బంగళాలో నొక రిద్దఱు నవుకరులుండిరి. కొంచెము తినుబండము నాకడ నుండెను. నాకు ఖర్జూరము కావలసిరాఁగా పాప మా శుక్ల బజారు నుండి తెచ్చిపెట్టెను.

బిహారునందు అస్పృశ్యతను గూర్చి చాల పట్టుదల. నా జాతి యేదియో యచటి నవుకరులకుఁ దెలియదు. వారు నీరుతోడుచుండఁగా నేను నీరు తోడుకొనుటకు వీలులేదు. నా నీటిబొట్లు వారిమీఁదఁబడి నచో వారి కపవిత్రత యంటుకొనును. రాజకుమారశుక్ల లోపలి మఱుఁగుదొడ్డిలోనికి దారి చూపెనుగాని అచటి నవుకరులు బయటి మఱుఁగుదొడ్డిని వ్రేలితోఁ జూపిరి. ఇట్టి యనుభవములు నాకు వేనవే లాయెనుగాన వీరి చేఁతలకు నాకక్కజముగాని, రోష్టుగాని కలుగ లేదు. పాప మా నవుకరులు తమ విధిని చేసికొనుచుండిరి. మరియు రాజేంద్రబాబుగారి కది సమ్మత మని వారి యభిప్రాయము. విచిత్ర ములగు నిట్టి యనుభవములవలన రాజకుమారశుక్లయెడల నాకు సదు ద్దేశము పెంపొందెను. మరియు నతని విషయమంతయు చక్కఁగాఁ దెలిసెను. రాజకుమారశుక్ల నాకు మార్గదర్శకుఁడు కాఁజాలఁడని తెలిసికొని పాట్నానుండి లగాములు నా చేతిలోనే యుంచుకొంటిని.

౧౩

బిహారువారి మంచితనము

లండనములో మౌలానా మజహరుల్ హక్కుగారును, నేనును సమకాలికులము. మరల ౧౯౧౫ సాలున బొంబాయిలో కాంగ్రెసునందు కలిసికొంటిమి. అపుడు వారు ముస్లింలీగున కధ్యక్షులు. అపుడు వారు మా ప్రాంత చెలిమిని గుఱుతుచేసి 'పాట్నాకు వచ్చినపుడు మా యింటికి తాము దయచేయవలయు'నని నన్నాహ్వానించిరి. దీనిని నేనాధారముగాఁ గొని 'నేను వచ్చియున్నటు' లొకచీటిని వారికి వ్రాసి పంపితిని. నా వచ్చిన పనినిగూడ అందు దెలిపితిని. వారు వెంటనే మోటారుకారు వేసికొనివచ్చి నా కాతిథ్య మొసఁగిరి. ఇందులకు నేను వీరికి ధన్యవాదము లొసఁగి 'మేము చేరవలసిన తావునకు మొదటి రైలులో మమ్ము పంపవలసిన'దని కోరితిని. నావంటి సరిక్రొత్తవానికి రైల్వేగైడుతో పని నెట్టదు. వీరు రాజకుమారశుక్లతో మాటాడి సంగతిసందర్భములను దెలిసికొని 'మీరు ముందుగా ముఝప్ఫర్‌పూరు వెళ్లవలసియుండు' నని యనిరి. నాఁటి సాయంకాలమే ముఝప్ఫర్‌పూరున కొక రైలు పోవును. వీరు మమ్మా రైలులో పంపివైచిరి. అపుడచట ఆచార్య కృపలానీగా రుండిరి. నేను హైదరాబాదా వెళ్లిన నాఁటనుండియు వీరి నెఱుఁగుదును. వీరి త్యాగమును గూర్చియు, వీరి ప్రమితజీవనమునుగూర్చియు, వీరి ధనసాహాయ్యమున తాము నడిపించు నాశ్రమమును గూర్చియు డాక్టరు చోఇథరాముగారు చెప్పియుండిరి. వారు ముఝప్ఫర్‌పూరు నందలి గవర్నమెంటు కాలేజీలో ప్రొఫెసరుగా నుండిరి. నేను వెళ్లునప్పటికి ఆ పదవిని విసర్జించిరి. నేను వారికి తంతి యిచ్చితిని. రైలచటికి

నడిరేయిని జేరినను వీరు విద్యార్థిసంఘముతో వచ్చిరి. వీరి కచట నిల్లు వాకిలి లేదు. ప్రొఫెసరు మలకానీగారియింట వారి విడిది. వీరు నన్నుఁగూడ నా విడిదికే తీసికొనిపోయిరి. ఆ కాలములో గవర్నమెంటు ప్రొఫెసరొకఁడు నాబోటివానికి తనయింట నాతిథ్య మొసఁగుట చాల నసాధారణ మగు విషయము.

కృపాలినీగారు బీహారుదీనదశనుగూర్చియు, విశేషించి తిరహుత్ డివిజనుదీనదశనుగురించియు తెలిపి నే ననుకొనిన పని యెంత కఠిన మయినదియుఁ జెప్పిరి. వారికి బిహారువారితో గాఢపరిచయము కలదు. నావచ్చిన పనియంతయు కృపాలినీగారుబిహారువారికిఁ జెప్పియే యుంచిరి. ప్రొద్దున కొందఱు వకీళ్లు నాకడకు వచ్చిరి. వీరిలో రామనవమీప్రసాదుగారి పేరు నా కింతవఱకును గుర్తే. వారి పట్టుదలయే దీనికి కారణము.

వీ రిటు లనిరి: 'మీరు ఇచట నుందురేని, అనఁగా ప్రొఫెసర్ మలకానీగారి గృహములం దుందురేని, మీతలపెట్టిన పని సాగదు. మీరు మాలో నొకరియింట విడిది చేయువలయును. ఇచట గయాబాబు పేరుపడ్డ వకీలు. వారి యింట మీరు బసపెట్టుట మంచిది. నేను వారి తరఫున మి మ్మాహ్వానించుచున్నాను. మాకు సరకారువారనినచో చాల భయము. కాని మాకు చేతనయినంత సాయము మేము చేయఁగలము. రాజకుమారశుక్ల చెప్పిన మాటలు చాలవఱకు నిక్కవము. మా నాయకులు నేఁ డిట లేకుండుట దౌర్భాగ్యము. బ్రజకిశోరప్రసాదుగారికిని, రాజేంద్రప్రసాదుగారికిని తంతి యిచ్చితిని. వారు తప్పక రాఁగలరు. మీకుఁ గావలసిన యానుపానము లన్నియు వారు చెప్పుదురు. మీకు సాయము చేయుదురు. దయయుంచి తాము గయాబాబుగారి యింటికి రావలయును.'

ఈ మాటలకు నేను లబ్ధుఁడ నయితిని. నా విడిదివలన గయా బాబు స్థితి విషమ మగునేమోయని వగచితినిగాని గయాబాబే విషయ మున నన్ను నిశ్చింతుని గావించెను.

గయాబాబుగారి యిల్లు చేరితిని. వారును, వారి కుటుంబము నందలివా రందఱును నాపై ప్రేమ ప్రమ్మరించిరి.

వ్రజకిశోరబాబు దరభంగానుండియు, రాజేంద్రబాబు పూరీ నుండియు వచ్చిరి. వ్రజకిశోరప్రసాదు నేను లక్నోలోఁ జూచిన వ్రజకిశోరప్రసాదు కాఁడు. బిహారుల నమ్రత,నిరాడంబరత,యోగ్యత, అసాధారణమగు విశ్వాసమును ఇతనియందు చూచి నే నుప్పొంగి పోతిని. వ్రజకిశోరబాబునెడల వకీళ్లందఱకును గల గౌరవము చూడఁగా నా కానందాశ్చర్యములు కలిగెను.

నాఁటినుండియు నా కీ వకీలుమండలితో స్నేహము నెల కొనెను.

వ్రజకిశోరబాబు నా కచటఁ గల విషయము లన్నియుఁ దెలి పెను. అతఁడు పేదలపాలిటి వకీలు. పేదల కేసు లపుడు రెండుండెను. పేదల కే సేదియేని గెలిచినయెడలఁ దా నీ పేదల కేకొంచెమో యుప కరించినటు లతఁ డెంచుకొనును. కొన్నిమాఱులు ఇట్టివానియందును అసాఫల్య మొందవును. ఇట్టి బీదరయితులకడనుండి యితఁడు ఫీజు గైకొనుచుండెను. త్యాగశక్తి కలవారయ్యును వ్రజకిశోర రాజేంద్ర బాబులు ఫీజుగొనుటలో సంకోచము లేనివారే. 'ఫీజు పుచ్చుకొననిచో మా సంసార మెటులు నడచును? మరియు నీ పేదవారికి తగినంత సాయము మే మెటులు చేయఁగలము?' అని వీరి వాదము. వీరి ఫీజును, బంగాళ-బిహారు దేశముల బారిష్టరుల ఫీజును వినఁగా నా గుండె చెదరెను.

సలహా యిచ్చుటకు ఫలానావారు ౧౦,౦౦౦ రూపాయలు పుచ్చుకొని రని నాకుఁ దెలిసెను. ఏకేసులోను వాలు ౫౦ కెలకు తక్కువ వినలేదు.

ప్రేమపూర్వకమయిన వానిషేధము పహేతుక మని వారు గ్రహించిరి. నా మాటలకు వారు వెఱ అర్థము చెప్పలేదు.

ఈ కేసు లన్నియు నవగతము చేసికొని నే నిటు లంటిని: 'కోర్టుల కెక్కినందువలన నేమియు ప్రయోజనము లే దని నాకు తెల్ల మగుచున్నది. ఇట్టి కేసులకు కోర్టులలోఁ గలుగు మేలు కొలఁది. ప్రజ లింతగా విఱిగిపోయి భీతు లయి యున్నతటి కోర్టులు నిరుపయోగ ములు. లోకులకు భయము పోఁగొట్టుటయే సరియగు మందు. తీన్‌కఠి యా పోవునంతవఱకు మనము నిదురపోవరాదు. నేను రెణ్ణాళ్లను కొని వచ్చితిని. కాని విచారించి చూడఁగా నిది రెండేండ్లపని. అక్కఱ పట్టుచో రెండేండ్లుగూడ నేను పనిచేసెదను. నాకు చేయవలసిన పని తెలిసెను. కాని మీ సాయము వలయును.'

వ్రజకిశోరబాబు నిశ్చితమనస్కుఁ డని నేను గ్రహించితిని. ఇతఁడు శాంతితో నిటులు జవాబుచెప్పెను: 'మేము చేయఁగలంత సాయమును చేయుదుము గాని యెట్టి సాయము చేయవలయునో తెలుపుఁడు!'

మే మిటులు మాటలాడుకొనుచు నడిరేయివఱకును గూరు చుంటిమి. నే నిటు లంటిని: 'నాకు మీ వకాలతు సాయముతో అట్టే పని లేదు. వ్రాయసకాఁడును, దుబాసియు కావలయును. ఇందు జైలుకు వెళ్లవలయు నక్కఱగూడఁ గలుగవచ్చును. మీరును వెళ్లఁగలుగుదురేని నా కానందమే. కాని మీ కిష్టము లేనిచో నిఁక నేమాట లేదు. ఒక అనియతకాలమువఱకు మీరు వకాలతు మానివైచి

వ్రాయసకాండ్రుగా పనిచేయుటమాత్ర మంత తక్కువ పని కాదు. ఇచటి హిందీభాష తెలిసికొనుట నాకుఁ గడుఁ జిక్కుగా నున్నది. కైథీ, ఉరుదులలో వ్రాయఁబడిన కాకితములు నేఁ జదువజాలను. వీని యనువాదములకు మీమీఁద ఆశపెట్టుకొని యున్నాను. డబ్బిచ్చి యీ పని చేయించుట మన శక్తికి మించిన పని. ధనము పుచ్చుకొనకుండ సేవాభావముతో నీ పనియంతయు కావలయు నని కోరుచున్నాను.”

వ్రజకిశోరబాబున కిది యంతయు వెంటనే అవగతమాయెను. పిదప నతఁడును, అతని సహచరులును ఒకరితరువాత నొకరు నన్ను క్రాసు-పరీక్ష చేసిరి. నా మాటలకు ఫలితార్థముగా ‘సుమారు ఎంత కాలము మేము వకాలతు మానవలసియుండును? ఎంతమందిమి పని చేయవలసియుండును? కొలఁది కొలఁది మందిమి కొంత కొంత కాలము పనిచేసినచోఁ జాలునా?’ అని యీరీతిగా నన్ను ప్రశ్నించిరి. ‘మీరు మీ రెంతెంత త్యాగము చేయఁ గల’ రని వ్రజకిశోరబాబు వారివారి నడిగెను.

తుట్టతుదకు వారు తమ యభిప్రాయమును నా కిటులు తెలిపిరి: ‘మే మిందఱము మీరు చెప్పిన పనిని చేయ సంసిద్ధులము. మాలోఁ గొందఱము మీరు నియమించినంత కాలము మీకడఁ బనిచేయుదుము. చెఱసాలమాట మాకు సరిక్రొత్త. అయినను దాని ననుభవించుటకుఁ గూడ శక్తిని సంపాదింతుము.

అహింసాదేవి సాక్షాత్కారము

రైతులతో సంప్రతించుట నా యుద్దేశము. కామందులకును, రైతులకును నడుమ నున్న చిక్కు లెంత సత్యములో తెలిసికొనవలసి యుండెను. కావున వేలకొలఁది రైతులను జూడవలయును కాని వీరిని చూచుటకు ముందు కామందులను కలిసికొని వారు చెప్పు సంగతులను దెలిసికొనుటయు, కమిషనరును జూచుటయు నావశ్యకమని తోఁచెను. కామందులకును, కమిషనరునకును చీటి వ్రాసితిని.

ప్లాంటర్స్ అసోసియేషన్-సెక్రటరీని చూచితిని. అతఁ డిటులు చక్కఁగా చెప్పివేసెను: 'మీ రీ దేశమువారు కారు. మీరు మా సంగతులు కల్పించుకొనవలదు. మీ రేమయినను చెప్పఁదలఁచికొందురేని వ్రాసిపంపుఁడు.' నేను వివేకముతో నిటు లంటిని: 'నేను పరదేశి ననుకొనను. రైతులు కోరునెడల వారి స్థితిగతులు తెలిసికొనుటకు నాకు సంపూర్ణాధికారము కలదు'. పిదప కమిషనరును కలిసికొంటిని. అతఁడు నన్ను బెదరించి వెంటనే తిరహుత్ విడి పొమ్మని యుపదేశ మిచ్చెను.

నా సహచరులకు నే నీ సంగతు లన్నియుఁ దెలిపి 'సరకారు వారు' 'బహుశా' నన్ను సంప్రతింప నియ్యరు; నే ననుకొనినదాని కంటె ముందే జైలుయాత్ర పొసఁగవచ్చును. అట్టిది పొసఁగనేని మోతీహారిలోఁ గాని, లేక బేతియాలోఁగాని నన్ను పట్టుకొనినచోఁ జాల మేలు. కావున వీలయినంత వడిగా ఆ ప్రదేశములకుఁ బోవు టుచితము' అని చెప్పితిని.

౧౪ అహింసాదేవి సాక్షాత్కారము

చంపారను తిరహుత్ ప్రదేశమునం దొక జిల్లా. దానికి మోతీహారి ముఖ్యపట్టనము. బేతియాకు దగ్గఱ రాజకుమారు నూరు. మరియు దీని చుట్టుపట్టుల నున్న కోఠీరయితులు జిల్లాలోని కెల్ల దరిద్రులు. వారిని నేను తప్పక చూడవలయు నని రాజకుమారుని యుద్దేశము. నాకును జూడవలయునని యుండెను.

కావున సహచరులను దీసికొని నే నానాఁడే మోతీహారికి పయనించితిని. గోరఖుబాబుగారు మా కాశ్రయ మొసఁగిరి. వారి యిల్లొక సత్ర మయిపోయెను. మాయందఱ కా యిల్లు చాలలేదు. ఎటులో ఒకటులు మే మందఱ మచట నుంటిమి. మోతీహారికి అయిదు మైళ్ల దూరమున నొకరయితు అన్యాయముగా దండింపఁబడె ననియు నాఁడే మేము వింటిమి. మఱునాఁటి ప్రొద్దున ధరణీధరబాబుగారితో నే నచటికిఁ బోయి చూచిరావలయు నని నిశ్చయించితిని. అనుకొనినటులే మఱుసటినాఁటి ప్రొద్దున ఏనుఁగుమీఁద బయలుదేఱితిమి. గుజరాతులో బండిమీఁద ప్రయాణ మెట్టిదో చంపారణ్యమున ఏనుఁగుమీఁద ప్రయాణ మట్టిది. సగముదూరము వెళ్లకముందే పోలీసు సూపరింటెండెంటుగారి బంటొకఁడు వచ్చి 'తమకు సూపరింటెండెంటుగారు అభినందనములు చెప్పుమనిరి' అని పలికెను. నా కర్థమాయెను. ఆ ప్రదేశమునకు వెళ్లి చూచి రమ్మని ధరణీధరబాబునకు చెప్పి జమాను తీసుకొనివచ్చిన బాడుగ బండిమీఁద నేను వెనుకకు మరలితిని. అతఁడు 'చంపారను విడిచి పొమ్ము' అను నోటీసొకటి నా కందిచ్చెను. నన్ను ఇంటికడ దిగవిడచి దానిమీఁద చేవ్రాలు పెట్టుమనెను. 'ఇచటి సంగతులఁ దెలిసికొనక చంపారనును విడిచి వెళ్లి పోను' అని నేను వ్రాసియిచ్చితిని. 'ఈ యాజ్ఞ నుల్లంఘించినందులకు రేపు విచారణ జరుగఁ గల' దని నాకు సమను వచ్చెను.

ఆ రేయి నేను జాగరణ మొనరించి వ్రాయవలసిన యుత్తరము లన్నియు వ్రాసితిని. చెప్పవలసిన విషయము లన్నియు వ్రజకిశోర బాబుకు చెప్పితిని.

నాకు సమను వచ్చినటులు నలు దెస లల్లుకొనిపోయెను. మోతీహారిలో నిట్టి వింత లెన్నఁడును జరిగియుండలేదని యెల్ల రనుకొనిరి. గోరఖబాబుగారి యిల్లును, కచేరియు మనుజులతో నిండిపోయెను. రాత్రియెల్లయు చేయవలసిన పనిని చేసికొనియుంటినిగాన ఈ జన సమూహమును సంబాళించుకొనఁ గలిగితిని. నా సహచరుల విలువ నాకపుడు తెలిసెను. నే నెచటి కేఁగిన నచట నా చుట్టును జనము. నా సహచరులు వీరిని నియమప్రకార మునుపఁగలిగిరి. కలెక్టరు మేజిస్ట్రేటు సూపరింటెండెంటులకును, నాకును నొకమాదిరి మైత్రి సమకూరెను. నామీఁద అమలుజరుపఁబడిన నోటీసు వగైరాలను లా ప్రకారము నేను విరోధింపవచ్చును గాని నే నటులు చేయుటకు బదులు వారి నోటీసులమీద దస్కతు చేసి పుచ్చుకొంటిని గాన నేను వ్యక్తితిరస్కారము చేయులే దనియు, వారి హుకుములకు మాత్రమే సవినయముగ తిరస్కారము చేసితిననియు వారు గ్రహించిరి. దీన వీరి కొక ప్రకారముగా భయము పోయెను. వీరు న న్నేమియు నిబ్బంది పఱుపలేదు. ఇంతియకాక, లోకసమూహమును నియమముగా నుంచుటలో నా సాయమును, నా సహచరుల సాయమును సంతోష పూర్వకముగా నుపయోగపఱిచికొనిరి. కాని తమ యధికారము నాఁడే లోపించె నని వారు కనులారఁ గనుఁగొనిరి. లోకుల కాక్షణమున దండభయము పోయెను. వారీ క్రొత్త స్నేహితుని యధికారమునకు లోఁగిరి.

చంపారణ్యమునందు నన్నెవరు నెఱుఁగ రని గుర్తుంచుకొనవలయును. అచటి రయితు లందఱును పామరులు. చంపారణ్యము

గంగకు ఉత్తరపు తల. హిమాలయప్రత్యంతపర్వతముమీఁద దాని యునికి. దానికి నేపాళము బాసట. ఇది యిటు లొక క్రొత్త ప్రపంచము. ఇందు కాంగ్రెసుమాట చొఱలేదు. ఇందు కాంగ్రెసు సభ్యు లెవరును లేరు. కాంగ్రెసు పే రెఱింగినవా రున్నను వారికి 'కాంగ్రెసు' అని పలుకను, కాంగ్రెసులోఁ జేరను భయము. నేఁ డచట కాంగ్రెసుపేరితో గాక కాంగ్రెసు, కాంగ్రెసు-సభ్యులును ప్రవేశించిరి. కాంగ్రెసు అభయహస్త మొసఁగెను.

నా సహచరులతో నాలోచించి 'ఇచట కాంగ్రెసుపేర నేమియు జరుపరా' దని నిశ్చయించితిని. పని కావలయును గాని పేరితో నేమి పని! కూఁతలు వలదు; చేఁతలు వలయు. ఆ ప్రాంతమునందు వకీళ్ల వాగ్యుద్ధమే కాంగ్రెసని యర్థము; డొంక తిరుగుడుగార్లను సమర్థించుటయే కాంగ్రెసని యర్థము. మరియు కాంగ్రె సనఁగా బాంబు, రాజద్రోహము, మోసము. ఇట్టి యూహ సరకారుకును, సరకారువారి నీలికామందులకును గలదు. కాంగ్రె సిట్టిది కాదని మే మీ యిరువురకును తెలుపవలయును. కావున కాంగ్రెసుపేరు స్మరింపరాదనియు, లోకులకు కాంగ్రెసుయొక్క భౌతికదేహమును గుఱించి కూడ తెలుపరా దనియు నిశ్చయించితిమి. కాంగ్రెసుపేరు—వట్టి యక్షరములు—తెలియకున్న నేమి! దానియాత్మ నెఱిఁగి దాని ననుసరించినఁ జాలును. కావలసిన పని యిది.

కావున ముందుగా భూమికను తయారుచేయుటకు కాంగ్రెసు తరపున చాటుగాఁగాని నీటుగాఁ గాని, మనుష్యు లెవరును అచటికిఁ బంపఁబడలేదు. వేలకొలఁది ప్రజను రాజకుమారశుక్ల సమర్థించుకొనఁ జాలఁడు. రాజకీయపు పని యిసుమంతయు నచట ప్రచారము చేయఁబడియుండలేదు. వారు చంపారణ్యమాతక్క బహిఃప్రపంచ మెఱుఁ

గరు. ఇటులయినను వారు నన్ను పురాణమిత్రునివలె గారవించిరి. కావున ఇట్టి యీ మహాజనసమ్మేళమునందు నే నీశ్వరసాక్షాత్కారము, అహింసాసాక్షాత్కారము, సత్యసాక్షాత్కారము చేసియుంటి ననుచో నిసుమంతయు నతిశయోక్తి కాదు. ఇందు ప్రతియక్కరము నిక్కము. ఇట్టి సాక్షాత్కారమునకు లోకులయెడ నాకుఁగల ప్రేమ వినా మరొక కారణము లేదు. ఈ ప్రేమయు అహింసయెడల నచల మగు నా విశ్వాసమే కాని వేఱు కాదు.

చంపారణ్యమునం దా దినము నా జన్మములో మరవరానిది. నాకును, అచటిప్రజకును ఆనాఁడు పండుగు.

లా ననుసరించి నేనే విచారింపఁబడవలసినవాఁడను గాని నిక్కమునకు సర్కారే విచారింపఁబడెను. కమిషనర్ నాకు పన్నిన బోనులో సర్కారునే త్రోసెను.

౧౫

కేసు తీసివేసికొనుట

విచారణ మారంభ మాయెను. సర్కారు-వకీలు, మేజిస్ట్రేటు మొదలగు నాఫీసరులు బెదరిపోయిరి. ఏమి చేయవలయునో వారికిఁ దోఁచలేదు. కేసును వాయిదా వేయుమని సర్కారు- ప్లీడరు మేజిస్ట్రేటుకు నొక్కి చెప్పుచుండెను. కాని నే నడ్డుజొచ్చి వాయిదా వేయవలదనియు, చంపారణ్యమును విడిచి వెళ్లవలసిన దను మీ నోటీసును నే ననాదరించి యపరాధము నొప్పుకొనుచుంటి ననియు తెలిపి చిన్న వాఙ్మూల మిచ్చితిని.

‘క్రిమినల్ ప్రొసీజరు కోడ్డు ౧౪౪ సెక్షన్ ప్రకారము మీరు నా మీఁద జారీచేయించిన నోటీసునెడల పైకిమాత్ర మవిధేయతవలె కానిపించు గంభీరమగు నీ యనాదరము నే నేల కావించితినో కోర్టువారి సెలవు తీసికొని రుజువుచేసికొనఁ దలఁచుచున్నాను. ఇది నా యుద్దేశమున ననాదరము కాదు. స్థానికపరిపాలనమునకును, నాకును గలిగిన మతభేద మని నా మనవి. నే నీ ప్రదేశమునకు జనసేవ చేయుటకును, దేశసేవ చేయుటకును వచ్చియుంటిని. నీలిమందు కామందులు రైతులకు న్యాయము చేయుట లేదని విని రైతులు తమకు సాయము చేయవలసినదని కోరఁగా నే నిటకు వచ్చితిని. ఈ విషయమంతయు సంపూర్ణముగా కనుఁగొనకుండ సాయ మెటులు చేయఁగలను? కావున ఈ విషయమును సంపూర్ణముగా తెలిసికొనుటకు వీలయినచో సరకారువారి సాయమును, నీలికామందుల సాయమునుగూడఁ బడయఁదలఁచితిని. నే నిచటికి వచ్చుటకు కొండొక యుద్దేశము లేదు. నే నిచటికి వచ్చినందుల శాంతిభంగముగాని, ప్రాణాపాయముగాని కలుగునని నమ్మఁజాలను. ఇట్టి విషయములలో నాకు చాల ననుభవము కలదు. కాని సరకారువా రన్యథా తలఁచిరి. వారి కష్టము నే నెఱుఁగుదును. వారలు చెప్పిన మాటలను వారు విశ్వసింపవలసియుందురని నాకు తెలియును. మీకు

నామీఁద జారీ చేయించిన ఆజ్ఞకు న్యాయబద్ధుని చందమున నేనును బద్ధుఁడను కావలయును. మరియు నాయుద్దేశముగూడ నట్టిదియే. కాని నే నిటుల చేసినచో నే నేపనిమీఁద నెవరికొఱకు వచ్చితినో వారియెడల నా కర్తవ్యము నతిక్రమించినవాఁడ నగుదును. నేను వారిలో నుండనిచో వారి కుపకరింపఁజాల ననుకొనుచున్నాను. కాన నాయంతట నేను చంపారనును విడిచిపెట్టి పోవఁజాలను. ఇట్టి ధర్మసంకటమున చంపారణ్యమునుండి నన్ను తొలఁగించు భారమును సరకారువారిమీఁద పెట్టక తప్పకపోయెను. భారత దేశమునందలి సార్వజనికజీవనమున నా పదవివంటి పదవిలో నున్నవారు ప్రముఖమగు కార్యముపట్లఁ గడు జాగరూకత వహింపవలసి యుండునని నేను లెస్సగా నెఱుఁగుదును. ఈ క్లిష్టపరిపాలనమందు స్వాభిమానము కలవానికి నాకు పట్టిన స్థితిగతులే పట్టినచో నతఁడును, నే నేది చేయ నిశ్చయించితినో అదియే—అనఁగా నాజ్ఞ నుల్లంఘించి మాటాడకుండ దండము ననుభవించుటయే చేయవలయును.

నాకు వేయఁబడు శిక్ష తక్కువగా నుండవలయు నను నుద్దేశముతో నే నీ వాఙ్మూలము నీయఁ దలఁపలేదు. న్యాయము గల పరిపాలకులయెడ గౌరవలోపముచే నామీఁద జారీ చేయఁబడిన యాజ్ఞను నే నుల్లంఘింపలేదు. కాని యింతకంటె దొడ్డయాజ్ఞ యొకటి కలదు—అది అంతరాత్మ యాజ్ఞ. దాని ననుసరించుటయే నా యుద్దేశమని మనవిచేసికొనుచున్నాను.'

'నే నిటులు వాఙ్మూల మిచ్చిన పిదప విచారణ నాఁపవలసిన పని యేమున్నది? కాని మేజిస్ట్రీటుగాని, సర్కారువకీలుగాని యిది యిటులు పరిణమించు నని తలపోయలేదు. కావున తీర్పు చెప్పుటకు మేజిస్ట్రీటు వాయిదా వేసెను. నే నీలోపుగా నీ సంగతియంతయు వైసరాయికిని, పాట్నాలోని స్నేహితులకును, పండిత మదనమోహనమాలవ్యులకును, తదితరులకును తంతియిచ్చితిని. నేను శిక్ష బడయుటకు కోర్టుకు వెళ్లకముందే 'యీ కేసును ఎత్తివేసికొన వలసిన దని లెఫ్టి

సెంటు గవర్నరు తనకు తంతి నిచ్చెననియు, నీవిషయమును మీరిఁక విచారించుకొనవచ్చుననియు, ఆఫీసరులు మీకు కావలసిన సాయము చేయఁగల రనియు కలెక్టరు నాకు చీటి వ్రాసెను. ఇట్టి మే లింతలో కలుగు నని మే మనుకొనలేదు.

నేను కలెక్టరు హైకాకుగారిని సందర్శించితిని. అతఁడు న్యాయతత్పరుఁడయిన యోగ్యుఁడని నాకు తోఁచెను. 'మీకుఁ గావలసిన కాకితముల నన్నిఁటిని మీరు చూచికొనవచ్చును. న న్నెపుడు చూడఁదలఁచుకొనిన నపుడు చూడవచ్చు' నని యతఁ డనెను.

భారతదేశమున కిది సత్యాగ్రహప్రథమపాఠము; లేక సవినయ మగు రాజకీయాజ్ఞోల్లంఘనమున ప్రథమపాఠము. పత్రికలలో నీ విషయము చాల చర్చింపఁబడెను. చంపారణ్యమును గుఱించియు, నా విచారణనుగుఱించియు మితి లేని వ్యాప్తి కలిగెను.

నా విచారణయెడల గవర్నమెంటువారు నిష్పక్షపాతు లయి యుండవలయును. దీనిని పత్రికలలో చర్చింపవలసినంత పనిలేదు. మరియు పత్రికలకు వార్తలు పంపువారితో పనిలేదు. ఇంతియకాక దీనినిగుఱించి అతిశయమయిన టీకలును, పెద్దపెద్ద రిపోర్టులును చేసినచో నష్టముకూడఁ గలుగు నను భయము కలదు. కావున 'తాము తమ సంవాదదాతలను ఖర్చుపెట్టి యిచటికిఁ బంపవల' దని ముఖ్య పత్రికల సంపాదకులకు నే నుత్తరములు వ్రాసితిని. మరియు ప్రకటింపఁదగిన విషయము లున్నయెడల నేను వ్రాయుదు ననియు వారికిఁ దెలిపితిని.

సర్కారువారికి నాయెడఁ గలిగిన సద్భావమునకు నీలిమందు కామందు లసంతుష్టు లయిరి. పొక్కలేదు గాని ఆఫీసరులకును ఇది యిష్టముకాదు.

సత్యాసత్యములతోఁ గూడిన పత్రికావార్తలు వారి కోపమును రగులుకొలుపవచ్చును. దానిఫలము నేననుభవించుటకు బదులు భయభ్రాంతులగు రైతు లనుభవింపవలసివత్తురు. మఱియు నిందలి సత్యమును గనుఁగొనుటకు నాకు విఘ్న మేర్పడును. నే నింత జాగ్రత్తగా నున్నను నీలిమందు కామందులు నన్ను గుఱించి విషముగా బ్రచారముచేయఁ దొడఁగిరి. నన్ను గుఱించియు, నా సహచరుల గుఱించియు పత్రికలలో కల్లమాటలు వెలువడియెను గాని నే నతిజాగరూకతఁ గొనినందువలనను, కడుఁ జిన్న విషయములందుఁగూడ నేను సత్యము నంటిపెట్టుకొని యుండుటవలనను వారి ప్రయత్నము లన్నియు విఫలము లాయెను.

నీలిమందు కామందులు బ్రజకిశోరబాబును నిందించుటలో నే మాటనుగూడఁ దాఁచికొనలేదు. కాని వారు నిందించినకొలఁదియు బ్రజకిశోరబాబు ప్రతిష్ఠ వృద్ధిఁ బొందెను.

ఇట్టి చిక్కులో రిపోర్టరుల నచటికి రమ్మని నేను ఉత్సాహము కలిగింపలేను. నాయకులకుఁగూడ రమ్మని వార్త పంపలేను. 'అక్కఱ కలిగినపుడు తెలిపినచో వత్తు' నని మదనమోహన మాలవ్యాలు ఉత్తరము వ్రాసిరి. కాని నేను వీరి కిట్టి కష్టము కలిగింపలేదు. నే నీ రీతిగా నీ యాందోళనమునకు రాజనీతిస్వరూపము కలుగకుండఁ దప్పించితిని. అప్పుడప్పుడచటి వార్తలు ముఖ్యములయిన పత్రికలకుఁ బంపితిని. అవి వారికిఁ దెలియుటకే కాని ప్రకటింపఁబడుటకుఁ గాదు. తుదకు రాజనీతిలో పరిసమాప్తమయినను రాజనీతికి సంబంధింపని విషయమున కొక రాజనీతిస్వరూపమును గల్పించినచో నది పాడగు ననియు, ఉన్నదాని నున్నపాళముగా నుంచినయెడల నది దానికి దోహదమగు ననియు నాకు పుష్కలముగ ననుభవము కలదు.

శుద్ధమగు లోకసేవయందు ప్రత్యక్షముగాఁ గాకున్నను పరోక్షముగా రాజనీతి వచ్చి దొరలు నను మాట చంపారణ్యసంగ్రామము సిద్ధము చేసిపెట్టెను.

౧౬

కార్యపద్ధతి

చంపారణ్యవిచారణమును సంపూర్ణముగా వ్రాయుట యనఁగా చంపారణ్యపు రైతుల చరిత్రమును వ్రాయుటయే. ఆ చరిత్ర మంతయు నీ ప్రకరణములలో వ్రాయ శక్యముగాదు. చంపారణ్యవిచారణ మనఁగా నహింసాసత్యముల మహాప్రయోగము. దీనికి సంబంధించిన విషయములలో మంచి వని నాకుఁ దోఁచినవానిని మాత్ర మేటి యుదాహరించుచున్నాను. దీని నంతయుఁ దెలిసికొనఁగోరు వారు రాజేంద్రప్రసాదులు హిందీభాషలో వ్రాసిన 'చంపారన్ మేఁ మహాత్మాగాంధీ' యను పుస్తకమును చదువవలయును.*

ప్రకృత మనుసరింతము. గోరఖబాబుగారి యింటనే యీ విచారణ జరుపుచో వారి యింటిని కాళీచేయ మనవలసివచ్చును. మాకొఱకొక యిల్లద్దెకుఁ బుచ్చుకొను ధైర్యము మోతీహారిలోని జనుల కింకను గలుగలేదు. కాని చతురుఁడగు వ్రజకిశోరబాబొక యిల్లెటులో దొరకించుకొనెను. ఇంటిముందు చాల స్థలము కలదు. మే మా యింటఁ బ్రవేశించితిమి.

ధనము లేక పని సాగదుగదా! ఇట్టి పనుల కింతవఱకును ప్రజాసామాన్యముకడ ద్రవ్యభిక్ష గొనుట యలవాటులో లేదు. వ్రజకిశోరబాబుగారి సమాజము ముఖ్యముగా వకీలుసమాజము. అక్కఱ కలిగినయెడల వీరే చందాలు వేసికొనెడివారు; లేక మిత్రులచేత చందాలు వేయించెడివారు. 'ధనమునకు లోటు లేని మేము జన

---

*యస్. గణేశన్. ట్రిప్లికేన్. మద్రాసులో దీని కాంగ్లానువాదము ముద్రితము.

సామాన్యము నెటులు యాచింపఁగలము?' అని వారి యభిప్రాయము. ఇది వాదమునకు బాగుగనే యున్నది. చంపారను రయితులకడనుండి యొక పైస యేని వసూలు చేయఁగూడ దని నా నిశ్చయము. ఇటులు చేయుచో దీనికి విపరీతార్థము ప్రసక్తించును. మరియు నే నీ విచారణ నిమిత్తము హిందూదేశమునం దంతటను చందాలు వేయింపఁ దలఁప లేదు. ఇటులు చేయుచో దీనికి రాష్ట్రీయత్వమును, రాజనీతిస్వరూపమును సంఘటించును. బొంబాయి మిత్రులు ౧౫,౦౦౦ రూకలు పంపుద మనిరి కాని నేను వందనపూర్వకముగా వల దంటిని. చంపారణ్యమున కావల నున్న ధనికులగు బిహారువారికడ వ్రజకిశోరబాబుచే వీలయినంత ధనము పోగుచేయింప నెంచితిని. చాలనిచో నాకు మిత్రులగు ప్రాణజీవనదాస మెహతాగారి నుపసర్పింపఁ దలఁచితిని. 'కావలయునది నాకడఁ దీసికొనుఁ' డని మెహతాగారు వ్రాసిరి. ఈరీతిగా మాకు ద్రవ్యచింత మానెను. చంపారణ్యములోని పేద జీవి కనుకూలముగా మేము తక్కువలో తక్కువ వ్యయము చేయఁ దలఁచితిమి. కావున ధన మెక్కువ కూడఁబెట్టఁ దలఁపలేదు. చాల ధన మక్కఱ లేదని తుదకు మాకుఁ దెలిసిపోయెను. వెరసి రెండు మూఁడు వేలకంటె నెక్కువ వ్యయము కాలే దని నా యూహ. మరియు మేము పోగుచేసినదానిలో ఏ నూఱో, వేయో మిగిలినటుల గుఱుతు.

మొదటమొదట నా సహచరుల పద్ధతి విచిత్రముగా నుండెను. నా కది చాల వినోదపాత్ర మాయెను. ఒకొక్క వకీలు కొక్కొక్క వంటవాఁడు; ఒకొక్క పాకశాల. భోజనమా నడిరేయిని. ఎవరి ఖర్చులు వారివే యయినను వారి యనియమము నా కొక యుపద్రవముగా నుండెను. వారికిని, నాకును చాల నెయ్య మలవడెను గాన

దురర్థము చేసికొనక నా శబ్దబాణములను వారు ప్రేమతో చవి చూచిరి. నవుకరులను తీసివేయవలయు ననియు, ఏకవంట చేయవలయు ననియు, భోజననియమ మనుష్ఠింపవలయు ననియు తుద కందఱు నంగీకరించిరి. వీరిలోఁ గొందఱు మాంసాహారులు. రెండు వంటకములు వ్యయకరములు. కావున మాంసవర్జనము చేయఁబడెను. శాకాహారము గూడ ఎక్కుతొక్కు కాకుండఁ జేయఁబడెను. దీనితో వ్యయము తగ్గెను. మాకు పనిచేయు సామర్థ్య మెక్కువాయెను. కాలమును కలిసివచ్చెను. ఈ రెండును మా కపు డావశ్యకములు.

వాఙ్మూలము లొసంగుటకు రయితులు గుంపులు గుంపులుగా వచ్చిరి. ఆ రయితులకు పలువురు సహచరులు. వీ రందఱితో మా వాకిలియు తోఁటయు నిండిపోయెను. దర్శనాభిలాషులనుండి నా సహచరులు నన్ను చాల రక్షింపఁ బూనుకొనిరి గాని యాపని వారిచేతఁ గాలేదు. ఒక నియతసమయమున నే నందఱకును గానిపింప వలసి వచ్చెను. అయిదుగురు మొదలుకొని, యేడుగురివఱకును వాఙ్మూలములు వ్రాసికొనుచున్నను తెమలక కొందఱు రయితులు ప్రొద్దుగ్రుంకిన పిదప యూరక వెళ్లవలసివచ్చెడివారు. నిక్కమున కిన్ని వాఙ్మూలములతో పనిలేదు. ఏలన నివి చాలవరకు పునరుక్తములే. కాని వాఙ్మూల మీయనిచో వారికి తృప్తి లేదు. ఇచ్చినచో సంతోషము కలిగెడిది. వారి యీ యుద్దేశమునకు నేను సంతోషించితిని.

వాఙ్మూలములు వ్రాసికొనువారికి కొన్ని నియమములు కలవు. వ్రాయసకాఁడు ప్రతిరైతును క్రాసుపరీక్ష చేయవలయును. దీనికి తాళనివాని సాక్ష్యము గైకొనరాదు. దీనికి చాల సమయము పట్టినను ఇటులఁ జేయుటవలన చాల వాఙ్మూలములు తిరుగులేనివాయెను.

ఈ వాఙ్మూలములు వ్రాసికొనునపుడెల్ల నొక సి. ఐ. డి. ఆఫీసరుండెడివాఁడు. మేము సి. ఐ. డి. వారిని బాధింపఁ జేయఁగలము. కాని వీరిని బాధింపమనియు, వీరితో సౌజన్యము నెఱపుదమనియు, వీరికిఁ గావలసిన విషయము చెప్పుదమనియు మొట్టమొదటనే నిశ్చయించుకొంటిమి. వాఙ్మూలములు వ్రాసికొనునపుడు వీరు దగ్గఱనుండి చూచుచుండెడివారు, వినుచుండెడివారు. ఈ రీతులు చేయుట వలన లోకులకు భయము పోయెను. మరియు వీరియెదుట వాఙ్మూలము లిచ్చుటలో అత్యుక్తి తగ్గెడిది. కల్లలాడుచో పోలీసువారు కోర్టులోఁ బెట్టుదురను భయముతో రైతులు జాగ్రత్తగా నుండవలసివచ్చెడిది.

నే నీ సమయమందు కామందులకు రోష్టు కలిగింప నెంచక సౌజన్యముచే వారిని లోఁగొనఁ దలఁచితిని. ప్రియాదు లెవరిమీఁద నెక్కువ పడినవో వారికి చీటి వ్రాయుటయు, వారిని గలిసికొని మాటాడుటయు నొక పనిగా పెట్టుకొంటిని. ప్లాంటర్స్ అసోసియేషన్ వారిని కలిసికొని రైతుల కష్టనష్టములను వారి కెఱుకపఱచి వారి యుద్దేశమును గయికొంటిని. వీరిలోఁ గొందఱు నన్నుఁ దిరస్కరించిరి; కొందఱు ఔదాసీన్యమును వహించిరి; మఱికొందఱు సౌజన్యము చూపిరి.

౧౭

సహచరులు

బ్రజకిశోరబాబు రాజేంద్రబాబులు జోడు. ఈ జోడునకు మఱి జోడు లేదు. వీరు నన్ను తమ ప్రేమచే ముందరి కొక యడుగేని వేయలేనంత కుంటివానిఁ జేసి వయిచిరి. వీరికి శిష్యు లనుకొనుఁడు, లేక సహచరు లనుకొనుఁడు—శంభుబాబు, అనుగ్రహ బాబు, ధరణీబాబు, రామనవమిబాబు, మరియు నింక కొందఱు వకీళ్లెల్లప్పుడును వీరిని బరివేష్టించియుండిరి. అపు డపుడు వింధ్యాబాబు, జనకధారీబాబుగారలుగూడ వచ్చి సాయపడుచుండెడివారు. వీ రందఱు బిహారువారు. రైతుల వాఙ్మూలములు వ్రాసికొనుట వీరి ముఖ్యకార్యము.

ప్రొఫెసరు కృపలానీగారు మాకు తోడుపడకుండ నూరక కూరుచుండఁగలరా! అతఁడు సింధుదేశమువాఁ డయినను బిహారు దేశమువారికన్న నెక్కువ బిహారువాఁడాయెను. లోకమునందు కొందఱు దేశసేవకులు విచిత్రులు కలరు. వా రే దేశమున కేఁగిన నా దేశమునందు కలిసిపోవుదురు. వారిని పరదేశు లని యెవరును కనిపట్టఁ జాలరు. అట్టివారిలో కృపలానీగా రొకరు. ఇతఁడు నా ప్రధాన ద్వారపాలకుఁడు. ఆ సమయమున నతఁడు దర్శనార్థులనుండి నన్ను బ్రతికించుచో తన జీవితము సార్థక మనుకొనెను. కొందఱను నవ్వించియు, కొందఱను హింసచేయకుండ బెదరించియు నాకడకు రాకుండఁ బంపివయిచుచుండెను. చీకటిపడఁగనే యధ్యాపకత్వము వహించుచుండువాఁడు. నవ్వించి సహచరుల పొట్టలు వక్కలు కావించువాఁడు. పిఱికివాఁ డెవఁడేని వచ్చినయెడల శూరునిగా మార్చెడివాఁడు.

మౌలానా మజహరుల్ హక్కు గారు సహాయకకోటిలో నుండుటకు తమ హక్కును వ్రాయించి యిచ్చి నెల కొకటి రెండు మాఱులు వచ్చి చూచి పోవుచుండిరి. నాఁటి సాడంబర మగు వారి జీవితమునకును, నేఁటి నిరాడంబర మగు వారి జీవితమునకును రాజునకును, బంటునకును గల భేదము కలదు. వారి దొరవేషము బిహారు వారికి వింతగా నున్నను వారి హృదయము మాలోఁ గలిసిపోయి వారు మాలో నొక రయిపోయిరి.

నా కాయాయీ ప్రదేశములం దనుభవ మెక్కు డయిన కొలఁది చంపారణ్యమున సరి యయిన పని చేయవలసి యుండుచో గ్రామములందు బడులు పెట్టక తప్ప దని తోఁచెను. రైతుల యజ్ఞానము, రామ రామ! చెప్పఁ దరము కాదు. వారు తమ బాలుర నూరక తిరుగనిత్తురు. లేదా, దుగ్గానికూలికి ప్రొద్దున మొదలుకొని చీకటిపడువఱకును నీలితోఁటలలోనికిఁ బంపుదురు. ఆనాళ్లలో మగవానికి కూలి పదికానులకంటె మించదు. ఆఁడువారి కాఱు, పసివారికి మూడు. కర్మము చాల కెవనికేని నాలు గణాలు కూలి గిట్టుచో వాఁడు మహాభాగ్యవంతుఁడు.

నా సహచరులతో నాలోచించి మొదట ఆఱు గ్రామములలో బాలురకు బళ్లు పెట్ట నిశ్చయించితిని. పంతుళ్లకు భోజనము, నివాసము మీరు ఏర్పాటు చేయుచో మిగిలినవానిని మేము చూచుకొందు మని గ్రామస్థులకుఁ జెప్పితిమి. పాపము వారి చేతిలో డ బ్బుండదు. కాన వారు ధాన్యము కొలఁతు మనిరి.

పంతుళ్ల నెచటనుండి పిలిపించుట యనునది చాల నాలోచింపఁదగిన విషయ మాయెను. బిహారులో జీతము తీసికొనక గాని, కొద్ది జీతము తీసికొని గాని మంచి పంతుళ్లు దొరకుట కష్టము. పిల్ల

లను మామూలు పంతుళ్లపాలు చేయుట నా కిష్టము కాదు. వారికి అక్షరజ్ఞాన మల్పముగఁ గలిగినను చరిత్రబలము చాలఁ గావలయును.

ఇందులకు స్వయంసేవకులు కావలయునని విన్నపము ప్రకటించితిని. దీనికి జబాబుగా గంగాధరరావు దేశపాండే గారు బాబా సాహేబ్ సోమణ్ గారిని, పుండలీకుగారిని పంపిరి. బొంబాయి నుండి అవంతికాబాయి గోఖలే గారు వచ్చిరి. దక్షిణమునుండి (పూనా) ఆనందీబాయిగారు వచ్చిరి. నే నాశ్రమమునుండి ఛోటే లాలును, సురేంద్రనాథుని, నా కుమారుఁడు దేవదాసును ఓలిపించితిని. ఇంతలో మహాదేవ దేశాయియు, వారి భార్య దుర్గాబహేనును, నరహరి పరేఖుగారును, వారి భార్య మణిబహేనును వచ్చిరి. కస్తూరబాయినిగూడఁ బిలిపించితిని. ఇటు లాచార్యులు ఆచార్యాణులును ఆచార్యులును పోగయిరి. శ్రీ అవంతికాబాయియు, ఆనందీబాయియు విద్యావతులే కాని శ్రీ దుర్గాదేశాయికిని, మణిబహేను పరేఖు గారికిని గుజరాతీలో గల జ్ఞానము కొలఁది. కస్తూరబాయి కదియు లేదు. ఈ స్త్రీలు హిందీబాలకుల కెటులుం జెప్పఁగలరు?

బాలురకు వ్యాకరణము, గోకరణము చెప్పవలసిన పని లేదు. వారికిఁ జెప్పవలసినది రీతి నీతి. వ్రాఁత కూఁతలకంటె శుచిశుభ్రతలం నేర్పవలయు నని నే నీ యాఁడువారికిఁ దెలిపితిని. హిందీ, గుజరాతీ, మరాఠీ-అక్షరములలో నత్యంత భేదము లేదనియు, మొదట అక్షరములు, అంకెలు నేర్పుట అంత చిక్కయిన పని గా దనియుఁ దెలిపితిని. దీనికి ఫలముగా నీస్త్రీలు చక్కగా బోధింపఁ గలిగిరి. దీన వీరి కాత్మవిశ్వాసము వృద్ధిచెందెను. వీరికి తమ పనియెడల నాసక్తి గూడఁ గలిగెను. అవంతికాబాయిబడి మేలుబడి యాయెను. ఆమె యిందులకు తన ప్రాణములను ధారపోసెను. ఆమె యీపనికి పెట్టినది

పేరు. మే మీ యాఁడువారివలన గ్రామములలోఁ బ్రవేశము కలిగించుకొనఁ గలిగితిమి.

నేను బడులు పెట్టుటతో నాఁగలేదు. గ్రామములందు మురికికి మేరలేదు. సందుగొందులలో చెత్తచెదారములు. నూతుల చుట్టును బురద, కుళ్లునీరు. వాకిళ్లలో కాలు పెట్టుటకు వీలు లేదు. పెద్దవారలకు శుచిత్వము నేర్పు టావశ్యకము. చంపారణ్యమునం దెల్లెడల పలుతెగల చర్మవ్యాధులు కలవు. వీలయినంతవఱకు వీనిని బాగుచేయుటకు ప్రయత్నింపవలయు ననియు, వారి జీవితప్రవిభాగములలోనికిఁ గూడఁ జొఱఁబాఱవలయు ననియు తలఁచితిమి.

ఈ పనికి వైద్యులు కావలయును. డాక్టరు దేవుగారిని పంపుఁ డని గోఖలే సొసయిటీవారిని గోరితిని. వీరితో నా కిదివఱకే స్నేహము మెండు. వారి సేవాలాభ మాఱునెలలు దొరకెను. పంతుళ్లు, పంతులమ్మలు వారికడఁ బని నేర్చికొనిరి.

వీ రెవరికిని నీలిమందు కామందులతోఁ గాని, రాజకీయవ్యవహారముతోఁ గాని జోక్యము లేదు. ఫిర్యాదు లేవేని యున్నచో నాకు మాత్రమే వానితో సంబంధము. ఎవరిపని వారిదే, యెవరిపాట వారిదే, వీరి కింకొక పనితో సంబంధ మిసుమంతయు లేదు. 'ఎవరికి వారే యమునాతీరే.' చంపారణ్యమునందు నా యీ సహచరుల నియమపాలన మత్యద్భుతము. వీరిలో నెవరును వెంట్రుకవాసి యైనను ఈ నియమముల నుల్లంఘించినటులు నాకు గుర్తు లేదు.

౧౮

గ్రామప్రవేశము

చాలవఱ కొకొక్క బడిలో నొక పురుషుని, ఒక స్త్రీని నియమించితిమి. మందు లొసంగుట, గ్రామారోగ్యము సరిచేయుట వీరు చూచుకొనవలయును. స్త్రీసాహాయ్యమున స్త్రీలోకములో ప్రవేశము కలిగించుకొనవలయును. మందుల పని చాలఁ దేలిక చేసిపెట్టితిమి. ఆముదము, క్వినిన్, గంధకలేపము–వీనిని ప్రతి బడిలోను నిలువచేసితిమి. నాలుకపై మకిల కానిపించినను, లేక మలబంధము కలిగినను ఆముద మొసఁగితిమి. జ్వరము వచ్చినవారి కాముద మిచ్చి పిదప క్వినిన్ వాడితిమి. చర్మవ్యాధులు గలవారికి గజ్జి మొదలగునది కల చోటు చక్కగా కడిగి గంధకలేప మంటించితిమి. ఇంటికి పట్టుకొనివెళ్లుటకే మందును ఈయనయితిమి. విశేషవ్యాధులు కలవారిని డాక్టరు దేవుగారికడ కంపితిమి. డాక్టరు దేవుగారు నియతవేళకు కొన్నికొన్ని తావుల కరిగి వైద్యము చేయుచుండెడివారు. ఈ సులభోపాయములు చాలమంది కుపకరించెను. మామూలు రోగములు కొలఁదిగా నున్నపుడును, అవి సులభోపాయములకు లొంగునపుడును పెద్ద వైద్యుల సాయ మక్కఱలేదు గాన మే మేర్పఱచిన పద్ధతి హాస్యజనకము కాదు. ఇది అచటివారి కెవరికిని నవ్వులాటగా లేదు.

ఇఁక గ్రామసంస్కరణముకడ నట్టు. గ్రామమునందలి జనము తమంతఁ దా మేమియుఁ జేయరు. పొలములలో పాటుపడువారుగూడ తమ చేతితో తమ మలమును తీసి పాఱవైవరు. డాక్టరు దేవుగారు 'ఇఁక లాభము లేదు' అని అనుకొనెడివారు కారు. వారును, మఱి

కొందఱు స్వయంసేవకులును గలిసి యొక గ్రామమును పూర్ణముగా నిర్మలము చేయఁదలఁచి బజాఱు లూడ్చిరి; వాకిళ్లలోని పెంట నెత్తి వయిచిరి; నూతులకడ నున్న మురికిగుంటలను బాగుచేసిరి. ఇటులు చేసి 'కొందఱు స్వయంసేవకులను బంపుఁ' డని గ్రామస్థులను గోరిరి. కొన్నియూళ్లవారీ పనిని జూచి సిగ్గిలి పనిచేయ నారంభించిరి. మఱి కొన్ని యూళ్లవారు నా మోటరుకారు పోవు రోడ్లనుగూడ శుభ్రపఱిచిరి. ఈ మధురవిషయములతో పాటు లోకుల యుపేక్షవలన కటువిషయములుగూడఁ జవిచూడఁబడకపోలేదు. కొన్ని గ్రామముల వారీ పనియెడల మొగమోటమి లేక తమ యనిష్టమును దెలిపి నటులు నాకు గుర్తు కలదు.

నేననేక స్త్రీల సభలలోఁ జెప్పుచు వచ్చిన యొక విషయ మిచట నుదాహరించుట అనుచితము కాదు. భితిహరవా యను నొక చిన్న గ్రామము కలదు. దీనిప్రక్కనొక గ్రామటిక * కలదు. అచట నున్న కొంద ఱాఁడువారి బట్టలు చూతునుగదా మడ్డి యోడుచుం డెను. వీరు బట్ట లేల యుతుకుకొనరో, వేఱు బట్ట లేల కట్టుకొనరో కస్తూరబాయిని కనుఁగొమ్మంటిని. ఆమె వారి మంచిచెడుగులు కనుఁగొనెను. వారిలో నొకయామె కస్తూరబాయిని తన గుడిసెలోనికిఁ గొంపోయి, 'ఇదిగో! మాకు పెట్టెలు గాని యలమరలు గాని, లేవు. నాకు వేఱే వస్త్రము లేవియు లేవు. ఈ కట్టుకొనిన దొక్కటే నాకుఁ గల బట్ట. ఏమి కట్టుకొని దీని నుతుకుకొందునో సెల విండు! మహాత్ములను నా కొక వస్త్రము నిమ్మనుఁడు! నేను ప్రతిదినమును తప్పక స్నానము చేసి వస్త్రము నుతికికొని మంచి బట్ట కట్టుకొందును' అని చెప్పెను. హిందూదేశమునం దిట్టి గుడిసె యిది యొకటియే

---

*గ్రామటిక=మఱీ చిన్న పల్లె: గూడెము.

కాదు; వేన వేలు. పెట్టెయు బుట్టయు లేక, మాఱుచలువ లేక మానము కాపాడుకొనుటకు చినుఁగుపాతలు దాల్చువా రసంఖ్యాకులు గలరు.

మఱి యొక విషయ మిచట నుదాహార్యము. చంపారణ్యమున గడ్డికిని, వెదురునకును వెతకుకొన నక్కఱలేదు. భీతిహరవాలో బడికిఁగాను మట్టిగోడలు పెట్టి గడ్డివెదుళ్లతో నొక పాకను వేసిరి. ఎవరో యొకరాత్రి దానికి నిప్పు పెట్టిరి. ప్రక్కనున్న నీలిమందు కామందుల తాలూకువాడని లోకు లనుమానించిరి. మరల నట్టి పాకయే వేయుట మంచి దనిపింప లేదు. ఆ బడిని శ్రీ సోమణుగారును, కస్తురబాయియుఁ జూచుచుండిరి. సోమణుగారు, ఇటుకలతో గోడలు కట్టి పెంకుటిల్లు వేయ నిశ్చయించిరి. పలువు రతనికి సాయ పడిరి. వెంటనే యొక పెంకుటిల్లు లేచెను. ఇఁక దాని కగ్నిభయము లేదు.

ఈ రీతిగా బడులవలనను, ఆరోగ్యసంస్కరణమువలనను, ఔషధములవలనను లోకులకు స్వయంసేవకులయెడల నమ్మిక ప్రబలెను. వారియెడ మంచియుద్దేశము కలిగెను.

నే నీ పని యంతయు చిరస్థాయిగా నుండునటులు చేయఁదలఁచితిని గాని యది సాగలే దని చింతాపూర్వకముగా చెప్పుచున్నాను. వచ్చిన స్వయంసేవకులు కొలఁదికాలమే యుండుటకు వచ్చియుండిరి. క్రొత్తవారు పైనుండి వచ్చుట కష్టమాయెను. బిహారులో నిందులకుఁ దగినవా రెవరును దొరకరైరి. చంపారణ్యమున నా పని ముగియువఱకు ఈ లోపుగా నాకొఱకు తయా రగుచున్న మఱియొక పని నన్నొత్తుకొనిపోయెను. నే నచట నున్న దాఱు నెలలే యయినను నాఁటి పని నేఁటికిని నచట నేదోవిధముగాఁ గానబడుచునే యుండును.

౧౫

మంచి అధికారివలని ప్రయోజనము

వెనుకటి ప్రకరణములలోఁ జెప్పిన రీతిగా నొకవంక సంఘసేవ జరుగుచుండెను; మఱియొకవంక రయితుల దుఃఖకథలు వ్రాసి కొనుటయు వృద్ధిఁబొందుచుండెను. వేలకొలఁది వాఙ్మూలములు పుచ్చుకొనఁబడినపిదప నవి మే లొనరింపక మానునా? వాఙ్మూలము లిచ్చు జనము వేలకు దాఁటినకొలఁది నీలిమందు కామందుల క్రోధము హెచ్చఁదొడఁగెను. వారు నా విచారణను విఫలముగాఁ జేయుటకు విశ్వప్రయత్నముల నొనరించిరి.

నా కొకనాఁడు బిహారుసరకారువారికడనుండి యొక యుత్తరము వచ్చెను. 'మీ విచారణకు వలసినదానికంటె నెక్కువకాలము పట్టెను. మీ రిఁక దానిని ముగించి బిహారును విడిచి పోవరాదా?' ఈ యుత్తరము వినయముగనే యుండెను; గాని దాని యర్థము బట్టబయలుగనే యున్నది! నే నిటులు ప్రత్యుత్తరించితిని: 'నా విచారణ కింకను చాలఁ గాలము పట్టక తప్పదు. విచారణ ముగిసినపిదపఁగూడ నిచటి లోకుల కష్టములను బోఁగొట్టకుండ బిహారు విడిచిపెట్టి పోవుట నా కిష్టము కాదు.'

నావిచారణ నాఁపివేయుటకు సరకారువారికి రెండు మంచి దారులు కలవు. రైతుల కష్టములు నిక్కములని తెలిసికొని వానినిఁ బోఁగొట్టుట యొకటి. వారి వాఙ్మూలములఁ గయికొని సొంతముగా విచారణసంఘమును నియమించుట మఱియొకటి. గవర్నరు ఎడ్వర్డు గెఇట్‌గారు నన్ను దమకడకు రమ్మనియు, సొంతముగా విచారణ సంఘము నియమించుటకుఁ దా మూహించుచున్నా మనియు, అందు

మీరుగూడ సభ్యత వహింపుఁడనియు నాకుఁ దెలిపిరి. మిగిలిన సభ్యుల పేరులు చూచి నా సహచరులతో సంప్రతించి యీదిగువ షరతుల ప్రకారము నేను సభ్యుఁడ నగుదు నని సమ్మతించితిని. ఆషరతు లివి: విచారణ జరుగుచుండు కాలమున నా సహచరుల సలహాను దీసికొనుటకు నాకు నిషేధము ఉండరాదు. నే నిందు సభ్యుఁడ నయితి నను కారణమున రైతులకు సలహాదారుగా నుండరా దను నిషేధము ఉండరాదు. మరియు నీ విచారణ ముగిసినపిదప నిది నాకు సంతోషము కలిగించనిచో రైతులకు తగిన సలహా నిచ్చి వారిని నడిపించు స్వాతంత్ర్యము నాకు ఉండవలయును.

సర్ ఎడ్వర్డు గెయిట్ గారు నా షరతులు మంజూరుచేసిరి. ఈ విచారణసంఘమునకు స్వ. సర్ ఫ్రాంక్ స్లాయీగా రధ్యక్షులుగా నియమింపఁబడిరి. విచారణసంఘము రైతుల ఫిర్యాదు సత్యమని నమ్మెను. నీలిమందు కామందు లనుచితముగాఁ దీసికొన్న సొమ్ములో కొంత పాలు తిరిగి యీయవలయుననియు, తీన్ కఠియా పద్ధతిని చట్టముప్రకారము తీసివేయవలయు ననియు నభిప్రాయపడెను.

ఈ రిపోర్టేకవాక్యతగా నుండుటకును, తుదకు అగ్రేరియన్ బిల్లు ప్యాసుచేయించుటకును గవర్నరుగారి పాలెక్కువ. గవర్నరుగా రేమాత్రమేని దృఢముగా నుండకున్నను, తమ కౌశల్యమును సంపూర్ణముగా నుపయోగింపకున్నను, ఆ రిపోర్టున కైకకంఠ్య ముండెడిదికాదు. అగ్రేరియన్ బిల్లుగూడ ప్యాసయ్యెడిది కాదు. నీలిమందు కామందులకును చాల బల ముండెను. రిపోర్టువచ్చిన తరువాత నది బిల్లుగా మారకుండుటకుఁ జాలఁ బని చేసిరి. కాని సర్ ఎడ్వర్డు గెయిట్ గారు తుది వఱకు నచలముగా నుండి విచారణసంఘమువారి సిఫారసులు సంపూర్ణముగా నెఱవేఱునటు లొనరించిరి.

ఆ త్మ క థ

నూరేండ్లనుండి నమలులో నున్న యీ తీన్‌కఠియా పద్ధతి యీ రీతిగా రద్దాయెను. దీనితోపాటు నీలికామందుల రాజ్యమ స్తమించెను. విజిగిపోయిన రైతుల కిపుడు మరల జీవము వచ్చెను. 'నీలి మందు మచ్చ యెన్నఁటికిని పోదు' అను సందేహము తొలఁగిపోయెను.

చంపారణ్యమునం దారంభము చేయఁబడిన యీ పనులను కొన్నియేండ్లవఱకును కొనసాగింపవలయు ననియు, నింకను చాల బడులు పెట్టవలయు ననియు, నింకను చాల గ్రామములు తిరిగిచూప వలయుననియును నే ననుకొంటిని. క్షేత్రము సిద్ధముగనే యుండెను గాని పలుమాఱులు నాయభీష్టము నీశ్వరుఁడు కొనసాగనీయలేదు. దైవము నా కింకొక పని చూపి లాఁగుకొనిపోయెను.

౨౦

కూలివారితో

చంపారణ్యమున కమిటీపనిని ముగింపునకుఁ దెచ్చునంతలో మోహనలాల్ పాండ్యలును, శంకరలాల్ పరీఖులును గలిసి నా కొక యుత్తరము వ్రాసిరి: 'ఖేడాజిల్లాలో పంటలు పోయెను. రైతులు శిస్తులు చెల్లింపఁజాలరు. వారికి రిమిషను ఇప్పింపవలయును. మీరీవిషయమునఁ గలుగఁజేసికొనవలయును.'

అచటికి వెళ్లి చూడనిచో సలహా చెప్పఁగల ఇచ్ఛయు, శక్తియుఁ, సాహసమును నాకు లేవు.

అప్పుడే శ్రీ అనసూయాబాయియు నొక యుత్తరము వ్రాసెను. కూలివారి జీతములు చాలఁ దక్కువగా నున్నవనియు, కూలివారు చాలఁ గాలమునుండి జీతములను పెంపుచేయఁ గోరుచుండిరనియు నామె వ్రాసెను. నాకు కూలివారిని సరియగు దారిని నడపు నుత్సాహము కలదు. ఈ పని చాలఁ జిన్నదయినను ఇంత దవ్వునుండి నే నీ పనిని నడపఁజాలను. కావున వెంటనే అమదాబాదున కేఁగితిని. ఈ రెండు పనులను నెఱవేర్చికొని కొలఁదికాలములోనే చంపారణ్యమునకుఁ గ్రమ్మఱి యచటఁ దలపెట్టిన పనులన్నింటిని పూర్తిచేయఁగల ననుకొంటిని.

అమదాబాదు వెళ్ళి చూచికొనినతరువాతఁ జాలఁ గాలము వఱకును చంపారణ్యమునకు వెళ్ళ వీలు కలుగదని తేలెను. చంపారణ్యమునఁ బెట్టిన బడులొక్కొకటితరువాత మఱియొకటి యెత్తివేయఁబడెను. నా సహచరులును, నేనును చాల నాకాశసౌధములను గట్టితిమి గాని యవియన్నియుఁ గొలఁదికాలములో నేలఁగూలెను.

చంపారణ్యమున బడులు పెట్టుట, గ్రామములను బాగుచేయుట యను నీ రెండు పనులేగాక గోరక్షణము కూడఁ జేయవలయునని తలపెట్టితిని. గోరక్షణమును, హిందీప్రచారణమును మార్వాడీలే బూనుకొనినటులు నా త్రిప్పటలోఁ గనుఁగొంటిని. బేతియాలో నొకమార్వాడీ సజ్జనుఁడు తన సత్రమున నాకు బస యిచ్చెను. బేతియాలో నున్న చాలమంది మారువాడీలు నన్ను తమ గోష్ఠములలోనికిఁ దీసికొనిపోయిరి. గోరక్షణమును గురించి నే నప్పటికే ఆలోచించి పెట్టుకొని యుంటిని. నేఁడు నాకుఁ గల యుద్దేశము లన్నియు నాఁటివే. గోవంశమును వృద్ధిపొందించుటయు, గోజాతిని సంస్కరించుటయు, ఎడ్లచే తగినంత పనిమాత్రము చేయించుటయు, వేఱు బడులను క్షీరశాలల నెలకొలుపుట యీ మొదలగునవన్నియు గోరక్షణముక్రిందికి వచ్చును. మారువాడీ లీ పనికి చాల సాయపడుదు మనిరి గాని నేను చంపారనులోఁ జాలఁ గాల ముండఁజాలమి నాపని సగము సగముగానే యాఁగిపోయెను. బేతియాలో నింకను గోశాల పని జరుగుచున్నది కాని యది యింకను ఆదర్శమగు క్షీరశాల కాలేదు. చంపారణ్యమునందింకను ఎడ్లచే మితిమీఱిన పనిని చేయించుచున్నారు. హిందూనామధారు లింకను ఎడ్లను దయమాలి పీడించి తమ ధర్మమును పాడుచేసికొనుచున్నారు. నే నిందుల కెప్పుడును వగచుచున్నాను. నేను చంపారణ్యమునకు వెళ్లినపుడెల్ల చేతఁగాక చాలించిన యీ పని కై వేదనపడుటయు, బిహారువారలయు, మారువాడీలయు నెయ్యపు ముదలకింపులకు పాలగుటయుఁ దటస్థించుచున్నది.

కొన్ని కొన్ని తావులలో బడు లేవో మాదిరిగా సాగుచున్నవి. కాని గోసేవాకార్యక్రమము చక్కఁగా నెలకొనలేదు. కావున దానికిఁ దలఁచినంత పెం పొదవలేదు.

౨౦. కూలి వారితో

అమదావాదులో ఖేడాలోఁ జేయవలసిన పనినిగూర్చి యాలోచించుచు, ముందు కూలివారి పనిని జూడ నారంభించితిని.

నా స్థితి చాల విషమముగా నుండెను. కూలివారి వాదము సమంజసము. అంబాలాల్ సారాభాయి శ్రీ అనసూయాబాయికి సోదరుఁడు. అతఁడు మిల్లువారి పక్షము. శ్రీ అనసూయాబాయి కూలివారి పక్షము. వీరిరువురికి నిండు తగవు వచ్చెను. ఇఁక నామాట. నాకును మిల్లువారలకును జాలఁ జెలిమి. కావున వారితో తగవులాడుట మఱికొంచెము చిక్కు. నేను వారితో సంప్రతించితిని. పంచాయతిచే తగవు తీర్చుకొనుమంటిని. కాని తమకును, తమ కూలివారికిని నడుమ నొక మాధ్యస్థ్యము వారి కొప్పుదల కాలేదు.

నాకిఁక కూలివారితో 'కట్టు కట్టుఁ'డని చెప్పక తప్పనిసరి యాయెను. నే నిటులు చెప్పకముందు కూలివారితోడను, వారిలో పెద్దలతోడను బాగుగా మాటలాడి వారి స్థితిగతు లన్నియు తెలిసికొంటిని. కట్టిన కట్టు చెంగిపోకుండుట కీ క్రింది నియమములను విధించితిని:

౧. శాంతిభంగ మెన్నఁటికి కలిగింపరాదు.

౨. మరల పనిలోనికిఁ బోవువారిని బలాత్కరింపరాదు.

౩. బిచ్చ మెత్తరాదు.

౪. కట్టు జరుగునంతవఱకును తిరిగిపోకుండ నుండవలయును; కూడు లేనిచో మరియాదగల మఱియొక కూలిపనిని చేసికొనవలయును.

పెద్దల కీ నియమము లర్థమాయెను, నచ్చెను. 'మన విన్నపము నంగీకరింపనంతవఱకుఁగాని, పంచాయతీని వేయనంతవఱకుఁ

గాని మనము పనిలోనికి పోఁగూడదని కూలివారు ఒట్టుపెట్టుకొనిరి.

ఈ కట్టు జరుగుచున్నప్పుడే శ్రీ శంకర్‌లాల్ బాంకరును— శ్రీ వల్లభభాయిని నేను బాగుగా నెఱుఁగఁ గలిగితిని. ఇంతకుముందే శ్రీ అనసూయాబాయి నెఱిఁగియుంటిని.

సబర్మతీతీరమున నొక చెట్టుక్రింద దైనందినమీ కట్టు కట్టిన కూలివారి సభ జరుగుచుండెడిది. అచటికి వేలకొలఁది కూలివారు వచ్చెడివారు. నేను ప్రతిదినమును వారు పాటింపవలసిన షరతులను గుఱుతు చేయుచుంటిని. మఱియు శాంతిని కాపాడవలయు ననియు, నాత్మగౌరవమును కాపాడుకొనవలయు ననియు బోధించుచుంటిని. వారు ఏక్ టేక్* అని వ్రాయఁబడిన జెండాలు గైకొని పెండ్లివారివలె నూరేఁగి వీథులలో సభకు హాజరగుచుండెడివారు.

కట్టిరువదియొక్క నాళ్లు జరిగెను, ఇది జరుగుచుండఁగా కూలివారికి న్యాయము కలిగింపవలసిన దని నేను మిల్లువారిని ప్రార్థించుచుంటిని. 'మేము మాత్రము ఒట్టు పెట్టుకొనలేదా? కూలివాండ్రు మాకు బిడ్డలవంటివారు, మేము తండ్రులవంటి వారము..... మానడుమ మూడవవాఁ డొకఁడు వేలు పెట్టనేల? మాకు పంచాయతీచేయువారొకరా?' అని ప్రత్యుత్తరము చెప్పుచుండెడివారు.

* శపథమును పాలింపుము.

౨౧

ఆశ్రమము నొకతూరి తొంగిచూచుట

కూలివారలను ముందరకు నడిపింపక ముం నొకసారి యాశ్రమమును తొంగిచూచు టావశ్యకము. నేను చంపారణ్యమునం దుండినను ఆశ్రమముమాట మఱవలేదు. నడుమనడుమ నచటికిఁ బోయి వచ్చుచుంటిని.

అమదాబాదు ప్రక్కనున్న కోచరబ్ అను గ్రామమున మా ఆశ్రమము కలదు. కోచరబులో ప్లేగ గంటుకొనెను. బాలుర నచట సురక్షితులనుగా నుంచుట కష్టము. ఆశ్రమమునందు శౌచ నియమముల నెంత జాగరూకతతో పరిపాలించినను చుట్టుప్రక్కల నున్న యశౌచము నాశ్రమమునకు సోఁకకుండఁ జేయుట యసంభవము. ఆ సమయమున గ్రామస్థులచే శౌచనియమములఁ బరిపాలింపఁ జేయుటకును, లేక వారికి సేవచేయుటకును మాకు శక్తి లేదు. గ్రామమునకు దూరముగా—చిక్కు కలుగనంత దూరముగా—నాశ్రమము నుంచుట మా యుద్దేశము. ముం దెప్పుడో యాశ్రమమును స్థాపించిన ప్రకృతము భూమి కొని యచటికిఁ దఱలుదమని తలఁచితిమి.

'కోచరబు విడనాడి పొండు!' అనుట కీ ప్లేగు నోటీసను కొంటిని. శ్రీ పుంజాభాయి హీరాచం దనునతఁ డాశ్రమమున కొకచుట్టము. అతఁడు చిన్నపనులనక పెద్దపనులనక యాశ్రమసేవ చేయుచుండెడివాఁడు. అమదాబాదులోఁ బ్రతిసంగతియు నతనికిఁ దెలియును. ఆశ్రమమునకుఁ దగిన తావు నితఁడు నెమకఁ దొడఁగెను. ఇతనితోడ నేనును కోచరబుకు ఉత్తరభాగమును, దక్షిణభాగమును తిరిగి చూచితిని. ఉత్తరమున మూడు నాలుగు మైళ్లలో

నొక భాగము దొరకునో చూడుమని చెప్పితిని. ఇపుడు మేమున్న ప్రదేశము నతఁడు చూపెను. ఆ ప్రదేశము నాకు నచ్చుటకు చెఱసాల దాపుగా నుండుట యొక కారణము. సత్యాగ్రహాశ్రమవాసుల యోగమందు జైలుయాత్ర వ్రాయఁబడియుండుటచే కనులయెదుట జైలుండుట చాల మంచిది. శుచిగా నుండు ప్రదేశముల సమీపముననే జైళ్లు కట్టుదురనియు నే నెఱుఁగుదును.

ఏ డెనిమిది దినములలో కొనుబడి యాయెను. భూమిలో ఇండ్లు వాకిండ్లుగాని, చెట్లు చేమలుగాని లేవు. ఏమి లేకపోయినను నిది నదీతీరమున నుండుటయు, నేకాంతముగా నుండుటయు నన్నిటికంటె గొప్ప విశేషము. అందు గుడారములు వేసికొని యుండఁ దలఁచితిమి. ఇండ్లు కట్టునంతవఱకు రేకుపాకలలో వంటఁ దలపెట్టితిమి.

ఆశ్రమము క్రమాభివృద్ధిఁ గనుచుండెను. చిన్నలు పెద్దలు, స్త్రీలు పురుషులు అందఱు చేరసి సుమారు నలుబది మంది కలరు. అందఱకు పాకశాల యొకటియే యగుటచే చాల వీలుగా నుండెను. ఆశ్రమము నిటనుండి యిటకు మార్పఁ దలపెట్టుట నావంతు. పని చేయుట యంతయు మామూలు చొప్పున స్వ. మగన్‌లాల్ గాంధీవంతు.

మంచి యిండ్లు వేసికొని నిలఁద్రొక్కుకొనువఱకు మాకు వచ్చిన యిబ్బందులకు మితి లేదు. వానలు వచ్చెను. నాలుగు మైళ్ల దూరమునుండి సామానంతయు రావలయును. ఈ ప్రాంతపు నేలలో పాములు కావలసినన్ని. అట్టిచోట పసివారితో నివసించుట సామాన్యము కాదు. పైగా 'పాములు మొదలగువానిని చంపరాదు' అని మాకు నియమము. మరియు మాలో పాముని భయము లేనివా రెవరును లేరు; నేఁటికిని లేరు. స్థితిగతు లిట్టివి.

౨౧ ఆశ్రమము నొకతూరి తొంగిచూచుట

హింస చేయు జీవములఁ జంపరాదను నియమము ఫీనిక్సు టాల్‌స్టాయి సబర్మతీ యాశ్రమములందు యథాశక్తి యనుష్ఠింపఁబడుచు వచ్చుచుండెను. ఈ యాశ్రమములం దన్నిటను మేము పాంత్ర నేలలోనే కాలుపెట్టితిమి. ఈ మూడు తావులందును సర్పాదుల యుపద్రవ మెక్కువ. అయినను నేఁటివఱ కెవరిని పాము ముట్టలేదు. శ్రద్ధానేత్రముతో తిలకించుచో నీశ్వరకృపయే దీనికిఁ గారణము. 'ఈశ్వరునకు పక్షపాత ముండునా? మానవుల పిచ్చి పనులలోఁ జేయి చేసికొనుటయే యాతని పనియా!' యని యెవరును నిరర్థకముగా శంకింపకుందురుగాక! అది యనుభవసిద్ధమగు విషయము. దానిని భాషలోఁ బెట్టఁజాలను. లౌకికభాషలో నీశ్వరుని కార్యములను గురించి వ్రాయుచుంటినిగాని యవి వ్రాయుటకు వీలయినవి కావని నాకుఁ దెలియును. పాముకఁఱచు మానవుఁడు వర్ణింప నెంచునుబో మూకవాణియే యవలంబనము. సర్పములను జంపని మా యాశ్రమము వారి కిరువదియయిదేండ్లనుండియు నించుకయు సర్పబాధ కలుగకుండు టానుషంగిక మనుటకుబదు లీశ్వరకృపయే కారణ మనినచో నది వెఱ్ఱి నమ్మక మగునేని యట్టి వెఱ్ఱి నమ్మకమునే నేనంటి పట్టుకొని యుందును.

కూలివారు కట్టు కట్టిన సమయమున ఆశ్రమమున నేఁతసాలకు పునాదులు త్రవ్వితిమి. ఆశ్రమమున మొదటి పని నేఁత. వడుకుట మాకింకను తెలియలేదు. కావున తొలుతనే నేఁతసాల కట్టింపవలయు ననుకొంటిమి.

౨౨

ఉపవాసము

కూలివారు మొదటి రెండు వారములును చాల ధైర్యము చూపిరి. మిగుల శాంతముగా నుండిరి. ప్రతిదినమును పలువురు సభకు వచ్చుచుండిరి. ప్రతిదినమును నేను వారికి శపథమును గుర్తునకుఁ దెచ్చుచుంటిని. 'చావనయినఁ జచ్చెదముగాని యొట్టు మీఱుదుమా!' యని వారు చెప్పిపోవుచుండిరి.

క్రమముగా కట్టు తప్పిపోవఁ జొచ్చెను. బలము పోయినవాఁడు చెనకఁ జూచును. అటులే కట్టులో బలము పోఁదొడఁగినకొలఁది కట్టులో నున్నవారు కట్టు తప్పినవారిని ద్వేషింపఁ జొచ్చిరి. ఇఁక వీరిలో వీరికి తగవు లుప్పతిల్లునేమో యని యనుకొంటిని. వీరిలో వీరిని కొట్టుకొనఁజేయకుండుట కష్టమని నాకు భయమెత్తెను. ప్రతిదినమును సభలో జనము పలుచన కాఁ దొడఁగెను. వచ్చినవారి మొగములమీఁదఁగూడ నౌదాసీన్యము వ్రేలాడుచుండెను. కూలివారందఱును ఊఁగులాడిపోవుచున్నటులు నాకు వార్తవచ్చెను. నాపని అట్టిట్టాయెను. నా విధి యేమని యాలోచించితిని. నాకు దక్షిణ-ఆఫ్రికాలో కూలివారికట్ల అనుభవము కలదు. కాని యిది క్రొత్త. ఏలన నిపటు కూలివారు నా ప్రేరణచే కట్టుకట్టిరి. ప్రతిదినము నాకడ బాసచేసి పోవుచుండిరి. దీనికి నేనే సాక్షిని. ఇఁక వీ రెటు లీ ప్రతిజ్ఞను దాఁటఁగలరని నా యుద్దేశము. ఇది నా గర్వమో, కూలివారల యెడల నాకుఁ గల ప్రేమయో, లేక సత్యమునెడలఁ బ్రేమయో యెవరు చెప్పఁగలరు!

ప్రాతఃకాలము. నేను సభలో నుంటిని. ఏమిచేయను దోఁచలేదు. 'కూలివారందఱును మరల కట్టులోనికిఁ జేరనంతవఱకును,

ఈ విషయము తేలుదనుక కట్టు నిభాయింపనంతవఱకును—ఇంత యేల? కూలివా రందఱును మిల్లువదలి బయటఁ బడనంతవఱకును నే నన్నము ముట్టను' అను నీ మాట లప్రయత్నముగా నానోట వెలువడెను.

కూలివారు నివ్వెఱపోయిరి. శ్రీ అనసూయాబాయికనులవెంట నీ రూరఁ దొడఁగెను.

'మే ముపవసింపవలయుఁగాని మీ కేటి యుపవాసము? మీచేత నుపవాసము చేయనీయము. మా తప్పులు క్షమింపుఁడు! మేము మాబాసను దాఁటము.' అని కూలివారు గోలకెత్తిరి.

'మీ కుపవాసముతో పనిలేదు. మీరు మీ ప్రతిజ్ఞకు నిలువబడినచోఁ జాలును. మనకు ద్రవ్యము లేదు. భిక్షాన్నముతో కట్టు కట్టరాదుగదా! మీరింకొక కూలిపని చేసికొని పొట్ట గడపుకొనినచో కట్టెన్నాళ్లున్నను నిర్భయము. ఇఁక నా యుపవాసమందురా? ఇది అట్లో యిట్లో తేలిపోవలెను' అని నే నంటిని.

ఈలోఁగా వల్లభభాయి మునిసిపాలిటీలో పనులకు వెదకుచుండెనుగాని సమకూరలేదు. ఆశ్రమమున నేతసాలలో నిసుక పోయవలసిన పని యున్నది. దీనికిఁ జాలమంది కూలివారి నుపయోగపఱచికొనవచ్చునని మగనలాలు సూచించెను. కూలివారు పనికి తయారుగానుండిరి. శ్రీ అనసూయాబాయి నెత్తిమీఁద పళ్లిక నిడుకొని కూలివారికి దారి జూపెను. అపుడా కూలివారిని చూడవలె ననిపించెను. కూలివారికిఁ గ్రొత్త బలము వచ్చెను. వారికి కూలి యిచ్చువాని చేయి పీఁకుకొని పోయెను.

ఈ యుపవాసమునం దొక దోషముకలదు. ఏలన: మిల్లువారలకును నాకును నెయ్యము కలదని లోఁగడ వ్రాసియుంటిని. కావున

నా యీ యుపవాసము వారిని స్పృశింపకుండ నుండఁజాలదు. వీరికి విరుద్ధముగా నుపవసించుట సత్యాగ్రహ మనిపించుకొనఁ బడదని నే నెఱుఁగుదును. వీరిని వంపవలయునది కూలివారికష్టే. నా ప్రాయశ్చిత్తము వీరి దోషమునకుఁ గాదు; మఱి కూలివారి దోషమునకు. నేను కూలివారి ప్రతినిధిని. కాన వారు దోషులగుదురేని నేనును దోషినే. నేను మిల్లువారికి వినయమునే చూపవలయును. వీరి కెదురుగా నుపవసించుట బలాత్కారములోనికి దిగుట. ఇటులు నా యుపవాసము వారి కొరపిడి కలిగించు నని నాకుఁ దెలిసినను నాకుఁ జేయక తప్పని దాయెను. ఇట్టి దోషమయ మగు నుపవాసము చేయుట నాధర్మ మని తెన్నగా తోఁచెను.

'నా యుపవాసమువలన మీరు మీదారినుండి కొంచెమేని తొలఁగవలసిన పని లేదని నేను మిల్లువారలకుఁ దెలిపితిని. వారు నామాటల కనుకూలార్థమునే గ్రహించిరి. అపుడపుడు తమాషాగా నన్నెత్తిపొడిచిరి. దీనికి వీరి కధికారము కలదు.

ఈకట్టున కెదిరినాయకుఁడు సేఠ్ అంబాలాలు. ఇతని పట్టుదల యాశ్చర్యజనకము. ఇతఁడు కల్లకపటములు లేనివాఁడు. ఇతనితో కయ్యముపాడుచుట నాకు రుచించెను. ఇట్టివాఁడు నాయకుఁడుగాఁ గల విరోధిపక్షమునకు నాయుపవాసము పీడాజనక మగుటచే నేను చాల వగచితిని. ఆతనిభార్య సరళాదేవికిని, నాకును కడు నెయ్యము. ఆమె నాకు సోదరివంటిది. నాకొఱ కామె వగచుట నేను చూడఁజాలక పోయితిని.

శ్రీ అనసూయాబాయియు, కొందఱు మిత్రులును, కూలివారు కొందఱును తొలినాఁడు నాతోపాటుపవసించిరి. కాని పిమ్మట నతికష్టముమీఁద వారిని మానిపించితిని.

౨౨ ఉపవాసము

ఈరీతిగా నలువంకలును ప్రేమపూరితము లాయెను. మిల్లువారి హృదయములు ద్రవించెను. వెంటనే యీవిషయమును పరిష్కరింపఁ దలపోసిరి. శ్రీ అనసూయగారి యిల్లు వీరికి సభాగృహ మాయెను. శ్రీ ఆనంద శంకర ధ్రువగారు నడుమలో నుండుకొనిరి. తుద కతఁడు పంచాయతీదారుగా నేర్పఱుపఁబడెను. వెంటనే కట్టు విరమింపఁబడెను. నాకు నాఁటితో మూ డుపవాసములు. మిల్లువారు కూలివారికి మిఠాయి పంచిపెట్టిరి. ౨౧ దినముల కీరీతిగా సమాధానము కుదిరెను. సమాధానమున కొక సమ్మేళనము జరిగెను. దానికి మిల్లువారును, కమిషనరును హాజరయిరి. కమిషనరు కూలివారి కిట్లు సలహా నిచ్చెను: 'మీ రెప్పుడును మి. గాంధీమాట వినుచుండుఁడు!' ఇది జరిగిన కొలఁది నాళ్లకే నాకును, ఈ కమీషనరుకును పెద్ద యుద్ధము జరిగెను. కాని కాలము మారెను; దానితోపా టతఁడును మారెను. అప్పు డతఁడు నామాటల వినవలదని ఖేడారయితులకు సలహా యిచ్చెను.

రసనీయమును, దయనీయమును నగు నొక విషయ మిట నుదాహరింపక యీ ప్రకరణమును ముగింపను. మిల్లువారు కూలివారికి పంచిపెట్టుటకు చాల మిఠాయి చేయించిరి. వేలకొలఁదిగా నున్న కూలివారికి దానిని పంచిపెట్టుట యెట్టు లని శంక కలిగెను. శపథము తీసికొనిన చెట్టుక్రిందనే పంచిపెట్టుట బాగనిపించెను. ఇంతమందికి సరిపోవు చోటుగూడ వేఱొకచో దొరకదు. కావున ఆ చెట్టుచుట్టు ప్రక్కలఁ గల మైదానమునందు పంచిపెట్టుట నిశ్చితమాయెను. ౨౧ నా క్లదుపాజ్ఞలలో నున్నవారు విశేషప్రయత్నము చేయనక్కఱ లేకయే బారులు తీర్చి నిలువఁబడి మిఠాయి తీసికొనఁగలరనియు, తొందరపడి మిఠాయిమీఁద చేయిచేసుకొన రనియు నాకు పెత్తి నమ్మ

కము. కాని పంచిపెట్టుట తటస్థించినపు డెన్ని ప్రయత్నములు చేసినను విఫలము లాయెను. పంచిపెట్టుట మొదలిడిన రెండు మూడు నిముషములకే బారులు చెదరిపోయి గోల కాఁ బొసఁగెను. కూలీపెద్ద లెంత ప్రయత్నించినను లాభము కలుగకపోయెను. తుదకు అందఱును ఒక్క గుం పైపోయిరి. మిఠాయి చాలభాగము మట్టిగింపఁబడెను. దానితో మైదానమున పంచిపెట్టుట ఆఁపివేయఁబడెను. మిగిలిన మిఠాయి మిర్జాపురమునందలి సేఠ్ అంబాలాలుగారి యింటికిఁ గొంపోవఁబడెను. మఱునాఁడు వారి బంగళాయందలి కోష్ఠలమున పంచిపెట్టఁబడెను.

దీని హాస్యరసము స్పష్టమే. 'ఏక్ టేక్' చెట్టుక్రింద మిఠాయి పంచిపెట్టుదు రని అమదాబాదు బిచ్చగాండ్రకెట్టులో తెలిసెను. వారు మెల్లగా ఇటకు వచ్చిరి. మిఠాయిని కొల్లగొట్టుకొనిపోవుటకు వారి యాఁకలి కారణము. ఇది చాల శోచనీయము.

మన దేశమున ఆఁకటిచిచ్చుచే జచ్చువారి సంఖ్య క్రమాభివృద్ధి నొందుచున్నది. తిననెడలఁ, త్రాగనెడలఁగూడ నాఁకలి సామాన్యగౌరవమును కాపాడదు. మన ధనికులు వారికి పని చూపి తిండి పెట్టుటకుబదులు బిచ్చము లొసఁగి పోషించుచున్నారు.

౨౩

ఖేడా-సత్యాగ్రహము

కూలివారి కట్టు ముగిసిన పిదప ఊపిరి తీసికొనుటకేని నాకు తీరిక లేకపోయెను. వెంటనే ఖేడాజిల్లాలో సత్యాగ్రహము నడపింపవలసివచ్చెను. ఖేడాజిల్లాలో క్షామమువంటి స్థితి కలిగెను. రిమిషను పొందుటకు రైతులు ప్రయత్నించుచుండిరి. శ్రీ అమృతలాల్ ఠక్కరుగారు విచారించి రిపోర్టు తయారు చేసిరి. రైతులకు నేనింకను తగిన సలహా నీయకముందే ఠక్కరుగారు కమిషనరుతో ప్రసంగించిరి. శ్రీ మోహనలాల్ పాండ్యాగారును, శ్రీ శంకరలాల్ పరీఖ్ గారును దీనిలో విఱుచుకొని పడిరి. వీరు స్వ. గోకులదాస్ కహాందాసు శ్రీ విఠలభాయి పటేలుంగారలచే బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిలులో నలజడి కలిగింపఁజేసిరి. సరకారువారికడకు చాల డెప్యుటేషనులు వెళ్లెను.

నేనపుడు గుజరాతుసభ కధ్యక్షుఁడను. ఈ సభ సరకారు వారికి విన్నపములు పంపుకొనెను; తంతు లిచ్చెను; దీనికి ఫలముగా కమిషనరుగారి యవమానములకు లోనాయెను; బెదరింపులు చవిచూచెను; నాఁటి యాఫీసరుల చర్యలు నేఁడు పరికించినచో హాస్యజనకముగను, నమ్మఁదగనంత విచిత్రముగను ఉండును.

ఏమాత్రము చూచినను రైతుల కోరిక అసంగత మనిపింపదు. దానికి దాదుప్రియాదులతోఁగూడఁ బనిలేదు. నాలుగవ వంతుకన్నఁ దక్కువ పంటలు పండినచో రైతులు రిమిషను కోరవచ్చునని లాండ్ రివిన్యూ రూల్సులో అభ్యనుజ్ఞ కలదు. పంటలు నాలుగు వంతులకన్న నెక్కువ యుండెనని ఆఫీసరు లంచనా వేసిరి. రయితులు నాలుగు వంతులకన్న తక్కువ యుండు ననిరి. రయితులమాట సరకారుకు

నమ్మకమా? లోకులు పంచాయతీని కోరిరి. పంచాయతీని కోరుట రాజుగారిపై దండెత్తుట యని సరకారువారి యభిప్రాయము. ఇటులు ప్రార్థనలు, వినతిపత్రములు విఫలము లయినపిదప సహచరులతో నాలోచించి యిఁక సత్యాగ్రహము తలపెట్టుఁడని నేను రయితులకు సలహా యిచ్చితిని.

నా క్రింద ఖేడాజిల్లాలోని స్వయంసేవకులే కాక శ్రీ వల్లభభాయి పటేలు, శ్రీ శంకరలాల్ బ్యాంకర్, శ్రీ అనసూయాబహెన్, శ్రీ ఇందూలాల్ కన్హైయాలాల్ యాజ్ఞిక, శ్రీ మహాదేవదేశాయి మొదలగువారు తోడయిరి. దినదిన మభివృద్ధి నొందుచున్న గొప్ప ప్రాక్టీసు నిందులకుఁగాను వల్లభభాయిగారు వదలుకొనిరి. పిమ్మటఁ గూడ వారిఁక నా పనికిఁ బోలేదు.

మేము నడియాద్-అనాథాశ్రమమున డేరా వేసితిమి. అచట విడిదికి విశేష కారణము లేదు. ఇంతటికిఁ జాలిన తావు కొండొకట లేకుండుటయే యిందులకుఁ గల కారణము.

సత్యాగ్రహు లందఱీక్రిందిరీతి ప్రతిజ్ఞ చేసి చేవ్రాలు పెట్టిరి: “మా గ్రామములో పంటలు నాలుగవ పాలుకన్న తక్కువ యని మాకుఁ దెలియును. కావున పై సాలువఱకు శిస్తులు వసూలుచేయవలదని సరకారువారికి విన్నవించితిమి కాని వారు వసూలుచేయుట మాన లేదు. కావున ఈ దిగువ దస్కతుచేసిన మేము ఈ సాలునకు నిండు శిస్తుగాని, బకాయిగాని సరకారువారి కీయఁజాలము. కాని సరకారువారు శిస్తు వసూలు చేయుటకే దండనీతి ననుసరించినను మేము దాని ననుభవింపఁ దలఁచుకొన్నాము. మేము బుద్ధిపూర్వకముగా శిస్తు లిచ్చి మామాట కల్ల యనిపించుకొనుటకంటె, నాత్మగౌరవము నష్ట మొనరించుకొనుటకంటె మా భూముల జప్తు చేయించుకొనుటయే

మాకు మేలు. ఇఁక మీఁద సరకారువారు రెండవ కిస్తీవఱకును బకాయి వసూలు చేయుట నిలుపుచో మాలో శక్తి కలవారము నిండు శిస్తు ఈయవలసినచో నిండు శిస్తును, బకాయి యున్నచో బకాయిని ఇచ్చివేయఁగలము. తా మిచ్చినచో బీదలుగూడ నీయవలసివత్తురని శక్తి కలవారుగూడ నిప్పుడీయలేము. బీదల చట్టులు, కుండలు మొదలగునవి వేలము వేయఁబడును. వారి కీరీతిగా దుఃఖము కలుగును. ఇట్టి స్థితిలో దరిద్రులను కాపాడుట శక్తిమంతుల ధర్మమని మా నమ్మకము”

ఈ పోరాటమున కెక్కువ ప్రకరణములను వినియోగింపఁజాలను. కాని నాఁడు జరిగిన చక్కని విషయములు చాల నడుగునఁబడిపోవును. ఖేడాసత్యాగ్రహమునుగుఱించి శ్రీ శంకరలాల్ పరీఖుగారు ప్రామాణికమగు నొక గ్రంథమును * రచించియున్నారు. ఈ గొప్ప విషయమును లోఁతుగాఁ జూడఁదలఁచినవా రా గ్రంథమును జదువుదురుగాక !

* ఇది గుజరాతీభాషలో వ్రాయఁబడినది.

ఉల్లి దొంగ

చంపారణ్యము మారుమూల నుండుటవలనను, వార్తాపత్రికలకు సంబంధము లేకుండఁ జేయుటవలనను, అచటికి బయటినుండి జనులు మూఁగలేదు. ఖేడాపోరాట మటులఁ గాదు. అచటి వార్తలు ప్రతిదినమును పత్రికలు ప్రచురించెను. గుజరాతీవారికీ క్రొత్త వస్తువుమీఁద మోజు పుట్టెను. వారు ధనము కురిపింపఁ దలపెట్టిరి. సత్యాగ్రహమున కెంతయో డబ్బక్కఱలేదని అంతలో వారికిఁ దెలియుట కష్టము. నే నెంత నివారించినను అక్కఱకు మించిన ధనమును బొంబాయినేత లిచ్చిరి. సత్యాగ్రహమయినపిదప లెక్కలు చూడఁగా కొంత నిలువయుండెను.

మఱియొకదెస సత్యాగ్రహులకు నిరాడంబరజీవనమునుగుఱించి పాఠము చెప్పవలసివచ్చెను. వారు సంపూర్ణముగా నేర్చికొనిరని చెప్పఁజాలను గాని కొంతకొంత సంస్కరించుకొనిరని చెప్పఁగలను.

రైతులకుఁగూడ నిది వింత వస్తువే. కాన నూరూరు తిరిగి సత్యాగ్రహరహస్యములు వీరికి బోధింపవలసివచ్చెను. సరకారు-ఆఫీసరులు రైతులకు యజమానులు కారనియు, నౌకరులనియు, రైతు లొసఁగు పన్నులోనే జీతము గొందురనియు తెలిపి రైతుల భయము పోఁగొట్టుట ముఖ్యమయిన పని యాయెను. భయము పోఁగొట్టినను వీరిచేత వినయపాలనము చేయించుటయు, వినయపాలనము చేయవలయునని యొప్పించుటయు కష్ట మనిపించెను. ఆఫీసరుల భయము దూసికొనిపోవఁగనే వారు చేయు నవమానములకు బదులు తీర్చికొన కుండ నుండు టెటులు? సత్యాగ్రహికి అవినయము జత యగుచో

పాలలో విషము జతపడినట్లే. నే ననుకొనినంతకంటెఁ దక్కువ వినయము నే వీరు చూపఁ గలిగి రని తుదకు నాకుఁ దెలిసెను. సత్యాగ్రహములో వినయమే కఠినతమమగు నంశ మని యనుభవమువలన నేను దెలిసికొంటిని. వినయ మనఁగా గౌరవముగా మాటలాడుటయే కాదు. విరోధులయెడల మనస్సునందుఁగూడ నాదర ముంచుట, సరళభావ ముంచుట, హితము కోరుట: ఇట్టి ప్రవర్తనము వినయము. సత్యాగ్రహి కివి యన్నియు నావశ్యకములు.

మొదటి దినములలో లోకులు చాల ధైర్యము చూపినను సరకారువారు పని పుచ్చుకొనలేదు. కాని లోకులకు ధైర్యము వృద్ధి పొందె నని తెలిసినకొలఁదియు సరకారువారును ఉగ్రములగు నుపాయముల నవలంబింపఁ బూనిరి. ఆఫీసరులు పశువులను, ఇంటఁ గనఁబడిన వస్తువులను జప్తుచేసిరి. నాలవపాలు జరిమానాలకు నోటీసులు పంపిరి. కొన్ని గ్రామములలో పండిన పంటలు జప్తు చేసిరి. దీనితో రైతులు తల్లడిల్లిరి. కొందఱు రైతులు పన్నులిచ్చిరి. కొందఱు తమ చట్టులను, ముంతలను జప్తు చేసికొనుఁడని ఆఫీసరుల యెదుటఁ బెట వయిచిరి. మఱికొందఱు చచ్చినసరే తుదివఱకు పోరితీరవలయు నని పట్టుమీఁద నిలువఁబడి యుండిరి.

ఇటు లుండఁగా రైతు లెవరో శంకరలాల్ పరీఖుగారి భూమికి శిస్తులు చెల్లించిరి. దీనితో హాహాకారములు బయలుదేరెను. తన రైతు శిస్తు చెల్లించిన భూమిని ధర్మార్థ మిచ్చి శంకరలాల్ పరీఖుగారు ప్రాయశ్చిత్తము చేసికొనిరి. ఇటులు ఆయన తన ప్రతిష్ఠను కాపాడుకొని యితరులకు మార్గదర్శకుఁ డాయెను.

ఒక పొలమున ఉల్లిపంటను అయోగ్యమగు రీతిగా జప్తు చేసిరి. భయపడిపోయినవారి కుత్సాహము కలిగించుటకు మోహనలాల్ పాండ్యాగారి నాయకత్వమున ఆ యుల్లిపాయల నచటినుండి వేఱొక

చోటునకుఁ గొంపొం డని ప్రజలకు నేను సలహా నిచ్చితిని. నా యుద్దేశమున ఈపని చట్టము నతిక్రమించుట కాదు. నిలువయున్న పంటను జప్తుచేయుట చట్టమునకు సమ్మతమయినను నిది నీతికి వెలి; సరిగా లూటీ. కావున నీరీతిగా జరిగిన జప్తు ననాదరించుట ధర్మ మని నేను సూచించితిని. ఇటు లొనరించి జైళ్లకు వెళ్లుటయు, దండ మనుభవించుటయు తప్పనిసరి యని తెలిపితిని. మోహనలాల్ పాండ్యాగారికిని ఇదియే యిష్టము. సత్యాగ్రహమున కిసుమంతయు విరుద్ధము గాకుండు నే విషయమును గూర్చియేని చెఱసాల కేఁగకుండ ఖేడాపోరాటము ముగింపఁజేయుట మోహనలాల్ పాండ్యాగారికి సమ్మతము కాదు. కావున వీ రీ యుల్లిపంటను తొలఁగింపఁ దలఁ పెట్టిరి. వీరి కే డెనమండ్రు మిత్రులు తోడయిరి.

సరకారువారు వీరిని పట్టుకొనకుండ విడనాడుదురా? వీరిని, వీరి సహచరులను అరెస్టు చేసిరి. లోకుల కుత్సాహము బలిసెను. చెఱసాలల భయము పోయినచో, రాజదండము లోకుల కధైర్యము కలిగించుటకు బదులు శౌర్యము కలిగించును. విచారణసమయమున కోర్టంతయు జనులచే క్రిక్కిఱిసి పోయెను. పాండ్యాగారికిని, వారి సహచరులకును కొలఁదినాళ్లు కైదు విధింపఁబడెను. నా యుద్దేశమున నీ శిక్ష తప్పు. ఈ యుల్లిపంట నచటనుండి తొలఁగించుట పీనల్ కోడులోని చౌర్యముక్రిందికి రాదు. కోర్టులకుఁ బోవుట మా యుద్దేశము కాదుగాన అప్పీలు చేయఁబడలేదు.

వీరిని జైలునకుఁ దీసికొనిపోవునపుడు ఒక పెద్ద యూరేఁగింపు వీరివెంట నడచెను. నాఁడు జనులందఱును 'ఉల్లిదొంగ' యను బిరుదముతో వీరిని సమ్మానించిరి. ఆ సమ్మానము నేఁటికిని వీ రనుభవించుచున్నారు.

ఇఁక ఖేడాసత్యాగ్రహమును ముందరి ప్రకరణముతో ముగింతును.

౨౪

ఖేడాసత్యాగ్రహసమాప్తి

ఈ పోరాటము తుదకు విచిత్రముగా ముగిసెను. జను లలసి పోయి రని తెల్లమాయెను. పట్టు విడనాడనివారు ఇంకను పీడింపఁబడి నశింపఁజేయఁబడుదు రని సంకోచించితిని. సత్యాగ్రహి కుపాదేయ మగు నుపాయ మేదేని యున్నచో దానితో నీ పోరాటమును ముగింపఁదలపోసితిని. అట్టి యుపాయ మనుకోకుండఁ దటస్థించెను. 'ధనికులగు రైతులు శిస్తులు చెల్లించినచో బీదలకడ శిస్తు వసూలు పఱచుట యాఁపఁబడునని నడియాదు-తాలూకామామ్లతుదారు నాకు వార్త పంపెను. నే నా సంగతిని వ్రాసిపంపఁ గోరితిని. అతఁడు వ్రాసి పంపెను. మామ్లతుదారు తన తాలూకాకు జవాబుదారీ కాఁగలఁడుగాని జిల్లాకుఁ గాఁజాలఁడు గావున నే నీ సంగతిని కలెక్టరు కెఱుకపఱచితిని. 'ఇట్టి హుకుము మీకు తెలియలేదా!' యని నాకు సమాధానము వచ్చెను. నే నీ వార్త వినియుండలేదు. కాని యిది నిక్కమగుచో ప్రజల ప్రతిజ్ఞ చెల్లినట్లే. ప్రతిజ్ఞాతమగు వస్తు విదియే. కావున నీ హుకుమువలన సంతసము కలిగెను.

కాని దీని సమాప్తివలన నాకు తుష్టి కలుగలేదు. సత్యాగ్రహసంగ్రామము సమాప్తి పొందినతరువాత నుండవలసిన లక్షణ మిందు లేదు. కలెక్టరొక కట్టుబాటు ననుసరించినటులు కనఁబడక యీ హుకుమును నిర్వహించెను. మాట యిచ్చుటయేగాని దీన పేదలకు లాభ మంతగా కలుగలేదు. పేద లెవరో తేల్చవలసిన యధికారము ప్రజలది. కాని వారం దధికరింపఁజేయఁబడలేదు. ప్రజ కిట్టి శక్తి లేనందులకు నేను చాలఁ జింతింతును. తుద కిది సత్యాగ్రహమువలనఁ గలిగిన జయ మని యుద్ఘోషింపఁబడినను నాచూపులో నిది నిస్తేజముగనే యుండెను.

ఆరంభముకంటె నంతమున సత్యాగ్రహులను బలవత్తరులఁగాఁ జేసి విడిచిన యెడలనే సత్యాగ్రహము శుద్ధముగా ముగిసె ననవలయును. ఇం దిది నాకుఁ గానరాలేదు.

ఇటు లక్ష్యమును దీనివలన మనకు కనఁబడని మేళ్లు కొన్ని కలిగెను. వాని లాభమును మనము నేఁటికిని జూచుచున్నాము. ఇంకను పడయఁగలము. ఈ ఖేడాలడాయివలన గుజరాతు రైతులకు ప్రబోధము కలిగెను. వీని రాజనీతి తెలియ నారంభమాయెను.

శ్రీ బిసెంటుగారి హోమ్-రూలు ప్రచార మీ రైతులను నిక్కముగా స్పృశించెను గాని ఖేడాలడాయియే చదువుకొనినవారిని స్వయంసేవకులను రైతుల జీవితములలో సరిగా ప్రవేశపెట్టె నని చెప్పవలయును. సేవకులు రయితుల జీవితములో పడుగు పేకలుగాఁ గలిసిపోయిరి. ఈ పోరాటములో తమకుఁ గల క్షేత్రమర్యాద స్వయంసేవకులకుఁ జక్కగాఁ దెలిసెను. వీరి త్యాగశక్తి వర్ధిల్లెను. వల్లభభాయి యీ పోరాటమునకు తన నర్పించుకొనె నన్నచో దీని పరిణామము సామాన్యమనుటకు వీలులేదు. వెనుకటి సాలున వఱదలు వచ్చినపుడును, ఈసాలున బారడోలీయందును ఏతత్ప్రయోజనము మనకు బాగుగా తెలిసెను. ఘూర్జరరాష్ట్రమున ప్రజాజీవనమందు నవ్యతేజ ముదయించెను. నవోత్సాహము చూపట్టెను. రైతులకు తమ శక్తి తెలిసెను. ఆశక్తి యింక నెన్నఁటికిని మఱపునకు రాదు. తమ ముక్తి తమమీఁదనే, తమ త్యాగశక్తిమీఁదనే యున్నటులు అందఱకుఁ దెలిసెను. ఖేడావలన గుజరాతులో సత్యాగ్రహము కూఁకటివేఱు పోసికొనెను. సత్యాగ్రహసమాప్తివలన నాకు తుష్టి కలుగకున్నను ప్రజల కుత్సాహము కలిగెను. ఏలనఁగా తమ శక్తికి మించిన ఫలమును వారు పడసి రనుకొనిరి. రాజనీతివలన దుఃఖము కలుగుచో దానిని నివారించు మార్గము తమకు దొరకె ననుకొనిరి. వారి యుత్సాహమునకీ జ్ఞానము చాలును.

కాని ఖేడాప్రజకు సత్యాగ్రహస్వరూపము తిన్నగా తెలియదు. కావున వీరికి చిక్కులు వాటిల్లినటులు మన ముత్తరప్రకరణములఁ జూడఁగలము.

౨౬

ఐక్యమునకు ప్రయత్నము

ఖేడాలో సత్యాగ్రహము జరుగుచున్నప్పుడు మహాయుద్ధముగూడ జరుగుచుండెను. దాని సంబంధమున వైసరాయిగారు నాయకులను ఢిల్లీ కాహ్వానించిరి. నన్నుఁగూడ రమ్మని పట్టుపట్టిరి. నాకును, లార్డ్ ఛేమ్స్‌ఫర్డునకును మైత్రి కలదని లోఁగడనే వ్రాసియుంటిని.

నే నీ యాహ్వానము నంగీకరించి ఢిల్లీకివెళ్లితిని. నే నిందు కలుగఁజేసికొనుట కొక సంకోచము కలదు. అలీసోదరులును, లోకమాన్యులగు నితరనాయకులును దీని కాహ్వానింపఁబడకుండుటయే నా సంకోచమునకు ముఖ్యకారణము. ఆసమయమున అలీసోదరులు చెఱలో నుండిరి. నేను వారిని గురించి యెక్కువగా వినియుంటినిగాని ఒకటి రెండుమారులే చూచియుంటిని. వారి సేవను గూర్చియు, ధైర్యమును గూర్చియు పలువురు చెప్పఁగా వినియుంటిని. హకీమ్‌సాహెబుతో నాకు పరిచితి కాలేదు. స్వ. ఆచార్య రుద్రులును, దీనబంధువు ఆండ్రూజుగారును వీరిని మిగుల ప్రశంసింపఁగా వినియుంటిని. లక్నోలో జరిగిన ముస్లిమ్ లీగునందు శ్వేబ్ కురేశీగారితోడను, బారిస్టరు ఖ్వాజాగారితోడను పరిచయము సంపాదించితిని. డాక్టరు అన్సారీ, డాక్టరు అబుల్ రహమాను గారలతో సంబంధమును బంధించుకొంటిని. మంచి ముసలమానుల మైత్రి నన్వేషించుచుంటిని. పవిత్రులు, దేశభక్తులు నగు ముసలమానుల చెలిమి కలిగి ముసలమానుల అంతర్యమును కనుఁగొనఁ దలఁచితిని. కావున ముసలమానులు న న్నెక్కడికి రమ్మనిన నక్కడికి వెళ్లుచుంటిని.

హిందువులకును, ముసలమానులకును సత్యమగు స్నేహము లేదని దక్షిణ-ఆఫ్రికాలోనే నాకుఁ దెలియును. ఈ యిరువురకును నడుమఁ గల భేదమును పోఁగొట్టుటకు నే నే యుపాయమును విడనాడలేదు.

ముఖస్తోత్రము చేసి గాని, స్వత్వమును గోలుపడిగాని రాజీపడుట నా కస్వాభావికము. వీరి నైకముచేయుటలో నా యహింస కొరపిడి కలుగు ననియు, దీనికి విశాలప్రయోగ మేర్పడు ననియు నేను దక్షిణ-ఆఫ్రికాలో నున్ననాఁటనుండియు అనుకొనుచునే వచ్చుచుంటిని. ఆ నమ్మక నేఁటికిని అటులనే యున్నది. ఈశ్వరుఁడు ప్రతిక్షణమునను ఒరపిడి కలుగఁజేయుచునే యున్నాఁడు. నా ప్రయోగము నడుచుచునే యున్నది.

ఇట్టి యాలోచనలతో నేను బొంబాయిరేవున దిగితినిగావున అలీసోదరులను జూడవలయు ననుకొంటిని. మా చెలిమి పెరుఁగఁ జొచ్చెను. మా చెలిమి యింకను లెస్సగాఁ బెనవైచికొనకముందే సరకారువారు అలీసోదరులను జెయిలో నిడిరి. బేతుల్ జైలునుండియు, ఛిందవాడా జైలునుండియు అభ్యనుజ్ఞ కలిగినపు డెల్ల మౌలానా మహమ్మదలీగారు నాకు పెద్దపెద్ద యుత్తరములు వ్రాయుచుండెడివారు. నే నలీసోదరులను జూచుట కనుజ్ఞ వేఁడితినిగాని యనుజ్ఞ పుట్టదయ్యె.

అలీసోదరులు జైలుకు వెళ్లినతరువాత ముసలమాను సోదరులు నన్ను కలకత్తాలో జరిగిన ముస్లిమ్ లీగునకుఁ దీసికొనిపోయిరి. నన్ను వా రుపన్యసింపఁ గోరఁగా అలీసోదరులను విడిపించికొనుట ముసలమానుల ధర్మమని ప్రబోధించితిని.

అటుపిమ్మట వా రన్నలీఘుడ్ కాలేజికిఁ గొంపోయిరి. మాతృదేశమును సేవించుటకు ఫకీరులం కండని నే నచట పిన్నవారలకుఁ దెలిపితిని.

౨౩. ఐక్యమునకు ప్రయత్నము

పిదప నే నలీసోదరుల విడుదలనుగుఱించి సర్కారువారితో పత్రవ్యవహారమును సాగించితిని. ఈ సంబంధములో ఖిలాఫతును గుఱించిన వీరి ప్రవృత్తి నవగతము చేసికొంటిని. ముసలమానులతో చర్చించితిని. నేను ముసలమానులకు నిక్కపు నెచ్చెలి నగుదునేని అలీసోదరులను విడిపించుటకును, ఖిలాఫతును పరిష్కరింపఁజేయుటకును పూర్తిగా పాటుపడితీరవలయు ననుకొంటిని. ఖిలాఫతును గుఱించి యడుగుట నాకు చాల సహజ మనిపించెను. దాని గుణదోషముల గుఱించి విచారించుటతో నా కెట్టి పని కనఁబడలేదు. దీనిని గూర్చి ముసలమానులు ప్రార్థించుట నీతివిరుద్ధము కానిచో నే నిఁక దీనికి మద్దతు చేయవలసినదే యున్నది. మతవిశ్వాస మన్నింటికిఁ పైది. ఒక వస్తువునుగుఱించి అందఱి విశ్వాసము నొకటియే యగుచో నిన్ని మతములతోఁ బనిలేదు. ఒక మతమే యుండును. ఖిలాఫతునుగుఱించి ప్రార్థించుట నాకు నీతివిరుద్ధముగా తోఁపలేదు. ఇంతియకాక బ్రిటిష్ ప్రధానమంత్రి లాయిడ్ జార్జిగూడ నీ ప్రార్థన నంగీకరించెను. కావున ఆతఁ డిచ్చిన మాటను నెఱవేర్పఁజేయవలయు ననియు ననుకొంటిని. ముసలమానుల కోరికయందలి గుణదోషములను పరీక్షించుట నా యంతరాత్మను తృప్తిపఱచుకొనుటకే గాని ప్రధానమంత్రి తేటతెల్లముగనే బాసచేసెను.

ఖిలాఫతు విషయమున నేను ముసలమానులతోఁ జేరినందులకు మిత్రులును, విమర్శకులును నన్ను తెగ విమర్శించిరి. వీని నన్నియు విచారించి చూచిన పిదపఁగూడ నా యభిప్రాయమును మార్చికొనవలసిన పని నాకుఁ గానరాలేదు. ఇందులకు పశ్చాత్తాపము చెందవలసిన పనియుఁ గానరాలేదు. నేఁడు ఇట్టి చిక్కు మఱి యొకటి వచ్చునేని నా యాచరణ మీరీతిగనే యుండఁగలదు.

ఇట్టి యాలోచనలు కడుపునం బెట్టుకొని నేను ఢిల్లీ కేగితిని. ముసలమానుల యిక్కట్టులంగూర్చి వైస్రాయితో మాటలాడం దలంచితిని. నాంటి కింకను ఖిలాఫతు ఒక సంపూర్ణస్వరూపమునకు రాలేదు.

నేను ఢిల్లీకి చేరంగనే దీనబంధు ఆండ్రూజుగారొక పూర్వపక్షము చేసిరి. ఇంగ్లండు ఇటలీల నడుమ నొక గుప్తసంధి జరుగుచున్నదని ఇంగ్లీషుపత్రికలలో ప్రకటితమాయెను. కావున ఆండ్రూజుగారు 'ఇట్టి గుప్తసంధు లింగ్లండునకును, ఇతరదేశములకును జరుగుచున్నపుడు మీ రీ సభలో పాల్గొనుట నీతివిరుద్ధము కాదా?' యని నన్నడిగిరి. నాకీ గుప్తసంధి సంగతి తెలియదు. కాని దీనబంధువు చెప్పినం జాలును. కావున ఆ సభలో నేను పాలుగొనుటకు శంకించుచుంటి నని లార్డ్ ఛేమ్స్‌ఫర్డుకు వ్రాసితిని. ఈ విషయమును గుఱించి చర్చించుట కతండు నన్నుం బిలువనంపెను. ఇతని తోడను, ఇతని కార్యదర్శి మెఫీతోడను దీర్ఘముగా చర్చించితిని. తుట్టతుదకీ సభలో పాలుగొనుట కంగీకరించితిని. వైస్రాయిగారి వాదసంక్షేప మిది: 'బ్రిటిషుమంత్రిమండలి చేయు ప్రతి పనియు వైస్రాయికి తెలిసియుండు నని మీ రనుకొందురా? బ్రిటిషు సర్కారువా రెన్నండును పొరపాటు చేయ రని నేనుగాని మఱి యెవరుగాని నిర్ధారింపం జాలరు. మొత్తముమీంద బ్రిటిషు పరిపాలనము లోకమునకు కల్యాణము కలుగంజేయు ననియు, మొత్తముమీంద హిందూదేశము బ్రిటిషుసంబంధమువలన లాభము బడసె ననియు మీ రంగీకరింతురేని బ్రిటిషు రాజ్యమున కిట్టి యాపత్సమయమున సాయము చేయుట ప్రతివానికిని రమ్మని మీ రెలుం గత్తి చెప్పరా? బ్రిటిషుపత్రికలలో గుప్తసంధినిగుఱించి నేనును

జదివియుంటిని. దీనివిషయ మింతకన్న నెక్కువగా నాకును దెలియ దని ప్రమాణపూర్వకముగా౯ జెప్పుచున్నాను. పత్రిక లెన్ని గప్పాలు ప్రకటించునో మీకును దెలిసిన విషయమే. పత్రికలలో వచ్చిన యొక చెడు మాటవలన మీ రిట్టి యాపత్సమయమున సాయపడుట మానుకొందురా? యుద్ధము ముగిసిన తరువాత నీతిని గూర్చి మీయిష్టము వచ్చినన్ని ప్రశ్నలు వేయవచ్చును; మమ్ము లను కావలసినంత విమర్శింపవచ్చునుగాని నేఁడుమాత్రము కాదు.'

ఈ వాదము క్రొత్తది కాదు. కాని ఆ సమయమున, ఆ రూప మున నా కది క్రొత్తగా౯ గానిపించెను. నేను సభకు వచ్చెద నని యంగీకరించితిని. ఇఁక ఖిలాఫతును గురించి వైసరాయికి కమ్మ వ్రాయుటకు నిశ్చయించితిని.

౨౬

యుద్ధమునకు జనులను పోగుచేయుట

సభకు నేను హాజరయితిని. యుద్ధమునకు మనుష్యులను పోగు చేయవలయు ననుప్రస్తావమును నాచేత సమర్థింపఁ జేయ వలయునని వైసరాయికిఁ జాల నిచ్ఛ యుండెను. నేను హిందీ, హిందూస్థానీ భాషలలో మాటలాడుదు నని ప్రార్థించితిని. వైసరాయి గా రందుల కంగీకరించుచు నింగ్లీషులోఁగూడ మాటలాడుఁగోరిరి. అచట దీర్ఘముగా నుపన్యసించవలసిన పని లేదు. నే నీ వాక్యము చెప్పితిని: 'నాకుఁ గల కార్యభారమును చక్కఁగా గ్రహించి నే నీ ప్రస్తావమును సమర్థించుచున్నాను.'

హిందూస్థానీలో మాటలాడినందుకు నాకుఁ జాల ధన్యవాదములు వచ్చెను. వైసరాయిగారి సభలో నే మెఱిఁగినంతవఱకు హిందూస్థానీప్రసంగమున కిదియే ప్రథమదృష్టాంత మని యంద అనుకొనిరి. ఈ ధన్యవాదములకును, ఈ ప్రథమదృష్టాంత మను మాటకును నా మనసు నొచ్చెను. నేను సిగ్గిలితిని. ఔరా మన గతి! మన దేశమునందు, మన దేశమునకు సంబంధించిన సభయందు, మన భాషను బహిష్కరించి యవహేళన చేయుట యెంత దుఃఖవార్త! ఓహో! నే నొకటి రెండు హిందూస్థానీ మాటలు మాటాడినంతనే నాకు ధన్యవాదములా? ఈప్రసంగము మన దుర్దశను తెలుపదా? సభలో పలికిన యొక వాక్యమే నా కింత గౌరవము తెచ్చిపెట్టెను. నే నా సభనుగాని, నా సమర్థనమునుగాని మఱవఁజాలను. ఢిల్లీలో నా చేయవలసిన పని యొకటి కలదు. వైసరాయి కొక యుత్తరము వ్రాయవలసియున్నది. అది తేలికపనిగా తోఁచలేదు. సభకు నే

నెందులకు వెళ్లితినో, యెటులు వెళ్లితినో, భవిష్యదాశ యెట్టిదో, ప్రజలకును, సరకారువారికిని స్పష్టముగాఁ దెలుపుట యావశ్యకమని నే ననుకొంటిని.

వైసరాయికి కమ్మ వ్రాసితిని. అందు లోకమాన్య తిలక్, అలీ సోదరులను రావింపకుండుటకు నా ఖేదమును తెలిపితిని. మరియు ప్రజల కోరికలను, యుద్ధమువలనఁ బొడమియున్న ముసలమానుల కోరికలను నుల్లేఖించితిని. ఈ యుత్తరమును ప్రకటించుటకు వైసరాయి యనుమతి వేఁడితిని. వైసరాయి సంతోషపూర్వకముగా ననుమతించెను.

సభ యంత మొందఁగనే వైసరాయి సిమ్లా కరుగుటచే నే నీ కమ్మను సిమ్లాకుఁ బంపవలసివచ్చెను. టపాలోఁ బంపుచో నాలస్యమయిపోవును. ఈ యుత్తరము చాలఁ బ్రముఖమయినదని నా యుద్దేశము. ఎవరికో యొకరి కిచ్చి పంపుట కిష్టము లేదు. పవిత్రుఁడగువానిచేఁ బంపవలయు నని నా తలఁపు. దీనబంధు ఆండ్రూజుగారును, సుశీల రుద్రులును రెవ. ఐర్ లండ్ గారి పేరు సూచించిరి. 'చదివి చూచి కొందును. శుద్ధముగా నున్నదని తోఁచినయెడల నీ కమ్మను గొంపోవుదును' అని వా రనిరి. వారు చదివి చూచుకొనిరి; బాగున్నదని తీసికొనిపోవుదు ననిరి. రెండవతరగతి టికెట్టువెల యిత్తు నంటినిగాని వారు దాని కంగీకరింపక రేయి పయనమయినను ఇంటరులోనే వెళ్లిరి. వీరి నిరాడంబరత, సరళత, స్పష్టతయు నన్ను మోహింపఁ జేసెను. ఈరీతిగా పవిత్రపురుషుని చేతితోఁ బంపఁబడిన యీ కమ్మ నా యుద్దేశప్రకారము మంచి పనినే చేసెను. దీన నా మార్గము సరళమాయెను.

యుద్ధమునకు మనుష్యులను బ్రోగుచేయుట నా రెండవ పని. నే నీ యాచనను ఖేడాలోఁ జేయక మఱి యేడఁ జేయను! నా సహ

చరలముగాక మొదట మతి యెవరిని రమ్మందును? ఖేడా చేరఁగనే వల్లభభాయి మొదలగువారితో నాలోచించితిని. వారిలోఁ గొందఱు నా దరఖాస్తును సమ్మతింపలేదు. సమ్మతించినవారికిని పని జరుగు నని నమ్మకము లేదు. నేను రమ్మని కోరుచున్న ప్రజావర్గమునకును, గవర్నమెంటువారికిని ప్రేమ యన్నమాట లేదు. గవర్నమెంటువారి ఆఫీసరులవలన వారికిఁ గలిగిన దుఃఖానుభవము యింకను గుర్తు తప్పలేదు.

ఇటు లయ్యును వారు పనిచేయఁ దలఁచియే యుండిరి. కార్యారంభ మాయెను. వెంటనే సంగతిసందర్భములు నాకుఁ దెలిసి వచ్చెను. నా ఆశావాదమున* కాఘాతము కలిగెను. ఖేడాపోరాటమున వీరు తమ బండ్ల నుచితముగా మా కిచ్చియుండిరి. ఒక సేవకునకు నలుగు రయిదుగురు స్వయంసేవకులఁ బంపిరి. అటువంటిచో యిప్పు డద్దె యిచ్చినను బండికి కఱవాయెను. ఇఁక స్వయంసేవకుల మాట చెప్పవలయునా? మే మింతటితో ఆశ లుడుగ లేదు. బండ్లను విడిచి రెండుకాళ్ల బండ్లమీఁదనే పయనించితిమి. రోజు కిరువది మైళ్లు నడువవలసి వచ్చెడిది. మాకు బండ్లనే యొసఁగనిచో నిఁక భోజన మిడుదురా? అన్న మడుగుటయు నంత బాగుగా లేదు. కావున ఎవరి జోలెలో వారాహారమును గొనిపోవలయు నని నిశ్చయించితిమి. వేసవిగావున పడకసామానుతోఁ బని పట్టలేదు.

మేము వెళ్లిన చోటులనెల్ల సభలు జరిపితిమి. జనులు వచ్చెడివారు కాని యొకరో యిద్దరో సిపాయిలుగాఁ జేరెడివారు. 'మీ రహింసావాదులు గదా! అస్త్రములు దాల్పుఁ డని మా కెటులు చెప్పఁగలరు! సరకారువా రిండియా కేమి మే లొనరించిరి?

* Optimism

మహమ్మదీయులను వోడుదు రం డనుటకు వారికి మొగ మెటులు చెల్లును?' అని యీ రీతిగాఁ బ్రశ్నలను నామీఁద గుప్పెడివారు.

ఇటు లయ్యును మా సకలప్రయత్నము పనిచేసెను. తగినంతమంది సాఁవోసఁగిరి. మొదటి తుకిడీని బంపినపిదప మార్గము సరళ మగు నని యూహించితిని. 'ఈ కూటువయూఁక నెచట నుంపవలయు?' నని కమిషనరుతో నేను సంప్రతింపమొదలిడితిని.

కమిషనరులు ఢిల్లీనమూనాతో ప్రతిచోటను సభలు జరుపనారంభించిరి. అట్టి దొక సభ గుజరాతులోఁ గూడ జరిగెను. 'సహచరులతో రండ'ని నా కాహ్వానము వచ్చెను. మేము సభకు హాజరయితిమి. ఢిల్లీలోనే నాకు తక్కువ గౌరవము కలిగెనని కొంటిని. ఇక్కడ నంతకు తక్కువ. 'దేవరవారి దివ్యచిత్తము!' అని చేతులు నలుపుకొనవలసిన వాతావరణమునందు నాకు సుఖము లేదు. తుద కెటులో మాటలాడితిని. నే నిచటఁ గొంచెమెక్కువ సంభాషించితిని. నాసంభాషణమున ఆఫీసరుల ముఖస్తుతి లేదుగాని యొకటి రెండు చురుకు మాటలు కలవు.

సిపాయిలుగాఁ జేరవలసిన దని కొన్ని పత్రిక లచ్చొత్తించి యుంటిని. ఈ యాహ్వానమునఁ గల యొక విషయము కమిషనరుకు కటువుగా నుండెను. దాని సార మిది: "బ్రిటిషురాజ్యము మన కపకారము చేయఁ దలపెట్టిన చట్టములలోనికెల్ల మన జాతిని జాతిని అస్త్రరహితముగాఁ జేసిన చట్టము చట్టములలోనికెల్ల పాడు చట్టము. ఆరమ్సు ఆక్టును రద్దు చేయించుటకును, అస్త్రశిక్ష నేర్చికొనుటకును ఇది మనకు పుణ్యకాలము. ఈ యాపత్సమయమున నడుమతరగతి జను లిచ్ఛాపూర్వకముగా సాయపడుదు రేని యపనమ్మకము తొలఁగి

యస్త్రనిషేధ మూపసంహరింపఁ బడును." ఈ విషయము నెత్తి చూపి కమిషనరు 'మనకు మతభేదము లున్నను మీరు వచ్చుట నాకు సంతోషముకెను. నాకుఁ జేతనయినంత మంచిమాటలతో నా మత మును నేను సమర్థించుకొంటిని.

వైస్రాయిగారికి వ్రాయఁబడిన ఉత్తరపు సారాంశ మిదిగో:

యుద్ధసభకు వచ్చుటకు నేను వెనుకాడితినిగాని మీతో మాట లాడినపిదప నాకు సంకోచము పోయెను. నాకుఁ దమయెడఁగల మహాదరమే దీనికి ముఖ్యకారణము. ఈసభకు లోకమాన్యులగు తిలకు గారిని, మిసెస్ బిసంటును, అలీసోదరులను ఆహ్వానింపకపోవుటయే నేను రాకపోయిన కారణములలో ముఖ్యకారణము. వీరు చాల శక్తి కల నాయకులు. ఇట్టివారి నాహ్వానింపక సరకారువారు చాల పొర పాటు పడి రని నే ననుకొనుచున్నాను. అయినను దాఁటినది లేదు. ఆయాయీ ప్రాంతములలో జరుగు సభలకు వీరి కాహ్వానము పంప వచ్చును. ఎంత మతభేద మున్నను ఏరాజ్యమేనియు నిట్టి నాయకుల ననాదరింపఁజాల దని విన్నవించుకొనుచున్నాను. స్థితిగతు లిట్టు లుండుటవలన నేను కమిటీలో చేరఁజాలక పోతిని. సభలో ప్రస్తావన మును సమర్థించుటతోడనే సంతుష్టి పడితిని. నా యంపిన సూచనలను సరకారువా రంగీకరింతురేని వెంటనే నే నీ పనిలోఁ బ్రవేశింపఁగలుగుదు నని తలఁచుచున్నాను.

ఏ రాజ్యమునం దికముందు మేము సంపూర్ణముగా భాగ స్వాములము కాఁగలమని యాశ పెట్టుకొనుచున్నామో ఆ రాజ్యమున కాపద వచ్చినపుడు సాయపడుట మాకు ధర్మము. మరియు మేము సాయము చేసినచో మాకుఁ గావలసినదానిని వడిగాఁ బడయఁగల మను నాశయు మాకుఁ గలదు. కావున తమరు మా కాశపెట్టిన

౨౭ యుద్ధమునకు జనమును పోగుచేయుట

సంస్కరణములలో కాంగ్రెసు ముస్లిమ్ లీగుల ముఖ్యప్రార్థనలకును సమావేశము ఉండఁగలదని తలఁచుటకుఁ బ్రజలకధికార మున్నది. ఈ యుద్ధము జరుగుచున్నంతకాలము ప్రజలు హోమ్‌రూలు మొదలగు మాటలుఁగూడ మాటలాడకుండ జేయుటకుఁ బ్రయత్నించెదను. మరియు శక్తికలవారి నందఱను యుద్ధమునకుఁ బోవఁ బ్రేరణచేయుదును. ఇటులు చేయుటవలన భారతీయులు గొప్ప భాగస్వాములు కాఁగలరు. దీనితో వర్ణభేదము, దేశభేదమును సమసిపోఁగలవు.

చదువుకొనినవారిందు చాలఁ దక్కువగా నుపకరించు మార్గము బట్టి జనసామాన్యమునందు వీరికి పలుకుబడి తక్కువ. నేను హిందూదేశమునకు వచ్చినప్పటినుండియు జనసామాన్యమునందు చాల పరిచయము సంపాదించితిని. వీరికి హోమ్‌రూల్ సంపాదింపవలయునని గట్టి పట్టు గలదు. హోమ్‌రూలు లేనిచో జనుల కించుకయు సంతసము లేదు. హోమ్‌రూలు సంపాదించుట కెంత త్యాగము చేసినను తక్కువయే యనిపించుకొనునని వీరి యుద్దేశము. కావున సామ్రాజ్యమున కెంతమంది స్వయంసేవకులను సమకూర్పఁగలనో అంతమందిని సమకూర్పఁగలనుగాని ఆర్థికసాహాయ్యమునుగుఱించి నేను చెప్పఁజాలను. అయినను భారతదేశము తన శక్తికి మించియే ధన మొసఁగెనని నాకుఁ దెలిసినంతలోఁ జెప్పఁగలను. నేను ప్రాణము లొడ్డఁ దలఁచియే యుద్ధసభలోని ప్రస్తావమును సమర్థించితి నని చెప్పఁగలను. కాని మా స్థితి వేఱు. మేమే దుకాణమునను భాగస్వాములము కాము. మా సాయపుఁ బునాది భవిష్యదాశకుఁ దీయఁబడినది. ఆ యాశ యెట్టిదో విశేషరూపముగాఁ దెలుపఁ దలఁచుచున్నాను. నేను బేరములాడుట లేదు. మేమెందు నిరాశుల మగుదుమేని నేఁటివఱకును మాకుఁగల గౌరవమెల్లయు కల్లయయి పోవును.

మీలో మీకుఁ గల జగడములను మానుకొనుఁడని మీరు చెప్పిన మాటలకు ఆఫీసరులు చేసెడి బాధను, అత్యాచారమును సహింపుఁడని యర్థమగుచో నట్టి సహన మసంభవము. చేయవలయు నని యొక పద్ధతి పెట్టుకొని దాని ప్రకారము చేయు బాధ నెదురుకొని యరికట్టుట నా ధర్మము. కావున ఎవరికేనియు నావరింపవల దనియు, పూర్వ మెన్నఁడేని యాదరింపఁ బడని ప్రజాభిప్రాయము నాదరింప వలయు ననియు తమ రాఫీసరులకు సూచన చేయవలయును. చంపారణ్యమున నేండ్లతరబడి యున్న బాధను విరోధించి నేను బ్రిటిషు న్యాయముయొక్క సర్వమహత్వమును చాటితిని. సత్యమునకుఁగాను దుఃఖమును సహించు శక్తి కలిగినపుడు రాజ్యమునందు నిజమగు శక్తి లేదనియు, ప్రజాభిప్రాయమునందే కల దనియు ఖేడా ప్రజలు కనుఁగొనిరి. లోఁగడ రాజ్య మనిన శాపము వెట్టు ప్రజల కిపు డంత కోపము లేదు. సరకారువారు సవినయమగు నాజ్ఞోల్లంఘనమును సహించిరి కావున ప్రజాభిప్రాయము నింక నెంతమాత్ర మనాదరింప రని వీరికి విశ్వాసము కలిగెను. ఇ వన్నియు పరికించి చూడఁగా చంపారణ్యమునందును, ఖేడాయందును నా కావించిన పనులు యుద్ధమునకు సాక్షాత్సేవ యగుచున్నవి. 'నీ విట్టి పనులను మాను' మన్నచో గాలి పీల్చుకొనవలదని శాసించినటులే. నేను శస్త్రబలమునకు బదులు ఆత్మబలమును, అనఁగా ప్రేమబలమును లోకప్రియమునుగాఁ జేయుటలో సఫలుఁడ నగుదు నేని ముల్లోకము లెత్తివచ్చినను హిందూదేశము నెదురుగా నిలువఁబెట్టఁగలను. కావున అనేకసమయములందు దుఃఖమును సహించుట యను సనాతననీతి నా జీవనమునందు జీర్ణించిపోవునటులు నా యాత్మను నియమించుకొనుచున్నాను. మరియు నితరులనుగూడ నీ నీతినే యవలంబింపుఁ డని చెప్పుచున్నాను. మరియు నే నేమి యొనరించినను ఈ నీతి యద్వితీయమయిన దని తెలుపుటకే యొనరించుచున్నాను.

౨౬ యుద్ధమునకు జనమును పోగుచేయుట

తుట్టతుది మాట: ముసలమానుల రాజ్యములగుఱించి గట్టి మాట యిండని బ్రిటీషు-మంత్రులను తా మడుగవలయునని కోరుచున్నాను. ప్రతి ముసలమానునకును ఈ చింత కల దని తా మెఱుఁగియే యున్నారు. నేను హిందువునయియుండి వారి కష్టముల నూరక చూచుచుండఁజాలను. వారి దుఃఖములు మాకును దుఃఖములే. ముసలమానురాజ్యముల హక్కులఁ గాపాడుటలోను, వీరి ధర్మస్థలములను విచారించి యాదరించుటలోను, హిందూదేశము కోరిన హోమురూలు నిచ్చుటలోను సామ్రాజ్యక్షేమ మిమిడియున్నది. నా కాంగ్లేయులయెడఁ ప్రేమ కలదు గావున నే నీ కమ్మ వ్రాసితిని. మరియు ఆంగ్లేయులయందు నా కెట్టి నమ్మిక కలదో అట్టి నమ్మికనే ప్రతిహిందువునందును కలిగింపఁదలఁచుచున్నాను."

౨౮

మృత్యుపథము

యుద్ధమునకు జనులను పోగుచేయుటలో నా మేను చివికెను. బెల్లము, గుంపగాఁ జేసిన వేరుసెనగపప్పు, నిమ్మలు నా కానాఁటి ముఖ్యాహారము. వేరుసెనగ నధికముగా తినుట యపథ్యమని నాకుఁ దెలియునుగాని యధికముగనే తింటిని. దీనితో అతిసారము పుట్టెను. నడుమనడుమ నాశ్రమమున కరుగుట నాకు మామూలు. ఈమాత్ర మతిసార మే మంత చేయునని, నా మామూలు చొప్పున చీకటి పడువేళ నాశ్రమమున కరిగితిని. నే నా రోజులలో మందు వాడుట చాలవఱకు మానితిని. ఆనాఁ డుపవసించినచో తగ్గిపోవు నని నమ్మితిని. మఱునాఁటి ప్రొద్దున దేనిని ముట్టలేదు. దీనితో కొంత యుపశాంతి కలిగెను. ఇంకను ఒకటి రెండు లంఘనములు పడు నని నాకుఁ దెలియును. ఒకవేళ ఆఁకలి యగుచో ఫలరసము తక్క వే ఱేదియు పుచ్చుకొనఁగూడ దనుకొంటిని.

ఆనాఁ డేదో పండుగ. మధ్యాహ్నమునఁగూడ నేమియును గొన నని కస్తురబాయికిఁ జెప్పినటులు గుఱుతు. కాని కస్తురబాయి నన్ను మఱపించెను. నేనును మఱచితిని. నే నపుడే జంతువు పాలను త్రావుట లేదు. పాలనుండి పొడమిన ద్రవ్యములు గూడ నాకు నిషిద్ధములు గావున నేయిమజ్జిగలు గూడ నా కనుపాదేయములు. కాని నేతికిబదులు నూనె కలిపి యొక్క గోధుమపిండివంటకము నాకొఱకు ప్రత్యేకముగా కస్తురబాయి తయారుచేసెను. ఒక గ్లాసెఁడు మినుపకట్టుగూడ నాకొఱకు ప్రత్యేకింపఁబడెను. నా కివి యిష్టము. 'కస్తురబాయిమాట దక్కింపవలయును, నాలుకకుఁ

తృప్తిని చేయవలయును, శరీరరక్షణమును జూచుకొనవలయును' అని తలంచితిని. కాని ఎప్పుడా యని సైతాను నా నోటిముందే కాచికొని యుండెను. తినఁ దొడఁగితిని. కొంతవఱకుఁ దింటిని. రుచి తీరెను. యమునకు చీటి వెళ్లెను. తిని గంట కాకమునుపే అతిసారము ప్రకోపించెను.

రాత్రికి నడియాదు చేరవలయును. సాబరమతీ స్టేషనువఱకు నడచితిని. ఆ మైలుంబావు దూరముగూడ నాకు నడచుటకుఁ గష్టమాయెను. అమదాబాదు స్టేషనులో వల్లభభాయి నన్నుఁ గలిసెను. నాకు నొప్పి యెక్కుటమాయెను. నేను నలిగియుంటి నని యతఁడు గ్రహించెను. కాని ప్రాణాంతకమగు నీబాధ నితనికిఁ గాని, యొరులకుఁగాని నేను తెలియనీయలేదు.

సుమారు పదిగంటలకు నడియాదు జేరితిమి. స్టేషనుకును అనాథాశ్రమమునకును అరమైలులోపు. ఇది నాకు పదిమైళ్లనిపించెను. చచ్చి చెడి బసకు చేరితిని. బాధ పెరిఁగిపోవుచుండెను. నిముస నిముసమునకును అనుమానము కలుగుచుండెను. దానితో నిఁక నిలువలేక పోతిని. నా బాధ నందఱకును జెప్పివైచితిని. పడక వేసితిని. ఇంతవఱకు మలుఁగుదొడ్డి కరుగుచుంటిని. అపుడు కమోడు గోరితిని. ఇందులకు చిన్నతనముగానే యుండెనుగాని కోరక వీలు లేకపోయెను. ఫూల్ చందుగారు మెఱుపువలెపరుగిడి కమోడు తెచ్చిరి. సహచరు లందఱును విన్నఁబోయి నా చుట్టును మూఁగిరి. వీరి ప్రేమ యపారము. కాని నా బాధ తీసివేయఁగలరా? పైఁగా నా పట్టుదలకు పారము లేదు. ఇది వారి సంతాపమునకు మఱికొంచెము తోడు. వైద్యుని పిలుచుకొని వత్తు మనిరి. నే వలదంటిని. మందు పుచ్చుకొనను, చేసిన పాప మనుభవింతు నంటిని. నా సహచరులు దీని నంతయు దుఃఖముతో

సహించిరి. ఇరువది నాలుగు గంటలలో ముప్పది నలుబది సారు లావలికి వెళ్లవలసివచ్చెను. భోజనము మానితిని. గత దినముల ఫలరసముఁగూడ మానితిని. హితవుకు లేదు.

నేఁటివఱకు రాతివంటి దనుకొన్న నా శరీర మప్పటి కప్పుడు మట్టికన్న హీన మయిపోయెను. ఉన్నశక్తి యంతయు మటుమాయ మాయెను. డాక్తరు కానుగా గారు విచ్చేసిరి. మందు గొనుఁడని బతిమాలిరి. నే నొప్పుకొనలేదు. ఇంజెక్ష నిత్తు మనిరి. వల దంటిని. అపుడు నా కింజెక్ష ననినఁ దెలియమి నవ్వుచేటు. అది దేనిదో రసి యనుకొంటిని. కాని పిదప నది యొక హోమపధీరసమని తెలిసెనుగాని తెలియుసరికి అక్కఱ దాఁటిపోయెను. విరేక మాఁగలేదు. అలపు వలన కాఁకతగిలి సంధించెను. మిత్రులు గడబిడపడి డాక్తరులను బిలిచిరి. వారు వచ్చిరిగాని వారిమాట వినని యీ కొఁపనగొయ్యి కెటులు కుదుర్చఁగలరు?

సేఠు అంబాలాలుగారును, వారి ధర్మపత్నియు నడియాదు వచ్చిరి. నా మిత్రులతో నాలోచించి అమదాబాదులోని తమ మీర్జాపురపుబంగళాలోనికి మిగుల జాగ్రత్తతోఁ దీసికొనిపోయిరి. నా కీ వ్యాధిలో జరిగిన యీ నిర్మలనిష్కామసేవకంటె నధికమగు సేవ యెవరికిని జరుగదు. ప్రతిదినమును జ్వరము కొంచెముగాఁ దగులుచు వచ్చెను. శరీరము శుష్కించికొనుచుఁబోయెను. ఇంకను కొన్నాళ్లపా టిటులే యుండినచో లేవలేని స్థితి వచ్చు ననుకొంటిని. అంబాలాలుగారి బంగళాలో నింతప్రేమతో, వేయి కనులతో నిటులు నేను చూడఁబడుచున్నను మనసు నిలువక ఆశ్రమమునకుఁ బంపుమని కోరితిని. నా పట్టుదల కతఁడు న న్నాశ్రమమునకుఁ గొంపోయెను.

౨౯ మృత్యుపథము

నే నిటు లాశ్రమమున మంచముపైఁ బడి యటు నిటు కొట్టుకొనుచుండఁగా 'జర్మనీ సంపూర్ణముగా ఓడిపోయె' ననియు, నిఁక జనమును పోగుచేయ నక్కఱ లేదనియు కమిషనరు కబురు చేసెననియు వల్లభభాయి వార్త తీసికొనివచ్చెను. నే నంతటితో జనమును పోగుచేయవలయు ననుచింతఁ బాసితిని. దీన శాంతి కలిగెను.

జలచికిత్సచే శరీరము కొంచెము నిలువఁబడియుండెను. అతిసార మాఁగిపోయెను. కాని బలము పట్టలేదు. వైద్యులు, డాక్టరులును పలురకముల సలహా లొసఁగిరి. కాని నే నే మందును గొననెంచలేదు. ఇరువురు మూవురుమిత్రులు పాలమీఁద ఒట్టున్నది గాన మాంసరసము గ్రోలు మనియు, మందుగా మాంసము గొన్నచో హాని లేదనియు యాయుర్వేదమునుండి ప్రమాణము లీయఁదొడఁగిరి. ఒక మిత్రుఁడు కోడిగ్రుడ్లఁ దిను మనెను. కాని నే నీ యుపదేశములలో దేని నేని గయికొనలేదు. అన్నింటికిని నా జవా బొకటియే.

నేను శాస్త్రమును ప్రమాణముగాఁ గొని ఖాద్యాఖాద్య నిర్ణయము గావింపలేదు. అది నా జీవనముతోపాటు స్వతంత్రముగా నిర్మిత మాయెను. ఆ వస్తువు నీ వస్తువును దిని బ్రతుకవలయు ననులోభము సుంతయు నాకు లేదు. నా పుత్రులకు, నా భార్యకు, నా మిత్రులకు విధించిన ధర్మమును నా దగ్గఱకు వచ్చినపుడు నే నెటులు మానుకొందును!

ఇంత దీర్ఘవ్యాధి నాజీవితమున నిదియ మొదలు. ధర్మమును పరీక్షింపను, పట్టిచూడను నాకీ వ్యాధి యలభ్యయోగముగా తటస్థించెను. ఒక రాత్రి నే జీవింప ననుకొంటిని. మృత్యుదేవత నాయెదుట నిలువఁబడినటు లుండెను. శ్రీ అనసూయా బహేనుకు

వార్త పంపితిని. ఆమె పరువెత్తుకొని వచ్చెను. వల్లభభాయి వచ్చెను. డాక్టరు కానుగాగారు వచ్చి నాడి చూచి 'ఇప్పుడు భయపడవలసిన చిహ్న మిసుమంతయు నాకుఁ గానరాదు. నాడి బాగుగా నున్నది. బలము లేమివలననే మీ కీ యలజడి' యని చెప్పిరి. కాని నేను నమ్మ లేదు. ఆరాత్రి గడచెను. నా కా రేయి నిదుర లేదు.

ప్రాతఃకాలము. మృత్యువు రాలేదు. కాని బ్రతుకఁగల ననునాశ నాకుఁ గలుగలేదు. మృత్యు వాసన్నముగా నున్న దని తలఁచితిని. నా మిత్రుల వలన గీతలను వినుచు ఉన్నకాలము నుపయోగించుకొన నెంచితిని. ఏ పనికిని శక్తి లేదు. చదువుటకేని శక్తి లేదు. మాటాడుట కిచ్ఛ లేదు. ఒక్కమాట పలికినను తల గిర్రు మనును. బ్రదిమిలో తీపి పోయెను. బ్రతుకుటకొఱకే బ్రతుకుట, అనఁగా ఊరక బ్రతుకుట యనుమాట నాకు గిట్టదు. పని పాటలు లేక, మిత్రులచే చాకిరి చేయించికొనుచు మెల్లమెల్లగా చివికి పోవు దేహమును జూచికొనుచు కూరుచుండుట నాకుఁ గష్టముగాఁదోఁచెను.

నే నిటులు మృత్యువునకు కని పట్టుకొని యుండఁగా డాక్టరు తల వలకరుగారు విచిత్రమగు నొకజంతువును వెంటఁబెట్టుకొని వచ్చిరి. ఆ విచిత్రజంతు వొక మహారాష్ట్రుఁడు. అతనికి హిందూస్తానీ రాదు. చూచే చూడఁగనే నావంటి వికారపువాఁడే యని తోఁచెను. అతఁడు తన వైద్యమును నామీఁద నుపయోగింప వచ్చెను. అతఁడు గ్రాంట్ మెడికల్ కాలేజీలో విద్యనంతయు పరిపూర్తి చేసికొనెను గాని డిగ్రీ పుచ్చుకొనకుండ వచ్చివేసెను. ఇతఁడు బ్రాహ్మసామాజికుఁడని నా కిటీవలఁ దెలిసెను. అతని పేరు కేలకర్. స్వభావముచేఁ గడు స్వతంత్రుఁడు. మంచువైద్యమునం దతనికిఁ గడు నమ్మకము. నా జబ్బు విని తన వైద్యము నాకు చేయ వచ్చిననాఁటనుండి

యితనికి 'ఐస్ డాక్టరు' అను బిరు దిచ్చితిమి. ఇతనికిఁ దన యభిప్రాయములయెడ పట్టుదల మిక్కుటము. డిగ్రీ గల డాక్తరులకు దెలియని కొన్ని విషయములు తాను దెలిసికొనె నని తన విశ్వాసము. తన నమ్మక మితఁడు నాకుఁ గలిగింపఁజాలకపోవుట మా యిరువురకును చింత్యము. నే నొక వాద్దుకఱి కీతని పద్ధతి నమ్మదును. ఇతఁడు కొన్ని సిద్ధాంతములను తొందరపడి కావించె నని నా యభిప్రాయము.

అతఁడు కనుఁగొనిన విషయములు నిక్కములగుఁగాక, కల్లలగు గాక! నా శరీరము నతని వైద్యపరీక్ష కిచ్చితిని. బాహ్యోపచారములచే నారోగ్యము గొనుట నా కభిమతమే. ఇంతియకాక మంచువైద్య మనఁగా జలవైద్యమే. కావున నా శరీరము నంతయు మంచుతో తోమ మొదలిడెను. అతఁడు చెప్పినంత ప్రయోజనము నా శరీరమునఁ గలిగె నని నమ్మకున్నను మృత్యువునకు కాచుకొని యున్న నేను బ్రతుకు తెన్ను పట్టితిని. కొంచె ముత్సాహము కలుగఁజొచ్చెను. మానసోల్లాసముతో పాటు శారీరకోత్సాహమును గనుపట్టఁ జొచ్చెను. ఆఁకలి పుట్టెను. పది పదియేను నిమిషములు నడయాడఁ దొడఁగితిని. 'ఇఁక గ్రుడ్లరసముఁ గొనుఁడు! ఇంత కెక్కుడు పాటవము రాఁ గలదు. నా కిట్టి నమ్మిక కలదు. గ్రుడ్లు పాలవలె నిర్దోషములు. అవి మాంసకోటిలోఁ జేరవు. గ్రుడ్లన్నియు పిల్లలు కావు. పిల్లలు కాని నిర్బీజము లగు గ్రుడ్లంగళ్లలో దొరకును. వానిని దినఁ దప్పిదము లేదు' అని కేలకరుగారు నమ్మి చెప్పిరి. నిర్బీజములగు నండములఁగూడ నేను గొనవొల్ల నయితిని. కావలసిన పనులు కొంచెము కొంచెము చేసికొనఁగలుగుటకు నా కిపుడు కలిగిన బలము చాలును.

౨౯

రౌలతు చట్టము - నా ధర్మసందేహము

మాథేరాను పోవుచో నారోగ్యము కలుగు నని మిత్రులు చెప్పఁగా విని యచటి కేఁగితిని. కాని యచటి నీళ్లు బరువు. నావంటి రోగి కవి పడవు. అతిసారముచే మలద్వారము దుర్బల మాయెను. అచట పుండగుటచే మలము విడుచునపుడు మితి లేని బాధ కలిగెడిది. కావున తినుటయన్న భయము పుట్టెను. ఒక వారములో మాథేరానునుండి మరలి వచ్చితిని. శంకరలాలుగారు నా యారోగ్యమునకు శ్రద్ధఁ బూనిరి. దలాలుగారి సలహా గొనుఁడని పట్టుపట్టిరి. డాక్టరు దలాలుగారు దయ చేసిరి. విషయమును వెంటనే గ్రహింపఁగల వీరి శక్తికి నే నచ్చెరువొందితిని. వీ రిటు లనిరి:

'తాము పాలు గొననంతవఱకు తమ శరీరము బాగుపడదు. కావున మీరు పాలు గొనవలెను. ఇనుము, పాషాణము వీనికి సంబంధించిన ఇంజెక్షనులఁ గొనవలెను. ఇటులగుచో మీ శరీరము యథాప్రకారము కాఁగల దని నేను గ్యారంటీ యీఁగలను.'

'ఇంజక్షనులు చేయించికొందును గాని పాలు త్రాగను' అని నే నంటిని.

'మీ ప్రతిజ్ఞాశరీక మెట్టిది?' అని దలాలుగా రనిరి.

'ఆవులకును, గేదెలకును ఫూకా తగిలించి దాని పా లొద్దు ప్రక్రియ చేయుచున్నారు. ఈ సంగతి వినఁగా పాలపై తిరస్కారము కలిగెను. మరియు క్షీరము మనుష్యుని కాహారము కాదు గాన నేను క్షీరసన్న్యాసము గావించితి'నని యంటిని.

౨౯. రౌలతుచట్టము-నా ధర్మసందేహము

'అటు లగుచో మేఁకపాలు పుచ్చుకొనవచ్చునుగదా' యని నామంచముకడ నిలువఁబడియున్న కస్తురబాయి యనెను.

'మేఁకపాలు పుచ్చుకొన్నచో నాకుఁ జాలు' నని దలాలుగా రనిరి.

నేను లొంగి పోయితిని. సత్యాగ్రహసంగరపు సమ్మోహము నాకు జీవనలోభమును కలిగించెను. నేను ప్రతిజ్ఞాక్షర పాలనముతో సంతసించి ప్రతిజ్ఞాత్మహనన మొనరించితిని. ప్రతిజ్ఞాసమయమున నాకు గవ్యబుద్ధియు మాహిషబుద్ధియే యుండెను. అయినను ప్రతిజ్ఞాశరీరము క్షీరసామాన్యమునే చెప్పును. మనుష్యునకు క్షీరము సహజమగు నాహారము కాఁజాల దని నే ననుకొనునంతవఱకును నాకు పాలు త్రాగుట కధికారము లేదు. ఇది యెల్లయు నాకుఁ దెలిసియున్నను మేఁకపాలు పుచ్చుకొనుటకు సంసిద్ధుఁడ నయితిని. సత్యపూజకుఁడు సత్యాగ్రహసంగ్రామము నడపుటకు బ్రతుకఁదలఁచి సత్యమునకు బురద పూసెను.

దాన నామనసులో పుండింకను పూఁడలేదు. మేఁకపాలు విడుచుటను గూర్చి నే నింకను విచారించుచునేయుంటిని. మేఁకపాలు త్రావుచు దినదినమును దుఃఖము ననుభవించుచునే యుంటిని. కాని సేవ చేయవలయు నను అతిసూక్ష్మమగు మోహము నన్నుఁ బట్టుకొని విడుచుట లేదు. అహింసాదృష్టితో ఆహారమును గుఱించిన పరిశోధనములు నాకుఁ బ్రియతరములు. వానివలన నా కానందము కలుగును; వినోదముకూడఁ గలుగును. అహింసాదృష్టిచే మేఁకపాలు నాకుఁ గష్టము కలిగింపవు గాని సత్యదృష్టిచేఁ గలిగించును. నే నహింసకన్న సత్యము నెక్కువ తెలిసికొనఁగల నని నా మనస్సున భాసించుచున్నది. సత్యమును విడనాడితినేని అహింసాగ్రంథిని

ఎన్నటికిని విప్పఁజాల ననుకొనుచున్నాను. చేసిన ప్రతిజ్ఞయొక్క శరీరమును, ఆత్మను—శబ్దార్థమును, భావార్థమునుగూడఁ బరిపాలించు టయే సత్యపాలనము. ప్రకృతము నే నాత్మను—భావార్థమును నాశనము చేసితిని. ఇది ప్రతిదినము నాకు మనశ్శల్యముగా నుండును. ఇటు లిది యంతయు నాకుఁ దెలిసి యున్నను ప్రతిజ్ఞాసంబంధమున నా ధర్మ మెట్టిదో నాకుఁ దెలియుట లేదు. లేక, ప్రతిజ్ఞాపాలనమునకు నాకు ధైర్యము చాల దన్నమాట. ఈ రెండును ఒకటియే. ఏలన శంకామూలమున నమ్మకము లేదు. భగవంతుడా! నాకు నమ్మక మొసఁగుము!

మేఁకపాలు పుచ్చుకొన మొదలిడిన కొలఁది రోజులలో డాక్తరు దలాలుగారు మలద్వారమునందలి పుండు నాపరేషను చేసిరి. దాన ఫల మొదవెను.

నాలు గడుగులు వేయఁగల ననుకొంటిని. పత్రికలు చదువఁ దొడఁగితిని. రౌలతుకమిటీరిపోర్టు నా కంటఁ బడెను. అందలి విషయములు చూచి యదలిపోతిని. భాయి ఉమర్ శంకరలాలుగారలు వచ్చి మీ రేదో చేయుకతప్ప దనిరి. సుమా రొక నెలలో నే నహమదాబాదుకు వెళ్లితిని. వల్లభభాయి దైనందినము నాకడకు వచ్చుచుండెడివాఁడు. 'ఏదో యొకటి చేయవలె'నని నే నతనికి సూచించితిని. 'ఏమి చేయవలె?' నని యతఁ డనెను. 'కమిటీవారి యభిప్రాయములు లా యగునేని దాని నిరోధించుటకు ప్రతిజ్ఞ చేసి నిలువఁబడువారు పదిమంది దొరికినఁజాలు. సత్యాగ్రహ మారంభింతము. మంచమును పట్టుకొని యుండనిచో నే నొకఁడనే. ముందు పోరాడెదని నావెనుక పలువురు రాఁగలరు. ఈ దుర్బలస్థితిలో నే నీ పనికిఁ దగను' అని నే నంటిని.

౨౯ రౌలతుచట్టము-నా ధర్మసందేహము

ఈ ప్రసంగమునకు ఫలముగా నాకు సంబంధించినవారి నొక చిన్న సభగా సమకూర్చుటకు నిశ్చయము చేయఁబడియెను. రౌలతు కమిటీ-రిపోర్టులో ప్రకటింపఁబడిన సాక్ష్యమును బట్టి కమిటీవారు చేసిన సలహాలప్రకారము లా చేయవలసిన పని లేదని నాకుఁ దోఁచెను. ఆత్మగౌరవము కలవాఁ డెవఁడును ఈ లాను అంగీకరింపఁ జాలఁ డనియు నాకు స్పష్టముగాఁ దోఁచెను.

పిదప సభ జరిగెను. ఇరువది మందికిఁ గాఁబోలు-ఆహ్వానము పంపఁబడెను. వల్లభభాయిగాక వచ్చినవారిలో శ్రీమతి సరోజిని, మి. హార్నిమన్, స్వ. ఉమర్ సోబానీ, శ్రీ శంకర్‌లాల్ బాంకర్, శ్రీమతి అనసూయా బహేను మొదలగువా రుండి నటులు గురుతు.

ప్రతిజ్ఞాపత్రము తయారుచేయఁబడెను. వచ్చినవా రెల్లరును దానిమీఁద చేవ్రాలు పెట్టినటులే గుర్తు. అపుడు నేను పత్రికను నడపుట లేదు. అయినను అపుడపుడు నా యుద్దేశములను దినపత్రికలలోఁ బ్రకటించుచుంటిని. అపుడును అటులే ప్రకటింప మొదలిడితిని. శంకర్‌లాల్ బాంకరుగా రాందోళనము చేయఁ దొడఁగిరి. ఒక పనికి పునాది వేయుటయందును, దానికి బలము కూర్చుటయందును వారికిఁ గల శక్తి యపుడే నా కనుభవమాయెను.

అపు డున్న సంస్థలు సత్యాగ్రహమువంటి యొక క్రొత్త అస్త్రమును చేపట్టఁ గలుగుట యసంభవ మని తలఁచి సత్యాగ్రహ సభ యొకటి స్థాపించితిమి. బొంబాయివా రిందు చాలమంది సభ్యులుగాన దీనికి కేంద్రము బొంబాయిలోనే ఉంపఁబడెను. ప్రతిజ్ఞా పత్రికలమీఁద పలువురు చేవ్రాలు పెట్టఁ దొడఁగిరి. ప్రతిసంగతియు నప్పటి కప్పటికిఁ దెలుపు పత్రికలు వెలువడఁ జొచ్చెను. ప్రతిచోటును సభ లాయెను. ఇది యంతయు ఖేడాలడాయిని దలపించెను.

సత్యాగ్రహసభకు నే నధ్యక్షుండను. ఈ సభలో నున్న విద్యార్థికులకును, నాకును ఐక్యము కుదరలేదు. సభలో గుజరాతీ భాష నుపయోగించి తీరవలయు నని నే నంటిని. ఈ విషయమున కును, నా సూచించిన ఇంకొన్ని కార్యపద్ధతులకును వీరు విస్మితు లయిరి. అయినను వీరిలో పలువురు నా పద్ధతుల నవలంబించుట కుదా రత చూపి రని నే నొప్పుకొందును. కాని 'ఈ సభ యెంతకాలమో నిలువంజాల'దని నేను మొదటనే యనుకొంటిని. సత్యమునుగురించి, అహింసనుగురించి నేను నొక్కి చెప్పుట సభ్యులలో పలువుర కిష్టము కాదు. అయినను ఈ సభ మొదటమొదట బాగుగా పనిచేసెను.

౩౦

అద్భుతమగు హరతాళము

ఒకవంక రౌలతుకమిటీరిపోర్టునకు ప్రతికూలప్రచార మెక్కువగా జరుగుచుండఁగా, మఱియొకవంక కమిటీవా రిచ్చిన సలహాలను అమలులోనికిఁ దెచ్చుటకు సరకారువారి అనుకూల ప్రచారమును ఎక్కువగా జరుగుచుండెను. రౌలతు బిల్లు ప్రకటింపఁబడెను. నేను లెజస్లెటివ్ అసెంబ్లీ కెన్నఁడును వెళ్లియుండలేదు. ఈ బిల్లు చర్చింపఁబడునాఁ డచటికి వెళ్లితిని. శాస్త్రిగారు కూడ దని గంభీరముగా మందలించుచు మహోపన్యాస మొసఁగిరి. వారి వేఁడి వాగ్ధారకు వైసరాయిగారు కనులు పెట్టుకొని చూచుచుండిరి. వీరి యుపన్యాసప్రభావము వైసరాయిగారి మీఁద ప్రసరించె నను కొంటిని. శాస్త్రిగారినుండి వెచ్చని యావిరి వెళ్లి విరిసెను.

నిదురఁ బోవువానిని లేపవచ్చునుగాని దొంగనిదురఁ బోవు వాని చెవిలో డోలు వాయించియు లేపలేము. అచటి చట్టపుఁ జర్చ యొక ప్రహసనము. సరకారువా రా ప్రహసనమును ప్రదర్శించిరి. చేయవలసిన పనిని లోఁగడనే వారు నిశ్చయించుకొనిరి. కావున శాస్త్రిగారి మందలింపు మందునకును గొఱగాలేదు.

సవాకోటి బోడి జంగములలో ఈ బోడి జంగము నెవరు చూతురు? నేను వైసరాయిగారిని దర్శించితిని; చాల విన్నవించితిని. రహస్యములగు నుత్తరములు వ్రాసితిని; ప్రకటింపఁదగిన ఉత్తరములు వ్రాసితిని. 'నాకు సత్యాగ్రహముతక్క వేఱు దారి లే'దని వీనిలో తేటతెల్లము చేసితిని. కాని అంతయు వృథా.

ఇంకను బిల్లు గజెటులో ప్రకటింపఁబడలేదు. నాశరీరము దుర్బలముగా నున్నను దీర్ఘ ప్రయాణమునకు సాహసించితిని. సభకు వలయునంత బిగ్గరగా మాటలాడఁగల శక్తి నా కింకను గలుగలేదు. నిలిచి యుపన్యసింపఁగల శక్తి నేఁటివఱకును నాకు రానేలేదు. నిలువఁబడి యుపన్యసింపఁ దొడఁగితినా కొలఁది నిమిషములలోనే నాశరీర మంతయును కంపింపఁ దొడఁగి హృదయమునందును, ఉదరమునందును పోటు కలుగును. చెన్నపురినుండి వచ్చిన యాహ్వానమును అంగీకరింపవలయు నని తలఁచితిని. దక్షిణదేశము నాకు స్వగృహమనిపించును. దక్షిణ-ఆఫ్రికా సంబంధమువలన తెలుఁగువారు, అఱవవారు మొదలగువారిమీఁద నాకు హక్కు కలదని నే ననుకొందును. ఇటు లనుకొనుటలో పొరపా టున్న దని నా కింతవఱకును తోఁపలేదు. కస్తూరి రంగ అయ్యంగారికడనుండి నా కాహ్వానము వచ్చెను. ఈ యాహ్వానముచాటున శ్రీ రాజగోపాలాచార్యులుగా రున్నయటులు చెన్నపట్టణము చేరినతరువాత నాకుఁ దెలిసెను. వారితో నా కదే ప్రథమ పరిచయ మనుకొందును. కాకున్నను మేము పరస్పరము తెలిసికొనుట కదే మొదలు.

ప్రజాకార్యములలో నెక్కువ పాల్గొనుటకు కస్తూరి రంగ అయ్యంగారు మొదలగు మిత్రుల యామంత్రణముచే సేలము విడిచి రాజగోపాలాచార్యులుగారు చెన్నపురిలో వకాలతు చేయవచ్చిరి. వీ రున్న చోటుననే మా విడిది. ఆ గృహము కస్తూరి రంగ అయ్యంగారి దగుటచే మేము వారి యతిథులమే యని యనుకొంటిమిగాని రెండు మూఁ డ్నాళ్లకు మహాదేవ దేశాయి నా పొరపాటు దిద్దెను. రాజగోపాలాచార్యులుగారు మా కెడమెడముగనే యుండుచువచ్చిరి. కాని మహాదేవదేశాయి వారి పుట్టు పూర్వోత్తరము లన్నియుఁ దెలిసి

కాని 'మీరు రాజగోపాలాచార్యులవారితో పరిచయము చేసి చూడ వలయు'నని నాతో ననెను.

నేను వీరితో పరిచయము చేసితిని. వీరితో ప్రతిదినమును కర్తవ్యమునుగూర్చి ముచ్చటించుచుంటిని. అపుడు సభలు తక్క మఱియొక దారి నాచూపులో లేదు. రౌలెట్ బిల్లు లా యగుచో దానిని వినయముతో భంగించు టెటు లని యాలోచించితిని. సరకారువారు దానికి వీలు కలుగఁజేయుచో దానిని సవినయముగా భంగింపవచ్చును. ఇంకను ఏ చట్టములను మన మతిక్రమింపవచ్చును? అతిక్రమింపనగు నెడల అతిక్రమింపఁదగినవానికిని, అతిక్రమింపఁదగనివానికిని భేదక మేమిటి? ఇట్టి చర్చలు మాకు జరుగుచుండెడివి.

కస్తూరి రంగ అయ్యంగారు నాయకులను సభ కాహ్వానించిరి. ఇందు చాల చర్చ జరిగెను. అందు విజయరాఘవాచార్యులవారికి నిందు పాలు. చిన్న విషయమునుండియు పెద్ద విషయముదాఁక సత్యాగ్రహశాస్త్రమును రచింపవలయు నని వీరు కోరిరి. ఇది నా శక్తి మించిన దంటిని.

మే మిటు లాలోచనలు చేయుచుండఁగా బిల్లు గెజెటులో చట్టముగా ప్రకటింపఁబడెను. ఈ వార్త వచ్చిన నాఁటిరేయి ఆలోచించుచు పడుకొంటిని. మామూలు వేళకంటె వడిగా లేచితిని. అర్ధనిద్ర కాఁబోలును; కల వచ్చెను. ప్రొద్దుననే రాజగోపాలాచార్యులవారిని పిలిచి యిటులు తెలిపితిని :

'ఈ చట్టమునకు ప్రత్యుత్తరముగా మనము దేశములో హరతాళమును ప్రకటింపవలయు నను సూచనను నే కలగంటిని. సత్యాగ్రహ మాత్మశుద్ధికి పోరాటము. ఇది ధర్మయుద్ధము. ధర్మకార్యము శుద్ధితో నారంభించుట మేలు. హిందూదేశమునందలి ప్రజ లెల్లరు

నొక నాఁ డుపవసింతురు గాక! పనిపాటలు మానుదురుగాక! ముసలమానులు 'రోజా' వినాగా ఉపవసింపరు గాన నిరువదినాలుగు గంట లుపవసింపఁ గోరుచున్నాను. మన కన్ని ప్రాంతములవారును తోడుపడుదురో, పడరో చెప్ప వీలులేదుగాని, బొంబాయి మద్రాసు బీహారు సింధు దేశములవారు తోడుపడుదు రని నా కాశ గలదు. ఈ ప్రదేశము లన్నియు తగిన రీతిగా హరతాళ మొనరించినచో మనము సంతుష్టులము కావచ్చును.'

నా యీ మాట రాజగోపాలాచార్యులవారికి రుచించెను. పిదప వీరు మిత్రులకుఁ దెలిపిరి. అందఱును బాగుగా నున్న దనిరి. నే నొక చిన్న నోటీసును ప్రకటించితిని. ౩౦-౩-౧౯౧౯ నాఁడు హరతాళ మని నిర్ణయింపఁబడెను గాని పిదప ౬-౪-౧౯౧౯ కి మార్పఁబడెను. పని తొందరగా ప్రారంభింపవలసియుండుటచే లోకులకు కొలఁది యవకాశములోనే యీ సంగతి తెలుపఁబడెను.

కాని యిది యంతయు నిటులు జరుగు నని యెవ రనుకొనిరి! హిందూదేశమునం దెల్లెడల పట్టణములలో-పల్లెలలో నెటఁ జూచినను హరతాళమే. అది దర్శనీయము! అద్భుతము!

౩౧

ఆరోజులు (౧)

దక్షిణదేశమున కొంచెము సంచారము చేసి ౪ ఏప్రిలునకుఁ గాఁబోలు బొంబాయి చేరితిని. ౬ తేదీని గల కార్యక్రమము నెఱవేర్చుటకు బొంబాయి రావలసినదని శంకరలాల్ బాంకరుగారు నాకు తంతి యిచ్చిరి.

ఇంతకు ముందే మార్చి ౩౦ తేదీని ఢిల్లీలో హరతాళము జరిగిపోయెను. అచట శ్రద్ధానందులయు, అజమల్ ఖానులయు మాటయే ఆజ్ఞ. ఆఱవ ఏప్రిల్ వఱకును హరతాళ మాఁపవలయు నను సంగతి యచటి కాలస్యముగా నందెను. అట్టి హరతాళము ఢిల్లీ యెన్నఁడేని అనుష్ఠించియుండలేదు. హిందువులును, ముసలమానులును కలిసిపోయిరి. శ్రద్ధానందులు జుమా-మసీదున కాహ్వానింపఁబడిరి. ముసలమానుల కోరికచే వా రచట నుపన్యసించిరి. దీనికి సరకారు-ఆఫీసరుల కన్నులు కుట్టెను. ఈ హరతాళయాత్ర రైలుస్టేషనుదెసకుఁ బోవుచుండఁగా పోలీసులు తుపాకులు పేల్చిరి. కొందఱకు గాయములు తగిలెను; కొందఱు చచ్చిరి. ఈరీతిగా ఢిల్లీలో దండనీతి యారంభ మాయెను. వెంటనే రమ్మని నాకు శ్రద్ధానందులు వార్త నంపిరి. ఆఱవ తేదీని బొంబాయిలో కార్యక్రమమును పరిపూర్తిచేసికొనిన వెంటనే వత్తు నని నేను వారికి తంతి పంపితిని.

కొలఁది భేదముతో ఢిల్లీ ముచ్చటలే లాహోరు అమృతసరములలో జరిగెను. డా. సత్యపాలు కిచలూగారలు వెంటనే అమృతసరమునకు రమ్మని తంతి నంపిరి. నా కప్పుడు వారి పరిచితి లేదు. ఢిల్లీ వచ్చి పిదప అమృతసరమునకు రాఁగల నని వారికి తంతి పంపితిని.

ఆఱవ తేదీ ప్రొద్దున లక్షలకొలంది జనులు చౌపాటికడ సముద్రస్నానము చేసి యచటినుండి ఠాకుర్ ద్వారమునకు యాత్రగా బయలుదేరిరి. అందాడువారు, బాలురు, బాలికలును గలరు. ఇందు ముసలమానులును పలువురు పాలుగొనిరి. కొందఱు ముసలమాను సోదరులు దాపునఁగల యొక మసీదునకు మమ్మాహ్వానించిరి. నన్ను, సరోజినీదేవిని ఉపన్యసింపుమని కోరిరి. దేశభక్తికిని, హిందూ ముసలమానుల యైకమత్యమునకును ఆచట నందఱిచేత ప్రతిజ్ఞలు చేయింపవలయు నని విఠలదాస జేరాజణీగారు సూచించిరి. ఇంత వడిగా ప్రతిజ్ఞలు గొనుటకు నేను సమ్మతింపలేదు. ఇపుడు జరిగినదానితో సంతోషపడుట మంచి దని నేను సలహా యిచ్చితిని. బాస చేసిన తరువాత దానిని మీఱరాదు. దేశభక్తి యన నేమో లెస్సగా తెలిసికొనవలయును. హిందూముసలమానుల యైక్యమునకు పూన వలసిన భారము చాల దొడ్డది. దానిని బాగుగాఁ దెలిసికొనవలయును. ఇట్టి ప్రమాణములు తీసికొనఁ గోరువారిందులకుఁగాను మఱునాఁటి ప్రొద్దున చౌపాటికడ సమావేశము కావలయు నని నేను తెలిపితిని.

బొంబాయిలో సంపూర్ణహరతాళము—

చట్టమును శాంతముగా నతిక్రమించుటకు సంపూర్ణప్రయత్నము లొనరింపఁబడెను. రెండుమూడు చట్టము లతిక్రమింపఁదగినవి కలవు. అవియే మ మ్మతిక్రమింపుఁ డని చెప్పును. వానిని రద్దు చేయింప వలయును. వీనిలో నొక చట్టమునుమాత్ర మతిక్రమింపఁదలఁచితిమి. ఉప్పుచట్ట మందఱకు నసమ్మతము. దాని నాఁపుటకుఁ జాలఁ గాలమునుండి దొడ్డ ప్రయత్నములు జరుగుచు వచ్చుచున్నవి. కావున దీని నతిక్రమించుట కెవరి యిండ్లలో వా రుప్పును వండవలయు నని నేను సూచించితిని. సరకారువారు కొన్ని గ్రంథములను నిషేధించిరి. ఆ చట్టముగూడ నతిక్రమింపఁదగిన దని నేను సూచించితిని. ఇట్టివి

నా పుస్తకములు రెండు: హింద్-స్వరాజ్యము, సర్వోదయము. ఈ రెంటిని అచ్చువేసి బహిరంగముగా అమ్మినచో సన్నిటికంటె సహజమైన శాసనోల్లంఘన మగును. కావున నీ గ్రంథములెక్కువగా ముద్రించితిమి. సాయంతనోపవాస మయినపిదప జరిగిన మహాసభ ముగిసినతరువాత వీనిని అమ్మఁ జూపితిమి.

ఆఱవ తేదీ సాయంకాలమున స్వయంసేవకు లీ పుస్తకముల నమ్మఁ దొడఁగిరి. సరోజినీదేవి యొక్క కారుమీఁదను, నేనొక కారు మీఁదను బయలుదేఱితిమి. ముద్రించిన పుస్తకము లన్నియు అయిపోయెను. వసూలయిన సొమ్ము పోరాటమున నుపయోగింపఁబడెను. ఒక్కొక్క దాని వెల పావలా కాని నాకడను, సరోజినీదేవికడను ఎవరును పావలా యిచ్చి కొన్నట్టులు లేదు. జేబులో నున్న దెల్లయు నిచ్చి పుస్తకములు గొన్నవారు పలువురు. కొందఱు పది రూపాయలనోట్లును, కొంద ఱైదురూపాయలనోట్లను ఇచ్చిరి. ఒక పుస్తకమునకు ఏఁబది రూకల వెల వచ్చినట్టులు గుర్తు. కొట్టున పెట్టుదు రని కూడఁ గొనువారిని హెచ్చరించితిని. కాని ఆ సమయమున అందఱకును జైలు భయ మెగిరిపోయెను.

కాని మే మమ్మిన పుస్తకములు తమచే నిషిద్ధము లయినవి కావని సరకారువారి యభిప్రాయము. మొదట ముద్రింపఁబడిన పుస్తకములు జప్తుచేయ బడెను. వాని నమ్మినయెడలనే తప్పు. ఇది రెండవ కూర్పు. కావున నిది వారి చూపులో చట్టమునకు భంగము కలిగించుట కాదు. ఇటులు తెలియుటచే జనమునకు కులాసా లేక పోయెను.

దేశభక్తిని గుఱించియు, హిందూమహమ్మదీయసమ్మేళనమును గుఱించియు శపథము లొనరించుట కామఱునాఁడు చౌపాటిలో

శోకసభ జరిగెను. తెల్లని వస్త్రము పాలుగా వని హ్యాలదాస్ జేరాజణీ గారు తెలిసికొనుట కదియే ప్రథమపర్యాయము. కొలఁదిమంది సభకు వచ్చిరి. నాఁడు కూడిన యయిదారుగురు స్త్రీలు నాకు స్పష్టముగా గుర్తున్నారు. మగవారును కొలఁదిమందియే. నేను శపథమును వ్రాసి యుంచుకొంటిని. దాని యర్థమును వివరించితిని. కొలఁదిమందియే వచ్చినందులకు నా కాశ్చర్యముగాని, దుఃఖముగాని కలుగలేదు. చురుకుపాలుగల పనులలో ప్రజకు పక్షపాతము మెండు. ఉపయోగింపవలసిన పనులను ప్రారంభించుటలో నభిరుచి లేదు. నా కీ సంగతి మొదటినుండియు ననుభవము.

ఈ విషయమును వివరించుటకు వేఱొక ప్రకరణము కావలయును.

ఏడవ తేదీ రాత్రి నేను ఢిల్లీ అమృతసరములకు బయలుదేఱితిని. ఎనిమిదవ తేదీకి మథుర చేరితిని. అపుడే నన్ను పట్టుకొందు రను పుకారు బయలుదేఱెను. మథురకు తరువాతస్టేషనులో బండియాఁగెను. నన్నట గిదవాణీగారు చూడవచ్చిరి. 'మిమ్ము తప్పక పట్టుకొందురు; ఏమైన పని యున్న నేను చేయుదును' అని వీరు తెలిపిరి. 'మంచిది, అక్కఱ కలుగుచోఁ దెలుపుదు' నని నే నంటిని. పలవల్ స్టేషను చేరకమున్నే పోలీసు-ఆఫీస రొకడు నా చేతి కొక హుకు మిచ్చెను '—మీరు పంజాబులో ప్రవేశించునెడల నల్లరి జరుగునని మాకు భయము కావున మీరు పంజాబు త్రొక్కఁగూడదు.' పోలీసు హుకుము నాకుఁ జూపి రైలు దిగుమనెను. 'అల్లరి జరిపించుటకు నే నచటికిఁ బోవుట లేదు; అల్లరి మాపుటకు నేను పోవుచుంటిని. అందులకు నాయకులు నన్నాహ్వానించిరి. కావున నే నీ హుకుము ననాదరింప వలసివచ్చినది. ఇది చింతాజనకము' అని నే నంటిని.

పలవల్ స్టేషను వచ్చెను. మహాదేవదేశాయి నాతోఁగూడ వచ్చుచుండెను. ఢిల్లీ వెళ్లి శ్రద్ధానందులకు వార్త లందింపు మనియు, జనమును శాంతముగా నుండఁ దెలుపు మనియు మహాదేవదేశాయికిఁ జెప్పితిని. మరియు నే నీ యాజ్ఞ మీఱుటకుఁ గల కారణమును దెలుపు మంటిని. మరియు శిక్షను నే ననుభవింప సంసిద్ధుఁడ ననియు, శిక్ష వేసినపిదపఁగూడ మన మోర్పు జూపినయెడలనే మనకు విజయము కలుగు ననియుఁ దెలుపు మంటిని.

పలవల్ స్టేషనులో నన్ను దింపి పోలీసుల వశ మొనరించిరి. కొలఁది సేపటిలోనే ఢిల్లీనుండి యొక రైలు వచ్చెను. నన్నం దొక మూడవ తరగతి పెట్టెలో నెక్కించిరి. పోలీసు సిబ్బంది నన్ను వెంబడించియుండెను. మథురలో దింపి నన్ను పోలీసు బారకాసుల లోనికిఁ దీసికొనిపోయిరి. నన్నేమి చేయఁదలఁచిరో, నన్నెటకుఁ దీసికొని పోఁగలరో యెవరికిని దెలియదు. తెలవాఱుజామున నాలుగుగంటలకు నన్ను లేపి బొంబాయి దెసకుఁ బోవు మట్టిబండిలో నెక్కించిరి. రెండుగంటలకు సవాయీ మాధోపురమున దింపిరి. లాహోరునుండి ఇన్‌స్పెక్టరు మి. బోరింగు బొంబాయి మెయిలులో దిగెను. వారు నన్ను వశపఱచికొనిరి.

నన్నిచట మొదటి తరగతి బండిలో నెక్కించిరి. దొర నాతోఁగూడ నుండెను. లోఁగడ నేను మామూలు ఖైదీని. ఇపుడు 'జెంటిల్ మేన్' ఖైదీని. ఈ యాఫీసరు సర్ మైకేల్ ఓడ్వైయరును స్తోత్రము చేయఁదొడఁగెను. 'సర్ మైకేలు గారికి మీయెడ వేఱుగా నెట్టి విరోధమును లేదుగాని మీరు పంజాబు వెళ్లుచో నచట గందరగోళము జరుగునని వారికి భయము' అని యీ రీతిగాఁ జాలఁ జెప్పెను. కావున మీ యంతట మీరు బొంబాయికి

మరలిపొండనియు, పంజాబుసరిహద్దు ద్రొక్కవలదనియుఁ దెలిపెను. 'ఈ హుకుమును పరిపాలింప వీలు లేదు. నాయంతట నేను బొంబాయికి పోఁజాలను' అని నే నంటిని. కావున నిఁకఁ జేయునది లేక 'మీమీఁద అమలు జరిపెద' ననెను. 'ఏమి జరుపుదురు?' అని యంటిని. 'నాకును దెలియదు, పై ఆఫీసరుల ఉత్తరువు చొప్పునఁ జేయవలయును. కాని ప్రకృతము మిమ్ము నేను బొంబాయికి తీసికొనిపోవుచున్నాను' అనెను.

సూరతు స్టేషను వచ్చెను. మఱియొక పోలీసు-ఆఫీసరు నన్ను దఖపఱచికొనెను. రైలు బొంబాయి సమీపించుచుండఁగా నతఁ డిట్లనెను: 'మీ కిచట విడుదల. మీరు మెరీన్ లైన్సు స్టేషను కడ దిగినచో బాగుండు నని తోఁచును. కొలాబా స్టేషనుకడ జనసమూహము మూఁగుట కవకాశ మున్నది.' నే నతని కోరిక నామోదింతు నంటిని. అతఁ డందులకు సంతసించి నాకు ధన్యవాదము లొసఁగెను. నేను మెరీన్ లైన్సుకడ దిగితిని. అచట నొక మిత్రుని గుఱ్ఱపుబండి కానవచ్చెను. దానిమీఁద రేవాశంకర్ ఝవేరీగారి యింటి కేఁగితిని. 'మిమ్ములను పట్టుకొని రని విని జనులు కోపపూరితు లయిరి. పాయధునికడ నల్లరులు జరుగు నని భయము కలుగుచున్నది. అప్పుడే మేజిస్ట్రేటును, పోలీసులును అచటికి వెళ్లిరి' అని రేవాశంకరులు చెప్పిరి.

ఉమర్ సోబానీ, అనసూయా బహేనుగారలు నావెనుకనే మోటరుమీఁద వచ్చి 'వెంటనే మీరు రావలయును. జన మాఁగుట లేదు. మేము వారి నాఁపఁజాలము. మీరు కనఁబడినఁ జాలును; అల్లరి ఆఁగిపోవును' అనిరి.

నేను మోటరులోఁ గూరుచుంటిని. పాయధునికడఁ జాల జనము కానిపించుచుండెను. నన్నుఁ జూడఁగనే వారి కానంద మాఁగలేదు. వందేమాతరమ్, అల్లాహో అక్బర్ అను ధ్వనులతో

ఆకాశము బూరటిల్లెను. పాయధునికడ పోలీసు గుర్రపురౌతులు కనఁబడిరి. మేడలమీఁదనుండి ఇటుకల వర్షము కురియుచుండెను. 'శాంతముగా నుండుఁడు; శాంతముగా నుండుఁ'డని చేతులు జోడించి నేను ప్రార్థించుచుంటిని. మేముగూడ ఆ యిటుకవానను తప్పించుకొనలేకపోతిమి.

అబ్దుల్ రహమాను వీథినుండి యీ యూరేఁగింపు క్రాఫర్డు మార్కెట్టుదెస కేఁగుచుండఁగా గుర్రపురౌతు లెదురుగా నిలువఁబడిరి. ఈ యూరేఁగింపు కోటదెస కేఁగకుండఁ జేయుటకు వారు చాలఁ బ్రయత్నించుచుండిరి. జనము అపరిమేయముగా నుండెను. జనము పోలీసులను చీల్చుకొని ముందులకు సాగుచుండెను. నా మాటయు సాగునటులు తోఁపలేదు. అపుడు పోలీసు-ఆఫీసరు గుంపును చెదరఁగొట్టుట కాజ్ఞ యిచ్చెను. రౌతు లొక్కుమ్మడి జనముపై గుర్రములను పరుగెత్తించిరి. లోకులకు బరిసెలు గ్రుచ్చుకొనుచుండెను. నాకును తప్పదనుకొంటిని గాని బరిసెలు మా మోటరును రాచికొనుచుఁబోయెను. రౌతులు రైలువేగముతోఁ బరుగిడిరి. జనము విటిసిపోయెను. ఎచటివారచట పరుగిడఁ దొడఁగిరి. కొందఱు మట్టగింపఁబడిరి; కొందఱకు గాయములు తగిలెను. రౌతు లావలి కేఁగుటకు దారి లేదు; జనము పోవుటకు అంతకన్న లేదు. వెనుక కేఁగుటకును వీలులేదు; ముందఱ కేఁగుటకును వీలులేదు. రౌతులును, జనులును పిచ్చియెత్తినవారివలె నుండిరి. రౌతు లేమి చేయుచుండిరో రౌతులకే తెలియుటలేదు. కనులు మూసికొని గుర్రములను దౌడు తీయించిరి. అది యెల్లయు భయంకరముగా నుండెను. రౌతులును, జనమును ఆ గందరగోళమున 'కలగాపులగ' మయిపోయిరి.

ఈ రీతిగా జనము చెదరఁగొట్టఁబడెను. ఊరేఁగింపు ముందరకు జరుగకుండ జేయఁబడెను. మా మోటరును ముందరకుఁ బోనిచ్చిరి. కమిషనరు-ఆఫీసుముంగు బండినిలిపి పోలీసువారి వ్యవహారమును ఫిర్యాదు చేయుటకు లోని కేఁగితిని.

3౭

ఆ రోజులు (౭)

కమిషనరు మేడమెట్లెక్కుచుండగా, క్రిందినుండి మీఁదివఱకును సైనికులు తుపాకులతో నిలువఁబడి యుండిరి. వారిని జూచినవా రెవరును యుద్ధమునకు సన్నద్ధులుగా లే రనుకొనరు. బోరింగుగారు గ్రిఫిత్తుగారికడఁ గూర్చుండియుండిరి.

నా చూచిన సంగతు లన్నియు గ్రిఫిత్తుగారికిఁ జెప్పితిని. ఇతఁ డిట్లు సంక్షేపించి ప్రత్యుత్తర మొసఁగెను: ‘ఈ యూరేఁగింపు కోట దప కరుగుట నా కిష్టముకాదు. అచట గందరగోళము గాక తప్పదు. ఎంత చెప్పిచూచినను జనులు మరలలేదు. కావున అమలు జరిపింపక తప్పకపోయెను.’

నే నిటు లంటిని: ‘దీనిలాభము మీకుఁ దెలియకపోదు. గుర్రపు డెక్కలక్రింద జనము నలిబిలిగాక తప్పదు. గుర్రపుసవారులను బంప వలసినంత పని లే దని నే ననుకొందును.’

దొరగా రిటు లనిరి: ‘మీ రటులు నిశ్చయింపఁ దగదు. మీ బోధలు జనులచే నెట్టి పనులు చేయించునో ఆ సంగతి మీకంటె మా కెక్కువగా తెలియును. మేము ముందుగా జాగ్రత్త పడనిచో చాల హాని చేకూరును. జనులు మీ మాటలుఁగూడ విన రని నేను మీకుఁ దెలియఁజెప్పుచున్నాను. చట్టము నతిక్రమించుటయే లోకులకు చప్పున పట్టును గాని, శాంతి నెలకొలుపుట వారి శక్తి కతీతము. మీ హేతువులు చాల దొడ్డవి. కాని లోకుల కవి అర్థముకావు. వారి స్వభావమునే వా రనువర్తింతురు.’

'తమకును' నాకును మతభేద మచ్చుటకే. స్వభావముచే లోకము కలహప్రియము కాదు, శాంతిప్రియముసుండీ!'

మే మిటులు చాలసేపు వాదించుకొంటిమి.

తుదకు గ్రిఫిత్తుగా రిటు లనిరి: 'మీమాట లోకులం విన రను కొనుఁడు! మీ రపు డేమి చేయుదురు?'

'నా కట్టి నమ్మకము కలిగినచో ఈ పోరాటమును కట్టి పెట్టుదును.' అని నే నంటిని.

'ఏమీ? విడిచిపెట్టినచో వెంటనే పంజాబు వెళ్లుదు నని మీరు బోరింగుగారితో ననలేదా?'

'ఆ, అవును. తిరుగు రైలులోనే వెళ్ళఁదలఁచితిని. కాని అది యిఁక నేఁటి మాట కాదు.'

'మీరు కొంచెము శాంతి వహించియున్నచో సంగతులన్నియుం మీకే తెలియును. ఇపు డమదాబాదులో నేమి జరుగుచున్నదో మీకుఁ దెలియునా? అమృతసరమున నేమి జరిగెనో తెలియునా? ఎల్లెడలను లోకులకు వెఱ్ఱి యెత్తినటు లున్నది. నాకును అన్ని సంగతులు తెలియలేదు. కొన్నిచోటుల తంతితీఁగెలు తెగఁగొట్టఁబడెను. ఈ దోస మంతయు మీదియే.'

'నా జవాబుదారీ ఉన్న చోట దోసమును నా నెత్తిమీఁదఁ బెట్టుకొనక మానను. అమదాబాదులో అల్లరి జరిగె ననఁగా నాకు వింతయు, వెతయుఁ గలుగుచున్నవి. అమృతసరమునకు నాపూచీలేదు. నే నచటి కెన్నఁడును వెళ్ళియుండలేదు. నే నచట నెవరిని ఎఱుఁగను. కాని సరకారువారు న న్నచటికిఁ బోనిచ్చి యుండినచో నే నచటి శాంతిని కాపాడియుండువాఁడ నని ధైర్యముగాఁ జెప్పఁగలను. న న్నాఁపివైచి సరకారువారు లోకులను రెచ్చఁగొట్టిరి.'

వారి మాటలు వారు చెప్పిరి. నా మాటలు నేఁ జెప్పితిని. మాకు సామరస్యము కుదురలేదు. చౌపాటిలో సభ జరిపి జనులకు శాంతి బోధింతు నని నా యుద్దేశము వెల్లడించి వారికడ సెలవు గొంటిని.

చౌపాటిలో సభ జరిగెను. శాంతినిగూర్చి, సత్యాగ్రహ మర్యాదనుగురించి వివరించి సత్యాగ్రహము సత్యశీలుర కొక క్రీడ యనియు, లోకులు శాంతిని పరిపాలింపరేని వారికి సత్యాగ్రహమునకు నీరు వదలుకొనవలయు ననియుఁ జెప్పితిని.

అమదాబాదులో నల్లరులు జరిగెనని శ్రీ అనసూయాబేనుకుఁ గూడ వార్త వచ్చెను. ఆమెయును అరెస్టు చేయఁబడె నని యెవఁడో పుకారు పుట్టించెను. దీనితో కూలివారికి కోప మెత్తెను. వారు హరతాళము చేసిరి. కోపముచే పిచ్చి పనులు చేసిరి. ఒక సార్జెంటు చంపఁబడెను.

నే నమదాబాదు వెళ్ళితిని. నడియాదుకడ రైలుపట్టాల నూడఁ దీయుటకు ప్రయత్నములు జరిగెను. వీరామగామున ఒక గవర్నమెంటు ఆఫీసరు ఖూనీ చేయఁబడెను. నే నమదాబాదు చేరునరికి మార్షల్ లా చలాయించుచుండెను. లోకులు భీతు లయిపోయిరి. చేసినపనికి వడ్డీతో ననుభవింపవలసి వచ్చెను.

కమిషనరు ప్రాట్ గారికడకు నను దీసికొనిపోవుట కొకఁడు రైలు స్టేషనుకడ వేచియుండెను. నేను వారికడ కరిగితిని. ఆయన కోపముతో మండిపోవుచుండెను. నే నతనితో చల్లగా మాటలాడితిని. జరిగిన చావునకు నా ఖేదము తెలిపితిని. మార్షల్ లాతో పనిలేదనియు, శాంతికి వలయు ప్రయత్నము నేను చేయుదుననియుఁ దెలిపితిని. సబర్మత్యాశ్రమముకడ నివాసులకుఁగాను ఒక సభ నేర్పాటుచేయుట కనుజ్ఞ వేఁడితిని. వారును సమ్మతించిరి. ౧౩ ఏప్రెల్ ఆదివారమున సభ యయినటులు గుర్తు. ఆనాఁడో, అమరునాఁడో మార్షల్ లాగూడ

రద్దయినటులు గుర్తు. నే నా సభలో లోకుల దోసము లెత్తి చూపితిని. నేను మూఁడునాళ్లు ఉపవాసమును విధించుకొంటిని. ఒక దినము ఉపవసింపుఁ డని లోకులకు సలహా నిచ్చితిని. తప్పు లొనర్చినవారిని తమ తప్పుల నొప్పుకొనుఁ డనియు సలహా యిచ్చితిని.

నాధర్మము నాకు తెల్లముగాఁ దెలిసెను. నేను నాకుఁ గల తీరికలో నెక్కువ పా లెవరికొఱకు వినియోగించితినో, ఎవరికి నేను సేవ లొనరించితినో, ఎవరిమీఁద నేను పెద్దపెద్ద యాశలు పెట్టుకొని యుంటినో వారే యీ యల్లరిలో పాలుగొని రనినచో నాకు కష్టము కాదా? నాకును ఈ దోషమున పాలు గల దని గ్రహించితిని.

తప్పుల నొప్పుకొనుఁ డని నేను ప్రజకు సలహా యిచ్చినటులే తప్పులను క్షమింపుఁ డని సరకారువారికిని సలహా యిచ్చితిని గాని నామాట యెవరును వినలేదు.

స్వ. సర్ రమణభాయి లోనగు అమదాబాదు పెద్దలు సత్యాగ్రహమును నిలుపుఁ డని నన్నుఁ గోరవచ్చిరి. నన్నుఁ గోర నక్కఱయే లేదు. లోకులు శాంతిని జక్కగా నభ్యసింపనంతవఱకు సత్యాగ్రహమును నిలిపివేయవలయునని నేనే నిశ్చయించుకొనియుంటిని. దీనికి వారు ప్రసన్ను లయిరి.

దీనికి మఱి కొందఱు మిత్రు లప్రసన్ను లయిరి. సత్యాగ్రహము నకు శాంతి తప్పని నియమ మగుచో సాముదాయికసత్యాగ్రహము విఫల మగునని వీరి మతము. కాని నామతము వేఱు. నే నెవరిలో పని చేసితినో, నే నెవరిమీఁద ఆశ పెట్టుకొనియుంటినో వారే శాంతిని పాలింపనియెడల సత్యాగ్రహము జరుపుటకు వీలులేని మాట నిక్కము. ఎవరిచే సత్యాగ్రహము నడిపింపవలసియుండునో వారిచేత ఆ సత్యాగ్రహమునకుఁ గావలసిన శాంతి నంతయు పరిపాలింపఁ జేయఁ గలిగియుండుట నాయకుల కావశ్యకము. ఈ యభిప్రాయమును నేను ఇప్పటికిని మార్చుకొనఁజాలను.

33

కొండంత తప్పు

అమదాబాదులో సభ యయినవెంటనే నడియాదు వెళ్లితిని. కొండంత తప్పనియు, హిమవత్పర్వతమంత తప్పనియు అని వాడుక యయిపోయిన ఉపమను మొట్టమొదట నేను నడియాదునందే ఉపయోగించితిని. అమదాబాదునందే నా తప్పు నాకు మసకమసకగాఁ గానిపించెను. నేను నడియాదులో జరిగిన ఘోరములు కనులారఁ గాంచితిని. ఖేడాజిల్లాలో ననేకు లరెస్టయి రని వింటిని. ఖేడాలోను, మిగిలిన చోటులను చట్టము నతిక్రమింపుఁడని తరి రాకముందే నే నభ్యనుజ్ఞ యిచ్చుట తప్పనియు, కొండంత తప్పనియు అని నా కర్థమాయెను.

నే నపుడు సభలో నుపన్యసించుచుంటిని. నే నీ తప్పిదమును ఒప్పుకొంటిని. అటు లొప్పుకొనుట నా కపహాస్యముగా నున్నను ఒప్పుకొనినందులకు నాకు పశ్చాత్తాపము లేదు. ఏనుఁగులంత యితరుల తప్పులు నలుసు అంతవిగను, ఆవగింజలంత మనతప్పులు కొండలంతలుగను మనము చూడఁగలుగుట నేర్చుకొనినచో మన దోషములయు, పరుల దోషములయు ప్రమాణము మన మెఱుఁగఁగలుగుదుము. సత్యాగ్రహి కాఁగోరువాఁ డీ సామాన్యనియమమును కడు సూక్ష్మముగా పరిపాలింపవలయును.

ఇఁక ఈ కొండంత తప్పేదియో కనుఁగొందము. చట్టమును వినయముతో నతిక్రమింప నర్హుఁడగువాఁడు లాయెడ వినయమును, సమ్మతియును చూపవలయును. మనము చాలవఱకు దండభీతిచే లాకు బద్ధుల మయి యున్నాము. ఆ లాలు ముఖ్యముగా నీతికిఁగాని, అనీతికిఁ

గాని సంబంధించి యుండవు. ఎటు లనఁగా లా యున్నను, లా లేకున్నను మంచివాఁ డెవఁడును దొంగతనము చేయఁడు. ఆ మంచి వాఁడే చీకటిలో త్రొక్కుడుబండిమీఁద దీపమును ఉంచవలయు నను లాను అతిక్రమించి, అతిక్రమించినందులకు చింతింపఁడు. ఈ నియమము పాలింపవలసిన దని యెవరేని సలహా యిచ్చుచో ఎంత మంచివాఁడేని ఆ నియమపాలనమునకు సంసిద్ధుఁడు కాఁడు. కాని ఇట్టి చట్ట మొకటి పుట్టినపుడు దాని నతిక్రమించుచో జరిమానా తగులు నను భయము కలుగుచో ఆ జరిమానాను తప్పుకొనుటకే దీప మించును. ఈ నియమమును పరిపాలించుట దండమువలని భయముచేఁ గాని స్వేచ్ఛ చేఁగాదు.

కాని సత్యాగ్రహి సంఘమునకు సంబంధించిన 'లా'లను తెస్సగా తెలిసికొని గౌరవింపవలయు నను ధర్మ మెఱిఁగికొని స్వేచ్ఛాపూర్వకముగా గౌరవించును. సాంఘికమగు లా ను తెలిసికొని ఇచ్ఛాపూర్వకముగా పరిపాలించువానికి 'ఈ లా నీతికి సంబంధించినది, ఈ లా నీతికి సంబంధింపనిది' అని భేదము తెలిసికొను శక్తి కలుగును. ఈ చెప్పఁబడిన మేరలో లాను అతిక్రమింపఁగల అధికారము కలుగును. ఇట్టి యధికారము రాకముందే చట్టము నతిక్రమింపవలసిన దని నే నంటిని. ఇది తప్పు. ఈ తప్పు నాకు కొండంతగా కానిపించెను. ఖేడా జిల్లాలో కాలిడఁగనే తొల్లిటి సత్యాగ్రహమంతయు నాకు గుర్తువచ్చి 'ఎదుటి గోడను గానక కనులు మూసికొని పరుగు లెత్తించితి' ననుకొంటిని. మరియు చట్టము నతిక్రమించు నర్హత కలుగకముందు దానిలో నిమిడియున్న అర్థము లన్నియు తెస్సగా తెలిసికొనవలయు ననుకొంటిని. ప్రతిదినమును బుద్ధిపూర్వకముగా చట్టము నతిక్రమించుచుండువారును, దొంగతనముగా పలుమాఱులు

చట్టము నతిక్రమించుచుండువారును ఒక్కతూరి దీని నెటులు తెలిసి కొనఁగలగు? దీని మర్యాదాపాలన మెటులు చేయఁగలరు?

లక్షలకొలఁది జనము దీనిని సమగ్రముగా పరిపాలింపఁజాల రను మాట తేటతెల్లము. కావున సాముదాయికముగా చట్టము నుల్లంఘించుటకు ముందు స్వయంసేవకుల సేన యొకటి తయారుకావలెను. వీరు లోకులకు చక్కగా తెలుపఁగలవారుగా నుండవలయును. ప్రతి క్షణమును దారి చూపఁగలవారుగా నుండవలయును. వీరికి సత్యాగ్రహ మర్యాద సమగ్రముగాఁ దెలిసియుండవలయును.

ఇట్టి యాలోచనలతో నేను బొంబాయి చేరితిని. సత్యాగ్రహ సభాద్వారమున స్వయంసేవకుల సేనను తయారుచేసితిని. వీరి సాయమున లోకులకు చట్టమును వినయముగా నుల్లంఘించుటనుగూర్చి తెలుపఁ దొడఁగితిని. సత్యాగ్రహరహస్యములఁ దెలుపుటకు చిన్న చిన్న పత్రికలు ప్రకటింప మొదలిడితిని.

ఇటు లీ పని జరుగుచున్నదికాని దీన లోకుల కభిరుచి కలిగి నటులు నాకుఁ దోఁచలేదు. స్వయంసేవకులా, యెక్కువగా సమకూర లేదు. సమకూరినవారా, సత్యాగ్రహమును సమగ్రముగా నభ్యసింప లేదు. ఇంతియకాక క్రమక్రమముగా వీరి సంఖ్య పెరుగుటకు బదులు దిగజాఱఁ దొడఁగెను. నే నీ బండి నెంత వడిగా నడపవలయు నను కొంటినో అది అంత వడిగా నడవ దని తెలిసికొంటిని.

౩౪

నవజీవన్ యంగిండియాలు

శాంతిని నెలకొలుపు నాందోళన మిటు లోకవంక మెల్లగా జరుగుచుండఁగా, సరకారువారి దండనీతి మఱియొక వంక జోరుగా సాగుచుండెను. పంజాబులో ఈ దండనీతిప్రభావము కానిపించెను. నాయకు లరెస్టు చేయఁబడిరి. 'లా లే' దనఁబడు మాఱు పేరయిన మార్షల్ లా ప్రకటింపఁబడెను. క్రొత్త కోర్టు లేర్పాటు చేయఁబడెను. ఈ కోర్టులకు సాక్ష్య మక్కఱలేదు. ప్రమాణ మక్కఱలేదు. నిరంకుశాధికారమున కివి తావులు. అమృతసరమున ఏమియు నెఱుఁగని స్త్రీ పురుషులను పురుగులవలె పొట్టలమీఁద డేఁకించిరి. హిందూదేశమునకును, ప్రపంచమునకును తెలిసియున్న జలియన్‌వాలా బాగు-హత్యలుగూడ దీనిముందు నాకు తక్కువగాఁ గానిపించెను.

ఏ మయినను సరే వెంటనే పంజాబు రావలయు నని నాకు వార్త వచ్చెను. అనుజ్ఞకు వైసరాయిగారికి వ్రాసితిని; తంతి యిచ్చితిని గాని లాభము లేకపోయెను. సెలవు లేకుండ పంజాబు సరిహద్దును త్రొక్కుదునేని చట్టము నతిక్రమించితి నను సంతోషమే దక్కును. ఈ సంకట మెటులు తప్పించుకొందునా యని చింతించితిని. నే నిపుడు పంజాబునకు వెళ్లినయెడల నది చట్టమును వినయముతో నుల్లంఘించుట యనిపించుకొనదు. నేను కోరెడు శాంతివాతావరణ మచట లేదు. పంజాబు-నాదిర్షాలచే లోకుల కశాంతి రెచ్చెను. నే నిట్టి తఱి చట్టమును ధిక్కరించుచో నిప్పులో నేయి పోసినటు లగును. కావున మిత్రులు నన్ను రమ్మని కోరినను నేను పోదలఁపలేదు. ఇట్టి నిర్ణయము నాకు చేఁదు మందే. నే నిటులు

ప్రతిదినమును పంజాబునుండి వచ్చు దురంతము లయిన వార్తలు వినుచు, పండ్లు కొఱుకుకొనుచుఁ గూరుచుండవలసి వచ్చెను.

ఎవరి చేతులలో బాంబే క్రానికల్ పత్రిక ప్రచండశక్తిగా నేర్పడెనో అట్టి హార్నిమనుగారిని సరకారువారు ఎవరికిని దెలియకుండ దేశాంతరమునకు బంపివేసిరి. ఈ దొంగపనికి నా కింకను దుఃఖము పోలేదు. హార్నిమనుగారు లా వల దనువారు కారని నే నెఱుఁగుదును. సత్యాగ్రహ- కమిటీవారి సలహా లేకుండ పంజాబు సరకారువారి హుకుమును మీఱుట వీరి కిష్టము కాదు. సత్యాగ్రహమును నే నాఁపకముందే సత్యాగ్రహము నాఁపుఁ డని వీరు నాకు ఉత్తరము వ్రాసిరి. టపాలో రావలయుటచే ఈ యుత్తరము నాప్రకటనకు తరువాత నా కందెను. కావున వీరిని దేశాంతరము పంపుట నా కెంత యాశ్చర్యము కలిగించెనో అంత దుఃఖము గూడఁ గలిగించెను.

ఇటు లీ ఘటన జరిగిన తరువాత బాంబే క్రానికల్ పత్రికా వ్యవస్థాపకు లీ భారమును నన్ను వహింపఁ గోరిరి. బ్రెల్వీగా రచట నుండనే యుండిరిగాన నేను చేయవలసిన దంతగా కానరాకున్నను నా స్వభావము ననుసరించి నా జవాబుదారీ యెక్కు డయ్యెడిది. కాని నా కా భార మెన్నాళ్లో లేదు. సరకారువారి పుణ్యమా యని దానిని నిషేధించిరి. పత్రిక ఆఁగిపోయెను.

క్రానికల్ పత్రికాసంచాలకు లయిన ఉమర్ సోబానీ, శంకర్‌లాల్ బాంకరుగారల చేతులలోనే యంగిండియా అను మఱి యొక పత్రికయు నుండెను. వీ రీ యంగిండియా భారమును నన్ను వహింపు మనిరి. క్రానికల్ పత్రిక నడఁచివయిచిరిగావున దాని లోటు తీర్చుటకు యంగిండియాను వారమునకు రెండు మాఱులు

ప్రకటింపు మని సూచించిరి. నాకును ఇది బాగుగనే యుండెను. సత్యాగ్రహరహస్యమును లోకులకుఁ దెలుపవలయు నను నుత్సాహము నాకు మెండుగాఁ గలదు. పంజాబును గుఱించి యోగ్యమగు మాట యొకటేని వ్రాయుటకు నాకు వీలు లేకపోయెను. కాని సత్యాగ్రహరూప మగు శక్తి దీనివెనుక నున్నదని సరకారువారికి తెలియును. కావున నే నీ మిత్రుల సూచనను స్వీకరించితిని.

ఇంగ్లీషు భాషచే ప్రజాసామాన్యమునకు సత్యాగ్రహమును గూర్చి తెలుపు టెటులు? నా పనికి ఘూర్జరరాష్ట్రము ముఖ్యక్షేత్రము. అపు డిందులాల్ యాజ్ఞిక్ గారు సోబానీ బాంకరుల సమాజములో నుండిరి. ఈ మిత్రుల ధనసాహాయ్యమున వారు నవజీవన మాస పత్రికను గుజరాతుభాషలో నడపుచుండిరి. వీ రందఱును ఈ పత్రికను నా చేత నిడిరి. దీని కార్యభారమును గూడ నిందులాలు గారు వహింతు మనిరి. ఈ మాసికపత్రిక సాప్తాహికపత్రిక యాయెను.

ఇంతలో బాంబే క్రానికల్ పునరుజ్జీవిత మాయెను. కావున యంగిండియా యథాప్రకారము వారపత్రిక యాయెను. దీనిని నే నమదాబాదు తీసికొని పోయితిని. రెండు వారపత్రికలను భిన్నస్థలములలోఁ బ్రకటించుట చాల వ్యయమునకును, అసౌకర్యమునకును కావల మగును గాన నవజీవనపత్రిక లోఁగడనే అమదాబాదులో ప్రకటింపఁ బడుచుండుటచే యంగిండియాగూడ నా సూచనచే అమదాబాదునకే మార్పఁబడియెను. ఈ మార్పున కింకను గొన్ని హేతువులు కలవు. నాకు ఇండియన్ ఒపినియను కాలూకు అనుభవము కలదు. ఇట్టి పత్రికలకు సొంత అచ్చుకూటము ఉండవలయును. ఏలన, అపు డిండియాలో నములులో నున్న అచ్చుకూటము

లను సంబంధించిన చట్టములఁబట్టి వ్యాపారదృష్టితో అచ్చుకూటములను నడపువారు నా యుద్దేశములను యథాతథముగా ప్రకటింప సంకోచింతురు. కావున ప్రత్యేకముగా ముద్రాశాలను నెలకొలుపుటకిది ప్రబల కారణము. దీనికిని అమదాబాదులోనే చాల వీలుగావున యంగిండియాను అచటికి నడపితిని.

వీని ప్రకటనమువలన ప్రజలకు సత్యాగ్రహమునుగూర్చి నా శక్తి కొలఁది తెలుప నారంభించితిని. ఈ రెండు పత్రికలకును చాల ప్రాముఖ్యము కలిగెను. ఒకొక్క పత్రికకు ఇంచుమించు నలుబదివేల మంది చందాదారు లుండిరి. నవజీవన పత్రికకు వడిగను, యంగిండియా పత్రికకు మెల్లఁగను అభివృద్ధి కలిగెను. నేను జైలుకు వెళ్లినపిదప చందాదారులు తగ్గఁ దొడఁగిరి. నేఁడు వీరి సంఖ్య ఎనిమిది వేలకు లోఁబడియుండును.

పత్రికలలో ప్రకటనములను ముద్రింపఁగూడ దని మొదటి నుండియు నాకు పట్టుదల. దాన పత్రికల కేమియు లోటు లేదు. ఇంతియకాక పత్రికలలోని విషయముల స్వాతంత్ర్యమున కిది చాల నుపకరించె నని నా యభిప్రాయము.

ఈ పత్రికలవలన నేను నాలో శాంతిఁ బడయఁగలిగితిని. ఏలనఁగా, నేను వెంటనే శాసనధిక్కారమును జేయఁజాలకున్నను నా యుద్దేశములను ప్రకటింపఁ గలిగితిని. సలహాలను, సూచనలను ఈయఁగలుగుటవలన నా కూఱట కలిగెను. ఇట్టి కఠినసమయమున ఈ రెండు పత్రికలును ప్రజలకు చక్కగా సేవ చేసిన వనియు, మార్షల్ లా ఫలనఁ గలిగిన యన్యాయమును పీడను తగ్గింప శక్తి కొలఁది పని చేసెననియు నా యుద్దేశము.

౩౫

పంజాబులో

'పంజాబులో జరిగినవాని కన్నిటికిని నీవే కారణ'మని సర్ మైకల్ ఓడ్వాయరుగా రనిరి. మార్షల్ లాకుఁ గూడ నీవే కారణ మని యనుటలోఁ గొందఱు పాంచాలయువకులు వెనుదీయ లేదు. మీరు శాసనధిక్కారమునుమాత్రము కొంచె మాఁపకుండ నుండినచో జలియన్ వాలాబాగునందు హత్యలు జరిగియుండెడివి కావని వీరు క్రోధావేశముతోఁ బలికిరి. పంజాబులో కాలు పెట్టినచో మిమ్ము ఖూనీచేయక విడిచిపెట్ట రనియుఁ గొందఱు బెదరించిరి.

కాని నా చేసిన పని తెలివి గలవా రెవరును శంకింపనంత శుద్ధముగను, ఉచితముగను ఉండెనని నా యభిప్రాయము. పంజాబులో నెపుడు దూఁకుదునా యని యనుకొనుచుంటిని. లోఁగడ నెన్నఁడును నే నచటి కేఁగకుండుటచే నచట జరిగిన విషయములను కనులారఁ గనుఁగొనుటకు మఱి కొంచెము తొందరపడితిని. న న్నచటి కాహ్వానించిన డా. సత్యపాలు, డా. కిచలూ, పండిత రామభజదత్త చౌదరీగార లపుడు కారాగారమున నుండిరి. వీరిని, ఇతరులను సరకారువారు చాలఁ గాలము కొట్టున నుంప రని నాకుఁ జాల నమ్మిక. నేను బొంబాయికి వెళ్లినపుడెల్లఁ జాలమంది పంజాబువారు నను జూడ వచ్చుచుండెడివారు. వారు నాకడ ప్రోత్సాహముఁ బడసి ప్రసన్ను లయి వెళ్లుచుండెడివారు. నా కపు డాత్మవిశ్వాసము చాల మెండు.

నేను పంజాబు వెళ్లుట దూరదూరముగా పోవుచుండెను. వైస్రాయిగారు 'ఇపుడు కాదు' అని ప్రతిమాటును జరుపుచుండెడి వారు.

ఇంతలో హంటర్-కమిటీ యేర్పాటాయెను. మార్షల్ లా సమయమున పంజాబు-ఆఫీసరు లనులుజరిపిన పనులఁగురించి యీ కమిటీవారు విచారణచేయుదు రని ప్రకటింపఁబడెను. దీనబంధు ఆండ్రూజుగా రచటికి వెళ్లియుండిరి. వారి యుత్తరములు చదువఁగా గుండె నీరయిపోయెను. పత్రికలలో ప్రకటితములయిన విషయములకంటె ఘోరతమములగు విషయములు మార్షల్ లా వలన జరిగె నని యీ యుత్తరములు ధ్వనించెను. వెంటనే వచ్చి కలిసికొను మని వీ రుత్తరము వ్రాసిరి. వెంటనే పంజాబుకు బయలుదేఱవలయునని మాళవ్యులును వ్రాసిరి. నేను మరల వైసరాయిగారికి తంతి యిచ్చితిని. మీరు ఫలానా తారీఖుకు వెళ్లవచ్చునని జవాబు వచ్చెను. ఆ తారీఖు సరిగా గుర్తు లేదు కాని ౧౭ వ అక్టోబ రయి యుండవచ్చును.

లాహోరు చేరితిని. నాఁడు నా చూచిన దెన్నఁటికిని మఱపునఁ బడదు. ఈ మూలనుండి యా మూలకు నేల యీనినటులు జనసముద్రము పెక్కేండ్లు వియోగము పొందిన ప్రియుని గలిసికొనవచ్చినటు లిండ్లు వదలి జనము స్టేషనులో నాకొఱ కెదురుచూచుచుండిరి. లోకులు నన్నుఁ జూచి హర్షోన్మత్తు లయిరి.

పండిత రామభజదత్త చౌదరీగారి బంగళాలో నా విడిది. వారి భార్య సరళాదేవి చౌదరాణీగారిని నే నిదివఱ కెఱుఁగుదును. నా కాతిథ్య మొసఁగు భార మామెపైఁ బడెను. నే నిచట 'ఆతిథ్య మొసఁగు భారము' అని యెఱిఁగి ప్రయోగించితిని. ఏలన, నేఁటివఱకే నాఁడును నే నున్నచో టొక ధర్మసత్ర మయిపోవుచుండెను.

పాంచాలప్రధాననాయకు లందఱును చెఱఁబడుటచే పండిత మాలవీయులును, పండిత మోతీలాలుగారును, శ్రద్ధానందస్వాములవారును వారి స్థానముల నాక్రమించిరి. మదనమోహన శ్రద్ధానంద

స్వాములతో లోఁగడ నాకు గాఢపరిచయము కలదు. మోతీలాలు గారిని బాగుగా నెఱుఁగుట కిదే మొదలు. వీరును, జైలు గౌరవముఁ బడయని అభిజననాయకులును న న్నాత్మీయునిగాఁ జేసివయిచు కొనిరి. నా కచట క్రొత్త యనిపింపలేదు.

హంటర్-కమిటీ యెదుట సాక్ష్యము చెప్పఁగూడ దని మే మందఱమును ఒక్క త్రాటిమీఁద నుంటిమి. దానికి కారణ మప్పుడు ప్రకటింపఁబడెను గాన మరల నిచట వ్రాయను. ఇంతకాలము గడచిన పిదప నొక తూరి వెనుదిరిగి చూచినను 'హంటర్-కమిటీ యెదుట సాక్ష్య మీయఁగూడదు' అను నాఁటి నిశ్చయము శుద్ధముగాను, ఉచితముగాను తోఁచుచున్న దని చెప్పిన జాలును.

హంటర్-కమిటీని బహిష్కరించినపిదప లోకుల తరపున, అనఁగా కాంగ్రెసుతరఫున విచారణసంఘము నేర్పఱుపవలయుట తర్కసిద్ధము కదా! పండిత మోతీలాల్ నెహ్రూ, స్వ. చిత్తరంజనదాస్, శ్రీ అబ్బాస్ త్యైయబ్‌జీ, శ్రీ జయకరుగారును, నేనును పండిత మదనమోహనులచే సదస్యులముగా నేర్పాటు గావింపఁబడితిమి. సాక్ష్యము తీసికొనుటకు మేము వేఱు వేఱు చోటుల కరిగితిమి. పని నేర్పాటు చేయుట సహజముగా నావంతే. మరియు చాల చోటుల విచారణ చేయుట నాపాలఁ బడుటచే పాంచాలగ్రామములను, పాంచాలురను లెస్సగా నర్థము చేసికొను నలభ్యయోగము నాకుఁ గలిగెను.

ఈ విచారణలో నాకు పాంచాలస్త్రీలతోఁగూడఁ జాలఁ బరిచితి లభించెను. యుగముల తరబడినుండి మే మొండొండ నెఱిఁగినటు లుండెను. నేను వెళ్లిన తావుల నెల్ల స్త్రీలు గుంపుగుంపులుగా వచ్చెడివారు. తాము వడికి తెచ్చిన నూలుకట్టలను

నాయందు పెట్టెడివారు. పాంచాలము ఖాదీ కొక గొప్ప క్షేత్రము కాఁగలదని నేనీ విచారణలో అనాయాసముగాఁ దెలిసికొంటిని.

లోకులకుఁ గలిగిన ఘోరకష్టములను విచారించుచుఁ బోయిన కొలఁదిని రాచవారుచేసిన అరాచకము, ఆఫీసరులు కావించిన నాదిర్షా ప్రభుత్వము మొదలగు ఘోరములను వినఁగా వినఁగా నా కాశ్చర్యమును, దుఃఖమును గలిగెను. సరకారువారి కన్ని దేశములకన్న నెక్కువమంది సైనికుల నిచ్చిన దా పాంచాలదేశము. అచటి జనమే సరకారువారిచే నిట్టి యాతన లనుభవింపవలసివచ్చెను. ఈ విషయమప్పటికినిప్పటికి నాకు విస్మయావహముగనే యున్నది.

ఈ కమిటీ రిపోర్టు నంతయు తయారుచేయు భారముగూడ నామైఁ బెట్టఁబడెను. పంజాబునందు జరిగిన యత్యాచారముల నెఱుఁగఁగోరినవారు తప్పక ఆ రిపోర్టును చదివితీరవలయును. ఆ రిపోర్టునం దెచటఁగి చేసిన యత్యుక్తి యొకటియు లే దని నేను చెప్పఁగలను. అందలి ప్రతివిషయమునకును ప్రమాణము కలదు. ఇంతియకాక ఇం దుదాహరింపఁబడిన విషయము లన్నియు పుచ్చుకొనిన వాఙ్మూలములం దేకదేశము. శంక కిసుమంతయేని యవకాశమున్న సాక్ష్యమొకటియు నీరిపోర్టునందు ప్రకటింపఁబడలేదు. ఈరీతిగా సత్యము నెదుట నిలువఁబెట్టుకొని వ్రాయఁబడిన యీ రిపోర్టును పాఠకుఁడు చేతఁ దీసికొనినచో బ్రిటిషువారు తమ యధికారమును నిలుపుకొనుటకొఱకెంత దూరము పోవఁగలరో, యెట్టి యమానుష కార్యములు చేయఁగలరో తెలిసిపోవును. నాకుఁ దెలిసినంతవఱకు రిపోర్టునం దొకమాటలోనేని యసత్యగంధము లేదు.

౩౭

బదులుకు బదులా?

పాంచాలహత్యాకాండను కొంతసేపు విడనాడుదముగాక! పంజాబునందలి డైయరు పరిపాలనమును గుఱించి కాంగ్రెసు విచారణము జరుగుచున్నతఱి నా కొక పెద్ద పిలుపు వచ్చెను. ఇందు స్వ. హాకీముసాహెబు భాయి ఆసఫాలీగారల చేవ్రాలు కలవు. శ్రద్ధానందస్వాములుఁగూడ వచ్చెద రని యందుఁ గలదు. వా రాసభ కుపాధ్యక్షు లనుకొందురు. ఖిలాఫతును గూర్చి యాలోచించుటకు హిందూముసలమానుల సంయుక్తసభ ఢిల్లీలో జరుగును గాన నేనును ఆ సభ కాహ్వానింపఁబడితిని. ఆ సభ నవంబరులో జరిగెఁ గాఁబోలును.

ఆ యుత్తరమునందు ఖిలాఫతు చర్చమాత్రము కాక గోరక్షణ చర్చగూడ జరుపఁబడు ననియు, గోరక్షణను సాధించుట కది మంచి సమయ మనియు వ్రాయఁబడెను. నాకీ వాక్యశేషము బాగుగాఁ గనఁబడలేదు. నేను వచ్చుటకు ప్రయత్నింతు ననియు, ఖిలాఫతును గోరక్షణమును కలిపి బదులుకు బదులుగా చర్చింపవల దనియు, గుణదోషములను పురస్కరించుకొని యే విషయమున కా విషయమును విడివిడిగా విచారించి దాని దాని యోగ్యత నిర్ణయింపవలసియుండుననియు ప్రత్యుత్తరము వ్రాసితిని.

నేను సభకు వెళ్లితిని. వేనవేల జనము రాలేదుగాని చాల మంది వచ్చిరి. ఆ సభకు శ్రద్ధనందస్వాములవారు విజయంచేసిరి. తొలుత వారితో నేను పై విషయమునుగుఱించి మాటలాడితిని. వారికి నా యభిప్రాయము రుచించెను. 'సభాముఖమున కీ విషయమును గొనిరం' డని వా రనిరి. హాకీముసాహెబుతోఁగూడ మాటలాడి చూచి

తిని. గుణదోషములను పురస్కరించుకొని యీ రెండు విషయములను విడి విడిగా చర్చింపఁబడవలయు నని నా యభిప్రాయము. ఖిలాఫతు విషయమునందు సత్యమున్నయెడల గవర్నమెంటువారు దాని కన్యాయ మాచరించినయెడల హిందువులు ముసలమానులకు తోడుపడవలెను. దీనికి గోరక్షణమును జోడింపరాదు. హిందువులిందులకు షరతులు కోరుట మంచి దనిపింపదు. 'మీరు మా ఖిలాఫతుకు తోడుపడుఁడు; మేము గోవధము మానుదుము' అని ముసలమాను లనుటయు మంచి దనిపింపదు. హిందువులు తమకు పొరుగువారగుటచేతను, ఏకభూమియం దుండువార లగుటచేతను హిందువుల మనోభావముల నాదరించుటకు ముసలమానులు స్వతంత్రముగా గోవధము చేయుట మానుకొనుట మంచిది. అది వారికి కర్తవ్యము. కాని ఇది స్వతంత్రవిషయము. నిక్కముగా నిది వీరికి కర్తవ్యమాయెనేని, తా మిది తమకు కర్తవ్యమని భావింతురేని హిందువులు ఖిలాఫతువిషయమున సాయము చేసినను, చేయకపోయినను ముసలమానులకు గోవధము మాను టుచితము. ఈ రెండు విషయములను ఈరీతిగా విడి విడిగా విచారించుట యుక్తము కావున సభలో కేవలము ఖిలాఫతును గూర్చి మాటలాడుట యుచితమని నా యభిప్రాయము. సభవారికిఁగూడ నా యభిప్రాయము సంగతముగా నుండెను. సభలో గోరక్షావిషయము చర్చకు రాలేదు. అయినను మౌలానా అబ్దుల్ బారీగా రిటు లనిరి: 'హిందువులు ఖిలాఫతుకు సాయపడినను సాయపడకున్నను, ఏకక్షేత్రనివాసు లగుటచే హిందువుల మనఃప్రవృత్తి ననుసరించి గోవధమును మానవలయును.' ఒకానొక సమయమున గోవధ మాఁగి పోయినట్లుఁగూడఁ గానవచ్చెను.

ఖిలాఫతుతో పాంచాలవిషయమును జోడింప వలయు నని కొందఱు సూచించిరి. ఇదియును నాకు గిట్టలేదు. ఈ పాంచాల

విషయము స్థానికము. పాంచాలమునకు మహాదుఃఖ మొదవె వని సామ్రాజ్యమునకు సంబంధించిన శాంత్యుత్సవమునుండి పాంచాలమును విడిగా నుంచుటకు వీలు లేదు. సంధిషరతులనుండి యుద్భవించిన ఖిలాఫతు విషయముతో దీనిని జతపఱచుట యవివేకము నారోపించుకొనుటయే యగు నని నాయభిప్రాయము. ఇది యందఱకును సమ్మతమాయెను.

ఆ సభలో మౌలానా హజరత్ మోహానీగా రుండిరి. నే నిదివఱకే వీరి నెఱుఁగుదునుగాని వీ రింత యోద్ధ లని అదివఱ కెఱుఁగను. మా కిరువురకును చాల విషయములలో మతభేదము కలదు. అది కూడ పలుకును అటులే యుండెను.

సభలో జరిగిన అనేక ప్రస్తావములలో హిందువులు, ముసల్మానులు అందఱును స్వదేశీవ్రత మవలంబింపవలయు ననియు, అందులకుఁగాను విదేశీవస్త్రములను బహిష్కరింపవలయు ననియు నొక ప్రస్తావము తీర్మానమునకు వచ్చెను. నాఁటివఱకును ఖాదీకి పునర్జన్మము కలుఁగలేదు. ఈ ప్రస్తావము హజరత్ సాహె బంగీకరించునది కాదు. ఆంగ్లసామ్రాజ్యము ఖిలాఫతునకు న్యాయము కలిగింపని యెడల పగ దీర్చుకొనవలయు నని వారి యభిప్రాయము. కావున వారు ఈ ప్రతిపాదనమున కెదురుగా 'బ్రిటిషువస్తుమాత్రమును యథాసంభవముగా బహిష్కరింప వలయు'నని వాదించిరి. బ్రిటిషువస్తుమాత్రమును బహిష్కరించుట అశక్యమనియు, నయోగ్యమనియు చాల హేతువులు నే నపుడు చెప్పితిని. ఇపు డా హేతువు లందఱకును దెలియును. నేను నా యహింసావిషయమును కూడ సభవారియెదుటఁ బెట్టితిని. నా వాదప్రభావము సభవారిమీఁద బ్రసరించినటులు కనుగొంటిని. హజరత్ మోహానీగారి యుపన్యాసము నాలకించి సభవారు

హర్ష నాదము లొనరించిరి గాన నా తూతూ ఎవరికిని వినిపింప దనుకొంటిని. అయినను సాధర్మ్యమును నేను జేసికొనవలయు ననియు, నా యభిప్రాయముల నేల దాఁచిపెట్టవలయు ననియు నేను లేచి మాటలాడుటకు సాహసించితిని. సభ్యులు నా మాటలను జెవి యొగ్గి వినిరి. ప్లాట్ఫారముమీఁది కొకరితరువాత నొకరుగా పలువురు వచ్చి నా యభిప్రాయమును సంపూర్ణముగా సమర్థించిరి. బ్రిటిషు వస్తుమాత్ర బహిష్కారమును తీరుమానించుచో కొంచె మయినను ప్రయోజనము కలుఁగకపోఁగా నగుబాటగు నని నాయకులకు తెలిసి పోయెను. ఆ సభయంతటిలో ఏదో సీమవస్తువు లేని మనుజుఁ డొకఁడును లేఁడు. ప్రతిపాదకులే యనుష్ఠింపఁజాలని విషయములు కల యీ తీరుమానమువలన చెలుపుకెక్క మేలు లేదని ఆ సభలో పలువురు కనుఁగొనిరి.

'మేము మీ విదేశవస్త్ర బహిష్కారమువలన సంతోషించుచు కూరుచుండఁజాలము. మనము మన వస్త్రముల నన్నిటిని ఎపుడు వడికి నేసికొనఁగలము? ఇఁక విదేశవస్త్రబహిష్కార మెపుడు చేయఁగలము? సీమవారికి కాఁక పుట్టించు వస్తు వొకటి మనకుఁ గావలయును. మీ వస్త్రబహిష్కారముతో మాకు జగడము లేదు గాని దానితోపాటు కాఁక కలిగించు చులుకువస్తువు దేనినయినను మాకు పడవేయుఁడు!' అని మౌలానాగా రనిరి. 'క్రొత్త వస్తువిం కొకటి వలయు' నని నాకుఁ గూడఁ దోఁచెను. విదేశవస్త్ర బహిష్కారము వడిగా ఫలింపదని నా కపుడు తెలి యును. అచ్చుఖాదీని తయారుచేసికొనఁగల శక్తి మనలో నున్న దని తరువాతఁ దరువాత నాకుఁ దెలిసెను గాని అపుడు తెలియలేదు. సీమబట్టలను ముట్టకుండుటకు కేవలము మిల్లులను నమ్ముకొనినచో దగా పడుదు మనియు నాకుఁ దెలియును. మౌలానాసాహెబు తన

ఉపన్యాసము ముగించునంతలో ప్రత్యుత్తర మొసఁగుటకు నేను తయారుగా నుంటిని.

ఈ క్రొత్త వస్తువులు దెలుపుటకు నాకు ఉరుదూమాట గాని, హిందీమాటగాని దొరకలేదు. ఇట్టి శుద్ధముసలమాను సభలో యుక్తిప్రధానమగు నుపన్యాస మొసఁగుట నా కిదియ మొదలు. కలకత్తాలో జరిగిన ముస్లింలీగులో నేను కొంచెము ఉపన్యసించితిని గాని యది కొలఁది నిముసములే. మరియు నుపన్యాసమునందలి విషయము సభ్యుల హృదయములకు తన్మయత కలిగింపవలసినదే కాని యుక్తిప్రధానము కాదు. మరియు, నిచటి సభ్యులు నాకు విరోధులు కాకున్నను వీరి మతమును, నా మతమును భిన్నము. ఢిల్లీ ముసలమానులకడ శుద్ధమును, సలక్షణమును నగు ఉరుదులో నుపన్యసింపఁ జాలను గాని వచ్చియు రాని హిందీలో నా యభిప్రాయమును వారికిఁ దెలుపఁగలిగినఁ జాలును. ఈ రీతిగా నా పనిని నేను నెఱవేర్చుకొంటిని. 'హిందీ - ఉరుదు' భాష రాష్ట్రభాష యగుట కర్హమయిన దనుటకీసభయే ప్రత్యక్షప్రమాణము. నే నింగ్లీషులో నుపన్యసించినచో నా యభిప్రాయమును ఇప్పటివలె వారి మనస్సులకు పట్టింపగలిగి యుండెడివాఁడను గాను. మరియు మౌలానాసాహెబు చేసిన పూర్వపక్షమునకును అది తగి యయ్యెడిది కాదు. ఒకవేళ అయినను దానికి సమర్థమయిన సమాధానము నాకడనుండి వచ్చియుండెడిది కాదు.

తుద కిటులో చెప్పఁగలిగితినిగాని మొదట నా యీ క్రొత్తవస్తువును దెలుపుట కురుదుమాటగాని, హిందీమాటగాని తట్టక పోవుట నాకు లోటుగా నుండెను. నాకు 'నాన్-కో-ఆపరేషన్' అను మాట దొరకెను. మౌలానాగా రుపన్యసించుచుండఁగా నా

కెటులు తోఁచెను:'ఒకటి గాదు-రెండు గాదు: అనేక విషయము లలో తాము గవర్నమెంటుకు సాయపడుచున్నారు. అట్టి గవర్నమెంటును బలవత్తరముగా నిరోధింపవలయు నని చెప్పుట వ్యర్థము. పోనీ కత్తి గట్టుద మందమా, కాని పని. కావున సాయము చేయకుండుటయే సరి యయిన నిరోధము' ఈరీతి గానే నా సభలో నాన్-కో-ఆపరేషన్ అను మాటను మొదటి మాట్లు వాడితిని. నా యుపన్యాసమున దీనిని సమర్థింపఁ దగిన యుక్తులను సభవారి మది కెక్కించితిని. ఈ మాట యెన్ని యర్థముల కాకరమో అపుడు నాకుఁ దెలియదు. కావున నేను దాని తపిసీలులోనికి దిగ లేదు. నే నిటులు చెప్పినటులు గుర్తు:

ముసలమానులు ఒక గొప్ప విషయమును తీర్మానించుచున్నారు. వారికి సంధిషరతులు అనుకూలము కానిచో సర్కారు వారికి సాయ మాఁపివేసెదరు. ఇది ప్రజల హక్కు. సరకారువారి బిరుదులు మే ముంచుకొనము. వారి నౌకరి నిఁక మేము చేయము. ఖిలాఫతువంటి ఆవశ్యకమగు ధర్మవిషయమును సరకారువారు వ్యర్థపుచ్చుచో మే మిఁక వారి కెటులు సాయపడఁగలము? ఖిలాఫతు నెగురఁగొట్టుచో సాయము చేయకుండుట మా హక్కు.'

పిదపఁ గొన్ని నెలలవఱకును ఈ క్రొత్తవస్తువు ప్రచారములోనికి రాలేదు. కొన్ని నెలలవఱకు ఈశబ్ద మీ సభలో నడఁగి యుండెను. ఒకనెలపిదప అమృతసరమున కాంగ్రెసు జరిగెను. నే నపుడు సహకారము చేయవలయు నను తీరుమాన మామోదించితిని. హిందూ ముసలమానుల కెన్నఁడును ఆ సహకారమున కక్కఱ గలుగు నని నే నపు డనుకొనలేదు.

౩౮

అమృతసరపు కాంగ్రెసు

మార్షలు లా అమలులో నున్నపుడు పేరునకు మాత్రము సాక్ష్యము పుచ్చుకొని, నామమాత్రమునకు కోర్టులనువానిలో విచారించి వందలకొలఁది పంజాబువారిని నెలల తరబడి, యేండ్లతరబడి ఖైదులోఁ బెట్టిరి. ఈ దురన్యాయమునకు నలుఁవైపులను హాహాకారములు బయలుదేరుటచే సరకారువారు వారి నెంత కాలమో ఖైదులో నుంపఁజాలక పోయిరి. కాంగ్రెసు ప్రారంభము గాకముందే పలువురు విడుదల గావింపఁబడిరి. హరికిషన్‌లాలుగారు మొదలగువారు ముందు వదలిపెట్టఁబడిరి. పిమ్మట కాంగ్రెసు నడుమ, అలీసోదరులు విడువఁబడి నూటిగా కాంగ్రెసునకు వచ్చిరి. నాఁడు లోకుల సంతోషమునకు మితి లేదు. తన ప్రాక్టీసు నంతయు త్యజించి పాంచాలమున బసపెట్టిన మోతీలాలునెహ్రూగారపుడు కాంగ్రెసునకు అధ్యక్షులు. శ్రద్ధానందస్వాములవారు స్వాగతసభ కధ్యక్షులు.

హిందీభాషలో నొక చిన్న యుపన్యాస మిచ్చి హిందీ భాషకు వకాలతునామా పుచ్చుకొనుటయు, ఉపన్యాసమున వలస పోయిన హిందువుల స్థితిగతులనుగురించి చెప్పుటయుమాత్రమే ఇంతవఱకును కాంగ్రెసులో నాకుఁ గల పని. ఈ సంవత్సరమునఁ గూడ నింక కెక్కువ పని యుండ దని తలఁచితిని. కాని వెనుక కలుమాఱులు జరగిన చందముగనే ఈమాఱును కొంత కార్యభారము నామీఁద పడెను.

క్రొత్త సంస్కరణములను గురించి చక్రవర్తిగారి ఫర్మానా జారీ యాయెను. దానివలన నెవరికిని సంతుష్టి కలుగలేదు. నాకుఁగూడ సంపూర్ణముగా సంతుష్టి కలుగలేదు. సదరు ఫర్మానాలో సూచింపఁ

బడిన సంస్కరణములలో లోపము లున్నను స్వీకరింపఁ దగు నని అపుడు నాకుఁ దోఁచెను. చక్రవర్తిగారి ఫర్మానాలో లార్డు సింహా గారి సంతకము గూడ నుండుటచే ఆ సమయమున ఆ భావములో నా కాశాకిరణము కానిపించెను. కాని అనుభవశాలు లగు లోకమాన్యులు, చిత్తరంజనదాసులు మొదలగు పెద్దలు పెదవి విఱిచిరి. భారతభూషణము మదనమోహనులు మధ్యస్థులుగా నుండిరి.

మదనమోహనులు నన్ను తమ డేరాలో నుంచుకొనిరి. కాశీ విశ్వవిద్యాలయశంకుస్థాపనమున కేఁగినపుడు నేను వారి నిరాడంబర జీవితము నెఱిఁగియుంటిని గాని నే నిపుడు వారి సొంత డేరాలో నే యుండుటవలన వారి దిన చర్యలో ప్రతివిషయమును చూచి యానందాశ్చర్యముల నొందితిని. వా రున్న తావు పేదలకొల్ల సత్రము. దానిలో దారి దొరకదు. ఎటుఁ జూచినను మనుష్యులే. ఇందు వైశాల్యము లేదు; ఏకాంతమును లేదు. ఎవఁ డే సమయమున నెంతసేపు మాటలాడఁ దలఁచికొనినను నచట లోటు లేదు. ఇట్టి వీరి యీ గదిలో నా దర్బారు—అనఁగా మంచము.

ఈ ప్రకరణము మాళవ్యుల జీవితపద్ధతిని వర్ణించుటతో వ్యయింపక ప్రకృత మనుసరింతును.

మాలవ్యులతో ప్రకృతస్థితిగతులగుఱించి మాటలాడుచుంటిని. అన్నగారి వలె వారు నా కన్ని పక్షములవారి యభిప్రాయములను దెలుపుచుండిరి. సంస్కరణముల గుఱించిన చర్చలలో నేనును భాగస్వామిని గావలయు నని తలఁచితిని. పాంచాలహత్యాకాండను గుఱించిన విచారణసంఘమున నాకు పా లుండెను. తత్సంబంధమున సరకారువారితో పని యున్నది. మఱియు, ఖిలాఫతు మాట యొకటి. మి. మాంటేగు హిందూదేశమునకు మిత్ర మనియు భారతీయులకు దగా చేయఁ డనియు నా యభిప్రాయము. అలీసోదరుల విడుదల గూడ శుభచిహ్న మనుకొంటిని. ఇట్టి స్థితిలో సంస్కరణముల స్వీకరించుట మంచి దని తోఁచెను. సంస్కరణములు చాల నసంతోషకారకములను, అఱుగొఱలును గావున వానిని స్వీకరింపరా దని చిత్తరంజన

దాసుగారి యభిప్రాయము. లోకమాన్యులు కొంచెము తటస్థులుగా యుండిరిగాని దేశబంధువు పక్షమునే సమర్థింపఁ దలంచికొనిరి.

ముక్కాఁకలు తీఱిన యీ లోకనాయకులతో నా మతము వేఱుపడుట నాకుఁ గష్టమనిపించెను. ఇది యిట్లుండఁగా నా యంతర్వాణి నాకు విస్పష్టముగా వినఁబడుచుండెను. కాంగ్రెసు నుండి తప్పించుకొనిపోవఁ బ్రయత్నించితిని. నేను గైరుహాజరగు నెడల నన్ని కార్యములును చక్కఁబడు ననియు, గొప్పగొప్ప నాయకులకును నాకును మఱి భేదము లేకుండ బ్రతికిపోవుదు ననియును పండిత మోతీలాలుగారికిని మదనమోహనులకును దెలిపితిని.

ఈ పూజ్యపాదులకు నా మాట యిష్టము కాలేదు. ఎవరో యీ మాటను హరి కిషన్ లాలుగారి చెవిలో నూఁదిరి. 'అటు లెపుడును జరుగఁగూడదు. ఇది పాంచాలురకుఁ జాలఁ గష్టము కలిగించును' అని వా రనిరి. లోకమాన్యులతోడను దేశబంధులతోడను జిన్నాగారితోడను సంప్రతించితిని. ఎంతయాలోచించినను దారి కానరాలేదు. నా వేదన యంతయు మాలవ్యాగారితో నిట్లు వెళ్ళఁబోసికొంటిని: 'మాకు సమాధానము కుదురునట్టులు లేదు. నా ప్రస్తావమును తీర్మానముగఁ బెట్టుచో వోట్లు తీసికొనవలసి వచ్చును. దానికి వీలు కానఁబడదు. ఇంతవఱకును వోట్లు తీసికొనుటకు చేతు లెత్తించుచున్నాము. చేతు లెత్తునపుడు ప్రేక్షకులయు సభ్యులయు భేదము లేకుండఁ బోవుచున్నది. ఇంత పెద్ద సభలో నిక్కచ్చిగా వోట్లు పరిగణించుటకు సౌకర్యము లేదుగాన నేను నా పక్షమునకు వోట్లు కోరినను దానికి వీలు పొడకట్టదు.'

కాని లాలా హరికిషన్‌లాలుగారు దీనికి వీలు కలిగింప నేర్పాటుచేసిరి. 'వోట్లు తీసికొనునాఁడు ప్రతినిధులనేగాని ప్రేక్షకులను రానీయము. వోట్ల భారము నాది. అంతియే కాని, మీరేమి! గైరుహాజరేమి!' అని హరికిషనుగా రనిరి.

తుద కొప్పింపఁబడితిని. తీర్మానమును వ్రాసితిని. కడు సంకోచముతో ప్రతిపాదింప నంగీకరించితిని. జిన్నా మాళవ్యులు

సమర్థనలు. నేను ప్రతిపాదించితిని. మాకుఁ గల మతభేదమునం దిసుమంతయు ముఖ్యము లేకున్నను, మా యుపన్యాసములం దేని యుక్తితర్క మతి యేమియు లేకపోయినను సభ్యు లింతమాత్రము మతభేదమునుగూడ సహింపకపోయిరి. వారికి కష్టము కలిగెను. సభ కైకమత్య మిష్టము.

ఒక మూల ఉపన్యాసములు జరుగుచుండెను. ఒక మూల వేదికమీఁద రాజీప్రయత్నములు జరుగుచుండెను. ఒకరికడనుండి మఱియొకరి కడకు చీటులు నడచుచుండెను. మాలవ్యాగారు రాజీచేయుటకు సకలబాధలు పడుచుండిరి. ఇంతలో జయరామదాసుగారు నా చేతిలో తమ చీటి నుంచి యీ సంకటమునుండి ప్రతినిధులను తప్పించుటకు మిగుల మధురములగు శబ్దములతో నన్ను శోధించిరి. వారి తీరుమానమునం దొకటి చేర్పవలయు నని చేసిన సూచన నాకు బాగుగఁ గానిపించెను. మాలవ్యాగా రదివఱకే నలు వైపులను సంధి కాసించుచుండిరి. 'జయరామదాసుగారు చేసిన సూచన యిరువాగుల వారికిని ఉపాదేయముగాఁ గానిపించుచున్నది.' అని నే నంటిని. లోకమాన్యులకు దానిని జూపితిని. 'దాసుగారి కొప్పుదల యగుచో నాకును ఆపత్తి లేదు' అని వారనిరి. తుదకు దేశబంధులును మెత్తఁబడి విపినచంద్రపాలుఁగారి దెసఁ జూచిరి. మాలవ్యాజీకు ధైర్యము కలిగెను. వారా చీటిని చేతికిఁగొని దాసుగారి మోము నుండి 'సరే' అను మాట రాకమునుపే 'సభ్యులారా! తమ కిఁక సంతస మొందవఁగలదు; సమాధానము కుదిరెను' అని చెప్పివేసిరి. ఇకఁ జెప్పున దేమి? కరతాళధ్వనులతో సభామంటప మంతయు మ్రోఁగిపోయెను. గంభీరములగు మోము లన్నియు సంతోషముతో ప్రజ్వలించెను.

ఆ తీర్మానమును సవరణను ఇచటఁ జర్చింపఁ బని లేదు. ఏలనఁగా, నీ తీర్మాన మెటులాయెనో చెప్పుటయే నా శోధనములకు విషయము.

ఈ సమాధానమువలన నా జవాబుదారి యెక్కుడాయెను.

౩౭

కాంగ్రెసుతో సాక్షాత్సంబంధము

అమృతసరమున కాంగ్రెసు - వ్యవహారములు చూచినంత మాత్రమున మహాసభతో నాకు సాక్షాత్సంబంధము కలిగిన దని నే నుద్దేశింపలేదు. లోగడ నేను కాంగ్రెసులకు వెళ్లుట నాకుఁ గల భక్తిని దానిముందు దాఖలుచేసికొనుటకే. చిన్నచిన్న పనులు తక్క పెద్ద పను లేవియు నాకు అం దున్నటు లెన్నఁడును గోచరింపనూ లేదు. నేను 'కోరనూ' లేదు.

నాకుఁ గల రెండు శక్తులు కాంగ్రెసుకు ఉపయోగించు నని అమృతసరమున నా కనుభవ మాయెను. పాంచాలవిచారణసంఘము నందు నా చేసిన పని లోకమాన్యులకును మదనమోహనులకును మోతీలాలు గారికిని దేశబంధువులకును, సంతోషము కలిగించె నని నే నెఱిఁగితిని. సలహాలకును సంప్రతింపులకును తమ యాంతరంగిక సభల లోనికి వీరు నన్నుఁ బిలువ నంపుచుండెడివారు. సరియగు విషయ నిర్ధారణ మిచటనే జరుగుచుండెడిది. కేవలము విషయముల నిర్ధారించు వారే యచట సమకూడెడివారు. నాయకుల విశ్వాసమునకుఁ దగిన వారే యచటికి రాఁగలవా రయినను చాటుమాటుగా పైవారుఁ గూడఁ గొందఱు దూఱకుండుట లేదు.

రాఁబోవు సంవత్సరమునఁ జేయవలసిన పనులు రెండు గలవు. అందులకు నాకుఁ గొంత సామర్థ్యము గలదు; చేయవలయు నను ఉద్దేశమును గలదు.

జలియన్‌వాలాబాగులో జరిగిన హత్యలను గుర్తుతెచ్చుట కొక చిహ్నమును నెలకొలుపుట యీ పనులలో నొకటి. కాంగ్రెసంతయు

మిగుల పూనికతో నీ విషయమును తీర్మానించెను. దీని కయిదులక్షలు సంపాదింపవలసియుండెను. నేను ఒక ట్రస్టీగా నియమింపఁబడితిని. ప్రజాకార్యములకు ధనము పోగు చేయఁగలవారలలో మదనమోహన మాలవ్యాగారిది మొదటి పేరు. నేనును వారికి తీసికట్టు కానని నాకుఁ దెలియును. నాకీ శక్తి కలదని దక్షిణ - ఆఫ్రికాలో గుర్తించితిని. రాజులకడను మహారాజులకడను లక్షలు తెచ్చు శక్తి నాకు లేదు. నేఁటికిని లేదు. కావున మాలవ్యాగారితో పోటీ పెట్టుకొనవలసిన పని నాకుఁ గానరాదు. అదియునుగాక జలియనువాలాబాగునకు సంబంధించిన పనిలో రాజుల ద్రవ్యము తీసికొనరాదని నాకుఁ దెలియును. కావున ఈ స్మృతిచిహ్నమును నెలకొలుపుటకు ధనము చేకూర్ప వలసిన ముఖ్యభారము నాపైఁ బడునని ట్రస్టీపదవి గ్రహించునపు డనుకొంటిని. పిదప నటులే యయ్యెను. ఇందునకు బొంబాయిలోని ఉదారులు చేతినిండ ధన మొసఁగిరి. అది యిప్పుడు నిలువ యున్నది. దాని వినియోగమున కొక చిక్కు వచ్చెను. జలియనువాలా బాగులో హిందువులయు, ముసలమానులయు, సిక్కులయు రక్తముచే పవిత్రమగు నీ భూమిపై నెట్టి స్మృతిచిహ్న ముంపవలయునని శంక కలిగెను. ఏలనఁగా, ఈ మువ్వురిలో ఏ యిరువురికిని నేఁడు చెలిమి లేదు.

ఇఁక నా రెండవ శక్తి—నాకు ముసద్దీ పని తెలియును. అది కాంగ్రెసు కుపయోగించును. కొలఁది మాటలతో అవినయము లేని భాషలో వ్రాయఁ గల నేర్పు నాకుఁ గలదని నాయకు లంద ఱెఱుఁగుదురు. దీర్ఘకాలాభ్యాసమువలన నాకీ నేర్పు కలిగెను. నాఁటికమలులో నున్న కాంగ్రెసు కార్యప్రణాళిక గోఖలేగా రిచ్చి పోయిన కవిలె. కాంగ్రెసు - తంతుకు అందలి నియమావళి యాధారము. మధురమగు దాని యితిహాసమును వారివలననే నేను వినియుంటిని. కాంగ్రెసు - పనులు విరివి యగుటవలన నిపు డా సమయబలము చాల దని సర్వవిదితమే. దానికిఁ బ్రతియేఁడును చర్చ జరుగుచుండెడిది. ఏఁడాదిపొడుగునను పనులు జరుగఁగల

౩౮ కాంగ్రెసుతో సాక్షాత్సంబంధము

యేర్పాటుగాని రాఁబోవు విషయములను విచారించు నేర్పాటుగాని నాఁటికి లేదు. దీనికి మంత్రులు మువ్వురు. కాని నిక్కముగ నొక్కఁడే. అతఁడయినను ముప్పొద్దులు పనిచేయగలవాఁడు కాఁడు. ఈ యొక్కఁడే కాంగ్రెసు-ఆఫీసు నెట్లు నడపును? భవిష్యద్విషయముల నెట్లు లాలోచించును? భూతకాలమునఁ దలపెట్టిన కార్యముల నెట్లు నిర్వహించును? కావున నా యేఁడు అన్నిటికంటె నీ విషయము నాలోచించుటయే ఆవశ్యక మాయెను. కాంగ్రెసులో వేనవేల జనము. అందు ప్రజాకార్య మెట్లు సాగును? ప్రతినిధుల సంఖ్యకు హద్దు లేదు. ప్రతిప్రాంతమునుండియు నిందఱు ప్రతినిధులు రావలయు నను నియతి లేదు. మఱియు నందఱును ప్రతినిధులే కావచ్చును. కావున దీని కొక యేర్పాటు ఉండి తీరవలయు నని అందఱకును తోఁచెను. నే నొక షరతుతో ఈ యేర్పాటు చేయుటకు పూఁచీపడితిని. జనములో పలుకుబడి గల మహానాయకు లిరువు రని నే నెఱుఁగుదును. ఈ కాంగ్రెసు - కార్యప్రణాళికను కూర్చుటలో జనులకు ప్రతినిధులుగా నాకు సాయము చేయుఁడని వా రిరువురిని నేను కోరితిని. కాని వా రిరువురికిని యీ విధానమును తయారు చేయుటకు తీరిక యుండ దని నాకుఁ దెలియును. దానఁ జేసి 'తమకు విశ్వాసపాత్రములగు నిరువురను నాకు తోడొసఁగు' డని లోకమాన్యులను దేశబంధువులను యాచించితిని. ఈ కార్యప్రణాళి-సమితిలో వీరికంటె పైవా రెవరును ఉండఁగూడ దని సూచించితిని. నా సూచన యంగీకృత మాయెను. లోకమాన్యులు శ్రీ కేలకర్ గారి పేరు చెప్పిరి. దేశబంధులు శ్రీ ఐ. బి. సేన్ గారి పేరు చెప్పిరి. ఈ మువ్వురును ఒక నాఁడేని కలిసి కూర్చుండలేదు. మేము టపాలో పరస్పరాభిప్రాయము లెఱిఁగికొంటిమి. తుదకు సమరసముగ నభిప్రాయముతో రిపోర్టు తయారుచేసితిమి. దీనిగుఱించి నే నొకమాట చెప్పుదును—'ఈ విధానము చొప్పున పని చేసికొనుచుఁ బోయినఁ జాలును; స్వరాజ్యము సిద్ధించును.' ఈ జవాబుదారీని నెత్తిమీఁదఁ బెట్టుకొనిన పిదపనే కాంగ్రెసుతో నాకు నిక్కముగ సంబంధము కలిగె నని నా యుద్దేశము.

౩౯

ఖాదీ పుట్టుక

౧౯౦౮ సాలువఱకు రాటమునుగాని, మగ్గమునుగాని నే నెఱుఁగను. అయినను రాటముచే హిందూదేశపు బీదతనము పోవు నని నేను హింద్-స్వరాజ్యమున వ్రాసియుంటిని. హిందూ దేశమున పలువురు కడుపుకూటికి లేక చచ్చిపోవుచున్నారు. ఇటులు చావకుండఁ జేయుట కే యుపాయము దొరకునో ఆ యుపాయమే స్వరాజ్యమునకుఁ గూడఁ ద్రోవ జూపు నను మాట యందఱకుఁ దెలిసిన దే యని నే నా పుస్తకమున వ్రాసియుంటిని. ౧౯౧౫ సంవత్సరమున దక్షిణ-ఆఫ్రికా నుండి నేను ఇండియాకు వచ్చినపుడుగూడ రాటమును జూచి యెఱుఁగను. సత్యాగ్రహాశ్రమమును ఏర్పాటుచేసిన తరువాత నచటఁ గొన్ని మగ్గములు పెట్టితిమి. మగ్గములు పెట్టుటకుఁగూడ మాకుఁ గడుఁ గష్టమాయెను. మే మందఱ మిట్టి పనుల కపరిచితులము. మాకు మగ్గము నడపుట సాగలేదు. మే మందఱమును వ్రాఁతవారమును, కూఁతవారమును గాని మగ్గముమీఁద చేయివేసి యెఱుఁగము. చేతి పనులు మా యెఱిఁగినవి కావు. కావున మగ్గ మున్నను నేఁత నేర్పుటకు ఒకఁడు కావలసివచ్చెను. కాఠియావాడు పాలనపురములలో మగ్గములును, నేఁత నేర్పువాఁడును దొరికెను. ఆ నేఁతకాఁడు తన విద్య నంతయు మాకు నేర్పలేదు. కాని మొదలు పెట్టిన పనిని మగన్‌లాలు మానెడివాఁడు కాఁడు. పనివానితన మతని సొమ్ము. కావున నేఁతలో నతఁడు నేర్పరియై ఆశ్రమమునం దందఱకును నొకని తరువాత నొకనికి నేఁత నేర్పివైచెను.

మా వస్త్రములను మేము నేసికొనవలయు నని మా యూహ. కాన నాఁటినుండియు బొమ్మ బట్టలను విసర్జించితిమి. ఇండియా

మిల్లులలో తయారయిన నూలితో నేసిన వస్త్రములనే కట్టుకొనవలయు నని నిశ్చయించితిమి. దీనితో మాకు కావలసినన్ని సంగతులు తెలిసెను. సాలెవారి జీవనము, వారు నేయు వస్త్రముల మొత్తము, నూలు కొనుటలోఁ గల యిబ్బందులు, అందలి మోసము, తుదకు వారి యప్పు సొప్పులు ఈ మొదలగున వన్నియు మాకుఁ దెలిసిపోయెను. ఇట్టి స్థితిలో ఇంత వడిగా మాకుఁ గావలయు వస్త్రము లన్నియు మేము నేసికొనలేము. కావున సాలెవారికడ మా వస్త్రములఁ గొనవలయును. కాని ఇండియామిల్లు నూలితోడనే నేయఁబడిన వస్త్రములు బట్టలవర్తకులకడఁ గాని, సాలెవారికడఁ గాని దొరకవు. సాలెవారికడ నున్న సన్నబట్ట యంతయు సీమనూలే. ఇండియా మిల్లులు సన్న నూలు తయారు చేయలేవు. నేఁటికిని అవి తయారు చేయు సన్ననూలు కడుఁ గొలఁది. మఱీ సన్ననూ లవి తయారు చేయనే లేవు. మేము ప్రయత్నము చేయఁగాఁ జేయఁగా తాము నేసిన వస్త్రముల నన్నిఁటిని గొనినచో స్వదేశపు నూలితో నేసి పెట్టుదు మని కొంద ఱంగీకరించిరి. ఈరీతిగా ఇండియామిల్లునూలితో నేయఁబడిన వస్త్రములు మే మేర్పాటు చేసికొంటిమి. మా మిత్రులలోఁ గూడఁ బ్రచారము చేసితిమి. మే మీ రీతి నలవోకగా నూలు మిల్లుల కేజెంటుల మయితిమి. ఈ పరిచయమువలన వారి కార్యపద్ధతియు, వారు చేయు మోసము వగైరాలు మాకుఁ దెలియనాయెను. తామే వడికి తామే నేసి యీవలయు నని మిల్లువారి యుద్దేశము. చేమగ్గములవారికి వా రొనరించు సాయ మనిచ్ఛాపూర్వకము గాని యిచ్ఛాపూర్వకముఁ గాదు.

ఇది యెల్లయుఁ జూడఁగా మన నూలు మనమే వడుకుకొంద మనిపించెను. మనము వడుకుకొననంతవఱకును పరాధీనత తప్పదనుకొంటిమి. ఇండియామిల్లుల కేజెంట్ల మయి దేశసేవ చేయఁ గలుగుదు మనుకొన లేదు.

మాకు రాటము దొరకలేదు; రాటము త్రిప్పఁగలవాఁడును దొరకలేదు. పంచెలకును, కండెలకును మాకడ చక్రములు కలవుగాని వానిమీఁద దారము తీయుటకు వీలు కలదని మాకు తెలియదు. ఒకతూరి వకీలు కాళిదాసుగారు రాటముమీఁద దారము తీయఁగల యామె నొకతెను దీసికొని వచ్చి—'ఈమె మీకు నేర్పఁగల' దని చెప్పెను. క్రొత్త సంగతులను నేర్చికొనుటలో నేర్పరి యను నొకనిని మా యాశ్రమమునుండి యామెకడ కంపితిమి గాని యతఁడును ఆ కళారహస్యము తెలుఁగఁజాలకయే వచ్చెను.

కాలము గడచినకొలఁది నా కాతురత హెచ్చెను. ఆశ్రమమునకు వచ్చిన ప్రతివానితోడను నే నీ సంగతిని గోల పెట్టుచుంటిని గాని యేమి లాభము? ఏలన, వడుకుట ఆఁడువారి కిజారా. కావున ఆఁడువారే అట్టి యాఁడువారిని కనిపట్టవలయును.

౧౯౧౭ సాలున గుజరాతువారు నన్ను శిక్షా పరిషత్తున కధ్యక్షునిగా బ్రోచికి * తీసికొనిపోయిరి. అచట గంగాబాయి యను నామె నాకుఁ గానిపించెను. ఆమె తలచెడ్డది; పెద్దసాహసము కలది. ఆమె వ్రాఁత కోఁత లెఱుఁగదు. వ్రాఁత కోఁతలు వచ్చిన యాఁడువార లెవ్వరికిని ఆమెసాహసము లేదు. ఆమె యస్పృశ్యతను దాఁటెను. ఆమె నిర్భయముగా నంత్యజులలోఁ గలసి మెలసి వారికి సేవ యొనర్చెను. ఆమె ధనవతి. అయినను ఆమెకు కోరికలు తక్కువ. ఆమెశరీరము బలిష్ఠము. ఆమె ముక్కాఁకలు తీఱినది; నదురుబెదురు లేక యెచటికైనను ఒంటరిగా వెళ్లఁగలదు. ఆమె గుఱ్ఱపు సవారు చేయఁగలదు. గోధ్రాలో నా కీమెతో నెక్కువ పరిచితి యొదవెను. నేను నా రాటపు సొద నామెకడ వెళ్లఁబోసికొంటిని. దమయంతి నలుని వెదకఁబోయినటులు రాటమును వెదకఁబోవుదు నని చెప్పి యామె నా బరువు తగ్గించెను.

* భరుకచ్ఛము.

౪౦

దొరకెను

గంగాబాయి గుజరాతంతయుఁ దిరిగి తిరిగి పిదప బడోదా రాజ్యమునందలి బీజాపురమను గ్రామమున రాటమును గనుఁగొనెను. అచటఁ జాల నిండ్లలో రాటము లున్నవిగాని యవి యటకలపయికిని, గోడలపయికిని ఎక్కియుండెను. అయినను ఏకు లిచ్చుట, తీసిన నూలంతయుఁ గొనుట: ఈ రెండు నియమము లున్నయెడల రాటముమీఁద దారము తీయుటకు అచటివారు సంసిద్ధులయి యుండిరి. గంగాబాయి నా కిటులు వార్త యంపఁగనే నా సంతోషమునకు మేర లేకపోయెను. ఏకులు చేయించుట కష్టమాయెను. స్వ. భాయి ఉమర్ సోబానీగారి కీ సంగతి తెలుపఁగా వారు తమ మిల్లునుండి యేకుల కట్టలను పంపుటకు పూచీపడిరి. నే నీ యేకులను గంగాబాయికిఁ బంపితిని. నాఁటనుండి మేము నేయఁ జాల నన్ని నూలుకట్టలు వచ్చి పడుచుండెను.

భాయి ఉమర్ సోబానీగా రుదారతతో పంపుచుండిరిగదా యని మన మూరక పుచ్చుకొనుచుండుటయేనా? దాని కొక మితి లేదా? పోనీ, వెల యిచ్చి పుచ్చుకొందమన్న నాకు మనస్కరింపలేదు. మిల్లు-ఏకులు కొని నూలు తీయించుట నాకు దోషమని తోఁచెను. మిల్లు-ఏకులు కొనినచో నిఁక మిల్లునూలుమాత్ర మేల కొనరాదు? ప్రాచీనులకు మిల్లు లేకులు చేసి పెట్టినవా? కానిచో వా రేకు లెటులు చేయించుకొనిరి? ఇటు లాలోచించి దూదేకువా రెవరేని యేకులు చేసి యిత్తురేమో కనుఁగొను మని గంగాబాయికిఁ జెప్పితిని. ఆమె యంగీకరించెను. ఆమె దూదేకులవాని నొకనిఁ బట్టుకొనెను. అతఁడు నెలకు ముప్పదియయిదు రూక లడిగెను. అదియంతగా నెక్కువ కాదు.

అపుడు నేను వెలను లెక్క చేయలేదు. ఏకీభవదూదితో నీమె బాలుర కేసులు చేయుట నేర్పెను. నేను దూదిబిస్సమునకు బయలుదేఱితిని. భాయి యశవంత ప్రసాదదేశాయి దూదిని పంపు భారమును వహించెను. గంగాబాయి బూనిన యీపని యిటు లత్యంతము వృద్ధి చెందెను. బీజాపూరునందు వడికిన నూలు నేయించుటకు గంగాబాయి నేతగాండ్రను సంపాదించెను. ఇటులు బీజాపూరు — ఖాదీ పేరు మోసెను.

ఇటులు బీజాపూరులో ఖాదీ వృద్ధి యగుచుండఁగా మా యాశ్రమములో రాటము నెలకొనుట కాలస్యము కాలేదు. మగన్‌లాల్ గాంధీ తన నేరుపుచే రాటమునకు కొన్ని సంస్కారణము లొనగూర్చెను. ఆశ్రమమునందే రాటములును, తకిలీలును తయారు కాఁజొచ్చెను. ఆశ్రమమున నేసిన ఖాదీగుడ్డ గజము వెల రు. ౧-౧-౦ ఆయెను. నే నీ మోటు ఖాదీని నా మిత్రుల కిచ్చి గజము ౧-కి రు. ౧-౧-౦ వసూలు చేసితిని. వారు సంతోషముతో నొసఁగిరి.

నేను బొంబాయిలో మంచము పట్టి యుంటిని. అయినను నా భోగట్టా నేను మానలేదు. అచట నూలు వడుకు ఆఁడువా రిరువురు దొరకిరి. వారు ఇరువది యెనిమిది తులముల సేరు నూలున కొక రూక పుచ్చికొనిరి. నే నప్పటికి ఖాదీశాస్త్రమున కంధుఁడను. నాకు చేతినూలు కావలయును. మఱియు ఆఁడువారిచే వడికింపవలయును. గంగాబాయి యిచ్చు వెలయును, నా యిచ్చు వెలయును తావేజా వేసి చూచికొనఁగా నేను మోసములో పడితి నని తెలిసికొంటిని. వా రంతకు తక్కువ ధరకు ఒప్పుకొనలేదు. కావున వారిని విడనాడవలసివచ్చెను. కాని వారివలన మాకుఁ గలుగవలసిన యుపయోగము కలుగనే కలిగెను. వీరు శ్రీ అవంతికాబాయికిని, శ్రీ రమాబాయి కామదారునకును,

శ్రీ శంకర్‌లాల్ బాంకర్ గారి మాతృ శ్రీ వసుమతీ బహేను గారికిని వడుకుట నేర్పిపోయిరి. నా గదిలో రాటము జుమ్మని మ్రోయఁ దొడఁగెను. నా జబ్బు పోఁగొట్టుటలో నీ రాటమునకు భాగము కలదని చెప్పినచో నతిశయోక్తి కాఁజాలదు. జబ్బు పోఁగొట్టుటకు మనస్సు మార్పు ఒక హేతువు; ఇది నిక్కము. మనుజుల రోగములను బోఁగొట్టుటలో మనస్సు పాలుమాత్ర మేమంత తక్కువా? నేను రాటముమీఁదఁ జేయి వయిచితినిగాని అపుడంతగా పని చేయఁజాలక పోయితిని.

బొంబాయిలోఁగూడ నేకులకుఁ గఱవాయెను. చేతియేకు లెచటను దొరకలేదు. రేవాశంకర్ ఝవేరీగారి బంగళాముందు నుండి ప్రతిదినము దూదేకులవాఁ డొకఁడు దూది యేకు వింటిని మూపునఁ బెట్టుకొని పోవుచుండెడివాఁడు. నే నతనిని పిలిపించితిని. అతఁడు పఱుపులకు దూది యేకుచున్నటులు తెలిసికొంటిని. 'ఏకులు చేసిపెట్టెదవా?' యని యడిగితిని. కాని అత డెక్కువ వెల యడిగెను. వెల ఎక్కుడయినను ఇచ్చి యేకులు చేయించితిని. ఈ రీతిగా తయారయిన నూలు జపమాలలుగాఁ జేసి వైష్ణమిత్రుల కమ్మితిని. భాయి శివాజీ బొంబాయిలో నొక రాటపుశాల పెట్టెను. వీని యన్నిఁటికిని చాల వ్యయ మాయెను. శ్రద్ధాళురును, దేశభక్తులును ధన మొసఁగిరి. నేను ఖర్చు పెట్టితిని. ఈ వ్యయము వృథా కాదని వినయముతో మనవి చేసికొందును. దీనివలన మే మెన్నో సంగతులు తెలిసికొంటిమి. వీనితోపాటు రాటమువలని యుపయోగ మంతయుఁ దెలిసెను.

నేను ధరించున వస్త్రము ఖాదీమయ మయిపోయినదాఁక నాకు తోఁచలేదు. నాకట్టుబట్ట లిండియామిల్లువి. బీజాపురమునందును ఆశ్రమమునందును తయారయినవి చాల మోటుగా నుండెను.

మఱియు వాని పన్నా ముప్ఫ దంగుళములు. నలుబదియయి దంగుళముల పన్నాగల ఖాదీ దోవతు లొక నెలలోపుగా నాకుఁ బంపనిచో మోటు ఖాదీపంచలు కట్టుకొనవలసిన యిక్కట్టు కలుగు నని గంగాబాయికి వ్రాసితిని. గంగాబాయి గాబరాపడెను. సమయము చాల దనుకొనెను గాని ధైర్యము విడనాడలేదు. ఈమె యొక నెల లోపలనే ఏఁబది యంగుళముల పన్నా గల రెండు దోవతు లొసఁగి నా దారిద్ర్యమును బాపెను.

ఇంతలో భాయి లక్ష్మణదాసు లాఠీగ్రామమునుండి అంత్యజుఁడయిన, భాయి రామజీనిని, అతని భార్య గంగాబహేనును ఆశ్రమమునకుఁ దీసికొని వచ్చి వారిచే పెద్ద పన్నా గల ఖాదీబట్టల నేయించెను. ఖాదీవ్యాప్తికి ఈ దంపతులు చేసిన పని యింతింత కాదు. వీరు గుజరాతునందును తదితర దేశములందును చాలమందికి చేతి నూలితో బట్టల నేతను నేర్పిరి. అక్షరములు రాకపోయినను సంస్కారవతియగు నీ గంగాసోదరిని మగ్గముమీఁద కూర్చున్నతఱిఁ జూచి తీరవలయును. ఆమె కపు డొకటి కనఁబడదు, మఱియొకటి వినఁబడదు. ఆమె మగ్గమున తన్మయతఁ జెందిపోవును.

౪౧

ఒక సంవాదము

స్వదేశీ ప్రచారమను పేరఁ బరఁగిన యీ ఖాదీప్రచారమారంభమయిన మొదటి దినములలో మిల్లువారి విమర్శము లెక్కువగా జరుగుచుండెడివి. భాయి ఉమర్ సోబానీగారు సమర్థులగు మిల్లుయజమానులగుటవలన తమ జ్ఞానమును అనుభవమును నాకుఁ దెలుపుటయే కాక మిగిలిన మిల్లులవారి యభిప్రాయములను గూడఁ దెలుపుచుండిరి. మిల్లుయజమానులందఱిలో నొకని వాదమితనికి నచ్చెను. నన్నతనికడకు రమ్మనెను. సరే యంటిని. మేమతని కడ కరిగితిమి. మా కిటులు సంవాదమారంభమాయెను:

మీ స్వదేశీ-ఆందోళనమే మొదటిది కాదని మీ రెఱుఁగుదురే కదా?

ఔను. ఎఱుఁగుదును.

వంగవిభాగదినములలో స్వదేశీ-ఆందోళనము చాల జోరుగా జరిగియున్నటులును, మిల్లులకు చాల లాభము వచ్చినటులును మీ రెఱిఁగియుందురు. మేమపుడు వస్త్రముల విలువ హెచ్చించితిమి. చేయరాని పనులనుగూడఁ జేసితిమి.

నే నిదంతయు వింటిని. విని దుఃఖించితిని

మీ దుఃఖము నే నెఱుఁగుదును. కాని దానికి కారణము లేదు. మేము పరోపకారమునకు వ్యాపారము పెట్టుకొనలేదు. మాకు లాభము ఉండవలయును. మేము వాటాదారులకు జవాబు చెప్పవల

యును. ఖర్చునుబట్టి వస్తువువెల యుండును. ఉత్పత్తిగ, అమ్మక మును ఎవ రాఁపఁగలరు? తమ యాందోళనముచే స్వదేశవస్త్రముల వెల తప్పక హెచ్చునని బంగాళీవారికి తెలియవలదా ?

పాప మా పిచ్చివారు కూడ నావంటి వారే. వారికిని నాకు బలె పిచ్చి నమ్మకమే. కావున మిల్లు యజమాను లొక్కపెట్ట స్వార్థ పరులు కాఁజాల రని వారు నమ్మిరి; దగా చేయ రనుకొనిరి. విదేశ వస్త్రములను స్వదేశవస్త్రము లని మభ్యపెట్టి యమ్ముదు రని వా రను కొనలేదు.

మీకు వెఱ్ఱి నమ్మకమని నే నెఱుఁగుదును. కావుననే మీకు హెచ్చరిక చేయఁ దలఁచితిని. అంగులకే మి మ్మింతదూరము రమ్మని కష్ట పెట్టితిని. భోళాబంగాళీలవలె మీరును పప్పులో అడుగు వేయ కుందురు గాక !

ఇటులు పలికి యాసేటు తనమిల్లులో తయారయిన నమోనాల నిటు తెమ్మని కన్ను గిఱిపెను. తీసి పాఱవయిచిన తుక్కునూలితో నేయఁబడిన కంబళి కీ నమోనాలు గ్రువ్వఁబడి యుండెను. వాని నతఁడు చేకొని యిటు లనెను : 'వీనిని చూచితిరా; క్రొత్తగా తయారు చేసితిమి! వీనికి చాల ఖర్చు. ఇవి తుక్కునూలితో తయారు చేయఁబడినవి గావునఁ జాల చౌక. వీనిని మేము హిమాలయము వఱకు రవాణా చేయుదుము. మాకు ఎల్ల చోటులను ఏజెంట్లు కలరు. మీరుగాని మీ యేజెంట్లుగాని తొక్కిచూడని చోటులలో, మీ మాటలుఁగూడ చొఱని చోటులలో మాకు కొతాలు కలవు. మా కింకను క్రొత్త యేంజెంట్లతో పనిలేదు. హిందూదేశమునకు కావలసి నంత వస్త్రము హిందూదేశములో తయారు కాదని మీరు తెలిసి కొనుఁడు. కావున స్వదేశీ-ఆందోళనమున చేయవలసిన దే మనఁగా

ముఖ్యముగా వస్త్రోత్పత్తి. మనము వస్త్రపరిమాణమును, నాణెమును గూడ వృద్ధిచేసికొనఁ గలిగినచో విదేశవస్త్ర మప్రయత్నముగనే ఆఁగి పోవును. మీ రీ ప్రకృతపద్ధతిని ఆందోళన జరిపినచో లాభము లేదు గాన నిఁకముందు క్రొత్త మిల్లులను పెట్టించుటకు ఉద్యమించుట మంచి దని సలహా యిచ్చుచున్నాను. స్వదేశవస్తువుల ఖర్చు ఎక్కువ చేయుటకంటె స్వదేశవస్తువుల యుత్పత్తి యెక్కువ చేయవలయును.

నే నీ పనినే చేయుచున్నా నని తెలుపుచో నా కాశీర్వాదము లొసఁగుదురా?

ఏమీ? అది యెటులు? మీరు క్రొత్త మిల్లులను పెట్టించుటకు ప్రయత్నము చేయుచో తప్పక ధన్యవాదముల కర్హులు.

ఆ పనిమాత్రము చేయుట లేదుగాని రాటమును పునరుద్ధరించుటకు చాలఁ బ్రయత్నించుచుంటిని.

అ దేటి పని?

రాటపు సంగతి యంతయుఁ జెప్పి యిటు లంటిని:

నేను మీతో సంపూర్ణముగా నేకీభవించుచున్నాను. నేను మిల్లుల కేజన్సీ పుచ్చుకొనఁగోరను. దీన హిందూదేశమునకు మేలునకు బదులు కీడు గలుగును. చాలఁ గాలమువఱకు మన మిల్లుల వ్యాపారమునకు లో టుండదు. చేతినూలితో వస్త్రముల నుత్పత్తిచేయించుటయు దానిని ఖర్చు పెట్టించుటయు నాపని. కావున నేను ఖాదీని తయారు చేయించుటకే పూనుకొన్నాను. ఖాదీమీఁదనే నాకు విశ్వాసము మెండు. ఏలయనఁగా, సగము సగము పనితో సగము సగ మాఁకటితో చచ్చిపోవు ఆఁడువారికే పని చూపింపఁగలను. ఆఁడువారిచే నూలు వడికించుటయు దానితో నేసిన వస్త్రములను హిందూ

దేశమునం దంతటను కట్టించుటయే నా పని. రాట మెంత సఫల మగునో నే నిపుడు చెప్పఁజాలను. ఇపుడే దీనికి గణేశపూజ జరిగెను. దీనియందు నాకు దొడ్డ విశ్వాసము కలదు. దీనివలన నిసుమంతయు హాని లే దనుట నిర్వివాదము. ఇది యెంత కొలఁదిగా ఉత్పన్న మయినను దీనివలన హిందూదేశమునం దుత్పత్తి వృద్ధి యగును. ఉత్పత్తి యయినంత మేరకు లాభమును కలుగు గాన నీ ప్రయత్నమువలన మీ రాపాదించిన దోషము లేదు.

మీ రీరీతిగనే యుద్యమము సాగించుచుందురేని నేఁ జెప్పవల దేమియు లేదు. ఈ యంత్రయోగమున రాటము గిట్టునో గిట్టదో యనునది వేఱు మాట. అయినను నేను తమకు జయము కోరుచున్నాను.

౪౨

అసహకారము

పిదప ఖాదీ యెటు లెటు లభివృద్ధి చెందెనో యీ ప్రకరణములలోఁ జెప్పఁ జనదు. నా యొనర్చిన ఆయా యీ పనులు ఎటు లెటులు వ్యాప్తమాయెనో ఆ యితిహాసములోనికి దిగుట కిది తావు కాదు. అందు దిగినచో నొక్కొక్క విషయ మొక్కొక్క పుస్తకమయిపోవును. నేను సత్యమును శోధించుకొనుచుఁ బోవుచుండఁగా ఒక విషయము తరువాత మఱి యొక విషయ మప్రయత్నముగా నెటులు తటస్థించెనో దానిని జెప్పుటయే నా యాశయము.

కావున అసహకారమును గూర్చి కొంచెము ప్రసంగించుట కిది తఱి యనవచ్చును. ఖిలాఫతును గుఱించి అలీ సోదరులు దిట్టముగా ఆందోళనము నడపుచుండిరి. స్వ. మౌలానా అబ్దుల్ బారీ మొదలగు ఉలేమాలతో నే నీ విషయమును గుఱించి లెస్సగా చర్చించితిని. ముసలమానులు శాంతిని, అహింసను ఎంతవఱకు పాలింపఁగల రను విషయము వివేచించితిమి. ప్రకృతోపయోగముకొఱ కొక హద్దువఱకు శాంతిని అహింసను పరిపాలించుటలో ముసలమానుల నిస్లాము బాధింప దనియు, ఒకసారి అహింసాప్రతిజ్ఞను గైకొనినచో దానిని మీఱరా దనియును తుదకు వారు సిద్ధాంతీకరించిరి. ఖిలాఫతు-కాన్ఫరెన్సులో అసహకారపు తీర్మానము వచ్చెను. దీర్ఘముగా చర్చలు జరిగిన పిదప నందఱును దీని నామోదించిరి. అలహాబాదునం దీ విషయ మొక రేయెల్లయుఁ జర్చింపఁబడినటులు నాకు గుర్తు. హకీము సాహెబునకు శాంతిమయమగు అసహకార మశక్యమని శంక యుండెను. కాని కొంత కాలమునకు వారికి శంక

పోయెను. తరువాత వీరు హృదయ మిచ్చి పని చేసిరి. వీరి యుద్యమమునకుఁ గావించిన సాయ మమూల్యము.

పిదప గుజరాతులో పొలిటికల్ కాన్ఫరెన్సాయెను. నే నీ సభలో అసహకారపు తీరుమానము తెచ్చితిని. దీనిని కొంద ఱాక్షేపించిరి. వారి యుద్దేశ మిది: "కాంగ్రెసు అసహకారమును తీర్మానింపనంతవఱకు ప్రాంతసభలకు దీనిని తీర్మానించు హక్కు లేదు." నే నిటు లంటిని: ప్రాంతసభలు వెను కడుగు వేయ నక్కఱ లేదు; ముం దడుగు వేయుటకు వలయునంత అధికారము కలదు. ఇంతియకాక ధైర్య మున్నచో ముందడుగిడుట గూడ ధర్మము. దీనివలన ప్రధానసంస్థకు అనఁగా కాంగ్రెసుకు గౌరవము హెచ్చును. ఇటులు నే ననిన పిదప ఈ విషయమునందలి గుణదోషములు చర్చకు వచ్చెను. శాంతముగా పూర్వపక్షములు సిద్ధాంతములు జరిగెను. చీట్లు పుచ్చుకొనఁబడెను. అసహకారమున కెక్కువ చీట్లు వచ్చెను; తీర్మానింపఁబడెను. ఇది తీర్మానింపఁబడుటలో అబ్బాస్ తైయబ్జీ వల్లభభాయిగారల పా లెక్కువ. అబ్బాసుగా రధ్యక్షులు. వీరి యుద్దేశము అసహకారముదెసనే మొగ్గెను.

ఈ సంగతి విచారించుటకు ౧౯౨౦ సం. సెప్టెంబరులో కాంగ్రెసు-ప్రత్యేకసభ జరిగెను. అందులకు పెద్దపెద్ద యేర్పాట్లు జరిగెను. లాలా లజపతిరాయలు అధ్యక్షులుగా నెన్నుకొనఁబడిరి. బొంబాయినుండి ఖిలాఫతు-స్పెషలొకటియు, కాంగ్రెసు-స్పెషలొకటియు బయలుదేరెను. సభ్యసముదాయముతో ప్రేక్షకసముదాయముతో కలకత్తా-కాంగ్రెసు కిటకిట లాడిపోయెను.

మౌలానా షౌకత్ అలీగారి మాటమీఁద రైలులో అసహకారపు తీరుమానమునకు ముసాయిదా తయారు చేసితిని. నేఁటి

౨౩ అసహకారము

ఒకటియను ముసాయిదాలలో శాంతిమయశబ్దమును వాడు నలవాటు నాకు లేదు. కాని యుపన్యాసములలో కలదు. అయినను శాంత్యర్థ బోధక మగు శబ్దము ఉరుదు మొదలగు భాషలలో నాకుఁ దెలియక పోవుటచే ముసలమానులు మాత్ర మున్న సభలలో ఆ యర్థమును దెలుపఁజాలక పోవుచుంటిని. కావున మౌలానా అబుల్ కలామ్ అజద్ గారి నడుగఁగా శాంత్యర్థమును బోధించుటకు బా-అమన్ అని యు అసహకారార్థమునకు తర్క్-ఏ-మవాలాత్ అనియుఁ దెలిపిరి.

ఈ రీతిగా నేను గుజరాతీ హిందీ ఉరుదు పదములను తెలిసి కొనుచుండఁగా, కాంగ్రెసులో పై తీర్మానము తయారుచేయు భారము నాపైఁ బడెను. ఆ ముసాయిదాలో శాంత్యర్థబోధక మగు పదము పడలేదు. చిత్తు తీరుమానమును రాత్రి రైలులో తయారుచేసి మౌలానా షౌకతలీగారి చేతి కిచ్చితిని. ఉండవలసిన 'శాంతి' శబ్దము ముసాయిదాలో జారిపోయె నని రాత్రి గుర్తు వచ్చెను. 'అచ్చుకాక ముందే శాంతిమయశబ్దమును జోడింపవలయు' నని మహాదేవ దేశాయి గారిని పంపితిని. దీనిని జోడింపకముందే చిత్తుతీర్మాన మచ్చయి పోయినటులు గుర్తు. ఆ రాత్రియే విషయనిర్ధారక సభ. కావున ముందరనే శాంతిమయశబ్దమును చేర్పవలసివచ్చెను. ముందరనే నేను చిత్తుతీర్మానమును తయారుచేసికొని యుండనిచో చాల చిక్కుపడి పోవువాఁడనే యని పిదప తెలిసికొంటిని.

ఇల్లలుకఁగనే పండుగ కాలేదు. ముసల్ల పండుగు ముందున్నది. నా తీర్మానము నెవరు సమర్థింతురో, మఱి యెవ రెదిరింతురో నాకుఁ గొంచెమేని తెలియలేదు. లాలాజీ యెటు మాల్లు నూఘనో కొంచెమేని తెలియదు. అనుభవము గల పురాణయోధు లందఱును కలకత్తాలో నుండిరి. వీరిలో విదుషి ఆనీబెసంటు, పండిత

మాలవ్యగారు, విజయరాఘవాచార్యులు, పండిత మోతీలాలుగారు, దేశబంధువు లోనగు నాయకులు ముఖ్యులు. ఖిలాఫతు పాంచాల దోషముల నివృత్తికొఱకే అసహాకారము చేయఁబడు నని నా తీర్మానము. దీనితో శ్రీ విజయరాఘవాచార్యులవారికి సంతోషము కలుగలేదు. వీరు 'ఏవో కొన్ని అన్యాయములకుమాత్ర మసహాకార మేమిటి? అన్యాయములలోని కెల్ల స్వరాజ్య మీయకుండుటయే దురన్యాయము. స్వరాజ్యమునకే అసహాకార మాచరింపఁదగు' నని చెప్పిరి. మోతీలాలుగారుగూడ నిటులే పలికిరి. నేను వెంటనే వీరి సూచన నొప్పుకొని నా తీర్మానములో స్వరాజ్యమును గూడఁ జేర్చితిని. దీర్ఘమును గంభీరమును నిశితమును నగు చర్చతో అసహాకారపు తీర్మాన మామోదింపఁబడియెను.

అందఱికంటె మొదట నీ యాందోళనమున మోతీలాలుగారు చేరిరి. నాఁడు నా గా తీర్మానముమీఁద మధురముగా కావించిన వాదము నేఁటికిని నాకు గుర్తున్నది. వా రందలి శబ్దములను కొన్నిఁటిని మార్ప సూచింపఁగా నేను మార్చితిని. దేశబంధువుల నిటు వైపు త్రిప్పుటకు వీరు చాలఁ బాటుపడిరి. దేశబంధువున కసహాకార మనిన ఇష్టమే కాని ప్రజలు దీని భారమును వహింపఁజాల రని వారికి సంకోచము. దేశబంధువులును, లజపతిరాయలును నాగపురమున పూర్తిగా అసహాకారవాదు లయిపోయిరి. ఇట్టి శిష్టసభలో లోకమాన్యులు లేని లోపమునకు నేను కడు చింతపడితిని. వా రత్తటి నా సభలో నుందురేని నా కాశీర్వాదము లొసఁగి యుందు రని నా యుద్దేశము. ఒకవేళ వారు ఖండించినను నా కది సౌభాగ్యమే. దానఁ గొంత నేర్చికొని యుందును. వీరికిని నాకును మతభేదము కలదు గాని యది చాల మధురము. 'మా బంధుత్వములు సన్నిహితము' లని వారు

తలపించెడివారు. ఈ పంక్తులు వ్రాయుచుండగా వారి మృత్యు చిత్రము నా యెదుట నిలుచుచున్నది. నా సహచరుడు పటవర్ధనుడు నడిరేయి నీ వార్తను నాకు టెలిఫోను చేసెను. వెంటనే 'నా ఊతము తునినీ పడిపోయె' నను వాక్యము నా నోరినుండి వచ్చెను. అపుడు నా చుట్టును సహచరులు కలరు. అపుడనహాకారము మూర్తిమంత మ్మయి యుండెను. వారికడనుండి నాకు తేజస్సు వచ్చు ననుకొంటిని. వారి యుద్దేశమే దెస నుండెనో దైవమున కెఱుకగాని ప్రశేతివాసములో నట్టి కష్టకాలమున వారు లేకపోవు టందలిపను చింతాకర మని మాత్రము నా కెఱుక.

౪౩

నాగపురమున

కలకత్తాలో జరిగిన స్పెషల్ కాంగ్రెసునందు తీర్మానింపఁబడిన అసహాకారమును నాగపురమునఁ గాఁబోవు కాంగ్రెసు స్థిరీకరింపవలయును. కలకత్తాయందువలె నాగపురమునందును జనులు తండోపతండము. నాఁటికిని ప్రతినిధుల సంఖ్య నియతము చేయఁబడలేదు. కావున సుమారు పదునాలుగువేల ప్రతినిధులు వచ్చినటులు నాకు గుర్తు. విద్యాలయములకు సంబంధించిన తీర్మానములో కొంచెము మార్పు చేయవలసిన దని లాలాజీ పట్టు పట్టఁగా నే నందుల కంగీకరించితిని. ఇటువలె దేశబంధువు సూచించిన మార్పులను గూడ నంగీకరించితిని. తుదకు అహింసాత్మక మగు అసహాకారప్రస్తావ మందఱిచేతను ఆమోదింపఁబడెను.

ఈ సభలోఁగూడ కాంగ్రెసునిబంధనల మార్పును గుఱించి పునరాలోచన జరుగవలసి యున్నది. కలకత్తా స్పెషల్ కాంగ్రెసులోనే నే నీ నిబంధనల ముసాయిదాను సభవారి యెదుటఁ బెట్టితిని. సభవా రందఱును దీనిని యథేచ్ఛముగా చర్చించిరి. శ్రీ విజయరాఘవాచార్యులవారే కాంగ్రెసు కధ్యక్షులు. నిర్ణాయక సభవారీ నిబంధనలలో నొక పెద్ద మార్పు చేసిరి. నేను ౧౫౦౦ ప్రతినిధులను సూచించితిని. వారు ౬౦౦౦ చేసిరి. ఇది దూరదృష్టి లేని మార్పని నా యుద్దేశము. ఇన్నియేండ్ల యనుభవమునను బడసిన పిదపఁగూడ నా యుద్దేశము మాఱలేదు. ప్రతినిధుల సంఖ్యాబాహుళ్యమువలన పని బాగుగా జరుగు ననియు, ప్రజాస్వామ్యము చక్కఁగా నిర్వహింపఁ

బడుననియు ననుకొనుట వట్టి కల్ల. స్వయంనియుక్తులగు ప్రతినిధులు ఆఱువేలమంది ఉండుటకన్న ఉదారమనస్కులును ప్రజాస్వత్వపరిపాలకులును ప్రామాణికులును నగు ప్రతినిధులు పదియేనువందలమంది యున్నచో ప్రజాతంత్రము సురక్షితమగును. ప్రజాతంత్రమును నిర్వహించుటకు జనులలో స్వాతంత్ర్యము స్వాభిమానము ఐకమత్యము ఉండవలయును. జనులు యోగ్యులును సత్యసంధులును నగు ప్రతినిధులనే యెన్నుకొనవలయును. సంఖ్యామోహ మున్నచో ఆఱువేలే యని మితి యేమి? ఇంకను ఎక్కుడింపవచ్చును. కావున నీ విషయమాలోచించి నిశ్చయింపఁబడువఱకు ఆఱువేలు ఖాయము చేయఁబడెను.

స్వరాజ్యమును గుఱించి కాంగ్రెసులో తీవ్రముగా చర్చ జరిగెను. 'వీలగుచో సామ్రాజ్యములో నుండవచ్చును. వీలు లేనిచో సామ్రాజ్యమునుండి విడిపోవచ్చును. ఎటులేని స్వరాజ్యము సంపాదింపఁదగును.' అని కాంగ్రెసుకార్యప్రణాళికలో నొక నిబంధన కలదు. స్వరాజ్యము సామ్రాజ్యాంతర్భాగమే కావలయు నని ఒక పక్షమువారి వాదము. దీనికి సమర్థకులు మాలవ్యులును, జిన్నాగారును. కాని వీరి కెందఱో బాసట కాలేదు. 'శాంతిసాధనములచేతనే, సత్యసాధనములచేతనే స్వరాజ్యము సంపాదింపవలయును' అని మఱియొక నిబంధన కలదు. ఈ షరతులకును వివాదము కలిగెను. కాంగ్రెసు ఈ వివాదము నంగీకరింపలేదు. నిబంధన లన్నిఁటిపై చక్కఁగా చర్చ జరిగెను. తుదకు తీర్మానము చేయఁబడెను. ప్రామాణికత్వముతోడను జాగరూకతతోడను ఈ నిబంధనలను లోకులు నిర్వహింతు రేని సంస్కారమును పొంది స్వరాజ్యమును బడయఁగల రని నా పరమవిశ్వాసము. అయినను ఈ విషయ మిచట నప్రస్తుతము.

హిందూముసలమానుల యైక్యమును గుఱించియు, అంత్యజులను గుఱించియు ఖాదీని గుఱించియు ఆ కాంగ్రెసులో తీర్మానములు చేయఁబడెను. నాఁటినుండియు కాంగ్రెసునందలి హిందూ సభ్యు లస్పృశ్యతాకళంకమును తుడిచివేయఁ బూనుకొనిరి. నాఁటి నుండియు ఖాదీచేత కాంగ్రెసు కంకాళమాత్రావశిష్టు లగు నిఱుపేదలతో పోరాని చుట్టఱికమును గలుపుకొనెను ఖిలాఫతుకు అంగముగా అసహాకారమును జేపట్టి దాని మూలమున హిందూముసలమానుల యైక్యమునకుఁ జాలఁ బాటుపడెను. కాంగ్రెసు చేసిన పనులలో నిది చాల దొడ్డ పని.

పూర్ణాహుతి.

ఇప్పటికీ ప్రకరణములను ముగింపవలసిన సమయ మాసన్నమాయెను. ఇటుమీఁదట నా జీవితములో జనులకుఁ దెలియని విషయ మేదియు లేదు. మఱియు నేను ౧౯౨౧ సాలు నుండియు కాంగ్రెసునాయకులతో చాలఁ గలసి మెలసి పని చేసితిని. నాఁటినుండియు నా జీవితమున నే యంశమును ఎత్తికొనినను వారి సంబంధము తెలుపనిచో నది యథార్థవర్ణనము కాదు. వారి బాంధవ్యములు నా కింకను నూతనములుగా నున్నవి. శ్రద్ధానందులు దేశబంధులు లాలాజీ హకీముసాహెబు మనకు లేకున్నను సౌభాగ్యవశమున పలువురు దేశనాయకులు మన కున్నారు. కాంగ్రెసులో చాల పరివర్తనము కలిగినను దాని పదఁపటి చరిత్ర మింకను ప్రక్రియాదశయందే యున్నది. నా ముఖ్యశోధనము లన్నియు మహాసభాద్వారముననే జరిగెను గావున నా శోధనములను వ్రాయవలసివచ్చుచో నాయకులకును నాకును గల సంబంధము నుదాహరింపవలసి వచ్చును. ఔచితి నెఱిఁగి యిపుడు దీని నంట నొల్లను. మఱియు నేఁడు జరుగుచున్న శోధనలు నా యుద్దేశమున నిశ్చయాత్మకము లని యనిపించుకొనఁ దగవు గాన నీ గ్రంథము నిఁక ముగించుట నాకు విధి యని తలఁచుచున్నాను. నా కల మిఁక ముందరికి సాగవల దనుచున్నది.

పాఠకులకడ సెలవు తీసికొనవలసి వచ్చుటచే నాకు వెత గలుగుచున్నది. నాకు నా శోధనము లనర్ఘములు. వాని యథార్థ వర్ణనము చేయఁగలిగితినో లేదో నాకుఁ దెలియదు. నేను దేనిని దాఁచుకొనలేదు. ఉన్న దున్నటులు చెప్పితిని. సత్యమును నే

నే రూపమునఁ జూచితినో యే మార్గమునఁ జూచితినో ఆ రూపమున ఆ మార్గమునఁ దెలుపుట కెల్లపుడును ప్రయత్నించితిని. దీని నంతయు పాఠకుల యెదుట నిడి చిత్తశాంతి నొందుచున్నాను. ఏల యనఁగా, వీనిని పఠించుచో పాఠకుల హృదయములలో సత్యము నెడలను, అహింసయెడలను అధికమగు శ్రద్ధ కలుగఁగల దని నా కాశ.

సత్యముకంటె వేఱుగా పరమేశ్వరుఁ డొకఁ డున్నాఁడని నా కనుభవము లేదు. సత్యమున కహింసయే రాజమార్గ మని యీ గ్రంథమునందలి ప్రతిపుటయుఁ జెప్పఁజాలని యెడల నా యీ ప్రయత్న మంతయు వ్యర్థ మని తలఁతును. నా ప్రయత్న మంతయు వ్యర్థ మయినను నా సిద్ధాంతము వ్యర్థము కాదు. ఇంతవఱకు నా యహింస సత్యమయినను అపక్వముగనే, అపూర్ణముగనే యున్నది. కావున నా కనుఁగొనఁగలిగిన దా సత్యసూర్యునిలో నొక కిరణమే. మఱియు వేల సూర్యు లయినను ఆ సత్యసూర్యునకు తీసికట్టు. సంపూర్ణమగు నహింస లేనిచో సంపూర్ణ మగు సత్యము దొరక దని ఇన్నాళ్లు శోధించిన పిదపఁగూడఁ జెప్పుచున్నాను.

వ్యాపకుఁ డగు నీ సత్య నారాయణుని ప్రత్యక్షదర్శనమునకు జీవమాత్రమును తనవలెనే ప్రేమించు టత్యావశ్యకము. ఈ సత్యమును బడయఁగోరువాఁడు జీవనమునందలి యే క్షేత్రమునకును ఆవల నుండఁ జాలఁడు. కావుననే రాజనీతిక్షేత్రమునకు సత్యభక్తి న న్నీడ్చుకొని పోయెను. మతమునకు రాజనీతితో సంబంధము లే దని చెప్పువారికి మత మన నేమియో తెలియ దని నిస్సంకోచముగాఁ జెప్పుట వినయేతరము కా దనుకొనుచున్నాను.

ఆత్మశుద్ధి లేక ప్రాణిమాత్రముతో ఐక్యానుభవము కలుగదు. ఆత్మశుద్ధి లేక అహింసాపరిపాలన మసంభవము. ఆత్మశుద్ధి లేనిచో

ఆత్మదర్శనము కొరకదు. కావున జీవనక్షేత్ర మంతయు పరిశుద్ధము కావలయును. ఈ శుద్ధి సాధ్యము. ఏల యనఁగా, ఒకని శుద్ధి యనేకులను శుద్ధుల నొనరించును. వ్యష్టికిని సమష్టికిని ఇట్టి శుద్ధి కలుగఁగలంత సన్నిహితసంబంధము కలదు. ఇట్టి శుద్ధికి ప్రయత్నింపఁగల శక్తిని సత్యనారాయణుఁడు ప్రతివానికిని ఇచ్చియే యున్నాఁడు.

ఈ శుద్ధిమార్గము చాల నెగుడు దిగుడయిన దని ప్రతిక్షణమును నా కనుభవ మగుచున్నది. శుద్ధు డగుటకు మనోవాక్కాయములచే నిర్వికారుఁడును రాగద్వేషాదిరహితుఁడును గావలయును. ప్రతిక్షణమును సదమద మగుచున్నను నే నట్టి నిర్వికారస్థితికడకుఁ జేరఁజాలకున్నాను. కావున లోకులస్తోత్రములు నన్ను మేలుకొలుపక పలుమాఱులు వేసట గొలుపుచున్నవి. శస్త్రయుద్ధ మొనరించి జగత్తును జయించుటకంటె మనోవికారములను జయించుట నాకు కష్ట మనిపించుచున్నది. హిందూదేశమునకు వచ్చిన పిదపఁగూడ నాలోఁ గొన్ని వికారములు తెలియకుండ నడఁగియున్నవని కనుఁగొని సిగ్గిలుచున్నాను గాని ధైర్యమును మాత్రము గోలుపోవలేదు. సత్యశోధనలలో నా కానందము కలిగెను. ఇంకను కలుగుచునే యున్నది. కాని యింకను అగ్నిపథము ముందున్న దని నే నెఱుఁగుదును. కావున నే నింకను శూన్యతను బడయవలయును. అన్నిటికంటెఁ దన యల్పత్వము మానవున కెంతవఱకు గోచరము కాదో అంతవఱకును ముక్తి లేదు. ఈ వినయమునకు అహింస ఎల్ల. ఈ వినయము లేక ముక్తి లేదనుట అనుభవసిద్ధము. ఇట్టి వినయమును ప్రార్థించుచు, దీనికి లోకుల సాయమును యాచించుచు నిఁక నీ ప్రకరణములను ముగించుచున్నాను.

అయిదవ భాగము — రెండవ ఖండము

సమాప్తము